వేసిన బంగారుచాయగల వానిని, వహ్నిన్ = అగ్నిరూపమున సర్వము వహించు వానిని, కృతఘ్నుని = మేలు మఱచిన వారిని జంపువానిని, కంజహితుని = కమలహితుని, ప్రపంచమునకు హితుఁ డగువానిని, ప్రపంచమునకు కమలము సంకేతము.

"One of the symbolical figures for the Dual creative power in nature (matter and force on the material plane) is Padma, the water-lily of India. The Lotus is the product of heat (fire) and water (Vapour of Ether) Fire stands in every philosophical and religious system as a representation of the spirit of Deity. the active,male,generative principle, and Ether or theSoul of matter, the light of the fire, for the passive female principle from which everything in the universe amanated. HereEther or water is the Mother and fire is the Father. The Lotus is, moreover, a very ancient and favourite simile for the Cosmos itself and also for man lts root sunk in the mud represents material life, thestalk passing up through thewater typitiesexistencein the astral world, and the flowerfloating on the waterandopening to the sky is emblematical of spiritual being "*Evolution Page, 15*

గోణిగలు=నమస్కారములు, చిన్నిపూలు=నమస్కారములు, నతులు=నమస్కారములు.

తాత్పర్యము = స్పష్టము.

కం. భూతములఁ ద్రుంచి మఱి త, ద్వ్రాతముల సృజించి మనుచు ప్రభు వీతండే
యాతఁడె తపియింపించును, నీతండె కరాళిచేత వృష్టిం గురియున్ ౨౪౧

అర్థములు. తద్వ్రాతములన్ = భూతముల సమూహములను, సృజించి= తనలోనుండి విడిచి, మనచు = రక్షించు, వృష్టి = వర్షము.

తాత్పర్యము

ప్రాణికోటులను సంహరించి మరల సృజించి రక్షించు ప్రభు వీయనయే-తపియింపఁజేయువాఁ డీయనయే-మరల వర్షము గురియించి యీ తాప మణఁచువాఁ డీయనయే.

చ. భువనము నిద్రవోవుతఱిఁ బోల్పగ నీతఁడె జాగరూకుఁ డౌఁ
దనగఁ సమస్త భూతములఁ దాఁ బరినిష్ఠితుఁ డీతఁడే శ్రుతుల్
సవములు నగ్నిహోత్రులఫలంబు క్రతుల్ ఫల మగ్నిహోత్రు డిం
కెవి భువిఁ గృత్యముల్ సకల మీరవియే ప్రభు డెల్ల వానికిన్. ౨౪౨

అర్థములు. జాగరూకుఁడు=మేలుకొనియుండువాఁడు, తనగన్=తగఁగన్= తగినరీతి, పరినిష్ఠితుఁడు=శాశ్వతముగ నుండువాఁడు, శ్రుతుల్=వేదములు, సవములు=యజ్ఞములు, క్రతుల్ ఫలము = యజ్ఞముల ఫలము.

తాత్పర్యము స్పష్టము.

శ్రీరామచంద్రమూర్తి! నీవే, బ్రహ్మరుద్రేంద్రాదులు నారాయణుఁడవు దేవుఁడ వని స్తోత్రముచేసి శ్రీరామచంద్రమూర్తియే యందఱికంటెఁ బరుఁడని చెప్పఁబడును. ఇట్లుండ నిచట సూర్యుఁడు పరాత్పరుఁడని యెట్లు చెప్పఁబడెను? మధు విద్యయందు నాదిత్యుఁడే పరుఁడని ప్రతిపాదించినచోట నంతర్యామియగు పరమాత్మయం దన్వయింపఁబడెను. అట్లులే యిచ్చట గ్రహించునది. ఒక మట్టిబొమ్మనైనను నేకలవ్యునివలె భక్తితో సేవించితిమేని దానియందే భగవంతుఁ డావేశించి భక్తులకోరికల నెఱవేర్చును. ప్రతి పరమాణువునందు భగవంతుఁడు కలఁడుకదా. అట్లుండ దివ్యతేజోరాశి యగు సూర్యునియందలి భగవంతుని మనమర్చించితిమేని ఫల మేల లేకపోవును? సూర్యుఁ డని యర్చించితిమా సూర్యుఁ డీయఁగల ఫలము మాత్రమే యిచ్చును. భగవంతుఁ డని యర్చించితిమా యెంతఫలమైన నెట్టిదైన నిచ్చును. ఈ కారణముచేతనే సూర్యుఁడు దేవతామధ్యమున నిలిచి రావణవధ మంతుఁ ద్వరపడుమని శ్రీరామచంద్రమూర్తికిఁ జెప్పెను. ౨౮-౨౫ వ. చూడు.

కం. అను నీమంత్రం బాపద,లను గష్టములందు వనములను భయవేళన్
జననాథ! నరుఁడు కీర్తిం,చిన దుఃఖపడండు నిజము సీతానాథా! ౨౮-౨౧

తాత్పర్యము స్పష్టము.

కం. ఏకాగ్రమనస్కుఁడవై, లోకపతిన్ దేవదేవు లోకేక్షణునిన్
బ్రాటకమతిఁ బూజింపుము, శ్రీకర మువ్మాఱు చదువ సిద్ధము జయమా.

అర్థములు. ఏకాగ్రమనస్కుఁడవు = ఒక్క కొనయే గల మనస్సు గలవాఁడవు - చలింపని మనస్సు గలవాఁడవు, లోకేక్షణునిన్ = లోకమునకుఁ గన్నగువానిని, సూర్యకాంతి లేకున్న జనులు కన్ను లుండియు గ్రుడ్డివారే కదా.

తాత్పర్యము స్పష్టము.

కం. ఈ నిమిషమునన్ రావణు, మానితభుజశౌర్య నీవు మ్రందింతు వటం
చీనతి వచించి యంత,ర్ధానంబును జెంది ముని యథామతి నరిగెన్. ౨౮-౨౩

తాత్పర్యము స్పష్టము.

చ. ఇది విని దివ్యతేజుఁడు మహిష్ఠముదంబున మంత్ర మూని నె
మ్మది వ్యసనంబు మాని రవిమండలముం గనుచున్ జపించి హృ
త్పదవిఁ ద్రివారముల్ శుచిత వార్చి శరాసముఁ బూని రావణుం
గదనములోనఁ జంప మతి గైకొని యుద్ధము సేయఁబూనఁగన్. ౨౮-౨౪

అర్థములు. మహిష్ఠముదంబునన్ = మిగుల గొప్పదగు సంతోషములో, వ్యసనంబు=విచారము, హృత్పదవిన్ = హృదయస్థానమందు, త్రివారముల్ = మువ్మాఱు, శుచితన్ = పరిశుద్ధుఁడై, శరాసము=విల్లు, బాణములఁ జిమ్మునది.

తాత్పర్యము స్పష్టము.

కం. రామునిజయమున రవియును, సామోదహృదబ్జుఁ డగుచు • నసురపతివధన్
దా మతి ననుగ్రహించుచు, నామరగణమధ్యగుఁడు ర•యింపఁడు మనిరెమెన్.

అర్థములు. సామోద=సంతోషముతోఁ గూడిన, హృదబ్జుఁడు=హృదయ కమలము గలవాఁడు,అమరగణ మధ్యగుఁడు=దేవతల సమూహములమధ్య నుండు వాఁడు, రయపడుము=త్వర చేయుము.

ఈ యాదిత్యహృదయ మంత్రమునకు నంగన్యాస కరన్యాసము లిట్లు తిలక వ్యాఖ్యానంబున వ్రాయఁబడి యున్నవి.

"అత్ర స్తోత్ర స్యాగస్త్యఋషిః - అనుష్టుప్ ఛందః - ఆదిత్య హృదయ భూతో భగవాన్ దేవతా, నిరస్తాశేషవిఘ్నతయా బ్రహ్మవిద్యాసిద్ధౌ సర్వత్ర జయసిద్ధౌచ వినియోగః। అస్య షడంగం ప్రణవేన - రశ్మి మతే నమ ఇత్యనేన వా - గాయత్ర్యా షడంగ మిత్యన్యే.

—•{ ౧౦౭-వ సర్గము. రావణుఁడు మరల శ్రీరామునిమీఁదికి యుద్ధమునకు వచ్చుట }•—

సీ. శాత్రవవాహినీ • సంప్రధర్షణమును, గంధర్వనగరని•కాశమూర్తి
యున్నతధ్వజము సం•పన్నజాంబూనద, హారవిరాజిత•హయయుతంబు
యుద్ధోపకరణస•మిద్ధంబునై మిన్ను, మ్రింగెడినో యన • రంగుమీఱి
యశని వణంకఁగ • నహితులు గ్రుంగఁగఁ, దనసైన్యములు పొంగఁ•దనరుదాని
తే. రావణురథంబు నడపె సా•రథినితాంతహృష్టుఁడై శీఘ్రముగ నిట్టు•లేగుదెంచు
ప్రబలనిస్స్వనమును గృష్ణ వాజియుతముఁ,జంచలాధ్వజగహనంబు • సారతరము.

అర్థములు. కథాసందర్భమునకు ౩౦౦౦ వ పద్యమునకుఁ దరువాత నీ పద్యము చదువవలెను.

శాత్రవవాహినీ సంప్రధర్షణమును = శత్రుసేనలఁ దిరస్కరించునదియు, గంధర్వనగరనికాశమూర్తి=గంధర్వనగరముతో సమానమైన యాకారముగలది, ఆకాశమున నగరమువలెఁ గానవచ్చు మేఘముల చిత్రవిన్యాసము గంధర్వనగరము.

'చిత్రవర్ణం చిత్రరూపప్రాకారగృహ గోపురమ్,అలంకృత మనేకాభిర్వితాన ధ్వజతోరణైః।గంధర్వనగరం దంతి నృపాజిక్షయయుద్ధకృత్, దృశ్యతే చేన్మహద్యుద్ధమన్యోన్యం ధరణీభుజామ్' ఇది కానవచ్చెనేని రాజులలో గొప్ప యుద్ధము సంభవించును. ఉన్నతధ్వజము=ఎత్తైన టెక్కెము గలది, సంపన్న=సమృద్ధితోఁ గూడిన, జాంబూనదహార = బంగారు దండలచే, విరాజిత = ప్రకాశించు, హయయుతంబు = గుఱ్ఱములతోఁ గూడినది, యుద్ధోపకరణసమిద్ధంబు = విల్లు కవచములు లోనగు యుద్ధసాధనములచేఁ బ్రకాశించునది,మిన్ను=ఆకాశమును,నితాంతహృష్టుఁడై =మిక్కిలి సంతోషించినవాఁడై, ప్రబల నిస్స్వనమును = బలిష్ఠమైన ధ్వనిగలది, కృష్ణవాజియుతము = నల్లని గుఱ్ఱములతోఁ గూడినది, చంచలాధ్వజ

గహనంబు=మెఱుపులవంటి ధ్వజములు వనము గలది — పెక్కుధ్వజములు గలదని భావము - సారతరము = మిగుల దృఢమైనది.

తా త్ప ర్య ము

పగవారి సేనలఁ దిరస్కరించునదియు గంధర్వనగరమువలె మిగుల నాశ్చర్యకరమైన యాకారము గలదియు, ఎత్తైన ధ్వజము గలదియు, సమృద్ధిగ బంగారు సరములతో నలంకరింపఁబడిన గుఱ్ఱములుగలదియు, విండ్లు కవచములులోనైన యుద్ధసాధనములు గలదియు,ఆకాశమును మ్రింగెడి దానివలెనుండునదియు,భూమి గడగడ లాడ శత్రువులు క్రుంగి పోవఁ దన సైన్యములు పొంగఁగా నొప్పు దాని రావణు రథమును సారథి మిగుల సంతోషించినవాఁడై త్వరగాఁ దోలెను. ఇట్లు నల్లని గుఱ్ఱములు కలదై మహాధ్వనితో మెఱుపువలె మెఱయు ననేకధ్వజముల తోడ వచ్చుచున్న మిగుల బలిష్ఠమై.

కం. ఇంద్రాయుధోపమాయుధ, సాంద్రంబును రౌద్రకాంతి•సంకలితము ని
స్తంద్రాంబుదధారోపమ, రుంద్రశరాసారపతన•రూక్షరథంబున్. ౨౮-౨౭

అర్థములు. ఇంద్రాయుధ=ఇంద్రుని యాయుధములతో, ఉపమాయుధ=సమానమైనయాయుధములుగలది,(౨)ఇంద్రచాపమువంటివిల్లుగలది,రౌద్రకాంతి సంకలితము = భయంకర కాంతి గలది, నిస్తంద్ర = హెచ్చరికతోఁ గూడిన, అంబుదధారోపమ=మేఘముల వర్షాధారలతో సమానమైన, రుంద్ర = దట్టమైన, శరాసార=బాణవర్షముయొక్క, పతన=పడుటచే, రూక్షంబున్ = దయ లేనిది, దయ యనునది లేక బాణవర్షము గురియుంచునది యగు, రథంబున్=తేరిని.

తా త్ప ర్య ము

ఇంద్రాయుధములతో సమానములైన యాయుధము లనేకములు గలదియు, భయంకరమైన కాంతి గలదియు, మేఘములు వర్షధారలవలె బాణవర్షమును నిర్దయముగాఁ గురియునదియు నగు తేరిని.

దీనిచే రావణుఁడు దూరమునుండియే బాణములు వేయుచు వచ్చుచున్నాఁడని భావము.

—• శ్రీరాముఁడు మాతలిని హెచ్చరికగ నుండఁజెప్పుట. •—

చ. కనుఁగొని బాలచంద్రనత•కార్ముకముం గులిశాభిమృష్టమై
తునియలువాఱు శైలతతి•తోరపుఁబోఁతఁ జెలంగుదానిఁ గై
కొని సురనాథుసారథిని • గార్మి వచించెను గంటె మాతలీ !
మనపగవాని తేరి నస•మానజవంబున వచ్చునైఖరిన్. ౨౮-౨౮

అర్థములు. బాలచంద్రనత కార్ముకమున్ = బాలచంద్రునివలె వంపఁబడిన వింటిని, కులిశాభిమృష్టమై=వజ్రాయుధముచేఁ గొట్టఁబడి.

తాత్పర్యము

చూచి యర్ధచంద్రునివలె వంపుగలదై వజ్రముచేఁ గొట్టఁబడి తునుకలగు కొండల విశేషధ్వనివంటి ధ్వనిగలదానిని, విరామకాలమునఁ క్రింద నుంచినదానిని గైకొని ప్రేమతో మాతలితో రామచంద్రమూర్తి యిట్లనియె. మాతలీ! చూచితివా, మన పగవాని తే రెంత వేగముతో వచ్చుచున్నదో.

ఉ. చావఁగఁగోరి తాన యప•సవ్యముగాఁ జనుదెంచుచున్న వాఁ
డీవును నిందు హెచ్చరిక • నేగు మెదుర్కొని మారుతుండు ప్రో
ద్భావఘనంబునుం జెదరఁ•దాఁచు విధంబున రూపుమాపెదన్
రావణు, నేఁ దదేకమతిఁ • గ్రాలెద వాలెద విక్రమంబునన్. ౧౦-౧౧

అర్థములు. అపసవ్యముగా=అప్రదక్షిణముగా, అప్రదక్షిణముగాఁ దిరుగుట యనిష్టసూచకము. ప్రేతకార్యములందుఁ దప్ప దక్కిన వేళల దేనికి నప్రదక్షిణముగఁ దిరుగరాదు. తిరిగినవానికిఁ గీడుగలదు. మారుతుండు = వాయువు, ప్రోద్భావఘనంబునున్ = పెద్ద మేఘమును, తాఁచు విధంబునన్ = కొట్టునట్లు, తదేకమతిన్=ఆయొక్క మనస్సుతో, వాలెదన్=విజృంభించెదను.

తాత్పర్యము

రావణుఁడు తనకు చావు సిద్ధమగుటచేఁ గాఁబోలు మన కప్రదక్షిణముగ వచ్చుచున్నాఁడు. నీవు మిక్కిలి హెచ్చరిక గలిగి వాని తే రప్రదక్షిణముగా వచ్చునట్టులే యెదురుగఁ బొమ్ము. వాయువు పెద్ద మేఘమును జెదరఁగొట్టునట్లు రావణుని నాశము చేసెదను. నా మనస్సంతయు నా కార్యమందే యుంచి పరాక్రమించెదను.

ఆ. దృష్టి చెదరనీక • హృదయ మేకాగ్రత, నిలిపి డీలుపడక • కలఁగిపోక
భ్రాంతమతివిగాక • పగ్గముల్ విడుచుచో, లాగుచోట నెఱపు•లాఘవంబు.

తాత్పర్యము

పగవానిమీఁద నుంచిన దృష్టిని నిటునటు చెదరనీకుము. మనస్సు కూడ 'యత్రదృష్టి స్తత్ర మన' యన్నట్టు దృష్టి యెందున్నదో మన స్సందే యుండనిమ్ము. డీల్లఁబోకుము. ప్రమాదము చెందకుము. ఒకదానిని మఱియొకవిధముగా భ్రమింపకుము. పగ్గములు వదలుగా విడుచునపుడు బిఱ్ఱుగా బిగఁబట్టి లాగునపుడు నీ హస్త లాఘవమును బ్రకటింపుము.

చ. అఱగొఱలేక వాసవు శ•తాంగము దిద్దెడునంత వానికిన్
గఱదలు నేను జెప్పుదునె • కార్యభరంబునఁ జిత్తమంతయున్
గుఱికొని యుద్ధమంద యిడి•కొందును గావున హెచ్చరించితిన్
గఱపుట కాదటన్న గిరి•ఖండనుసారథి ప్రీతచిత్తుఁడై. ౧౨-౧౩

అర్థములు. అఱగొఱలేక = ఇంతు గొంతులేక, కఱదలు=బుద్ధులు, కఱ

పుటకాదు = నీకు నేర్పలేదు. గిరిఖండను సారథి = ఇంద్రుని సారథి - మాతలి. ప్రీతచిత్తుఁడై = సంతోషించినవాఁడై, మొదట నేమిరా యీయన నాకు సారథ్యము నేర్పుచున్నాఁడే యనుకొన్నవాఁడు నేర్పుట కాదన్న మీఁదట సంతోషించిన వాఁ డయ్యెనని భావము. రథికసారథులు పరస్పరము హెచ్చరించుట ధర్మమే కదా.

తాత్పర్యము

ఇంద్రు నంతటివానికి జంకు గొంకు లేక రథముఁ గడపు నీయంతవానికి నేను బుద్ధులు చెప్పుదునా? నేను కార్యభారము నాలోచించి నా మనస్సంతయు యుద్ధమందే యుంచియుందును. ఇతరకార్యములు హెచ్చరింప నా కవకాశ ముండదు. కావున నిప్పుడే హెచ్చరించితినిగాని నీకు నేర్పలేదు, అనిన మాతలి సంతోషించినవాఁడై.

తే. అసురపతిరథ మపసవ్య • మగువిధాన, ధరణిరజ మెఱిఁ గప్ప ర • థంబుఁబఱప
రావణుఁడుకింక నెదురేగి • రాము నేసెఁ, గాండకాండముల్ దండోప • దండములుగ

అర్థములు. అసురపతి రథము = రావణునితేరు, అపసవ్యము = అప్రదక్షిణము, ధరణి రజము = నేలదుమ్ము, కాండముల్ = బాణ సమూహములు, దండోప దండములుగ = గుంపులు గుంపులుగ, తండోపతండము లనునది యుపశబ్దము

. —• రావణుమరణంబుఁ దెలుపు విహ్నంబు లగపడుట •—

తే. ధర్షణామర్షితుండు నీ • తావిభుండు, రోషభీషణుఁ డయి ధైర్య • భూషణుండు
వజ్రిచాపంబుఁ గొని యేసె • భానురశ్మి, సమమహాప్రభముల శాత • సాయకముల.

అర్థములు. ధర్షణామర్షితుండు = తిరస్కారముచేఁ గోపించినవాఁడు, రోషభీషణుఁడయి = కోపముచే భయంకరుఁడై, ధైర్యభూషణుండు = ధైర్యమే యలంకారముగాఁ గలవాఁడు, వజ్రిచాపంబు = ఇంద్రుఁడు పంపిన వింటిని, భానురశ్మి = సూర్యకిరణములతో, సమ = సమానములైన, మహాప్రభములన్ = గొప్పకాంతి గలవానిని, శాతసాయకములన్ = వాఁడి బాణములను.

తాత్పర్యము

తిరస్కారముచేఁ గోపించిన రామచంద్రమూర్తి కోపముచే భయంకరమూర్తియై యింద్రుఁడు పంపినవిల్లు దీసికొని సూర్యకాంతితో సమానమైన కాంతి గల వాఁడిబాణముల రావణాసురు వేసెను.

ఉ. రావణరామచంద్రులు ప • రస్పరనిర్మథనాభిలాషులై
చేవ దలిర్ప మత్తవన • సింహయుగంబులపోల్కిఁ బోరుచో
దేవత లభ్రవీథి గుమి • గూరి మహారథయుగ్మయుద్ధమా
పోవక చూచి రెప్డు హరి • పోవునొ రావణుఁ డంచుఁ గోరుచున్. ౨౮౩౮

అర్థములు. పరస్పర నిర్మథనాభిలాషులై = ఒకరినొకరు చంపఁ గోరిక

గలవారై, మత్త=మదించిన, వనసింహ యుగంబుల పోల్కి = అడవిసింహముల జంటవలె, అపోవక=తృప్తిలేక, పొరిపోవునొ=చచ్చునో.

తాత్పర్యము

రావణుఁడు రామచంద్రమూర్తి యొకరి నొకరు చంపు కోరికతో బలాతిశయమున మదించిన యడవి సింహములవలె యుద్ధముచేయఁగా దేవతలాకాశమున గుంపులై రావణుఁ డెప్పుడు చచ్చునా యని యా మహావీరుల నిద్దఱఁజూచుచుండిరి.

కం. రావణునాశము ధరణిసుతావిభువిజయంబుఁ దెలుప • దారుణమయి మేన్
వావిరి గగ్గురుపొడువఁగ, నా వేళను లక్షణంబు • లగపడఁ జొచ్చెన్. ౨౮౩౫

తాత్పర్యము స్పష్టము.

సీ. రావణురథముపై • రక్తవర్షము ద్రావాలె, సుడిగాలి డాచుట్లు • చుట్టి విసరెఁ
వానిశతాంగము • బడిఁ జెను గ్రద్దలు, గుములుగ మింటను • గూడి యాడె
దాసనపుంబువ్వు • తెరమైన డాలున, సంధ్య లంకాపురి • సవదరించె
దినమయ్యుఁ దత్కాంతిఁ • దేజరిల్లె ధరిత్రి, మండెడుభంగి భీ • మంబుగాఁగఁ
ఆ. దోఁకచుక్కలురలెఁ • దోరంపుఁబిడుగులు, పడియె పసురచయము • పల్లటిల్ల
పోఁకులనిని గపులఁ • దాఁకుచో వారి హ, స్తంబు లెవరొ బిగియు • చందమయ్యె.

అర్థములు. డాచుట్లు=ఎడమవైపుగా, అప్రదక్షిణముగ, బడి = వెంబడి, సవదరించెన్ = తాల్చెను, గ్రద్దలు సమీపమునఁజుట్టి తిరుగుట ఆసన్నమరణత్వమును దెలుపును. 'ఆసన్నమృత్యోర్నికటే చరంతి గృధ్రాదయో మూర్ధ్ని' గృహోర్ధ్వభాగే' శకునార్ణవము. ఎవని యింటిమీఁదఁగాని తలమీఁదఁగాని గ్రద్దలు మొదలైనవి తిరుగునో వానికి మృత్యువు సమీపించినది.

తాత్పర్యము

రావణాసురుని తేరి మీఁద నెత్తురువాన గురిసెను. సుడిగాలి యెడమవైపుగఁ జుట్టి విసరెను. వాని రథము వెంట గ్రద్దలు గుంపులై యాకాశమునఁ గూడి తిరిగెను. సంధ్య లంకయందు దాసనపువ్వువంటి కాంతినిఁ గలదయ్యెను. పగటివేళ యయ్యు నాకాంతికి భూమి మండుచున్నట్లు కానవచ్చెను. తోఁకచుక్కలు రాలెను. పిడుగులు విస్తారముగఁ బడెను. రాక్షసులు కలఁతచెందిరి. రాక్షసులు వానరులఁ గొట్టఁబోవునపుడు వారిచేతుల నెవరో బిగఁబట్టిన ట్లుండెను.

కం. రావణునితేరు చనియెడి, చో వసుధ వణంకుచుండె • సూర్యమరీచుల్
రావణునంగముపైఁ బడెఁ,గాని పసిమి తెల్ల కఱియ • కాంతులతోడన్. ౨౫౩౬

తాత్పర్యము

రావణు తేరు పోవుచోట నేల యదరుచుండెను. సూర్యకాంతులు రావణు మీఁదఁ బడెను గాని, యవి ఎఱుపు, పసుపు, తెలుపు, నలుపు వన్నెలు కలవై యుండెను.

కం. వెంబడి వచ్చెడి పెనుగృ, ధ్రంబులు ముఖములను మంట • గ్రక్కుచుఁ దద్వా
క్త్రింబును గని యశివనినా,దంబులు గావించె దెసల•దళ మయ్యె నిరుల్.

అర్థములు. అశివనినాదంబులు = అశుభము దెలుపు ధ్వనులు, ఇరుల్ = చీఁకటులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ప్రతికూలవాయువుల్ • పాంసుజాలంబుతోఁ, రావణాసురు దృష్టి•ద్రఢిమఁ జెఱిచె
నుఱుములు లేక యె•యురలె నింద్రాశను, లందందు సైన్యంబు•నందుఁగలయఁ
బాంసువర్షంబునఁ • బరికింపరా దయ్యె, జలధరమార్గంబు • సైన్యములకు
శారికాకోటులు•జగడంబు లాడుచుఁ, బరుషధ్వనులతోడఁ • బడిరొ దేరఁ
తే. గటుల జనియించె విస్ఫులిం•గములు కనుల,నూరె నీరంబు బాబాల•కొక్కసారి
యిట్టియుత్పాతములు రాక్ష•సేంద్రుకీడు,పలువిధంబులఁ దెలిపెను•ధండనమున.

అర్థములు. పాంసుజాలంబుతో = విస్తారపు దుమ్ముతో, ద్రఢిమ = పటుత్వము, ఉరలెన్=రాలెను, ఇంద్రాశనులు = పిడుగులు, పాంసువర్షంబున= దుమ్మువానచే, జలధర మార్గంబు=మేఘమార్గము, ఆకాశము,శారికాకోటులు = గోరువంకల గుంపులు, బాబాలకు=గుఱ్ఱములకు, కటులన్=చెక్కిళ్ళయందు, విస్ఫులింగములు=మిణుఁగురులు, ధండనమునన్=యుద్ధమందు.

తాత్పర్యము

ఎదురుగాలి దుమ్ముతోడ వీచి రావణుని దృష్టిపటుత్వము చెఱిచెను. ఉఱుము లేకయే సైన్యమున పిడుగులు పడెను. ధూళివర్షముచేత నాకాశము కానరాదయ్యెను. గోరువంకలు కలహించుచు పరుషముగఁ గూయుచు తేరియందుఁ బడెను. గుఱ్ఱములకుఁ జెక్కిళ్ళయందు మిణుఁగురు కన్నుల నీరు కలిగెను. రావణుని కీడు తెలుపుచు నిట్టి యవశకునము లనేకములు గానవచ్చెను.

కం. రామునకును సౌమ్యంబులు, క్షేమావహములును నైన • చిహ్నము లయ్యెన్
రాముఁడు వానిని గని మది, నామోదం బొందెఁ జచ్చె • నసురుం డనుచున్.

అర్థములు. క్షేమావహములు=మేలు కలిగించునవి.

తాత్పర్యము స్పష్టము.

## —• { ౧౦౮-వ సర్గము. వానరరాక్షసులు శ్రీరామరావణ యుద్ధంబు దిగ్భ్రమగొని చూచుట } •—

శా. హర్షోల్లాసవికాసభాసురముఖుం•డై రామచంద్రుండు జ్యా
కర్షారావము ఘోరమై పరఁగ వీఁ•కం బాణ పాతంబులన్
ధర్షించెన్ సురవైరి వాఁడును రణో•త్కంఠన్ మహాశస్త్రముల్
వర్షించెం ద్రిజగద్భయావహముగా • వర్తిల్లెఁ దజ్జన్యమున్. ౩౮౮౧

అర్థములు. హర్షోల్లాస వికాస భాసుర ముఖుండై =పులకలచేతను సంతో

షము చేతను గలిగిన వికాసముచేతఁ బ్రకాశించు ముఖము గలవాఁడై, జ్యాకర్షా రావము = అల్లెత్రాటిని లాగుధ్వని, రణోత్కంఠన్=యుద్ధమందలి తహ తహ పాటుచే, జన్యము = యుద్ధము.

తా త్ప ర్య ము

పులకలచేతను సంతోషముచేతను గలిగిన వికాసమువలన ప్రకాశించు ముఖము గలవాఁడై రామచంద్రమూర్తి యల్లెత్రాడు లాగి విడుచుటవలన గలుగు ధ్వని భయంకరముగా వ్యాపింపఁగా బాణములు వేయుటచే రావణుని మోదెను. వాఁడును యుద్ధమందలి యతికాంక్షచే మహాశస్త్రములను వర్షించెను. ఈ ప్రకారము యుద్ధము భయంకరమయ్యెను.

ఉ. మర్కటసైన్యముల్ దనుజ♦మండలియున్ రణకాంక్ష గల్గియున్
గర్కశసాధనావళులు ♦ గ్రాలుకరంబులతోడి రాక్షసే
శార్కకులీనభండనము ♦ సక్కటిఁ జూచుచుఁ జేష్ట లేది సం
తర్కముతోఁ దదేకమతిఁ ♦ దప్పనిచూడ్కులఁ జూచె నంతయున్. ౨౪౪౨

అర్థములు. కర్కశ=కఠినములైన, రాక్షసేశ = రావణుని యొక్కయు, అర్కకులీన = రామచంద్రుని యొక్కయు, భండనము=యుద్ధము, చేష్టలేది = ఏకార్యము చేయక, కదలక మెదలక - సంతర్కముతో = ఎవరు గెలుతురోయను నూహలతో, తదేకమతిన్ = మనస్సంతయు దానియందే యుంచి, తప్పని చూడ్కులన్=దానిని విడిచి మఱియొకదానిమీఁదఁ బోవని దృష్టులచే.

తా త్ప ర్య ము

వానరసేనలు రాక్షససేనలు యుద్ధము చేయఁ గోరిక గలిగియు, కావలసిన సాధనములు చేతులఁ బట్టుకొన్న వాఁడయ్యు రామ రావణుల యుద్ధమును జూచు నాశచే కదలక మెదలక తదేకధ్యానముతో నెవరు గెలుతురో యెవరి కే క్షణ మున నేమగునో యని ఱెప్పలు వ్రాల్పక చూచుచుండెను.

కం. అబ్బురపడు మనములతో, నిబ్బరపడి నిలిచి డాయు ♦ నిజశత్రులపై
దెబ్బయిడీయ రిపుదెస, నబ్బలియులపోరు చూచు♦నభిలాషమునన్ ౨౪౪౩

తా త్ప ర్య ము

రామరావణులయుద్ధము చూచు కోరికతో నాశ్చర్యపడు మనస్సులతో నిబ్బరముగ నిలిచి శత్రులు తమపై పడివచ్చుచున్నను వారిని గొట్టక నిలిచియుండిరి.

కం. రావణుఁ గను నసురులు నీ, రావిభుఁ గను వానరులును ♦ దతవిస్మయపు
ల్లావిఘ్నాలోకనముల, వా విచ్చి రహింత్రు సాల♦భంజిక లట్లై. ౨౪౪౪

అర్థములు. తతవిస్మయ = విస్తారమైన యాశ్చర్యముచే, ఫుల్ల=విచ్చిన, అవిఘ్న=విఘ్నములేని, ఆలోకనములన్=చూపులచే, వా విచ్చి = నోరు తెఱచి కొని, సాలభంజికలట్లై = బొమ్మలవలె.

తాత్పర్యము

రావణునిఁ జూచి రాక్షసులు, రాముని జూచు వానరులు ఆశ్చర్యముచే తెప్పపాటులేని కన్నులచే నోరు తెఱచికొని, బొమ్మలవలెనై చూచు చుండిరి.

—• శ్రీరాముఁడు రావణు ధ్వజంబు నఱకుట •—

శా. అంతన్ రావణరాఘవుల్ నిజనిమి• త్తాళీసమీక్షాదృఢ
స్వాంతుల్ శోకము నీసు డింపక భయం • బావంతయున్ లేక దు
ర్దాంతప్రౌఢిమఁ బోరుచో నసుర మ • ర్త్యవ్యం బటంచున్ ధరా
కాంతుండున్ విజిగీష స్వస్వబలవి• క్రాంతుల్ సమగ్రంబుగన్. ౨౨౨౫

అర్థములు. నిజ నిమిత్తాళీ సమీక్షా దృఢస్వాంతుల్ = తమకుఁ గలిగిన శకునము చూచుటచే దృఢపడిన మనస్సులు గలవారు, రావణుఁడు తనకుఁ గలిగిన యపశకునములఁ జూచి తనకుఁ జావు తప్పదని తలఁచెను. రామచంద్రమూర్తి శుభ శకునములఁ జూచి జయము తప్పదని నిశ్చయించెను. మర్త్యవ్యం మరణం అవశ్యం భావతిమర్త్యవ్యం, అవశ్యక త్యార్థేతవ్యః-మరణమవశ్యముకలుగునని రావణాసురుఁడు ఈమాటకు మృత్యురూప శత్రువును చంపవలయునని యర్థమని కతకుఁడు, విజిగీష= జయించు కోరికతో, స్వస్వబల విక్రాంతుల్ = తన తన బలము పరాక్రమము, సమగ్రంబునన్ = పూర్ణముగ.

తాత్పర్యము

ఇట్లు శకునములు కలుగఁగా రావణుఁడు రామచంద్రమూర్తియుఁ దనకుఁ దనకుఁ గలిగిన శకునములఁ జూచి మనస్సులు నిశ్చయము చేసికొనియు కొంచెమైనను కోపము వదలక, కొంచెమైన భయపడక, మిక్కిలి నేర్పుతో యుద్ధము చేయునపుడు అపశకునములు గానవచ్చుటచేఁ దనచావు తప్పదని రావణుఁడును, శుభశకునములు గానవచ్చుటచే తనకు జయము తప్పదని రామచంద్రమూర్తియు తలఁచి తమబల పరాక్రమములు పూర్ణముగ.

శా. హోరాహోరి పెనంగుచో సురపరుం• డుగ్రోగ్రదుర్వారస
న్నారాచోత్కరముల్ నిగిడ్చి ధరణీ• •నాథధ్వజం బంటఁ ద
న్నారాచంబులు దానిఁ దాఁకక ధరన్ • వ్యర్థంబులై రాలుడున్
శ్రీరాముండు ప్రతిక్రియం జలుప నెం• చెన్ వంచెవి ల్లుద్ధతిన్. ౨౨౨౬

అర్థములు. సురపరుండు = దేవద్వేషి, రావణుఁడు, ఉగ్రోగ్ర = మిగుల నుగ్రములైన దుర్వార = వారింపరాని, సత్+నారాచ+ఉత్కరముల్ = మంచి బాణ సమూహములు, ధరణీనాథధ్వజం బంటన్ = రామచంద్రుని ధ్వజము దాఁకు నట్లు, హోరాహోరిన్ = విరామములేక.

తాత్పర్యము

కొంచెమైనఁ దెఱపి లేక యుద్ధము చేయునపుడు రావణుఁడుమిగులనుగ్రము

లైన నివారింపరాని బాణములను రామచంద్రమూర్తి ధ్వజమును దాఁక వలయు నని వేసెను గాని యవి దానిని దగులకయే వ్యర్థముగా నేల రాలెను. అప్పుడు రామచంద్రమూర్తి వాఁడు చేసిన దానికి బదులు చేయఁ దలఁచి బలాధిక్యము కొలఁది విల్లు వంచెను.

కం. తెగ నిండఁ దిగిచి యొక్కటి, ఖగముం బరఁగింపఁ ద్రుంచి ♦ క్రవ్యాదు ధ్వజం
 బొగి మహిఁ జొచ్చెను వేగమ, బిగిచెడి యది యురలె వాని ♦ బీరముపోలెన్.

అర్థములు. తెగ=అల్లెత్రాడు, నిండన్ = పూర్ణముగా, ఎంతవఱకు, లాగ సాధ్యమో యంతవఱకు, క్రవ్యాదు=రాక్షసునియొక్క, ఉరలెన్=దొర్లెను.

తాత్పర్యము

అల్లెత్రాడు పూర్ణముగ లాగి యొక్క బాణమును బ్రయోగింపఁగా నది రావణుని ధ్వజమును ఖండించి భూమిలోఁ బ్రవేశించెను. ఆ ధ్వజము రావణుని పరాక్రమమువలెనే బిగువుచెడి నేలదొరలెను. ఉపమానము బిగువు చెడుట యందేయని గ్రహింపవలెను.

చ. ధ్వజ మిటు గూల రావణుఁడు ♦ దారుణరోషపరీతచిత్తుఁడై
 భుజబల మెల్లఁ జూపి రఘు ♦ భూవరువాజుల ముంచె నమ్ములన్
 గజబిజలేక తామరస ♦ కాండహతంబులు వోలె సైంధవ
 వ్రజములు స్వస్థతన్ వెలసె ♦ వానిని జూచి సురారి వెండియున్. ౨౮౮౮

అర్థములు. దారుణరోషపరీతచిత్తుఁడై = భయంకరమైన రోషముచేఁ గూడిన మనస్సు గలవాఁడై, తామరసకాండ=తామర తూఁడులచే, హతంబులు= కొట్టఁబడినవి, సైంధవ వ్రజములు=గుఱ్ఱముల సమూహములు, స్వస్థతన్=యథా ప్రకారముగ, సుఖముగ.

తాత్పర్యము

తన ధ్వజము నేలఁబడఁగా రావణుఁడు మిగులఁ గోపించినవాఁడై తన భుజ బలమంతయుఁ జూపి రాముని గుఱ్ఱముల బాణములచే ముంచెను. ఆ గుఱ్ఱములు కొంచెమైనఁ గలఁతచెందక తామరకాండలచేఁ గొట్టఁబడినవానివలెనై యథా ప్రకారము సుఖముగ నుండెను. రావణుఁడు మఱియును.

కం. మాయా విహితశరంబుల, నాయసపరిఘముల గదల ♦ నతిభీకరచ
 క్రాయతశూలపరశ్వథ, సాయక గిరిశృంగవృష్టి ♦ సాధ్వసదముగన్. ౨౮౮౯

అర్థములు. మాయావిహిత శరంబులన్=మాయచేఁ గల్పింపఁబడిన శర ములచే, ఆయస పరిఘములన్ = ఇనుప గుదియలచే, అతిభీకర = మిగుల భయం కరమైన, చక్ర = చక్రములచేతను, ఆయతశూల = నిడుపాటి శూలములచేతను, పరశ్వథ=గండ్ర గొడ్డండ్ల చేతను, సాయక=బాణములచేతను, గిరిశృంగవృష్టిన్ = పర్వతశిఖరముల వానచేతను, సాధ్వసదముగన్=భయము కలిగించునట్లుగ.

తాత్పర్యము

సామాన్య బాణములు పనిచేయకుండుటచేత మాయచేఁ గల్పింపఁబడిన బాణములచేతను ఇనుపగుదియలచేతను గదలచేతను భయంకరములైన చక్రములచేతను నిసుపాటి శూలములచేతను గండ్రగొడ్డండ్లచేతను బాణములచేతను శిఖర వర్షముచేతను భయము కలుగునట్లు.

కం. ఆకసము భూమినిండ న, నేకంబులు శస్త్రసమితు ♦ లెల్లెడఁ బఱపెన్
గాకుత్స్థరథము దక్కఁ న,నీకమ్ము నిరంతరముగ ♦ నిండెన్ వానన్.

తాత్పర్యము

భూమి ఆకాశము నిండునట్లు శస్త్ర సమూహములను నలువైపులఁ బరగించెను. రామచంద్రమూర్తి రథము తప్పఁ దక్కిన సేనయంతయు వానిచే నిండెను.

ఇందు మాయాశరములనఁగా మిథ్యాశరములు గావు. మిథ్యలను నేమది రావణుఁడు ప్రయోగించియుండును. కావున మాయాకల్పితము లనఁగా అద్భుత శక్తిచేఁ గల్పింపఁబడినవనియే యర్థము. ఇట్లె ప్రహ్లాదునిమీఁద శంబరుఁడు మాయాయుధముల ప్రయోగింప సుదర్శనము వానిని ఖండించెను. విష్ణుపురాణమున నిట్లు చెప్పఁబడెను.

'తేన మాయాసహస్రం త చ్ఛంబరస్యాశుగామినా, బాలస్య రక్షితా దేహ మేకైకంచ నిషూదితమ్'. మాయిక బాణములు మాయిక కార్యములుచేయునే కాని కార్యసాధకము లెట్లు కాఁగలవు. అవి ఖండింపఁబడు టెట్లు? కాన మాయ యనఁగా మిథ్యగాదు. అనీకము=సమూహము.

శా. ఏకోద్యోగ విజృంభమాణుఁ డయి దై ♦ త్యేశుండు నశ్రాంత మ
వ్యాకీర్ణం బగు చిత్తవృత్తి శరసా ♦ హస్రంబు కీశావళిన్
చీకాకుం గొన నేసె నేయుటయు శ్రీ ♦ సీతేశుఁడున్ సుస్మిత
వ్యాకోచాననుఁడై నిజాస్త్రసమితిన్ ♦ వైశంబ పై వైచినన్. ౨౮౫౧

అర్థములు. ఏకోద్యోగ విజృంభమాణుఁడయి = ఒక్క ప్రయత్నముచే విజృంభించినవాఁడై, అశ్రాంతము=విడువక, అవ్యాకీర్ణము = కలఁత చెందనిది, సుస్మిత=చిఱునవ్వుచే, వ్యాకోచాననుఁడై=వికసించిన ముఖము గలవాఁడై.

తాత్పర్యము

రావణాసురుఁ డేకవిధమైన సంకల్పము గలవాఁడయి విరామము లేక కలఁత చెందని మనస్సుతో నేమైనఁ గానిమ్మని వేలకొలఁది బాణములను వానరులు చీకాకుపడ వేసెను. అది చూచి రామచంద్రమూర్తి వీఁడీ యాటలకు మరగినాఁడా యని నవ్వుచు, తన యస్త్రసమూహములను వానిమీఁద వేయఁగా.

చ. వడిగొని నూర్లు వేలుగను ♦ వచ్చెడి రామశరాళిఁ గాంచి తా
నుడుగక యట్లు పైపయి స ♦ ముగ్రత వైచె సురారినాథుఁడున్

గడుకొని వారి బాణముల • ఖచ్ఛలి సాయకబద్ధ మైనదై
పడెఁ బోలుపారి రెండవ న • భం బనఁ బందిరి వైచినట్టు లై. ౨౮౬౨

తా త్ప ర్య ము

మిగుల వేగముగ రామచంద్రమూర్తి బాణములు నూర్లు వేలుగఁ దన మీఁదికి రాఁగా రావణుఁడును నట్టులే తానును వైచెను. వారి యిరువురబాణములచే నాకాశము బద్ధమైనట్లు పందిరి వేసినట్టులై యది రెండవ యాకాశమువలెఁ గాన నయ్యెను.

కం. గుఱి తప్పదు వ్యర్థం బై, పఱి వోవద యెదిరిఁ బఱియ • వాపకపో ది
ద్ధఱశరములనొక టనియు, బిఱుసేదదు వాఁడిచెడదు•విఱువోదనిలోన్ ౨౮౬౩

అర్థములు. పఱివోవదు = నశింపదు, పఱియవాపక = చీల్పక, బిఱుసేదదు = బిఱుసు లేనిదికాదు, విఱువోదు = వెనుకఁబడదు.

తా త్ప ర్య ము స్పష్టము.

సీ. ఒండొరుబాణంబు • లొండొంటి ఢీకొని, తుత్తుమురై నేలఁ • దూలిపడఁగ
సవ్యాపసవ్య సం•చారభేదంబుల. నెఱపుచు విశిఖముల్ • పఱపి పఱపి
రావణుహయముల • రాముండు రాముని, హయముల రావణుం•డడిచియడిచి
కృతికిని బ్రతికృతి•ద్రుతగతిఁ జలుపుచు, నొక్కముహూర్తం బిట్టు • లుక్కుమెఱసి
ఆ. యిద్దఱుఁబోర యిద్ధ • తేటాడుచుండఁగ, సకలభూతములును • సంభ్రమమున
వెఱగుపాటుతోడ • వీక్షించుచుండెను, గాన మెన్నఁడిట్టి • కల నటంచు

అర్థములు. సవ్యాపసవ్య సంచారభేదంబులన్ = ఎడమకుడిగాఁ దిరుగు భేదములచే, అడిచి = కొట్టి, ద్రుతగతిన్=శీఘ్రముగ, ఏటాడుచు = కొట్టుకొనుచు, కలను = యుద్ధము.

తా త్ప ర్య ము

ఒకరు వేసిన బాణములు మఱియొకరు వేసిన బాణములతో ఢీకొట్టి రెండును పొడిపొడియై నేలరాలఁగ ఎడమకుడి, కుడియెడమలుగఁ దిరుగుచు బాణములు వేసి వేసి రాముని గుఱ్ఱములను రావణుఁడు, రావణుని గుఱ్ఱములను రాముఁడు కొట్టి కొట్టియొకరు చేసినదానికి వెంటనే బదులు మఱియొకరు చేయుచు కొంచెము కాలమట్టులు పరాక్రమించి వెనుదీయక యుద్ధము కొట్టుకొనుచుండ సమస్తప్రాణులు భ్రాంతిపడి నివ్వెరగొని యిట్టి యుద్ధ మెన్నఁడు చూడలేదని యనుకొనుచుండిరి.

**—• ౧౧౦-వ సర్గము. రావణుఁడు భీమముగ శ్రీరామునితోఁ బోరుట •—**

సీ. దాయుచుఁబాయుచుఁ•దద్దయుఁ గదియుచు, నన్యోన్యము వధింప•యత్నపడుచు
నొండొంటిఁ జుట్టుచు • నొరయు నల్లరుగుచు, నిండారుతేజున • మండిపడుచు
విచ్చుచు జవమున • హెచ్చుచుఁ బగడీలు, పుచ్చుచు నెదురు త•ప్పులనుగనుచు
సారథిసారథ్య•సామర్థ్యమునఁ జేసి, చిత్రయానంబులఁ • జెలువు మెఱసి

ఆ. రథయుగంబు నప్డు•రావణరాఘవుల్. డాయుచోట మరలఁ • బాయుచోట
గమనజవము వెలయఁ•గాండము ల్గురియింప, వారివాహయుగము•భాతి దనరె.

అర్థములు. పగ=శత్రువును, డీలువుచ్చుచు = డీలుపడఁజేయుచు, వారివాహయుగముభాతి = రెండు మేఘములవలె.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఏపును నేపునున్ మెఱయ • నీగతి నిద్దఱుఁ జిత్రభంగి సా
టోపగతిం జరించుచుఁ గ•డు న్వడి నెట్టెదు రౌచు వర్థిలం
గోపము కాఁడికాఁడియును • గుఱ్ఱము మూఁతియు మూఁతి ఢెక్కెముల్
చేపడి ఢీకొనం బఱవఁ•జేసిరి వారి శతాంగరాజముల్. ౨౮౫౬

అర్థములు. ఏపు = పరాక్రమము, నేపు=నేరుపు, ఆటోపగతిన్ = వేగముతోఁ గూడిన గమనముతో, ఎట్టెదురు=ఎదురు+ఎదురు=ఎట్టెదురు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. అట్టియెడన్ రఘుప్రవరుఁ • డాశరనాయకు నాల్గువాజులన్
గొట్టెను నాల్గుబాణములఁ • గ్రూరతఁ దత్తడు లోసరిల్లినన్
నెట్టన దీర్ఘరోషి రజ•నీచరవర్యుఁడు రామచంద్రుపై
గుట్టలు గొట్టుశస్త్రమున•కుం దులతూఁగెడిముల్కు లేసినన్. ౨౮౫౭

అర్థములు. తత్తడులు = గుఱ్ఱములు, ఓసరిల్లినన్=తొలఁగినన్, అడ్డముగా నీడ్వఁగా, గుట్టలుగొట్టు శస్త్రమునకున్ = వజ్రాయుధమునకు, తులఁదూఁగెడి=సమానమగు.

తాత్పర్యము

ఆ సమయమందు రామచంద్రమూర్తి రాక్షసరాజు నాలుగు గుఱ్ఱములను క్రూరుఁడై నాలుగు బాణములచేఁ గొట్టెను. ఆ దెబ్బలుపడి గుఱ్ఱములు త్రోవ తొలఁగిపోఁగా దీర్ఘకోపి యగు రావణుఁడు వజ్రాయుధముతో సమానములైన బాణములను రామచంద్రుపై వేసెను

తే॥ బంతితేరుల రౌండయని•పట్టి వాని, తాఁకునను నొవ్వు గొనక ని•తాంత శాత
సాధనము లేసె దాని కా•శక్రవైరి,సారథిని నేసెనిరుపమ•సాయకముల. ౨౮౫౮

అర్థములు. నొవ్వు = నొప్పి, నితాంత = మిక్కిలి, శాత = పదునైన, సాధనములు = బాణములు, శక్రవైరి = రావణుఁడు, నిరుపమ సాయకములన్ = అసమాన బాణములను, బంతితేరుల రౌండయని=పంక్తిరథుని - దశరథుని, పట్టి= కుమారుఁడు.

తాత్పర్యము

అవి తగిలినను రామచంద్రమూర్తి నొప్పిపడక మిగుల వాఁడిగల బాణముల నేసెను. దానికి రావణుఁ డసమానబాణముల మాతలిని వేసెను.

కం. మాతలియును దద్విశిఖా, పాతంబులఁ జిమకఱచు • పాటియు నొవ్వేన్
భీతియు మోహము గానక, ప్రీతుఁగఁ యుండె నసుర • శేఖరుఁ డీట్టుల్. ౨౮౪౯

అర్థములు. తద్విశిఖాపాతంబులన్ = ఆ బాణములు మీఁదఁబడుటచే.

తాత్పర్యము

ఆ బాణములు తనకుఁ దగిలినను మాతలి చీమ కుట్టిన మాత్రము నొప్పియైనను భయమైనను భ్రమయైనను బొందినవాఁడు కాఁడు. కాంతియుఁ దగ్గినది కాదు.

కం. తనసారథి నొప్పించినఁ, దను నొంచినఁ గవలవట్టి • ధైర్యనిధి రుషా
తనురక్తాననుఁ డై యసుహృని విముఖునిఁజేసె బహుళ • రూక్షేషువులన్. ౨౮౫౦

అర్థములు. రుషా+అతనురక్త+ఆననుఁడై = కోపముచే మిక్కిలి యెఱ్ఱనైన ముఖముగలవాఁడై, విముఖుని = మాఱు మొగము గలవానిఁగా.

తాత్పర్యము

తన్నుఁ గొట్టినను గోపింపని రామచంద్రమూర్తి తన సారథిని రావణుఁడు గొట్టఁగా మిగులఁ గోపించి కఠినబాణములచే వాఁడు ముఖము త్రిప్పుకొని పోవునట్లు కొట్టెను.

చ. ఇరువది ముప్పదిన్ నలువఁ • దేఁబది యర్వది నూఱు వేలు భీ
కరశరవార మొక్కుమొగి • గాత్రము తూఁటులు వోవ నేయుడున్
సురపరిపంథి శాతతర • శూలగదాపరిఘాదిసాధనో
త్కరముల నేసెఁ భైరవము • దద్దయు దిక్కులఁ బిక్కటిల్లఁగన్. ౨౮౫౧

అర్థములు. సురపరిపంథి = దేవవిరోధి, రావణుఁడు, భైరవము = పెద్ద ధ్వని. పిక్కటిల్లఁగన్ = క్రిక్కిఱియఁగా.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిరువది, ముప్పది, నలువది, యేఁబది, యఱువది, నూఱువేల బాణములు దేహము దూఱిపోవునట్లు వేయఁగా రావణుఁడు పదును గల శూలములు గదలు పరిఘములు లోనగు నాయుధములను పెద్ద ధ్వనులు దిక్కులు నిండ నేసెను.

శా. నారాచంబులు చొచ్చురాయిడికి నా • నాథంగి క్షోభిల్లెఁ గూ
పారంబుల్, సుతలాలయుల్ విషధర • ప్రాగ్భ్యల్ మహావేదనన్
గూరంజొచ్చిరి, దానవుల్ బెగడి గ • గ్గోలొంది రెంతేని, కాం
తారక్ష్మాధరయుక్త భూవలయ మా • త్రం బద్యోఁ గంపించుచున్. ౨౮౫౨

అర్థములు. రాయిడికిన్ = ఉపద్రవమువలన, పంచమ్యర్థమున షష్ఠి, కూపారంబుల్ = సముద్రములు, సుతల+ఆలయుల్ = సుతలలోకమున నున్నవారు, విషధరప్రాగ్భ్యల్ = సర్పశ్రేష్ఠములు, గగ్గోలొందిరి = క్షోభపడిరి, కాంతార =

అడవులతోను, భూధర=పర్వతములతోను, యుక్తం = కూడిన, భూవలయము = భూచక్రము, ఆర్తంబయ్యెన్=బాధచెందిన దయ్యెను.

తాత్పర్యము

బాణములు తమలోఁ బ్రవేశించు నుపద్రవమువలన సముద్రములు కలఁత చెందెను. పాతాళవాసులైన సర్పశ్రేష్ఠములు మహాబాధ పడఁజొచ్చెను. దానవులు భయపడి మిగులఁ గలఁత చెందిరి. అడవులతోఁ గొండలతో భూచక్రము వడఁకుచు బాధపడెను.

తే. కాంతిఁ గోల్పడెఁ బద్మినీ • కాంతుఁ డపుడు
గతులు చెడి భ్రమానుపడె సదా • గతియు సిద్ధ
విబుధ గంధర్వపరమర్షి • బృంద మెల్ల
దిక్కుఁ దోఁపక చింతచే • దీన మయ్యె. ౪౨-౩

అర్థములు. పద్మినీకాంతుఁడు = సూర్యుఁడు, ఇట్లు చెప్పుటచే నింకను సూర్యాస్తమానము కాలేదని యేర్పడు చున్నది. సదాగతి=వాయువు.

తాత్పర్యము

సూర్యుఁడు కాంతిహీనుఁ డయ్యె, వాయువు మార్గముచెడి మొద్దుపాఱెను. దేవగంధర్వులయు ఋషులయు సమూహము దిక్కు తెలియక చింతచే శోకించెను.

సీ. స్వస్తి గోబ్రాహ్మణే • భ్యోస్తు లోకా స్సమా, శ్శాశ్వతా స్తిష్ఠన్తు • చణ్డసమితి
విజయతాం రాఘవో • విశ్వవిద్వేషిణం, రాక్షసనాయకం • రావణంచ
యని జపించుచు నాత్మ • లను నిరీక్షింపగ, రోమహర్షణ మైన • భీమజన్య
మమరులు గంధర్వు • లసమానతత్సంప్ర, హారంబుఁ గనుఁగొని • యుబ్బకుడుచు
ఆ. నభ్రమునకు నభ్ర • మంబుధి కంబుధి, రామరావణోగ్ర • రణమునకును
రామరావణోగ్ర • రణమె సమం బని, చూచు చుండి రపుడు • శుద్ధమతుల.

అర్థములు. గోబ్రాహ్మణేభ్యః స్వస్తి అస్తు = గోవులకు బ్రాహ్మణులకు మేలు కలుగును గాక. బ్రాహ్మణునకు సమానమైనది గోవుమాత్రమే. సమస్త భూచక్రమైనను బ్రాహ్మణునకు సమముగాదు. గోవులవలన బ్రాహ్మణుల వలన లోకమునకు మేలుగలదు,కీడులేదు.బ్రాహ్మణుఁడు గోవుచెడిన తలలేని మొండెము వలె దేశమే చెడును. వీరు క్షేమముగా నుండినఁ బ్రపంచము క్షేమపడును. ఇది సద్బ్రాహ్మణ విషయము. బ్రహ్మబంధువుల విషయము గాదు, 'లోకాః సమాః శాశ్వతాః తిష్ఠంతు=లోకములు శాశ్వత వత్సరము లుండునుగాక, చండసమితి = భయంకరయుద్ధమునందు, రాఘవః=రామచంద్రుఁడు,విశ్వవిద్వేషిణం=ప్రపంచమునకు విరోధి యగు, రాక్షసనాయకం=రాక్షసరాజు నగు, రావణం = రావణుని, విజయతాం=జయించునుగాక, ఇదిచెప్పినవారు దేవర్షులు గావున వారిభాషయందు వారు మాటలాడిరని గ్రహింపనగు, జపించుచు=పలుకుచు, భీమజన్యము=భయం

కర యుద్ధము, అసమాన తత్సంప్రహారంబు = వారల అసమానమైన యుద్ధము, అభ్రమునకు=ఆకాశమునకు, అంబుధికి=సముద్రమునకు, రామరావణ = రాము నకు రావణునకు సంబంధించిన, ఉగ్రరణమునకును = భయంకర యుద్ధమునకు, అభ్రమున కభ్రము, అంబుధికంబుధి, రామరావణ యుద్ధమునకు రామరావణ యుద్ధము సమాన మనుటచే వీనికి సమముగా నుపమింపఁ దగినవి యివిగాక వేఱు లేకుండుటచే అనన్వయాలంకారము.ఒకవస్తువే యుపమానము ఉపమేయమునైన యెడల ననన్వయాలంకారము.

## తాత్పర్యము

గోవులకు బ్రాహ్మణులకు క్షేమముగలుగునుగాక!లోకములు జనులు శాశ్వత సంవత్సరము లుండునుగాక! యుద్ధమందు లోకద్వేషియు రాక్షసరాజు నగు రావ ణుని రాముఁడు జయించునుగాక! యనుచు భయంకరమై గగ్గురుపాటు గలిగించు నా యుద్ధమును దేవతలు,ఋషులు చూచుచుండిరి. వారు ఆకాశమునకు ఆకాశమే సమానము, సముద్రమునకు సముద్రమే సాటి, రామరావణ యుద్ధమునకు రామ రావణయుద్ధమే యీడని నిర్మలమనస్సులతో నాశ్చర్యపడుచుండిరి.

## —• శ్రీరాముఁడు రావణు శిరంబు నఱకుట •—

శా. చండామర్ష విభీషణుండు రఘువం • శక్షీరవారాశిచం
ద్రుం డాశీవిషతుల్యసత్క్షురముఁ దో • డ్తోఁ బూని రత్నోజ్జ్వల
చ్చండాంశూపమకుండలాంచితము శీ • ర్షం బంత ఛేదించె బ్ర
హ్మాండం బంతయుఁ జూచె రావణప్రధా • నాంగంబు నేలం బడన్. ౨౪-౨౫

అర్థములు. చండామర్ష విభీషణుండు=తీక్ష్ణమైన కోపముచే భయంకరుఁడు, రఘువంశ=రఘువంశమనెడి, క్షీరవారాశి = పాలసముద్రమునకు, చంద్రుఁడు = చంద్రుని వంటివాఁడు, ఆశీవిషతుల్య=పాముతో సమానమైన, సత్ + క్షురము = మంచి క్షురము వంటి బాణమును, తోడ్తోన్ = వెంటనే, రత్న - ఉజ్జ్వలత్ = రత్నములచే ప్రకాశించునవియు, చండాంశూపమ=సూర్యునితో సమానములైనవి యగు, కుండల = కుండలములచే, అంచితము = ఒప్పుచున్నది, శీర్షంబు=తలను, ఛేదించెన్=నఱకెను, రావణ ప్రధానాంగంబు=రావణు శిరస్సు.

## తాత్పర్యము

తీవ్రకోపముచే భయంకరుఁడై రఘువంశమను పాలసముద్రమునకుఁ జంద్రుని వంటివాఁడగు రామచంద్రమూర్తి సర్పముతో సమానమైన మంగలకత్తివంటి బాణమును వెంటనే సంధించి రత్నములచే ప్రకాశించునవియు సూర్యునివంటి కాంతిగలవియు నగు కుండలములచే నొప్పు రావణు శిరస్సును నఱకెను. అది నేలఁ బడఁగా ప్రపంచ మంతయుఁ జూచెను.

ఉ. ఆతల యట్టిదే మొలచె • నచ్చటనే యపుడే నృపోత్తముం
డాతతవేగహస్తుఁ డయి • యద్ది హరింపఁగ వెండి మొల్చె నీ
లాతరుణీవిభుం డదియుఁ దప్పక త్రుంపఁగ వెండి మొల్చె నా
తప్పైతలభర్త నూఱు నొక•మాఱును ద్రుంచె సురారిమూర్ధముల్. ౨౮౬౬

తాత్పర్యము స్పష్టము.

పై పద్యమునందు నీ పద్యమునందు నొక శిరస్సు మాత్రమే ఛేదింపఁ బడెనని చెప్పఁబడెను. దీనివలన నిప్పుడు రావణుఁ డేక శిరస్కుఁడై యుండెనని గోవిందరాజీయము. దీని కాధారము ౨౮౬౫ వ పద్యము. ఇచ్చట శిరస్సనునది జాత్యేక వచనముగా గ్రహింపవలెను. ఏలన—ముందు ౨౮౬౭ వ పద్యమున వింశతి భుజుఁడు-పంక్తివదనుఁడు మైనాకుపగిది నిలిచె నని పది తలలు, ఇరువది చేతు లున్నట్లు చెప్పఁబడెను. ఇచ్చట నఱకఁబడినది యొక శిరస్సే కావున నొక శిరస్సనియే చెప్పఁబడెనని తీర్థీయము. ౨౮౧౧ వ ఉద్ధృత్యచ భుజౌ కాచిదంకే శిరః కృత్వా రురోద- ఈవిధముగ మరణానంతర మొంటితల రెండుచేతులే యున్నట్లు చెప్పఁబడెను. దీనికి సమాధానము తీర్థీయమందు లేదు.

సారథి తేరు మరలించు నఱకు పదితలలతో నుండెననియు తల లెక్కువగు కొలఁది లక్ష్యము విశాల మగుటచే దెబ్బ లెక్కువ కావున మరలి వచ్చునపుడు ఒంటితలతో రెండుచేతులతోనే వచ్చెననియు సామరస్యము కుదుర్చ వచ్చును. రావణుఁడు కామరూపిగదా. తెగిన శిరస్సు మరల మొలచినట్లు చెప్పఁబడెను.ఇది యెట్లు? బ్రహ్మ యిచ్చిన వరము లందు నిది చెప్పఁబడలేదు.వరకాలమున వాఁడు నఱకి హోమము చేసిన తొమ్మిది తలలు మఱల వచ్చునట్లు బ్రహ్మయనుగ్రహించెను గాని యెప్పటి కట్లే యగునని చెప్పలేదు.

దశగ్రీవస్య చిచ్ఛేద శిరాంసి రఘునందనః,సముత్థితాని బహుశో వరదానాత్కపర్దినః—పద్మ. పురా.

అని యిది శివునివర మని చెప్పఁబడెను. ఉత్తరకాండమున నిదియుఁ జెప్పఁబడలేదు. నూటొక్కమాఱు రాముఁడు రావణుతల నఱకెనుగదా. ఆ నేలఁ బడిన తలలేవి? నేలమీఁద నున్నట్లు చెప్పఁబడలేదు. ఈవిషయమై యరణ్యకాండమున జటాయురావణయుద్ధఘట్టమునఁ జూచునది.

కం. త్రుంచినవెంటనె తల మొల, చెంచెడినే కాని వాఁడు• తెగియెడిభంగుల్
కొంచెము దోపఁబుకింజం,చించెం జిత్రం బటంచు • నృపతిలకుండున్. ౨౮౬౭

తాత్పర్యము

తల నఱకఁగానే తల మొలచుచుండెను గాని వాఁడు చచ్చు విధము కనఁబడలేదు.ఇది యేమి చిత్రమని రామచంద్రమూర్తి యాలోచించెను.పడిన తలయే మఱలఁ గఱచుకొను చుండె ననుట మీఁది యాక్షేపమునకు సమాధానము.

68)

సీ. మారీచుఁ జంపితి • మడియించితిని ఖరు, దూషణు ద్రుటిలోనఁ•ద్రుంపఁగంటి
క్రౌంచవనస్థు వి•రాధు ద్రుంచితి, దండకను గబంధు • దారితాంగుఁ
జేసితి నెప్పుడు • వీసరవోవవ, యస్మదస్త్రములు ప్ర•త్యాయికములు
నేఁ డేల వడిచెడి•వాఁడి వాసినయవి, కా నిట్టు లది యేమి•కారణంబొ

తే. యనుచుఁ జింతాపరుండయి•యనము డింప,క ప్రమత్తత నెండియు•నతులబాణ
వృష్టి వక్షంబుఁ జించిన•నెగడుపడక, యసురవర్యుండు ముసలగ•దాదినైచె.

అర్థములు. ప్రత్యాయికములు=నమ్మకమైనవి.

## తాత్పర్యము

మారీచుని, ఖరుని, దూషణుని, క్రౌంచవనమున విరాధుని, కబంధుని జంపితిని. ఎన్నఁడు నా బాణములు వ్యర్థములైనవి కావు. నమ్మకమైనవి. నేఁడేల యిట్టులయ్యెను ? వేగము తగ్గుటకు వాఁడిచెడుటకు నేమి కారణము అని యాలోచించుచు రోసము వదలక హెచ్చరికతో బాణవర్షముచే వక్షము చింపఁగా రావణుఁడు భయపడక ముసలము గద లోనైనవి వేసెను.

తే. వారు రథవేగగరిమ న • భంబునందు
భూతలంబునఁ దద్గిరి • మూర్ధమునను
నిశయు దినమును మూర్తంబు • నిమిష మేని
నిలుపకరె సర్వరాత్రంబు • కలను నలుప. ౨౮౬౮

అర్థములు. రథవేగగరిమన్ = అతిశయించిన రథవేగముచే, నభంబునందున్ = ఆకాశమందు, భూతలంబున = భూమియందు, తద్గిరిమూర్ధమునను = ఆ త్రికూటపర్వతశిఖరమునందు, ఇట్లు చెప్పుటచే కొంతసేపు భూమియందు,ఆవల నాకాశమందు, ఆవల త్రికూటశిఖరమందు - ఈ మూఁడు ప్రదేశములందు ననుకూలపడినట్లు ఒకటిమార్చి యొకటి రణభూమిగాఁ జేసిరని భావము.ఈ కారణముచేతనే వానరులను రాముఁడు సమీప పర్వతములందుఁ గూర్చుండుఁ డని చెప్పెను. సర్వరాత్రంబు=రాత్రియుఁ బగలు, చతుర్దశినాఁటి రాత్రి అమావాస్యనాఁటి పగలు రాత్రి.

మందోదరీ విలాపమందు సూర్యరశ్ములు లంకాపురిఁ బ్రసరించె ననుటచే అమావాస్య శేషముగల పాడ్యమినాఁటి యుదయము రావణ వధమనియుఁ జెప్పవచ్చును.

సర్వరాత్ర మనుటకు సప్తరాత్ర మనునది యపపాఠమనియు రామరావణులకు నేఁడుదినముల యుద్ధము రామాయణమున వినఁబడదనియు తీర్థీయము. సప్తరాత్రమనునది యపపాఠము. ఏఁడుదినములు రామరావణయుద్ధమే యైనయెడల నవమినాఁడే యీ యుద్ధము ప్రారంభమయి యుండవలెను. అష్టమినాఁడే మూలబలము హతమైయుండవలెను. పంచమి, షష్ఠి, సప్తమి, ఇంద్రజిత్తు యుద్ధము. ఈ

ప్రకారము చూచిన నిది యే లెక్కకు సరిపోదు. కావున సప్తరాత్ర మనునది యప పాఠము. అటుగాక సప్తరాత్ర మనునది సరియైన పాఠమందు రేని నవమినాఁడు యుద్ధారంభము కావున నేఁడు అమావాస్య కావున నేఁడుదినము లగుచున్నది. కావున యుద్ధమంతయుఁ గలసి ఏఁడు దినములని చెప్పవచ్చును.

ఈ విషయము ముందే చర్చింపఁ బడెను. యుద్ధారంభము దినము మొదలు రావణాసురుఁడు చచ్చువఱకు దినసంఖ్య యేఁడుగా నుండవలయును గాని దానికి మించరాదు. రామనామము మొదలు రామాయణ మంతయు నేఁడు సంఖ్యమీఁద నాధారపడి యున్నది. రామ=ఏఁడు, కాండము లేఁడు, యుద్ధదినము లేఁడు మొదలైనవి. (దీనిని జూచియే వ్యాసమహర్షి భారతమునకు 'జయ' మని పేరు పెట్టెను. జయ=౧౮; భారత పర్వములు ౧౮; యుద్ధదినములు ౧౮; భగవద్గీత ౧౮ అధ్యాయములు. ఈప్రకారము భారతము పదునెనిమిదిపై నాధారపడఁ జేసెను. సప్తసంఖ్య మహిమ తత్త్వశాస్త్రములందు విశేషించి చెప్పఁబడెను. భాగింప సాధ్యము కాని సంఖ్యలలో ఏడు కడపటిది. గొప్పది, ౧-౨-౩-౬-౯ ఇవి భాగింప సాధ్యపడదు. ఇవి యన్నియుఁ గలిపిన ౧౮ యగును. ఈవిషయము ముందే వ్రాయఁబడెను. చర్వితచర్వణ మేల ? కావున యుద్ధదినము లన్నియుఁ గలిసి యేఁడనియు, నందు రామ రావణయుద్ధ మొక్కదిన మనియు గ్రహింపనగు.

తాత్పర్యము

వారు భూమి ఆకాశము త్రికూటశిఖరము మూఁటిని యుద్ధరంగముగఁ జేసి యానుకూల్యముకొలఁది యీ మూఁడు ప్రదేశములందుఁ దిరుగుచు యుద్ధము చేసిరి. వారు రాత్రి పగలు ముహూర్తమైన నిమిషమైన నిలువక సర్వరాత్రము యుద్ధము చేసిరి.

తే. వారిరణమున విజయంబు • వారిజాక్ష, వంశ్యున కటంచు నిశ్చయిం • పఁగను లేక
యతులమతి శాలిమాతలి • యాహవైక, హృదయుఁ డగు రామవిభుతోడ • నిట్టులనియె

తాత్పర్యము

వారి యుద్ధమందు రామచంద్రమూర్తియే యిట్టులు యుద్ధము చేయుచుండిననో గెలువఁగలఁ డని నిశ్చయింపలేక మిక్కిలి బుద్ధిమంతుఁడైన మాతలి యుద్ధమందే మనస్సంతయు నిలిపి యితరవిచారము లేని రామచంద్రునితో నిట్టు లనెను

## —• ౧౧౧-వ సర్గము. శ్రీరాముఁడు బ్రహ్మాస్త్రంబున రావణు వధించుట •—

ఉ. ఏమి మహానుభావ! మది • నేమి యెఱుంగనివానిమాడ్కి నే
మేమొ మహాస్త్రముల్ పగతు • నేసెదుఁ దత్కృతికిం బ్రతిక్రియల్
గా, మడియింప నియ్యసురుఁ • గంజభవాస్త్రము వీడ వయ్య శ్రీ
రామ! సురోక్తకాలవప • రాసనకాల మ దివ్వ సంధిలెన్. ౩౮౯౧

అర్థములు. కంజభవాస్త్రము = బ్రహ్మాస్త్రము, సురోక్త = దేవతలచేఁ జెప్పఁబడిన, శాత్రవ పరాసన కాలము=శత్రుఁడు మరణించుకాలము,సంధిలెన్= కలిగెను.

తాత్పర్యము

ఇదియేమి మహానుభావా! రామచంద్రా! యేమియుఁ దెలియనివానివలె వాఁడు వేసిన యస్త్రమునకు బదులు మహాస్త్రములు వేయుచుఁ గాలము గడుపుచున్నావు? వీనిపై బ్రహ్మాస్త్రము వేయుము. వీఁ డేగడియయందుఁ జచ్చునని దేవతలు చెప్పిరో యాకాల మిప్పుడు తటస్థించినది.

చ. అనవుడు సర్వలోకవిజ•యార్థికిఁ బాకవిరోధి కర్థిమై
మును వనజాసనుండు కర•మున్ మహిమంబు మెయిన్ సృజించి యి
చ్చిన నతఁ డాస్థ నిచ్చె ముని•శేఖరుఁ డైన యగస్తి కాతఁడున్
దన కతిరక్తిచేఁ దొలుత • దండక నిచ్చిన యమ్మహాస్త్రమున్. ౨౪౭౨

అర్థములు. సర్వలోక విజయార్థికి=సమస్తలోకములు జయింపఁ గోరిన వానికి, పాకవిరోధికి=ఇంద్రునకు, అర్థిమై = ప్రీతితో, వనజాసనుండు = బ్రహ్మ, అగస్తికి=అగస్త్యునకు.

తాత్పర్యము

మాతలి యిట్లు చెప్పఁగా సర్వలోకముల జయింపఁ గోరిన యింద్రునకుఁ బూర్వము బ్రహ్మదేవుఁడు మిక్కిలి మహిమముతో సృజించి యీయఁగా నాయన యగస్త్యున కిచ్చెను. ఆయన దండకలోఁ దన కిచ్చెను. అట్టి యస్త్రమును దీసెను. (అరణ్యా. ౨౦౨ పద్యము చూచునది.)

సీ. పక్షభాగంబులఁ • బవనుండు ముఖమునఁ, బావకభాస్కరుల్ • పరఁగుచుండ
నాకాశమయు మైన•యంగంబు భాసిల్లి, మేరుమందరములు•గౌరవమున
రాజిల్లి దివ్యమై • రజతభూషిత మయి, జాజ్వల్యమానమౌ•సంహననము
సవితృవర్చస్సును • సకలభూతావళీ, తేజంబు దృఢపుంఖ•దీప్తి దనర
ఆ. నాగ్రహమున రోఁజు•నాశీవిషంబును, ధూమకలితకాల•ధూమకేతు
వెనయుదాని శాత్ర•వేభాశ్వపరిఘూర్ణి, ద్వారములను జెండి•వైచుదాని. ౨౪౭౩

అర్థములు. పక్షభాగంబులన్=పార్శ్వంబులందు, తెక్కలుందు స్థలమందు, పవనుండు=వాయువు. ముఖమున - పావక భాస్కరుల్ = అగ్నియు సూర్యుఁడు, ఇవి యా మంత్రబీజాక్షరము లని యెఱుఁగవలెను, రజత భూషితమై = బంగారుచే నలంకరింపఁబడినదై , జాజ్వల్యమానము=మండుచున్న, సంహననము = శరీరము, సవితృవర్చస్సును=సూర్యకాంతియును, దృఢపుంఖదీప్తి=గట్టిపింజకాంతి, ఆశీవిషంబును = పామును, ధూమకలిత=పొగతోఁగూడిన, కాలధూమ కేతువు=ప్రలయకాల ధూమకేతువు, ఎనయుదానిన్=పోలుదానిని, శాత్రవ = పగవారి, ఇభ =

పసుఁగులను అశ్వ = గుఱ్ఱములను, పరిఘాళి=ఇనుపకట్ల గుదియల సమూహమును, ద్వారములను.

తా త్ప ర్య ము

ఱెక్కలందు భాగమును వాయుదేవుఁడు,ముఖమునందు సూర్యాగ్నులును నుండఁగా నాకాశమయమైన దేహములో (ఆ యా దేవతలందు నావహించి యున్నారని భావము) మేరుమందర పర్వతములంత భారము గలిగి దేవ సంబంధ మైన బంగారు భూషణములచే నలంకరింపఁబడి మండుచున్న దేహము సూర్య కాంతి సకలభూతముల తేజస్సు, గట్టి పింజకాంతి గలిగి, కోపముచే బుసకొట్టు సర్పమును, పొగతోడి కాలాగ్నిని బోలుచు, శత్రువుల గజ తురగ పరిఘ గోపుర ముల భేదించునదియై.

కం. మేదోదిగ్ధము భూధర, భేదనదక్షంబు రుధిర•పిహితంబు మహా
నాదంబు వజ్రసారము, భేదననిరుపమము భూత•చిత్తభయదమున్. ౩౭౭౭

అర్థములు. మేదోదిగ్ధము = మేధస్సుచేఁ బూయఁబడి, భూధరభేదన దక్షంబు = పర్వతముల భేదించు సామర్థ్యము గలదై,రుధిరపిహితంబు=నెత్తురుచేఁ గప్పఁబడి, మహానాదము = పెద్ద ధ్వనిగలదై, వజ్రసారము=వజ్రమువంటి సత్తువ గలదై, భేదన నిరుపమము = సాటిలేనిదయి దనమానము. భూతచిత్త భయదము =ప్రాణుల మనస్సున భయము కలిగించునది.

తా త్ప ర్య ము

మాంసముచేఁ బూయఁబడి పర్వతముల భేదించు సామర్థ్యము గలదై నెత్తు టిచేఁ గప్పఁబడి పెద్ద ధ్వనిగలదై, వజ్రమువలె దృఢమై సాటిలేనిదయి దసమా నమై, ప్రాణిభయంకరమై.

ఉ. అప్రతిమానవీర్య మన•యంబు శివాచయకంక గృధ్రభ
క్షప్రద మంతకాభము ప్ర•శ స్తతమేషువు వానరాళిచి
త్తప్రమదావహం బసుర•దండభయావహ మాత్మవంశకీ
ర్తిప్రతిపాదకంబు పర•బృందయశోహరణాసమానమున్. ౩౭౭౮

అర్థములు. అప్రతిమానవీర్యము=ఎదురులేని వీర్యముగలిగి,అనయంబు= సర్వదా, శివాచయ = నక్కలకు, కంక = రాబులుఁగులకు, గృధ్ర = గ్రద్దలకు, భక్షప్రదమయి = ఆహారము కల్పించునదియై, అంతకాభము = యమునితో సమానమైన, ప్రశస్తతమ + ఇషువు = మిక్కిలి శ్రేష్ఠమైన బాణము, వానరాళి చిత్త ప్రమదావహంబు = వానర సమూహముల మనస్సునకు సంతోషము గలిగించునది, అసురదండ భయావహము = రాక్షససేనకు భయము కలిగించునది, ఆత్మవంశకీర్తి ప్రతిపాదకంబు = తన వంశమునకుఁ గీర్తి తెచ్చునది, పరబృంద=

శత్రుసమూహముయొక్క, యశస్ = కీర్తిని, హరణ = హరించుటయందు, అసమానము=సమానమైనది లేనిది.

తాత్పర్యము

అసమానబలము గలది, సర్వదా నక్కలకు, కంకములకు, గ్రద్దలకు నాహారము కల్పించునది, యమునితో సమానమైనది, మిక్కిలి పొగడఁబడిన బాణము. వానరులకు సంతోషము రాక్షసులకు భయము కలిగించునది. తన (రాము)వంశము నకుఁ గీర్తి తెచ్చునది. శత్రువుల కీర్తి హరించుటయం దసమానమైనది.

కం. గారుడపక్షవిచిత్రిత, సారాద్భుతవాజియుతము • శతధృతిమంత్రో
దారము విధ్యుక్తంబు ప్రకారమునన్ వింటఁగూర్చెఁ•గాకుత్థ్సుండున్. ౨౮౬

అర్థములు. గారుడపక్ష విచిత్రిత = గరుడపక్షి తెక్కలచే చిత్రింపఁబడి, సారాద్భుత=సారవంతమై, ఆశ్చర్యకరమైన, వాజ = తెక్కలతో, యుతము = కూడినది, శతధృతి మంత్రోదారము=బ్రహ్మమంత్రముచేఁ గొప్పది, విధ్యుక్తంబు ప్రకారంబు=శాస్త్రమునఁ జెప్పఁబడిన విధముగ.

తాత్పర్యము

గరుడపక్షి తెక్కలచేఁ జిత్రింపఁబడి ఆశ్చర్యకరమైన సారము గలిగిన తెక్కలు గలదై బ్రహ్మమంత్రముచే గొప్పదైన దానిని శాస్త్రమునఁ జెప్పఁబడిన ప్రకారము రామచంద్రమూర్తి వింట సంధించెను.

శా. అబ్రహ్మాస్త్రము మార్వఁ గూర్చుటయు హా•హాకార యుక్తంబుగా
నబ్రహ్మణ్యము లోలిఁ జేసె సకలా • శాంతస్థభూతాళి; స
ర్వాబ్రాసుల్ కలఁగెన్, వణంకె ధర, తీ•వ్రాటోపసంరంభుఁడై
యాబ్రహ్మఘ్ననిమీఁద వైవ రఘురా•మాధీశుఁ డయ్యస్త్రమున్. ౨౮౭

అర్థములు. అబ్రహ్మణ్యము=నేను జంపఁబడఁదగను, నన్నుఁ జంపవలదు అనుమాట. 'అబ్రహ్మణ్య మవధ్యోక్తౌ' అమరము - సకలాశాంతస్థ భూతాళి = అన్నిదిక్కుల యందుండు భూతములగుంపు - ఆ యస్త్రము తమ్ముఁ జంపునేమో యని భయపడి, మమ్ముఁ జంపవలదు, నిరపరాధుల మని చెప్పుకొన్నవి. సర్వ + అప్ + రాసుల్=సమస్త సముద్రములు, బ్రహ్మఘ్ననిమీఁదన్=బ్రాహ్మణహంత మీఁద - దీనివలన వీఁడు చంపఁబడుటకు సీతాహరణముకంటె బ్రాహ్మణహింస గొప్పకారణ మని యేర్పడుచున్నది.

తాత్పర్యము

ఆ బ్రహ్మాస్త్రమును సంధింపఁగానే దిక్కులయందుండు భూతములది తమ్ముఁ జంపునేమో యని భయపడి హాహాయని ధ్వనించుచు మమ్ముఁ జంపవలదని చెప్పుకొనెను. సముద్రములు కలఁగెను. భూమి వణఁకెను. మిగుల వేగముతోఁ గూడిన వాఁడై ఆయస్త్రమును బ్రాహ్మణహంత యగు రావణునిమీఁద వేసెను.

కం. దంభోళిధర విముక్తము, దంభోళి యనం గృతాంత • దారుణ మగుచున్
జంభారరిపుఁ గ్రొమ్మున సం,రంభంబునఁ బడియెఁ దీవ్ర•రంహస్స్ఫుటమై. ౨౭౭౮

అర్థములు. దంభోళిధర = ఇంద్రునిచే, విముక్తము = విడువఁబడినది, దంభోళి=వజ్రము, కృతాంతదారుణము=యమునివలె భయంకరము, జంభారరి= ఇంద్రశత్రువగు రావణుని, సంరంభంబునన్ =ఆటోపముతో,తీవ్రరంహస్స్ఫుటమై =తీవ్ర వేగముతోఁ గూడినదై.

తాత్పర్యము

ఇంద్రుఁడు వేసిన వజ్రాయుధమువలె యమునివలె భయంకరమై యతివేగ ముగఁ బోయి రావణాసురుని ఱొమ్మమీఁదఁ బడెను.

ఉ. అమ్మహితాస్త్ర మిట్టు లసు • రాధిపువక్షము వ్రక్కలించి ర
క్తమ్మునఁ దోఁగి ప్రాణములు • కాయమునుండి వెలార్చి భూమిఁగ
ర్భమ్మునఁ జొచ్చి వెల్వడి ధ • రాతనయాపతితూణిఁ జొచ్చెఁ గా
ర్యమ్మును దీర్చి వేగ విన • యమ్మున లోహితవర్ణితాంగమై. ౨౭౭౯

అర్థములు. తోఁగి = మునిఁగి, వెలార్చి = బయటఁ దీసి, లోహిత వర్ణి తాంగమై=నెత్తుటిచే వన్నె వేయఁబడిన దేహము గలదై.

తాత్పర్యము

ఆ గొప్ప యస్త్రి మాప్రకారము రావణాసురుని ఱొమ్మచీల్చి యా నెత్తుటిలో స్నానము చేసి దేహమునుండి ప్రాణములను వెడలఁగొట్టి కార్యము నెఱవేర్చి భూమిలోఁ దూఱి వెలుపల వచ్చి వేగమున వినయమున రామునిపొదిలోఁ బ్రవేశించెను.

కం. ప్రాణంబుతోడఁ జాపము, బాణంబును పసురనాథుఁ • బాసి యిలఁ బడెన్
బ్రాణము చెడి పడె గాత్రము, క్షోణిని హరినిహతవృత్ర • సురవైరి యనన్.

తాత్పర్యము

దేహమును ప్రాణము వదలినట్లు విల్లు బాణములుకూడ రావణుని వదలి నేలఁ బడెను. ఇంద్రునిచేఁ జంపఁబడిన వృత్రుని దేహమువలె రావణుని దేహము శక్తి చెడి నేలఁ బడెను.

రామచంద్రమూర్తి తొలుతఁ జెప్పిన ప్రకారము రథమును, గుఱ్ఱములను, సారథిని జంపక వింటిని ద్రుంపక సాధన వికలునిఁజేయక రావణుఁ జంపెను.

ఉ. ఏలినవానిపాటుఁ గని • యెంతయు భీతిని జావకున్న వా
రోలిని లంకకుం బఱచి • రుగ్రత రామజయప్రవృత్తికి
శాఖులు వెన్నడించి తము • నారట పెట్టఁగ బావ్పవారితో
ద్వేలెడు మోముతోఁ జెడిన • ధీరముతోఁ దడి లేని నాల్కతోన్, ౨౭౮౧

అర్థములు. ఏలినవాని = ప్రభువుయొక్క.

తాత్పర్యము

తమ ప్రభువు చచ్చుట చూచి చావక మిగిలిన రాక్షసులు రామ జయముచే సంతోషించు వానరులు తమ్ముఁ దఱిమి బాధింపఁగా భయపడి కన్నీళ్ళు కాఱుచుండ మొగములు వ్రేల వేసికొని పౌరుషము చెడి నాలుక లెండ లంకలోనికిఁ బరువెత్తిరి.

కం. రావణుమరణంబును నీ, తావిభువిజయంబు రణక ♦ థాసామగ్రిన్
వేవిధములఁ బొగడుచు హ, ర్షావేశవశాత్ములై రి♦యుగచరవర్యుల్. ౨౪౭

అర్థములు. హర్షావేశవశాత్ములు = ఆవేశించిన సంతోషమునకు వశపడినవారు. తాత్పర్యము స్పష్టము.

—♦ రావణుమృతికి లోకంబులు సంతోషించుట ♦—

సీ. అందమై త్రిభువనా♦నందమై మింటను, దుందుభిధ్వానంబు♦ క్రందుకొనియె
బృందమై విగళన్మ♦రందమై వర్షించె, మందారసుమతతి ♦ స్యందనమున
మందమై పరిమళా♦మందమై సుఖమూల, కందమై వీచెఁ♦గమ్మగాలి
నందమై హితకర♦చ్ఛందమై స్తవవృష్టి. కందమై విబుధ వా♦క్యంబు లెసఁగె
తే. సర్వలోకభయంకర ♦ శాత్రవుండు, రావణుండు త్రిభువనవి ♦ ద్రావణుండు
శ్రీరఘూత్తముచే నామ♦ శేషుఁడైనఁ, జారణామరు లెసఁగిరి ♦ సమ్మదమున.

అర్థములు. త్రిభువనానందమై = మూఁడు లోకములకు సంతోషకరమై, దుందుభిధ్వానము= దేవతలనగారాధ్వనులు, బృందమై=సమూహమై, విగళత్ + మరందమై = స్రవించుచున్న తేనెగలదై, మందారసుమతతి = కల్పవృక్షముల పూలగుంపులు, మందమై= మెల్లనిదై, పరిమళామందమై = సువాసనచే, దట్టమై, సుఖమూలకందమై = సుఖమునకు కూఁకటి వేరై, కమ్మగాలి = కమ్మనిగాలి, నందమై = సంతోషముతోఁ గూడి, హితకరచ్ఛందమై= మేలుచేయునభిప్రాయము గలదై, స్తవవృష్టి = స్తోత్రము లను వానకు, కందమై = మేఘమై, విబుధవాక్యంబులు= దేవతల మాటలు, త్రిభువన=మూఁడు లోకముల వారిని,విద్రావణుఁడు = పరువెత్తఁ జేసినవాఁడు, నామశేషుఁడు=పేరు మాత్రము మిగిలినవాఁడు.

తాత్పర్యము

సమస్తజనులకు భయము కలిగించు శత్రువు, మూఁడులోకముల వారిని దన పేరు చెప్పిన భయపడి పరువెత్తునట్లు చేసినవాఁడు, శ్రీరామచంద్రమూర్తిచేఁ జావఁగా నందముగా మూఁడులోకములకుసంతోషకరముగ నాకాశమున దేవతలు దుందుభులు మ్రోయించిరి. కల్పవృక్షములనుండి తేనెలు గురియుచుఁ బూవులు గుంపులై వానవలె రాముని తేరిపైఁ బడెను.కమ్మనిగాలి మెల్లగా పరిమళముతోఁ గూడి సుఖకరముగ వీచెను. సంతోషకరములై మేలుచేయు నభిప్రాయముగలదై

దేవతలవాక్యములు స్తోత్ర మను వర్షమునకు మేఘములయ్యెను. దేవతలు చార ణులు లోనగువారు సంతోషించిరి.

సీ. శాంతమానసముల ♦ సంతసించె బుధాళి, దిశలు ప్రసన్నతా♦దశ వహించె
గగనంబు నిర్మలా♦కారమై రాణించెఁ, గంప మందుట మానె ♦ క్ష్మాతలంబు
కమ్మగ నెమ్మిగఁ ♦ దెమ్మెరయై వీచె, దిగులు లేకరుణుండు ♦ తేజ మెఱసె
విచ్చలవిడి జనుల్ ♦ వీథులఁ దిరిగిరి, యధ్వరధూమంబు ♦ లభ్ర మంటె

ఆ. నాదమలచి నిద్ర ♦ నందిరి లోకులు, గుండె లదరు టుడిగెఁ ♦ గోమలులకు
నఖిలలోకవైరి ♦ యగు నసురేశుండు, ఖచరలోకమునకుఁ ♦ గదలిపోవ. ౨౮౦౮

తాత్పర్యము

సమస్తజనవిరోధి యగు రావణుఁడు దేవలోకమునకుఁ బ్రయాణమై పోవఁగా దేవతలు శాంతచిత్తులై సంతోషించిరి. దిక్కులు తేటగా నయ్యెను. ఆకాశము నిర్మలమై యొప్పెను. భూమి వణఁకుట మానెను. చల్లగ సంతోషకరముగ సువా సన గలదై మందమారుతము వీచెను. సూర్యుఁడు భయములేక ప్రకాశించెను. నిర్భయముగ జనులు వీథుల వెంటఁ దిరిగిరి. యాగములపొగ లాకాశ మంటెను. దిగులులేక లోకులు నిద్రించిరి. ఆఁడువారికి గుండెలయదరు తగ్గెను. దీనివలన రావణుఁడెంత లోకకంటకుఁడై యుండెనో తెలియనగు.

ఉ. అంత విభీషణార్కతన♦యాదులు లక్ష్మణయుక్తులై విభు
ప్రాంతముఁ జేరి యాహవజ♦యంబున భాసిలుచున్న యమ్మహా
స్వాంతునిఁ బెక్కుభంగులఁ బ్ర♦శంస యొనర్చుచుఁ జుట్టి దేవతా
కాంతుని దేవబృందము♦లకైవడిఁ గొల్చిరి పొల్చి రంతటన్. ౨౮౦౯

తాత్పర్యము

ఇట్లు రావణాసురుఁడు చావఁగా విభీషణుఁడు సుగ్రీవుఁడు లోనగువారు లక్ష్మణునితోడ రామచంద్రుని సమీపించి (ఇంతవఱకు వీరు దూరమునుండి చూచుచుండిరి) యుద్ధమందు గెలుపుగొని ప్రకాశించు నా మహాత్ముని ననేకవిధ ములుగ స్తోత్రముఁ జేయుచు దేవత లింద్రుని జుట్టుకొన్నట్లు చుట్టుకొనిరి.

—♦ ౧౧౨-వ సర్గము. విభీషణుఁడు రావణు కళేబరముఁ జూచి యేడ్చుట ♦—

కం. అన్నను రామాశుగసం, భిన్నుఁ గని విభీషణుండు ♦ చేరం జని యా
పన్నుండై శాల్వలుగాఁ, గన్నులనీ రొలుక నేడ్చెఁ♦గడుదీనుండై. ౨౮౧౦

అర్థములు. రామాశుగ సంభిన్నున్ = రాముని బాణములచే భేదింపఁ బడినవానిని.

తాత్పర్యము స్పష్టము.

శా. ఎన్నో యుద్ధములన్ జయించి ప్రథచే ♦ నేపారి వీరుండవై
యెన్నో శాస్త్రములం బఠించి సుమనీ♦షీడ్యుండవై యుండి య

సన్నాహమానసుసౌఖ్యతల్పముపయిం • గై సేత నిద్రించు నీ
వన్నా ! నేఁ డిటు నేలపా లయితివే • హా! దైవమా! యే మనన్. ౨౮౦౮

అర్థములు. ప్రథచే=కీర్తి చే, ప పారి=అతిశయించి, సుమనీపీడ్యుండవై =పండితులచే స్తోత్రము చేయఁబడినవాఁడవై, అసన్నాహ=జాలని, అమాన=కొలఁత లేని సౌఖ్యతల్పముపయిన్ =సుఖకరమైనపానుపుమీఁద, గై సేతన్ =అలంకరించుకొని.

తాత్పర్యము

ఎన్నో యుద్ధములందు జయించి వీరుఁడని కీర్తి సంపాదించి శాస్త్రము లెన్నియో పఠించి పండితులచేఁబొగడఁ బడియుండి స్థిరమైన కొలఁతలేని సౌఖ్యము గూర్చు పానుపు మీఁదఁ బండుకొను వాఁడవు. అన్నా ! నేఁడిటు నేలమీఁదఁ బడవలసిన వాఁడ వైతివి కదా! దైవమా, ఏమందును ?

ఆ. కాళ్ళు పాఱఁజాచి • కనకాంగదసుభూష, ణాంచితంబు నీదు • హ స్తయుగము
క్షితిని విడిచి వీత • చేష్టుండవై యిట్లు,పుడమి మకుట మెడలఁ•బడఁగఁదగునె. ౨౮౦౯

అర్థములు. కనక + అంగద సుభూషణాంచితంబు=బంగారు భుజకీర్తులచే నొప్పునది, వీతచేష్టుండవై=చేష్ట మానిన వాఁడవై, మకుటము=కిరీటము,ఎడలన్ = తొలఁగి పోఁగా.

హ స్తయుగ మని చెప్పుటచే రావణుఁ డిప్పుడు రెండు చేతులవాఁడై యుండెనని యేర్పడుచున్నది.

తాత్పర్యము

కాళ్ళు పాఱఁజాచి బంగారు భుజకీర్తులచేఁ బ్రకాశించు రెండు చేతులు నేలఁబడవైచి చేష్టలు మాని కిరీటము నేలఁబడఁగా నిట్టు లుండఁదగునా ?

కం. అన్నా! యీగతి నగు నని, యెన్నో మాటలు వచింప • నే నీతోఁ? గా
మోన్నతి మోహంబున నీ,క న్నుడులు రుచింప వయ్యె•నసురాధీశా! ౨౮౧౦

అర్థములు. కామోన్నతి = కామాతిశయముచే, మోహంబునన్ = అజ్ఞానంబున.

తాత్పర్యము స్పష్టము.

సీ. కుంభకర్ణుం డేని • కులిశకరారి యే, నా ప్రహస్తుండు న • రాంతకుండు
నైనను నతిరథుఁ • డా యతికాయుఁడేన్, బలిమికల్మిని నీతిఁ • దలఁప రైరి
నీవును జింతింప • వీవిధం బద్దాని, ఫలము వో నే డిటు • ప్రాప్త మయ్యె
నెంతయో చెప్పితి•నంతయు వృథయయ్యెఁ, గాలంబుఁదప్పింపఁ•గలుగు నెవఁడు

తే. పోయెను సునీతి సేతువు • పోయెధర్మ
విగ్రహము సత్త్వసంగ్రహ • విధము జెల్లె
స్తోత్రపాత్రంబు విషయంబు • శూన్య మయ్యె
నన్న ! నీ వొకఁడిలఁ బాసి • యరుగుకతన.

అర్థములు. కులిశకరారి=ఇంద్రజిత్తు, బలిమికల్మిని = బలము విశేషముగ గలవారమను తలంపుతో, సునీతిసేతువు=మంచి నీతికి నడకట్ట, ధర్మవిగ్రహము = ధర్మముయొక్క యాకారము, సత్త్వసంగ్రహవిధము=బలము సంపాదించు విధము.

తాత్పర్యము

కుంభకర్ణుఁడైనను, ఇంద్రజిత్తైనను ప్రహస్తుఁడైనను నరాంతకుఁడైనను అతికాయుఁడైనను బలముగలవారమని ప్రవర్తించిరే కాని యెంత బలవంతులకైనను ధర్మము శ్రేయస్కరము, అధర్మము హానికరమను నీతిని పాటించినవారుగారైరి. నీవును నాలోచించినవాఁడవు కాకైతివి. దాని ఫలముగదా నేఁడిట్లు ప్రాప్తించెను. నే నెంతయో వలదు వలదని చెప్పితిని. నేను జెప్పినదంతయు వ్యర్థమయ్యెను. కాలము నెవరు తప్పింపఁగలరు. నీ వొక్కఁడవు భూమిని విడిచిపోవుటచే నీతికి నడకట్ట లేదయ్యెను. ధర్మమునకు ఆకారము తొలఁగెను. బలమునకు నిలువనీడ లేదయ్యెను. లోకమున స్తోత్రము చేయఁదగిన పదార్థము లేనిదయ్యెను.

ఆ. ఇనుఁడు నేలఁ ద్రెళ్ళె • నిరులలో శశి మున్గె, నగ్ని చల్లఁబడియె • నవనిమీఁద
నుద్యమంబు లేద • యుత్సాహమునకు నీ, వీరవరుఁడు మేను • విడుచుకతన.

అర్థములు. ఇనుఁడు = సూర్యుఁడు, ఇరులలో=చీఁకటిలో.

తాత్పర్యము

ఈ వీరుఁడు దేహమును వదలుటచే సూర్యుఁడు నేలఁబడియెను. చంద్రుఁడు చీఁకటిలో మునిఁగెను. అగ్ని చల్లఁబడెను. ఉత్సాహమునకుఁ బ్రయత్నమే లేనిదయ్యెను. రావణునివలె నుత్సాహముతోఁ గార్యములు చేయువాఁడు లేఁడని భావము.

ఆ. రణతలంబునందు • రాక్షససింహంబు, ధూళి బ్రుంగి నిద్రఁ • దేలుభంగి
మృతినిఁ గూర నిపుడు • హతవీర మీలోక, మందు నేమిగలదు • మందలింప.

అర్థములు. బ్రుంగన్=మునుఁగఁగా, హతవీరము = చంపఁబడిన వీరులు గలది.

తాత్పర్యము

రాక్షససింహమగు రావణుఁడు యుద్ధమందుఁ జచ్చి దుమ్ములో మునిఁగిన కారణముచే వీరశూన్యమైన యీ లోకమందు వీరుఁడని చెప్పఁదగినవాఁ డెవఁడు గలఁడు ?

ఆ. ధీరతాప్రవాళ • మోరుపు పుష్పంబు, భృశతపోబలంబు • వీర్యబద్ధ
మూలమైన యసుర•మూర్ధన్య వృక్షంబు, రామమారుతమున•భూమిఁ ద్రెళ్ళె.

అర్థములు. ధీరతాప్రవాళము = ధైర్యమను చిగురు, భృశతపోబలంబు = గొప్ప తపస్సను బలము, వీర్యబద్ధమూలము = వీర్యమను వేరుచేఁ గట్టఁబడినది, అసుర మూర్ధన్యవృక్షంబు = రాక్షసశ్రేష్ఠుఁడను చెట్టు, రామమారుతమునన్ = రాముఁడను వాయువుచే, సావయవరూపకము.

తాత్పర్యము

ధైర్యమను చిగుళ్ళు, ఓరుపను పుష్పములు, గొప్పతపస్సను బలము, వీర్య మను వేరు గల రావణుఁడను వృక్షము రాముఁడను వాయువుచే నేలఁబడెను.

ఆ. బలవిషాణయుతము•కులవంశవంశంబు, కినుక కరుణ యనెడి • తనువు కరము
 గలుగు రాక్షసేంద్ర•గంధేభ మడఁగారె, రామసింహవర ప • రాక్రమమున.

అర్థములు. బలవిషాణయుతము = బల మనెడి కొమ్ములతోఁ గూడినది, కులవంశవంశంబు - కుల = పితృపితామహాదుల, వంశ = వంశమనెడి, వంశము = వెన్నెముక గలది,'వంశో వేణౌ కులే వర్గే పృష్ఠస్యావయవేపిచ' దేహము నిలుచుటకు వెన్నెముక యాధార మైనట్లు పితృపితామహాుల వంశము నిలువ కారణమైన వాఁడు, కినుక = కోప మనెడి, తనువు = దేహము, కరుణ యనెడి - కరము = తొండము, రాక్షసేంద్ర = రావణుఁడనెడి, గంధేభము=మదపుటేనుఁగు, రామ= రాముఁడనెడి, సింహ = సింహముయొక్క, వరపరాక్రమమునన్ = గొప్ప పరాక్రమముచేత, అడఁగారెన్=నశించెను.

తాత్పర్యము

బలమనెడి కొమ్ము, కులవంశ మనెడి వెన్నెముక, కినుక యనెడి దేహము, కరుణ యనెడి తొండము గల రావణుఁడను మదపుటేనుఁగు రాముఁడను సింహముయొక్క పరాక్రమముచేఁ జచ్చెను.

తే. విక్రమోత్సాహజృంభిత • వికటహేతి, దీర్ఘనిశ్శ్వాసధూమంబు•దేహసత్త్వ
 సత్ప్రతాపంబు గల రాక్ష•స ప్రకాండ,వహ్నిఁ జల్లార్చె రాఘవ•వారిధరము.

అర్థములు. విక్రమోత్సాహ జృంభిత వికటహేతి=పరాక్రమమువలనఁ గలిగిన యుత్సాహ మనెడి విజృంభించిన భయంకరజ్వాల గలది, దీర్ఘ నిశ్శ్వాస ధూమంబు = నిట్టూర్పనెడి పొగ, దేహసత్త్వ = దేహబల మనెడి, సత్ ప్రతాపంబు = మిగుల వేఁడిమిగల, రాక్షస ప్రకాండ = రాక్షస శ్రేష్ఠుఁడను,వహ్నిన్ = అగ్నిని, రాఘవ = రాముఁ డనెడి, వారిధరము=మేఘము.

తాత్పర్యము

విక్రమము వలనఁ గలిగిన యుత్సాహ మనెడి భయంకర జ్వాలయు,నిట్టూర్పనెడి పొగయు, దేహబల మనెడి వేఁడిమియు గల రాక్షసశ్రేష్ఠు డను నగ్నిని రాముఁడనెడి మేఘము చల్లార్చెను.

తే. అసురవాలకకుద్విషా•ణాన్వితంబు, శాత్రవధ్వంసనంబు హిం•సారతంబు
 చపలకర్ణేక్షణము సుర•శత్రువృషభముఁ, దాఁకి రాఘవద్వీపి వ•ధం బొనర్చె.

అర్థములు. అసుర = రాక్షసు లనెడి, వాల = తోఁకతోను, కకుత్ = మూఁపురముతోను, విషాణ = కొమ్ములతోను, అన్వితంబు = కూడినది, శాత్రవ ధ్వంసనంబు = శత్రువుల నాశము చేయునది, హింసారతంబు = హింసించుటయం

దాసక్తి గలది, చపల విషయ=చపలతే యను, కర్ణము = చెవులు, ఈక్షణము = చూపులుగలది, సురశత్రు = రావణుఁడనెడి, వృషమున్=ఎద్దును, రాఘవద్వీపి= రాముఁడనెడి పులి.

తాత్పర్యము

రాక్షసులనెడి తోఁక మూఁపు కొమ్ములు గలదియు, శత్రువుల నశింపఁజేయునదియు,హింసయం దాసక్తిగలదియు, విషయలోలత్వమనెడి చెవులుకన్నులుగలది యగు రావణుఁడనెడి వృషభమును రామచంద్రమూర్తి యను పులి చంపెను.

కం. అని శోకసమాకులుఁడై, పనవి పనవి హేతుయుక్త•వాక్యంబులతో
పనరు విభీషణుఁ గని భూ,తనయానాథుండు పలుక•దయదైవారన్. -౨౮౯౭

అర్థములు. శోకసమాకులుఁడై = శోకముచే కలఁత చెందినవాఁడై, హేతుయుక్త=కారణములతోఁ గూడిన, దైవారన్=అతిశయింపఁగా.

తాత్పర్యము స్పష్టము

—• శ్రీరాముఁడు విభీషణునకు దుఃఖోపశమనంబు చేయుట •—

ఉ. ఏమిటి కేడ్చెదయ్య బల•హీనత నీతఁడు దూలలేదు, సం
గ్రామకుతూహలుం డతిప•రాక్రమశాలి మహోత్సహుండు దై
ర్యామరభూధరంబు రవ•యుంతయు జంకును గొంకులేక ని
స్సీమధృతిం బెనంగి తన•చే నయినంతయుఁ, గూరె మృత్యువున్. -౨౮౯౮

తాత్పర్యము

అయ్యా! విభీషణా! యేల యేడ్చెదవు? బలహీనుఁడై యుద్ధము చేయలేక యవమానపడి యితఁడు చావలేదు. యుద్ధమందుఁ గోరిక గలవాఁడు.మిగులఁ బరాక్రమము ఉత్సాహము గలవాఁడు.మేరుపర్వతమువలె ధీరుఁడు. ఇట్టివాఁడు కొంచెమైనను ఓడుదునేమోయను సందేహముగాని చత్తునేమోయను భయముగాని లేక యపరిమిత ధైర్యముతో చేతనయినంతవఱకు యుద్ధముచేసి చచ్చెను.

కం. పరలోకసుఖముఁ గోరెడి, పురుషులు పెనువీఁకఁ బెనఁగి•పౌలియుదు రనిలో
ధర క్షత్రధర్మమున నం,గరమునఁ దెగువారి కేడ్వఁ•గా న్యాయ్యంబే? -౨౮౯౯

అర్థములు. పౌలియుదురు=చత్తురు, న్యాయ్యంబే=ధర్మయుక్తమా, పెనఁగి= యుద్ధముచేసి, వీఁకన్=పరాక్రమముతో.

తాత్పర్యము స్పష్టము.

కం. లోకత్రయిఁ గారించెను, నాకుల భంగించెఁ గలన • ననమబలుండై
చేకొనె వీరస్వర్గము, శోకింపఁగఁ దగునె యిట్టి•శూరుని కనఘా! -౨౯౦౦

అర్థములు. కారించెను = బాధించెను, నాకులన్=దేవతలను, కలనన్ = యుద్ధమందు.

తాత్పర్యము

మూఁడు లోకముల బాధించెను. దేవతల జయించెను. యుద్ధమునందు నసమానబలము గలవాఁడై చచ్చి వీరులుపోవు స్వర్గమునకుఁ బోయెను. ఇటువంటి శూరున కేడువ వచ్చునా ?

తే. ఇట్టివాఁడె జయించు న•న్నట్టినియమ
మున్నె యెపుడైనఁ జెప్పుమా • యుద్ధములను ?
దాను బరుగెల్చుఁ బరులచేఁ • దాను జచ్చు
గెలుపు నోటమి నెవ్వాఁడు • పలుక నేర్చు. ౨౯౦౧

తాత్పర్యము స్పష్టము.

కం. క్షత్రియసమ్మతము పురా, ధాత్రీశాదిష్టితమ్ము • తగుగతి యిది యా
క్షత్రియున కాహవోజ్ఝిత, గాత్రున కై కార్చరాదు•కన్నీ రెందున్. ౨౯౦౨

అర్థములు. క్షత్రియసమ్మతము = క్షత్రియు లందఱు నంగీకరించినది, పురాధాత్రీశాదిష్టితమ్ము = పూర్వపు రాజులచే విధింపఁ బడినది, ఆహవ=యుద్ధమందు, ఉజ్ఝిత=విడువఁబడిన, గాత్రునకై =దేహము గలవానికై.

తాత్పర్యము

ఈప్రకారము యుద్ధమందు మరణించుట క్షత్రియుల కిష్టమైన కార్యము. పూర్వపు క్షత్రియులు విధించినది కావున యుద్ధమునందుఁ జచ్చిన క్షత్రియునకై యెవరును కన్నీరు కార్చరాదు.

దీనివలన రావణుఁడు క్షత్రియుఁ డనుట స్పష్టపడుచున్నది. కావున బ్రాహ్మణుఁడు కాఁడు, విష్ణుస్మృతి యందు.

సమానవర్ణాసుపుత్రాః సవర్ణా భవంతి,

అనులోమాసు మాతృవర్ణాః, ప్రతిలోమా స్వార్యవిగర్హితాః, అని కలదు. కావునను రావణుఁడు రాక్షసక్షత్రియస్త్రీకి, నందు నవివాహితకుఁ బుట్టిన వాఁడు కావున బ్రాహ్మణుఁడు కాఁడు.

కం. ఇది నిశ్చయించుకొని నీ మదిఁ దత్త్వార్థంబు నిలిపి • మానుము వగపున్
బిదపటికెలసముఁ దీర్పఁగ, గొదగొను మన నతఁడు పలుకు•గురుశోకమునన్.

అర్థములు. పిదపటి కెలసము = తరువాత జరుగవలసిన కార్యము, గొదగొనుము=త్వరపడుము.

తాత్పర్యము

క్షత్రియధర్మ మిదియని నిశ్చయించుకొని వాస్తవార్థము మనస్సునందుంచుకొని తరువాత జరుగవలసిన కార్యములకై త్వరపడుము అనిన నతఁడు గొప్పశోకముతో నిట్లనియె.

ఉ. ఈతఁడు దేవతాచయస ♦ మేతుఁడు వాసవుఁ డొడ్డి తాఁకినన్
ఖ్యాతిగ లోఁగ కాతని య ♦ హంకృతి మాపె జగం బెఱుంగఁ బ్ర
స్ఫీతభుజాబలోద్ధతిని ♦ వీరవరా! నినుఁ దాఁకి సాగరం
బాతతవేలఁ దాఁకి చెడు ♦ నట్టులు భంగముఁ జెందె నేఁ డనిన్. ౨౫౦౪

అర్థములు. ఒడ్డి=సేనల వ్యూహముగాఁ బన్ని, లోఁగక=లోఁబడక.

తాత్పర్యము

రామచంద్రా! దేవేంద్రుఁడు సేనలను వ్యూహముగాఁ బన్ని యెదిరించినను లోఁబడక కీర్తికరముగ ప్రసిద్ధబలాతిశయమున నతని గర్వ మణంచెను. సముద్రము చెలియలి కట్టదాఁకి చెడినట్లు నిన్నెదిరించి నేఁడు యుద్ధమునందుఁ జచ్చెను.

సీ. ఎన్నెన్నియో మేలి♦యీవు లిచ్చినవాఁడు, గురుల దైవతములఁ♦గొలిచినాఁడు
అఖిలసుఖంబుల ♦ ననుభవించినవాఁడు, నాశ్రితావనుఁ డయి ♦ యలరినాఁడు
హితులకు నర్థంబు ♦ లెలమిఁ గూర్చినవాఁడు వైరులఁ గారించి♦వాలినాఁడు
అగ్నుల సేవేళ ♦ ననుసరించినవాఁడు, దీర్ఘతపంబునఁ ♦ దేజినాఁడు
తే. వేదవేదాంతవిదుఁడయి♦ వెలసినాఁడు, కర్మచణుఁడను యశమునఁ♦ గ్రాలినాఁడు
ఔర్ధ్వదైహికకృత్యంబు ♦ లాచరింప,నాన తిచ్చెదె యనిన ద♦యాళుఁడనియె.

అర్థములు. ఈవులు = దానములు, ఆశ్రితావనుఁడు = ఆశ్రయించిన వారిని రక్షించిన వాఁడు, కారించి = బాధించి, కర్మచణుఁడు = కర్మఠుఁడు, శాస్త్రోక్త కర్మములయందు నిష్ఠగలవాఁడు, దయాళుఁడు = దయ స్వభావముగఁ గలవాఁడు.

తాత్పర్యము

రామచంద్రా! వీఁడు మంచి యుత్తమ దానము లెన్నియో యిచ్చినాఁడు. గురువులను దేవతలను గొలిచినవాఁడు. అన్నిసుఖము లనుభవించినవాఁడు. ఆశ్రితులను రక్షించినవాఁడు. తన మేలు గోరిన వారికి వలసినంతధన మిచ్చినవాఁడు. శత్రువుల బాధించినవాఁడు. నిత్యము అగ్నుల సేవించినవాఁడు. గొప్ప తపస్సు చేసినవాఁడు. వేదము, వేదాంతము చదివినవాఁడు. కర్మానుష్ఠానపరుఁ డని కీర్తిగనినవాఁడు. కావున వీనికి పరలోకమున హితకరములైన ప్రేతకార్యములు చేయుమనెదవా? అనిన స్వభావముగ దయావంతుఁడైన రామచంద్రమూర్తి యిట్లనియె.

కం. వైరము మరణాంతము మన, కారియముల్ దీరె వీఁడి ♦ కార్యములను సం
స్కారాదులఁ దీర్పుము నీ,కారము నితఁ డట్టివాఁడొ♦యట్టిడ నాకున్. ౨౫౦౫

అర్థములు. మరణాంతము=మరణముతో ముగియునది.

తాత్పర్యము

విభీషణా! పగ యనునది జీవితకాలమందే కాని చచ్చిన వానిమీఁదఁ బగ యనునది లేదు. ఇప్పుడు మన మేమి చేసిన నతఁడేమి చేయఁగలఁడు? ఆవిధముగాఁ

ప్రతీకారము చేయలేనివాని విషయమున మన మేమియుఁ జేయరాదు. కావున వాని మీఁది పగ వాని మరణముతోఁ దీరెను. వాఁడు మనము పుట్టినది మొదలు శత్రువులు గాము. ఒక నిమిత్తమున విరోధము వచ్చెను. ఆ కార్యము చక్కఁబడెను. కావున నిమిత్తమెప్పుడు లేదో పగయు నప్పుడు లేదు. మన కార్యములు చక్కనైనవి. కావున నిఁక వాని మేలునకై చేయవలసిన సంస్కారములను జేయుము. వీఁడు నీ కెట్టివాఁడో నాకు నట్టివాఁడే. నీ కెట్లు తోఁడఁబుట్టినవాఁ డను ప్రీతిగలదో నాకు నట్లులే కలదు. నీకుఁ దోడఁబుట్టిన వాఁడైనపుడు, నీవు నాకు తోడబుట్టిన వారిలో నొకఁడైనపుడు వీఁడు మాత్రము కాఁడా? కావున వీనికిఁ గర్మములు చేయు విషయములో నే నన్యథా తలఁచెద నని తలఁపకుము.

ఈ సందర్భమునఁ బూర్వాచార్యు లిట్లు వ్రాసియున్నారు.

వైరము మరణాంతము - ఇంతవఱకు నాకు విరోధముగ జనస్థానమునల బాధించుట, సీతను హరించుట, నాకుఁ బ్రాణప్రదమైన జటాయువును సంహరించుట లోనగు కార్యములు చేసినట్లు లిఁక చేయఁజాలఁడు. నాయందు నిఁక వాఁడు పగ సాధింపలేఁడు.

మన కారియముల్ దీరె- రావణుఁడే వచ్చినను రక్షించెద నని చెప్పి వాఁడు వచ్చునా రక్షింతునా యని కోరిక గలవాఁడనై యుంటిని. వాఁడో, నా తల రెండుగాఁ జీల్చినను నేనొకనికి నమస్కరింపను అని మూర్ఖత వహించెను. ఆ కారణముచే నాకోరిక వ్యర్థపడిచెను. వీనికి మేలు చేయవలయునన్న నాసంకల్పమునకు నీఁ డిప్పు డడ్డపడఁజాలఁడు. కావున నేను మేలు చేయవలయును. మరణించినవానికిఁ జేయఁదగ్గిన మేలు పరలోకమున వానికి సుఖము గలుగుటకై యుత్తరక్రియలు చేయుటే, కావున వానిని వదలరాదు. ఆ కార్యములకు నే నడ్డపడెదనని తలఁపవలదు. సహాయపడెదను. వీఁడు నా యిష్టమున కిప్పు డడ్డపడఁ జాలఁడు కావున వీఁడు నాకు మిత్రుఁడే. (ఇదియే ప్రపత్తిలక్షణము. భగవత్ప్రవృత్తికి విరుద్ధమైన ప్రవృత్తి లేకుండుటే ప్రపత్తిలక్షణము) కావున నీవు వాఁ డిరువురు నాకు సమానులే. వానికి కొడుకులు లేరుగావున శాస్త్రప్రకారము త్తరకర్మములు నీవు చేయవలయును. నీవు చేయకపోయితివా నేను జేయవలయును. మన యిరువురలో నొకరి కిది తప్పినది కాదు. ఇందలి ప్రథమపాదమున వకారము గాయత్రీ మంత్రము లోనిది.

## —♦ ౧౧౩-వ సర్గము. రావణుభార్యలు రావణుఁజూచి విలపించుట ♦—

కం. అని పలుకు చుండ రాఘవ, సునిశితశరములను సురనిషూదనుమరణం
బును విని రాక్షసకాంతలు, వనరుచు నంతఃపురంబు వదలి భృశార్తిన్. ౨౫౦౭

అర్థములు, సునిశిత శరములను=వాఁడిగల బాణములచే, సురనిషూదను = దేవతల మర్దించిన రావణుని, వనరుచు=ఏడ్చుచు.

తాత్పర్యము స్పష్టము.

సీ. విరిసినజడలు పూ•సరములతోఁ గూడి, వెన్నులఁ బ్రక్కల • వ్రేలుచుండ
జిడిగొనికాటుకబా•ష్పముల పెల్లున జాఱి, తోరాడుపైఁటలు • దడియుచుండఁ
గరతాడనంబుల • గసిబిసిగొని హార,రత్నముల్ నేలపై • రాలుచుండఁ
గనుఁదీరు కప్పినఁ • గనులు గానమిఁ గటి,భరమునఁ గాల్దడఁ • బడుచునుండ
ఆ. మేను దూలిపోవ • మేదినిఁ బొరలుచు, నెత్తి మోఁదికొనుచుఁ•దత్తఱిలుచు
నధికశోకమునను•హతవత్సగోవుల, పగిదిఁ బతిని జూడ•వచ్చి రపుడు. ౨౬౦౮

తాత్పర్యము

నేలఁబడి పొరలుటచే విచ్చిపోయిన జడలు పూలదండలతోడ వీఁపులమీఁదను రెండు ప్రక్కలందును వ్రేలాడుచుండఁగా, వర్షమువలెఁ గాఱుచున్న కన్నీళ్ళు స్రవించి వ్రేలాడు పైఁటలను దడుపుచుండఁగా చేతులతో ఱొమ్ములు కొట్టుకొనుటచేఁ జిక్కుపడిన హారములయందలి రత్నములు నేల రాలుచుండఁగా, నీరు గప్పుటచేఁ గన్నులు గానరామిని పిఱుఁదుల బరువునఁ గాళ్ళు దడఁబడుచుండఁగా, దేహములు తూలిపోవుచుండ నేలఁబడి పొర్లుచు తలలు కొట్టుకొనుచు దత్తఱలాడుచు శోకాతిశయమున దూడలు చచ్చిన గోవు లేడ్చునట్లేడ్చుచు రాక్షస స్త్రీలు రావణుఁ జూడ వచ్చిరి.

దూడలు చచ్చిన యావులకు నుపమానము శోకాతిశయమునందు మాత్రమే యని గ్రహింపవలెను.

తే. ఉత్తరద్వారమునఁ గాచి•యున్న యసుర,వరులు తమతోడ రాఁ బతి•నరసికొనుచు
వచ్చి రెల్లరు శోణిత•బహుకబంధ, భీమమునకును ఘోరసం•గ్రామమునకు.

అర్థములు. అరసికొనుచున్ = వెదకుచు, శోణిత = నెత్తుటిచేతను, బహుకబంధ = అనేకములైన మొండెముల చేతను, భీమము = భయంకరమైనది, సంగ్రామమునకు = యుద్ధభూమికి.

తాత్పర్యము స్పష్టము.

సీ. హా! రాజనందనా ! • హా జీవితేశ్వరా!, హా ప్రాణనాయకా! • హా మదీశ !
హానాథ! హానాథ! • హాపతీ ! యనుచును, నశ్రుసంపూర్ణ నే•త్రాబ్జ లగుచుఁ
బ్రాణేశు శోకప•రాయణల్ కాంతలు, హతయూథప కరేణు•వితతివోలె
నఱచుచు వెదకి మ•హాకాయుఁ బటువీర్యు, నంజనచయతుల్యుఁ•బ్రాణనాథుఁ
ఆ. బ్రధనపాంసుపతితుఁ • బరికించి సంభిన్న, వనలతాళి లనఁగఁ • బైన వ్రాలి
తలలు మోఁదికొనుచు • విలపించి రెల్లరుఁ, జెక్కుఁ-భంగి రవము•పిక్కటిల్ల.

అర్థములు. అశ్రు సంపూర్ణ = కన్నీళ్ళతో నిండిన, నేత్రాబ్జలు=కమలములవంటి కన్నులు గలవారు, హత = చంపఁబడిన, యూథప=యూథనాయకుఁడగు పెద్ద యేనుఁగు గల, కరేణువితతి=ఆఁడేనుఁగుల సమూహమును,అంజనచయతుల్యు = కాటుక కుప్పతో సమానుని, ప్రధన = యుద్ధమందలి, పాంసు = ధూళి

యందు, పతితున్ = పడినవానిని, సంభిన్న = పగులఁబడిన, వనలతాళులు = అడవితీఁగెల గుంపులు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఒక్కతె బహుమాన♦యుక్తిఁ గౌఁగిటఁ జేర్చి, తన చనవెల్లను దలఁచి♦యేడ్చె
నొక్కర్తు పదముల♦మక్కువమైఁ గ్రుచ్చి, తన నేలురీతిని ♦ బనవి యేడ్చె
నొక్కతె కంఠంబు♦నుపగూహన మొనర్చి, తను గారవించు విధంబు♦నేడ్చె
నొక్కర్తు పతిఁగని ♦ యుద్ధృతహస్తయై ప్రాణేశ్వరా! యని♦యవనిఁ బొరలె
ఆ. మూర్ఛబోయె నొకతె♦ముమ్మరంబగు శోక,మునను బలుకలేక♦ముగుదయొర్తు
తనదుతొడను నాథు♦తల యుంచి తిలకించి, బాష్పవారి ముంచె♦వదనతలము.

అర్థములు. ఉపగూహనము=కౌఁగిలింత. ఉద్ధృతహస్తయై = చేతులెత్తినదై, ముమ్మరము=అధికము, తల — ఏకవచన ప్రయోగముచే రావణుఁ డొంటి తలవాఁడై చచ్చెనని తెలియనగు.

కం. రావణు ధరణీతలగతు, నావనితలు చూచి చూచి ♦ యతిదుస్సహశో
కావిష్టచిత్తలై వాపోవం గడఁగిరి సుగాత్రి ♦ బుద్ధిఁ దలఁచుచున్. ౨౯౧౨

అర్థములు. ధరణీతలగతున్ = నేలఁబడిన వానిని, దుస్సహ = సహింపరాని, శోక = వ్యసనముచే, ఆవిష్ట=ఆవేశింపఁబడిన, చిత్తలై = మనస్సు గలవారై, వాపోవన్=ఏడ్చుటకు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ఏ మహాబలు పని ♦ నెదిరించి పాకారి, మానంబుఁ గోల్పోయె♦దీనుఁ డగుచు
నేమహావీరుని ♦ నెదిరించి శమనుండు, త్రాణంబునను నోల ♦ మాసగొనియె
నేశూరవరుఁడు గౌ♦రీశమిత్రుని నోర్చి,పుష్పకంబు హరించెఁ♦బొలుపు వెలయ
నెవ్వనిపే రన్న ♦ ఋషులు గంధర్వులు, తల నిక్కఁబెట్టఁగ ♦ దలకువార
ఆ. లెవనినామధేయ ♦ మెల్లసురాళికి, గుండెగాల మట్టి ♦ గండుమగఁడు
అట్టి దోర్బలాఢ్యుఁ ♦ డకటా! నేఁ డిట్లు, విగతజీవుఁ డగుచు ♦ దెగినవాఁడు

అర్థములు. శమనుండు=యముఁడు, ఓలమాసగొనియె = మఱుఁగుపడిపోయెను, గౌరీశమిత్రుని=కుబేరుని, విగతజీవుఁడు=ప్రాణము పోయినవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

ఆ. అసురతతికి వెఱపఁ ♦ డమరులకును జంకఁ, డహివరేణ్యులకును ♦ వదరఁ డట్టి
పరమసాహసునకు ♦ భయవిదూరునకును, మనుజువలన భయము♦దనరె నేఁడు!

అర్థములు. భయవిదూరునకున్ = భయము లేనివానికి, దోర్బలాఢ్యునకున్=భుజబలసంపత్తి గలవానికి.

తాత్పర్యము స్పష్టము

ఆ. దానవాళిచేత ♦ దానవారులచేత, నసురవితతిచేత ♦ హతుఁడు గాని
కడిఁదిబంట వీవు ♦ కాల్నడ మనుజుచే, ననిని హతుఁడ వై తె♦యనదవోలె ?

అర్థములు. కడిఁది బంటు=గొప్ప శూరుఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. విన వైతివి సుహృదులనుడి, వినవైతివి మేలుకోరు ♦ పెద్దలపలుకుల్
కొని తెచ్చితి మృతికొఱకై, జనకాత్మజ దానవసుర♦సంఘముసమసెన్. ౨౫౧౬

అర్థములు. సుహృదులనుండి=స్నేహితులమాట.

తాత్పర్యము స్పష్టము.

ఉ. నీమహితంబుఁ గోరువర ♦ నీతివిదుండు విభీషణుండు నీ
సోదరుఁ డింత వచ్చు నని ♦ యూరక నీచెవి కూఁటిపోయెఁడే ?
కా దని ధిక్కరించితివి ♦ కాఱులు పల్కితి వట్టివాని ని
ర్హేదనుజాళి నీవు మఱి ♦ యేమును గూలితి మింద ఱొక్కటన్. ౨౫౧౭

అర్థములు. వరనీతి విదుండు=ఉత్తమమైన నీతిమార్గము తెలిసినవాఁడు, కాఱులు = నిష్ఠుర వాక్యములు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. సీతను నీవు రామునకుఁ ♦ జెల్మితలంపున నిచ్చియున్న నీ
భ్రాతయు సంతసించు, రఘు♦రాముఁడు నీకు హితార్థి యౌను, మా
కీ తల్రవాఁత ప్రాణధవ ♦ హీనత పాయు, విరోధి సంచయా
కూతము రిత్తయౌ, నసుర ♦ కోటి సమూలము ద్రుంగ కుండదే. ౨౫౧౮

అర్థములు. హితార్థి=మేలు కోరువాఁడు, ప్రాణధవ హీనత=వైధవ్యము, విరోధి సంచయ=నీకీడు గోరు పగవారి గుంపుయొక్క, ఆకూతము=అభిప్రాయము, సమూలము=ముసుముట్ట, ప్రేళ్ళతోడ.

తాత్పర్యము స్పష్టము.

కం. పాపపుమనమున సీతను, కేపట్టఁగఁ గోరి హఠము ♦ చేయుటఁ గాదే
యీపురమున వారును మే,మీపగిది స్నేపుముగుర♦మిటు పాడగుటన్. ౨౫౧౯

అర్థములు. హఠము=మొండితనము, హఠయోగమున నెంత బాధకలిగి నను సహించి యొక్కయాసనమందే పెక్కుకాల ముండుటచే నది మూర్ఖత్వము నకుఁ బర్యాయనామ మయ్యెను. పురమున వారు=పురమునందలి వారు, సప్తమ్యర్థమున నకారము, "చేటు పురంబున వారి కెమ్మెయిం, గా కెటులుండు" విరాట పర్వము భారతము.

తాత్పర్యము

నీ యొక్కని మూర్ఖత్వమువలన నీవు, మేము, ఊరివారు అందఱు చెడుట యయ్యెను.

కం. కావు పతీ! కాముకుఁడవు, కావు స్వతంత్రుఁడవు నీవు ♦ కార్యముపట్లన్
దైవంబ నలుపు సర్వము, దైవోపహతు వ్యధించుఁ♦దక్కఁ-దియేనిన్. ౨౫ ౨౦

అర్థములు. దైవోపహతున్=దైవముచేఁ గొట్టఁబడినవానిని.

తాత్పర్యము

నీ మృతికి కామము కారణము కాదు. ఆ విషయమునఁ గార్యములు చేయుట యందు నీవు స్వతంత్రుఁడవు కావు. సర్వము దైవవశము. దైవము తప్పఁజూచినపు డేదియైనఁ జంపఁగలదు. అది నిమిత్తమాత్రమే. ముఖ్యకారణము దైవమే.

కం. వనచరకోటులకును మన మనుజాశన సంఘములకు ♦ మఱి నీకు వినా
శన మిటు చేకూరుటకును, దనుజేంద్రా! కారణంబు♦దైవంబ చుమీ. ౨౫ ౨౧

తాత్పర్యము

వానరులు రాక్షసులు నీవు నాశనమైపోవుటకుఁ గారణము నీవు కావు. మఱి యెవ్వరుకారు. దైవమే కారణము.

కం. కలిమినినైనను గామము. బలమున నేన్ మిగుల దేహ♦బలమున నాజ్ఞా
కలనమున నేని శక్యమె, బలవద్విధిగతిని ద్రిప్పఁ ♦ బ్రకటబలాఢ్యా. ౨౫ ౨౨

తాత్పర్యము

సంపదబలముచేతఁ గాని కామబలముచేతఁ గాని దేహబలముచేతఁ గాని అధికారబలముచేతఁగాని బలవంతమైన విధి సంకల్పము తప్పింప సాధ్యముగాదు.

కం. అని యీగతి శోకాకుల, మనములఁ గన్నీరు దొరఁగ ♦ మనుజాశనభా
మిను లెల్లఁ గురరులో యనఁ, బనవి పనవి యేడ్చుచుండ♦వారలలోనన్.

అర్థములు. కురరులో=లకుముకులో.

తాత్పర్యము స్పష్టము.

## —♦ ౧౧౪-వ సర్గము. మందోదరీ విలాపము ♦—

తే. పెద్దభార్య మందోదరి ♦ పేరిచెలువ, రావణుని ప్రియురాలు భ♦ర్తను గకుత్థ్స
గోత్రదీపక హతునిఁగ♦న్గొనుచు దుఃఖ, పాటు సైరింప లేకిట్లు♦పలవరించు. ౨౫ ౨౪

అర్థములు. కకుత్థ్స గోత్ర దీపక = కకుత్థ్సుని వంశమును ప్రకాశింప చేయువానిచే, హతునిన్=చంపఁబడినవానిని.

తాత్పర్యము స్పష్టము.

చ. అకట మహానుభావ! ధన♦దానుజ! నీ వొక యింత యల్గినన్
వికలత నొందు వాసవుఁడు ♦ వేలుపులున్ ధరణీసురోత్తముల్
తికమికలాడి పాఱుదురు ♦ దిక్కుల వెంబడి నట్టినీ వహో
యొకనరమాత్రుచేఁ బడుట ♦ కోర్చితి వింతగ సిగ్గుమాలితే. ౨౫ ౨౫

అర్థములు. ధరణీసురోత్తముల్ = బ్రాహ్మణశ్రేష్ఠులు, సిగ్గుమాలితే = ఇంతటి గొప్పవాఁడ వొక మనుష్యమాత్రునిచేఁ జచ్చునంత సిగ్గులేనివాఁడవైతివా?

మండోదరి వీరపత్నిగదా! వీరపత్ని యైనది భర్త గెలిచినపు డెంత సంతోషింపవలయునో వీరమరణము చెందినపుడు తన వీరపత్నీత్వమునకు హానిరాలేదు గదా యని సంతోషింపవలసి యుండఁగా బాలికురాలివలె నేడువ వచ్చునా? మండోదరి రావణ మరణమునకు నేడువలేదు. రావణుఁడు తన కంటె నధములని తాను భావించియుండిన మనుష్యులచేఁ జచ్చి, తన వీరపత్నీత్వమునకు హాని గలిగించెగదా! ఇది యెంత లజ్జావహము! ఎవ తెయైన వచ్చి నీ మగఁడు మనుష్యునిచేఁ జచ్చెనఁట నిజమా యనిన నేమి చెప్పుదునని యేడ్చెను.

కం. పొడిచితి ముల్లోకంబులు, నొడిచితి వెల్లెడలఁ గల్గు ♦ నుత్తమలక్ష్మిన్
బడసితివి పేరుఁ బెంపును, నడవిమనుజుచేతఁ దుదకు♦ హతుఁ డైతె పతీ? ౨౫.౨౬

అర్థములు. పొడిచితివి=కొట్టితివి, ఒడిచితివి=బలవంతముగ హరించితివి.

తాత్పర్యము స్పష్టము.

కం. మనుజుల కవిషయ మగునీ, వనవిధి వసియించు కామ ♦ వర్త్మని నిన్నన్
మనుజుఁ డొకఁడు ద్రుంచె నన, న్మనుజాశనవర్య! యేమి♦న్యాయము చెపుమా?

అర్థములు. అవిషయము = విషయగోచరము గానిది, చేరరానిది, కామవర్త్మని = కామ మార్గమున సంచరించు వానిని, మనుజుఁడు మనుజులఁ దిను వానిని జంపుట యం దేన్యాయము గలదు? ఇది విపరీతము అవమానకరముగదా?

తాత్పర్యము స్పష్టము.

కం. ఇమ్ముగ నమ స్తశస్త్రా స్త్రమ్ములఁ బరిపూర్ణు నిన్ను ♦ రథికుని సంగ్రామమ్మున రాముఁడు చంపుట, నమ్మంగానేర నేను ♦ నాకపవైరీ! ౨౫.౨౮

తాత్పర్యము స్పష్టము.

కం. పరఁగ జనస్థానంబున, ఖరుని సహభ్రాతృ నెల్ల ♦ క్రవ్యాదులతోఁ
బరిమార్చుట విన రాముఁడు, నరమాత్రుఁడు గాఁ డటంచు♦నాకుం దోఁచెన్.

అర్థములు. క్రవ్యాదులతో = రాక్షసులతో.

తాత్పర్యము

ఎప్పుడు జనస్థానమున తమ్ములను సర్వరాక్షసులతో రాముఁడు చంపెనో యది మనుష్య సాధ్యము కాని కార్యము కావున రాముఁడు సామాన్య నరుఁడు కాఁడని యప్పుడే తలఁచితిని 'శంకే రాను మమానుషమ్' అని వాల్మీకి చెప్పిన ఫక్కి ననుసరించి వ్యాసమహర్షి భారతమున ఆదిపర్వమున "తదానాశంసె విజయాయ సంజయ" అని మకుటము గల శ్లోకముల అఱువది తొమ్మిది వ్రాసెను. 'పరంకవీనా మాధా' రమ్మని వాల్మీకి చెప్పినది సర్వవిధముల సత్యము.

కం. సురలకు దనుజుల కైనను, జొరరానిది లంక దానిఁ ♦ జొచ్చె బలిమి మైఁ
గరువలిసుతుఁ డప్పుడె నేఁ, బరితాపముపడితిఁ జేటు♦పాటిలు ననుచున్. ౨౫.౩౦

అర్థములు. కరువలిసుతుఁడు=వాయుపుత్రుఁడు — హనుమంతుఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. గిరికోటులతో నీరా,కరమున వనచరులు కట్టఁ • గట్టినయపుడే
సురనాథవైరి! రాముఁడు, నరమాత్రుఁడు గాఁడటంచు • నమ్మితి జవిమ్మా.

అర్థములు. నీరాకరమునన్=సముద్రమందు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఆయముఁడె తా స్వయమ్ముగ, నీయవనీనాథురూప • మిటు గొని నిన్నున్
మాయింప నప్రతర్కిత,మాయన్ ఘటియించెనొటు•మ్మశాపనేశా! ౨౫౩౨

అర్థములు. అవనీనాథు రూపము = రాజునాకారము, మాయింపన్ = రూపము లేకుండఁజేయ,అప్రతర్కిత మాయన్=ఊహించి తెలియరాని యద్భుతమైన శక్తిని, ఘటించెనొటు=ఘటియించి నేమో.

తాత్పర్యము స్పష్టము.

కం. కాకున్న వృత్రవైరియొ, పోకార్చనొ నిన్ను? నట్టి • బూమెలు గలవే?
నాకాధిపతికి నీ దెస, నేకరణిం జూడ శక్తి • యెక్కడ వచ్చెన్? ౨౫౩౩

అర్థములు. వృత్రవైరియొ=ఇంద్రుఁడె, బూమెలు=మాయలు.

తాత్పర్యము స్పష్టము.

సీ. కాన రాముండు ని•క్కము మహాయోగి యు,నాదిమధ్యాంత స • నాతనుండు
పరమాత్ముఁడును బరా • పరుఁడు మహాత్ముఁ, బరమమహాత్మను•బరమధాత
శ్రీవత్సవక్షుండు • శ్రీనిత్యనిలయుండు, శంఖచక్రగదాది • సాధనుండు
శాశ్వతుండు ధ్రువుం డ•జయ్యుండు సత్యవ, రాక్రముఁ డగువిష్ణు•వవనిమీఁద
తే. మానుషశరీరమును బూని • వానరత్వ, కలితవిబుధులతోడ జ•గద్విభుండు
భువనహితకామ్యమునసిన్నుఁ•బూర్వదేవ,సంతతులతోడ ద్రుంచెం•సంగరమున.

అర్థములు. మందోదరి తొలుత సామాన్య మనుష్యుఁడు అందు నడవి మనుష్యుఁడగు రామునిచేఁ జచ్చుట యవమానప్రసంగమని ప్రారంభించి ఖరాదులను జంపుటచేతను లంక కాల్పించుటచేతను సేతువు కట్టుటచేతను రాముఁడు మనుష్యమాత్రుఁడుగాఁడు, దేవతగా నుండవలెనని తర్కించి యా దేవత యెవరు? సంహారశక్తిగల యముఁడా? దేవతాప్రభువు ఇంద్రుఁడా యని యూహించి ప్రత్యక్షముగా నీ దేవత లందఱు నీ చేత దెబ్బలు దినినవారే కావున అట్టివారు మాఱువేషములతోడ వచ్చి యేమి చేయఁగలరు? కావున రాముఁడు ఆ దేవతలకంటె గొప్పవాఁడుగా నుండవలెను.అట్టివాఁ డెవఁడని యాలోచించి మహాయోగీత్యాది విశేషణము లెవ్వని కన్వయించునో యట్టి విష్ణువే శ్రీరామచంద్రమూర్తి యని వ్యక్తీకరించుచున్నది.

మహాయోగి — యోగమనఁగా ధ్యానమునకు పేరు. 'యోగ స్సన్నహనే

ధ్యానే।నానా।౮।'. అట్టి ధ్యానము గలవాఁడు యోగి. ఇట్టి యోగులలో నందఱిలో గొప్పవాఁడు మహాయోగి—లోకరక్షణోపాయధ్యానము గలవాఁడు అనియర్థము.

'యోగో హ్యఘటితార్థస్య ఘటనం తేన సర్వథా, యస్యాస్తి నిత్యసంబంధం స యోగీ పరికీర్తితః'—ఇతరులు చేయలేనిదాని నెవఁడు చేయుచున్నాఁడో అట్టి దానితో నెవనికి విశేషముగ నిత్యసంబంధము గలదో యతఁడు యోగి. 'భారభృత్ కథితో యోగీ యోగీశ స్సర్వకామదః' అని విష్ణుసహస్రనామము.

'పశ్య మే యోగ మైశ్వర్యమ్' గీ। ౧౧-౮

'యోగేశ్వరః కృష్ణః—గీ—౧౮-౭౮

'యోగం యోగేశ్వరాత్ కృష్ణాత్'—గీ॥ ౧౮-౭౫

'మహాయోగేశ్వరో హరిః'—గీ. ౧౧-౯.

'యోగీ యోగ ఇతిజ్ఞానం సర్వజ్ఞానం సర్వజ్ఞో హ్యాయత్యతః' యోగమనఁగా జ్ఞానము. అదిగలవాఁడు యోగి, సర్వజ్ఞుఁడని యర్థము, ఇది యితరులయం దౌపచారికము. భగవంతుఁడగు విష్ణువు మహాయోగి కావుననాయనయందు ముఖ్యము. 'యస్యజ్ఞానమయం తపః' ఎవని యాలోచన జ్ఞానమయమో యాయని కదా శ్రుతి చెప్పుచున్నది. మహాయోగి=స్వాభావిక జ్ఞానశక్తి యుక్తుఁడు, 'పరాస్యశక్తి ర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబల క్రియాచ'-శ్రుతి. భగవంతుని స్వభావసిద్ధమైన పరశక్తి-జ్ఞానమని బలమని క్రియయని మఱియుఁ గొన్ని పేర్ల ప్రసిద్ధి గాంచినది. భగవంతుని స్వభావసిద్ధ షడ్గుణ సంపత్తిలో జ్ఞాన మనునది యొక్కటి. జ్ఞానశక్తి బలైశ్వర్య వీర్య తేజస్సులు ఇవి స్వభావముగఁ గలవాఁడుగదా భగవంతుఁడు విష్ణువు?

మహాయోగి=మహాసన్నాహము గలవాఁడు. ఇచ్చట సన్నాహము ఆశ్రిత రక్షణమం దని యెఱుఁగవలయును.

మహాయోగి=వివిధవిచిత్ర జగన్నిర్మాణోపాయచతురుఁడు.

మహాయోగీ = బహుభవన సంకల్పముగలవాఁడు. 'బహుస్యాం ప్రజాయేయేతి' యని శ్రుతి.

'సోభిధ్యాయ శరీరాత్ స్వాత్ సిసృక్షు ర్వివిధాః ప్రజాః'॥ మనుస్మృతి.

మహాయోగి=జగన్నిర్మాణమున కుపయుక్తమైన ప్రకృతి పురుష కారకర్మ సంసర్గము గలవాఁడు.

మహాయోగీ - శరణాగత రక్షణాదులందు చాంచల్యములేని యుక్తి గలవాఁడు.

'యోగస్సన్నహనోపాయధ్యానసంగతియుక్తిషు' - అమరము.

అనాది మధ్యాంతుఁడు = మొదలు నడుమ తుద యనునవి లేనివాఁడు, జన్మవృద్ధిక్షయములు లేనివాఁడు.

సనాతనుండు=ఎప్పుడు 'అస్తి' కలఁడు అను నది తప్ప. "నాస్తి" లేఁడు అనునది లేనివాఁడు.

సదాతనో౽పి తదాతనవ న్నిత్యభోగ్యతయా అతిశయితః-సనాతనః=పురాణః-నిత్యనూతనభోగ్యత్వాత్ సనాతనతమ స్స్మృతః॥

సర్వదా యున్నవాఁడే యైనను ఎప్పటికప్పుడు క్రొత్తగా ననుభవయోగ్య మగుచుండువాఁడు, పురాపి నవశ్చ పురాణః - ప్రాఁతవాఁడైనను ఎప్పటికప్పుడు క్రొత్తవాఁడే. అట్టివాఁడు పురాణపురుషుఁడు.

పరమాత్ముఁడు - పరముఁడైన, ఆత్ముఁడు - పరమాత్ముఁడు. జీవాత్మల కన్నిటికంటెఁ బరముఁడైనవాఁడు- ఉత్తమఃపురుష స్త్వన్యః పరమాత్మేత్యుదాహృతః॥ భ. గీ. ౧౫-౧౭. క్షరాక్షరములకంటె నుత్తముఁడగుటచేఁ బరమాత్ముఁడు. పరమాత్మ=ఆత్మలకు ఆత్మయైనవాఁడు, అనఁగా సర్వాంతర్యామి యని భావము. యః ఆత్మని తిష్ఠ న్నాత్మనో౽ంతరో యమాత్మా న వేద యస్యాత్మా శరీరమ్- య ఆత్మాన మంతరో యమయతి॥ శ్రుతి ఎవఁడు ఆత్మ (జీవ)యందున్నాఁడో, తనయందుండు నెవనిని జీవాత్మ తెలిసికొనలేదో, ఎవనికి జీవాత్మ శరీరమో, ఎవఁడు లోపలనుండి జీవాత్మను నియమించుచున్నాఁడో యని శ్రుతి కర్థము, ఇట్టి వాఁడు పరమాత్మ.

పరమాత్మ- "యేన భూతా న్యాత్మవంతి నాయ మన్యేన చాత్మవాన్ అతో హ్యాత్మేశ్వరత్వాచ్చ పరమాత్మా ప్రకీర్తితః".

సమస్త భూతములు ఎవనివలన ఆత్మగల వగుచున్నవో, ఇతరముల వలన నెవఁడాత్మవంతుఁడు కాఁడో, ఎవఁడు ఆత్మల కీశ్వరుఁడో వాఁడు పరమాత్మ. పరో మా అస్యేతి పరమః- ఈయనకంటె పరమనునది లేదు. అట్టివాఁడు పరముఁడు - అట్టిపరముఁడగు ఆత్మ పరమాత్మ.

పరమాత్మా - స ఏవాత్మా పరమః - ప్రత్యగాత్మనః - ప్రకృతి సంబంధము లేని శుద్ధజీవాత్మకు ప్రత్యగాత్మ యని పేరు. ఆ యాత్మలకంటెఁ బరముఁడు కావునఁ బరమాత్మ.

ఆత్మేశ్వరమ్. తై. నా. ౬-౧౧.

తస్మాద్ధాన్యన్న పరః కించ నాస॥ ౨ అష్ట. ౮-ప్ర-౯-అ.

న తత్సమ శ్చాభ్యధికశ్చ దృశ్యతే - శ్వే - ఉ. ౬-౮.

'యస్మాత్పరం నాపర మస్తి కించిత్' శ్వే. ఉ. ౩-౯ 'నపరం పుండరీకాక్షాత్ దృశ్యతే భరతర్షభ. పరంహి పుండరీకాక్షా న్నభూతం న భవిష్యతి.'

'నదైవం కేశవాత్పరం' భార. అశ్వ. శేష. ౨-౨౧ యస్మాత్పరస్మాత్పురుషా దనంతా దనాదిమధ్యా దధిక న్న కించిత్॥ జీవులకంటె శ్రేష్ఠుఁడు-అనంతుఁడు- అనాది, మధ్యుఁడునైన వానికంటె నధికుఁడు లేఁడో.

మత్తః పరతరం నాన్యత్కించిదస్తి ధనంజయ, పరం హ్యమృత మేతస్మా ద్విశ్వరూపా న్నవిద్యతే, పరః పరాణాం పరమః పరమాత్మా. వి.పు. ౧-౨-౧౦ పరావరుఁడు=పరముఁడైన యెవ్వనికంటె నన్యమైనది లేదో, పరమైనది లేదో.

ఏది శ్రేష్ఠమైనదని మనము తలఁతుమో అట్టివానికంటె శ్రేష్ఠుఁడై, యంత కంటె నన్యమైనది లేనివాఁడు - వాసుదేవ స్సర్వమ్—సర్వం ఖల్విదం బ్రహ్మ- సమస్త చరాచరములు భగవంతుఁడే- నిమిత్త కారణము ఉపాదానకారణము తానేయైనవాఁడు, శ్రేష్ఠాన్యదూరశ్యేష్వేషు పర స్స్యాత్ ॥నానా॥ర॥

మహాత్మునకు పరమ మహాత్మ— మహాత్ముకంటె అన్యదూర సమీపేతరో త్తరాద్యర్థ యోగంబునకు గంటె - కు వర్ణకంబులగు' - సు వ్యా. - కార - ౧౯

మహాత్మునకు - ఉకార ఋకారంబులకు కు షష్ఠీ పరమగుచో నగాగమంబు తెలుగుగ నగు - సు, వ్యా తత్స - రం - తెలుగుగ ననుటచే —

'నిషధేంద్రు బచ్చుకున్' శృం. నై - ౬ ఆ.

'సంగరంబనిన నుత్సవము కేగడి క్రియ' నాచన సోమన, ౬ ఆ.

అండజాధీశ్వరు కొసఁగఁబోలు, విక్ర-౪ ఆ. నగుఁబాటుకోర్చి-భోజ. ౫ అ.

'వంతుకువచ్చు' పారి. ౧ ఆ. ఇత్యాది ప్రయోగంబులుగలవు. తెలుగుగ ననుటచే దీర్ఘపు వర్ణముమీఁద కుషష్ఠి వచ్చునేని నకారాగమము నిత్యము.షష్ఠీ కు పర్ణకమెకాదు. పదాది కువర్ణకమైనను రారాదు. పూవు శబ్దమునకు పూయని రూపాంతర ముండినను కువర్ణముగాని కువర్ణకముగాని పరమైనపుడు పుకార లోపములేదు. 'కాలకంఠుని శిరసుపూ గగనగంగ' శ్రీనాథుఁడు.

మహాత్ములు = మనకంటె గొప్పవారు; ఇంద్రాదులు ? వారికంటె గొప్ప వారు, మహాత్మునకు మహాత్ములు, బ్రహ్మాదులు; వారికంటె పరమమహాత్మ భగ వంతుఁడు, 'మహతో మహీయాన్' శ్రుతి.

మహ తత్త్వమునకంటెఁ బరమైనది తమస్సు. దానికంటె పరముఁడైన మహాత్మ, తమసః పరస్తాత్। తమసఃపరః తమసస్తు పారే - శ్రుతి. తమస్సు నఁగను ప్రాకృత మండలము. తమస్సునకావల నప్రాకృతమైన వైకుంఠము, దాని యందుండు వాఁడని యర్థము. ఆదిత్యవర్ణం తమసస్తుపారే - శ్రుతి. దీనివలన స్థాన విశేషముచేతను పరమత్వము చెప్పఁబడెను.

పరమధాత - ధాత = సర్వమును ధరించినవాఁడు, డుధాఞ్ ధారణ పోషణయోః - బ్రహ్మ బ్రహ్మకంటెఁ బరముఁడు పరమధాత - బ్రహ్మరూపమున సృష్టిభారమును ధరించినవాఁడు,తపోబలముచే బ్రహ్మపదవికి వచ్చిన జీవునం దావే శించి యతనిచే సృష్టికార్యము చేయించువాఁడు. ధాత = పోషకుఁడు, పోషకులకు నందఱకుఁ బోషకుఁడైనవాఁడు- పరమధాత - ధాత - సృజించువాఁడు,యతో వా

ఇమాని భూతాని జాయంతే - యని శ్రుతి - అచిత్సమష్టి భూతాయాం ప్రకృతౌ చిత్సమష్టికమ్। గర్భం వేధాత్మకం ధత్తే యస్తు ధాతేతి చక్షతే- సర్వయోనులందు అచిత్సమష్టిభూతమైన ప్రకృతియందు విరించ్యాత్మక చిత్సమష్టి రూప గర్భము ధరింపఁజేయువాఁడు. 'మమ యోనిర్మహత్ బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్, భ. గీ. ౧౪-౩. ధాతా క్షేత్రే కర్మబీజభూతం గర్భం దధాతి—"అప ఏవ ససర్జాదౌ తాసువీర్య మపాసృజత్' మనుస్మృతి.

తొలుత స్వరూపవర్ణనముఁ బట్టి పరమత్వము, ఆవల స్థానముఁబట్టి పరమత్వము. ఇఁక విగ్రహముబట్టి పరమత్వముఁ జెప్పుచున్నది.

శ్రీవత్సవక్షుండు = శ్రీకరమైన వత్సము శ్రీవత్సము— అది రక్తవర్ణము గలది. అది వక్షమునందుఁ గుడిప్రక్క నుండును. అట్టి మచ్చగలవాఁడు శ్రీవత్సవక్షుఁడు. దీనిచే సర్వేశ్వరద్యోతకము చెప్పఁబడెను. శ్రీనిత్యనిలయుండు.

ఇఁక జగద్రక్షణోపయోగ పురుషకారత్వము చెప్పుచున్నది. నిత్యముగా, వేఱుపాటనునది లేక లక్ష్మీదేవికి స్థానమైనవాఁడు.

సర్వదా శ్రీతోఁ గూడియుండువాఁడు. 'విష్ణో శ్రీ రనపాయి' నీత్యాది.

శంఖచక్ర గదాది సాధనుండు = శంఖము, చక్రము, గద, నందకము, శార్ఙ్గమ న్నను నాయుధములు ధరించినవాఁడు. సర్వదా యీ యాయుధములు ధరించియుండువాఁడు. లోకములో నాయుధధారు లందఱు తమ యాయుధముల సర్వదా మోచి తిరుగుచున్నారా ! కావలసినపుడు తీసికొనరాదా అనినట్లుకాదు. ఎవఁడైన పాహి శరణు అనఁగానే వెంటనే రక్షించునట్లుండవలెఁగాని యర్జునుని వలె నప్పు డాయుధశాలకుఁ బరువెత్తునట్లుండరాదు. ఆర్తుఁడగు భక్తుని రక్షించుటయందుఁ గాలవిలంబనమును లవమైన భగవంతుఁడు సహింపఁడు. గజరాజు చరిత్రము సాక్ష్యము. ఈ విషయమును బూర్వు లిట్లు చెప్పిరి. "పాతు ప్రణత రక్షాయాం, విలంబ మసహన్నివ, సదా పంచాయుధం బిభ్రత్ స న శ్శ్రీరంగనాయకః"

ఆయుధములు లేక భగవంతుఁడు కార్యములు చేయఁజాలఁడా యనిన నట్లు కాదు. సంకల్పముచేత సృష్టిసంహారాదులు చేయువానికి నాయుధములు లేవన్న లోటు లేదు. భక్తులు రక్షణమందు విశ్వసించుకొఱకు, దుష్టులు భయపడుకొఱకు. ఉత్తచేతులవాఁడు యుద్ధమునకుఁ బోయిన శత్రువులు దూరమునుండి యాయుధములతోఁ గొట్టిన వీఁడేమి చేయఁగలఁడని మూఢులు సందేహింతురు. శత్రువు లలక్ష్యము సేయుదురు. కావున నాయుధధారణము, నిత్యశ్రీ యనియు నిత్యశంఖచక్ర గదాధరుఁ డనియుఁ జెప్పుటచే దివ్యమంగళవిగ్రహనిత్యత్వము చెప్పఁబడెను. స్వరూపనిత్యత్వము సాధారణప్రాప్తి విషయము. అది ప్రత్యేకించి చెప్పవలసిన పనియే లేదు.

శాశ్వతుఁడు=అపక్షయ రహితుఁడు - దేశకాలవస్తు పరిచ్ఛేద రహితుఁడు, ధ్రువుఁడు, పరిణామ శూన్యుఁడు, ఇవి రెండు షడ్భావ వికారములు లేమిని దెలుపుచున్నవి.

'అపక్షయ వినాశాభ్యాం పరిణామర్ధి జన్మభిః, వర్జిత శ్శక్యతే వక్తుం యస్సదా స్తీతి కేవలం' అని విష్ణుపురాణము.

అజయ్యుఁడు = జయింప శక్యము గానివాఁడు, క్షయ్యాజయ్యౌ శక్యార్థే- పాణిని, నిత్యశ్రీ యగుటచే నజయుఁడని భావము.

'అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా' ఆ సీతాదేవి యెవనిదో వాని తేజ మప్రమేయమని యరణ్యకాండమున మారీచోక్తి.

అజయ్యుఁడు = ఉపాసకులకుఁ దప్పఁ దక్కినవారికి జయింప సాధ్యము గానివాఁడు.

సత్యపరాక్రముఁడు=సత్యమైన పరాక్రమము గలవాఁడు. నీవలె మాయా యుద్ధము చేయువాఁడు కాఁడు. కావుననే కదా చేతఁజిక్కిన వానిని నిన్నుఁ జంపక విడిచెను. రెండవసారి నీ రథ సారథి ధనుస్సుల దేనిని ద్రుంపక సాధన సంపూర్తిగల నిన్నుఁ జంపెను. సత్యపరాక్రముఁడు=సత్యమే పరాక్రముగాఁ గలవాఁడు. ఆయన సత్యత్వమే లోకముల నన్నిటిని జయించుచున్నది. ఆయన పరాక్రమ్మునకు వేఱుసాధన మక్కఱ లేదు.

మానుష శరీరమును = మనుష్యశరీరము వంటి శరీరమును వానరత్వ కలిత విబుధులతోడ = వానరులుగానైన దేవతలతో, జగద్విభుండు = ప్రపంచమున కంతయుఁ బ్రభువు కావున నీకుఁ బ్రభువే. ప్రభువు విషయమునఁ దక్కిన వారెట్లు వినయవిధేయతలతో వర్తింపవలయునో యట్లు వర్తించి యుండిన నిన్ను రక్షించి యుండును. ప్రభుతిరస్కారము చేసితివి గావున నిన్నుఁ దండించెను. ఏల దండించెను? భువనహితకామ్యమునన్ = ప్రపంచమునకు మేలుగోరి, నీవు తిరస్కరించుటచే నాయనకు వచ్చిన యవమానము నష్టి లేదు. నీవలన లోకమును రక్షింపవలసి యున్నది. కావున నిన్ను దండించెను గాని నీయందు ద్వేషబుద్ధి గలిగి కాదు. పూర్వదేవ సంతతులతోడన్=నీకు సహాయులైన రాక్షసులతో, నీకు సహాయుఁడు గాని వానిని రక్షించెను. కావున నీ చావునకు నీవు కారణభూతుఁడవు కాని యితరులు కారు. రామునందు నిర్దయత్వము పక్షపాతము లేదు.

## తాత్పర్యము

ఈ కారణములచే నీ రామచంద్రమూర్తి వాస్తవముగ మహాయోగియు, ఆదిమధ్యాంత శూన్యుఁడును, సనాతనుఁడును, జీవాత్మల కన్నిటికంటె బరముఁడైన వాఁడును. పరాపరుఁడును, మహాత్ములకంటెఁ బరమ మహాత్మును, సర్వమును ధరించి పోషించువాఁడును, వక్షమందు శ్రీవత్సముగల వాఁడును, శ్రీదేవితో నిత్యముగఁ

గూడి యుండువాఁడును, శంఖచక్రాదుల సదా ధరించినవాఁడును, విశాలశరీరుఁడును, ధ్రువుఁడును, జయింప సాధ్యపడనివాఁడును, సత్యపరాక్రముఁడును అగు విష్ణువే జగత్ప్రభువగు నాయనయే మనుష్యశరీరమువంటి శరీరమును ధరించి వానరులుగాఁ బుట్టిన దేవతలతో లోకము మేలుకొఱకు నీ తోడి రాక్షసులతోడ నిన్నుఁ జంపెను.

అదియేమి చిత్రమో! మహర్షులను వదలి సామాన్యజనులను గ్రహించితిమేని శ్రీరామచంద్రమూర్తి పరత్వమును గ్రహించినవారు సుమిత్ర, శబరి, తార, మందోదరి, ఏ రండలు నాఁడువారే. భాగవతమున "కటకట మోసపోయితిమి కాంతల పాటియు బుద్ధిలే"దని బ్రాహ్మణు లేడ్చిరి.

భారతమందు కుంతికి ద్రౌపదికి కృష్ణునం దున్నంత భక్తిశ్రద్ధలు పాండవులకు లేవు. భగవంతుఁడు భక్తిసాధ్యుఁడు. భక్తి స్త్రీలకు సులభసాధ్యము. కావున భగవంతుఁడు వారికి సులభుఁడు. పురుషుల కతి కష్టసాధ్యుఁడు.

కం. ఇంద్రియముల మును గెలిచి యతంద్రత ముల్లోకములను • ధర్షించితి వా
యింద్రియములు పగ మది నిడి, యింద్రారీ! నిన్ను గెలిచె•నియ్యెడ మరలన్.

అర్థములు. అతంద్రత=హెచ్చరికతో, ధర్షించితివి=ధిక్కరించితివి.

తాత్పర్యము

నీవు తపము చేయునపు డింద్రియముల గెలిచి యా బలమున మూఁడులోకములు జయించితివి. ఆ పగ మనస్సునం దుంచుకొని యింద్రియములు నిన్ను గెలిచి యీ దశకుఁ దెచ్చెను.

ఉ. చెప్పఁగ లేదె నేను రఘు•శేఖరుతోఁ బగ మానుమంచు ? నీ
వప్పలుకుల్ గ్రహించితివె • యా ఫల మిప్పుడు దాపరించె, నీ
గొప్పతనంబు ప్రాణమును • గూరిమిచుట్టము లెల్లసంపదల్
తెప్పునఁ గూల నేకతము • లేకయె కోరితి వా ధరాసుతన్. ౨౫౩౬

తాత్పర్యము

రామచంద్రమూర్తితో విరోధము వలదు వలదని నేను చెప్పలేదా ? నా మాటలు నీవు వింటివా? వినని ఫల మిప్పుడు నిన్నీ గతికిఁ దెచ్చెను. నీ పరువు ప్రాణము బంధువులను సంపదల నాశము చేయుటకుఁ గాకున్న నేమి కారణమున సీతను దెచ్చితివి?

కం. మతి లేవు గాక, చంద్రుని, సతికి నరుంధతికి మిన్న • జానకిని బతి
వ్రత నతిమాన్యను బఱచితి,మతిమంతులు చనిన సాధు•మార్గమె యదియున్.

తాత్పర్యము

నీ వాలోచన లేనివాఁడవు. కావుననే రోహిణికంటె నరుంధతికంటె గొప్ప పతివ్రతయగు జానకిని గౌరవింపవలసిన దానిని బాధపెట్టితివి. ఇది బుద్ధిగలవారుపోవు మంచిమార్గమా ? అరుంధతీ రోహిణులు పతివ్రతలే కాని లోకముచేఁ బూజింపఁ

## —•సీతాదేవి హనుమంతుఁ బ్రశంసించుట•—

కం. అని హనుమంతుం డడిగిన, వినియమపర యిట్టులనియెఁ • బ్రియమున హర్షం
బున గద్గదకంఠంబున, విను మీ మౌనంబుకతము•వినుతుఁ గపీంద్రా! ౧౧౨

అర్థములు. వినియమపర = ధర్మనియతియం దాసక్తిగలది.

తాత్పర్యము

అని హనుమంతుఁ డడుగఁగా ధర్మనియతిగల సీతాదేవి ప్రియవాక్యము వినుటచేఁ గలిగిన సంతోషాతిశయమున గద్గదపాటుగలదై డగ్గుత్తికతో నిట్లనియె. ఆంజనేయా! నేను బలుకకుండిన కారణము చెప్పెద వినుము.

సీ. ప్రాణేశువిజయంబు • భాషించు నీ ప్రియ,వాక్యముల్ విని వర•వశతఁ జేసి
నిర్వాక్యనై తిని•నిమిష మంజనపుత్ర!, మఱి ప్రియంబు వచించు•మాన్యునకును
సర్వోక్తు లేమని • యందునా యని యెంచి, యోజించితినిగాని•యొక్కఁడు లేద
యర్హవస్తువునైన • నర్పింతు నందునా, యీడైన దీ యిల • నేది లేదు
ఆ. వివిధమణులు గాని • విశ్వంబునం గల, వెండిగాని పైడి • కొండగాని
యెల్లలోకములయు•నేలికతనమైన, సాటిగాదు నిజము•మాటకైన. ౨౬౧౩

తాత్పర్యము

ఆంజనేయా! నా ప్రాణేశ్వరు గెలుపువార్త చెప్పుచున్న నీ సంతోషకర వాక్యములు విని నా దేహము నేను మఱచుటఁ జేసి నిమిషకాలము మాటలాడ నేరక పోయితిని. ఇదియొక కారణము; స్మృతివచ్చిన తరువాత నాకుఁ బ్రియములైన మాటలు చెప్పు పూజ్యునకు నేమిబదులు చెప్పుదునా యని యాలోచించితిని గాని నాకెంత సంతోషము నీవు గలిగించితివో, యంత సంతోషము నీకుఁ గలిగించు మాట యేదైనఁ జెప్ప నెంతో యాలోచించితిని గాని నాకుఁ దోచినది కాదు. నాకుఁ దోఁపకుండుట నా యజ్ఞానముచేతఁ గాదు. అట్టి మాటయే లేదు. మాట చెప్పకుండినఁ బోనీ. ఏదైనఁ దగిన వస్తువు బహుమానముగా నియ్యఁదలఁచి యీ లోకమున నేది గలదని యాలోచించితిని. ఒక్కటియు సమానమైనదిగాఁ గనఁబడ లేదు. ఒక్కటిగఁ గాకున్నఁ జెక్కులు కలిపిన సరిపోవునేమో యని చూచితిని. లోకములో నుండు నన్ని రత్నములు, వెండికొండ, బంగారుకొండ, వేలువేలుగఁ గాని యన్ని కలిపినఁగాని సరిగాదని తోఁచెను, ఈ లోకమునఁ గాకున్న నితర లోకములం దున్నవేమో యని చూచితిని. అందును గానరాలేదు. ఇన్ని లోకముల యాధిపత్యమే (బ్రహ్మత్వమే) నీ కిచ్చినఁ జాలునేమో యని చూచితిని. అదియు జాలదనియే తోఁచెను. నే నూపిరితో నున్నానని చెప్పినంత మాత్రమునకే నా మనఁసు సంతోషించి నీ కీయందగినది యేదియు లేకుండుటచేఁ దన్నే నీకు సమర్పించుకొననని యంటిని; విజయరాముఁడనిన రెండుమాటల కదియు సరిగాదని నా యభిప్రాయము. ఇట్టు లాలోచించుచుండుటచే నీతో మాటలాడ నేరనైతిని.

బడువారుగారు. సీతాదేవి యట్లుగాదు. పతివ్రత యగుటయేకాక లోకముచేఁ దల్లివలెఁ బూజింపఁదగినది యని భావము.

సీ. వసుధకు వసుధ యా • భర్తృవత్సల సీత, శ్రీకిని శ్రీయగు•చెలువ మిన్న
యనవద్యసర్వాంగి • యఖిలశుభాస్పద, మెచటనో యడవిలో•నెవరు లేని
తలమునఁ గ్రుమ్మఱు • దానిని వంచించి, మొఱ్ఱో యటంచును•మొఱలు పెట్ట
నాత్మనాశక! యట్టు•లపహరించితి గాని, యేమిసౌఖ్యముఁ గంటి•వింతివలన?
ఆ. సన్మహానుభావు • రాలిపాతివ్రత్య, తపముఁబలిమి నీవు • దగ్ధుఁడైతి
వడఁతిఁ దాఁకినపుడె•భస్మమై పోని నిన్, జూచి యదలి రగ్ని•సురలుహరియు.

అర్థములు. వసుధకు=భూమికి, ధనమును ధరించునది, శ్రీకిని శ్రీ=లక్ష్మికి లక్ష్మియైనది, అనవద్య=దోషరహితమైన, సర్వాంగి=సమస్తావయవములు గలది, అఖిలశుభాస్పదము=సమస్త శుభములకు నాస్పదమైనది, ఆత్మనాశక = నిన్ను నీవే నాశముచేసికొనినవాఁడా, అట్టులు=మారీచుని మాయామృగముగాఁ బంపి.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నీవు సీతాదేవి నేమని తలఁచితివి? ఆమెవలనఁ గదా వసుధకు వసుధయని పేరు వచ్చెను. శ్రీ శ్రీ యయ్యెను. అటువంటి స్త్రీరత్నమగు పతివ్రత. సీత.ఆమె యేయవయవమునందైన నొక్క దోషము కానరాదు.దోషములు లేకుండుటేకాదు, సమస్త శుభచిహ్నములు గలవు. అటువంటి యామెను నీవు భక్తితో నాశ్రయించి యుండిన నెంతో బాగుపడియుందువు. ఆ మార్గము విడిచి మహారణ్యములో నేమూలనో యెవరు లేని చోట నామె యుండఁగా మోసగించి మొఱ్ఱోయని యామె యేడ్చుచుండ మారీచుని పంపి యపహరించితివి. ఇది నిన్ను నీవు నాశము చేసికొను కార్యముకాదా?అపహరించుటొక్కటే కాని యామెవలన నీవు సుఖ మేమి యనుభవించితివి? సుఖమునకు మాఱుగ నామె పాతివ్రత్యముచే కాలిపోయితివి. ఆమె పాతివ్రత్యముచే నే నప్పుడే యేల కాలలేదందువేమో? ఆమెను నీవు దాఁకినపుడే భస్మమై పోని నిన్నుఁజూచి యందఱు దేవతలు భయపడిరి.

కం. పాపం బొనరుచునాతఁడు, పాపములఫలంబు కాల • పక్వం బగుడున్
జేపడఁగ ననుభవించును, ద్రోపాడినఁ బోదు నిజము•దోషాటవరా! ౨౫౯౯

తాత్పర్యము

నేను జేసినది పాపకార్యమైనచో నిప్పు దాకిన గాలునట్లు అప్పుడే పాపఫలము నే నేల యనుభవింప లేదందువేమో? అట్లు గాదు.విత్తనము నాటఁగానే ఫలము నోటికి రాదు. కాలపక్వము కావలెను.పాపము చేసినవాఁ డా పాపఫలము కాలపక్వమై రాఁగా నప్పు డేమి చేసినను వది పోదు.

తే.శుభముఁ జొనరించువానికి•శుభముగలుగుఁ,బాప మొనరింపఁదప్పదు•పాపఫలము
పుణ్యారతుని విభీషణుఁ•బొందె సుఖము, పాపశీలివి నీ కిట్టి•పాటుగలిగె. ౨౫౯౦

తాత్పర్యము స్పష్టము.

కం. అంచితరూపంబున నా,చంచలలోచనను మించు • సౌందర్యవతుల్
పంచన నీకుం గల రది, పంచశరునివలలఁ జిక్కి • పరికింప వయో. ౨౫౮౧

అర్థములు. అంచిత రూపంబునన్ = సౌందర్యముచే, చంచలలోచనను= చలించు కన్నులు గలదానిని - సీతను, పంచశరుని = మన్మథుని, పరికింపవు = చూచినవాఁడవు కావు.

తా త్ప ర్య ము

సౌందర్యమునందు సీతకంటె చక్కనివారు నీకుఁ బ్రక్కనే కలరు. కాని నీవు మదనునివలలోఁ జిక్కిన కారణముచేఁ జూడలేక పోయితివి.

ఆ. కులముచేత నైన • గుణముచేనైనను, జక్కఁదనముచేతఁ • జదురుచేత
నాకు మిన్న గాదు • నాయీడు రాదు వై, దేహి; మోహితాత్మఁ దెలియవైతి.

అర్థములు. చదురు=చాతుర్యము.

తా త్ప ర్య ము స్పష్టము.

ఆ. నింద లేక పోదు • బొందియున్నానుడి, నిఖిలభూతములను • నిశ్చయంబ
యెచట సీత! నీ వ•దెచ్చట? నెట నుండి, మిత్తిఁ దెచ్చికొంటి•మెలఁతమిషను.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. సీతాపతి రామునితోఁ, జేతోగతి సమ్మదమునఁ • జెలఁగి రమింపన్
పీతసుకృత నగు నే నిఁక, నాతతదుఃఖాబ్ధి మునిఁగి•యడలఁగవలసెన్. ౨౫౮౮

అర్థములు. పీతసుకృత=పుణ్యము పోయినది, నిర్భాగ్యురాలను.

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. మందరకందరంబులను • మానితరాజతశైలభూములన్
సుందరమేరుకూటముల • సుందర ! యక్షవనాళిలన్ మణీ
మందిరసీమలన్ సురవి • మానములం దనివార మాలికా
బృందసుచేలయుక్తిఁ జరి • యింతు రమింతు భవత్సమేత నై. ౨౫౮౫

అర్థములు. మందర కందరంబులను=మందర పర్వత గుహలందును, రాజతశైల భూములన్=కైలాస పర్వత ప్రదేశములందును, మేరుకూటములన్ = మేరు పర్వత శిఖరములందును, యక్షవనాళిలన్=చైత్రరథమందును, మణీమందిరసీమలన్=రత్నమయములైన యిండ్లయందును, సురవిమానములన్ = దేవతా విమానములందును, తనివారన్=తృప్తిగా, మాలికాబృంద=పుష్పహారములయు,సుచేల = మంచివస్త్రములయు, యుక్తిన్=కూడికతోఁ, భవత్సమేతనై = నీతోఁ గూడిన దాననై.

తా త్ప ర్య ము

మందరాద్రి గుహలందును కైలాస భూములందును అందమైన మేరు శిఖరములందును కుబేరుని వనములందును రత్నగృహములందును దేవతా విమానము

లందును దృప్తి తీర మంచి చీరలు కట్టుకొని హారములు ధరించి సీతో డఁ దిరుగు చుండితిని గదా.

కం. కోరినభోగంబుల నే, నా రీతిఁ గ ననుభవించి ♦ హతుఁడవుగా నో
వీర యిటు మూలఁబడితిని, త్సా మ్రరమణుల సిరు లవేల ♦ క్షణభంగురముల్. ౨౫౪౭

తా త్ప ర్య ము

సీ. హా మహా రాజేంద్ర ♦ యా సౌకుమార్యంబు, నా సుభ్రువును మఱి ♦ యా సమున్న
సంబు నా సుత్వక్కు ♦ చంద్రాబ్జరవితుల్య, కాంతి లక్ష్మీద్యుతి ♦ కామనీయ
మా కిరీటోజ్జ్వల ♦ మా దీప్తకుండల, మా మదాకులితలో ♦ లాక్ష మా మ
నోహరస్రగ్ధరం ♦ బా హాసరుచిరంబు, నగు తామ్రవక్త్రమా ♦ ప్రాణనాథ
ఆ. రామబాణభిన్న ♦ మై మాంసమస్సృఙ్మ, రుధిరయుక్తి మిగుల ♦ రూక్ష మగుచు
రథపరాగసమితి ♦ రహి తప్పి యీగతి, నేలఁ బడిన యదియు ♦ నిర్జరేంద్ర!

అర్థములు. సుభ్రువు = మంచి కనుబొమలు, సమున్నసము = ఎత్తైన ముక్కు, సుత్వక్కు = మంచిచర్మము, చంద్రాబ్జ రవితుల్యకాంతి = చంద్రునకు, కమలమునకు, సూర్యునకు సరిపోలు కాంతి, కామనీయ = అందమైన, మదాకులిత లోలాక్షము = మదముచే చలించు కన్నులు, మనోహర = మనస్సు నాకర్షించు, స్రక్ = హారములను, ధరంబు=ధరించునది, హాసరుచిరంబు=నవ్వుచే పందమైనది, తామ్రవక్త్రము = ఎఱ్ఱనిముఖము, మాంస మస్తిష్క రుధిర యుక్తి = మాంసము తోను మెదడుతోను నెత్తురుతోను గూడినది, రథపరాగసమితిన్ = తేరి దుమ్ము రాశిచే, రహి = కాంతి.

తా త్ప ర్య ము

ఆ సుకుమారత్వము ఆ కనుబొమ్మలు అ ముక్కు ఆ దేహము సూర్య చంద్రులవంటి యా కాంతి ఆ కిరీటము ఆ కుండలములు మదముచేఁ జలించు నా కన్నులు మనోహరమగు మాలికల ధరించు మెడ ఆచిఱునవ్వుగల యెఱ్ఱని ముఖమా యిప్పు డిట్లు రామబాణములచే భేదింపఁబడి మాంసము నెత్తుటితోఁ గూడి పరుషమై రథచక్రములచే రేగిన దుమ్ముతో నిండి కాంతిచెడి యిట్లులున్నది ?

కం. మందమతినైట నెన్నఁడు, డెందంబునఁ దలఁపనట్టి ♦ దెప్పర మిపు డీ
చందంబున వైధవ్యం, బందితి నది నీకుఁ బ్రాణ ♦ హానిం గూర్చెన్. ౨౫౪౮

తా త్ప ర్య ము స్పష్టము.

కం. జనకుఁడు దానవరాజట, ఘనబలుఁడగు నసురభర్త ♦ గాంతుండఁట నా
తనయుఁడు శక్రజితుండఁట, యనిమిక్కిలి గర్వపడును ♦ ననవరతంబున్. ౨౫౪౯

అర్థములు. దెప్పరము, రూ - దెపురము = ఆపద.

కం. కేవలవిఖ్యాతబల, ప్రావీణ్యులు దృప్తవైరి ♦ పరిమర్దనులున్
భీవిరహితచిత్తులు వా, నావార లటంచు మిగుల ♦ నమ్మితి నాథా! ౨౫౫౦

అర్థములు. కేవలవిఖ్యాత బలప్రావీణ్యులు=మిక్కిలి ప్రసిద్ధి కెక్కిన బలమున నేర్పుగలవారు, దృప్తవైరి పరిమర్దనులు = మదించిన విరోధుల దండించువారు, భీవిరహితచిత్తులు=భయములేని మనస్సుగలవారు.

తాత్పర్యము

నా బంధువులందఱు ప్రసిద్ధికెక్కిన బలము యుద్ధమందలి నేర్పుగలవారనియు, గర్వించిన శత్రువుల దండించు వారనియు, భయ మెఱుఁగని వారనియుఁ దలంచితిని గాని యిట్టు లగుట తలంచినదానఁ గాను.

కం. ఇట్టిప్రభావముఁ గలిగిన, దిట్టలు నీ సుతుఁడు నీవుఁ ♦ దెగితిరి నరుచే
నిట్టగుట దలఁప నెన్నఁడు, చిట్టలువో వీరు మనుజ ♦ చేతం దెగుటల్. ౨౫౫౫౧

అర్థములు. దిట్టలు = సమర్థులు, చిట్టలు=చిత్రములు.

తాత్పర్యము స్పష్టము.

సీ. నిద్ధంపునీలంపు ♦ నీలిడాలు వహించి, ప్రాంశుమహీధరా ♦ భంబు నగుచు
సంగదవైదూర్య ♦ హారస్రగుజ్జ్వలం, బై విహరణకేళి ♦ హారి యగుచు
సంగ్రామతలముల ♦ సందీప్యమానమై, శంపాలతాయుత ♦ జలద మనఁగఁ
బరమాభరణచయ ♦ భావిభాసితమయి, కాంతుల నీనుచుఁ ♦ గ్రమ మైన
ఆ. నీ శరీర మకట! యాశుగసందోహ, శాతశల్యనికర ♦ సంచిత మయి
తాఁకుటకును లేమిఁ ♦ దమిఁ గౌఁగిలించెదు, భాగ్య మైన లేదు ♦ ప్రాణనాథ.

అర్థములు. నీలిడాలు = నల్లవన్నె, ప్రాంశుమహీధరాభంబు = ఎత్తైన కొండతో సమానము, అంగద వైదూర్యహారస్రగుజ్జ్వలంబై=బాహుపురులతోను వైదూర్యహారములతోను, పూలదండలతోను ప్రకాశించునదియై, హారి = మనోహరము, శంపాలతాయుత జలద మనఁగ=మెఱుపులతోడి మేఘమువలె, పరమాభరణచయ=ఉత్తమ భూషణ సమూహములయొక్క, భా=కాంతిచే, విభాసితమై=ప్రకాశించునదియై, ఆశుగసందోహ=బాణసమూహములయొక్క, శాత=పదునైన, శల్య=ములుకులయొక్క, నికర=సమూహముచే, సంచితమయి=కూడినదై.

తాత్పర్యము

నునుపైన యింద్రనీలములయొక్క నల్లని కాంతిగలిగి ఎత్తైన కొండను బోలి బాహుపురులచేతను, వైదూర్యహారముల చేతను, పూలదండల చేతను ప్రకాశించుచు వినోద విహారముల మనోహరమై యుద్ధభూములందుఁ బ్రకాశించునదియై మెఱుపులతోడి మేఘమో యనన నుత్తమ భూషణముల కాంతిచే ప్రకాశించుచు కాంతులు ప్రసరింపఁ జేయుచు మనోహరమైన నీ శరీర మయ్యో! బాణముల పదునైన ములుకులతోఁగూడి తాఁకుటకును సాధ్యపడ కుండుటచేఁ గౌఁగిలించు భాగ్యమైన లేదు.

ఆ. పలుగుముండ్లవోలె♦సాయకంబులు మర్మ,తలము లంటఁదాఁక ♦ దారుణముగఁ
దెగినసిరలనుండి♦తెఱపి లేక స్రవించు, రక్తమునను మేను♦సిక్తమయ్యె. ౨౫౫౩

అర్థములు. పలుఁగు=ఏదుపంది, సిరలనుండి = నరములనుండి, రక్తము= తడిసినది.

తాత్పర్యము

ఏదుపంది ముండ్లవలె బాణములు ఆయువుపట్లవఱకుఁ బోయి గ్రుచ్చుకొని యుండుటచేతఁ దెగిన నరములనుండి విరామము లేక కాఱుచున్న నెత్తుటిచేత దేహము తడిసియున్నది.

కం. కట్టా! వాసవసాధన, కుట్టాకంబైన మేను ♦ గురుతరరఘువం
శోట్టుశరంబులఁ బవిహత,కుట్టారమువోలె నేలఁ♦గూలెనె యనిలోన్. ౨౫౫౪

అర్థములు. వాసవసాధనకుట్టాకము = ఇంద్రాయుధముల ఛేదించిన, మేను = దేహము, గురుతర = మిగుల గొప్పవగు, రఘువంశోట్టు = రఘువంశమునఁ బుట్టినవారిలో శ్రేష్ఠుఁడు, పవిహతకుట్టారము = వజ్రాయుధముచేఁ గొట్టఁ బడిన పర్వతమువలె.

తాత్పర్యము

అయ్యో! యింద్రుని యాయుధములను ఛేదించిన దేహము రామచంద్రుని గొప్పబాణములచే వజ్రాయుధముచేఁ గొట్టఁబడిన పర్వతమువలె యుద్ధములో నేలఁగూలెనా ?

కం. సత్యమ్మగు స్వప్నం బిది, మృత్యువునకు మృత్యువగుచు ♦ మీఱిన నీవున్
మృత్యువునకు వశపడుదె? య సత్యమువో రామవిభుఁడు♦చంపుట నిన్నున్.

కలలో జరిగినది సత్యమైనను మేలుకొన్న దశలో నది యసత్యమని యెట్లు భ్రమింతుమో యట్లు నిన్ను రామచంద్రమూర్తి చంపుట వాస్తవమైనను మృత్యువునకు మృత్యువగు నీవు మృత్యువునకు వశపడుదువా యని భ్రమించుచున్నాను. కలలో జరిగినవి యసత్య మనుకొనుట భ్రమయైనట్లు నీవు రాముచేఁ జావలేదను కొనుటయు భ్రమయే.

సీ. సకలజగజ్జాల ♦ సర్వార్థభోక్తను, వైరివ్యాలోస్ఫటన ♦ పరుషవక్త్ర
సర్వదిశాపాల ♦ సముదయజేతను, నఖిలజగత్స్రష్ట ♦ యుగ్రవదాత
సహరాజతాహార్య ♦ శంకరదక్షేపను, లంకాపురీద్వీప ♦ లలితగోప్త
సముదశాత్రవలోక ♦ సంఘాతనిగ్రహీత, శరనివాతకవచ ♦ సంగ్రహీత
ఆ. బహుళయజ్ఞలోప్త ♦ స్వజనయూథపగోప్త, దానవేంద్రహంతఁ♦దలతనియంత
లోకచయవిహర్తఁ♦బాకారిమదహర్తఁ బంక్తికంఠభర్త♦ప్రాణభర్త. ౨౫౫౬

అర్థములు. సకలజగజ్జాల = సమస్తలోక సమూహముల యందలి, సర్వార్థభోక్తను = సమస్తమైన యుత్తమ పదార్థముల ననుభవించినవానిని

వైరిహృత్ స్ఫోటన పరుషవక్త = శత్రువుల గుండెలు పగులునట్లు మాటలాడు వానిని, సర్వదిశాపాలసముదయజేతను = దిక్పాలక సమూహముల నన్నిటిని జయించిన వానిని, సకలజగత్సుభయప్రదాతఅన్ని లోకములకు విశేషభయము గలిగించిన వానిని, సహరాజతాహార్యశంకరక్షేప్తను=వెండికొండతోడ శివుని నెగురఁజిమ్మిన వానిని, లంకాపురీద్వీప లలితగోప్త=లంకాపురద్వీపమును చక్కఁగా రక్షించిన వానిని, సమద = మదముతోఁ గూడిన, శాత్రవలోక సంఘాత నిగ్రహీత=శత్రుజన సమూహమును నిగ్రహించిన వానిని, శఠనివాతకవచ సంగ్రహీత=వంచకు లగు నివాతకవచులను రాక్షసులను స్నేహితులుగా సంగ్రహించిన వాఁడు, బహుళ యజ్ఞలోప్త = అనేక యజ్ఞములు విఘ్నపఱిచినవాఁడు, స్వజన యూథపగోప్త=తన బంధువులగు యూథపతులను రక్షించినవాఁడు, దానవేంద్ర హంత = కాలకేయులందు ముఖ్యులైన విద్యుజ్జిహ్వుఁడు (శూర్పణఖ మగఁడు) మొదలగువారిని జంపినవాఁడు, లోకచయవిహర్త=అన్నిలోకములందు సంచరించు వాఁడు, పాకారి మదహర్త = ఇంద్రుని గర్వము నణఁచినవానిని, పంక్తికంఠ ధర్త=పదితలలు ధరించిన వానిని.

## తాత్పర్యము

సమస్త జగముల నుండు నుత్తమ పదార్థముల ననుభవించినవాఁడు, శత్రువుల గుండెలు పగులునట్లు మాటలాడువాడు, దిక్పాలుర నందఱ జయించినవాఁడు, సమస్త ప్రపంచమును భయపడఁజేసినవాఁడు, కైలాసముతోడ శంకరుని నెగఁజిమ్మినవాఁడు, లంకాద్వీపముఁ బాలించినవాఁడు, గర్వించిన పగవారిని నిగ్రహించినవాఁడు, మాయావులైన నివాతకవచులతో స్నేహముచేసినవాఁడు, అనేక యజ్ఞముల ధ్వంసముచేసినవాఁడు, తన బంధువుల రక్షించినవాఁడు, దానవులందు ముఖ్యులను జంపినవాఁడు, మిక్కిలి నియమించువాఁడు, సర్వలోకముల సంచరించిన వాఁడు, ఇంద్రుని మదము హరించినవాఁడు, పదితలలు ధరించినవాఁడు, నాకు ప్రాణభర్తయగువాఁడు.

కం. త్రాతను రణమాయాని, ర్మాతను పరిపంథియువతి ♦ రాజీబాధా

దాతను స్వజనానందవి, ధాతను మత్సరమ కామ ♦ దాతను వీనున్. ౫౫౬

అర్థములు. త్రాతను = ఆశ్రితులకు రక్షకుఁ డగువానిని, రణమాయా నిర్మాతను=యుద్ధమందు పత్యమ్నుతశక్తులఁ జూపువానిని, పరిపంథియువతి రాజీ బాధాదాత = శత్రువుల యొక్క స్త్రీసమూహములకు బాధ కలిగించిన వానిని, స్వజనానంద విధాతను=తన బంధువులకు సంతోషము గలిగించిన వానిని, మత్సరమ కామదాతను=నా యుత్తమ కోరికల నన్నిటిని దీర్చినవానిని.

## తాత్పర్యము

ఆశ్రయించినవారిని రక్షించిన వానిని, యుద్ధమునందు మాయలు నిర్మించు వానిని, దేవతాస్త్రీలను అసురస్త్రీలను మనుష్యస్త్రీలను హరించి బాధించినవానిని, తన

బంధువులకు సంతోషము గలిగించినవానిని, నా కోరికల నన్నిటిని దీర్చినవానిని, వీరుఁడగువానిని.

క౦. ఉత్తమశాస్త్రశ్రుతిచయ, వేత్తను సద్ధర్మమార్గ • విధిమర్యాదా
భేత్తను బుణ్యజనాది,చ్ఛేత్తను సురనరసతీవి • శేషాహర్తన్. ౩౫౫౪

అర్థములు. ఉత్తమశాస్త్ర శ్రుతిచయవేత్తను=ఉత్తమ ధర్మశాస్త్రములను నాలుగు వేదములను దెలిసిన వానిని, సద్ధర్మమార్గ విధి మర్యాదాభేత్తను=మంచి ధర్మమార్గముఁ దెలుపు శాస్త్రముల మర్యాదను భేదించినవానిని, పుణ్యజనాదిచ్ఛేత్తను=పుణ్యము చేయు మనుష్యులు లోనగు వారిని ఛేదించిన వానిని, సురనర సతీవిశేషాహర్తన్=దేవస్త్రీలను మనుష్యస్త్రీలను విశేషముగ హరించి తెచ్చిన వానిని.

తాత్పర్యము

నాలుగు వేదములు ధర్మశాస్త్రములు చదివిన వానిని ధర్మశాస్త్రమర్యాద నుల్లంఘించిన వానిని, పుణ్యాత్ముల ఛేదించిన వానిని, దేవస్త్రీలను మనుష్య స్త్రీలను హరించినవానిని.

క౦. నిను నా ప్రాణేశ్వరు రా,మనిశితశరనిహతుఁ జూచి • మరణింపక నా
తనువునఁ బ్రాణము దాల్చుట, దనుజేశ్వర యింక శాశ్వ•తమ నా బ్రదుకున్.

అర్థములు. రామనిశితశరనిహతున్=రాముని వాఁడిబాణములచేఁ జంపఁబడినవానిని.

తాత్పర్యము

ఇటువంటి నిన్ను నా ప్రాణభర్తను రామశరములచే మరణించిన వానిని జూచియుఁ జావక నా దేహమునఁ బ్రాణములుండుటచే నేను స్థిరజీవిని,నాకుఁ జావు లేదు.

తే. మేను నునుటంచతెక్కముల• మెత్తలందు, వ్రాల్చి హాయిగ నిదురించు•రమణ నీవు
రేణుపాటల మైన యీ•క్షోణియందు, నేమిసుఖ మని పన్నుండ • నెత్తికొంటి?

అర్థములు. నునుటంచతెక్కముల మెత్తలందున్=మెత్తని హంసతూలికా తల్పములందు, రేణుపాటల=దుమ్ముచే నెఱ్ఱనైన, పన్నుండన్=పండుకొన, ఎత్తికొంటివి = ప్రయత్నించితివి.

తాత్పర్యము స్పష్టము.

క౦. సౌమిత్రిశరంబుల సం,గ్రామంబున శక్రజిత్తుఁడు • కడచుట విని నే
భూమిఁ బడితి ననుకొంటిని, నీ మరణముచేత నేఁడు•నీఱైతిఁ బతీ! ౩౫౬౧

అర్థములు. కడచుట=చచ్చుట, నీఱు=బూది.

తాత్పర్యము స్పష్టము.

క౦. చుట్టములు లేరటంచును, బుట్టదు వో చింత నాకుఁ • బురుభోగంబుల్
నెట్టన యొసఁగెడినిను విడి, యెట్లోకో శాశ్వతసమల్ స•హింతు వ్యసనటన్.

అర్థములు. శాశ్వతీ సమాః=అనేక సంవత్సరములు.

తాత్పర్యము స్పష్టము.

కం. నేను సహధర్మచారిణిఁ, గానా? నే నిట్లు వగవఁ • గడు దవ్వయి పో
రానియెడ కేగుటలు దగ, వౌనా? నిను విడిచి బ్రదుక • నగునా నాకున్.

అర్థములు. సహధర్మచారిణీ=నీతోడ ధర్మమును జేయుదానను.

తాత్పర్యము స్పష్టము.

కం. దీన నయి దుస్సహవ్యథ,చే నిటు పలవించుచున్నఁ • జే విడిచి చనం
గా న్యాయమె? యేడువకే. మానినియని ప్రీతి నొక్క • మాటన రాదా ?

అర్థములు. దుస్సహవ్యథచేన్=సహింపరాని బాధచే.

తాత్పర్యము స్పష్టము.

ఉ. కోమలనీలదేహ! యవ • కుంఠనమున్ విడనాకి కాల్నడన్
నీమహిషిం బురంబు విడి • నే నిటువచ్చినఁ గోపగింప వే
లా మనుజాశనేంద్ర! ప్రియు • రాండ్రు ముసుంగులు వీడి సిగ్గువో
నీమెయి రాఁగ నింద అది • యేలొకొ కిప్డు వహింప వింతయున్? ౨౫౬౫

అర్థములు. అవకుంఠనము = ముసుఁగు, మహిషిన్ = పట్టపురాణిని, సిగ్గువోన్=సిగ్గువిడిచి, ఈమెయిన్=ఈ విధముగ.

తాత్పర్యము

మృదువైన నల్లని దేహము గలవాఁడా! నీ పట్టపురాణినగు నేను ముసుఁగు వదలి కాలినడకతో నూరు విడిచి పదుగురు చూచుచుండు చోటికి వచ్చితినిగదా, ఏల నీవు కోపింపవైతివి? నేనొకతెనేకాదు నీకు ప్రియులైనవారందఱు నిట్లే ముసుఁగులుదీసి సిగ్గువిడిచి యీ విధముగ రాఁగా నేల కోపింపవు?

దీనివలన స్త్రీలు ముసుఁగులులేక వెలికి రాఁగూడదను నాచారము క్షత్రియ స్త్రీలయందు ఐశ్వర్యము పరువు పట్టి వచ్చినదని యేర్పడుచున్నది. సిగ్గుమాలిన శూర్పణఖ లెట్లుదిరిగినను నెవ రేమనగలరు? ఈయాచారము భర్తృసన్నిధియందు లేదనిన ౨౫౬౫ వ పద్యమువలన నేర్పడుచున్నది. ఈయాచారమునకుఁ బ్రభుత్వము, ఐశ్వర్యము, పరువు కారణమని మఱికొంద ఱట్టి స్థితియం దున్నవారు పాటించుటచేఁ దెలిసెడి. తక్కినవారియం దిది దురాచారము. ఐశ్వర్యము, ప్రభుత్వము కొన్ని దురభిప్రాయములకుఁ గారణము లగుచున్నవి. ప్రభువులు ధనికులు తమకాళ్ళఁ దాము నడచుటకూడఁ బరువునకు హానియనియే మూఢలోకముతలంపు.

కం. నీ లాలించు జనంబులు, ఖేలాసహచరులు నాథ • కెలఁకుల నేఁడ్వన్
లాలింప వూఱడింపవు, పోలును నీ కిట్టి కఠిన • బుద్ధి హృదీశా ! ౨౫౬౬

అర్థములు. ఖేలాసహచరులు = కూడ నాడుకొనువారు, కెలఁకులన్ = ప్రక్కల. తాత్పర్యము స్పష్టము.

సీ. పరమపాతివ్రత్య • భవ్యశీలలఁ గుల, పాలికలను ధర్మ•పరల భవ్య
వృద్ధశుశ్రూషణా•విరతచిత్తల నీవ, యొందఁ జనో పతి•హీనురాండ్రఁ
జేసితి వా సతు • లీసున దుఃఖంబు, గరిమను దిట్టిరి • కఠినఫణితి
వారిశాపము దాఁకి • వైరిచేఁ జెడితివి, వా రెట్లు తిట్టి•రావగిది సయ్యెఁ

తే. బరమసాధ్వుల కన్నీరు•ధరణిఁ బడవు, మనసు నొప్పించువారిచే•టునకుఁ గాక
యనెడు లోకప్రవాదంబు•ప్రాణనాథ!, సత్యమయ్యెను నీయందు•జగతియందు.

అర్థములు. పరమ పాతివ్రత్య భవ్యశీలలన్ = ఉత్తమ పతివ్రతా ధర్మమనెడి శుభాచారముగలవారిని, కులపాలికలను=కులస్త్రీలను. 'కులస్త్రీ కులపాలికా' అమరము. వ్యభిచారములేక వంశమును రక్షించువారు కులస్త్రీలు, వ్యభిచరించువారు కులటలు, ధర్మపరలన్=పాతివ్రత్యమె పరమధర్మమని యుండువారిని, భవ్య వృద్ధ శుశ్రూషణావిరతచిత్తలన్=శుభకరులైన పెద్దల (అత్తమామల)శుశ్రూష చేయుటయందు నెడఁదెగని మనస్సుగల వారిని, ఈసునన్=కోపముతో.

తాత్పర్యము

ఉత్తమ పతివ్రతలను కులస్త్రీలను పెద్దల సేవచేయు వారిని స్త్రీలను నెంద ఱనో వారిని భర్తలను జంపి విధవలఁ జేసితివి. ఆ పతివ్రతలు కోపించి కఠిన వాక్కుల మావలెనే నీ భార్యలు విధవ లగుదురు గాక యని శపించిరి. వారి శాపముచే నీవు చచ్చితివి. వా రెట్లు చెప్పిరో యట్లులే మేము విధవల మైతిమి. ఉత్తమ పతివ్రతల కన్నీరు ఏనాఁటికైన నా కన్నీరు కారఁ జేసినవారి నాశముచేయక వదలదు. పతివ్రతల కంటినీరు వ్యర్థముపోదు అను వాక్యములు లోకమున వ్యాపించి యున్నవి. అది నీ విషయమున సత్యమయ్యెను.

కం. శూరుఁడవై రణముల భుజ,వీరత గెలిచితివి నిఖిల • విశ్వము నయ్యో
భీరుగతి శూరమానీ, నారీచౌర్యంబు సేఁత • నైచ్యముగాదే. ౭౧-౭౨

అర్థములు. భీరుగతిన్ = పిఱికివానివలె, శూరమానీ = శూరుఁడని తలఁచుకొనువాఁడా, నారీచౌర్యంబు సేఁత = స్త్రీని దొంగిలించు కార్యము, నైచ్యము= క్షుద్రము గదా.

తాత్పర్యము

నీవు శూరుఁడవై 'లోకమంతయు భుజబలముచే గెలిచితివి, కావుననే నేను శూరుఁడ' నని నీవు తలఁచితివి. కాని నీవు నిజముగ శూరుఁడవు కావు. నిజమైన శూరుఁడవే యైన పక్షమున పిఱికివానివలె నాఁడు దానిని దొంగిలించు నంత నీచకార్యము చేయుదువా? మగవారికిభయపడిగ దానీవట్లు చేసితివి? దానినే వివరించి చెప్పుచున్నది.

సీ. హరిణమిషంబున • నాశ్రమంబుననుండి, దాశరథిని దవ్వు • దలఁగఁ జేసి
జానకిఁ దెచ్చితి • మానధనా! యిది, పిఱికితనానకు • గుఱుతు గాదె
భీమాహవముల నేన్ • బిఱికివి గావని, సత్య మే నెఱుగుదు • సాహసాంక
యట్టి నీ విటు సేఁత • యరయ దౌర్భాగ్యసూ•పక్వలక్షణమయి • పరిణమించె

ఆ. సల్త్రికాలవేది • యైన నాదుమఱంది, నీవు సీతఁ దేర • నిశ్వసించి
చూచి సత్యభాషి • శుభచరిత్రుఁడు దాన, నసురతతికిఁ జేటు•పొసఁగుననియె.

అర్థములు. హారిణమిషంబుననే=జింక నెపమున, "కంధరాదులకు మువర్ణకంబును బహుళంబుగ నగు" సు. వ్యా-తత్స. 23. మిషాశబ్దము కంధరాదులలోఁ జేరినది కావున మిష, మిషము అని రెండు రూపంబులుగలవు, భీమాహవములనేన్=భయంకర యుద్ధమందు, దౌర్భాగ్య పక్వలక్షణము = నిర్భాగ్యదశ పండిన గుర్తు, త్రికాలవేది=కడచిన, జరుగుచున్న, జరుగఁగల కాలములం దేవేవి జరుగునో యవి తెలిసినవాఁడు.

తాత్పర్యము

జింక నెపము పెట్టి రామచంద్రుని నాశ్రమమునుండి దూరముగాఁ బోఁజేసి సీతను దెచ్చితివి. మానమే ధనముగాఁ గలవాఁడా! యిది పిఱికితనమునకు గుఱుతు గాదా? మానధనుఁడిట్టి యవమానకర కార్యము చేయునా? పిఱికినైన నన్ని యుద్ధము లెట్లు చేసితివందువేమో? నిజమే, నీవు భయంకరయుద్ధములందు పిఱికివి కావు నిజము నే నెఱుఁగుదును అట్టివానికిట్టి దుర్బుద్ధిపుట్టుటకు కారణము నిర్భాగ్యదశ పక్వమై చెడుకాలము సమీపించుటచేతనే యని తలఁచెదను. అట్లు గాకున్న నట్టి వానికిట్టి బుద్ధి యేల పుట్టును? నీ వే నాఁడు సీతను దెచ్చితివో యానాఁడే భూత భవిష్యద్వర్తమానములు తెలిసిన నామఱఁది సత్యవాదియు మంచి నడవడిగల విభీషణుఁడు నిట్టూర్పు విడిచి దీనితో రాక్షసులు నాశమగుదురని చెప్పెను. దైవ తంత్రము దప్పింప విభీషణుఁ డెంతెంతో ప్రయత్నించెనుగాని యది తప్పినదికాదు.

కం. కామక్రోధంబులచే, నీమెయి సమకూరె నింత • కీవే మూలం
బామూలము చెడె నసుర, స్తోమము దిక్కెంది లేక • తూలించితివే. ౨౪౭౦

తాత్పర్యము

ఇంత యనర్థమునకు నీవు దుష్కామమునకు లోఁబడుట, హితము బోధించిన వారియందుఁ గోపపడుట కారణములు, కావున నీవలననే రాక్షసు లందఱు సమూలము నాశమైరి.

తే. నీవు సడిసన్నవాఁడవు • నిఖిలజగతి, బలపరాక్రమముల నీకు • నగవఁ దగద
యనుచు నెఱుఁగుదునైనను•నాఁడు దానఁ, గాన నాబుద్ధి దుఃఖాబ్ధి•లీనమయ్యె.

అర్థములు. సడిసన్నవాఁడవు=కీర్తి కెక్కిన వాఁడవు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఓగో బాగో నొవరిచి, నీగతికిం జనితి వీవు • నేనో నీనం
యోగంబుఁ బాయుకతమున, నాగతి యే మనుచు నగతు • నాకైనాథా!

తాత్పర్యము

నీవు మేలే చేసితివో! కీడే చేసితివో అయినదానిని గుఱించి యిప్పుడు తప్పొప్పు లెన్నిన నేమి ప్రయోజనము? చేసిన దాని ఫల మనుభవింప నీగతికి నీవు

పోయితివి. కావున నీకై నేను దుఃఖింపలేదు. నీ మాటను వదలిన నాకతి యేమని నేను నాకై దుఃఖించుచున్నాను. లోకములో నెవ్వరు చచ్చిన వారికై యేడుచువారు లేరు. చచ్చిన వారివలనఁ దమకు లభించుచుండిన, లభింపఁగల సుఖము, సంతోషము, లాభము పోయెనే యని తమకై యేడ్చువారే.

సీ. నీహితకాముల • నీతివాక్యాళికిఁ, జెడచెవినిచ్చితి • వీరవర్య !
శుభము వచించిన • సోదరపాళికి, మాఱుమో మిడితివి • మహితశౌర్య !
హేతుయుక్తంబుగ • నీతియుతంబుగ, శ్రేయస్కరంబుగఁ • జెప్పలేద
తిన్ననిమాటల • నెన్ని యోమాఱులు, చిన్నతమ్ముఁడు చెవి • విచ్చి వింటె
తే. కొఱఁత లేకుండ మారీచ•కుంభకర్ణు,లపుడె నాతండ్రియును నీకు•నార్థఁ జెవులఁ
గూరిపోయరె? వినవైతి•వారిపలుకు, బలమదంబున, దాన నీ•ఫలము గలిగె.

అర్థములు. హితకాముల=మేలు గోరువారియొక్క.

తాత్పర్యము స్పష్టము.

తే. కాలజీమూతసంకాశ • కనకచేల, తనువు సర్వంబు నెత్తుటఁ • దడిసియుండ
ధరణి నిద్రించుగతిఁ బండి•దైన్యగరిమ, నేఁడు నాతోడ మాటాడ•వేల చెపుమ!

అర్థములు. కాలజీమూతసంకాశ=నల్లని మబ్బుతో సమానమైన దేహకాంతి గలవాఁడా! కనకచేల=బంగారు సరిగ వస్త్రము ధరించినవాఁడా, తనువు=దేహము.

తాత్పర్యము స్పష్టము.

కం. సాహసవీర్యధనుండును, నాహవమున విజయి దక్షుఁ • డర్దితశత్రు
వ్యూహుఁడగు మాల్యవంతుని, దౌహిత్రుఁడ యేల చూడఁ•దలఁపవు నన్నున్.

అర్థములు. సాహసవీర్యధనుఁడు=తెంపు బలము ధనముగాఁ గలవాఁడు, విజయి=గెలుపుగొనువాఁడు, దక్షుఁడు = ఏకార్యమైన సమర్థించి చేయువాఁడు, అర్దితశత్రువ్యూహుఁడు = బాధింపఁబడిన శత్రుసమూహము గలవాఁడు, దౌహిత్రుఁడవు = కూఁతు కొడుకవు, రావణుఁడు మాల్యవంతుని తమ్ముని దౌహిత్రుఁడు, కావున మాల్యవంతునకు దౌహిత్రుఁడే ఎక్కువ ప్రసిద్ధినిబట్టి యతనిపేరు చెప్పఁబడెను.

తాత్పర్యము స్పష్టము.

కం. లే లెమ్ము క్రొత్తపరిభవ, మీ లంకాపురికిఁ గలిగె • నిపు డినరశ్మిల్
చాలఁగ నివె యెల్లెడలన్, వాలాయము చొచ్చె సైఁప•వచ్చునె సీతన్ ?

అర్థములు. క్రొత్త పరిభవము = ఇదివఱ కెన్నఁడు లేని యవమానము, అనఁగా రావణు నాజ్ఞలేక లంకయందు సూర్యుఁ డెండ గాయ భయపడుచుండెను. ఇప్పు డతని యాజ్ఞ లేకయే విచ్చలవిడి కాయుచున్నాఁడు, ఇనరశ్మిల్=సూర్యకిరణములు, వాలాయము=అడ్డము లేక.

ఇట్లు చెప్పుటచే నిది యుదయకాలమని యేర్పడుచున్నది. ఎల్లెడల నిన రశ్ములు వ్యాపించెననుటచే తొమ్మిదిగడియల ప్రొద్దై యుండవచ్చును.

తాత్పర్యము స్పష్టము.

ఉ. నీరజబాంధవాభ మయి • నిర్జితసర్వవిపక్షజాలమై
భూరివిభూషణాంచితము • పుష్పతతిన్ సతతార్చితంబునై
ఘోరము నై పురందరున • కున్ శతకోటి యనంగ నీకుఁ జె
న్నారు సముజ్జ్వలంపుఁ బరి • ఘాయుధముం జెడె వేయితున్కలై. ౨౫౭౭

అర్థములు. నీరజబాంధవాభము=సూర్యునితో సమానమైన కాంతిగలది, నిర్జిత = జయింపఁబడిన, సర్వ విపక్షజాలము = సమస్త శత్రుసమూహము గలది, భూరివిభూషణాంచితము=బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినది, అనేకములగు సొమ్ములచే నలంకరింపఁబడినది, భూరి స్వర్ణే బహౌ త్రిషు ॥నానా॥రర.సతత=ఎల్లప్పుడు, అర్చితంబు=పూజింపఁబడినది, పురందరునకున్ = ఇంద్రునకు, శతకోటి= వజ్రాయుధము, పరిఘాయుధము=ఇనుపకట్ల గుదియ.

తాత్పర్యము

సూర్యునితో సమానమైన కాంతిగలదియు, సర్వశత్రువుల జయించునదియు, అనేకములైన బంగారుసొమ్ములచే నలంకరింపఁబడినదియు ప్రతిదినము పూలచేఁ బూజింపఁబడినదియునై భయంకరమైనదియునై యింద్రునకు వజ్రాయుధమువలె నీకు నొప్పుచున్న పరిఘాయుధము వేయి తునుకలై చెడినది.

కం. ఏమీ ప్రియురాలన సంగ్రామమహిం గ్రుచ్చి నీవు కౌఁగిట నాతో
నేమియుఁ బలుకక యప్రియ, భామినివలెఁ జూడ నీకు • భావ్యమె చెపుమా?

తాత్పర్యము స్పష్టము.

కం. ఎట్టిహృదయ మిది భీభీ, పట్టని వేతునుక లగుచుఁ • బగులదు నిన్నీ
పట్టున రణనిహతుం గని, కట్టా యని స్నేహగరిమఁ•గనునీ రురలన్. ౨౫౭౮

తాత్పర్యము స్పష్టము.

ఆ. మనసు నిలుపలేక • మయునితనూభవ, యసురనాథుపక్ష•మందు వ్రాలె
మూర్ఛ తన్ను మిగుల•ముంప సంధ్యారక్త, జలదమందు వెలుఁగు•శంపవోలె.

అర్థములు. సంధ్యారక్తజలదమందు=సాయంకాలమున నెఱ్ఱనైన మేఘమునందు, శంపవోలెన్ = మెఱుపువలె, నెత్తుటిచే నెఱ్ఱనైన రావణుని వక్షమందు వ్రాలెను.

తాత్పర్యము స్పష్టము.

చ. సవతులు హా! యటంచు నల • సాధ్విని జుట్టి నితాంతశోకభా
రవశమునన్ మునుంగుచును • రామ! దొఱంగనె రాజ్యలక్ష్మియున్
భువనచయస్థితుల్ దశల • పోకలతోడన మాఱుచుంట య
ధ్రువము లటంచు నిబ్బరముఁ • దొయ్యలి! తాల్పుము మమ్ముఁ దేర్పవే.

అర్థములు. రామ=స్త్రీ, ఇచ్చట సంబోధన ప్రథమ.

తాత్పర్యము

ఇట్లు పడిన మండోదరిని జుట్టుకొని హా హా యని యేడ్చుచు నధిక శోకమున మునుఁగుచు నామెనుజూచి యిట్లనిరి. సుందరీ! రాజుల సంపత్తు, భువనస్థితిగతులు, ననుభవించువారి దశలు మాఱు కొలఁది మాఱుచుండునవియు నిలుకడగా నుండునవి కావనియు నీ వెఱుంగవా? కావున నీవు ధైర్యము తెచ్చుకొని మమ్ము సమాధానపఱుపుము. నీ వే యేడ్చుచుండిన మాగతి యేమి?

కం. అను చెలులకు పతి యయ్యో, యని ధారగఁ గనులఁ గాఱు ♦ నంబువులం దా
స్తనములఁ దడుపుచు నిజపతిఁ, బనవి పనవి యేడ్వ రామ♦భద్రుం డంతన్.

అర్థములు. అంబులన్ = నీళ్ళచే.

తాత్పర్యము స్పష్టము.

—♦విభీషణుఁడు శ్రీరామునితో రావణుఁడు సంస్కారార్హుఁడుకాఁడని చెప్పుట♦—

కం. అయ్యా! విభీషణ నీ వీ, తొయ్యలులం గడకుఁ బంచి ♦ తూర్ణము నీ య
న్నయ్యకు సంస్కారంబులు సెయ్యమున నొనర్పు మన్న♦నెమ్మదిఁ దనలోన్.

అర్థములు. తొయ్యలులన్=స్త్రీలను

తాత్పర్యము స్పష్టము.

కం. ఆలోచించి విభీషణుఁ, డోలిన్ ధర్మంబు తెఱఁగు ♦ నూహించి ధరా
పాలానువృత్తికై హిత, శీలుం డుత్తర మొసంగు ♦ శ్రీరామునకున్. ౨౯౦౪

అర్థములు. ఆలోచించి=ఈ సంస్కార విషయమున రామచంద్రుని వాస్తవాభిప్రాయ మెట్టిదో నేను దెలిసికొనక ముందు మించి యిదివఱకు నేను సంస్కారములు చేయుదునా యని యడిగితిని, చేయుమని చెప్పెనుగాని యది వలదనిన నే నే మనుకొందునో యని దాక్షిణ్యవశమునఁ జెప్పెనో లేక యది వాస్తవాభిప్రాయమో తెలిసినది కాదు, అని యాలోచించి ధర్మంబు తెఱఁగు నూహించి ఏది ధర్మము? అన్న యను నభిమానముతో రామచంద్రమూర్తి యేమైన ననుకొననీయుని సంస్కారము చేయుట ధర్మమా? రామచంద్రుని యిష్టప్రకారము పోవుట ధర్మమా? నీళ్ళు విడుచువాఁడు లేక చచ్చిన యన్నకు సంస్కారమును చేయకపోయితినా లోక మే మనును? ఎంత కఠినుఁడు? చచ్చిన వానిమీఁదఁ బగ సాధించుచున్నాఁడు అనరా? సంస్కారములు చేసితి నేని, చూచితివా నాయొద్దఁ జేరనే కాని నా విరోధి మీఁద నభిమానము వీనికిఁ బోయినది కాదు. ఏదో తన కార్యార్థమై చేరినాఁడే కాని యభిమాన మాత్రక్కనే యున్నది యని రామచంద్రమూర్తి యనుకొనునేమో యని వితర్కించి సంస్కారములు చేయుట సామాన్యధర్మము. రాముని యిష్టప్రకారము పోవుట విశేషధర్మము. కావున ధరాపాలనానువృత్తికై =

రామచంద్రు నభిప్రాయ మనువర్తించుట బాగని తీర్మానించుకొని హితశీలుఁడు= మేలగు దానిఁ జేయు స్వభావము గలవాఁడు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా నాలోచించి విభీషణుఁడు ధర్మ మేది యని యూహించి రాముని చిత్తవృత్తి ప్రకారము పోవుటే ధర్మమని తీర్మానించు కొని యిట్లు ప్రత్యుత్తర మిచ్చెను.

సీ. ధర్మవృత్తంబులు • దలఁచఁ ద్రోసినవాఁడు, కరుణావిదూరుండు • కల్లరీఁడు
కలుషచిత్తుం డన్య•కాంతాభిమర్శియు, భ్రాతృరూపముఁ గొన్న•పరమవైరి
సకలాహితరతుండు •జగదుపద్రవకారి, వీనికా నే నిష్ఠ • విధిహితముగ
సంస్కారములు సేయఁ?•జాల నాపనికిని, నన్న యీాటను బూజ•కర్హుఁ డైన

తే. సంస్కృతికిఁ గాఁడు నే నది•సలుపకున్న, నెట్టివారలునను మున్న•కట్టిఁడి యని
తిట్టువారలో వార లీ•చెట్టగుణము, విన్న నను మెచ్చువార లు • క్షితలేంద్ర!

అర్థములు. ధర్మవృత్తంబులు= ధర్మముతోఁగూడిన నడవడులను, కరుణా విదూరుండు = దయలేనివాఁడు, కల్లరీఁడు = అసత్యము లాడువాఁడు, కలుష చిత్తుండు=పాపపు మనస్సు గలవాఁడు, అన్యకాంతాభిమర్శియు=ఇతర స్త్రీలను బాధించిన వాఁడు, భ్రాతృరూపము=అన్నయను నాకారము. పరమవైరి = నన్ను జంపఁదలఁచిన విరోధి, సకలాహితరతుండు =అహితములైన కార్యము లన్నియుఁ జేయుటయందుఁ బ్రీతిగలవాఁడు, జగదుపద్రవకారి=ప్రపంచమునకు నుపద్రవము కలిగించినవాఁడు, విధిహితముగన్=శాస్త్రమునఁ జెప్పఁబడినట్లు, శాస్త్రమునందు విశ్వాసము గౌరవము లేనివానికి శాస్త్రీయకర్మ మేల? సంస్కృతికిన్=శాస్త్రోక్త సంస్కారమునకు, కట్టిఁడి=మర్యాద హీనుఁడు, కట్టు+ఇఁడి=నియమహీనుఁడు.

తాత్పర్యము

ధర్మప్రవర్తనము వదలినవాఁడు, దయలేని చోరుఁడు, అసత్యవాది, పాపపు మనస్సు గలవాఁడు, ఇతర స్త్రీల బాధించినవాఁడు, వానికి నన్నయేకాని నడవడి యందు నాకు గొప్ప శత్రువు అహితకార్యము లన్నియు జేయుటయందుఁ బ్రీతి గలవాఁడు, ప్రపంచమున కుపద్రవము కలిగించిన వాఁడు, ఇట్టి వీనికా యిప్పుడు నేను శాస్త్రప్రకారము సంస్కారములు చేయవలయును. నేనాపని చేయలేను, అన్నగదా యందువేమో? అన్నయని లౌకిక గౌరవములు చూపుదును గాని పారలౌకిక కర్మములకు వీఁ డర్హుఁడుగాఁడు. నేను వీని కుత్తరక్రియలు చేయకున్న నన్నిపుడెవ్వరు శాస్త్రనియమము మీఱినవాఁడని తిట్టుదురో వారే వీని నడవడి తెలిసిన పిమ్మట విభీషణుఁడు సరియైన పనియే చేసినాఁడు, పతితునకు శాస్త్రీయ సంస్కారము లెక్కఁడ నని నేను జేసినది సరియని మెచ్చుకొందురు.

కం. అనవుడు నాతనిపలుకులు, విని పరమప్రీతి ధర్మ • భృద్వర్యుఁడును వా
క్యనిపుణుఁ డగు సీతాపతి, చనవున నొడికారి యసుర•సత్తము ననియెన్.

అర్థములు. పరమప్రీతిన్ = మిక్కిలి ప్రీతితో, పరమ్+అప్రీతి = చచ్చిన తరువాతఁ గూడ వీఁడు పగ సాధించెద ననుచున్నాఁడే, వీఁడు సంహరింప కుండిన పరలోకమున వాని కెంతకీడో, ఆకారణమునఁ దన కెంతకీడో యాలోచింపలే కున్నాఁడే యని మిగుల నప్రీతిచే, ధర్మభృత్ =(౧) విల్లునుపట్టెడివారి,(౨) ధర్మమును ధరించు వారియందు, వర్యుఁడు=శ్రేష్ఠుఁడు, వాక్యనిపుణుఁడు = మాటల యందు నేర్పరి, నొడికారి=మాటలు చెప్పుటయందు సమర్థుఁడు.

తాత్పర్యము

అని చెప్పఁగా నా పలుకులు విని యతని యందుఁ బ్రీతియుఁ జచ్చిన వాని మీఁదఁ బగసాధింపఁ బూనె నని యప్రీతియుఁ గలవాఁడై ధర్మమును (వింటిని, ధర్మమును) ధరించువారియందు శ్రేష్ఠుఁడును మాటలయందు చమత్కారము గల రాముఁడు చనవుచే మాటలు చెప్ప సమర్థుఁడగు విభీషణున కిట్లనెను. ఇరువురు మాటలయందు సమర్థులు. విభీషణుఁడు రావణుఁడు సంస్కారార్హుఁడు కాఁడను టకు నెన్ని చెప్పవలయునో యన్నియు యుక్తియుక్తముగఁ జెప్పుచున్నాఁడు. రామచంద్రమూర్తియు దాని ప్రత్యాఖ్యానము చేయుచున్నాఁడు.

కం. నాకుం బ్రియ మగు కార్యము, నీకుం దగుఁ జేయ జయము • నీమహిమను గా
దే కలిగె నాకుఁ గావున, నీకు హితము నేను జెప్ప•నెఱి యసురేంద్రా !

నాకుం బ్రియమగు కార్యము — అనుటచే నేను రావణుని సంస్కరించిన రామునకప్రియ మగునేమో యను సందేహము నివర్తించెను. 'నీకు హితము నేను జెప్ప నెఱి'—అనుటచే నీమేలు కోరి నేను జెప్పుచున్నా ననుటచే భయమువదలెను.

తాత్పర్యము

విభీషణా! నీకు బ్రియము గాని యప్రియముకాని నేను జెప్పినది వినుము. ఆ ప్రకారము చేయుట నీకుఁదగిన కార్యము. నా మాట ధిక్కరించుట నీకుఁదగదు. నేను జేయరాని పని చేయుమని చెప్పిన నే నట్లు చేయుదు వందువేమో? ఈ యుద్ధమందు నీవు చేసిన సాహాయ్యమువలన నాకు జయముకలిగెను. నాకిట్టి మేలుచేసిన నీకు హితమైనది జెప్పుట నీతి. కావున నాకుఁ బ్రియమో యప్రియమో యని నీవాలోచింపరాదు. నాకుఁ బ్రియమని నీ కహితమైనది నేను జెప్పరాదు. కావున నీ మేలుగోరి నేను జెప్పినట్లు చేయుము.

చ. ఎఱుఁగుదు నే, నధర్మమున • కేమియుఁ గొంకక, డసత్యమాడఁగన్
వెఱవఁడు. రాక్షసేంద్రుఁ డవి • నీతి, యుఁడైనను వీర్యవంతుఁడున్
నెఱసరి తేజ వాఁడు సుర • నేతృముఖాదుల చేతనైన నో
టఱఁ డని లోకరావణుఁ డ • హార్యసుధీరుఁడు కేవలుం డొకో. ౨౫౮౦

### తాత్పర్యము

రావణుఁడు సంస్కారార్హుఁడు గాఁడు, పతితుఁ డనుటకు నీవు చెప్పిన కారణములు నేను దప్పనను, అవి నే నెఱుఁగనివాఁడనుగాను. అతఁడు అధర్మమునకు భయపడఁడని అసత్యవాదియని నీతిమాలినవాఁడని నే నెఱుఁగుదును. తెలిసియె నీకు వానిని సంస్కరింపుమని చెప్పితిని. ఏల చెప్పితివందువా? పతితునకుఁ బరలోక క్రియలు లేవనుట లోకసామాన్యవిధమునఁ జచ్చినవాని విషయమె కాని ధర్మ యుద్ధమందు న్యాయ్యరీతిఁ జచ్చిన వీరునివిషయము కాదు. వాఁడు బలశాలి, శూరుఁడు, తేజస్వి, ఇంద్రాదులకైన వెనుదీయువాఁడు కాఁడు. అట్టి లోకరావణుఁడు పర్వతమువంటి ధైర్యశాలి, సామాన్యుఁడా, యుద్ధమందుఁ జచ్చెను. వీరస్వర్గము వానికి లభింపవలయును. నీవు వానికి సంస్కారము చేయకున్నఁ బ్రేతత్వము పోదు. ప్రేతత్వము పోకున్న స్వర్గప్రాప్తి లేదు. వాఁడు కష్టపడి సంపాదించిన స్వర్గసుఖమును సంస్కరింపని నీవు విఘ్నపఱుచుటేగాక ప్రేతత్వబాధ కలిగించినవాఁడ వగుదువు. అది నీకు శ్రేయస్కరముకాదు. చచ్చినవానిని బ్రీతి గలవాఁడుకదా సంస్కరింపవలెను. వానియందు నాకుఁ బ్రీతిలేదు. నాయందు వానికిఁ బ్రీతిలేదు. ప్రీతి లేకుండుటే గాక యిరువురము విరోధుల మందువేమో.

కం. వైరము మరణాంతము మన, కారియముల్ దీరె మీఁది • కార్యంబుల సం
స్కారాదులఁ దీర్పుము నీ, కారయ నితఁ డెట్టివాఁడొ • యట్టేఁడ నాకున్.

• చూ. పద్యము ౨౫౦౬. తాత్పర్యము

ఆ పద్యమునే మరలఁ జెప్పనేల యనిన అప్పుడు నేనిచ్ఛకములకై నీకుఁ జెప్పలేదు. పరమార్థబుద్ధితోఁ జెప్పితిని. ఆ మాటలే యిప్పుడు చెప్పెదను. నా యభిప్రాయము మార్చుకొనఁ గారణము లేదు. అప్పుడు నే నే యభిప్రాయముతోఁ జెప్పితినో యని సందేహింపఁ నీకుఁ గారణములేదని తెలుపుటకే.

కం. కావునఁ బంక్తిగ్రీవుఁడు, నీవలనన్ విధిహితముగ • నిఖిలక్రియలన్
గోవిద! యందఁగ నర్హుఁడు, పావనయశమబ్బు నీకు • భావింపు మిదన్.

అర్థములు. విధిహితముగన్ = శాస్త్రప్రకారము, ఎంత పాపాత్ముఁడైనను వీరరణమునఁ జచ్చినవానికి వీరస్వర్గము కలదు. కావున వాఁడు సంస్కారార్హుఁడు 'రావణునివంటి పాపికి విరోధికి సంస్కారములు చేసినాఁడు, విభీషణుఁ డెంత సాధు'వను కీర్తి నీకుఁ గలుగును. కాని అపకీర్తి రాదు.

### —• విభీషణుఁడు రావణునకు దహనాదిక్రియలు దీర్చుట •—

సీ. అనుడు విభీషణుఁ డా మాట లాలించి, సంస్కారమునకయి • జతనపడుచుఁ
జందనకాష్ఠసం • చయములఁ జితిఁ జేర్చి, పద్మకోశీరము • లుపఱచి మీఁద
శాస్త్రోక్తముగ రంకు • చర్మంబు పైఁ గప్పి, పశ్చిమవిధు లెల్లఁ • బరఁగఁ జేసి
పితృమేధ మెల్లను • విధ్యుక్తముగఁ జల్పి, చితికి నాగ్నేయంపు • క్షితిని వేది

తే. సమరఁజేసి యథాస్థాన•మందు నిల్పి, వహ్నిఁ బృషదాజ్యపూర్ణ స్రు•వంబు వైచి
చరణముల యొద్దశకటంబు•సరగఁ దోడల; యొద్దనుంచిరి యా రాక్ష•సోత్తము నకు

అర్థములు. జతనపడుచు = యత్నము చేయుచు, యత్నశబ్దభవము జతనము, చందనకాష్ఠ సంచయములన్ = శ్రీగంధపుఁ జెక్కల సమూహముతో, పద్మకోశీరముల్ = పద్మక + ఉశీరములు = పద్మకాష్ఠ మను నోషధి, వట్టివేరు, రంకు చర్మము = తెల్లని వెంట్రుకలు, మెత్తని చర్మముఁగల యిఱ్ఱియొక్క చర్మమును, పశ్చిమ విధులు = అంతిమేష్టి లోనైనవి, విధ్యుక్తముగ = వేదోక్త ప్రకారము, పృషదాజ్యపూర్ణ స్రువంబు = - పృషదాజ్యము = పెరుగుతో గలిసిన నేయి, 'పృషదాజ్యం సదధ్యాజ్య' మ్మని యమరము. దానిచే నిండిన, స్రువము = హోమ పాత్రము, సరగన్ = లోటిని.

## తాత్పర్యము

రామచంద్రమూర్తి చెప్పిన యీ మాటలు విని సంస్కరించుటకయి ప్రయత్నముచేసి కావలసిన పదార్థముల నెల్లఁ దెప్పించి స్త్రీలనెల్ల నావల నుండఁ జేసి శ్రీ గంధపుఁ గట్టెలతో సొదపేర్చి దానిమీఁద పద్మకము, వట్టివేరు పఱచి, శాస్త్రమునఁ జెప్పినట్లు తెల్ల వెంట్రుకల యిఱ్ఱి చర్మము మీఁదఁగప్పి యంతిమేష్టి గావించి వేదము నందుఁ జెప్పిన ప్రకారము పితృమేధమంతయు నెరవేర్పఁబడెను. ఇట్లు సంగ్రహముగఁ జెప్పిన దానిని వివరించి చెప్పుచున్నాఁడు. ఋత్విజులు చితికి నాగ్నేయ భాగమునందు వేది సమర్చి, యందు బడమట గార్హపత్యము, తూర్పున నాహవనీయము, దక్షిణమున దక్షిణాగ్నిని నీ ప్రకారము దాని దాని స్థానమునందు దాని దానిని వరుసగా మూఁడగ్నుల నిలిపిరి. ఆవలఁ బెరుగు నెయ్యి కలసిన దానిని హోమపాత్రమున నిండించి యా పాత్రమును ప్రతిపత్తికై యందఱు చితియందు వైచిరి, ఆవల రావణునిపాదముల దగ్గఱ సోమరాజును దెచ్చుశకటమును కొడలవడుమ యజ్ఞము కొఱకు వర్తుకించు లోటిని నిలిపిరి.

సీ. అరణియు దారుపాత్రాళియు నుత్తరా, రణి యన్యముసలంబు • క్రమముగాఁగఁ
ద త్తత్స్థలంబులఁ • దగ నిల్పి ఋష్యుక్త, పద్ధతి మేధ్యంపుఁ • బశువు జంపి
చితి యొద్ద వేలిచి • ఘృతసిక్తదర్భలఁ, బఱచి కస్సిధిలు • పాఱుమండ
దశకంఠుమాల్యగం•ధంబులఁ గైసేసి, వస్త్రంబుఁ గప్పి యా • వారు చితిని

తే. బోరుగులను జల్లిరంతటఁ•బొక్కుమది వి, ధిమణుం డగ్నినిచ్చి యా•విదపమునిఁగి
యార్ద్రవస్త్రంబులో డదూ•ర్వాభిమిశ్ర, తిలలునీళ్ళును విడిచెను•ధీరతుండు.

అర్థములు. అరణి = అగ్ని మథించుకట్టె, దారుపాత్రాళియు = కొయ్య పాత్రములు, ఉత్తరారణి = నిప్పు మథించు రెంటిలో మీఁది కట్టెను, ముసలంబు = రోఁకలి, తత్ + తత్ + స్థలంబులన్ = ఏదేది యెచ్చట నుంచవలెనో యచ్చట ఋషి + ఉక్త + పద్ధతిన్ = స్మృతులందుఁ జెప్పఁబడిన ప్రకారము, మేధ్యంపుఁ

పశువున్=పవిత్రమైన ఛాగపశువును (మేఁకను) జంపి, ఘృతసిక్త దర్భలన్=నేతితోఁ దడిసిన దర్భలను, మాల్య గంధంబులన్=పూలదండల చేతను, చందనము చేతను, కైసేసి=అలంకరించి, ఔ వారు=బంధువులు, ఆర్ద్రవస్త్రంబుతోన్=తడిగుడ్డతో, దూర్వాభిమిశ్రితిలలు=లేఁత పచ్చిక కొనలతోఁ గలిసిన నూవులు, సుధీరతుండు=మంచి మనస్సు గలవాఁడు, పూర్వపు ద్వేషబుద్ధి గలవాఁడు గాక శ్రద్ధతోఁ గూడినవాఁడు, శ్రద్ధతోఁ జేయఁబడినది కదా శ్రాద్ధము.

తాత్పర్యము

అరణిని, కొయ్య పాత్రలను, ఉత్తరారణిని, రోఁకలిని - వీనిని వరుసగ దేనిదేనిని యెందెందుంచవలయునో యందందుంచి స్మృతులందుఁ జెప్పఁబడిన ప్రకారము పవిత్రమైన ఛాగపశువును జంపి చితిసమీపమందు హోమముచేసి దర్భలను నేతిలోఁ దడిపి చితిమీఁదఁ బఱచిరి. ఆవల వారు కన్నీరు కాఱుచుండ రావణశవమును పూలదండలతోను గంధముతోను నలంకరించి మీఁద వస్త్రమును గప్పిరి. తరువాత కావలసినవారు చితిమీఁద పేలాలను జల్లిరి. అవల దుఃఖపడుచు విభీషణుఁ డగ్నినిచ్చెను. ఇట్లగ్నినిచ్చి స్నానముచేసి తడిబట్టలతో దూర్వములతోఁ గలసిన నూవులు నీళ్ళు తీసికొని తర్పణము గావించెను.

కం. ఉదకంబు లిచ్చి మ్రొక్కుచుఁ, బదపడి యారార్చి సతులఁ • బనిచి నగరికిన్
సదమలమతిఁ జని వినయా,స్పదగతి శ్రీరామవిభుని • సన్నిధి నిలిచెన్. ౧౧౫

తాత్పర్యము

ఈ ప్రకారము నీళ్ళు విడిచి నమస్కరించి యావల నాఁడువా రుండు చోటికి వచ్చి వారికి సమాధానము చెప్పి వారి నందఱ నూరిలోనికిఁ బంపి నిర్మలమనస్సుతో విభీషణుఁడు సవినయముగ రామచంద్రమూర్తి సన్నిధి నిలిచెను.

ఇది యంతయుఁ జైత్రశుద్ధమునఁ బాడ్యమినాఁటి చర్య.

కం. రాముఁడు సహాసైన్యుం డై, సౌమిత్రియు భానుసుతుఁడు • సంసేవింపన్
భీమబలు వృత్రుఁ జంపిన, భూమీధ్రవైరివోలెఁ • బోలుచునుండెన్. ౧౧౬

అర్థములు. సహసైన్యుండై=సేనతోఁ గూడినవాఁడై, భీమబలున్=భయంకర బలముగలవానిని, భూమీధ్రవైరివోలెన్=ఇంద్రునివలె.

తాత్పర్యము స్పష్టము.

—• { ౧౧౫-వ సర్గము. మాతలి శ్రీరామునిచే ననుజ్ఞాతుండై దివంబునకుఁ బోవుట. } •—

సీ. రావణవధమును • రామవిక్రమమును, రాక్షసవానర • రణవిధంబు
సౌమిత్రి వీర్యంబు • సౌభ్రాత్రగరిమంబు, మార్తండనందను • మంత్రితంబుఁ
గథలుగాఁ జెప్పుచుఁ • గలను వీక్షింపఁగ, వచ్చినదానవా • స్వర్ణచయము
మరలి పోవౌను హర్ష • భరమున నంతట, రాముండు మాతలిఁ • బ్రేమ బొగడి

ఆ. యనుమతించె రథము•హరిహయుకడకును, మరలఁ గొంచుఁబోవ•మాతలియును
నట్లు సలిపె నంత • నర్కజుఁ గౌఁగిటఁ, గ్రుచ్చి లక్ష్మణుండు•గూర్మిఁ దెలుప.

అర్థములు. సౌభ్రాత్రగరిమంబు = అన్నదమ్ముల ప్రీతి యతిశయమును మంత్రితంబు=ఆలోచన విధము, అస్వప్నచయము= దేవతల సమూహము.

తాత్పర్యము

యుద్ధమును జూడవచ్చిన దానవులు దేవతలు రావణుని జంపినవిధము, రామచంద్రమూర్తి పరాక్రమము, రాక్షసులు వానరులు యుద్ధముచేసిన తీరు, లక్ష్మణుని బలము, అన్నదమ్ములకుఁ గల భ్రాతృ వాత్సల్యాతిశయము, సుగ్రీవుఁడు చేయుచుండిన యాలోచన విధము, కథలుగాఁ జెప్పుచు సంతోషముతో మరలి వారి స్థానములకుఁ బోయిరి. తరువాత రామచంద్రమూర్తి మాతలికిఁ దనయందుఁ గల ప్రేమ పొగడి యిఁక నీవు రథము తీసికొని యింద్రునియొద్దకుఁ బొమ్మని సెలవీయఁగా నాయన వెడలిపోయెను. అంత సుగ్రీవునిఁ గౌఁగిలించుకొని రామచంద్రమూర్తి లక్ష్మణుఁడు బోధింపఁగా.

తే. అఖిలకపిసేన గొల్వ బ • లాలయంబుఁ, జేరి పరిసరతలవర్తి • సారకీర్తి
దివ్యకాంతి స్ఫురన్మూర్తి • భవ్యచరితు, లక్ష్మణు సుమిత్రపట్టిని•లలితగతిని.

అర్థములు. బలాలయంబు = సేనలు విడిసిన చోటును, పరిసరతలవర్తి= ప్రక్కనే యుండువానిని, సారకీర్తి = దృఢమైన కీర్తి సంపాదించినవానిని, దివ్యకాంతిస్ఫురన్మూర్తి = దేవతల తేజస్సుతోఁ బ్రకాశించు నాకారము గలవానిని, భవ్యచరితున్ = శుభకరమైన నడవడి గలవానిని, సుమిత్రపట్టిని = సుమిత్రా దేవి చెప్పినప్రకారము తన్ను వినయ విధేయతలతో సేవించినవానిని, "ఈతండె గతి నీకు నెల్లెడ ధర్మంబు, జ్యేష్ఠానువర్తివై చెలఁగుచుంట, పుత్రక! సనాతనంబైన పుణ్యవృత్త, మీకులంబున విదియుసుమ్మీ తలంప, దానమును యజ్ఞదీక్ష యుద్ధమువృతి" యని కదా బోధించి పంపెను, లలితగతిని=మనోహరమైనరీతిగా.

తాత్పర్యము

సమస్త వానరసేన సేవింపఁగా, సేనలు విడిసినచోటికిఁబోయి, తనప్రక్కనున్నట్టియు యుద్ధమునందు నడవడియందు మంచికీర్తి సంపాదించినట్టియు అన్న యుద్ధమందు జయించెగదాయని యత్యంత సంతోషముతో దివ్యకాంతితోఁ బ్రకాశించు నాకారముగలట్టియు తల్లి చెప్పినప్రకారము తన్ను వినయ విధేయతలతో సేవించుచు యుద్ధమునందుఁ దననిమిత్తమై ప్రాణమిచ్చినట్టియు లక్ష్మణుని.

## — • విభీషణ పట్టాభిషేకము • —

కం. చేరఁగ బిలిచి విభీషణుఁ, డారయ రక్తుండు భక్తుఁ • డత్యుపకృతి నా
కారఁ ఘటించెను గావునఁ, గోరెద నభిషిక్తుఁ జేయఁ • గొమరుగ లంకన్.

అర్థములు. రక్తుఁడు = అనురాగముగలవాఁడు, భక్తుండు = నా సేవ కోరువాఁడు, అత్యుపకృతి=మిక్కిలి యుపకారమును, అరసె =పూర్ణముగ, రక్తుఁడనుటచే మిత్రకృత్యము, భక్తుఁడనుటచే దాసకృత్యము చెప్పఁబడెను. రక్తిలేని భక్తి లేదు. రక్తి భక్తి గలవాఁడు వానిని గార్యమునఁ బరిణమింపఁజేయవలెను. శుష్కాలాపములు శూన్యహస్తములు రక్తిగల భక్తుల లక్షణముగాదు. కావున ఉపకారము చేసెనని చెప్పెను.

తాత్పర్యము

నాయనా! రమ్మని దగ్గఱకుఁ బిలిచి విభీషణుఁడు నాయందనురాగము గలవాఁడు, భక్తుఁడు, నాకు మిక్కిలి యుపకారము శక్తికొలఁది చేసినవాఁడు కావున నతని లంకయందు నభిషేకింపఁగోరెదను.

కం. పరమాభీష్టం బిది నా, కురుమతి నీ వరిగి దాని • నొనరింపు మనన్
నరభసముగ సమ్మదమునఁ, బురికిం జని కనకకలశ•ముల వేగమునన్. ౨౫౧౦

అర్థములు. పరమాభీష్టంబు = నాకుఁగల కోరికలలో నెపుడు విభీషణునికి బట్టాభిషేకము చేయుదునా యనునది గొప్పకోరిక, ఉరుమతి=గొప్ప మనస్సుతో, సరభసముగన్ = వేగముగ, సమ్మదమునన్ = సంతోషముతో, కనకకలశములన్ = బంగారు పాత్రముల.

పట్టాభిషేకము సముద్రతీరమున ముందే జరిగెనుగదా. ఇప్పుడు మరల నేల?

ఇదివఱకుఁ జేసినది తాంత్రికము. అది రాక్షసు లెవ్వరు నెఱుంగరు. కావున సింహాసనమునఁ గూర్చుండబెట్టి, అందఱు రాక్షసులు చూచుచుండగా యథావిధి చేయుట ప్రశస్తమని చేయవలసివచ్చెను.

తాత్పర్యము

ఇది నామనస్సునఁగల గొప్ప కోరిక. దీనిని నీవు గొప్ప మనస్సుచే నెఱవేర్పు రమ్ము అని చెప్పగాఁ సంతోషముతో వేగముగఁ బురములోనికిపోయి బంగారు పాత్రములను త్వరగా

సీ. కొనిపోయి కీశులు • వననిధిజలములఁ, దెం డన్న వారలు • తెచ్చుటయును
నం దొండు దాఁ గొని • యర్హోత్త మాసనం,బున విభీషణు నిల్పి•బుధవిరోధి
మధ్యంబునందు స•మంత్రికంబుగ నభి,షిక్తునిఁ గావింపఁ • జెలఁగి యుతేఁడు
ప్రకృతిజనంబులఁ • బ్రమదంబునను దేల్చి, సచివవర్గంబులు • సంతసింప
ఆ. రామదత్తమైన • రాజ్యంబుఁ గైకొని, యసురముఖ్యు లిచ్చు • నక్షతలును
మోదకములు బుష్ప•ములు లాజలును గొని, భద్రకరములైన • వస్తువులను.

అర్థములు. బుధవిరోధి మధ్యంబునందు=రాక్షసులనడుమ, మోదకములు= లడ్డువాలు, లాజలు=పేలాలు, యుద్ధమునందుఁ జచ్చిన వారికై యాశౌచ ముండఁ బనిలేదు.

## తాత్పర్యము

తీసికొనిపోయి సముద్రజలము తెండని పంపి వారు తీసికొని రాఁగా నందొకటి తాను దీసికొని రాజయోగ్యమైనయుత్తమసింహాసనమున నాయనను గూర్చుండ బెట్టి రాక్షసు లందఱుఁ జూచుచుండ వారి నడుమ మంత్రయుక్తముగ నభిషిక్తుని గావించెను. విభీషణుఁడును సంతోషించి పురజనుల నధికారులను సంతోషింపఁజేసి మంత్రులు సంతోషింపఁగా రామచంద్రమూర్తి యిచ్చిన రాజ్యంబు గ్రహించి శ్రేష్ఠులగు రాక్షసు లాశీర్వదించి యిచ్చిన యక్షతలను లడ్డువములను పుష్పములను పేలాలను గ్రహించి శుభకరములైన వస్తువులు దీసికొని.

చ. కొని రఘురాముఁ జేరఁ జని • కూరిమి వానిని వారి కిచ్చినన్
గని కృతకార్యు శ్రీ కలితు • గాదిలిమిత్రముఁ బొంగి యన్నియుం
గొని యతఁ డుల్లసిల్లఁగ స•మంచిత భక్తిని నొద్ద నున్న యా
హనుమను జూచి యిట్లనియె • నాశుగనందన యిట్లొనర్పుమా. ౨౬౦౦

అర్థములు. కృతకార్యుని = చేయఁబడిన కార్యముగలవానిని, రామాజ్ఞ నెఱవేర్పవలసినది తనకు విధి గావున పట్టాభిషేక మంగీకరించినవానిని- దీనివలన విభీషణుఁడు కామముచే రాజ్య మంగీకరింపలేదనియు రామాజ్ఞ మీఱరానిది కావున నంగీకరించెననియు భావము.

పొంగి= సంతోషముచే నుప్పొంగి, ఇట్లనుటచే నింతవఱకు నీ సేవ నాకుఁ గావలయును గాని రాజ్య మెవరికిఁ గావలెను? నాకు వలదనునేమో ? ఇంతటి వానికి నే నేమి మేలు చేసినట్టు అని క్రుంగినవాఁడు,ఇప్పుడు శ్రీకలితుని విభీషణుఁ జూచి పొంగెనని భావము. ఆశుగనందన = వాయుతనయ, ఇది శీఘ్ర గమనమును సూచించును.

## తాత్పర్యము

రామచంద్రుఁ డొద్దకు వచ్చి సమర్పింపఁగా నాయన సంతోషముతో తాను జెప్పిన కార్యము చేసినవానిని ఐశ్వర్యముతోఁ గూడిన వానిని, ప్రేమగల స్నేహితునిఁ జూచి పొంగి యన్ని గ్రహించి యతఁడు సంతోషింపఁగాఁ దన సమీపమందున్న హనుమంతునిఁ జూచి హనుమంతా యని పిలిచి నీ విట్లు సేయుము.

### —• శ్రీరాముఁడు హనుమంతుని సీతాదేవి యొద్దకుఁ బంపుట •—

సీ. చనుము విభీషణు • సమ్మతి నాలంక, కందు రావణగృహ • మందు నున్న
పృథ్వీజఁ బొడఁగని • విజయవార్త వచించి, మిత్రతనూజ సౌ • మిత్రియుక్తి
నేను సేమం బని • యింద్రారి రావణు, నే జయించినమాట • నెఱుక పఱచి
సంతసింపఁగఁ జేసి • జలజాక్షి సందేశ మును గొని చనుదేర • మనఘయనిన
ఆ. రామునాజ్ఞ తనకు • రంబున వహియించి, యసురులెల్లఁ దన్ను • నాదరింపఁ
బంక్తికంఠువేశ్మ•వాటిఁ బ్రవేశించి హర్షహీన యగుచు•నడలుదాని. ౨౬౦౧

అర్థములు. విభీషణు సమ్మతిపై = విభీషణు నంగీకారము తీసికొని, ఇదివఱకుఁ బోయినట్లు దొంగతనముగాఁ గాదని భావము అప్పుడు శత్రుక్షేత్రము, ఇప్పుడు మిత్రక్షేత్రము. కావున మిత్రు ననుమతి లేక యతని యంతఃపురమునకుఁ బోరాదు. సందేశమును = వార్తను, అసురులెల్లఁ దన్ను నాదరింపన్ = ఇదివఱకు పోయినప్పుడు ధిక్కరించినట్లుగాక ప్రీతితో రమ్మని వారే పిలుచుకొనిపోయి రని భావము. వేశ్మవాఁటి=గృహప్రదేశము, హర్షహీన=సంతోషము లేనిది.

తాత్పర్యము

ఆంజనేయా! విభీషణు ననుమతి తీసికొని లంకకుఁబోయి యందు రావణునింట నున్న సీతాదేవిని యుద్ధమందు నేను గెలిచిన వృత్తాంతముఁ దెలిపి సుగ్రీవుతోడను లక్ష్మణునితోడను నేను క్షేమముగా నున్నాననియు రావణుని నేను జయించితిననియు తెలిపి సంతోషపఱిచి మరల నామె యేమి ప్రత్యుత్తర మిచ్చునో తెలిసికొని రమ్ము అని చెప్పఁగా రామాజ్ఞను శిరసావహించి రాక్షసు లందఱుఁ దన్ను నాదరింపఁగా రావణు నింటిలోఁ బ్రవేశించి సంతోషములేక దుఃఖించుచున్న దానిని.

**—• ౧౧౬-వ సర్గము. హనుమంతుఁడు సీతాదేవికి విజయవార్తఁ దెలుపుట •—**

కం. సాతంకరోహిణీగతిఁ, జేతస్సుఖహీన యగుచుఁ • జెలువతి రక్షః
స్త్రీతతిపరివృత యగు భూ,జాతన్ భూజాతమూల•సంస్థం గనుచున్. ౨౬౦౨

అర్థములు. సాతంక రోహిణీగతిన్ = గ్రహపీడాభయముతోఁ గూడిన రోహిణివలె, చేతస్సుఖహీన=మనసున సుఖమనునది లేనిది, పరివృత=చుట్టుకొనఁబడినది, భూజాతన్=సీతను, భూజాతమూలసంస్థన్=చెట్టు మొదట నున్న దానిని.

తాత్పర్యము

భయముతోఁ గూడిన రోహిణివలె మనస్సున సుఖములేక యందము చెడి రాక్షసస్త్రీలు చుట్టుకొన చెట్టుమొదటఁ గూర్చుండిన సీతను జూచెను.

కం. వినయమున వఁగి మఁగియుఁ, జని తనపేర్వాడి భక్తి • సాష్టాంగముగా
వినతుల్ లొనర్చి యచంచల, తనుఁడై నిలఁబడిన వాయు•తనయుం గనుచున్.

తాత్పర్యము

అణఁకువచే దేహము ముడుచుకొని విజృంభణము మానిపోయి తన పేరు చెప్పి సాష్టాంగముగ సాగిలఁబడి నమస్కారములుచేసి త్రికరణముల కదలక మెదలక నిలువఁబడిన వాయుపుత్రునిఁ జూచి.

వాయుతనయుఁ డనుటచే శ్రీరామచంద్రమూర్తి చెప్పినట్లు త్వరగా కార్యము చేసెనని భావము.

కం. స్మరియించి యతని కృత్యముఁ, బరమానందమున సీత • పలుకక యున్నన్
ధరణిజ సౌమ్యాననముం,బరికించి ప్లవంగవరుఁడు•పలుకం దొడఁగెన్. ౨౬౦౪

తాత్పర్యము

ఇదివఱ కతఁడు వచ్చినపుడు చేసిన కార్య మంతయు జ్ఞప్తికిఁ దెచ్చుకొని

మిక్కిలి సంతోషపడి సంతోషాతిశయమున పలుకలేక యుండఁగా సీతాదేవి యొక్క సుప్రసన్నమైన ముఖముఁజూచి హనుమంతుఁ డిట్లు చెప్ప నారంభించెను.

కం. అమ్మా! మైథిలి! గాదిలి, తమ్మునితో సంబుజాప్త • తనయునితో సై
న్యమ్ములతో రావణుఁ బిన,తమ్మునితో రామవిభుఁడు•తనరుఁ గుశలియై. ౨౬౦౫

తాత్పర్యము స్పష్టము

కం. సీతాసాధ్వీమణి! నీ,చేతఃపతి యరుల గెలిచి • సిద్ధార్థుండై
ప్రీతిని దన కుశలంబును, మాతా! నీతోడఁ జెప్పుమా•యని పనిచెన్. ౨౬౦౬

తాత్పర్యము

ప్రతివ్రతారత్నమవైన సీతాదేవీ! నీ మగఁడు శత్రువుల గెలిచి కార్యము సాధించి సంతోషపడి తన క్షేమవార్త నీకుఁ జెప్పుమని నన్నుఁ బంపెను.

కం. బాసటగాఁగ విభీషణుఁ, డోసతి! నీపతి ప్లవంగ • మోత్తమతతితో
శ్రీసౌమిత్రితనయుచేఁ, దా సమరమునందుఁ గూల్చె•దశకంధరునిన్. ౨౬౦౭

అర్థములు. బాసట=సహాయుఁడు.

తాత్పర్యము

ప్రతివ్రతామణీ! నీమగఁడు సౌమిత్రి నీతిచేతను విభీషణుఁడు సహాయపడఁగను వానరసేనతో రావణాసురుని యుద్ధమందుఁ జంపెను.

కం. రచితాద్భుతకార్యుఁ డ,సంకుచితపరాక్రముఁడు నీదు • కుశల మడుగుచున్
వచియింపుమనుచుఁ జెప్పిన,వచనంబులు వినుము కర్ణ•పర్వంబులుగాన్. ౨౬౦౮

అర్థములు. రచిత+అద్భుతకార్యుఁడు=ఆశ్చర్యకరమైన కార్యము చేసినవాఁడు, అసంకుచితపరాక్రముఁడు = విస్తరించిన పరాక్రమము గలవాఁడు, కర్ణపర్వంబులుగన్ = చెవులపండువుగా.

తాత్పర్యము

తన పరాక్రమము వికాసము నొందఁజేసి యద్భుతకార్య మొనర్చిన రామచంద్రమూర్తి నీ క్షేమము విచారించి నీతో సంతోషకరములైన కొన్నిమాటలు చెప్పుమనెను. చెప్పెదను. వీనులవిందుగా వినుము. ఏమి చెప్పునోయని భయపడు నేమోయని సంతోషవార్తయే యని ముందుగానే చెప్పెను.

సీ. ప్రియముఁజెప్పెద దేవి•వినుము నీ కనురక్తుఁడను జుమ్మి మిక్కిలి • వనజనేత్ర
మద్భాగ్యవశమున • మనియున్న దానవు, మత్పరాక్రమమున•మనకు జయము
ధర్మవేదిని గల్గెఁ • దలఁగి దుఃఖంబును, స్వస్థచిత్తవుగమ్ము • జనకతనయ!
హతుఁడయ్యె రావణుం•డఖిల లంకాపురి,మనవశంబున నున్న•దనుచుఁ దలఁపు

ఆ. కన్నుమోడ్పులేక • కలికి నీకై చెలిఁ, బాపఁ బ్రతినచేసి • వార్ధియందు
సేతు వొకటిఁగట్టి • చేసితి బాసను. దీర్చుకొనఁగ గంటిఁ దియ్యఁబోణి. ౨౬౦౯

అర్థములు. నీ కనురక్తుఁడను=నీయందు అనురాగము కలవాఁడను, మద్భాగ్య

వశమున = నా యదృష్టము కారణమున, మనియున్న దానవు = బ్రదికియున్న దానవు, నేను నిర్భాగ్యుఁడనై యుండిన నీవు మరణించి యుందువని భావము. మమ కున్ =నీకు నాకు, నాజయము నీజయమే. నాభర్తయే రావలె, రావణునే చంపవలె నన్న నీమాటల గెలిచినది కదా. ధర్మవేదిని = పాతివ్రత్య ధర్మము తెలిసినదానా, స్వస్థచిత్తవు = కలఁతలేక కుదుటఁబడిన మనస్సు గల దానవు. ఇవి రామచంద్రుని వాక్యములు.

తాత్పర్యము

దేవీ! నీకుఁ బ్రియమైన దానిని జెప్పెద వినుము. నీ యందు మిగుల ప్రేమ గలవాఁడను. నా యదృష్టము కొలఁది నీవు బ్రదికి యున్న దానవు నా పరాక్రమము చేత మనకు జయము గలిగెను సతీధర్మము తెలిసినదానా! నీవు దుఃఖమును వదలుము. మనస్సునఁ గలఁక లేక దానిని కుదుటఁబడనిమ్ము. రావణాసురుఁడు చచ్చెను. లంక మన వశమున నున్నది. నిన్నుఁ జెఱనుండి విడిపించెద నని ప్రతిజ్ఞ చేసి యది నెఱవేఱు వఱకు నిద్దురగొనక సముద్రమున సేతువు నిర్మించి చేసిన ప్రతిజ్ఞను నెఱవేర్చుకొంటిని.

చ. అణుసమమధ్య ! రావణుగృహం బని భీతిలఁ బోకుమీ, విభీ
షణునకుఁ గైవసం బిపుడు • సర్వము లంక సమస్తలక్ష్మి, ధా
రిణిసుత ! స్వాలయంబునఁ జరించుగతిన్ మది నూఱడిల్లు మీ
క్షణమున నిన్నుఁ జూచు కుతుకాన విభీషణుఁ డేగుదెంచెడిన్. ౨౬-౧౦

అర్థములు. అణుసమమధ్య = అణువుతో సమానమైన సూక్ష్మమైన నడుము గలదానా, కైవసము=స్వాధీనము.

తాత్పర్యము

తనుమధ్యా! నీవు రావణు నింట నున్నదాన వని భయపడవలదు. లంకయు సర్వైశ్వర్యము విభీషణు స్వాధీనమం దున్నది. కావున నీ సొంతయింట నున్నట్లు నిర్భయముగ నిశ్చింతముగ నుండవచ్చును. క్షణకాలములో నిన్నుఁజూచు కోరికతో విభీషణుఁడు రాఁగలఁడు.

కం. అన రాకేందునిభానన, విని దిగ్గన లేచి నిలిచి • విగతక్రియయై
మునిగతి నుండఁగ సతి! యో,జన సేసెద వేల పలుకఁ•జాలవు నాతోన్? ౨౬-౧౧

అర్థములు. రాకేందునిభానన = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలది, విగతక్రియ=ఏ చేష్టయు లేక, మునిగతి = మౌనము వహించి యేదియో యాలోచించుదానివలె.

తాత్పర్యము

పదునాఱు కళలతోఁ గూడిన చంద్రునివంటి ముఖముగలదై సీతాదేవి తటాలున లేచి నిలఁబడెను గాని యేమియుఁ జేసినదికాదు. మాటలైన నేదియుఁ జెప్పినది కాదు. బొమ్మవలె నిలిచిన యామెనుజూచి హనుమంతుఁడు ఏమమ్మా! యేల నాతోఁ బలుకవు? ఏమి యాలోచన చేసెదవు?

—♦ సీతాదేవి హనుమంతుఁ బ్రశంసించుట ♦—

కం. అని హనుమంతుం డడిగిన, వినియమపర యిట్టులనియెఁ ♦ బ్రియమున హర్షం
బున గద్గదకంఠంబున, విను మౌనంబుకతము ♦ వినుతుఁ గపీంద్రా!౧౦౧౨

అర్థములు. వినియమపర = ధర్మనియతియం దాసక్తిగలది.

తాత్పర్యము

అని హనుమంతుఁ డడుగఁగా ధర్మనియతిగల సీతాదేవి ప్రియవాక్యము వినుటచేఁ గలిగిన సంతోషాతిశయమున గగ్గుపాటుగలదై డగ్గుత్తికతో నిట్లనియె. ఆంజనేయా ! నేను బలుకకుండిన కారణము చెప్పెద వినుము.

సీ. ప్రాణేశువిజయంబు ♦ భాషించు నీ ప్రియ, వాక్యముల్ విని వర ♦ వశతఁ జేసి
నిర్వాక్యనైతిని ♦ నిమిష మంజనపుత్ర!, మత్ప్రియంబు వచించు ♦ మాన్యవరుకు
సర్వోత్తు లేమని ♦ యందునా యని యెంతో, యోజించితినిగాని ♦ నొక్కఁడు లేద
యర్థవస్తువునైన ♦ వర్ణింతు నందునా, యీడైన దీ యిల ♦ నేది లేదు
ఆ. వివిధమణులు గాని ♦ విశ్వంబునం గల, వెండిగాని పైడి ♦ కొండగాని
యెల్లలోకములయు ♦ నేలికతనమైన, సాటిగాదు నిజము ♦ మాటకైన. ౨౭౧౩

తాత్పర్యము

ఆంజనేయా ! నా ప్రాణేశ్వరు గెలుపువార్త చెప్పుచున్న నీ సంతోషకర వాక్యములు విని నా దేహము నేను మఱచుటఁ జేసి నిమిషకాలము మాటలాడ నేరక పోయితిని. ఇదియొక కారణము; స్మృతివచ్చిన తరువాత నాకుఁ బ్రియములైన మాటలు చెప్పు పూజ్యునకు నేమిబదులు చెప్పుదునా యని యాలోచించితిని గాని నా కెంత సంతోషము నీవు గలిగించితివో, యంత సంతోషము నీకుఁ గలిగించు మాట యేదైనఁ జెప్ప నెంతో యాలోచించితిని గాని నాకుఁ దోచినది కాదు. నాకుఁ దోఁపకుండుట నా యజ్ఞానముచేతఁ గాదు. అట్టి మాటయే లేదు. మాట చెప్పకుండినఁ బోసి. ఏదైనఁ దగిన వస్తువు బహుమానముగా నియ్యఁదలఁచి యీ లోకమున నేది గలదని యాలోచించితిని. ఒక్కటియు సమానమైనదిగాఁ గనఁబడ లేదు. ఒక్కటిగఁ గాకున్నఁ జెక్కులు కలిపిన సరిపోవునేమో యని చూచితిని. లోకములో నుండు నన్ని రత్నములు, వెండికొండ, బంగారుకొండ, వేలువేలుగఁ గాని యన్ని కలిపినఁగాని సరిగాదని తోఁచెను, ఈ లోకముననఁ గాకున్న నితర లోకములం దున్నవేమో యని చూచితిని. అందును గానరాలేదు. ఇన్ని లోకముల యాధిపత్యమే (బ్రహ్మత్వమే) నీ కిచ్చినఁ జాలునేమో యని చూచితిని. అదియు జాలదనియే తోఁచెను. నే నావిరితో నున్నానని చెప్పినంత మాత్రమునకే నామగఁడు సంతోషించి నీ కీయందగినది యేదియు లేకుండుటచేఁ దన్నే నీకు సమర్పించుకొనెనని వింటిని; విజయరాముఁడనిన రెండుమాటల కదియు సరిగాదని నా యభిప్రాయము. ఇట్టు లాలోచించుచుండుటచే నీతో మాటలాడ నేరనైతిని.

శుష్కాలాపంబులందు శూన్యహస్తములందు మగని మించినది భార్య భార్యను మించినవాఁడు భర్త యని తోఁచును గాని సీతారాములట్టివారు గారని యనుభవజ్ఞు లెఱుఁగుదురు. నిర్మలమైన సీతారామసేవ వ్యర్థముగా నేనాఁటికిని బోదు. వారి నిగ్రహానుగ్రహములు రెండును సార్థకము లని ప్రమాణము చేసి చెప్పవచ్చును.

కం. నావుడుఁ బ్రాంజలి యగుచుం, బావని పతిహితముఁ గోరు•భవ్యచరిత్రా !
పావని! పతిజయకాంక్షిణి!, నీ వే తగుదమ్మ యిట్టి•స్నిగ్ధోక్తులకున్. ౨౬-౧౪

అర్థములు. పతిజయకాంక్షిణి = మగని గెలుపు గోరుదానా, స్నిగ్ధోక్తులకున్ = స్నేహముతోఁ గూడిన మాటలకు.

తాత్పర్యము స్పష్టము.

చ. పతివిజయంబు వాకొనిన•వాని కొసంగగ సర్వవస్తువీ
క్షితిఁ గనసంచు నర్మిలి వ•చించిన పల్కది స్నేహపూర్ణమై
యతులితసారయుక్తమయి • యన్నివిధంబుల దివ్యసన్మణీ
వితతులకంటె నా విబుధ•విశ్రుతరాజ్యముకంటె మిన్నయా. ౨౬-౧౫

అర్థములు. వాకొనిన వానికి=చెప్పినవానికి, అర్మిలిన్=ప్రేమతో, అతులిత సారయుక్తము = అసమానమైన స్థిరాంశము గలది, దివ్యసన్మణీ వితతుల కంటెన్=దేవతా సంబంధమైన చింతామణిలోనగు రత్నములకంటె, విబుధ విశ్రుత రాజ్యముకంటెన్=దేవతల ప్రసిద్ధ రాజ్యముకంటెఁ, మిన్నయా=శ్రేష్ఠమైనదగును. ఆంజనేయుఁడు ప్రతిఫలకాంక్షచే దాస్యముచేసిన వాఁడు కాఁడు. భగవంతుఁడు సంతోషించునట్లు దాస్యము చేయుటయే దాసుని కార్యము. ఆ ప్రకారము చేసిన వాఁడు హనుమంతుఁడు. క్షుద్రములయిన రత్నములు లోనైన నశ్వరపదార్థము లాయనకేల ?

తాత్పర్యము

మగని గెలుపుచెప్పిన వానికి నీయఁదగిన పదార్థము లేదని ప్రేమతోఁ జెప్పితివి. ఆ మాటయే స్నేహముచే నిండినదై అసమాన సారవంతమై యెన్నివిధములఁజూచి నను దేవతారత్నసమూహముల కంటె స్వర్గలోక ప్రభుత్వము కంటె శ్రేష్ఠమై యున్నది. ఏలన నవి యన్నియు నశ్వరములు. కొంతకాలముండి నశించునవి. నీ ప్రేమ యనునది యట్టిదిగాదు. దానియందుండుసారము వీని యన్నిటియందు లేదు. కావున నశ్వరమైన మీ యనుగ్రహము నాయందున్నది. నాకదియె చాలును. ఈ తుచ్ఛములైన యైహికములు నాకేవియు వలదు.

కం. హతశత్రుని విజయుని సుస్థితునిన్ శ్రీరాముఁ జూచి • దేవీ! యమర
క్షితిరాజ్యాదులకంటెను, నతిమాత్రోత్కర్ష మంది • యలరెద నేనున్.

అర్థములు. హతశత్రుని=శత్రువుల జంపిన వానిని, విజయుని = జయించిన వానిని, సుస్థితునిన్=మంచి స్థితిగలవానిని, అమర క్షితి రాజ్యాదుల కంటెను =

దేవలోక భూలోక ప్రభుత్వము లభ్భినదానికంటె; అతిమాత్రోత్కర్షము=మిగుల గొప్ప సంతోషమును, అలభద = సంతోషించెదను.

తాత్పర్యము

అమ్మా! యీ పదునాలుగులోకముల ప్రభుత్వము నీవు నాకీయఁదలఁచుట నన్ను సంతోషపెట్టుటకే కదా. వానిని బరిపాలించు కష్టమునకు లోనై యనుభవించు సంతోషమునకంటె నెంతో రెట్టింపు యానందము శత్రువుల చంపి జయమునొంది స్వస్థుండుగనుండు రామచంద్రమూర్తిని జూచుటచే నాకుఁగలిగినది. కావున నీ యుద్ధము త్రైలోక్యప్రభుత్వము నాకేల ?

కం. అని హనుమంతుఁడు పల్కఁన, జనకాత్మజ శుభతరోక్తి • సంపద వెలయన్
గనుఁగవ నానందాశ్రులు, చినుకఁగ నిట్లనియె బ్లవగ • శేఖరుతోడన్. ౨౬ ౧౭

అర్థములు. శుభతర+ఉక్తి=మిగుల శుభమైన మాట.

తాత్పర్యము స్పష్టము.

కం. అతిలక్షణసంపన్నం, బతిమాధుర్యగుణభూష • ణాంచితమును న
ష్టమిత మష్టాంగయుతం బగు, మతియొప్పఁగ నీవ నేర్తు • మాటాడంగన్.

అర్థములు. అతిలక్షణసంపన్నము=ఆకాంక్ష, యోగ్యత, సన్నిధిలోనగు వాక్యలక్షణము లేవిగలవో వాని యన్నిటిచే నిండినది, అనఁగా శబ్దసాధుత్వముతో నిండినది. దీనినే రామచంద్రమూర్తి "ఈతఁ డింతసేపు మాటలాడ నొక్కమాట యేనియు నపశబ్దితంబుగాదు" అనెను. కిష్కింధ ౧_౨౯.

అతిమాధుర్యగుణ భూషణాంచితము=మిక్కిలి తీపుగుణము నలంకారముచే నొప్పినది. దీనినే రామచంద్రమూర్తి "సంశ్రవే మధురం వాక్య"మ్మని చెప్పెను. మాధుర్యమనఁగా తేనెబిందువు నోటఁబడఁగానే తీపు తెలిసినట్లు విన్నమాత్రమునసే ఆనందము కలిగించు గుణము.

అష్టాంగయుతము = బుద్ధితోఁగూడినది, 'గ్రహణం ధారణంచైవ స్మరణం ప్రతిపాదనం, ఊహాపోహార్థ విజ్ఞానం తత్త్వజ్ఞానంచ ధీగుణాః'యని యష్టాంగ లక్షణము. గ్రహించుట, ధరించుట, స్మరించుట, బోధించుట, ఊహించుట, అపూర్వము నూహించుట, అర్థము తెలియుట, తత్త్వము తెలియుట నను నివి యష్టాంగములు.

పూర్వము రామచంద్రమూర్తి హనుమంతుని మెచ్చుకొనినట్లే యిప్పుడు సీతయు మెచ్చుకొనుచున్నది. దీనివలన సీతాదేవికి లక్షణజ్ఞాన మెంత తున్నమై యున్నదో తెలియనగు.

తాత్పర్యము

వాక్యలక్షణ సంపత్తి గలిగి మాధుర్యగుణముచే నలంకరింపఁబడి యష్టాంగయుక్తమైన బుద్ధితో మాటలాడ నీవే సమర్థుఁడవు.

చ. అనిలునకున్ సుతుండవు మహాత్మ! పరంబగు ధార్మికుండవున్
ఘనబల శౌర్య సత్త్వ శ్రుత • కాంతిపరాక్రమ ధీరతాక్షమా

వినయధృతి ప్రశస్తగుణ • విశ్రుత దాక్ష్యగుణాదులెల్ల నో
యనఘ ! త్వదాశ్రయంబున మహోరుచిసంపదఁ దాల్చి వెలిగెడిన్. ౨౮-౨౯

అర్థములు. మాటలాడుటయందేగాక గుణములందును హనుమంతుఁడు గొప్ప వాఁడని చెప్పుచున్నది, అనిలునకున్=జగత్తునకుఁ బ్రాణమై,జగత్ప్రాణుఁడనిఅనిలుఁడని పేరు పొందిన వాయుదేవునకు, అనత్యనేనేత్యనిలః, అన ప్రాణనే,ఇతనిచే బ్రదుకుదురు కావున అనిలుఁడని వ్యుత్పత్త్యర్థము. సుతుఁడవు=పుత్రుఁడవు, కారణ గుణములుకార్యమం దుండును గావున నీయందును బ్రదికించు గుణములుగలవు. కావుననే కదా నన్ను బ్రదికించితివి. లక్ష్మణుని వానరులను బ్రదికించితివి. ధార్మికుండవు = ధర్మగుణముగలవాఁడవు, బలము = ప్రయాసము సహించు శక్తి, శౌర్యము=యుద్ధోత్సాహము, సత్త్వము = దేహసారము, శ్రుతము = శాస్త్రజ్ఞానము; "శ్రుతం శాస్త్రావధృతయో" అమరము, కాంతి=తేజస్సు, పరాక్రమము = సామర్థ్యము, ధీరతా=ధైర్యము, కలఁతపడ కారణ మున్నను కలఁతపడకుండుట, క్షమ = ఓర్పు, అపరాధమును సహించుట, వినయము = అణఁకువ, ధృతి=ధారణాశక్తి, ప్రశస్త = పొగడఁబడిన గుణములచే, విశ్రుత = ప్రసిద్ధికెక్కినవాఁడా, దాక్ష్యము=కార్యములందు నేర్పరితనము, త్వదాశ్రయంబునన్= నిన్నాశ్రయించుటచే.

తాత్పర్యము

మహాత్మా ! నీవు వాయుదేవునకుఁ గుమారుఁడవు. మిక్కిలి ధర్మగుణము గలవాఁడవు. గొప్పబలము శౌర్యము సత్త్వము జ్ఞానము కాంతి పరాక్రమము ధైర్యము ఓర్పు వినయము ధారణ యీ మొదలయిన గుణములచేఁ బ్రసిద్ధుఁడవు. నేర్పరితనము లోనైన గుణములు నిన్నాశ్రయించి మిక్కిలి కాంతి గలవై ప్రకాశించు చున్నవి, గాని వానివలన నీకు వచ్చిన ఘనత లేదు.

—• హనుమంతుఁడు రాక్షసస్త్రీలఁ జంప సీతాదేవి యనుమతి వేఁడుట • —

తే. ఆమెవచనంబులను విని • హస్తయుగళి
మోడ్చి వినయంబు దొలఁకఁగ • ముగుద కనియె
హనుమ యో తల్లి ! యీ రాక్ష • సాంగనాళి
ననుమతించెద వేని నే • హతి నొనర్తు. ౨౯-౩౦

తాత్పర్యము స్పష్టము.

సీ. పతిదైవముగ నీవు • భావించి యీవనిఁ గడుదుఃఖములఁ గుందఁ • గరుణ లేక
ఘోరరూపంబులఁ • గ్రూరశీలంబులఁ గ్రూరతరాక్షులఁ • గ్రూర లైన
రాకాసు లెల్లఁ బూ • ర్వము నిన్ను నదరించి, బెదరించి కష్టంబు • పెట్టువారు
వారి నెల్లర నేఁడు • పదములఁ గరముల, మోఁకాల డాకాల•ముష్టిహతులఁ

తే.జంపువాఁడను జెవులను ♦ద్రెంపువాఁడ, వెంట్రుకలులాగి మొగములఁ ♦బెటీకిబటీకి
మొగిరి మూఁకి పడంద్రోచి♦యూడ్చిపండ్లు, రాలఁగొట్టెద నిట్టె వ♦రమ్ము నిమ్ము.

అర్థములు. వనిన్ = వనమునందు, క్రూరశీలంబులన్ = క్రూరములైన నడవడులచే, క్రూరతరాక్షులన్=మిగుల క్రూరములైన చూపులచే, క్రూరలు= దయలేనివారు, డాకాలన్=ఎడమ కాలితో, ముష్టిహతులన్ = పిడికిటిదెబ్బలచే,

తాత్పర్యము స్పష్టము.

## —♦ సీతాదేవి హనుమంతునితో రాక్షసస్త్రీలఁ జంపరాదనుట ♦—

కం. ఈరీతిఁ గూల్తు నీకప, కారిణులం గిల్బిషాత్మ ♦ కలఁ గ్రూరల నా
జారుగుణ సద్యశస్విని, మారుతసుతు వనియె ధర్మ♦మార్గస్థిత యై. ౧౬-౪౨

అర్థములు. అపకారిణులన్ = అపకారము చేసిన స్త్రీలను, కిల్బిషాత్మకలన్ = పాపపుమనస్సు గలవారిని, చారుగుణ = మనోహరములైన గుణములు కలది, సద్యశస్విని=సత్కీర్తిగలది, ధర్మమార్గస్థితయై=ధర్మమార్గ మందున్నదై.

తాత్పర్యము

నీకపకారము చేసిన పాపపు మనస్సుగల దయలేని యీ స్త్రీలను నీ విధముగాఁ జంపుదును అని చెప్పఁగా మనోహరగుణములు గలిగి సాధుగుణము గలదని కీర్తి కెక్కిన సీతాదేవి ధర్మమార్గమం దున్నదై యిట్లనియె.

కం. రాజాశ్రయమున బ్రదుకుచు, రాజాజ్ఞకుఁ జిక్కి మిగుల ♦ బ్రస్గ్ని కెలస మ
•వ్యాజగతిఁ దీర్చు నీదా, సీజనములమీఁదఁ గినియఁ♦జెల్లునె నీకున్. ౧౬-౪౩

అర్థములు. రాజాశ్రయమునన్ = కడుపుకూటి నిమిత్తమై రాజునాశ్రయించి బ్రదుకుచు.

తాత్పర్యము

రాజ నాశ్రయించి రాజునాజ్ఞకు లోబడి యడఁగి పడియుండి రాజకార్యము నిర్వహించనముగ నెఱవేర్చు నీ దాసీజనులమీఁద నీవు కోపపడవచ్చునా ?

కం. విను నాదురదృష్టంబున, మును చేసిన ఘోరపాప♦మున దుఃఖములో
హనుమ! యిటు లనుభవించితిఁ; దనచేసినకర్మ మెందుఁ♦దప్పుట గలదే ?

తాత్పర్యము స్పష్టము.

కం. ఇది యొండుదశాకాలము, కదిసెను నా కనుభవింతుఁ ♦ గా కని హనుమా!
మది నిశ్చయించి వీరల, బెదరులు నేసెచుకొంటి ♦ విధిలే కబలన్. ౧౬-౪౫

తాత్పర్యము

"కం. కలకాలము లే దలమట, కలకాలము లేదు సుఖము కాయము మోవం
గలిగిన పటుకొన్నాళ్ళీ, యిల నిటుకొన్నాళ్ళు దీని కేలావగవన్."పంచతంత్రము.

అను నీతిశాస్త్రవాక్యము ననుసరించి కొన్నాళ్ళు సుఖమనుభవించితిని. అదకే మాతినది. ఇప్పుడు దుఃఖకాలము ప్రాప్తించినది. అది యనుభవించినట్లే దీని ననుభ

వింపవలయును అని యాంజనేయా! మనస్సున నిశ్చయించుకొని వేఱు మార్గము లేకుండుటను బలహీనను గావున వీరి బెదరింపులు సహించితిని. ప్రతీకారసామర్థ్యము లేనప్పుడు సహనమే సముచితము.

కం. నిర్జరవిరోధిపనుపునఁ, దర్జించిరి వీర లతని ♦ దాసులు గావన్
నిర్జితుఁ డౌట దశాస్యుఁడు. దర్జింతురె యింక నన్నుఁ ♦ దరుచరవర్యా!

అర్థములు. నిర్జరవిరోధి=రావణాసురునియొక్క, పనుపునన్ = ఆజ్ఞచేత, తర్జించిరి=భయపెట్టిరి, నిర్జితుఁడు=చంపఁబడినవాఁడు, తరుచరవర్యా=వానరశ్రేష్ఠా.

తాత్పర్యము

రావణుని కొలువునం దుండుటచే వాని దాసులు గావున వాని యాజ్ఞ చొప్పున వాఁడు చెప్పినట్లు వినకున్న చంపునని భయపడి నన్ను వీరు బెదరించిరి. ఇప్పుడు వాఁడు చచ్చెను. ఇప్పుడు వీరు వాని దాసులు గారు కావున నిఁక వీరు నన్ను బెదరింతురా? నాయందు వీరికి స్వయముగ ద్వేషబుద్ధి లేదు. వీరు పాపాత్మక లంటివి-వాని కొలువునందుండు దోషము తప్ప వీరియందు మఱి యేదోషము గలదు? వీరిచే నీ కార్యము చేయించిన దోషము వానిదిగాని వీరిది గాదు. వానికి భయపడిగదా వీ రీ కార్యము చేసిరి? కావున వీరియందుఁ బాపము లేదని నా యభిప్రాయము.

కం. మున్నొకవ్యాఘ్రంబునకుం, బన్నగ వచియించె నొక్క ♦ భల్లుక మీయ
త్యున్నతధర్మాన్విత మై, సన్నుతి గను నొకపురాణ ♦ సచ్ఛ్లోకంబున్.

అర్థములు. అత్యున్నత ధర్మాన్వితము=ఉత్తమధర్మముతోఁ గూడినది; పురాణ+సత్+శ్లోకంబున్=పూర్వులు చెప్పిన యొక మంచి శ్లోకము.

తాత్పర్యము

ఈ విషయమునఁ బూర్వమొక యెలుఁగొక వ్యాఘ్రమునకు నుత్తమ ధర్మముతోఁ గూడిన యొక మంచి శ్లోకము చెప్పెను. అది చెప్పెద వినుము.

కం. తన కపకార మొనర్చిన; మనుజున కపకృతి నొనర్ప ♦ మదిఁ దలఁపఁడు స
జ్జనుఁ డీనియతిం బ్రోవఁగఁ, బొనరున్ సజ్జనులు శీల♦భూషణు లెంచున్.

తాత్పర్యము

ఒకఁడు తనకు నపకారము చేసినను దాను సజ్జనుఁ డగునేని వానికి బదులపకారము చేయరాదు. ఈ నియతిని రక్షింప వలయును. ఏలన సజ్జనులకు శీలమె భూషణము. పూర్వమొక యడవిలో నొకపులి వేటగానిని దఱుముకొనివచ్చెను. వాఁడుపరువెత్తి యొక చెట్టెక్కెను. ఆ చెట్టుమీఁద నొక యెలుఁగుండెను. వాఁడు దానిఁజూచి భయపడెను. నేనుండు చోటికి నీవు భయపడి వచ్చితివి. నిన్నుఁ జంపనని యది వానికి ధైర్యము చెప్పెను. పులి యెలుఁగును జూచి వీఁడు మన మృగజాతికే శత్రువు. కావున వీనిని గ్రిందఁ బడఁద్రోయు మనెను. వీఁడు నన్నాశ్ర

యుంచినవాఁడు కావున నేను బడఁ ద్రోయనని యది యందే నిద్రించెను. అప్పుడు పులి యోరి మూఢుఁడా! నిన్నది రక్షించుట నీయందు దయగలిగి కాదు. నేను వెడలి పోఁగానే తాను నిన్నుఁ జంపఁదలఁచినది. అది నిద్రలేచి నిన్నుఁ జంపును. కావున దానిని గ్రిందఁ ద్రోయుమనెను. వాఁడట్టులే చేసెను. అది యభ్యాసవశమునఁ గ్రిందఁబడక మఱియొక కొమ్మ పట్టుకొని పైకెక్కెను. అప్పుడు పులి నేను జెప్పలేదా. వీఁడు ద్రోహి, నిన్నుఁ జంప యత్నించెను. కావున వానిని గ్రిందఁ ద్రోయుమనెను. అప్పుడా యెలుఁగువాఁడు ద్రోహియైన నేనును ద్రోహి గావలయునని నిర్బంధముగలదా? అట్లు వాని నేను గ్రిందఁ ద్రోయుట ధర్మము కాదు. నేను ద్రోయననెను. పులి వెడలిపోయెను. వేటకాఁడును చెట్టుదిగి పోయెను.

శరణాగతరక్షణవిషయమై రామచంద్రమూర్తి సుగ్రీవునకు కపోతాఖ్యానము చెప్పెను ఇప్పుడు సీతాదేవి హనుమంతునకు ఋక్షగీతము జెప్పెను. ఈ రాక్షసస్త్రీలు సీతాదేవికి శరణాగతలు. మిమ్ము రక్షించెదనని యభయ మిచ్చినది. కావున వారిని రక్షింపవలసినభార మామెయం దున్నది.

కం. కపివర! పుణ్యులలోఁ బా,పపుజనములలోన వధకుఁ • బాత్రులకల్లన్
కృపఁజూపవలయు సజ్జనుఁ డపరాధముఁ జేయనట్టి•యతఁడుం గలఁడే.

తాత్పర్యము

వానరేంద్రా? పుణ్యులు గాని పాపులు గాని వధ కర్హులైరేని అట్టివారి యందు సుజనుఁడు కృప చూపవలయునుగాని వారిని జంపరాదు. ఏలన లోకమునం దపరాధము చేయనివాఁడు లేఁడు. హనుమంతా! నేను వీరి కే యపకారము చేయకున్నను వీరు నన్ను నిష్కారణముగ బాధించిరి కావున వీరు పాపాత్మకులని నీ యభిప్రాయము. వీరు పరాధీనపు బ్రతుకుబ్రతుకుచు స్వాతంత్ర్య మనునది లేక తమ్ము రక్షించువాని యిష్టప్రకారము నడవకుండిన వాఁడు చంపునని భయపడి నన్ను బాధించిరి గాని నా యందలి ద్వేషబుద్ధిచేఁ గాదు. కావున వీరు పాపాత్మకులు గారని నా యభిప్రాయము.

నీ యభిప్రాయప్రకారము వీరు పాపినులైనను నా యభిప్రాయప్రకారము వీరు పాపినులు కాకున్నను వీరు వధ్యులే యైనను చంపఁబడఁదగరు. వీ రపరాధినులనికదా వీరిని జంపెద నంటివి? లోకములో నపరాధము చేయనివా రెవరు ? కావున నీ యభిప్రాయప్రకారము లోకమున రక్షింపఁదగినవారు లేరు. ఆ కారణమున సజ్జనుఁడను వాఁడును లేఁడు. రక్షించువాఁడు సజ్జనుఁడు. రక్షింపఁదగినవాఁడే లోకములో లేనప్పుడు ఇఁక సజ్జనులతో నేమిపని? ఎవనిని సజ్జనుఁ డనవలె?

హను:-అమ్మా! నీవు చెప్పిన ప్రకారము లోకమున నందఱు వర్తించిరేని దండ
భయములేని కారణమున నందఱు పాపమే చేయుదురు. లోకము పాపభూయిష్ఠ
మగును. సజ్జనుఁ డనువాఁడే యుండఁడు. ఇట్టి స్థితి నీకు సమ్మతమా ?

సీత:—ఆంజనేయా! 'యోగ్యః పురుషో నాస్తి, అయోగ్యః పురుషో నాస్తి' యన్నట్లు లోకమున కేవల యోగ్యుఁడని కాని కేవల మయోగ్యుఁడని కాని చెప్పఁదగినవాఁ డొకఁడు లేఁడు. ప్రకృతి గుణములకు నందఱు పాలుపడినవారే. ఒకసారి కాకున్న నొకసారియైన నొక పాపమైనఁ జేయువారే. కావున నీమతప్రకారము పోయిన నందఱను జంపవలసియేయుండును. లోకము జీవకోటిశూన్య మగును. దయ కెడమే యుండదు. ఇట్టి స్థితి నీకు సమ్మతమా ?

నా యభిప్రాయము చెప్పెద వినుము. పుణ్యాత్ములను మనము రక్షింపఁబని లేదు. వారి పుణ్యమే వారిని రక్షించు. రక్షింపఁబడవలసినవారు పాపాత్ములే. అట్టివారు మన రక్షణము గోరినేని వా రెటువంటివారని పుణ్యులా పాపులా యను విచారము లేక రక్షింపవలయును. మనల నాశ్రయింపక పోయిరా వారిని దండింప వచ్చును. నేను రావణునకు శ్రీరామచంద్రమూర్తి యనుగ్రహము సంపాదించు కొనుమని చిలుకకుఁ జెప్పినట్లు చెప్పితిని. వాఁడు నామాట వినఁడయ్యెను. వానిని జంపుట దోషమని నేనందునా? పాపాత్ముల దండింపవలయుననుట సామాన్య శాస్త్రము. శరణాగతుల రక్షింపవలయుననుట విశేష శాస్త్రము. విశేష శాస్త్రము సామాన్య శాస్త్రమును బాధించునుగాని సామాన్య శాస్త్రము విశేష శాస్త్రమును బాధింపదు. కావున వీరిని నీవు చంపరాదు. నామతప్రకారము దండ్యులను దండింప వలయునను సామాన్య శాస్త్రము భంగమయ్యెనేని శరణాగతుల రక్షింపవలయు నను విశేష శాస్త్రము నీవలన భంగమగును. ఏది మేలో యాలోచింపుము.

ఇది సీతాదేవి యభయప్రదాన పద్యము.

తే. మైత్రి భావించి తాన సంప్రాప్తుఁడైన, వాని నెటులైనఁ జేవిడువాఁడఁ గాను
వానియెడ నుండునేని నేదేని దోష, మద్ది గర్హ్యంబుగాదు సదాఖులకును.

అనునది రామచంద్రమూర్తి యభయప్రదాన పద్యము.

ఈ రెండును సమానార్థకములుగాఁ దోచినను వ్యక్తిస్వభావమునుబట్టి తల్లి దండ్రులయందుండు భేదము సీతారాముల వాక్యములయందుఁ గానవచ్చెడిని. తల్లి యెప్పటికి రక్షించు గుణము గలదే కాని దండపారుష్యము గలది కాదు. తండ్రి యందు దండించు గుణముగలదు. ఈ తారతమ్యమే యీ రెండు పద్యములందుఁ గలదు.

మైత్రి భావించి శరణాగతి చేయవలయునని రామచంద్రాభిప్రాయము. అట్టులే విభీషణుఁడు వచ్చి శరణు జొచ్చెను.

సీతాదేవి రాక్షసస్త్రీలు శరణుజొచ్చుట ప్రీతిచేఁగాదు, భీతిచేత, స్వాయ ముగఁగాదు, త్రిజట ప్రేరణము చేత మైత్రి పాటింపకున్నను సీతాదేవి రాక్షసస్త్రీల రక్షించెను.

శరణాగతునందు దోష మండినను దానిని లెక్కకుఁ దీసికొనరాదని రామచంద్రుమతము. దీనివలన దోషజ్ఞానము రక్షకునకుఁ గలదని యేర్పడుచున్నది.

శరణాగతుఁడు పాపియా పుణ్యుఁడా యను విచారమే కూడదనియు పాహి యనఁగానే అభయమ్మనవలయు ననియు సీతాదేవి మతము.

స్వతంత్రించి సీతాదేవి శరణాగతలైన రాక్షసస్త్రీల రక్షించుటచే నామె యందుఁ బురుషకారమేగాక శరణాగతరక్షణమందు స్వతంత్రశక్తియుఁ గలదని యేర్పడుచున్నది. భర్తృసన్నిధానమందుఁ బురుషకారభూత యనియుఁ బరోక్షమందు స్వతంత్రశక్తి యనియు గ్రహింపనగు.

తే. పాపములె చేయుచును గామరూపులగుచు
భువనహింసావిహారులై పోలుచున్న
యసురులకుఁ గీడు సేఁత కార్యంబు గాదు
సుమ్మటన్నను హనుమ యాసుదతి కనియె. ౬౩౦

తాత్పర్యము

ప్రాణములు దీయువారు కావున వీరసురు లనఁబడిరి. వీరు స్వభావముగఁ బాపములు చేయువారు, ఆ పాపములు చేయుటకు నెట్టి రూపములు ధరింపవలెనో యట్టి రూపములను ధరించువారు, వారు చేయు పాపమూ లోకహింసయే కావున వీరు వధ్యు లందమా యనిన నా మతమునఁ గాదు. వీరు పాపాత్ములని వారిని దండింపరాదు. ఏలయందువా వారి కా గుణము ప్రకృతిసిద్ధము. పుట్టువతోనే వచ్చినది. స్వభావము దురతిక్రమము. అది నీవు దండింపఁగానే పోవునదికాదు. పుట్టుతామసుని దండించినంతమాత్రము చేతనే సాత్త్వికుఁడుగాఁడు. పులిని తోడేలిని నీవు దండించినంతన గోవు కాఁజాలదు. వారువారు చేసిన పాపములకు వారువారు నరకశిక్ష యనుభవించి మఱుజన్మములందు, ఆ మఱుజన్మంబులందుఁ జిక్కఁబడవలయును గాని యమునికృత్యము మనము చేసి చక్కఁబెట్టఁజాలము. దండమే మన కార్యముగ నెంచితిమేని క్రమక్రమముగ మన హృదయములు దయాశూన్యములై కఠినములగును. వారు బాగుపడుట యసత్యము, మనము చెడుట సత్యము.

అట్లుగాక మనము క్షమించితిమేని వారి మనస్సులం దొకవిధమైన మార్పు గలుగవచ్చును. "ఈమె విషయమున మనమింత క్రూరముగ వర్తించినను ఆ కారణముచే మనము హింసకుఁ దగినవారమైనను కేవలదయను బురస్కరించుకొని యీమె మనలను రక్షించెను. ఈ వానరుఁడు మనలఁ జంపెదననిన నెంత భయపడితిమో మన మీమెను జంపెద మన్నప్పుడంత భయపడియుండునుగదా. ఛీ! దయలేని మన బ్రదు"కేమి బ్రదుకని వారికే తోఁచి యికమీఁద నిట్టికార్యము మానినను మానవచ్చును. కావున దయకుఁ బారుష్య మేనాఁటికి సరిగాదు.

హను :— అమ్మా! యుడైన నీవేల రావణుఁజంపుమని నాచేతనే చెప్పి పంపితివి? వానికది స్వభావము అని నీ బాధ నీవు పడుచుండరాదా? ఇందఱ కేల యింత కష్ట మిచ్చితివి ?

సీత :— ఆంజనేయా! వారి కది స్వభావము కావున వారిచేతిలో మనము చిక్కి బాధపడవలయునని నా మతముగాదు. మన యాత్మరక్షణమునకై యెంత కృషి చేయవలయునో యంత కృషి చేయవలసినదే. మానరాదు. ఆత్మరక్షణ మవశ్యకార్యము. రావణుఁడు నయభయములకు లోఁబడినవాఁడు కాఁడు. సామదానభేదములకు వశపడినవాఁడు కాఁడు. నే నెన్నోవిధములఁ జెప్పితిని. వాని వారలు చెప్పిరి. ఎవరుచెప్పినను వాఁడు నన్ను బాధించుట మానినవాఁడు కాఁడు. కావున నాత్మరక్షణమునకై నాకు స్వతంత్రశక్తి లేదుగావున నా భర్తను బిలిగొల్పవలసి వచ్చెను. ఇది నా రక్షణార్థమే కాని వానిని శిక్షింపవలయునను పట్టుదలతో గాదు. ఈ రాక్షసస్త్రీ లిట్టివారు కారు. కావున వీరిని రక్షింపవలయును.

ఈ స్త్రీలు సీతాదేవికి శరణాగతి చేసిరి. ఆమె యభయమిచ్చెను. శరణాగత రక్షణ విషయమున నీమె యభిప్రాయ మెట్టిదో క్రోధమునకుఁ బాలుపడునో పడదో పరీక్షింపఁగోరియే హనుమంతుఁ డామె నీ వరముఁ గోరెను. దీన సీతాదేవి సర్వభూతదయాళుత్వము అపరాధసహిష్ణుత్వము ఘటకత్వము ప్రకటపడెను. ఇట్టి యభిప్రాయము హనుమంతునికి లేదేని దిక్కుమాలిన యాఁడువారిమీఁదనా తన బలము చూపఁగోరెను. ఎదిరించిన లంక యాఁడు దని మెల్లగాఁ గొట్టిన వాఁడీ యాఁడువారలఁ జంపఁదలఁచునా?

శ్రీరాముడు నిర్దోషి కభయమిచ్చెను. సీతాదేవి సాపరాధుల కభయమిచ్చెను. జగన్మాత యిట్లుగాక మఱి యెట్లు చేయఁగలదు ? విభీషణరక్షణమందు శ్రీరామునకుఁ బ్రతిఫలకాంక్ష కలదేమోయని సందేహింపనైనఁ గారణము కలదు. సీతయందట్టిసందేహమున కెడమే లేదు.

ఈ ప్రకారము చెప్పఁగా హనుమంతుఁడు సీతాదేవితో నిట్లనియె.

—• సీతాదేవి శ్రీరాముఁ జూడఁగోరుట •—

కం. రామునకుఁ దగినపత్నివి, శ్యామా! సత్కీర్తియుక్త • వగు మిఁక నే
రామునికడ కేగెద నీ, వేమి బదులుచెప్పె దనిన • మృగలోచనయున్. ౨౬౩౧

తాత్పర్యము స్పష్టము.

కం. పతిఁ గనఁగోనెద మారుత,సుత!యనఁ బతిఁడనియెఁ బూర్ణ•శుభ్రాంశుముఖున్
హతవైరి లక్ష్మణాన్వితు,సతి! నిర్జరయుక్తశక్ర•సముఁ గనెదు విభున్. ౨౬౩౨

అర్థములు. పూర్ణశుభ్రాంశుముఖున్ = పూర్ణచంద్రునితో సమానమైన ముఖము గలవానిని, హతవైరిన్ = విరోధులఁ జంపినవానిని, నిర్జరయుక్త = దేవతలతోఁ గూడిన, శక్రసమున్ = ఇంద్రుని బోలినవానిని.

### తాత్పర్యము

ఆంజనేయా! నా భర్తను నేను జూడఁగోరుచున్నాను అని చెప్పఁగా నిండు చందురుఁ బోలు మోముగలవానిని పగవారిని జంపిన వానిని లక్ష్మణునితోఁ గూడి యుండువానిని దేవతలతోఁ గూడినయింద్రుని బోలినవానిని నీపతిని నీవు చూచెదవు.

కం. అని సాక్షాచ్ఛ్రీయనఁ దగు, వనజాక్షికిఁ జెప్పి భక్తి ♦ వలగొని రామున్
గనఁగోనఁ దన్నికటమునకుఁ జనియెన్ వాయుజుఁడు వేగ ♦ సంపద వెలయన్.

అర్థములు. సాక్షాత్ + శ్రీ = ప్రత్యక్షమైన లక్ష్మీదేవి, వలగొని = ప్రదక్షిణ నమస్కారములు గావించి, తన్నికటమునకున్ = రాముని సమీపమునకు.

### తాత్పర్యము

ఈ ప్రకారము ప్రత్యక్ష లక్ష్మీదేవి వలెనున్న యా కమలాక్షికి చెప్పి యామెకు ప్రదక్షిణ నమస్కారము లాచరించి రామచంద్రమూర్తినిఁ జూచుటకు వేగముగ నాయనసన్నిధికిఁ బోయెను.

## —♦ { ౧౧౭-వ సర్గము. సీతాదేవి సందేశమును హనుమ శ్రీరామునితోఁ జెప్పుట. } ♦—

మ. చని కోదండగురూత్తముం గదిసి వా ♦ చాదక్షుఁ డౌ నా మరు
త్తనయుం డిట్లను నేమెుకై కడు నసా ♦ ధ్యంబైన కార్యంబులన్
ఘనశక్తిన్ ఘటియించి తత్ఫలము లం ♦ కానాథనాశంబు నీ
వొనరంజేసితి వట్టిసీత బహుదుః ♦ ఖోపేతఁ గానందగున్. ౬౩౮

అర్థములు. వాచాదక్షుఁడు = మాటలయందు నేర్పరి.

### తాత్పర్యము

ఇట్లు పోయి విలువిద్య నేర్చినవారిలో మిగుల గొప్పవాఁడగు రామచంద్రు సమీపించి మాటలయందు నేర్పరి యగు నాంజనేయుఁ డిట్లనియె రామచంద్రా! యేమెుకనిమిత్తమై మిగుల నసాధ్యమైన కార్యములు చేసి దానికి ఫలముగా రావణుఁ జంపితివో యట్టి సీతను దుఃఖించుచున్న దానిని జూడఁదగును.

కం. శోకాకులమతియై యశ్రుకణములు గాఱ వనట ♦ స్రుక్కుచు నుండిన్
తా న్మైకన్యక నీవిజయం బాకర్ణించినక్షణంబ ♦ యతిముద మందెన్. ౬౩౯

అర్థములు. శోకాకులమతియై = శోకముచేఁ గలఁతబడిన మనస్సుగలదై, అశ్రుకణములు = విశేషముగాఁ గన్నీరు, వనటన్ = దుఃఖముచే, ఉండిన్ = ఉండియును, సముచ్చయము యు' లోపింపఁగా మిగిలినరూపము.

తాత్పర్యము

శోకముచేఁ గలఁతచెందిన మనస్సు గలదై కన్నీళ్ళు విశేషముగఁ గార్చుచు దుఃఖించుచున్నను నీ గెలుపు విన్నమాత్రముచేతనే యా నిమిషమందే సీతాదేవి మిగుల సంతోషించెను.

కం. మునుపటినమ్మకమున నా, జనకాత్మజ నన్ను నమ్మి • సహలక్ష్మణునిన్
గనఁగోరెద సుకృతార్థుని, వనజేక్షణుఁ డైననాదు•వల్లభు ననియెన్. ౬-౩౬

తాత్పర్యము

పూర్వము నేను నీ దూతనని నమ్మిన దగుటచే నిప్పుడు నీవు పంపిన వచ్చినా నని నమ్మి లక్ష్మణునితోనుండు నా వల్లభుని చక్కఁగా గార్యము నెఱవేర్చినవానిని కమలమువంటి కన్నులు గలవానిని జూడఁగోరుచున్నదాన ననెను.

సుకృతార్థుని నిన్నుఁ జూడఁ గోరెద ననుటచే నీ వీ కార్యము నెఱవేర్పకున్న ని న్నామె చూడ నిచ్చగించియుండదు అని భావము.

—• శ్రీరాముఁడు సీతాదేవిఁ దోడితేర విభీషణు నియోగించుట. •—

చ. అని హనుమంతుఁ డాడ సుకృ•తాత్మవరేణ్యుఁడు రామభద్రుఁడున్
గనుఁగవ నశ్రు లుబ్బ నిలఁ • గాంచుచు హుస్సని వెచ్చనూర్చుచున్
దనచుదిఁ జింతచేసి సవి • ధస్థితు మేఘనిభున్ విభీషణున్
గనుఁగొని-ధర్మసంశ్రయ ! వి • కారవిదూర ! సురారినాయకా ! ౬-౩౭

అర్థములు. సుకృతాత్మ వరేణ్యుఁడు = ధర్మాత్ములందు శ్రేష్ఠుఁడు, ఇట్లు చెప్పుటచే నీయన చేయఁబోవునది ధర్మవిరుద్ధము కాదని భావము. కనుఁగవ నశ్రులుబ్బన్=కన్నుల నీళ్ళూరఁగా, ఇలఁ గాంచుచున్ = చింతాపారవశ్యముచే నేమియుఁ దోపక, భూదేవి నీకడుపునఁ బుట్టినదానికిఁగూడ నిట్టికష్టదశ వచ్చెఁగదా యని నేలఁ జూచుచు, హుస్సని వెచ్చనూర్చుచున్=శ్వాసము బలమున విడుచుటచే హుస్సను శబ్దము పుట్టగా వేఁడిశ్వాసము పుచ్చుచు, చింతాబలము దీర్ఘమగు కొలఁది శ్వాసము బలము దీర్ఘముగా నుండును. చింతచేసి = చిరకాలము రావణు నింట నుండుదానిని, దటాలునఁ బరిగ్రహించిన లోకములో మహాపనింద కలుగును. లోకమునకై నిర్దోషురాలిని విడిచిన మహాదోషము తప్పదు. ఈ సంకటమం దేమి చేయుదునా యని విచారము, సవిధస్థితున్=సమీపమందుండు వానిని, మేఘనిభున్ = మేఘముతో సమానమైన వానిని మేఘమువలె వేగముగాఁ బోఁగలవానిని, ధర్మ సంశ్రయ = ధర్మము నాశ్రయించి యుండువాఁడా ! వికారవిదూర = వికారము లేనివాఁడా.

తాత్పర్యము

ఈ ప్రకారము హనుమంతుఁడు చెప్పఁగా ధర్మాత్ములలో శ్రేష్ఠుఁడగు రామ భద్రుఁడు ఈపదినెలలుగా నానాబాధలు పడుచుండుదానిని శత్రువులు పెట్టినబాధ

చాలదని నేనుగూడ బాధపెట్ట వలసివచ్చెఁగదా యని కన్నుల నీరుబుకఁగా చింతచే పరవశుఁడై యేమియుఁ దోఁపక నేలచూచుచు వేఁడియూర్పును హుస్సని యూర్చుచు దీర్ఘకాలము, పగవాని-దుష్టుని, యింట నున్నదానిని గాముకుఁడై రాముఁడు మరలఁ బరిగ్రహించెనని లోకు లందు రే యని నిర్దోషురాలిని కఠినవ్రతముల నుండుదానిని నెట్లు విడిచి మహాదోషము మెడఁ గట్టుకొందునని చింత చేయుచు, సమీపమం దున్న వానిని మబ్బువంటివానిని విభీషణుఁజూచి ధర్మమున కాశ్రయమైన వాఁడా? వికారములేని మనస్సుగలవాఁడా! రాక్షసరాజా!

కం. సీతను వసుంధరాసం, జాతను దివ్యాంగరాగ•సకలాభరణో
పేతను వేగమ మూర్ధ, స్నాతనుగాఁ జేసి తోడి•చయ్యనఁ దెమ్మా. -౨౬౩౮

అర్థములు. వసుంధరాసంజాతను = భూమియందుఁ బుట్టినదానిని, కావున నే యయోనిజను, దివ్యాంగరాగ = దివ్యములైన గంధాదులు పూసికొనిన దానినిగా, సకలాభరణోపేతను = సమస్త భూషణములు ధరించిన దానిఁగా, మూర్ధస్నాతనుగా = తలంటుకొని స్నానము చేసిన దానిఁగా.

తాత్పర్యము

భూకన్యయగు సీతాదేవిని వేగముగ శిరస్స్నానము చేయించి గంధాదులు పూసికొనఁజేసి ఆభరణములు ధరింపఁజేసి తీసికొని రమ్ము.

• రామచంద్రమూర్తి యుద్దేశము మంచిదైనను జేసినది సరియైనను గఠిన విషమ పరీక్ష దలఁచినపు డీయన రాక్షసుఁడా యని నోరారఁ దిట్ట బుద్ధి పుట్టుచున్నది.

ఉన్న దున్నట్లు వచ్చెనేని యామెను జూచిన నెట్టి వారికిని రాక్షసులకైనను కన్నీరు రాక యామెయందు జాలి పుట్టక తప్పదు. అట్టి సమయములోఁ దాను జెప్పఁ దలఁచిన కఠినవాక్యములు చెప్పినచో వినువా రందఱు నీయన రాముఁడు కాఁడు, రాక్షసుఁడు, కాకున్న నిట్టి యామెను నిట్లు మాటలాడునా యని తన్ను నిందింతురు. ఆ నింద తప్పించుకొనన నిట్లుపాయము చేసెను.

సీ. అనుడు వేవే పోయి • యంతఃపురస్త్రీల, ననిచె సీతాసతి•కని వచింప
దివ్యాంగరాగయై • దివ్యభూషాంచిత, యై దేవి చతురంత•యానమెక్కి
మీా నిన్ను నీభర్త•యీాక్షింపఁ గోరెను, నీకు భద్రం బగు • నియమశీల
యనిన జానకి పల్కె•నస్నాత నగుచును, నసురేంద్ర! పతిఁ జూడ•నభిలషింతు
తే. నన విభీషణుఁడనియెనీ•ప్రాణవిభుని, యాజ్ఞ యది రాజ్ఞ్యప్రాణేశుఁ•డైన రాముఁ
డెట్లు వచియించె నారీతి•నీవు సేయు, నర్హమగుఁగాదె యనిన నా•యవనితనయ.

అర్థములు. చతురంతయానము = పల్లకి, అస్నాత = స్నానము చేయని దాననై.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యిట్లు చెప్పఁగా మిగులఁ ద్వరగాఁ బోయి యీవార్త సీతకుఁ జెప్ప నంతఃపురస్త్రీలను బంపి తానును బోయెను. పోయి యమ్మా! నీవు దివ్యచందనాదులు పూసికొని దివ్యాభరణములు ధరించికొని పల్లకి యెక్కుము. నిన్ను నీభర్త చూడఁగోరుచున్నాఁడు. పతివ్రతా! నీకు మేలగును అనిన జానకి నేను స్నానము చేయకయే చూడఁగోరెదను అని తన యభిప్రాయము స్త్రీలతో జెప్పించెను. ఆ మాట విని విభీషణుఁ డిది నీభర్తయాజ్ఞగాని నాకోరిక కాదు. నీకు భర్తయు రాజు నగు వానియాజ్ఞ నీవు పాలింపవలయునుగదా యనిన నాసీతయు.

తే. భర్తృదేవత నిజభర్తృ•భక్తిశీల, సాధ్వి వల్లె యటంచు చట్లు • పలికె నంత
జలక మాడించి భూషణ•జాలభూషి, తాంగి నొనరించి దివ్యవ•స్త్రాళు లిచ్చి.

అర్థములు. భర్తృదేవత = పతియే దైవముగా నెంచినది. నిజభర్తృభక్తిశీల=తన భర్తయందు భక్తిగలదై యుండుటయే స్వభావముగాఁగలది, సాధ్వి= సాధుగుణముగల పతివ్రత, వల్లె = అట్లె కానిమ్ము, భూషణజాల = ఆభరణముల సమూహముచే, భూషితాంగి=అలంకరింపఁబడిన దేహముగలది, దివ్యవస్త్రాళులు= మంచిచీర, యుత్తరీయ మిచ్చి.

తాత్పర్యము

భర్తయే దైవమని తలఁచునదియు తనభర్తయందు భక్తిసేయుట స్వభావముగాఁ గలదియు సాధుగుణములుగల పతివ్రతయు నగుటచే సీత యట్టులే చేసెద ననెను. ఆమెను స్నానము చేయించి ఆభరణములచే నలంకరించి మంచి వస్త్రము లిచ్చి.

తే. మెఱుఁగులీనెడువస్త్రముల్ • మేలిముసుఁగు, గాఁగ రాక్షసగుప్తమై • కాలుదివ్య
శిబిక జానకి నెక్కించి • శీఘ్రగతిని, విభుని డాయంగఁ దెచ్చె వి•భీషణుండు.

అర్థములు. రాక్షసగుప్తమై=రాక్షసులచేఁ గాపాడఁ బడునది, శిబిక = పల్లకి.

తాత్పర్యము

తళతళ మెఱయు సరిగవస్త్రములు పైముసుఁగుగాఁ గలిగి రాక్షసులు రక్షించు పల్లకియం దామె నెక్కించి శీఘ్రముగ విభీషణుఁడు రామచంద్రమూర్తి యొద్దకుఁ దెచ్చెను.

—• సీతాదేవిరాక శ్రీరామునకు విభీషణుఁడు దెల్పుట •—

కం. జానకి వచ్చుట యెఱిఁగియు, ధ్యానస్థితుఁ డైన దశర•థాత్మజుఁ గని ర
క్షోనాథుఁడు వినయంబున, జ్యానాయక! వచ్చె • నని తెలుపుటయున్.

తాత్పర్యము

జానకి వచ్చుట తెలిసి కూడ నేదియో యాలోచించుచున్న రామచంద్ర మూర్తితో విభీషణుఁడు రాజేంద్రా! సీతాదేవి వచ్చె నని చెప్పెను.

కం. చిరకాలము రాక్షసుమం,దిరమున వసియించి మానినీమణి యపుడం
దరు దేర వినఁడు రాముని, నరుసము దైన్యంబు రోష•మావేశించెన్. ౨౬౮౩

అర్థములు. అరుసము = సంతోషము, శత్రువును జయించి మరల సీతను బొందఁగలిగితిని కదా యని సంతోషము, దైన్యంబు = చిన్నపోవుట, రావణు నింటఁ జిరకాలముండెనుగదా యను నవమానబుద్ధిచే దైన్యము, రోషము = కోపము, ఇప్పుడు కోపము రావలసిన కారణము లేదు. ఎవరిమీఁదఁ గోపము ? చచ్చిన రావణుమీఁదనా? బ్రదికిన సీతమీఁదనా? సీతమీఁదఁ గోపించుటకునాకు చేసిన దోషమేమి ?

కామమునకు విఘ్నము కలిగనేని యట్లు విఘ్నము కలిగించిన వానిపైఁ గోపమువచ్చును. సీతాదేవి యట్టులేదియుఁ జేయలేదు. కావున నీకోపము వాస్తవమైనది కాదు. తాను జెప్పఁదలఁచిన మాటలు కోపముతోఁ జెప్పఁదగినవి కావున నీ కోప మారోపితమే—నటనమేకాని సత్యముగాదు.

తాత్పర్యము

దీర్ఘకాలము రావణునింట నుండిన సీతాదేవి యందు వచ్చినదని వినఁగానే రామచంద్రమూర్తి మనస్సునందు సంతోషము దీనత్వము కోపము ఆవేశించెను.

కం. అంతట సవిమర్శంబుగ, జింతించుచుఁ గనియె ముదము • చెదరిన సరమా
•కాంతుని మద్విజయరతా! చెంతకుఁ గొని రమ్ము వేగ • సీత నటన్నన్.

అర్థములు. సవిమర్శంబుగన్ = వితర్కముతోడ. ముదము చెదరిన = సంతోషము చెడిన, రామచంద్రుని ముఖ నయన చేష్టావాక్యముల తీరు చూచి యేదియో యనర్థముగలదని సంతోషము చెడినవాఁ డయ్యెను. మద్విజయరతా= నా గెలుపునందుఁ బ్రీతిగలవాఁడా, ఇచ్చట విజయమనఁగా శత్రుజయమువలనఁ గలిగిన కీర్తియని చెప్పవలయును. శత్రుజయమం దెట్లు నీవు నాకు సహాయపడితివో యట్లు ఇప్పుడు నాకు అపకీర్తి రాకుండ నన్నుఁగాపాడుకొనుటయందును నీవుసహాయపడుము. అనఁగా నేను జేయఁబోవుపనికి నీవు విఘ్నము కలిగింపకుమని భావము.

తాత్పర్యము స్పష్టము.

సీ. రాముని నుడి విని రాక్షసనాథుండు, జలిత మొనర్చెఁ ద•జ్జనము నెల్ల
దూరంబు దొలఁగింపఁ • దూర్ణంబ కంచుకుల్, పాగాలవారును•బాఱుదెంచి
తొలఁగుఁడు పొండు•మారంబు చనుఁడని, బగళంబు సేయుచు•ఝల్లికముల
నసురులఁ బ్లవగుల • నదలింప వారల, పెనురొదాళము విను•వీఁది దాఁకె
తే. వానరాదులుదొలఁగుచో•వారిరవము,వాయువశమునఁదిరుగుడు•వడువరోధి
స్వనముఁబోలినఁ దజ్జాత•సంభ్రమములను,గాంచిదాక్షిణ్యవశమునఁ•గనలఁ పూ

అర్థములు. జతనము = ప్రయత్నము, తూర్ణంబ = వేగముగ, కంచుకుల్ = అంతఃపురము కావలివాండ్రు, బగళించు = తోలఁగించుచు, రొదాళము = ధ్వని, తజ్జాతసంభ్రమములను = ఆ విధముగఁ గలిగిన వేగిరపాటుగలవారిని.

తాత్పర్యము

రామచంద్రమూర్తి చెప్పినమాట విని యచ్చటనున్నవారి నందఱ దూరముగాఁ బంప యత్నించి కంచుకులను పాగాలవారిని నియమించెను. వారు అచ్చట గుంపుగా నుండిన భల్లూకములను వానరులను రాక్షసులను తొలఁగుడు దూరము పొండని యందఱను దొలఁగింపఁగా వారి ధ్వని యాకాశమంటెను. వానరులు లోనగువారు దొలఁగి పోవునపుడు కలిగినధ్వని వాయువశమునఁ గలఁత చెందిన సముద్రము ధ్వనివలెఁ గాఁగా ఆ విధముగఁ గలఁతపడుచున్న వానరులఁజూచి వారియందుఁ గల దాక్షిణ్యముచే కోపించి.

## —• శ్రీరాముఁడు విభీషణుఁ గోపించుట. •—

కం. కోపారుణనయనుం డై, చూపులనె దహించుభంగిఁ • జూఱ చుఱ గనుచున్
భూపతి విభీషణుని నిటు, లోపాలంభముగ ననియెనుత్తమమేధున్. ౨౪

అర్థములు. రోపారుణనయనుండై = కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసినవాఁడై, సోపాలంభముగ = మర్మము నాటునట్లుగ, ఉత్తమమేధున్ = ఉత్తమబుద్ధి గలవానిని, ఇట్లనుటచే విభీషణుఁ డాలోచించి సరియైన కార్యమే చేసెనని భావము. అయినను రామున కది సరిపడినది కాదు.

తాత్పర్యము

కోపముచేఁ గన్ను లెఱ్ఱచేసి చూపులనే కాల్చువానివలెఁ జూఱచుఱ చూచుచు మిగుల బుద్ధిమంతుఁడై యాలోచించి పనిచేసినవాఁడైనను విభీషణునిఁ జూచి రామచంద్రమూర్తి మర్మములు నాటునట్లు నిష్ఠురవాక్యముల నిట్లనియె.

కం. ఏలా నన్ను విభీషణ!; యేలిద మొనరించి జనము • నిటు లేఁచెదిపే!
చాలింపుము నీయత్నము, చాలున్ వీ రెల్ల నాకుఁ•స్వజనులు సుమ్మీ. ౨౫

అర్థములు. ఏలిదము - రూ - ఎల్లిదము = చులుకన, స్వజనులు = సమీపబంధువులు.

తాత్పర్యము

విభీషణా! యేల నన్నింత యలక్ష్యముచేసి నాయెదుటనే వీరినందఱ బాధించుచున్నావు? ఛీ! నీవు చేయుపని చాలింపుము. వీరందఱు నాకుఁ గేవల మాప్తులు. ఇప్పుడు నావారిని బరిభవించినవాఁడవు రేపు నన్నుఁ బరిభవించువాఁడవే కదా.

రామచంద్రమూర్తి వానరు లందఱు నావారని చెప్పుటచే నాయనకు వానరులవలె జీతము బత్తెము గోరక నిష్కామకైంకర్యము చేయువారిని తన యాప్తులవలెనే భావించుననియుఁ దన్నవమానించినను సహించునుగాని తనవారి యవమానమును సహింపఁడనియు సూచితము.

కం. చేలములు ప్రహరు లాలయ,జాలంబులు నిట్టి రాజసత్కృతులు తెఱల్
చాలవు చెలువలఁ గావఁగ, స్త్రీలకు సంరక్షకంబు శీలంబె చుమీ. ౨౭౪౪

అర్థములు. చేలములు = వస్త్రములు, అనఁగా ముసుఁగులు, ప్రహరులు=ప్రాకారములు, కోటగోడలు, ఆలయజాలంబులు = ఇండ్లసమూహములు, రాజసత్కృతులు=రాజులకుఁ గల సమ్మానములు, తెఱల్ =పరదాలు, శీలంబు= చక్కని నడవడి, పాతివ్రత్యము.

తాత్పర్యము

రాజస్త్రీ యీ గుంపంతయుఁ జూచుచుండ నెట్టులు గుంపులోనికి రాఁగల దందువా? వచ్చిన నేమి? ఆ మాత్రమునన నలువురముఖము దాను జూచి నలువురు తన్నుఁ జూడఁగానే చెడిపోవునా? ఆ కారణము చేతనా రాజస్త్రీల నెవ్వరు చూడరా దందువు. అది సరిగాదు. స్త్రీలను రక్షించునవి వారి ముసుఁగులు కావు, కోటగోడలు కావు, అంతఃపురములు గావు, ఇట్టి రాజగౌరవములుకావు, తెఱలు గావు. ఇవి యేవియు స్త్రీలను గాపాడఁజాలవు వారి మనస్సు దుర్వృత్తియందుఁ బోయెనేని యివి యేవియు నడ్డము రాఁజాలవు. మనస్సు చెడినచో వారు చెడినట్టే. కావున స్త్రీలను గాపాడునది వారి పాతివ్రత్యమే; వారి సదాచారసంపత్తియే.

మనుస్మృతి తొమ్మిదవ యధ్యాయమున—

'సూక్ష్మేభ్యోఽపి ప్రసంగేభ్యః స్త్రియో రక్ష్యా విశేషతః
ద్వయోర్హి కులయోః శోకమావహేయు రరక్షితాః. ౫

కొంచెమైనను దుష్టసాంగత్యము లేకుండ స్త్రీలను మిక్కిలి జాగ్రత్తతో రక్షింపవలయును. వా రట్లు జాగ్రత్తతోఁ గాపాడఁబడరేని వారు రెండు వంశములను (మగనివంశము - తండ్రివంశము) శోకము పాలుసేయుదురు. (నరకప్రాప్తి కలిగింతురు.)

ఇమంహి సర్వవర్ణానాం పశ్యంతో ధర్మ ముత్తమమ్
యతంతే రక్షితుం భార్యాం భర్తారో దుర్బలా అపి. ౬

బ్రాహ్మణాదులగు సర్వవర్ణములవారును వారివారి భార్యల శీలమును రక్షించుట తక్కిన యన్ని ధర్మములకంటె ముఖ్యమైన ధర్మము భర్తలు కుంటివారు గ్రుడ్డివారు బలహీనులు నైనను భార్యలశీలమును గాపాడవలయును.

అట్లు భార్యను గాపాడుటంజేసి వ్యభిచారాదిసంకరదోషములు లేమిచే పరిశుద్ధమైన సంతతిని, శిష్టాచారమును, తన పెద్దల వంశమును, పరిశుద్ధమైన సంగతివలనఁ గలిగిన పరలోకక్రియలచేతఁ దన్నును పతివ్రతయగు భార్య యుండుటచే యాగాదుల కధికారము కలదు గనుక స్వధర్మరక్షణమును జేసికొన్న వాఁడగును. కావున భార్యాసంరక్షణ మవశ్యకార్యము.

శ్లో॥ పతి ర్భార్యాం సంప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే,
జాయాయా స్తద్ధి జాయాత్వం యదస్యాం జాయతే పునః ॥౦॥

తన రేతస్సు రూపమునఁ దన భార్యాగర్భమందుఁ దాను ప్రవేశించి గర్భమై యా భార్యయందుఁ బుత్రుఁడుగ జన్మించుచున్నాఁడు. కావుననే భార్యకు జాయ యని పేరు కలిగెను. ఏలన భార్యయందు మరల భర్త జన్మించుచున్నాఁడు గదా. అట్టి భార్య చెడనేని తాను జెడినవాఁడే.

'న కశ్చి ద్యోషితః శక్తాః ప్రసహ్య పరిరక్షితుమ్,
ఏతై రూపాయయోగై స్తు శక్యాస్తాః పరిరక్షితుమ్' ।

స్త్రీలను బలవంతముగఁ గాపాడ నెవ్వరికిని దరముగాదు కావున వారి నీ క్రింది యుపాయములచే రక్షింపవలయును.

'అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్,
శౌచే ధర్మేఽన్నపక్త్యాంచ పారిణాహ్యస్య చేక్షణే' ॥

ధనమును గాపాడుట, వ్యయపఱచుటయందును, ద్రవ్యములు శరీరము పరిశుద్ధపఱచుట యందును, పతిసేవ యందును ఈ మొదలగు కార్యములందును, వంటలు వార్పులయందును గృహోపకరణరక్షణ మందును నియమింపవలయును.

'అరక్షితా గృహే రుద్ధాః పురుషై రాప్తకారిభిః
• ఆత్మాన మాత్మనా యాస్తు రక్షేయు స్తా స్సురక్షితాః'॥ ౧౨

కావలివాండ్రమూలమున నిర్బంధముతో సంరక్షింపఁబడు భార్య లెప్పుడును రక్షితలుగారు. ఏ యువతులు దమ్ముఁ దాము కాపాడుకొందురో యా స్త్రీలే చక్కఁగాఁ గాపాడఁబడువారు.

దీనివలన నిర్బంధరక్షణము వ్యర్థమనియు స్త్రీలు చెడకుండుటకై వారికిఁ దగిన విద్యా నీతి మత భక్తి విషయములు దెలుపవలయుననియు మంచిచెడ్డలు దెలిసినచో వారు చెడకుందు రనియు స్మృత్యభిప్రాయము. దీనినే రామచంద్ర మూర్తియుఁ దెలిపెను.

కం. సమరంబుల వ్యసనములన్. డమరముల స్వయంవరంబులం బెండ్లి యెడన్
సుమతీ! యజ్ఞములందుం, గమలాక్షుల దర్శనం బకార్యం బగునే? ౨౬౪

అర్థములు. స్త్రీలు పనిలేక వీథులవెంటఁ దిరుగరాదు గాని కార్యముల పట్ల వెలికిరాఁగూడ దను నియమము లే దనుచున్నాఁడు.

సమరంబులన్ =యుద్ధసంబంధమైన కార్యములందు, మందోదరీ తారలవలె, వ్యసనంబులన్ = కష్టములు కలిగినపుడు, చంద్రమతి - దమయంతి - ద్రౌపది లోనగువారివలె, డమరములన్ =కొల్ల మొదలగు దేశోపద్రవములందు, స్వయంవరమునన్ = తమ భర్తలను దాము వివాహార్థము కోరు సమయమున, పెండ్లి

యెడన్ = వివాహము జరుగునపుడు, యజ్ఞములందు=భర్తలు యజ్ఞము చేయు సమయమందు.

తాత్పర్యము

యుద్ధభూమియందు కష్టములు ప్రాప్తించినపుడు దేశోపద్రవములందు స్వయంవరమందు పెండ్లి వేళ యజ్ఞములందు నో బుద్ధిమంతుఁడా! స్త్రీలను జూచుట దోషముకాదు.

కం. ఈసీత రణతలస్థిత, మాసరదుఃఖములఁ బొంది ♦ మఱిఁగెడి నందున్
నా సవిధంబున నుండఁగ,దోసం బెయ్యదియు లేదు ♦ దోఁచిన బయలన్.

అర్థములు. రణతలస్థిత = యుద్ధభూమి యందున్నది, మాసర దుఃఖములన్ = దీర్ఘ కాలముగ దుఃఖముచే, మఱిఁగెడిన్=సంతసించుచున్నది, నా సవిధంబునన్=నా సమీపమున.

తాత్పర్యము

ఈసీత యుద్ధభూమి యందున్నది. చిరకాలముగ దుఃఖము లనుభవించుచున్నది. అదియును గాక నేను సమీపమందే యున్నాను. కావున నాభార్య నాయెదుట వెలుపల వచ్చుటయందే దోషములేదు.

దీనివలన నేస్త్రీయైనను వేడుకలకు వినోదములకు ఆటపాటలకు ఉబుసుపోకకు విచ్చలవిడి తిరుగ గాదనియు సక్కఱ లవసరముల బయట దిరుగుట దోషము కాదనియు నేర్పడుచున్నది.

—♦ సీతాదేవి శ్రీరాము సమీపంబునకు వచ్చుట ♦—

కం. కాన సుహృజ్జనసంవృతుఁ, డౌ నన్నుఁ గనుఁగాక జనకు ♦ నాత్మజ తోడి తె
మ్మా నావుడు శంకించుచు, దానవసత్తముఁడు దేని♦దఱియఁగఁ దెచ్చెన్.

అర్థములు. సుహృజ్జనసంవృతుఁడు = స్నేహితులతోఁ గూడినవాఁడు, శంకించుచున్=రామచంద్రమూర్తి వాక్యధోరణిఁ బట్టి ఆయన మనస్సు ప్రసన్నముగ లేదు, ఏదో యనర్థము జరుగఁ గలదని సందేహించును.

తాత్పర్యము

ఈ కారణములచే స్నేహితులతోఁ గూడిన నన్ను సీత చూచునుగాక. తీసికొని రమ్మని అనఁగా విభీషణుఁడు సందేహపడుచు సీతాదేవిని సమీపమునకు దెచ్చెను.

కం. రాముని వాక్యంబులకున్, సౌమిత్రియు మారుతాత్మ♦సంజాతుండున్
దామరసాప్తతనూజుం, డేమోయని దుఃఖ మంది ♦ రెంతయు మదులన్.

అర్థములు. ఏమోయని=ఏమో యనర్థము కలుగఁ బోవుచున్నదని.

తాత్పర్యము స్పష్టము.

కం. రాముని పలుకువిధంబును, నాముఖచిహ్నములు గాంచి ♦ యక్కజముఖ్యల్
భూమిజపై రామునకుం, బ్రేమము లేదనుచుఁ దెలిసి♦మిడుకుచునుండన్.

మీఁదఁ జెప్పిన యేమో యను దానిని వివరించుచున్నాఁడు.

తాత్పర్యము స్పష్టము

ఉ. ఆ వనజాక్షి సిగ్గున ని•జావయవంబులు ముడ్చికొంచు ర
క్షోవిభు వెంట వచ్చి నృప•సౌమ్యముఖాబ్జముఁ గోష్ఠిలోఁ గనన్
హైవసనంబునన్ ముఖము•మాటుచు సౌమ్యతరాస్య దాసి య
వ్వావని యేడ్చె బిగ్గఱఁగఁ•బ్రాణధవా! యని యార్తిఁ దూలుచున్. ౩౬౯౪

తాత్పర్యము

సీతాదేవి సిగ్గుచేఁ దన యవయవముల ముడిచికొని విభీషణు వెంట వచ్చి రామచంద్రుని సౌమ్యముఖమును సభలోఁ జూచి తన యుత్తరీయమును ముఖమున కడ్డము వేసికొని మిగుల సౌమ్యమైనముఖము గల సీతాదేవి ప్రాణేశ్వరా యని గట్టిగా నేడ్చెను.

రామచంద్రుని ముఖము సౌమ్యమైనచో సీతాదేవి ముఖము సౌమ్యతరమని చెప్పఁబడెను.

ఉ. దీనతఁ గూరి యెండి పతి•దేవత విస్మయమున్ ముదంబు నెం
తేనిని నెయ్యము న్మది న•హించి వినిర్మలపూర్ణ చంద్రతు
ల్యానన దీర్ఘకాలముగ•వర్షిలిఁ జూడని నాథు జాతరా
కానశినారిబింబసమ•శ్రమముఖంబును జూచె నాదటన్. ౩౬౯౫

అర్థములు. ఎంతేనిని = ఎంతేనియును, సముచ్చయము లోపించి ఎంతేనిని అయ్యెను. ఏని శబ్దమే కాని ప్రమత్రప్రకృతికము గాదు. మఱేన్, ఉండెన్, లేకను వలె నర్థవిశేషమున ప్రయుతమై వచ్చును.

తాత్పర్యము

శోకము గల దయ్యుఁ బతియే దైవమని తలఁచు పూర్ణచంద్రముఖ సీతాదేవి యాశ్చర్యము సంతోషము విశేషస్నేహముగలదై చాలఁగాలముగఁ జూడని తన భర్తయొక్క యుదయించుచున్నపున్నమనాఁటి చంద్రుని బోలిన మోమును ప్రీతితోఁ జూచెను. పున్నమనాఁ డుదయించు చంద్రబింబ మెఱ్ఱగా నుండును. అట్టులే రామచంద్రుముఖము కోపముచే నెఱ్ఱగా నుండె నని సూచన.

## —• ౧౧౮-వ సర్గము. శ్రీరాముఁడు సీతాదేవికిఁ దనజయంబుఁ దెలుపుట •—

కం. తన ప్రక్కన వినయమునన్, వినమితతనులతిక యగుచు • నిలుచుండిన సీ
తను గనిహృదయాంతర్గత, ఘనతరకోపమున నృపతి • కడఁగెం బలుకన్.

అర్థములు. వినమిత తనులతిక=వంగిన తీఁగవంటి దేహముగలది, హృదయాంతర్గత=హృదయమునసుండు, ఘనతర కోపమునన్ = అధికమైన కోపముచే, కడఁగెన్=ప్రారంభించెను, నృపతి=రాజు, నరులను పాలించువాఁడు, ఈకోపమునకు, ఇఁకఁ జెప్పఁబోవు మాటలకుఁ గారణ మేమనిన నీయన రాజగుటయే కారణము.

ఈమెయందు దోషము లేదని నే నెఱింగినను దక్షిణ లోకము ఈమె నిర్దోష రాలని నమ్మదు. కావున నేను ప్రేమాతిశయమునఁ దటాలున స్వీకరించితినా యీమె యపకీర్తికి నే నపవాదమునకుఁ బాలుపడవలసివచ్చును. దుష్ట స్త్రీలకు దత్పతులకు మేము మార్గదర్శుల మగుదుము. 'యథా రాజా తథా ప్రజా' యని కలదు గదా! కావున మా యంతర్గత మెంత పరిశుద్ధముగా నున్నను శ్రేష్ఠుఁ డేది సేయునో తక్కినవారు విమర్శింపక యట్లే చేయుదురు. లోకసంగ్రహార్థము తగిన రీతిఁ బ్రవర్తింపవలయు నని తలఁచెను. ఆచరణముచే లోకమునకు ధర్మము నేర్పవలసిన యవతారము కదా రామావతారము. అనాగతవిధాతగా రామ చంద్రమూర్తి ప్రవర్తించినను పాపలోకము నిందింపక మానినది కాదు.

తాత్పర్యము

తన పార్శ్వమునందు దేహమును వంచి నిలువఁబడిన సీతాదేవిని జూచి తన హృదయమునఁ గల కోపాతిశయమున రాజగు రామచంద్రుఁ డిట్లు పలుక నారంభించెను.

ఉ. కంటకుఁ డైన శాత్రవుని • గం డడఁగించితి జన్యమందు, గై
కొంటిని నన్ను, నెయ్యది యకుంఠితశక్తి నొనర్పఁ జెల్లు వా
ల్గంటిరో! యంతయుం జలుపఁ • గంటిని, సార్థక మయ్యెఁ గింకయున్,
గంటిని శత్రుధిక్కృతిని • గీర్తి వహించితి భూతలంబునన్. ౧౧౪

• అర్థములు. కంటకుఁడైన = ముల్లువలె బాధ గలిగించువాఁడగు, జన్య మందున్ = యుద్ధమందు, అకుంఠితశక్తిన్ = మొక్కవోని సామర్థ్యముచేత, కింక = కోపము, శత్రుధిక్కృతిని = విరోధి ధిక్కారమును.

తాత్పర్యము

బాధ కలిగించిన విరోధిని యుద్ధమందుఁ జంపితిని. నిన్ను గ్రహించితిని. పూర్ణసామర్థ్యముచే నేది చేయఁదగునో యంతయుఁ జేయఁ గల్గితిని. నా కోపము సఫలమయ్యెను. పగవాఁడు చేసిన యవమానమును బోఁద్రోచితిని. భూమి యందుఁ గీర్తి వహించితిని.

కం. పగవానిని నవమానము, యుగపత్క్రియఁ జెఱచినాఁడ • నుదుటున నాదౌ
మగఁటిమి జగము లెఱింగెను, మగువా! ఫలియించె నాస•మ స్తశ్రమమున్.

అర్థములు. యుగపత్క్రియ = ఒక్కసారిగ, ఏకకాలమందు, ఉదుటున = బలగర్వముచే.

తాత్పర్యము

పగవానిని నవమానము నొక్కటిగ నేకకాలమందు నా బలగర్వముచేఁ గొట్టివేసితిని. నా శౌర్యము లోకము తెలిసికొనెను. నేను బడిన శ్రమ యంతయు సఫల మయ్యెను.

కం. నా పలికినయాబాస వృథాపడ కొనరించి నే స్వ • తంత్రుఁడ నైతిన్
బాపురె యన నా పరిధాత్రీపాలకులం దలెత్తి • తిరుగంగంటిన్. ౨౬౯

అర్థములు. బాస = మాట, ప్రతిజ్ఞ.

తాత్పర్యము

నేను రావణాసురుని జంపెదనని చేసినప్రతిజ్ఞ వ్యర్థమై పోకుండఁ జేసి నేను స్వతంత్రుఁడనై తిని. నా పరిరాజులాశ్చర్యపడునట్లు వారిలో తలయెత్తి సగౌరవముగఁ దిరుగఁగంటిని.

కం. నే విడిచి యుండునెడ నిను, నావిధిఁ జలచిత్తుఁ డసుర • హరియించెఁగదా
దైవకృతం బగుదోషము, నావలన నిరస్తమయ్యె • నరగురుశక్తిన్. ౨౭౦

తాత్పర్యము

నేను నిన్ను విడిచియుండు సమయమున నా చపలచిత్తుఁడు నిన్ను హరించెను గదా. ఈ దోషము దైవముదే. నీది కాదు, నాది కాదు. అట్టి దైవదోషమును నా పౌరుషముచే నివర్తింపఁ జేసితిని.

కం. పరిభవము దొడరె నేనియు, గురుశక్తిం దానిఁ దీర్ప • గొనకొనఁడేనిన్
బురుషుఁడు పురుషుం డగునే, పురుషార్థము లట్టి నీచ • పురుషున కున్నే.

అర్థములు. పరిభవము = అవమానము, తొడరెనేని = లభించినపుడు, గురుశక్తిన్ = గొప్ప పౌరుషముచే, తీర్పన్ = చక్కఁజేయ, గొనకొనఁడేనిన్ = పూనఁడయ్యెనా.

తాత్పర్యము

అవమానము సంభవించినపుడు దానిని గొప్ప పురుషశక్తిచే చక్కఁ జేయ యత్నింపని మగవాఁ డొక మగవాఁడా, ఆ నీచపురుషునకు పురుషార్థములం దేదైనఁగలదా! ఏదియుఁ గలుగదు.

ఇచ్చట ధర్మసందేహ మొకటి బాధించెడిని :

ఇచ్చట సీతాహరణము దైవకృతమని రామచంద్రమూర్తి యంగీకరించెను. సీతాదేవియు 'దైవంబె దోషకారి తథ్యము' ౨౭౦ ప. అనియుఁ జెప్పెను. ఇది సత్యమే కాని రామచంద్రమూర్తి యాదైవమును దన పురుషకారముచే నివర్తింపఁ జేసితినని ప్రజ్ఞలు పలుకుచున్నాఁడుగదా; యీ తెలివి పట్టాభిషేకము విఘ్నమైన కాలమున నెందుఁ బోయెను. పట్టాభిషేక విఘ్నము దైవకృతమని రామచంద్రమూర్తి వాదించెను ? అట్టి దైవకృతమును పౌరుషముచే నివర్తింపఁ జేసెదనని లక్ష్మణుఁడు వాదించెను. రామచంద్రమూర్తి దైవమే పరమని దాని నంగీకరించిన వాఁడుకాఁడు. అట్టులే యిప్పుడును సీతాహరణము దైవకృతమని యూరకుండక యేల పురుషప్రయత్నముచే దానిని జక్కఁ జేసెను ?

దైవము, పురుషప్రయత్నము - ఈ రెంటిలో నేది బలీయ మన్నప్పుడు

దైవమే బలీయమనుట నిర్వివాదము. దైవబలము లేక పౌరుషము ఫలింపదు. మన యత్నము లేకయే దైవమేదో యొక రూపమునఁ దన కార్యము సంఘటింపఁ జేయును. అయినను మన యొక ఫలము గోరితిమేని నది దైవమే యిచ్చునని పురుష కారము మానరాదు. దైవమిచ్చినదానితో సంతుష్టిపడి యుండువానికిఁ బురుష కార మనావశ్యకము. 'యోగక్షేమం వహామ్యహ'మను మాట ప్రమాణము.

పట్టాభిషేక విఘ్నమునకు మూలకారణము దైవమైనను అవ్యవధానకారణము జనకాజ్ఞ యైయున్నది. దైవమును ధిక్కరింపఁదలఁచిన జనకాజ్ఞ ధిక్కరించి నట్లగును. అది ధర్మవిరుద్ధము. ధర్మమునకు బాధకలిగించు పురుషకారము నిషిద్ధమని రామచంద్రుని యభిప్రాయము. సీతాహరణమం దట్టి సంకటము లేదు. ఇచ్చట దైవమును పౌరుషముచే నివర్తింపఁజేయుటవలనఁ గలిగెడి ధర్మహాని లేదు. నివర్తింపకుండిన ధర్మహాని కలదు. కావునఁ బురుషప్రయత్నము కర్తవ్య మయ్యెను. అచ్చట దైవము ననువర్తించుటవలనఁ గీర్తి లభించెను. ఇచ్చట దైవము ననువర్తించిన నపకీర్తి వచ్చియుండును. ధర్మహానియుఁ గలిగియుండును. కావున ధర్మవిరుద్ధమైన పురుషకారము త్యాజ్యముకాని పురుషకారము లన్నియుఁ ద్యాజ్యములు గావు. ఒక ధర్మము మఱియొక ధర్మమును బాధింపరాదు. నిష్కామశుద్ధధర్మమునకంటె నర్థ కామముల సంబంధముగల ధర్మము జఘన్యము.

కం. జలనిధి లంఘించుటయును, బలవద్రిపుపురము లంక • భంగంబు మహా

బలసుతు శ్లాఘ్యక్రియలో, జలజాక్షీ! నేఁడ చుమ్ము • సఫలములయ్యెన్.

అర్థములు. మహాబలసుతు=వాయుపుత్రుఁడగు నాంజనేయుని యొక్క, శ్లాఘ్యక్రియలు=పొగడఁదగిన కార్యములు.

తాత్పర్యము

సముద్రమును దాఁటుట బలవంతుఁడైన శత్రువుపురము గాల్చుట లోనగు హనుమంతుని శ్లాఘ్యకార్యములు నేఁడు ఫలవంతము లయ్యెను.

కం. ఆలమున మహాశౌర్యం, బాలోచనములను హితసమంచితమంత్రం

బోలి వెలయించు వానరజాలేశ్వరుశ్రమము నేఁడు • సఫలం బయ్యెన్.

అర్థములు. ఆలమునన్=యుద్ధమందు, హితసమంచిత మంత్రము=మేలుతోఁ గూడిన యాలోచనము, వానరజాలేశ్వరు = వానరసమూహముయొక్క ప్రభువు సుగ్రీవుని యొక్క, శ్రమము=కష్టము.

తాత్పర్యము

యుద్ధమునందు శౌర్యము ఆలోచనలందు మేలగు నాలోచనము చెప్పుచుండు సుగ్రీవునికష్టము నేఁడు ఫలించెను.

ఆ. దోషశీలుఁ డైన • తోఁడఁబుట్టినవానిఁ, బాసివచ్చి నాదు • ప్రాపుఁ గాంచె

నివ్విభీషణుండు • నీ వరభక్తుని, శ్రమము సకల మిపుడు • సఫలమయ్యె.

ఇందు విభీషణుఁడు భర్తుఁడనియే చెప్పఁబడెను.

తాత్పర్యము స్పష్టము.

చ. అని వచియించుచుండ హృదయాధిపుఁ డా మృగశాబనేత్ర లో
చనముల నశ్రువారిచయసంకలితంబులఁ జేయ రాముఁడు
గని నెయి వోయ మందు జ్వలనం బనఁ గ్రోధవివర్ధితాకృతిం
బొనరెడి భ్రూకుటిన్ భువనమోహినిఁ జక్కఁగఁ జూడ కిట్లనున్. [illegible]

అర్థములు. మృగశాబనేత్ర = జింకపిల్ల కన్నులవంటి కన్నులు గలది. అశ్రువారిచయ సంకలితంబులు=కన్నీళ్ళతోఁ గూడినవి, నెయి, ఘృ, నెయ్యి = నేయి, జ్వలనంబు = అగ్ని, క్రోధవివర్ధితాకృతిన్ = కోపముచే వృద్ధిపొందిన యాకారము గలది, భ్రూకుటిన్=బొమముడిని.

తాత్పర్యము

తన హృదయేశ్వరుఁ డీ ప్రకారము పరులతో ముచ్చటించునట్లు లేవో తన విషయములు చెప్పుచు తన(సీత)విషయమై యంగీకారసూచకమైన మాట నొకటి యైనఁ జెప్పకయుండుటచే నామె కన్నులనిండ నీరు నించెను. అది చూచి రామచంద్రుఁడు మనస్సు మెత్తనచేసినఁ గార్యహాని యని తలఁచి యాకన్నీరు తన కోపాగ్నికి నెయ్యివలెఁ గాఁగా కోపాతిశయమున బొమముడి దీర్ఘముచేసి విచ్చి మొగమ్మఁ జూచిన మొగమాటమను సామెత ప్రకారము భువనమోహిని యగు నామెనుజూచిన తన మనస్సు మోహములోఁబడునని ముఖము సరిగాఁ జూడక.

కం. నాతీ! యరాతికృతపరిభూతిం దొలఁగింప గోరు పురుషుం డెది వి
ఖ్యాతిగ నొనర్పఁదగు నది, త్ర్యాతల మెఱుఁగంగఁ జలుపఁగంటిని శక్తిన్.

అర్థములు. అరాతికృతపరిభూతిన్=శత్రువుచేసిన తిరస్కారమును, నాతీ= ఆఁడుదానా, ప్రియురాలా, ప్రాణేశ్వరీ యను మాటలు పోయినవి. ఆఁడుదానా యనుదశ వచ్చినది.

తాత్పర్యము

శత్రువుచేసిన యవమానమును తొలఁగించుకొనఁగోరు పురుషుఁ డే కార్యము ప్రసిద్ధముగఁ జేయునో యది లోక మెఱుఁగఁగ నాశక్తిని జేసితిని.

తే. జీవలోకంబులకు నెల్ల నేగిసేయు, రాక్షసులచేత మును దురారాధ్యమైన
శమనుదిశఁ గుంభజుఁడు ముక్తసలిపినట్లు, శాత్రవార్దిత నిను ముక్తపలిపినాఁడ.

అర్థములు. జీవలోకంబునకున్ = ప్రాణికోటికి, నేగి = కీడు, దురారాధ్యము = సేవింపరానిది, పొందరానిది, శమనుదిశ=దక్షిణము, కుంభజుఁడు = అగస్త్యుఁడు, శాత్రవార్దితన్=విరోధిచే బాధింపఁబడిన.

తాత్పర్యము

లోకుల కందఱకుఁ గీడుసేయు రాక్షసులవలన సేవింపరాకయుండిన దక్షిణ

దిక్కును అగస్త్యుఁడు వారిబాధనుండి తప్పించినట్లు నిన్ను శత్రుబాధనుండి తప్పించి నాఁడను.

**—• శ్రీరాముఁడు సీతాదేవిని దా నొల్ల నని చెప్పుట. •—**

కం. నెయ్యురసాహాయ్యంబునఁ, గయ్యంబున నరులఁ ద్రుంచి • గాసిపడుచు నేఁ
 గ్రయ్యుట నీకై కాదని, తొయ్యలి నీమదిని దెలియు • దువు గాక యిటన్.

అర్థములు. క్రయ్యుట = కలయుట.

తాత్పర్యము

మిత్రుల సాహాయ్యముచే యుద్ధమున శత్రువులఁ జంపి శ్రమపడి యిట్లు నిన్నుఁ గలయుట నిన్ను గ్రహించుటకుఁ గాదని తెలిసికొనుము.

కం. కులగౌరవంబుఁ గావఁగ, వలరింపఁగ నాదుశీల • మపవాదంబున్
 దొలఁగింప గీర్తి నిలుపఁగ, బలితపుఁ గయ్యముల గాసి•పడితిన్ వింటే.

తాత్పర్యము స్పష్టము.

కం. జనశంకిత చారిత్రవు, వనజాక్షి! నీవు నాదు • పజ్జను నిలువన్
 గనుకలక వానిముందటి, పెనుదీపమువోలె దాయ • విధ మైతి చుమీ.

అర్థములు. జనశంకిత చారిత్రవు = జనులచే సందేహింపఁబడు నడవడి గలదానవు. లోకులు నీ నడవడి సందేహింతురే కాని నాకు సందేహము లేదని ధ్వని. దాయ = శత్రువు.

తాత్పర్యము

నీవు లోకులు సందేహించు చరిత్రము గలదానవై తివి. ఏలన నీవు వనజాక్షివి. తామరలవంటి కన్నులుగల యందగత్తెవు. కావున నిన్నాళ్ళు చెడక యుందువని లోక మెట్లు విశ్వసింపఁగలదు? ఇట్టి నీవు నాప్రక్కను నిలువఁబడి కనుల కలఁకవాని యెదుట నుంచఁబడిన దీపమువలె నన్ను బాధించుచున్నావు.

కనుకలఁకవాని ముందటి దీప మున్నప్పుడు దోషము దీపమునందు లేదు. పురుషునియందుఁ గలదు. అట్టులే దోషము నీయందు లేదు. అపవాదభయముచే బాధపడు నాయం దున్నది. దీపమును దూరముగఁ గనులకుఁ గానరాక యుంచినఁ బురుషునకు సుఖముకావున నిన్ను నాయెదుట లేకుండఁ జేసితినని నేను సుఖింతును

కం. నాతీ! యనుజ్ఞ యిచ్చితి, నే తరలుము నీ కభీష్ట • విధమున నాశా
 వ్రాతంబుల నెట కేనియు, నీతోఁ గార్యంబు లేదు•నిజముగ నాకున్. ౨౦-౨౧

అర్థములు. ఆశావ్రాతంబులకున్ = దిక్కులకు, నీయిష్ట ప్రకారమే దిక్కునకైనఁ బొమ్ము, నాయెదుట లేకుండినఁ జాలును.

తాత్పర్యము స్పష్టము.

కం. ఉత్తమకులజుం డెవ్వఁడు, సత్తేజోయుక్తుఁ డన్య • సదనస్థిత యౌ
 నత్తరుణి మరల నెయ్యపుఁ జిత్తమునఁ బరిగ్రహించుఁ • జెపు మెపుడేనిన్.

అర్థములు. ఉత్తమ కులజుఁడు=గొప్పకులమునఁ బుట్టినవాఁడు, సత్ + తేజోయుక్తుఁడు = మంచి తేజస్సుతోఁ గూడిన వాఁడు, అన్యసదన స్థిత=ఇతరుల యింటి యందున్న దానిని, తరుణిన్ = వయస్సు స్త్రీని, నెయ్యపుఁ జిత్తమునన్= స్నేహ భావమున.

తాత్పర్యము

ఉత్తమవంశమున నుత్తమ జాతియందుఁ బుట్టినవాఁడు కీర్తి ప్రతాపములు గలవాఁడే పురుషుఁడైనను పరునియింట దీర్ఘకాలముండిన వయస్సువచ్చిన యాఁడుదానిని మరల భార్య యను స్నేహ భావముతో గ్రహించునా? నీవే చెప్పుము. వయస్సు వచ్చిన తన భార్యను దాని పుట్టిన యింటనైన నెక్కువకాల ముండ నిచ్చినేని దాని శీలము సందేహింపఁ దగినదే—'తన యిల్లాలి దాని పుట్టిన యింటన్ దడవుండ నిచ్చె నేనియుఁ బడఁతిని సంగడిఁ దాని పంపుట సుమతీ' యని నీతి శాస్త్రము. కావున నిన్ని దినాలు శత్రువునింట నుండు నిన్ను నే నిట్లు పరిగ్రహింతును ?

ఉ. దుష్టుఁడు చూచె నన్నుఁ గడు • దోషపుఁజూడ్కులచేఁ, దదంకసం
భ్రష్టవు నైతి, విట్టి నిను • రాజకుమారిక ! వంశశీలతన్
శిష్టుఁడ నంచుఁ జెప్పికొను • నే నెటు వెండి గ్రహింప నేర్చెదన్ ?
గష్టము మానహానికర • కార్యము రాముఁడు చేయఁ డెన్నఁడున్. ౨౨-౨౩

అర్థములు. తదంక సంభ్రష్టవు = వాని యొడియం దుండుటచే భ్రష్టురాలవు, వంశశీలతన్=గొప్ప వంశమునఁ బుట్టుటచేత, గొప్ప సదాచారముచేత, గొప్ప వంశాచారముచేత, శిష్టుఁడను=సదాచార సంపన్నుఁడను, వెండి=మరల, మానహానికర కార్యము=గౌరవమునకు హాని కలిగించుపని రాముఁడు చేయఁడు, నేను జేయనని చెప్పుటకు మాఱు ప్రథమ పురుషమునఁ జెప్పుట యాత్మగౌరవార్థమని యెఱుంగునది. రాముఁడని పేరుగలవాఁడు కూడ నటువంటి పని చేయఁడని నామగౌరవద్యోతక మగు నర్థము.

తాత్పర్యము

దుష్కామ దోషముగల చూపులనిన్ను దుష్టుఁడు చూచెను వాని కన్నులతో వాఁడు చూచిన నే నేమి చేయుదును? వానికన్నులు మూయుదునా యందువేమో వాని యొడియందు నిన్నుంచుకొనుటచే భ్రష్టవైతివి. ఇట్టి నిన్ను నో రాచదానా ! సద్వంశమునఁ బుట్టి సదాచారసంపత్తి గలిగి సదాచారసంపన్నుఁడ నని చెప్పుకొను నేను మరల నెట్లు గ్రహింతును? అటువంటి నీచము గౌరవహానికర కార్యము రాముఁడు చేయఁడు సుమా, రాముఁడు కామదాసుఁడు గాఁడు.

ఉ. కావున నాదుకీర్తి నిలఁ • గాచుకొనన్ దశకంఠుఁ ద్రుంచి నీ
తా! విడిపించినాఁడ నినుఁ • దథ్యము నీపయి స్నేహమోహముల్

భావమునందు లేవు, మగువా! చను మిచ్చటనుండి నీకు మో
దావహ మైనభంగి నెట•కైనను, నీకు ననుజ్ఞ యిచ్చితిన్. ౨౬౪

తాత్పర్యము

ఈ కారణముచేత రాక్షసుఁ డెత్తుకొనిపోయిన తన భార్యను విడిపించుకొన లేకపోయినాఁడు రాముఁడను నపకీర్తి రాకుండుటకును శత్రువుల వధించి మరల భార్యను గ్రహించినాఁడను కీర్తి కాపాడుకొనుటకు నేను రావణుని జంపి నిన్ను వాని చెఱనుండి విడిపించితినిగాని నిశ్చయముగా నీమీఁది కామమోహములచేఁ గాదు. అవి నామనస్సునందు లేవు. ఆఁడుదానా! నీ విచ్చటనుండి నీకు సంతోష కరమైన చోటికిఁ బొమ్ము. నీ కనుజ్ఞ యిచ్చితిని.

సీ. మానినీ! చక్కఁగ • మఱిమఱి యోజించి, పలుకుచున్నాఁడ•స్పష్టఫణితి
నిలుము లక్ష్మణునొద్ద•నేనియు భరతుని, యొద్దనేనిఁ గపీంద్రు•నొద్దనేని
నీ విభీషణునొద్ద•నేని నీ కెది సుఖ, మట్లభంగిఁ జేయుమీ • యవనితనయ !
దివ్యరూపవు మనో•దృష్ట్యభిరామ వై తనయింట జిక్కఁగ•దిరుగనీ నిన్నుఁ
తే. గాంచి దశకంఠుఁడిటు చాల•కాలమోర్చి, యూరకుండెడివాఁడు రంభోరు! వింటె
కావన నినునొల్ల నీయెడఁ•గామ ముండఁ, గాను జను మిచ్చకోలఁది ని•క్కంబయనిన.

తాత్పర్యము

సీతా! నేను చెప్పునది యాలోచింపక యేదో నోరికివచ్చినది కోపవశమునఁ జెప్పుచున్నానని తలఁపకుము. పలుమాఱు చక్కఁగ నాలోచించి స్పష్టముగ చెప్పు చున్నాను. సందేహింపవలదు. నీవు స్త్రీవి గావున స్వతంత్రవై యుండరాదు. భర్త విడిచిన స్త్రీ బంధువుల యొద్ద నుండవచ్చును. కావున నీవు లక్ష్మణునింటనో భరతు నింటనో సుగ్రీవునింటనో విభీషణునింటనో యుండి కాలము గడుపుము. నీకెం దేది సుఖకరమని తోఁచునో యట్లు చేయుము. నీవు వదలవలసిన కారణమేమి? నీయింట నేల యుండరాదనెదవా? నీవు దేవతాస్త్రీవంటి యందగత్తెవు. ఎట్టివారి చూపు లను మనస్సునైన నానందింపఁజేయుదానవు. ఇట్టి నీవు వయస్సుదానవై తన యింటఁ జిక్కఁగా జూచి రావణుఁడా చాలఁగాలమోర్చి నిన్ను జెఱుపక యూర కుండువాఁడు? కాఁబట్టి నిన్నొల్లను. నీయందు నాకుఁ గామము లేదు. నీ యిష్టము వచ్చినట్లు పొమ్ము. నాయింట నుండిన నేను నిన్ను భార్యగా గ్రహించితినని లోకము సందేహించును. కావున నాయింటఁదప్ప నీ వెందైన నుండుము. ఇది నిశ్చయము.

చ. ప్రియము వినంగ నర్హయయి•విశ్రుతశీల ప్రియంబు వేచుచోఁ
బ్రియుఁ డిటు లప్రియంబు లనఁ•బెద్దయుఁ గాలము చెల్లి యిట్టివా
క్యములు వింటఁ జేసి మద•నాగజహస్త నికృత్తసల్లకీ
క్రియ వసుఁ జాఁడి బాష్పలహ•రిన్ వెలిగాఱిచె దుఃఖిత య్యయై. ౨౬౫

అర్థములు. మదసామజ=మదపు టేనుఁగుయొక్క, హస్త=తొండముచే, నికృత్త=విఱువఁబడిన, వల్లకీ క్రియన్ = అందుగుచెట్టువలె, వడఁకాడి = వణఁకి, బాష్పలహరిన్=కన్నీళ్ళ ప్రవాహమును.

తాత్పర్యము

ప్రసిద్ధపతివ్రతయగు సీతాదేవి ప్రీతికరమైన మాటలు విననయోగ్యురాలు కావున మగఁడు ప్రీతికరములైన మాటలు చెప్పును, విని సంతోషింప వచ్చును అని యెంత కాలముగానో వేచియుండఁగా ప్రియుఁడే యిట్టు లప్రియము పలుకఁగా దీర్ఘకాలము చెల్లియు నివి వినవలసివచ్చుటచేత మదపుటేనుఁగుతొండముచే విఱువఁబడిన యందుగుచెట్టు నీరు కార్చువట్లు శోకభయముల వణకుచు దుఃఖముచేఁ దపించుచు సీతాదేవి కన్నీళ్ళు వెల్లువగాఁ గార్చెను.

—•{ ౧౧౬-వ సర్గము. శ్రీరామునివాక్యంబులకు సీతాదేవి దుఃఖించి ప్రత్యుత్తరం బిచ్చుట }•—

సీ. ఎన్నఁడు మును విని•యేనియు నెఱుఁగని, రోషనిష్ఠుర ఘోర•భాషణముల
నిండినసభను గాం•తుం డిటు పల్కిన, లజ్జచేఁ దల వ్రాల్చి • లలితశీల
తనువు నిల్పఁగ • లేక దారుణభాషణ, శరతాడ్యమాన త•చ్ఛల్యసమితి
మర్మంబులను నాటి • మఱి మఱి కోయఁగ, గన్నీటికాల్వలఁ•గార్చుకొనుచు
తే. నశ్రుజలములఁ దడిసిన•యాననంబుఁ, బైఁటకొంగునఁ దుడుచుచుఁ•భర్తఁ జూచి
యింతి గాద్గదికం బగు•నీ రెలుంగు, కలుగ మెల్లన వచియించుఁ • గళవళమున.

అర్థములు. రోషనిష్ఠుర ఘోరభాషణములన్ = సీతాదేవి భర్త తన్నుఁ గోపించి మాటలాడఁగా విని యెఱుఁగదు. ప్రణయకోపంబున మాటలాడినను నిష్ఠురములు విని యెఱుఁగదు. నిష్ఠురముగ మాటలాడినను క్రూరములై భయంకరములైన మాటలు విని యెఱుఁగదు. అట్టి సీతాదేవి రహస్యమునఁ గాదు, నిండిన సభలో మఱియెవ్వఁడో కాఁడు-కాంతుఁడే,-మనోహరుఁడే-దారుణ=భయంకరములైన, భాషణ = మాటలనెడి శర = బాణములచే, తాడ్యమాన = కొట్టఁబడినది, తత్ +శల్య+సమితి=ఆ ములుకుల సమూహము, మర్మంబులన్ = ఆయువు పట్టులను, గాద్గదికంబు = డగ్గుత్తికతోఁ గూడిన. ఈ రెలుంగు = సన్నని ధ్వని, కళవళమునన్=కలఁతతో.

తాత్పర్యము

పూర్వమెన్నఁడైనను రోషపుమాటలు, అందు నిష్ఠురవాక్యములు, అందు భయంకరములైన వాక్యములు ఎవ రాడినను విని యెఱుంగదు. అట్టిది నిండు సభలోఁ దన ప్రియుఁడే యిటు పలుకఁగా సిగ్గుచేఁ దలవంచి నిలఁబడలేక కఠినభాషణములను బాణములచేఁ గొట్టఁబడి యా ములుకు లాయువు పట్టులఁ దగిలి

మీఁద మీఁద గోయఁగా కన్నీరు కాల్వలుగాఁ బాఱఁజేయుచు కన్నీటఁ దడిసిన ముఖమును జైఁటకొంగుచేఁ దుడుచుకొనుచు మగనిఁ జూచి గద్గదస్వరముతో సన్నని గొంతున నిట్లనియె.

ఉ. క్షుద్రుఁడు క్షుద్ర నాడుగతి • శ్రోత్రవిదారణ రూక్షవాక్యముల్
భద్రచరిత్ర! పల్కఁ దగ • నా ననుబోఁటిని? నీ వదేమిగా
ఛిద్రము సంశయించితివి • శీలమునం దటువంటిదానిఁగా
హృద్రస నెంచఁబోకు సుచ•రిత్రముపై శపథంబు సేసెదన్. ౨౫౭౦

అర్థములు. క్షుద్రుఁడు = కులమున గుణమున నీచుఁడు, క్షుద్రను=కులమున గుణమున నీచురాలిని, శ్రోత్రవిదారణ = చెవులను జీల్చునట్టి, రూక్షవాక్యముల్ = పరుషపు మాటలు, భద్రచరిత్ర = శుభకరమైన నడవడి గల వాఁడా, ఇది యెత్తిపొడుపు మాటగానైన వాస్తవముగనైన గ్రహింప నగును. ననుబోఁటినిన్=నావంటి దానిని, ఛిద్రము=సందు, రంధ్రము, హృద్రస=హృదయప్రదేశమున, సుచరిత్రముపై=పాతివ్రత్యముమీఁద, శపథంబు=ప్రమాణము.

తాత్పర్యము

భద్రచరిత్ర = వంశశీలతన్ శిష్టుఁడ నని చెప్పుకొనువాఁడా! కులమున శీలమున నీచుఁడగువాఁడు, కులశీలముల నీచయగుదానిని బల్కినట్లు చెవులు చీల్చు కఠినవాక్యము లెట్లు పల్కితివి? అందు నన్ను నుద్దేశించి యెట్లు పల్కితివి? నీవు శిష్టుఁడవైతివా నీ నోర నిటువంటి మాటలు రానేరావు. శిష్టులు నీచులనైన నిట్లు మాటలాడరు. నీవు క్షుద్రుఁడ వైతివా? యెంతటి క్షుద్రుఁడైనను కులశీలముల శిష్టయగు దానిని మాటలాడఁడు. నీవెట్టి వాఁడవైనను నీమాటలు నాకన్వయింపవు. నీవు వాస్తవమున గొప్పవాఁడవు. గొప్పవాఁడు మాట్లాడినట్లు మాట్లాడక యిట్లు మాటలాడుట నీకుఁ దగదు. నా శీలమునందేమి లోపము గలదని కనిపెట్టి నీవు నన్ను సంశయించితివి? నాశీలమునం దెటువంటి దోషము గలదని నీవు సందేహించితివో యట్టి దోషము నాయందు లేదని పాతివ్రత్యముపైఁ బ్రమాణము చేసెదను.

ఉ. స్త్రీలను నీతిహీన లగు•చెన్నఁటి జాఁగల నాత్మ నుంచి యో
షాఖిలజాతి యంతయును • నట్టిదిగాఁ దలపోయ నేల? న
చ్ఛీలపరీక్ష నీవు మును • చేసియ యుండిన నిట్టిశంకలన్
బోలఁగ నీకుమీ, కతము • పుట్టదు పో యిటువంటివానికిన్. ౨౫౭౧

తాత్పర్యము

నేను సంశయించిన దోషము స్త్రీల యందు లేదా యందువేమో? ఏ స్త్రీల యందుఁ గలదు? పతివ్రతల యందుఁ గలదా? నీతిమాలిన చెడ్డ లంకటాండ్ర యందుఁ గలదా? ఎవరో దుష్టస్త్రీ లేమో చేసినారని స్త్రీలందఱట్టి వారే యని

నీవు తలంప వచ్చునా? అట్లైనఁ బురుషులందు మంచివారు చెడ్డవారు లేరా? రావణుఁడు పురుషుఁడు దుష్టుఁడని నీవు నట్టివాఁడ వని నే ననవచ్చునా? తడిక త్రోసినవాఁడెవఁడనిన నాలు లేనివాఁడన్నట్లు లిన్నినాళ్ళు నేను నీయొద్ద లేనప్పుడు నీ వెచ్చట నే మాటలాడితివో యని నేను సందేహింపవచ్చునా? కూడదు. ఏల? నీ నడవడి నేను బరీక్షించియున్నాను. అట్టి గుణము నీయందు లేదు. అట్టులే నీవు నా గుణము పరీక్షించియుండిన నిట్టి కుశంకలకుఁ గారణము గలుగదు. కాఁబట్టి యీ శంకలు వదలుము. ఈ శంకలకుఁ గారణమే లేదు. నా యందు దోషము స్థాపింపక కుశంకలచే నన్ను దండించెదవా? శంకామాత్రమున నొకఁడు దండ్యుఁడని యేధర్మశాస్త్రము చెప్పుచున్నది.

కం నే వివశగ వ్రాలినచో, నావపు వతఁ డంటెఁ గాని • నాసమ్మతిఁ గా
దీవిషయంబునఁ జూడఁగ, దైవంబే దోషకారి • తథ్యము నాథా. ౨౬౮౦

అర్థములు. వివశగన్ = పరవశురాలనై, వ్రాలినచో=నేలఁబడి యుండినపుడు, నా వపువు=నా దేహము, నా సమ్మతి గాదు=నే నంగీకరించినది కాదు, దోషకారి=దోషము చేసినవాఁడు, దైవంబే = నా పాలికి నీవే దైవము కావున నీదే దోషము.

తాత్పర్యము

నిన్ను వాఁ డంటెనా లేదా? అది దోషమగునా కాదా? యందువేమో! వాఁడు నన్నుఁ దాఁకినది నిజమే, కాదనను. వాఁడై నన్నుఁ దాఁకెను గాని నేనై వానిని దాఁకలేదు. వాఁ డెప్పుడు నన్నుఁదాఁకెను? నేను పరవశనై మూర్ఛపోయి పడియుండిన సమయంబునఁ దాఁకెను. నేను దానికి సమ్మతించినదానఁ గాను. నాయనుమతిమీఁద వాఁడు తాఁకలేదు. ఎట్లు స్పృశించినను దోషమా? దుష్టభావమున స్పృశించిన దోషమా? దుష్టభావమున స్పృశించిననే దోషమందువా? వానిదుష్టభావమునకు నే నెట్లుత్తరవాదిని గాఁగలను? నాభావము దుష్టమైన నన్ను నీవు దండింపవచ్చును గాని యితరులభావము దుష్టమని నన్ను నీవు దండింపవచ్చునా? నన్ను రక్షింపవలసిన భారము నీయందున్నది. నీవు రక్షింపక పోయితివి. నీకర్తవ్యలోపమున నాకీకష్టము కలిగెను. కావున దోషము నీదిగాని నాది గాదు. స్త్రీ లేవిషయమున స్వతంత్రలు కారుగదా?

కం. మానసము నాయధీనము, మానక నీయంద నిలిచె • మానధన పరా
ధీనపుగాత్రమునెడ నో, ప్రాణేశ్వర! యనద నేమి•యగు నొనరింపన్. ౨౬౮౧

అర్థములు. అనదను=దిక్కు లేని దానను.

తాత్పర్యము

నాథా! త్రికరణములలో కార్యములు చేయునవి మనస్సు. దేహము. మనస్సు తన సమ్మతి లేక పరాధీనము గాఁజాలదు. బలవంతముగా నొకఁడు దానిని లాగి

కొని పోలేఁడు. అట్టి నా మనస్సు నీ యందే నిలిచి యుండినది. ఉన్నది. ఉండఁ గలదు. అది నిన్ను విడిచి పోయినది కాదు. ఇఁక దేహమా, పరాధీనమైనది. ఒక రెట్లీడ్చిన నట్లు పోఁగలది. నా సమ్మతి లేకున్నను, నా యిష్టమునకు విరోధముగాఁ బరులు దాని లాగికొని పోవచ్చును. అట్టి దేహమువిషయమున రక్షకులు లేని నే నేమి చేయఁగలను? అందుఁ బరవశనై పట్టువడినపు డేమి చేయఁగలను? బలవంతుఁడైన వాని పట్టు నేను విడిపించుకొనఁగలనా? అక్కడికి నేను దూఁక యత్నించితిని, నాకు సాధ్యపడినదికాదు అరచితిని, ఏడ్చితిని. మీరు వచ్చినవారు కారు. ఇందు నా దోష మేమి కలదు?

చ. చిరముగఁ గూడి యుంటిమి • చిత్తము లేకము గాఁగ, హాళిమైఁ
దిరిగితి మొక్కఁడై, పెరిఁగి • తి న్నినుఁ గూడి, పరస్పరంబు దాఁ
పుర మొకయింత లేద, యిటు • పొల్పుగ నుండియు నాదుశీలమే
యరయవ యేని నీవు, హత • నైతి హృదీశ్వర! శాశ్వతంబుగన్. ౧౦౨

తాత్పర్యము

ఆ సమయంబున నీ మనస్సెట్లుండెనో నే నెట్లు తెలిసికొనఁగల నందువా? ఎట్టి స్త్రీ యైనను దటాలున నున్నట్టుండి చెడదు, కొంత పూర్వప్రయత్నము వలయును. మొదట మనస్సుమారవలయును. దాని ననుసరించి చేష్టలు మాటలు మారును. వీని నింగితజ్ఞు లెఱుంగఁగలరు ఒక విషయమునఁ గాకున్న మఱియొక విషయమున నొకవేళఁ గాకున్న మఱియొక వేళ మనస్సు బయటపడును గాని పడక పోదు. కావున నెట్టి దుష్ట స్త్రీగాఁ బరిణమించిన దానికైనఁ బూర్వరంగము కొంత కావలసియున్నది. నే నో పుష్పవతిని గాకముందే మీ యింటికి వచ్చితిని. అది మొదలు చిరకాలముగ మన మిరువుర మొక మనస్సుతో వర్తించితిమి. ఎక్కడఁ దిరిగినను మన మొకరి నొకరు విడిచి తిరిగినది లేదు. నీ తోడ నేను పెరిఁగితిని. పెద్దదాననైతిని. నీ రహస్యము నాకుఁ దెలియనిది, నా రహస్యము నీకుఁ దెలియనిది లేదు. ఒకరి సమ్మతి లేక మఱియొక రేకార్యము చేసినదిలేదు. ఈ విధముగ సూర్యుఁడు నెండవలె మనము విడనాడక యుండియు నా శీలము నీవు తెలిసికొనలేక పోయితివేని నీవు తెలివి తక్కువవాఁడ వని నే ననను గాని నీ లోపముచేత నేను శాశ్వతముగఁ జచ్చినదాననే యైతిని.

సీ. ఏటికి దాఁచితి • విందాఁకఁ బ్రాణేశ! నను నెమకంగ నా • వాఁడు పవన
తనయుని లంకకుఁ • బనుచుచో నప్పుడే, యేటికి విడనాడ • వీవు చెపుమ
యప్పుడే యతనితోఁ • జెప్పి యుండిన నీవు, విడిచిన ట్లుసుఱును • విడుచుఁ గాదె
నే మేను వాసిన • నీకును బ్రాణగొడ్డం బగు నిట్టి శ్ర • మంబు లేద
ఆ. నీదు నెయ్యురకును • నిర్భర క్లేశంబు, నిష్ఫలంబుగాక • నెగడియుండు
నీసుహృత్తులకును • నీకును నా కెంత, శ్రమము నిడితి కంటె • జాగు సేఁత. ౧౦౩

అర్థములు. వెదకంగన్ = వెదకుటకు, నానాఁడు = నాఁడు + నాఁడు; నానాఁడు=ఆనాఁడే; ఉసుఱు=ప్రాణము, ప్రాణగొడ్డము=ప్రాణాపాయకరము.

తాత్పర్యము

ప్రాణేశ్వరా! నాయందు నీకిట్టి దురభిప్రాయ ముండెనేని యేల యిన్నాళ్ళు దాఁచితివి? ఆనాఁడు నానిమిత్తమై లంకకు హనుమంతుని బంపినపుడే నీ నడవడి యందు నాకు సందేహముగలదు, కావున నిన్ను వదలితినని చెప్పిపంపియుండిన నీవు వదలినట్లు ప్రాణములుకూడ న న్నానాఁడె వదలిపోయియుండును. ఆ విషయమున నా ప్రయత్న మక్కఱయే లేక యుండును. నేను దేహమును విడిచితినా నీకిటువంటి ప్రాణాపాయకరమైన శ్రమము లేక యుండునుగదా? నీ స్నేహితులు పడిన కష్టము నిష్ఫలము గాక యుండును. నా స్నేహితుల కష్ట మెట్లు వ్యర్థమయ్యెను, రావణుని జంపితినిగదా యందువా? రావణుని జంపుట యెవరికొఱకై? నన్ను గ్రహించుటకుఁగదా? నన్ను గ్రహించితి నంటివే? ఏమి గ్రహించితివి? అశోక వనములో నున్నదానిని సముద్రతీరమున విడిచితివి. ఇదియా నీవు నన్ను గ్రహించుట? అదియునుగాక ఎప్పుడు నామీఁద నీకు సందేహము గలిగెనో యప్పుడే సీత చెడినది. రావణునిఁ జంపి యిఁక దానిని సాధించి ప్రయోజనము లేదని యూర కుండినయెడల నీకు నీ మిత్రులకు నీ శ్రమము లేకుండునుగదా? లేదా హనుమంతుని చేత నీ ఛీ. వార్త చెప్పిపంపిన నా మరణవార్త యాయనచే విని సీత చచ్చినది, ఇఁక రావణుని జంపి సాధించున దేమున్నదని సర్వప్రయత్నములు మానిన నీవు నీ స్నేహితులు సుఖపడి యుందురుగదా! చెట్టుపెట్టి నీళ్ళుపోసి పెంచి కాపుంచి ఫలించినపిమ్మటఁ బండు చేతికిఁ దీసికొని పాఱవేసిన వాని శ్రమము సఫలమైన దగునేని నీ శ్రమము సఫలమే. నీ మనసు బయటఁ బెట్టుటయందు నాలసించి నాకు నీకు నీ స్నేహితుల కెంత కష్టము కలిగించితివో తెలిసికొనలేక పోయితివిగదా?

ఉ. కేవలకోప మూనుటను • గీడును మేలుఁ దలంప లేక యో
భూవర! నీచమానవుని • పోలిక యాఁడుతనంబు నొక్కటే
భావనజేసెదే, జనకు • వ్యాజమునన్ ధరఁబుండి పుట్టుటల్
నావలపున్ సువృత్తముఁ ద • లంపవు వృత్తవిధిజ్ఞ యే మనన్. ౨౬౭౪

తాత్పర్యము

విమర్శనజ్ఞాన మనునది వదలి కోపము నొక్కదానినే గ్రహించిన వాఁడ వగుటచే యిది మేలు, ఇది కీడు అని యాలోచింపలేక నీచమనుష్యునివలె నెద్దినిన దనిన గాఁటఁ గట్టు మన్నట్టు లాఁడుది గావున చెడిపె యని తలంచితివి, అంతే కాని, జనకుఁడను నెపమున నయోనిజనై భూమియందుఁ బుట్టుటయు, నీయందు నాకున్న ప్రేమము, నా చక్కని నడవడి నీ వాలోచించినవాఁడవు కావు. నీకుఁ దెలియదా యనిన వృత్తవిధి తెలిసినవాఁడవే, దాని నాలోచనకుఁ దేనపుడు దానివలన లాభ

మేమి? నీ వంశము నీ శీలము నీవు గొప్పగాఁ జెప్పుకొంటివి. నా వంశము నా శీలము నీ వాలోచింపవైతివి. వంశమందుఁగాని శీలమందుఁగాని నేమిట నీ కంటె నేను దక్కువదాననో చెప్పుము. నీ వంశప్రతిష్ఠ శీలము కాపాడుకొనవలయు నని నీ కున్నంత మాత్రము జ్ఞానము అభిమానము నాకు లేదా? లేదని చెప్పుటకు నీ కేమి యాధారము గలదు? నిష్కారణసందేహము ప్రమాణముగా నెవరైన నంగీకరించిరా? అట్టి సందేహమును నీవు ప్రమాణముగాఁ దీసికొని నన్ను నీ వెట్లు దండింతువు? దోషము స్థిరపడినగదా దండింపవలయును? నీ రాజనీతి తెలుపు శాస్త్రము లేమి చెప్పుచున్నవి? సందేహము గలిగినంత మాత్రముననే దండింపు మని చెప్పుచున్నావా? దోషులను విడుచుటకంటె నిర్దోషుల దండించుట యెక్కువ పాప మని నీవు చదివిన గ్రంథములందు లేదా ?

సీ. నీ చిన్నతనమున ♦ నేఁ జిన్నదాననై, వలచుచు నిన్ను వి ♦ వాహ మగుట
నాఁటఁగోలెను నిన్ను ♦ నాథ! దైవంబుగఁ, దలపోసి నే భక్తి ♦ నలుపుచుంట
యిద్దఱహృదయంబు ♦ లేకంబుగా నెప్డుఁ, గలసియు మెలసియుఁ ♦ గ్రాలుచుంట
నీకష్టసుఖము లే ♦ నాకష్టసుఖములం, చన్నియవస్థల ♦ ననుసరించి

ఆ. నేను దిరుగుచుంట ♦ నిర్మలశీలంబు, నీ వెఱుంగనివియె ♦ నీరజాక్ష!
యేలయొక్క యిప్పు ♦ డిన్నియు వెనుకకు, నెట్టి శంక నొండ పట్టి ♦ తీవు.

తాత్పర్యము స్పష్టము.

ప్రాణేశ్వరా! 'నీ విషయమైన నా శంక నిష్కారణముగాదు. అశాస్త్రీయము గాదు. లోకములో నెవతెయో జారిణి యని స్త్రీలందఱు జారిణు లని నేను జెప్పలేదు. మగనియొద్దఁ గాక యే పరులయింటనైన వయస్సు వచ్చిన స్త్రీ యెక్కువ కాల ముండునేని దాని శీలము సందేహింపవలయును అని శాస్త్రము చెప్పుచున్నది. నీవో - పరుఁడే కాదు, నాకు శత్రువు, స్త్రీలవిషయమున దుష్టుఁడని పేరు పోయినవాఁడు, ఐదునాళ్ళు పదినాళ్ళు గాదు, పది నెలలు నీ వున్నప్పుడు శాస్త్ర ప్రకారము నేను సందేహింప వలయునా, వనిలేదా? కావున నా సందేహమునకు శాస్త్రము ప్రమాణము' అందువేమో, అట్లైన నేను జెప్పవలసినది లేదు.

## —♦ సీతాదేవి యగ్నిప్రవేశముఁ జేయుట ♦—

మ. అని డగ్గుత్తికతోడఁ బల్కుచును దుః ♦ ఖాక్రాంతయై దీనుఁడై
ఘనచింతాబ్ధి మునింగి యున్న మఱఁదిం ♦ గంజాక్షి వీక్షించి యీ
పెనుశోకంబున కౌషధం బగు చితం ♦ బేర్పంగదే లక్ష్మణా!
యనఘా! యిట్టిమహాభిశాపహత నై ♦ ప్రాణంబు నిల్పం జుమీ. ౨౬౮౬

అర్థములు. అని = ఈ ప్రకారము చెప్పి, డగ్గుత్తికతో = గద్గద స్వరముతో, మహాభిశాపహత నై = అపనిందచేతఁ గొట్టఁబడిన దాననై.

తాత్పర్యము

ఈ ప్రకారము గద్గద స్వరముతోఁ జెప్పి దుఃఖముచే నాక్రమింపఁబడినదై చిన్నవోయి గొప్ప వ్యసనములో మునిఁగియున్న మఱఁదిని లక్ష్మణుని జూచి సీతాదేవి యిట్లనియె. లక్ష్మణా! ఈ పెనుశోక మను వ్యాధికి నౌషధము అగ్ని ప్రవేశముదప్ప నేఁడొకటిలేదు. భర్త యాజ్ఞ లేక నీవు ఆప్రకారము చేయవచ్చునా యందువేమో ఇప్పుడు నేను స్వతంత్రురాలను. భర్తృపరతంత్రనుగాను. "నీ కనుజ్ఞ యిచ్చితిని. నీ యిష్టమువచ్చినట్లు పొమ్మ"ని పారతంత్ర్యమునుండి నన్ను నా భర్త ముక్తురాలిని జేసెను. ఇఁక నేను జేయు కార్యమున కడ్డమువచ్చు నధికార మాయనకు లేదు. ఆయన యాజ్ఞగాని యనుమతిగాని యిఁక నాకనావశ్యకము. కావున నీకైనను నాయందుఁ బూర్వపుభక్తి గలదేని చితి పేర్పుము. ఇటువంటి యపనింద వచ్చిన పిమ్మట జీవచ్ఛవనై యేల బ్రదుకవలెను? ఇన్నిమాటలు మాటలాడినను సీతాదేవి నోర రామా యనిమాట రాలేదు. మునుపటి రాముఁడైనచో నిట్లు మాటలాడునా యని కాఁబోలు.

కం. నుతగుణతతులన్ మెచ్చని, పతిచేఁ బేరోలగమునఁ ♦ బరిహృత యగు నా
సతికిన్ యోగ్యం బగు నా,గతిఁ జనెదన్ వహ్నిఁ జొచ్చి ♦ కాకుత్స్థవరా.

అర్థములు. నుతగుణతతులన్=పొగడఁబడుగుణముల చేతను, పేరోలగమునన్=పెద్దసభయందు, పరిహృత=వదలిపెట్టఁబడినది, ఆ సతికిన్=అటువంటి పతివ్రతకు.

తాత్పర్యము

తన శ్లాఘ్యమైన గుణసమూహములను మెచ్చక నిండుసభలో నీవు దుష్టురాలవని భర్తచే వదలి పెట్టఁబడిన పతివ్రతకు నేగతి యోగ్యమో నేను వహ్ని ప్రవేశించి లక్ష్మణా యాగతికిఁ బోయెదను.

చం. అని జనకాత్మజాత యిటు ♦ లాడిన దీనత లక్ష్మణుండు రా
మునివదనంబుఁ జూచి నృప ♦ ముఖ్యుని యాకృతిసూచితాశయం
బును గొని తన్మతంబునను ♦ భూరిచితన్ సమకూర్చ సీతయున్
వినతశిరస్కుఁడైన రఘు ♦ వీరునకున్ వలగొంచు మెల్లఁగన్. ౨౬౨౮

అర్థములు. ఆకృతి=ఆకారముచే, సూచిత=సూచింపఁబడిన, ఆశయంబు=అభిప్రాయము, తన్మతంబునను=ఆయన సమ్మతిమీఁద, వినతశిరస్కుఁడు = తల వంచుకొన్న వాఁడు.

తాత్పర్యము

సీతాదేవి యీ ప్రకారము చెప్పఁగా శోకాక్రాంతుండైన లక్ష్మణుఁడు రామచంద్రమూర్తి ముఖముఁ జూచి యాయన యాకారము సూచించిన యభిప్రాయము గ్రహించినవాఁడై యాయన సమ్మతిమీఁద పెద్ద సాద పేర్పఁగా సీతాదేవి నిష్కారణముగ నిర్దోషురాలికి నింతశ్రమ మిచ్చుచున్నవాఁడ నని విచారపడుచుఁ దల వంచుకొన్న రామచంద్రమూర్తికి మెల్లగఁ బ్రదక్షిణించి.

కం. ప్రవిమలగుణ జానకి హ,వ్యవహు సమీపించి మోడ్చి • హస్తములు మదిన్
దివిషద్విప్రుల మ్రొక్కుచుఁ బవనసఖుం గూర్చి యిట్లు • పలికెన్ భక్తిన్.

అర్థములు. ప్రవిమలగుణ = మిక్కిలి నిర్మలమైన గుణములు గలది, హవ్యవహున్=అగ్నిని, దివిషద్విప్రులకున్ = దేవతలకు, బ్రాహ్మణులకు, పవనసఖునిన్ = అగ్నిని.

తాత్పర్యము

మిక్కిలి నిర్మలమైన గుణములు గల సీతాదేవి యగ్నిహోత్రు సమీపించి చేతులు మోడ్చి మనస్సులో దేవబ్రాహ్మణులకు నమస్కరించి యగ్ని నుద్దేశించి భక్తితో నిట్లనియె.

కం. సత్యంబుగ నా హృదయము, నిత్యంబుగ రామునంద • నిలిచి తలఁగదేన్
బ్రత్యయగతి నెల్లెడలం, దత్యంతము బ్రోచునన్ను • హవ్యవహుండున్.

అర్థములు. ప్రత్యయగతిన్ = నమ్మకముగ, ఎల్లెడలందు = అన్ని సమయములందు, అన్ని ప్రదేశములందు.

తాత్పర్యము

నా హృదయము సత్యముగ నిత్యముగ రామునందే నిలిచి తొలఁగనిదయ్యెనా నమ్మకముగ నన్నగ్నిహోత్రుండు సర్వదేశ సర్వకాల సర్వావస్థలయందు రక్షించునుగాక.

కం. శిష్టచరిత్రను నన్నున్, దుష్టగ భావించె విభుఁడు • దుష్టను గాదేన్
స్పష్టముగ లోకసాక్షి య,నిష్టముఁ దొలగించి దహనుఁ • డెల్లెడఁ గాచున్.

అర్థములు. శిష్టను = సదాచారసంపత్తి గలదానను, లోకసాక్షి = లోకులుచేయు కార్యముల చూచుచుండువాఁడు, సూర్యుఁడు, అనిష్టము = కీడు, దహనుఁడు=అగ్ని.

తాత్పర్యము

సదాచారసంపత్తిగల నన్ను నా మగఁడు దుష్టురాలనని తలఁచెను. నేను దుష్టస్త్రీని గానేని సర్వజనులు చేయు కర్మములకు సాక్షి యగు సూర్యదేవుఁడు లోనగువారు స్పష్టముగ నమ్మిరేని యగ్నిదేవుఁడు కీడు తొలఁగించి నన్ను రక్షించును గాక.

కం. మనమున నేన్ వాక్కున నేన్, దనువున నే నెపుడు సర్వ•ధర్మజ్ఞుని రా
ముని నే నతిక్రమింపక, చనియెద నేన్ బ్రోచు నన్ను • జ్వలనుం డెంతున్.

తాత్పర్యము స్పష్టము.

చం. దినకరుఁడున్ నిశాకరుఁడు • దిక్కులు వాయువు రేలు సంధ్యలున్
దినములు భూమి తక్కఁగల • దేవతలెల్లరు నాదు శీలమున్

మనము నిజెంగి రేని నను•మానము నాయెడ లేదయేని యీ
జన మఖిలం బెఱుంగ నను • సమ్మతిఁ గావుము హవ్యవాహనా! —౨౯

అర్థములు. దినకరుఁడున్ = సూర్యుఁడు, నిశాకరుఁడు = చంద్రుఁడు, హవ్యవాహనా=అగ్నిహోత్రా!

తాత్పర్యము

సూర్యుఁడు చంద్రుఁడు దిక్కుల కధిపతియగు దేవతలు వాయువు రాత్రులు సంధ్యలు పగళ్ళు భూమి తక్కిన దేవతలందఱు నాశీలమును దెలిసియున్నవారై దానియందు సందేహము లేనివారై రేని యీ లోకులకందఱకుఁ దెలియునట్లు లగ్నిహోత్రుఁడా! నన్నుఁ గావుము.

తే. అనఘ యటుపల్కి సంగహీ•నాంతరాత్మ,శిఖికి సద్భక్తితోఁ బ్రద•క్షిణముఁ జేసి
మహితశిఖలొప్ప ధగధగ•మండుచుండు, శుచిఁ బ్రవేశించె శుచితర•శుద్ధచరిత.

అర్థములు. సంగహీనాంతరాత్మ = దేహాభిమానము లేని మనస్సుగలది, శిఖికి = అగ్నికి, మహితశిఖలు=పెద్దజ్వాలలు, శుచిన్ = అగ్నిని, శుచితర = మిగుల శుద్ధమైనది, శుద్ధచరిత=దోషరహితమైన నడవడి గలది, అగ్ని శుచియని సీతాదేవి శుచితరయని చెప్పుటచే నగ్నిహోత్రునికంటె సీతయే పవిత్రురాలని భావము. కావుననే యాంజనేయుఁడు సీతాదేవి యగ్నిని దహింపగలదు, అట్టి సీతను నగ్ని యేమి చేయఁగలఁడని చెప్పెను.

తాత్పర్యము

ఈ ప్రకారము చెప్పి దేహాభిమానమువదలి యగ్నికి భక్తితోఁ బ్రదక్షిణించి పెద్ద మంటలు ధగధగమని మొగురుచున్న యగ్నిలో మిగుల పవిత్రమగు నడవడి గల సీతాదేవి ప్రవేశించెను.

చం. గడగడలాడె నప్పు డటఁ • గల్గిన బాలకవృద్ధసంఘముల్
దడదడ గుండె గొట్టుకొనఁ• దద్దయు భీతిని, మేలిజాళువా
నొడిమెలు గ్రాల మేనఁ బుట•మించిన పుత్తడిబొమ్మచందమై
పుడమికుమారి యెల్లజగ•ముల్ గన మండెడుమంటఁ జొచ్చినన్. —౩౦

అర్థములు. మేలి జాళువా నొడిమెలు = మంచి బంగారు సొమ్ములు, పుత్తడిబొమ్మ=బంగారుబొమ్మ, సీతాదేవి బంగారు ఛాయగలది, ఆమె బంగారు సొమ్ములు ధరించుట బంగారు బొమ్మను బంగారు సొమ్ములతో నలంకరించినట్లు లుండెనని భావము. పుడమికుమారి=భూపుత్రి, సీత.

తాత్పర్యము

ఆ బంగారు సొమ్ములు ధరించిన సీతాదేవి లోకములన్నియుఁ జూచుచుండగా మండెడు మంటలోఁ బ్రవేశింపఁగానే యచ్చటఁ జేరిన బాలుర వృద్ధులు భయముచే గుండెలు కొట్టుకొన గడగడలాడిరి.

ఆ. అమ్మహానుభావ • యగ్నిలోఁ జొరఁబడ, జలదరించి మూఁడు • జగము లప్పు
డమలినాగ్నిలోని • యాజ్యపూజ్యాహుతి, భంగిఁ గాంచె రెప్ప • పాటు లేక.

తాత్పర్యము

ఆ మహామహిమగల సీతాదేవి యగ్నిలో దుముకఁగా మూఁడు లోకములు కంపించి నిర్మలమైన మంత్రములచేఁ బవిత్రమైన యజ్ఞాగ్నిలోఁ బవిత్రమైన నేయి యాహుతి పడుచున్నట్లు రెప్ప వ్రాల్పక చూచిరి. ఈ యుపమానము సీతాదేవి పరమపవిత్ర యనియు నామె యగ్నిలోఁ బ్రవేశించుటచే నగ్నికే తేజోభివృద్ధి కలిగెననియు గ్రాహ్యము.

శా. అచ్ఛం బైనమహాధ్వరాగ్నిఁ బడునా • జ్యంబో యనన్ వహ్నిలో
సచ్చారిత్ర వికారశూన్యమతి యై • శాంతిం జొరంబాఱఁగా
నచ్చో మూఁగినమానినీజనులు హా • హాకారపూర్ణాస్య లై
విచ్చుంగన్నులతోడఁ జూచిరి భయో • పేతాత్మికల్ దిగ్భ్రమన్. ౨౬౭

అర్థములు. మహాధ్వరాగ్నిన్=గొప్ప యజ్ఞసంబంధమైన యగ్నియందు, ఆజ్యము=నెయ్యి, సచ్చారిత్ర = సాధువగు నడవడికగల పతివ్రత, వికార శూన్య మతియై = భయముగాని శంక గాని యేదియు లేని మనస్సు గలదై, శాంతిన్= సౌమ్యమైన మనస్సుతో, కోపములేని మనస్సుతో; మానినీజనులు = ఆఁడువారు, సీతాదేవి వచ్చునపుడు ఆమె వెంట ననేక స్త్రీలుకూడ వచ్చి రని గ్రహింపనగు; హాహాకార పూర్ణాస్యలై = హాహా; అయ్యో, అయ్యో యను ధ్వనులచే నిండిన నోళ్ళు గలవారై, విచ్చుంగన్నులతోడ=కన్నులు బాగుగ తెఱచుకొని; భయో పేతాత్మికల్=సీతాదేవి కాలిపోవు నేమో యను భయముతోఁ గూడిన మనస్సు గలవారు; దిగ్భ్రమన్=దిక్కు తెలియక.

తాత్పర్యము

పవిత్రమైన యజ్ఞాగ్నియందు బడు నేతిధారవలె సీతాదేవి భయముగాని సందేహముగాని కొంకుగాని కోపముగాని వ్యసనముగాని యేదియు లేక యగ్నిలోఁ బ్రవేశింపఁగానే యచ్చట గుంపుగూడిన స్త్రీలందఱు భయపడి దిక్కు తెలియక యయ్యో యయ్యో యని గట్టిగ నఱచుచు కనురెప్ప లెగయించి చూచిరి.

తే. సౌరలోకంబునందుండి • శాపనిహతి, నిరయమున ద్రెళ్ళు నిర్జర • నీరజాక్షి
నాఁగఁ జూచిరి దేవతా • నాగయక్ష,సిద్ధగంధర్వదానవుల్ • సీత పడుట. ౨౬౮

అర్థములు. సౌరలోకము = స్వర్గము; నిరయమునన్=నరకమున; నిర్జర నీరజాక్షి = దేవతా స్త్రీ.

తాత్పర్యము స్పష్టము.

దేవతా స్త్రీ పుణ్యవశమున దేవతా స్త్రీయయ్యెను. అట్టిది నరకమునఁ బడ యోగ్యురాలుకాదు. అట్టులే సీతయు రావణాగమనము మొదలుకొని యగ్నిప్రవే

కేము వఱకు సీతాదేవి పరమభాగవతుని లక్ష్మణుని దూషించిన ఫల మనుభవించెను. అగ్నిలోఁ బ్రవేశించినది మాయాసీతయనియు వెడలివచ్చినది నిజమైన సీతయనియుఁ గొందఱు చెప్పుదురు. ఈ యభిప్రాయమునకు వాల్మీకి రామాయణ మెడమీయదు. ౨౭౧౦ పద్యము చూడుము.

కం. మంటల దూఁకెడి యా వా,ల్గంటిం గని మూఁగియున్న • కపులును సురల్
టంటమ్మను మదులన్ దివి, నంట వెస న్నించి రపుడు • హాహారవముల్.

తాత్పర్యము స్పష్టము.

## —• { ౧౨౦-వ సర్గము. దేవతలు శ్రీరామునకుఁ బ్రత్యక్షంబై సీతాదేవి నిర్దోషురా లని చెప్పుట } •—

కం. ఆ రవములు విని ధర్మా,చారుఁడు రాముండు బాష్ప • సంపూర్ణాక్షుం
డారఁగ దుర్మనుఁ డగుచును, మూరుత ముండెం దనంత • మునుఁగుచుఁ జింతన్.

అర్థములు. ధర్మాచారుఁడు=ధర్మప్రవర్తన గలవాఁడు, బాష్పసంపూర్ణాక్షుండు = కన్నీట నిండిన కన్నులు గలవాఁడు, ఆరఁగన్ = పూర్ణముగ, దుర్మనుఁడు=శోకముతోఁ గూడిన మనస్సు గలవాఁడు, మూరుతము=అల్పకాలము.

తన భార్య తన కన్నుల యెదుటఁ బదుగురు చూచుచుండఁగా నిర్నిమిత్తముగ నగ్నిలోఁ బడుచుండఁగాఁ జూచి సహించుట మహాక్రూరకార్యమైనను ధర్మము నాచరించుట యందును, ధర్మ మాచరింపఁ జేయుట యందును శ్రద్ధగల రామచంద్రమూర్తి యా ధ్వనులు విని నిర్దోషురాలిని దయయం దెంతో ప్రేమగల దానిని నిష్కారణముగా లోకము నిమిత్తమై యెంత బాధ పెట్టవలసి వచ్చెనని కన్నులనిండ నీళ్ళు నించుచు శోకముతోఁ గూడిన మనస్సు గల వాఁడగుచు తన లోనే చింతచే మునుఁగుచు నల్పకాల ముండెను.

సీ. అంత వైశ్రవణుండు • నఘశీలకర్శనుం, డగు దండధరుఁడు, స • హస్రనయనుఁ
డగుమహేంద్రుండును • నరిభంజనుండగు,వరుణుండునున్ వృష • ధ్వజుఁడుశివుఁడుఁ
ద్రినయనుఁ డగు మహా • దేవుండు, సర్వలో,కస్రష్ట బ్రహ్మజ్ఞ • కాండవరుఁడు
నగు పితామహుఁడు నీ • యందఱు సూర్యస,న్నిభవిమానంబుల • నింగి విడిచి
తే. లంక కరుదెంచి శ్రీరాముఁ • బంకజాక్షు, నెదుట నిలఁబడి నవతప్త • హేమభూష
ణాన్వితంబులు విపులక • రాంబుజంబు, లెత్తి పల్కిరి చేమోడ్చి • యెదుట ధరణి.

అర్థములు. వైశ్రవణుఁడు = కుబేరుఁడు, అఘశీలకర్శనుండు = పాపాచారుల దండించు వాఁడు, దండధరుఁడు = యముఁడు, సహస్రనయనుఁడు = వేయి కన్నులు గలవాఁడు, మహేంద్రుఁడు=ఇంద్రుఁడు, అరిభంజనుఁడు=శత్రువుల భేదించువాఁడు, వృషధ్వజుఁడు = వృషభచిహ్నము గల టెక్కెము గలవాఁడు.

త్రినయనుఁడు = మూఁడు కన్నులు గలవాఁడు, మహాదేవుఁడు = శివుఁడు, సర్వలోకస్రష్ట = సమస్తలోకముల సృజించువాఁడు, బ్రహ్మజ్ఞ కాండవరుఁడు = వేదముల నెఱిఁగినవారి సమూహమందు శ్రేష్ఠుఁడు, సూర్యసన్నిభవిమానంబులన్ = సూర్యకాంతిగల విమానంబులను, సంగిన్ = ఆకాశమందు, విడిచి = ఎంతి గొప్పవాఁడైనను భగవత్సన్నిధానమునకు వాహనముల మీఁదఁ బోరాదు నవతప్త = క్రొత్తగాఁ బుటము వేయఁబడిన, హేమభూషణాన్వితంబులు = బంగారు సొమ్ములతోఁ గూడినవి. విపుల కరాంబుజంబులు = విశాలములైన కరకమలములు, చేమోడ్చి = చేతులు జోడించికొని.

## తాత్పర్యము

సీతాదేవి యిట్లగ్నిలోఁ బ్రవేశించిన తరువాత కుబేరుఁడు, పాపాత్ముల దండించు యముఁడు, వేయి గన్నుల యింద్రుఁడు, శత్రువుల మర్దించు వరుణుఁడు, వృషభధ్వజము మూఁడు కన్నులు గల శివుఁడు, సర్వలోకము సృజించువాఁడు వేదజ్ఞులలో శ్రేష్ఠుఁడు నగు బ్రహ్మ వీరందఱు సూర్యకాంతి గల విమానములపై నాకాశము వఱకు వచ్చి భగవత్సన్నిధానమునకు వాహనములమీఁదఁ బోరాదు కావున విమానములను ఆకాశమందే నిలిపి క్రొత్త బంగారుసొమ్ములు ధరించిన దీర్ఘబాహువు లెత్తి చేతులు జోడించి యెదుట నిలఁబడి యిట్లు పల్కిరి.

చం. నిలఁబడియున్న రాముఁ గని • నీవ మహాత్మ! సమస్తలోకము
లలుగఁగఁ జేయఁజాలినవ•లంతివి మిన్నవు జ్ఞానికోటిలో
జలజదళాక్షి జానకి కృ•శానుశిఖావళిలోనఁ జొచ్చినం
దలఁక కుపేక్ష సేయఁ దగు•నా? నిను నీవ యెఱుంగ వేటికో? —౨౭౦.

అర్థములు. వలంతివి = సమర్థుఁడవు, మిన్నవు = శ్రేష్ఠుఁడవు, కృశానుశిఖావళిలోనన్ = అగ్నిజ్వాలలందు, తలఁకక = చలింపక, పడినఁ బడనీ లెమ్మని.

## తాత్పర్యము

ఎదుట భూమిమీఁద నిలఁబడియున్న రామచంద్రమూర్తినిఁ జూచి మహాత్మా! సమస్తలోకములు సృష్టింప సమర్థుఁడవు జ్ఞానుల సమూహములలో శ్రేష్ఠుఁడవు. ఇట్టి నీవు సీతాదేవి యగ్నిజ్వాలలందుఁ బ్రవేశింపఁగాఁ బడినఁ బడనిమ్మని యుపేక్ష చేసి చలింపక యుండఁదగునా? ఏల నిన్ను నీవు తెలిసికొనలేక పోయితివి. మీఁది పద్యమున లోకసృష్టికర్త బ్రహ్మ యని చెప్పఁబడెను. ఇచ్చట రామచంద్రమూర్తి యని చెప్పఁబడెను. బ్రహ్మచేయుసృష్టి అద్వారకము. భగవత్సృష్టి సద్వారకము. భగవంతుఁడే బ్రహ్మయం దావేశించి యాయనచేఁ గార్యంబులు చేయించును. కావున చేయువాఁడు బ్రహ్మగాఁ గానవచ్చినను వాస్తవకర్త భగవంతుఁడే.

సీ. సకలనాకాలయ•సంఘనాథుండవు, వసువులలోఁ బ్రజా•పతివి మున్ను
బుతుధాముఁ డనుపేర • నుతి గన్నవాఁడవు, సకలలోకములకు • నాదికర్త

నీవ స్వయంప్రభు • నీవ రుద్రులలోన, నష్టమరుద్రుండ • వసమతేజ!
యేనవమూర్తి వీ• వెల్లసాధ్యులయందు, నశ్వులు కర్ణంబు•లక్షియుగము
తే. చంద్రసూర్యులు జగములు•నమయు వేళ, నాదికాలంబునను నుండు•వనఘ నీవు
ప్రాకృతునిభంగిపై దేహిఁ•బాయఁదగునె, కరుణఁజూడుము భూపుత్రిఁ•గంజనేత్ర.

అర్థములు. సకల=సమస్తమైన, నాకాలయ = దేవతల, సంఘ = గుంపు నకు, నాథుండవు=రక్షకుఁడవు, వసువులలో, ప్రజాపతివి = ప్రజలకు స్వామివి, ఇది ఋతుధాముఁ డను పేరుగల వసువునకు విశేషణము. ఆదికర్తవు = మొట్ట మొదటి సృష్టికర్తవు. అండాధిపతివరకు సద్వారక సృష్టికర్తవు, స్వయంప్రభువు= నీకు నీవే ప్రభువుగాని నిన్ను నియమించు ప్రభువు లేఁడు. అష్టమ రుద్రుఁడవు= ఎనిమిదవ రుద్రుఁడవు; "భవశ్శర్వస్తథేశానో రుద్రః పశుపతిస్తథా, ఉగ్రోభీమో మహాదేవ ఇత్యష్టౌమూర్తయ స్స్మృతాః" ఇందు నెనిమిదవ మహాదేవుఁడు విష్ణువే. వసురుద్రాదిత్యాది గణములం దన్నిట భగవంతుఁడు విభూత్యవతారమై తక్కిన వారికి నియామకుఁడై వర్తించుచుండును. ఏనవమూర్తివి=ఐదవమూర్తివి. ఈయన పేరు వీర్యవంతుఁడు "మనోనుమందా ప్రాణశ్చ శ్వేతయానశ్చ వీర్యవాన్, చిత్తర్ష యోనయశ్చైవ హంసో నారాయణస్తథా। ప్రభవోథ విధిశ్చైవ సాధ్యా ద్వాదశ జజ్ఞిరే" వాయుపురాణము. అక్షియుగము=రెండుకన్నులు, ప్రాకృతుని భంగిన్=సామాన్య జ్ఞానహీనమనుష్యునివలె.

తాత్పర్యము

రామచంద్రప్రభూ! నీవు సమస్తదేవతలకు నాథుఁడవు. వసువులలోఁ బ్రజాస్వామియై ఋతుధాముఁ డను పేరఁ బ్రసిద్ధిగన్న వాఁడవు. అన్ని లోకము లకు నండాధిపతి పర్యంతము స్వయముగా సృష్టించి యావల నండాధిపతి మూల మున సద్వారకముగ సృజించువాఁడవు. నీకు నీవే ప్రభువు. నిన్ను నియమించు వాఁడు లేఁడు. రుద్రులలో మహాదేవుఁ డను పేరుగల యెనిమిదవ రుద్రుఁడవు నీవే. సాధ్యులందు వీర్యవంతుఁ డను నైదవవసువు నీవ. నీకు నశ్వినీదేవతలు కర్ణములు. సూర్యచంద్రులు నేత్రములు. జగము లన్నియుఁ బ్రలయకాలమందు నమసినను నీవుమాత్రము మిగిలియుందువు. సృష్టికిఁ బూర్వమునందు నుండు వాఁడవు నీవే. ఇట్టి నీవు సామాన్యమనుష్యునివలె సీతాదేవిని వదలవచ్చునా? కమలాక్షా! నీ వామెయందుఁ గనికరింపుము.

కం. అని లోకపాలు రెల్లరు, వినయంబున విన్నవింప • విని జగములకున్
వినియమకరణుఁడు రాఘవుఁ, డనియెం దత్త్రిదశనాయ•కావళితోడన్.

అర్థములు. వినియమకరణుఁడు = నియమము విధించువాఁడు, ఈ విశేష ణము రామచంద్రమూర్తి యడుగఁబోవు ప్రశ్నము పారమార్థికబుద్ధి నజ్ఞానముచే నడుగ లేదని సూచించుచున్నది.

## తాత్పర్యము

ఈ విధముగ లోకపాలు రగు దేవత లందఱు వినయముతో విన్నవింపఁగా లోకముల నన్నిటిని నియమించు రామచంద్రమూర్తి యా దేవతానాయకుల సమూహములో నిట్లనెను.

కం. మనుజుఁడ నని దశరథనృప,తనయుఁడ నని రాముఁడ ననితలఁతును నన్నన్
వినిపింపుఁ డెవ్వఁడను నె,వ్వనివాఁడను నేల నేను ప్రభవించితినో. ౨౭౦౫

అర్థములు. మనుజుఁడను=మనుష్యుఁడను, దశరథ తనయుఁడ నని, ఎవ్వఁడను? ఇది స్వరూప విషయమైన ప్రశ్న. ఎవ్వనివాఁడను? ఇది తదీయుల విషయమైన ప్రశ్న. ఏల ప్రభవించితిని? ఇది కార్య విషయమైన ప్రశ్న.

ఇది తన పరస్వరూపజ్ఞానము లేక యజ్ఞానముచే నడిగిన ప్రశ్న కాదు. ఎలన ముందు పద్యములం దీయన పరత్వము చెప్పఁబడెను. అజ్ఞాని యని యెంచినను దానివలననే పరత్వస్ఫురణము కలిగియుండవలెను. చెప్పినను దెలిసికొనలేని మూఢుఁడా రామచంద్రమూర్తి? కావునఁ దెలిసియు దన విషయము పూర్తిగా సుగ్రీవాదులకుఁ దెలుపఁగోరి యీ ప్రశ్న గావించెను. సుగ్రీవున కింతవఱకు రామచంద్రమూర్తియందు పరత్వజ్ఞానము లేదు. ఉండెనేని విభీషణశరణాగతియం దట్లు వాదించియుండఁడు. మనుష్యుఁడను భావముతోనే యిట్లు వాదించెను. ఇఁక వారిని కృతార్థులను జేయవలసియున్నది. కావున వారికిఁ దనయందు భక్తి ముదురుటకై తన విషయమైన జ్ఞానము వారికిఁ గలిగింపవలసియున్నది. తన్ను గుఱించి తాను జెప్పుకొనుటకంటెఁ బరులు చెప్పిన గుణము హెచ్చును. ఆకారణముచే బ్రహ్మచేఁ జెప్పింపఁదలఁచి యిట్లు ప్రశ్నించెను. సుగ్రీవాదుల యభిప్రాయమును దన యభిప్రాయముగాఁ జెప్పినపుడు బ్రహ్మ దాని సవరించెనా, సుగ్రీవాదుల యభిప్రాయము చక్కఁబడును.

ఇఁక దేవతలతో నేను మనుజుఁడను రాముఁడను దశరథతనయుఁడ నని చెప్పుటయం దభిప్రాయ మేమన:—దేవతలారా! మీరు నన్ను నాదికర్త యని స్వయంప్రభు యని యిత్యాదివాక్యములఁ బొగడుచున్నారు. ఆ దశలు మీరు చెప్పుట నాకు సంతోషకరముగాదు. నేను స్వయంప్రభువైన నెనని కేమి లాభము? ఆదికర్తయైన నెనని కేమి మేలు? పరుల కుపయోగపడని పదవు లుండిన నేమి లేకుండిన నేమి? అన్ని విధముల దీనులై శోచనీయులైన మనుష్యుల కా దశలలో నేమి చేయఁ గలిగితిని? ఇప్పుడు వారివలె నేను మనుష్యుఁడనై వారి కుపయోగపడఁ గలుగుటచే మీరు చెప్పెడి పరత్వముకన్న నాకీ మనుష్యత్వమే సంతోషకరమైనది. అందులో నెల్లయ్య పుల్లయ్య యను పేరుగలవాఁడను గాక ప్రజలను రమింపఁజేయు వాఁడను నర్థముగల రాముఁ డనుపేరు గలవాఁడగుట

యెక్కువ సంతోషకరము. అట్టి చేయులేని మనుష్యత్వమేల? అందు దశరథకుమారుఁడను పేరుపొందుట మఱింత సంతోషకరము. ఎట్లన?

'భూతానాం ప్రాణినః శ్రేష్ఠాః, ప్రాణినాం బుద్ధిజీవినః
బుద్ధిమత్సు నరాః శ్రేష్ఠాః, నరేషు బ్రాహ్మణాః స్మృతాః'

ఈ కారణముచే భూతములందు మనుష్యుఁడు కావునఁ దాను మనుష్యుఁడనని యందు స్వయంకృషివలన రాముఁడను పేరు సంపాదించి వారిలో శ్రేష్ఠుఁడనైతినని చెప్పి యంతకు శ్రేష్ఠమైనది దశరథపుత్రత్వమని చెప్పుచున్నాఁడు రాముఁడను పేరింతకుముందే పరశురామునకుఁ గలదు. ఏమి లాభము? ఇప్పుడు సత్యమునకై ప్రాణమును, ప్రాణమునకంటెఁ బ్రియుఁడైన కుమారునివిడిచిన దశరథునికుమారుఁడను పేరు వచ్చుట గొప్పగదా. అటు గాకున్న పండితపుత్రుఁడను పేరు రాదా? తనవలనఁ దండ్రికి గొప్ప పేరు వచ్చెను. అట్టివాని కొడుకనుటచేఁ దనకు గొప్పతనము లభించెను. కావున తన్ను దశరథకుమారుఁ డనుటయే తనకు సంతోషకరమని భావము.

ఈ సందర్భమున భవభూతి యుత్తరరామచరిత్రమందలి యీ వాక్యము లనుసంధింపనగు.

కంచుకీ—రామభద్ర (ఇత్యర్ధోక్తే సాశంకమ్) మహారాజ!

రామః-(సస్మితమ్) ఆర్య. నను రామభద్ర ఇత్యేవ మాం ప్రత్యుపచార శ్శోభతే తాత పరిజనస్య. తద్యథాభ్యస్త మభిధీయతామ్.

అంతఃపురమున గావలియుండు కంచుకి రామచంద్రమహారాజును రామభద్రా యని పిలిచి మరల భయపడి మహారాజ యనెను. రాముఁడు నవ్వుచు నీకెట్టులభ్యాసమో యట్టులే పిలువుమని చెప్పెను.

ఈ వ్యాఖ్యాత కొన్ని సంవత్సరములకుఁ బూర్వము ఒంగోలునకు బోయెను. అం దొక పండితుఁడు పాఠశాలోపాధ్యాయుఁ డాయనను జూడవచ్చి మాటప్రస్తావనగా నీశ్లోక ముదాహరించి రాముని వాక్యము జ్ఞానకృతమా, యజ్ఞానకృతమా యని ప్రశ్నించెను. ఈ వ్యాఖ్యాత చెప్పిన సమాధానము లాయనకుఁ దృప్తికరములు గావయ్యెను. అప్పు డీయన యా పండితుని మీరు గొప్ప పండితులు, మీకు నే నేమని సమాధానము చెప్పఁగలను? ఇంతటి పండితుల యోగ్యత తెలిసికొనలేక యధికారు లల్పవేతనము లిచ్చెద రని శ్లాఘించెను. అప్పు డా పండితుఁడు నేను బండితుఁడఁగాను. నా కేమియుఁ దెలియదు అని యజ్ఞునివలెఁ బలికెను. అప్పు డీయన మీరు చెప్పినట్లు మీరజ్ఞులైన యెడల నేమని పండితపీఠ మలంకరించితిరి? ఏమి తెలియనివారు విద్యార్థుల కేమి చెప్పెదరు? ఇట్లాత్మవంచనము లోకవంచనము నగుకార్యము మీరు చేయవచ్చునా? యని ప్రశ్నించెను. నే నడిగిన ప్రశ్నమునకుఁ బ్రత్యుత్తరము వచ్చినది, తృప్తిపడితి నని చెప్పెను.

ఈ శ్లోకమువంటి మఱియొక శ్లోకమునకు నిట్టులే పెద్ద లర్థము చెప్పుదురు. వస్త్రాపహరణ కాలమున ద్రౌపది "శంఖచక్ర గదాపాణే ద్వారకానిలయాచ్యుత। గోవింద పుండరీకాక్ష, పాహి మాం శరణంగతామ్" అని ప్రార్థించెను. శంఖ చక్రగదాపాణీ - ద్వారకానిలయా - అచ్యుత- గోవింద-పుండరీకాక్ష శరణాగతు రాలైన నన్ను రక్షింపుము.

శంఖచక్ర గదాపాణీ యనఁగానే కృష్ణుఁడు తల వంచుకొనెనట! ఈమె పరత్వ చిహ్నములు వర్ణించుచున్నదే - ఈశంఖచక్రగద లీమెమానము కాపా డుటయందు నెట్లుపయోగపడఁగలవని లజ్జించెను. ద్వారకానిలయ యనుటచే కృష్ణావతారము సూచించుచున్నదిగదా యని వంచినతల కొంచె మెత్తెను. గోవింద= గొల్లపిల్లవాఁడా యనఁగానే సంతోషముతో తల పూర్ణముగ నెత్తెననియు పుండరీ కాక్ష యనుటచే సంతోషముతోఁ గన్నులు వికసింపఁ జేసెననియుఁ జెప్పుదురు.

పదవతారములలో విభవావతారము అర్చావతారము లోకోపకారకములు. తక్కినవి భక్తులకుఁ గోఱఁగానివి. దేవతలును విభవావతారములనే యర్చింతురు. కావున వానినిగుఱించి చెప్పినపుడె భగవంతుఁడు సంతోషించును.

విష్ణుపురాణమందలి (౫-౧౩-౧౨) యీ కృష్ణవాక్యములు స్మరింపుఁడు.

గోవర్ధన పర్వత మెత్తినపుడు గోపాలురు కృష్ణుని బహువిధములఁ బొగ డిరి. అప్పుడు కృష్ణభగవానుఁడు ప్రణయకోపము గలవాఁడై వారితో నిట్లనెను:-

'యది వోఽస్తి మయి ప్రీతి శ్లాఘ్యోఽహం భవతాం యది। తదాత్మబంధు సదృశీ బుద్ధి ర్వః క్రియతాం మయి। నాహం దేవో న గంధర్వో న యక్షో నచ దానవః। అహం వో బాంధవో జాతో నైవ చింత్య మతోఽన్యథా।

మీరు నాయందుఁ బ్రీతిగలిగి మీకు నేను శ్లాఘ్యుఁడ నైతినా మీరు నన్ను బంధు వనిమాత్రమే యెంచుఁడు. నేను దేవుఁడనుగాను, గంధర్వుఁడఁగాను, యక్షుఁడఁగాను, దానవుఁడఁగాను, మీకు నేను బంధువను. ఆ విధముగఁ దప్ప నన్ను మీరు మఱియొకవిధముగ చింతింపవలదు అని చెప్పెను. దీనివలన భగవం తుని పరత్వమెంచి ధ్యానించుటకంటె భక్తులై బంధుభావముతో తండ్రి యనియో అన్న యనియో కుమారుఁడనియో భర్తయనియో స్వామియనియో ధ్యానించు టయే భగవంతునకు సంతోషకరము.

దీనివలన రామచంద్రునం దజ్ఞానముకల దను వాదము నిరస్తము. ఈశ్లోకము సూచించుచు నుపదేశసాహస్రియం దిట్లు వ్రాయఁబడినది. బ్రహ్మా దాశరథే యద్వదుక్త్వా వాపనుదత్తమః యస్య విష్ణుత్వ సంబోధేన యత్నాంతర మూచి వాన్॥ ౧౦౦. తత్త్వమసి ప్రకరణము.

బ్రహ్మ రామచంద్రమూర్తికి నీవు విష్ణు వని చెప్పుట చేతనే యాయన యజ్ఞానమును దొలఁగించెను. అజ్ఞానము తొలఁగుటకై మఱే ప్రయత్నము చేయ

లేదని భావము ఉపాసనములేని జ్ఞానమే యజ్ఞానమును నివర్తింపఁజేయు ననుటకై యిది వ్రాయఁబడెను.

రామచంద్రమూర్తియం దజ్ఞానము లేదని ముందే చెప్పఁబడెను. అందే తమశ్శబ్దమునందు వ్యాఖ్యయందు 'దాశరథినా రామేణ దేవకార్యసిద్ధయే మనుష్యావతార నాట్యేన స్వమాహాత్మ్యాచ్ఛాదనం స్వసంకల్పపూర్వకం యత్కృతం తదిహతమశ్శబ్దే నోచ్యతే। నతు ఈశ్వరస్య సంమోహా స్సంభవతి'.

దశరథరాముఁడు దేవకార్యము సాధించుకొఱకు మనుష్యావతారమును వేసుచేఁ దన మాహాత్మ్యము మఱుఁగుపాటును దేవిని సంకల్పించెనో యది యిందుఁ దమస్సనఁబడెను. ఈశ్వరునకు సమ్మోహము లేదు అని యర్థము. నాటకములందు పాత్రము నిద్రపోవుటకు-కుంభకర్ణుఁడు నిద్రపోవుటకు నెంత భేదము కలదో యంత భేదమే జీవకోటుల యజ్ఞానమునకు, రామచంద్రమూర్తి యజ్ఞానమునకుఁ గలదు. నాటక పాత్రమందు నిద్రయే లేదు. అట్టులే రామునం దజ్ఞానము లేదు. నిద్రించు కుంభకర్ణుని నీవు కుంభకర్ణుఁడవు నిద్ర లెమ్మనఁగానే లేవలేఁడు. అట్టులే తమస్సున మునిఁగిన జీవకోటులకు జ్ఞానము గలిగింప నుపదేశముమాత్రము చాలదు. ఉపాసన మావశ్యకము.

తాత్పర్యము

దేవతలారా! నన్ను నేను మనుష్యుఁడనని రాముఁడనిన దశరథకుమారుఁడనని తలఁచుచున్నాను. నే నెవ్వఁడు? ఎవ్వరివాఁడను? ఏల పుట్టితిని? తెలుపుఁడు.

కం. అని నుడివెడు కౌసల్యా, తనయుం గని బ్రహ్మవిత్ప్రధానాగ్రణి యా
వనజజుఁడు సత్యవిక్రమ, వినుమా సత్యంబు రామ విజ్ఞాపింతున్. ౨౬౦౮

అర్థములు. నుడివెడు=చెప్పుచున్న, బ్రహ్మవిత్+ప్రధానాగ్రణి=బ్రహ్మ జ్ఞానము గలవారిలో శ్రేష్ఠులలో ముఖ్యుఁడు, ఇది నాభిప్రాయవిశేషణము, భగవత్తత్త్వము చక్కఁగా దెలిసి చెప్పుచున్నాఁ డనుట, వనజజుఁడు = బ్రహ్మ, విజ్ఞాపింతున్ = విన్నవింతును, సత్యవిక్రమ = యథార్థపరాక్రమము గలవాఁడా! సత్యమే విక్రమముగాఁ గలవాఁడా! సత్యము=ఉన్నదున్నట్టు.

తాత్పర్యము

అని చెప్పుచున్న రామచంద్రమూర్తినిఁ జూచి బ్రహ్మవేత్తలలో మొట్టమొదటివాఁడగు బ్రహ్మదేవుఁడు రామా సత్యవిక్రమా! యథార్థము చెప్పెద వినుము.

—బ్రహ్మ శ్రీరాముని నుతించుట—

దండకము. శ్రీరామ రామా! మహాభావ! నారాయణా! దేవ! లక్ష్మీసనాథా! యనాథాధినాథా! విభూ! శంఖచక్రాయుధా! నీవ మున్నొంటికొమ్మగంబు భూదారవై భూమి కాధారమైనిల్చు పెన్వేల్పవుం, జన్న రానున్న యాసూనులం గీడులంగూర్చి

వేధించి సాధించి బాధించు బల్లోప్రదవున్, నీవ బ్రహ్మంబు, సత్యంబు నీ, వక్షరంబెల్ల కాద్యుండవు మధ్యాంతసంస్థుండును న్నీవ. లోకాళికిన్ సిద్ధధర్మంబు కర్మంబు మర్మంబునున్ నీవ, నీవే చతుర్వ్యూహుండవున్ స్వామియున్ శార్ఙ్గివిన్ శంఖివిన్ ఖడ్గివిం గృష్ణుండున్ విష్ణుండున్ బుద్ధియున్ సిద్ధియున్ సత్త్వముం దత్త్వమున్ శాంతియుం దాంతియుం బూరుషాఖ్యుండవుం బూరుషోత్కృష్టరూపంబును న్నీవ, నీవే హృషీకేశ విఖ్యాతమూర్తీ! యజయ్యుండవున్ సర్వసేనానివిన్ గ్రామణీరత్నమున్ స్రష్టవుం ద్రష్టవున్ నీవ, నీయందె డిందున్ సమస్తంబు పేంద్రా! హరీ! మధ్వరీ! యింద్రకర్మా! మహేంద్రా! నరేంద్రా! మునీంద్రాదివంద్యా! వరా! పద్మనాభా! విరోధ్యంతకారీ! శరణ్యుండవున్ నీవ, నిన్నే సుమీ సర్వరక్షైక సామర్థ్యదక్షుండవున్ లోకచక్షుండవం చెల్ల దివ్యర్షు లుత్కర్ష భావించి సేవించి స్తోత్రంబుఁ గావింత్రు శాఖాసహస్రాత్మకామ్నాయరూపా! మహర్షిప్రవేశా! యనేకోరుజిహ్వా! జగత్పాళికిం బాద్యుఁడౌ కర్తవున్ ధర్తవున్ హర్తవున్ నీవ, నీవే స్వయంభర్తవున్, సిద్ధసాధ్యాశ్రయుం డీవ, నీవే సుమీ సృష్టికిన్ముందు భాసిల్లు రూపంబు, యజ్ఞంబును న్నీవ, నీవే వషట్కార మోంకారమున్నీవ, నీవే సముత్కృష్ట యోగైకగమ్యుండవున్, భక్తరమ్యుండవున్ నీవ, నీ పుట్టువుం బుట్టువున్ గిట్టుటన్ వెండి నీవిట్టివాఁడంచు నెవ్వాఁడెఱుంగున్, రమాధీశ! గోజాతభూనిర్ఝరాక్రాంతభూతావళీశైలదిగ్జాలకాంతార దేశంబులన్ నిండి రాణింతు వో దేవదేవేశ! నీవే కదా వేయిపాదంబులన్ వేయిశీర్షంబులన్ వేయినేత్రంబులం బూని భూతంబులన్ గోత్రసంభూతసంప్రీతమై భూతధాత్రిన్ వహింపన్ సహింపంగ దక్షుండ, వీ క్షోణి కల్పాంతవేళన్ మహాహీంద్రతల్పుండవై దేవ! గంధర్వ దైతేయ సంఘంబులం దాల్చి ప్రత్యక్షమై యుందు, వో రామ! నీ చిత్తమే నేను, నీ జిహ్వ యే వాణి, రోమాళి దేవాళి, యోగీశహృద్ధామ! శ్రీధామ కన్ రెప్పలన్ మూయఁగా రేయి, విప్పం బగల్, నీదు విశ్వాసముల్ వేదముల్ రామ! నీకాని దావంతయున్ లేదు, సర్వంబులోకంబు నీకున్ శరీరంబు స్థైర్యంబు భూగోళ, మగ్నుల్ ప్రకోపంబు, శ్రీవత్సచిహ్నా! ప్రసాదంబు సోముండు, నీవే కదా మున్ను వైరోచనిం జేరి దానంబునుం గోరి పాదత్రయీన్యాసరూపంబునన్ సర్వలోకంబులున్ నిండి దండించి తా దైత్యు, దైత్యారికిం బట్టముం గట్టి రక్షించితో దివ్యమూర్తీ! లసత్కీర్తి! శ్రీలక్ష్మియే సీత. విష్ణుండవే నీవు, కృష్ణుండునున్ నీవ, నీవే ప్రజానాథవాచ్యుండవై పంక్తికంఠున్ వధింపంగ నై మానుషీదేహమున జొచ్చి రక్షోధిపుం ద్రుంచి మా కార్యముం దీర్చి లోకంబులం దేర్చి తీవింక హృష్టుండవై ధాత్రిఁ బాలించి యాపై దివిం జేరుమా, యో రమానాథ! నీ వీర్యసారం బమోఘంబు, నీ ఘోరశౌర్యం బమోఘంబు

నీ దర్శనంబే సమోఘంబు, నీ స్తోత్రమున్ మోఘ మేవేళ నేవారికింగాదు, నిన్ భక్తిచేఁ గొల్చి చిత్తంబునం దాల్చు నీ భక్తులా వారి కేలోపముల్ లేవు, నిన్నుం బురాణున్ సదాపూరుషోత్తంను నిశ్చంచలంబైన సద్భక్తి సేవించు భక్తుల్ జగద్రక్షకా! మైహికాత్యంత సౌఖ్యంబు లెల్లప్పుడుం గందు రీశా నమస్తే నమస్తే నమః.

అర్థములు. శ్రీరామ = లక్ష్మీదేవియందు రమించు రామా — రామచంద్రమూర్తీ, మహాభావ = మహాత్మా, నారాయణ = నారము లనఁగా జలములు జీవకోటులు వానికి స్థానమై, యవి స్థానముగాఁ గలవాఁడా.

ఈ పదము జగత్కారణత్వమును జగద్ధారకత్వమును దెలుపును, "ఏకో హవై నారాయణ ఆసీన్న బ్రహ్మ నేశానో నేమే ద్యావా పృథివీ" అప్పుడు నారాయణుఁ డొక్కఁడే యుండెను. బ్రహ్మలేఁడు, శివుఁడు లేఁడు, ఈయాకాశము లేదు, భూమియు లేదు. ఇట్లు అవాప్తసమస్తకాముఁ డగువానికి నీ సృష్ట్యాది వ్యాపారము లేల యని శంకరాఁగా 'లోకవత్తులీలాకైంకర్య' మన్నట్లు క్రీడార్థమైయని తెలుప నీవు దేవుఁడ వనుచున్నాఁడు.

ఈ పదమునకు నర్థము రామపరత్వ మను గ్రంథమందు విశేషించి వ్రాసియుండుటచే నిందు వివరింపఁబడలేదు. దేవ=ప్రకాశస్వరూపుఁడా, వ్యాఘ్రాదివత్ జీవతతేః మాయాపాశేన బంధనం కృత్వా నిత్యం క్రీడయతి యః సదేవః పరికీర్తితః ॥ పులులు మొదలైనవానిని త్రాళ్ళతోఁగట్టి క్రీడించునట్లు జీవకోటులను మాయాపాశములచేఁ గట్టి క్రీడించువాఁడు. "దేవః క్రీడతి సర్గాద్యై రసురాన్విజగీషతే, క్రియాఫలై ర్వ్యవహరన్ ద్యోతతే స్తూయతే బుధైః । మోదతే మాదయన్మూఢాన్ స్వాపయంశ్చ స్వమాయయా । ఫలార్థిభిః కామ్యమానః ఫలం ప్రాపయతే చ తాన్ । ఏవం ధాత్వర్థ సంబంధా దేకో దేవ ఇతి శ్రుతేః ॥

శుద్ధో దేవ ఏకో నారాయణః ॥ శ్రుతి. లక్ష్మీసనాథా=సర్వదా లక్ష్మీదేవితోఁ గూడియుండువాఁడా; ఆటలు పాటలు గృహస్థునికేఁగాని యొంటరి సన్న్యాసికేల యను శంకరాఁగా లక్ష్మీసనాథుఁ డని చెప్పఁబడెను. అనాథాధినాథా=దిక్కులేనివారికి గొప్ప దిక్కైనవాఁడా! సోపాధికబాంధవు లందఱు చేయి విడిచినను భగవంతుఁడు చేయి విడువఁడని భావము "హాకృష్ణ ద్వారకావాస-క్వాసియాదవనందన? ఇమామవస్థాం సంప్రాప్తాం కి మనాథా ముపేక్షసే" యని ద్రౌపది యైదుగురు భర్తలు మామలు తాతలు బంధువులంద ఱుండియు ననాథ నని యేడ్వఁగా భగవంతుఁడు రక్షించెను. విభూ='విభు ర్విశ్వాత్మనా హ్యేవ వివిధం పరిపశ్యతి'=విశ్వాత్ముఁ డగుటచే సర్వము చక్కఁగా పాలించువాఁడు. శంఖచక్రాయుధా = పాంచజన్య మను శంఖమును సుదర్శనచక్రమును ఆయుధములుగాఁ గలవాఁడా - ఇట్లు దివ్యసాధనములు చెప్పఁబడెను. ఒంటిశ్రం

గంబు=ఒక్క కొమ్ముగల, భూదారము=వరాహము, భగవంతుఁడు హిరణ్యాక్షుని నొంటికొమ్ము వరాహమై చంపి యా కొమ్ముచే భూమిని నుద్ధరించెను. 'ఉద్ధృతాసి వరాహేణ' అని శ్రుతి-"దంష్ట్రియా పర్వతేంద్రాణాంచాలనం కృతవా న్మహాత్, తత స్తంతుష్టువు ర్దేవా ఏకశృంగత్వసిద్ధయే, ఏకశృంగవరాహోఽభూ త్తదాప్రభృతి మాధవః-" స్కాందము. ప్రళయవేళ భగవంతుఁడు వరాహమై యొక కొమ్ముతో భూమి నుద్ధరించి రెండవ కొమ్ముతో పర్వతములఁ గదలించెను. అప్పుడు దేవతలు రెండవకొమ్ము వలదని ప్రార్థించిరి. అది మొదలు నారాయణుం డొంటిశృంగము గల వరాహమయ్యెను. వేల్పవు=దేవతవు, చన్న = కడచి పోయిన, రానున్న = ఇఁక ముందు రాఁగల, సూదులన్=విరోధులను చనిన విరోధులు=మధుకైటభ హిరణ్యాక్ష హిరణ్యకశిపులు లోనగువారు, రానున్న విరోధులు=శిశుపాలాదులు, ప్రోడవు = సమర్థుఁడవు, బ్రహ్మంబు = 'బృహత్త్వాత్ బృంహణత్వాచ్చ బ్రహ్మేతి పరికీర్త్యతే' విస్తారమైనవాఁడు, విస్తారముగాఁజేయు వాఁడు, సూక్ష్మదశయం దున్నవానిని స్థూలప్రపంచాకారమున విస్తరింపఁజేయు వాఁడు. సూక్ష్మచిదచిద్విశిష్టుఁడైన బ్రహ్మమే స్థూలచిదచిద్విశిష్టుఁడై ప్రపంచ ముగాఁ బరిణమించును, "వ్యక్తావ్యక్త సమష్టి వ్యష్టి పురుషాన్ బృంహయతి, నిరతిశయకల్యాణగుణగణైః స్వరూపగుణవిభవైః స్వయంచ బృంహతి."

"వ్యక్తావ్యక్త సమష్ట్యాది పురుషాం శ్చైవ నిత్యశః గుణైశ్చ కల్యాణతమై ర్బృహ్మ బృంహయతీతిచ॥ రూపేస్వరూపేణ గుణై ర్విభవైశ్చ స్వయం మహాః బ్రహ్మేతి సతువా బ్రహ్మ వదన్తి స్సంతతిప్రదః"

సత్యంబు = త్రికాలములయం దుండువాఁడు – అస్తి – జాయతే – పరిణమతే – వర్ధతే – అపక్షీయతే – వినశ్యతి – ఉండుట – పుట్టుట – మాఱుపడుట – పెరుఁగుట-తగ్గుట – నశించుట అను నాఱు వికారములు లేనివాఁడు – సత్సుసాధు రితి సత్యః సజ్జనులందు సాధువు కావున సత్యము. "సత్యస్స వితథాత్మత్వాత్ సతాంహితకరశ్చ యః। మూర్తామూర్తాత్మక స్సచ్చత్యచ్చాభ వేదితి శ్రుతేః"అక్షరంబు=క్షయింపనిది – నాశము లేనిది – "ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదంతి" శ్రుతి–"సదానుభూయమానో ఽపినిస్సీమగుణగౌరవాత్ -ముక్తైః క్వచిన్న క్షరతి త్యక్షరః పరికీర్తితః" ముక్తులచే సర్వదా యనుభవింపఁబడుచున్నను మేర లేని గుణగౌరవమువలనతగ్గనివాఁడక్షరుఁడు. 'అక్షరం నాశరహితం బ్రహ్మైవాఖిల కారణమ్.' ఎల్లకు = అన్నిటికి, సమస్తభూతకోటికి – ఆద్యుండు = మొదటి వాఁడవు, మధ్యాంతసంస్థుండు=నడుమఁ దుదనుండు వాఁడవు, ఆది మధ్యాంతములు లేనివాఁడనుటచే నిత్యత్వము చెప్పఁబడెను. లోకాళికిన్=జనసమూహమునకు, సిద్ధ ధర్మంబు=ధర్మమనఁగా శ్రేయస్సాధనము — భగవంతుఁడు నిత్యసిద్ధ సాధనము, భగవత్ప్రాప్తి కోరువారు కష్టించి సాధింపవలసినది లేదు. భగవత్ప్రాప్తికి భగ

వంతుఁడే సిద్ధోపాయము, కర్మము=భగవత్ప్రాప్తికై చేయుకర్మము భగవంతుఁడే, "బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతం, బ్రహ్మైవ తేవ గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా." భ. గీ. మర్మంబు=రహస్యము, చతుర్బాహువున్=నాలుగు భుజములు గలవాఁడవు తెడవలు తెడవలుగాఁ గాక నాలుగు పురుషార్థములను నొక్కసారిగనే యిచ్చువాఁడు. స్వామివిన్=స్వమ్ము, సొమ్ము, అది గలవాఁడు, భగవంతుఁడు సర్వస్వామి, ప్రకృతిపురుషు లందఱు నాయన సొత్తే ఆయనది కానిది సమస్త లోకములందుఁ బరమాణువైన లేదు.

శార్ఙ్గివి=శృంగముచేఁ జేయఁబడినది శార్ఙ్గము, శార్ఙ్గమను విల్లుగలవాఁడు, శార్ఙ్గధన్వా త్వింద్రియా ద్యహంకారాత్మిక శార్ఙ్గవాన్.

శంఖవిన్, శంఖ = పాంచజన్యమనుశంఖము గలవాఁడు, శంఖభృద్ధారయన్ శంఖం భూతాహంకరణాత్మకమ్। ఖడివి=నందకమను ఖడ్గమును ధరించిన వాఁడవు 'నందకీనందకో స్యాస్తిఖడ్గో విద్యాత్మకో యుతః' విద్యాత్మకమైన నందకమనుఖడ్గము ధరించువాఁడు.

కృష్ణుఁడున్="కృషిర్భూవాచకశ్శబ్దో ణశ్చ నిర్వృతివాచకః। కృష్ణస్తద్భావయోగాచ్చ," భూమికి భారము దగ్గించి సుఖము గలిగించువాఁడు.

"ఏకాంతలీలారసతో నిర్వృతః కృష్ణ ఉచ్యతే,' ఏకాంతలీలానందానుభవము గలవాఁడు కృష్ణుఁడు, విశ్వంకరోతీతి కృష్ణః=అన్నిటిని జేయువాఁడు. 'క్షైత్యాన్ కర్షతీతి కృష్ణః' రాక్షసులను వలఁపువాఁడు, నల్లని వన్నెగలవాఁడు గనుక కృష్ణుఁడు, చీఁకటిలో నుండు వస్తువు యొక్క స్వరూపస్వభావములు మన కేమియుఁ దెలియరావు. అట్లులే భగవంతుఁ డతిగంభీరుఁడు గనుక నల్లనివాఁ డని చెప్పఁబడును. గాంభీర్యము వలనఁ గదా సముద్రము ఆకాశము నల్లగాఁ గానవచ్చుట. ప్రపంచము వ్యక్తము గాక ముందు చీఁకటిలో నున్నట్లే కదా యుండెను. వీత్తనము భూమిలో నున్నప్పుడు మన కేమి తెలియఁ గలదు? భూమిని బగులఁ దీసికొని మొలకగా వచ్చిన తరువాతనే తెలియవచ్చును. అట్లులే భగవంతుఁడు పరత్వమం దెట్టివాఁడైనది పూర్ణముగాఁ దెలియదు.

కృష్ణోయం కృష్ణవర్ణత్వా త్సదానందాత్మకత్వతః కృషి ర్భూవాచక శ్శబ్దః ణశ్చ నిర్వృతివాచకః,తయో రైక్యం పరంబ్రహ్మ కృష్ణ ఇత్యభిధీయతే।"విష్ణుఁడున్= విశ్వమును వ్యాపించియుండు వాఁడు.

౨. తన దయకుఁ బాత్రుఁడగు వాని నప్పుడే యుచ్చటనే రక్షించువాఁడు- "స్వవిభూతిభూతంచిదచిదాత్మకంసర్వంవిశతీతివిష్ణుః-"తనవిభూతులగుచిదచిదాత్మకములం దన్నిటఁబ్రవేశించువాఁడు.'చరాచరేషు భూతేషు విశనాత్ విష్ణు రుచ్యతే.

బుద్ధి=జ్ఞానము ప్రవర్తింపఁజేయువాఁడు. తన భక్తుల కెట్టిజ్ఞానము నిచ్చిన దన్ను ప్రాపింతురో యట్టిజ్ఞానము నిచ్చువాఁడు-"నదేవా యష్టిమాదాయ రక్షంతి పశుపాలవత్।యంహిరక్షితు మిచ్ఛంతిబుద్ధ్యాసం యోజయంతితమ్।"పశులకాపరి

పశువులను గట్టిపట్టుకొని కాపాడినట్లు దేవతలు కాపాడరు. ఎవరిని రక్షింపఁగోరు దురో వానికి జ్ఞానము కలిగింతురు.

సిద్ధియున్=మోక్షమును, కార్యసిద్ధిని కలిగించువాఁడు, 'అయమేవవహ్యేపాయశ్చ సిద్ధిస్సాఽర్థ్య తే యతః, యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి'యున్నట్లు బ్రహ్మచర్యవ్రతనిష్ఠులు కోరు సిద్ధి యేదియో యదియగువాఁడు, 'సిద్ధి స్సమస్త సత్కర్మఫలరూపత యోచ్యతే.'

తత్త్వము='సారాంశభూతో జగతో యోసౌతత్త్వ మితి స్మృతః,'ప్రపంచమునకు సారాంశమైన వాఁడు 'తత్త్వం తథ్యం పరంబ్రహ్మ.

శాంతి='సర్వాధికారా శ్శామ్యంతి సమాధౌ పరమే యతః। అత శ్శాంతి రితి ప్రోక్తః ఋత్విగ్భి ర్భక్తిదో మనుః॥' పరమసమాధియం దధికారము లన్నియు నీయనయందు శమించును. 'శాంతి స్సమస్తవిద్యాయా నిర్వృత్తిర్బ్రహ్మ కేవలమ్,'

దాంతి = ఓర్పు, అజ్ఞులు చేసిన యపరాధములను జేపట్టఁ డీశ్వరుఁడు కృపాళుఁడగుట, పూరుషాఖ్యుండవున్ = పురుషుఁడను పేరు గలవాఁడవు.' పురుసనోతీతిపురుషః'=విశేషముగ నిచ్చువాఁడు, "ముక్తేభ్య స్స్వాత్మపర్యంతదానాత్పురుష ఈరితః" ముక్తులకు వాఙ్మనసాపరిచ్ఛేద్య గుణవిభవ స్వానుభవము నిచ్చువాఁడు. 'పురుష స్సర్వదేహేషు శేతే క్షేత్రజ్ఞరూపతః క్షేత్రజ్ఞరూపమున సర్వదేహములందుండు వాఁడు 'యేన జగత్ పూర్ణం స పురుషః,' ఎవనిచే జగము నిండియున్నదో యతఁడు పురుషుఁడు, 'తేనేదం పూర్ణం పురుషేణ సర్వ' మ్మని శ్రుతి. పురాతనత్వాత్ పురుషః, పురాణుఁడు కావునఁ బురుషుఁడు "పూర్వమేవాహమిహాసమితి తత్పురుషస్య పురుషత్వమ్॥" అని శ్రుతి.

పురుషోత్కృష్టరూపంబు=పురుషులం దుత్తముఁ డగువాఁడవు, "యస్మాత్ క్షరమతీతోహమక్షరాదపిచోత్తమః,అతోస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః," క్షరమునకంటె నక్షరమునకంటె నుత్తముఁడను గావునఁ బురుషోత్తముఁడను.

హృషీకేశవిఖ్యాతమూర్తి = హృషీకేశుఁ డని కీర్తివహించిన వాఁడవు. హృషీకములు = ఇంద్రియములు, వానికి ఈశుఁడు. నియమించువాఁడు, అన్ని యింద్రియముల నాకర్షించు దివ్యమంగళవిగ్రహము గలవాఁడు-హృషీకాణీంద్రియాణ్యాహు స్తేషా మీశో యతో భవాన్ । హృషీకేశ స్తతో విష్ణుః ఖ్యాతో వేదేషు కేశవః॥ భా. హరి. హర్షాత్ సౌఖ్యాత్ సుఖైశ్వర్యాత్ హృషీకేశత్వ మశ్నుతే, హర్షము, సౌఖ్యము, సుఖైశ్వర్యము గలవాఁడు కావున హృషీకేశుఁడు. ఇంద్రియాణాం నియంతృత్వాత్ హృషీకేశః ప్రకీర్తితః.

హృషీకేశో హృషీకాణా మింద్రియాణాం నియంతృణాత్, సూర్యాచంద్రమసో శ్శశ్వదంశుభిః కేశ సంజ్ఞకైః బోధయన్ స్వాపయంశ్చైవ జగ దుత్తి

వ్రతే పృథక్ ।స్థాపనా ద్భోధనాచ్చైవ జగతో హర్షణా ద్భవేత్ । పరమాత్మా హృషీకేశ ఇత్యతః పరిగీయతే.

అజయ్యుండవు=జయింపరానివాఁడు, తాను జెఱుపఁదలఁచినవానిని రక్షించువాఁడు లేఁడు, తాను రక్షింపఁబూనిన వానిని జెఱుచువాఁడు లేఁడు, అప్రతిహత సంకల్పుఁడు='త్రాతుం నశక్తా యుధి రామవధ్యమ్'అను వాక్యమును, ప్రహ్లాదాది చరిత్రములననుసంధించునది. సర్వసేనానివిన్ = దేవసేనా నిర్వాహకుఁడవు, గ్రామణీ= గ్రామం సమూజం సూరీణాం నయతి గ్రామణీశ్చ యః॥ నిత్యసూరుల సమూహమును నడుపువాఁడు గ్రామణి - గ్రామణీ రితి నేతృత్వాత్ భూతగ్రామస్య కత్స్నశః ॥ భూతసమూహముల కన్నిటికి నేత కావున గ్రామణి, గ్రామాధిపతి= ఇట్టివారిలో శ్రేష్ఠుఁడు గ్రామణీరత్నము.

స్రష్టవున్ = లోకముల సృష్టించువాఁడవు, ద్రష్టవు = సర్వసాక్షివి, డించున్ = లయించును, ఉపేంద్రా = ఇంద్రునకు వామనావతారమునఁ దోడఁ బుట్టినయున వాఁడా, మధ్వరీ=మధు+అరీ=మధువను రాక్షసుని జంపినవాఁడా.

ఇంద్రకర్మా = ఇంద్రునిచేఁ గర్మము చేయించువాఁడా, మహేంద్రా = మహా+ఇంద్రా=ఐశ్వర్యము గలవారిలో గొప్పవాఁడవు, నరేంద్రా = జీవకోటుల కధిపుఁడవైన వాఁడా, మునీంద్రాదివంద్యా = మునిశ్రేష్ఠులచే స్తోత్రము చేయఁ బడువాఁడా,

• పరా = అన్నిటికిఁ బరుఁడవైన వాఁడా, పద్మనాభా = బ్రహ్మజననమునకుఁ గారణమైన కమలము నాభియందుఁ గలవాఁడా! "కాలాత్మకంతు యత్పద్మం । నాభౌ యస్య స ఉచ్యతే । పద్మనాభ శ్చాప్తవర్ణో మహాసంతానదో మనుః." కాలాత్మకమైన పద్మమును నాభియందుఁ గలవాఁడు.

విరోధ్యంతకారీ=విరోధుల నాశముచేయువాఁడా, శరణ్యుండవు=రక్షించువాఁడవు శరణుజొచ్చుటకు యోగ్యుఁడవు సర్వరక్షైకసామర్థ్యదక్షుండవు = సమస్త భూతములరక్షించుటయందే సామర్థ్యముగలవాఁడవు, లోకచక్షుండవు=లోకమునకుఁ గన్నయినవాఁడవు, సర్వమునుజూచువాఁడవు. ఉత్కర్ష =గొప్పదనము, శాఖాసహస్రాత్మక=వేయిశాఖలుగల, ఆమ్నాయరూపా=వేదస్వరూపా, వేదము భగవత్స్వరూపము. భగవంతుఁడు వేదస్వరూపుఁడు, వేదము శబ్దబ్రహ్మము, వాచకము, భగవంతుఁడు వాచ్యుఁడు వాచ్యవాచకముల కభేదము మహర్షిప్రవేకా=మహర్షులందు శ్రేష్ఠుఁడా, ఋషీఆలోచనే, ఋషీ గతౌ అనుధాతవులఁ బట్టి ఆలోచించి తెలిసికొనువాఁడు ఋషి, వారిలో గొప్పవాఁడు మహర్షి. అట్టిమహర్షులలో గొప్పవాఁడు మహర్షిప్రవేకుఁడు, యస్య జ్ఞానమయం తపః, శ్రుతి. అనేకోరుజిహ్వా=పెక్కులు తోడలు నాలుకలు గలవాఁడా, జగత్సార్వికిన్=లోకసమూహమునకు, ఆద్యుఁడా కర్తవు = మొదటికర్తవు, ధర్తవు = వానిని ధరించువాఁడవు, హర్తవు = సంహ

రించువాఁడవు, సృష్టిస్థితిసంహారములు చేయువాఁడవు నీవే, ప్రత్యక్షముగ స్వయముగ రక్షణము బ్రహ్మరుద్రుల మూలమున సృష్టిసంహారములు చేయువాఁడవు నీవే. స్వయంభర్తవు=లోకముల నన్నింటిని నీవు భరింతువు కాని నిన్ను భరించువాఁడు లేఁడు, నిన్ను నీవు భరింపవలసినదే, సిద్ధసాధ్యాశ్రయుండు = సిద్ధులు = ముక్తులు, సాధ్యులు=నిత్యులు. 'యత్ర పూర్వే సాధ్యాస్సంతి దేవాః,' అని శ్రుతి. ఈ యిరువురకు నాశ్రయుమై నీతో సమానమైన భోగము లనుభవింపఁజేయువాఁడవు. 'భోగమాత్ర సామ్యలింగాత్'॥ బ్ర. సూ. సృష్టికిముందు సూక్ష్మ రూపంబు, మఱ్ఱిచెట్టునకు విత్తనమువలె నుండువాఁడవు. నీవేయజ్ఞంబు = 'యజ్ఞో వై విష్ణుః' శ్రుతి, యజ్ఞోపకరణములు యజ్ఞారాధ్యులు ఇంద్రాదులు నీశరీరము.

వషట్కారము=ఇది యుపలక్షణము, "చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పంచభిరేవచ। హూయతేచ పునర్ద్వాభ్యాం స నో విష్ణుః ప్రసీదతు.

నాలుగు - నాలుగు - రెండు - ఐదు - మరల రెండు వీనిచే నెవఁడు ఆరాధ్యుఁడో యట్టి విష్ణువు నన్ననుగ్రహించును గాక యని యర్థము. నాలుగు = ఆశ్రావయ; మరల నాలుగు=అస్తు శ్రౌషట్ - రెండు వషట్, ఐదు-యే యజామహే - మరల రెండు యజ - ఇన్ని కలిసి పదునే డక్షరములు - ఓంకారము= ప్రణవము - ఓమిత్యేకాక్షరం బ్రహ్మ = నారాయణోపనిషత్తు - గిరామస్మ్యేక మక్షరమ్॥ గీత—

సముత్కృష్ట=మిక్కిలి శ్రేష్ఠమైన భక్తియోగముచేఁ బొందఁబడువాఁడవు, నాహం వేదైర్నతపసా నదానేన నచేజ్యయా, శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా, భక్త్యా త్వనన్యయా శక్య అహ మేవంవిధోఽర్జున, జ్ఞాతుం ద్రష్టుంచ తత్త్వేన ప్రవేష్టుంచ పరంతప॥ గీత॥ "నాయమాత్మా ప్రవచనేన లభ్యో నమేధయా నబహునా శ్రుతేన-యమే వైష వృణుతే తేన లభ్యస్తస్యైష ఆత్మా వివృణుతేతనూం స్వామ్" శ్రుతి.

"యోగినామపి సర్వేషాం మద్గతే నాంతరాత్మనా, శ్రద్ధావాన్భజతేయో మాం సమే యుక్తతమో మతః' భ. గీ. ౬-౪౭. కావున సుత్కృష్టయోగము భక్తియోగము-భక్తరమ్యుండవు = భక్తులకు మనోహరుఁడవైన వాఁడవు, పట్టునన్=ఉనికి=స్థానము, గిట్టుటన్=సంహారము, గోజాత=వృక్షములు, భూ=భూమి, నిర్జర = దేవతలు, వీరిచే-ఆక్రాంత = ఆక్రమింపఁబడిన, భూతావళీ = భూత సమూహము, శైల = పర్వతములు, దిగ్జాల=దిక్కులు సమూహములు. కాంతార దేశంబులన్ = అడవిప్రదేశములందు, "భూతాని విష్ణు ర్భువనాని విష్ణు ర్వనాని విష్ణు ర్గిరయో దిశశ్చ - నద్య స్సముద్రాశ్చ స ఏవ సర్వం యదస్తి యన్నాస్తిచ విప్రవర్య-" విష్ణుపురాణము.

నీవేకదా వేయి పాదంబులన్......దక్షుండవు=ఇందు బురుషసూక్తార్థము

చెప్పఁబడెను. క్షోణి = భూమి, కల్పాంతవేళన్ = ప్రలయసమయమున, మహోహీంద్రతల్పుండవై = గొప్ప సర్పము పానుపుగాఁ గలవాఁడవై, ఈ సర్పము అనంతుఁడు సర్పప్రతీకము గుఱించి యిట్లు వ్రాయఁబడెను.

**The Primitive Symbol of the Serpent stood for divine wisdom, and perfection, regeneration and immortality.**

అంగాన్యన్యా దేవతాః అన్నట్లు దేవతలందఱు భగవంతుని యంగములు, ఈ వాక్యము ననుసరించి నేను నీ చిత్తము సరస్వతి నీ నాలుక - రోమములు దేవతలు-యోగిశహృత్ ధామ=యోగీశ్వరుల హృదయము స్థానముగాఁ గలవాఁడా, శ్రీధామ-ఇచ్చట శ్రీ భూమి కుపలక్షణము-"హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ" యని శ్రుతి-నిశ్శ్వాసములు=ఊర్పులు-"తస్యహవా ఏతస్య మహతో భూతస్య నిశ్శ్వసిత మేత ద్యదృగ్వేదః" శ్రుతి. దీని వలన వేదము లపౌరుషేయము లనియు ననాదు లనియు భగవత్స్వరూపము లనియు నేర్పడెను. అనంతయున్=అవగింజంతదైన, పరమాణువు నంతదైన.

సర్వంబు లోకంబు నీకున్ శరీరంబు="యస్య పృథివీ శరీరం యస్యాపశ్శరీరం యస్య తేజశ్శరీరం యస్యవాయుశ్శరీరం యస్యాకాశశ్శరీరం యస్య మనశ్శరీరం యస్య బుద్ధిశ్శరీరం యస్యాహంకార శ్శరీరం యస్య చిత్తం శరీరం యస్యావ్యక్తం శరీరం యస్యాక్షరం శరీరం యస్య మృత్యు శ్శరీరం సఏష సర్వభూతాంత రాత్మా పహత పాప్మా దివ్యో ఏకో నారాయణః' ఇట్లు సుబాలోపనిషత్తు, ఛాందోగ్యము చెప్పుచున్నవి. శరీర మనఁగా ఏ చేతనునకు నే ద్రవ్యము సర్వవిధముల స్వార్థమునకై నియమించుటకు ధరించుటకు శేషభూత మగుటకుఁ దగినదో యది యా చేతనుని శరీర మనఁబడును. ఆధేయ విధేయ శేషత్వములు శరీరలక్షణములు - కావున ప్రకృతియు జీవులు భగవంతునకు శరీర మగుటచే వాని సంసృష్టిచే నేర్పడిన సర్వ ప్రపంచ మాయునకు శరీరమే. విష్ణుపురాణ మిట్లులే చెప్పుచున్నది. శ్రీవత్సచిహ్నా=శ్రీవత్స మను పేరుగల మచ్చ వక్షమందు గుర్తుగాఁగలవాఁడా. "లక్ష్మీర్వాల్లభ్యసౌభాగ్య చిహ్నం శ్రీవత్సనామకమ్." ఇది మహాపురుషలక్షణము. శ్వేతరోమావర్తము. ప్రసాదము=ప్రసన్నత్వము, సోముఁడు=చంద్రుఁడు, వైరోచనిన్ = బలిని, విరోచను కొడుకును, పాదత్రయన్యాసంబునన్ = మూఁడడుగుల కొలఁతచే, దైత్యారికిన్ = ఇంద్రునికి, కృష్ణుండునన్ నీవ = ముందు కృష్ణుఁడుగా నవతరింపఁ బోవువాఁడవు నీవే, ఈ యవతారములు చెప్పుట ప్రత్యవతారమందు లక్ష్మి నిన్ననుసరించియే యున్నదని తెలుపుటకే ప్రతి మన్వంతరమున దశావతారములు వచ్చునవే కావున రాఁబోవు కృష్ణావతార వృత్తాంతము బ్రహ్మ సూచించెను. కల్క్యవతారము రాఁగలదని మనకే తెలిసినపుడు రాఁగలది బ్రహ్మకుఁ దెలియదా? ప్రజానాథ వాచ్యుండవు=ప్రజాపతి యని చెప్పఁబడువాఁడవు. మానుషీ దేహమున్=మనుష్యస్త్రీ, దేహమును, మా కార్యము=దేవతలకార్యముల కో

ఘంబు=వ్యర్థము కానిది. నీ స్తోత్రము ఫలమీయక వ్యర్థ మెప్పుడునుగాదు. నిన్ భక్తిచేఁగొల్చి నిన్ను మనస్సున నుంచుకొనువారికి నేకొఱఁతయుఁ గలుగదు.

తాత్పర్యము స్పష్టము

ఆ. అనఘమును బురాణ • మైతిహ్య మార్షంబు, నైన యీ స్తవంబు • ననుదినంబుఁ
బరమభక్తితోడఁ • బఠియించు వారికి, రాద దెప్పుడేని బ • రాభవంబు. ౨౭౦౮

అర్థములు. అనఘము = పాపము హరించునది పురాణము = పురాతనము, ఐతిహ్యము = ఇతిహాసరూపమైనది, ఆర్షంబు = వేదసిద్ధము, స్తవంబు = స్తోత్రంబు, అనుదినంబు = ప్రతిదినము, పరాభవంబు = మఱుజన్మము, (౨) బాహ్యాభ్యంతర శత్రుతిరస్కారము.

తాత్పర్యము

పై దండకమందు నిన్ను సేవించు భక్తు లిహపరసౌఖ్యముల నెల్లఁ గందురని చెప్పఁబడెను.

అట్లు భక్తి చేయలేనివా రీ స్తోత్రమును ప్రతిదినము పఠించిరేని జన్మాంతర ప్రాప్తిని గాని కామక్రోధాదుల వలనఁ గాని బాహ్యశత్రువుల వలనఁగాని తిరస్కారము కలుగదని చెప్పఁబడెను. ఇది పాపహరము, పురాణము, ఇతిహాసము, వేదసంబంధమైనది. కావున దీనియం దిట్టి మహాత్మ్యము గలదు.

## ౧౨౧-వ సర్గము. అగ్నిహోత్రుఁడు సీతాదేవిని శ్రీరామునకు మరల నర్పించుట

కం. అని మంగళకరసూక్తులు, వనజాసనుఁ డాడుచుండ • వైశ్వానరుఁడున్
జనకసుత నంకతలమునఁ,గొని నరుఁడై చితను జిమ్మ • కొనుచున్ వచ్చెన్.

అర్థములు. మంగళకరసూక్తులు = మిగుల శుభకరములైన మాటలు, వైశ్వానరుఁడు=అగ్ని, అంకతలమునన్=ఒడియందు, బిడ్డనెత్తుకొన్నట్లు, నరుఁడై = మనుష్యాకారము గలవాఁడై.

తాత్పర్యము

ఈ ప్రకారము బ్రహ్మదేవుఁడు శుభవాక్యములచే రామచంద్రమూర్తిని స్తుతించుచుండ నగ్నిహోత్రుఁడు మనుష్యస్వరూపమున నగ్నియని గుర్తింప స్రుక్స్రువాదులను ధరించి బిడ్డ నెత్తుకొన్నట్లు సీతాదేవి నొడియందుంచుకొని పాదయుందలి కట్టెలను చెదరఁజిమ్ముచు వచ్చెను.

సీ. తరుణార్క-బింబంబు - నిరసించుదానిని, నవ్యహాటకభూష • ణములదాని
నీలకుంచితకేశ • జాలకంబులదాని, రక్తాంబరంబునఁ • గ్రాలుదాని
వాడని మాలికా • భరణము ల్గలదానిఁ, జెక్కు-చెదరనిమేని • నిక్కు-దాని
సంకురింపని చిత్త • సంకోచ మగుదాని, మునుపటిరూపంబ • మొనయుదాని

ఆ. సర్వలోకసాక్షి • జాతవేదుఁడు బాల, నొడిఁ గదించి తెచ్చి • పుడమిజేని
కిచ్చి యిట్టు లనియె•నీమె సీతావైదేహి, యీమెయందుఁ, బాప•మేమి లేదు.

అర్థములు. తరుణార్కబింబంబున్ = బాలసూర్యబింబమును, నిరసించు దానిని=తన కాంతిచే ధిక్కరించు దానిని, నవ్యహాటక భూషణముల దానిని = మనోహరములైన బంగారాభరణములు ధరించిన దానిని, ఇవి విభీషణుఁడు సమర్పించిన భూషణములు, అంతకుముందు దేహమున సొమ్ములే లేవుకదా. నీలకుంచిత కేశజాలకంబులదాని = నలుపై యుంగరములవలె ముడుఁచుకొనిన తలవెండ్రుకలు విస్తారముగఁ గలదానిని, రక్తాంబరంబునఁ గ్రాలుదాని = ఎఱ్ఱనిచీర కట్టుకొన్న దానిని, ఈ యెఱ్ఱచీర విభీషణుఁ డిచ్చినది, ఆశ్రమ మందున్నప్పుడు కట్టుకొన్న చీర పచ్చనిది, లంకయందున్నప్పుడు కట్టుకొన్న చీర పచ్చనిదే, వాడని మాలికాభరణము ల్గలదాని=నిప్పుసెగకు కమలని పూలదండలు సొమ్ములు గలదానిని, ముత్యములు లోనైనవి నిప్పులలో వేసినఁ జెడిపోవును గదా, అట్లు పోలేదని భావము. ఆశ్రయ మాహాత్మ్యము వలన వానికి నట్టి శక్తి వచ్చెను. అంకురింపని= మొలక లెత్తని, పుట్టని; మునుపటి రూపంబు=అగ్నిలో ప్రవేశింపకముందే రూపమున నుండెనో యా రూపమే కలదాని, అగ్నిలోఁ బ్రవేశింపకముందు శోకావేశముచే నుపవాసములచే బక్కచిక్కి తెల్లవాఱి యుండెను. ఇప్పుడట్టులే యున్నది జాతవేదుఁడు.= అగ్ని.

తాత్పర్యము

•బాలసూర్యబింబమువంటి కాంతి గలదానిని, మనోహరము లయిన బంగారు భూషణములు ధరించినదానిని, నల్లని యుంగరముల వంటి తలవెండ్రుకలు గలదానిని, ఎఱ్ఱచీర కట్టుకొన్న దానిని, వాడిపోని పూలదండలు ఆభరణములు గలదానిని, కొంచెమైన కమలని దేహకాంతి గలదానిని, మనస్సునం దెట్టి సంకోచము లేని దానిని, నగ్నిలోఁ బ్రవేశించినపు డెట్లుండెనో యట్లే యున్నదానిని, నిట్టి బాలను సర్వలోకులు చేయుకర్మములకు సాక్షియగు నగ్నిదేవుఁడు బిడ్డ నెత్తుకొన్నట్టు లొడిలో నెత్తుకొని తెచ్చి రామచంద్రున కిచ్చి యీమె నీ సీత, ఈమెయందుఁ బాప మేమాత్రము లేదు.

కొందఱ యభిప్రాయమున ఆశ్రమమందున్న సీత రావణాసురుఁడు రాక ముందుగ నగ్నిలో దాఁగియుండి యిప్పుడు వెల్వడెననియు నీనడుమ రావణాసురుఁడు హరించి తెచ్చినది మాయాసీత యనియుఁ జెప్పుదురు. ఈయభిప్రాయమున కాధారము లితర గ్రంథవాక్యము లందురు. శ్రుతిసమ్మతములైన స్మృతివాక్యములు గ్రాహ్యములు. తద్విరుద్ధములు త్యాజ్యము లని యెట్లు చెప్పఁబడెనో వాల్మీకి రామాయణమున కనుకూలించిన యితరపురాణవాక్యములు గ్రాహ్యము లనియుఁ దద్విరుద్ధములు త్యాజ్యములనియు నవి యా యా వక్తల యభిప్రాయమే కాని యాదికవి యగు వాల్మీకి యభిప్రాయముగా గ్రహింపరాదనియు నీ వ్యాఖ్యాత

యభిప్రాయము. ఈ రామాయణమునకు విరోధింపనివి యితర గ్రంథముల జెప్పఁబడినవి గ్రహించిన గ్రహింప వచ్చును, కాలనేమి కథవలనే యీ మాయాసీత కథయు దీనితో విరోధించు చున్నది. కావున గ్రాహ్యము కాదు.

౧. మాయాసీతను గల్పింప వలసిన కారణమే లేదు. స్పర్శదోష విషయమై యిదివఱకే వ్రాయబడెను.

౨. లంకలో దుఃఖించు చుండినది మాయాసీత యగునేని సీతాదేవి విషయమున లోకము జాలిపడఁ బనిలేదు. సీతాదేవి చరిత్రమే నీరస మగుచున్నది.

3. మాయాసీత యనఁగా నేమి యర్థము. ఇంద్రజిత్తు కల్పించిన సీత వంటిదా ? ఇంద్రజిత్తు తన మాయచేతఁ గల్పించినదానివంటి దగునేని మాయావి పరోక్షమందు మాయ పనిచేయఁజాలదు. కావున నామాయాసీత యనునది సీత వంటి సత్యమైన వ్యక్తియే యని చెప్పవలయును. అట్లైనచో నామె ప్రవేశించు టకు ముందు చేసిన ప్రమాణముల వలన నామె దగ్ధకాక యుండవలెను. లేదా దగ్ధమై బూడిదయై యుండవలెను. మొదటి పక్షమున నిరువురు సీత లేర్పడుదురు. ఛాయాదేవి సంజ్ఞాదేవివలె అది విరుద్ధము.

౪. మాయాసీత యగ్నిలోఁ బడెనని యా బ్రహ్మరుద్రేంద్రాదులు పరితాపపడివచ్చుట ?

౫. సత్యసీతకుఁ బెండ్లినాఁ డీయఁబడిన జడబిళ్ళ మాయాసీత కెట్లులభించెను?

౬. కాకాసుర వృత్తాంతము మణిసిల తిలకము సత్య సీతావిషయమా ? మాయాసీతా విషయమా ?

౭. సత్యసీత పచ్చచీర కట్టుకొనినది, మాయాసీత యెఱ్ఱచీర కట్టుకొన్నది.

౮. సత్యసీత దశరథుఁడిచ్చిన సొమ్ములు ధరించినది, మాయాసీత విభీషణుఁ డిచ్చిన సొమ్ములు ధరించినది. దశరథుఁడిచ్చినసొమ్ములవంటివే విభీషణుఁడిచ్చెనా?

౯. సత్యసీత చిక్కినదికాదు. మాయాసీత బక్కచిక్కినది తెల్లవాఱినది.

౧౦. మాయాసీత రామునితోఁ జెప్పిన మాటలయందు వాస్తవముగ దానికి నన్వయించునది గొంకటియైనఁ గలదా ?

ఇత్యాది కారణములచే మాయాసీతావాదమే మాయావాదముగా నేర్పడు చున్నది.

కం. మానసమున భావణమున, ధ్యానంబునఁ గనల నైనఁ ♦ దరుణీమణి యీ
జానకి సువృత్తి నిన్నుం, దా నెప్పుడు మీఱలేదు ♦ తతశుభచరితా. ౨౭౮౧

తాత్పర్యము

అర్థములు. మనోవాక్కులచేఁగాని సంకల్పముచేఁగాని యనురాగముతో నితరులఁ జూచికాని యీయామె నిన్నెప్పు డతిక్రమించినదికాదు.

ఈమె యగ్నిలోఁ బ్రవేశించి వెడలిన సీత గాదేని యీ మాటలు పరిహాసాస్పదములు. ఉత్తరరామాయణమున సీతాదేవి వాల్మీక్యాశ్రమమందు విడుచుటకుఁ బూర్వము రామచంద్రమూర్తి లక్ష్మణునితో నీ పరీక్షావిషయము ప్రస్తావించెఁగదా. ఇచ్చట నగ్ని ప్రవేశించినది మాయసీత యగునేని యీవాక్యము లెట్లు సత్యములు.

ఉ. ని న్నెడఁబాసి దీన యయి • నిర్జనసీమను నస్వతంత్ర యై
యున్న సుశీల నీమె దురి•తోగ్రచరిత్రుఁడు బల్మిఁ దెచ్చి, నుం
చె న్నిజగేహమందు, నటు•చేసినను న్నినుఁ జింత సేయుచున్
నిన్నె భజించెఁ జూ వికృత•నేత్రలు రక్కసు లెప్డుఁ గావఁగన్. ౨౭౧౨

అర్థములు. నిర్జనసీమను=మనుష్యులు లేని ప్రదేశమున, అస్వతంత్రయై=పరవశయై, ఇది సీతాదేవి చెప్పినమాటను స్థిరపఱుచుచున్నది. బల్మిఁ దెచ్చె=బలాత్కారముగఁ దెచ్చెను. మాయాసీతావాదము ప్రకార మీ మాటలీమెయందు నన్వయింపవు. అగ్నిహోత్రుఁ డసత్యవాది యగును. వికృతనేత్రలు = వికారపుఁ గన్నులు గలవారు, ఈపద్యము మాయాసీతావాదమును నిర్మూలించుచు నగ్నిలోఁ బ్రవేశించిన సీతయే బయలు వెడలి వచ్చిన సీత యని స్థాపించుచున్నది.

తాత్పర్యము

నిన్ను వదలి శోకతప్తయయి మనుష్యు లెవ్వరు లేని ప్రదేశమునఁ బరవశయై యున్నసమయంబున నీ సాధ్విని పాపపునడవడిగల రావణుఁడు బలవంతముగా దెచ్చెను. తన యింట నుంచెను. అట్లు చేసినను వికారపుఁగన్నులు గల రాక్షసస్త్రీలు తన్ను రక్షింపఁగా నిన్నే ధ్యానించుచు నిన్నే భజించుచునుండెను గాని యితర విషయములందు మనస్సు పోనిచ్చినదికాదు.

తే. మోసగించెను దా నెంతొ•యాసముంచె. ధిక్కరించెను బెదరించె•గ్రక్కసించె
నేమిసేసిన లక్షింప • దీమె యతని, ననఘ నీయంద తనహృద • యంబు నిలిపి.

అర్థములు. తాను = రావణుఁడు, క్రక్కసించెన్ = కఠినముగా వర్తించెను. కర్కశించుయొక్క తద్భవము. ఈ పద్యముకూడ నశోకవనిలో దుఃఖించినది వాస్తవసీత యనియే తెలుపుచున్నది.

తాత్పర్యము స్పష్టము.

కం. రామా! విశుద్ధమానస, నే మాత్రం బైనఁ బాప•మెఱుఁగని సాధ్విన్
నామాటఁ బట్టి యేలుము, యీమెను నద్దంబు లాడ•కేమియు నిపుడే. ౨౭౧౪

తాత్పర్యము స్పష్టము.

—• శ్రీరాముఁడు సీతాదేవిని బరిగ్రహించుట •—

కం. అని యాశ్రయాశుఁ డాడిన, విని ప్రీతాత్ముండు రామ•విభుఁ డశ్రుతతుల్
కనుదోయి ముంప మూర్తం, బనఘుఁడు చింతించి యిట్టు•లను దహనునకున్.

అర్థములు. ఆశ్రయాశుఁడు=అగ్నిహోత్రుఁడు, అశ్రుతతుల్ = కన్నీళ్ళ సమూహములు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. జానకి శుద్ధురాలగుట • సత్యము దైనను దీర్ఘకాల మీ
దానవనాథు నంతిపురిఁ • దాని వసించుట నిక్కు దూరకే
యేను గ్రహించినన్ దశర•థేశ్వరు పుత్రుఁడు రాముఁ డెంత ధీ
హీనుఁడు కాముకుండు గ్రహి • యించె నతిం బరికింప కేమియున్. ౩౯౧౬

అర్థములు. ధీహీనుఁడు = బుద్ధిలేనివాఁడు; కాముకుఁడు=స్త్రీ కామము గలవాఁడు, పరికింపక=పరీక్షింపక, దశరథేశ్వరు పుత్రుఁడు రాముఁడు, దశరథుఁ డెంత కాముకుఁడో రాముఁడు నంత కాముకుఁడే.

తాత్పర్యము

జానకియందు దోషము లేదని నే నెఱుఁగుదును. నీవు సత్యమే చెప్పితివి వినను దీర్ఘకాలము రావణుని యంతఃపురమందు నుండిన కారణమున నిప్పుడు పరీక్షింపక గ్రహించితినేని యీ రాముఁడు తండ్రికిఁ దగిన కొడుకే బుద్ధిహీనుఁడు స్త్రీ కామవశుఁడు. మంచి చెడ్డ పరీక్షింపక మరల గ్రహించెనని.

చ. అని యిటు ముజ్జగంబులను • నార్యులు పల్కరె నన్ను ! దానికే
జనకజ భర్తరా లనియు • సాధ్వి యనన్యమనస్క యంచు నా
మనము నెఱింగి వర్తిలెడి • మానితశీల యటం చెఱింగియున్
జనముల నమ్మఁజేయ నతి • సత్యరతుండ నుపేక్ష సేసితిన్, ౩౯౧౭

అర్థములు. సాధ్వి = పతివ్రత; అనన్యమనస్క=నాయందుఁ దప్పనితరులయందు మనస్సు లేనిది, మానితశీల = పూజ్యచరిత్ర. సత్యరతుండ = సత్యమందు ప్రీతిగలవాఁడా.

తాత్పర్యము

నన్ను ముూఁడు లోకంబులఁ బెద్దలు పల్కరా? ఆ నింద పడఁజాలక జానకి నాయందు భక్తి గలది. పతివ్రత, ఇతరులయందు మనస్సు లేనిది. నామనస్సు ప్రకారము వర్తించు పూజ్యచరిత్ర యని తెలిసియు లోకుల నమ్మఁజేయుటకై నే నుపేక్షించితిని. నీవు సత్యమందుఁ బ్రీతి గలవాఁడవు కావున నేను సత్యము చెప్పితిని.

చ. చెలువలమిన్న నన్నెపుడు • శీలమహత్త్వము పేర్మిఁ గాచుకోఁ
గల దని, పంక్తికంధరుఁడు • కాండధి వేలనుబోలె మీఱఁగా
వలఁతియు గాఁడటంచు, నతి • శాపుడు నుండెడుమంటపోలికం
దలఁపున సేని ధిక్కృతి యె • నర్పఁగ లేఁ డని నే నెఱుంగుదున్. ౩౯౧౮

అర్థములు. కాండధి=సముద్రము, వేలను = చెలియలికట్టను, వలఁతి= సమర్థుఁడు.

తాత్పర్యము

ఈ స్త్రీరత్నము తన పాతివ్రత్యమహిమచేఁ దన్నుఁ దాను గాపాడుకొనఁ గల దనియు, చెలియలికట్టను సముద్రుఁడు మీఱిపోలేనట్లీమెను మీఱి రావణుఁడు పోలేఁడనియు, నీమెయొద్దకు వచ్చునప్పటికి వానిదుర్వృత్తి నిలిచిపోవలసినదే యనియు, ఆపాపాత్ముఁడు మండెడు మెఱుమంటను దిరస్కరింప సాధ్యపడనట్లీమెను దాఁకి బ్రదుక లేఁడనియు నే నెఱుఁగుదును.

తే. రావణాంతఃపురంబున • రమ్యశీల, యర్హ గాదు సుఖశ్రీల • ననుభవింప
సూర్యునకు నెండవోలె నీ•సుందరాంగి, నన్ను విడనాడి యుండ లే•దెన్నఁడేని

తాత్పర్యము

ఈమె రావణుని యంతఃపురంబున సుఖసంపద లనుభవింపఁ దగినదికాదు. ఆ పాపాత్ముని సొత్తు ఈమె వినియోగించుకొనఁ దగినదిగాదు. జారుల ద్రవ్యము సాధువులు గ్రహింపరాదుగదా. సూర్యుని విడిచి యెండ యేప్రకార మెన్నఁడైన నే నిమిషమందైన నుండదో యట్లీమె నన్ను విడిచియుండదు, మనస్సుచే నైన నా సంయోగము వదలి యుండునది కాదు. 'రాఘవత్వే భ వేత్సీతా' యన్నట్లు నిత్యానపాయిని యని భావము.

మీఁదఁ జెప్పిన యనన్యశబ్దముయొక్క యర్థ మిందు వివరింపఁబడెను. ఒక్క వస్తువు మఱియొక్క వస్తువుగా నగుట మనన్యత్వ మని చెప్పరాదు. ఏలన నొక వస్తువు మఱియొక వస్తువుగా నేనాఁటికిని నే దశయందును గాఁజాలదు. సూర్యున కెండ యనన్య మనినపుడు నిత్యసంయోగ మర్థముగాని ఎండ సూర్యుఁ డయ్యె నని కాని సూర్యుఁ డెండయయ్యె నని కాని యర్థముగాదు. ఎండ విశేషణము - అంశము-సూర్యుఁ డంశి - విశేష్యము. గుణసామ్యము గలదు - కావున సీతము - జీవాత్మ పరమాత్మ సంబంధ మిట్టిదే యని గ్రహింపనగు.

ఉ. పూతచరిత్ర యీ జనక • పుత్రిక శుద్ధ జగత్త్రియంబునన్
ఖ్యాతసుకీర్తినిన్ సుమతి • వీడఁగఁ జాలనిభంగి నెట్లు భూ
జాతను బాయనేర్తు? సుర • సత్తములార! త్రిలోకపూజ్యులున్
ఖ్యాతులు స్నిగ్ధు లీర లిటు • లా నన నే నొనరింప కుందునే. ౨౭ ౨౦

అర్థములు. పూతచరిత్ర = పవిత్రమైన నడవడి గలది, శుద్ధ = పవిత్రురాలు, కల్మషహీన, సుమతి=బుద్ధిమంతుఁడు, స్నిగ్ధులు=స్నేహభావము గలవారు.

తాత్పర్యము

పవిత్రమైన నడవడిగల యీ సీత నిష్కల్మషహృదయము గలది. బుద్ధిమంతుఁడు సత్కీర్తిని వదలలేనట్టు నే నెట్టులీమెను వదలనేర్తును. దేవతాశ్రేష్ఠులారా! మీరు మూఁడులోకములందుఁ బూజింపఁబడువారు. ప్రసిద్ధులు,

నాయందు స్నేహభావము గలవారు. ఇట్టి నీచారవుపనిన దానిని నేను జేయకుందునా? మీకు సమ్మతమైన కార్యము చేయుటకే కదా నే నవతరించితి నని భావము.

కం. ఇటు తనయొఱిఁగిన విషయము, స్ఫుటముగ వచియించి నిఖిల•సురసన్నుతుఁ డై
కుటిలాలక సీతం గొని, పటుతరసౌఖ్యంబు రామ•భద్రుఁడు గాంచెన్. ౨౬౨౧

తాత్పర్యము

ఈ ప్రకారము తనకుఁ దెలిసిన విషయము దేవతలకుఁ దెలియఁజెప్పి సీతను జేరఁదీసి రాముఁడు సుఖించెను.

భక్తిప్రపత్తుల ఫలము సాయుజ్యప్రాప్తి. అది యీ పద్యంబునఁ జెప్పఁబడెను. సీతాదేవి యతిక్రాంచితకాలము భక్తిహీనయై ప్రాకృతపదార్థము మీఁద మనస్సు పోనిచ్చుటచే లంకాప్రాప్తి యయ్యె నని ముందు చెప్పఁబడెను. ఇప్పుడు ముక్తి చెప్పఁబడెను. ఇప్పుడు సీతాదేవికి రామసాయుజ్యము ప్రాప్తించెను. సయుగ్భావము సాయుజ్యము. సమానత్వప్రాప్తి. పుంస్త్వస్త్రీత్వ భేదము తప్పఁ దక్కిన యన్ని విషయముల రామచంద్రమూర్తితో సమానురాలయ్యెను. ముక్త దశయందు జీవాత్మున కిట్టి సామ్యము లభించు నని,

"భోగమాత్ర సామ్యలింగాచ్చ" బ్ర॥ సూ॥ ౪-౪-౨౧.

"సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" యను శ్రుతియు జీవునకు బ్రహ్మానుభవము చెప్పుచున్నవి. కావున సాయుజ్యముక్తి సీతారాములు కలయుట వంటిదని యెఱుఁగనగును.

—: ౧౨౩-వ సర్గము. సీతా రామ లక్ష్మణులు దశరథు నందర్శించుట :—

సీ. సూర్యకులేశ్వరు • శుభసుభాషితముల, విని శుభతరసూక్తి • ననియె శివుఁడు
భూరిభుజా! సిత • పుష్కరలోచన!, పీనవక్షా! శత్రు • భూద్వరేణ్యా!
మాభాగ్యమున వైరి•మర్దనా! యిమ్మహా, కార్యంబుఁ జలిపితి • కౌసలేయ!
మాయదృష్టంబున•మహితదారుణతమం, బసురేంద్రభవము భ•యంబుఁ బాసి

ఆ. తఖిలలోకములకు • నాశ్వసింపుము దీను, భరతు నీకుజననిఁ • బ్రథితచరిత
యైన కైక లక్ష్మ•ణాంబామణి సుమిత్రఁ, బట్ట మయ్యయోధ్యఁ•గట్టుకొనుము.

అర్థములు. నవపుష్కరలోచనః క్రొత్త కెందామరలవంటి కన్నులు గలవాఁడా, "ఇది కప్యాసం పుండరీక ఇవ అక్షిణీ" యను శ్రుతివాక్యమును "పురుషః పుండరీకాక్ష" యను స్మృతివాక్యమును సూచించుచున్నది. ఎఱ్ఱకమలములవంటి కన్నులు గలవాఁడు– ఇది పరబ్రహ్మము యొక్క యసాధారణ చిహ్నముగా శ్రుతిస్మృతులు చెప్పుటవలనను దానినే శివుఁడు రాముని విషయమున ననువదించుటచేతను శ్రీరాముఁడుగా నవతరించిన విష్ణువే వేదాంతవేద్యుఁ డగు పరబ్రహ్మము అని చెప్పఁబడెను. గోవింద. పీనవక్షా = లక్ష్మీనివాస స్థానము గావున

బలిసిన బొమ్మ గలవాఁడా, శస్త్రభృద్వరేణ్య = శస్త్రముల ధరించిన వారిలో శ్రేష్ఠుఁడా! మహిత దారుణ తమంబు = గొప్పదియు భయంకరమైనదియు నగు చీఁకటిని, అసురేంద్రభవము=రావణు వలనఁ గలిగినది.

తాత్పర్యము

సూర్యవంశమునఁ బుట్టిన వారిలో గొప్పవాఁడగు రామచంద్రమూర్తి తమ్ము గౌరవించి యిట్లు శుభ వాక్యములు చెప్పఁగా శివుఁడు శుభతర వాక్యముల నిట్లనియె. గొప్పభుజబలము గలవాఁడా! క్రొత్తకెందామరలవంటి కన్నులు గలవాఁడా! విశాలవక్షము గలవాఁడా! ఆయుధములు ధరించిన వారిలో శ్రేష్ఠుఁడా, శత్రువుల సంహరించినవాఁడా, మాయదృష్టమున నీవీ గొప్పకార్యము చేసితివి. మాభాగ్యమున అఖిలలోకములకు రావణువలనఁ గలిగిన భయమును గాఢాంధకారమును దొలఁగించితివి. ఇచ్చట కార్యము తీరినది. అచ్చట భరతుఁడు దుఃఖించుచున్నాఁడు. ఆయనను నీ తల్లిని కీర్తికెక్కిన కైకను లక్ష్మణుతల్లి సుమిత్రను ఆశ్వాసపఱుపఁ బొమ్ము. అయోధ్య యందుఁ బట్టముఁ గట్టుకొమ్ము.

కం. అలరింపు సుహృజ్జనముల, నిలుపుము యిక్ష్వాకుకులము ♦ నిరుపమకీర్తిన్
వెలయుము, తురంగమేధము,సలుపుము సువదాన్యయశము♦జగములనిలువన్.

తాత్పర్యము

రామచంద్రమూర్తీ! నీ యవతార ప్రయోజనములలో సాధుపరిత్రాణము దుష్టవినాశము నను రెండు కార్యములు చాలభాగము నెఱవేర్చితివి. ఇఁకఁ మూఁడవది ధర్మసంస్థాపనము చేయవలసి యున్నది. దానికై నీవయోధ్యకుఁ బొమ్ము. స్నేహితుల సంతోషపెట్టుము. సంతానముఁగాంచి యసమాన కీర్తిగల యిక్ష్వాకుకులము నిలుపుము. ఉత్తమదాత యను యశము లోకముల నిలుచునట్లు లశ్వమేధయాగము చేయుము.

కం. త్రిదివంబునకుం జనుమీ, పదకడి; యదె చూడు భూమిఁ ♦ ద్వాజ్జనకుం డై
యుదితయశుండై గురుడై, విదితుం డగు దశరథుండు ♦ వియదధ్వమునన్.

తాత్పర్యము

ఈ కార్యము లన్నియు నెఱవేర్చిపూర్వము నీవు సంకల్పించిన ప్రకారము వైకుంఠమునకుఁ బొమ్ము. అదిగో నాకాశమున జూడుము. భూమియందు నీకుఁ దండ్రియై కీర్తివంతుఁడై గురువై ప్రసిద్ధికెక్కిన దశరథుఁ డున్నవాఁడు.

తే. పుత్రరత్నంబ వగు నీదు♦భూరిమహిమఁ, దారితుం డయి శక్రప♦త్తనమునందుఁ
గలితసుశ్రీలఁ దేలుచు ♦ గగనయాన, మందు నిలిచినవాఁడు మ♦హానుభావ!

అర్థములు. మహానుభావ=గొప్పమహిమగలవాఁడా, తారితుండయి = తరింపఁబడినవాఁడు, గగనయానము=విమానము.

## తాత్పర్యము

ఉత్తమ గుణములుగల నీవు కొడుకైన కారణముచే నీవాతని సత్యము కాపాడుటచే నరకము పాలుగాక తరించి యింద్రపత్తనమందు మంచిసంపద యనుభవించుచు విమానమందు నిలిచియున్నాఁడు.

కం. సౌమిత్రితోడ నీవును, ధీమహితా! మ్రొక్కు మన్నఁ • ద్రిపురహరునుడిన్
రాముఁడు సానుజుఁడై యా, వ్యోమరథస్థున్ సుకాంతి•యుక్తున్ జనకున్.

అర్థములు. త్రిపురహరునుడిన్ = శివుని మాట ప్రకారము, వ్యోమరథస్థున్=విమానమం దున్నవానిని, సుకాంతియుక్తున్ = మనుష్య శరీరమందున్న తేజస్సుకంటె నెక్కువ తేజస్సుగలవానిని, జనకున్=తండ్రిగా నుండిన వానిని.

## తాత్పర్యము స్పష్టము.

కం. విరజోంబరధారిని గని, కరములు ముకుళించి మ్రొక్కె • దాత్మనాథుఁడు ము
ద్భరమునఁ బ్రాణప్రియుతరు, వరసుతు నంకంబుఁ జేర్చి • పరిరంభించెన్.

అర్థములు. విరజోంబరధారిని = మలినములేని తెల్లవస్త్రముల ధరించినవానిని, ముద్భరమునన్=సంతోషాతిశయముచే, ప్రాణప్రియతరున్ = ప్రాణముల కంటె మిగులఁ బ్రియుమైన వానిని, పరిరంభించెన్=కౌఁగిలించెను.

దీని వలనను భారతమున స్వర్గారోహణపర్వమున ధర్మరాజు ననుభవముఁ బట్టియు నీ లోకమువారు మరణించి యీ దేహములు విడిచి స్వర్గమునకుఁ బోయినను అచ్చట నిచ్చటవలెనే యొకరి నొకరు గుర్తింపఁగల మొక్కట్లు సూక్ష్మశరీరము గలవారై యుందురనియు పృథివీతత్త్వము క్షీణించి తేజస్తత్త్వ మెచ్చగుటచే కాంతి యతిశయించి యుండుననియు నేర్పడుచున్నది. ఈ పోలిక ప్రకృతి సంబంధము వదలువఱకు మాఱదు. కాంతి యతిశయించు చుండునే కాని పై పై లోకములకుఁ బోయినను మొక్కట్లు మాఱవు. ఒకరినొకరు గుర్తింప వచ్చును.

## తాత్పర్యము

తెల్లని నిర్మలమైన వస్త్రమును ధరించినవానిని జూచి చేతులు జోడించి మ్రొక్కెను. దశరథుఁడును సంతోషాతిశయమునఁ బ్రాణములకంటె మిగులఁ బ్రియుఁడైన ప్రియకుమారుఁజూచి యొడియందుఁజేర్చి కౌఁగిలించెను, మరణించిరని మనము తలఁచు వారికిని మనకును దశాభేదము తప్ప మఱి యే భేదము కానరాదు. దశాభేద మనఁగా బాలుఁడు యౌవనవంతుఁడైనట్లు, ఈకారణముచేఁ బాపులుతప్ప దక్కినవారు మరణమునకు భయపడవలసిన కారణములేదు. అందు భక్తులకుఁ బ్రపన్నులకు నరకబాధలేదు. వీరు ప్రకృతిమండలము దాఁటి విరజానది స్నానము చేసి దానిని దాఁటి భగవత్స్వరూపధారు లగుదురు. అప్పటి శరీరము లప్రాకృతములు. అప్పటి శరీరధారణము వారి యిష్టానుసారమై యుండును. ప్రకృతినిర్బంధ మచ్చట లేదు.

—♦ దశరథుఁడు శ్రీరామునిఁ బ్రశంసించుట ♦—

ఉ. ఈ మెయిఁ గౌఁగిలించుకొని ♦ యెంతయు రక్తి మహీశుఁ డిట్లనన్
రామ! నిజంబు చెప్పెద ను ♦ రస్థిర మౌనిసురాళిచేత న
న్నోమహనీయసత్కృతుల ♦ నొందుచు గౌరవ మందు చుండియున్
నామది లేదు సంతసము ♦ నాయన! నిన్నెడఁబాసి యుండుటన్. ౨౭౨౮

అర్థములు. సురస్థిరన్ = దేవలోకమందు.

తాత్పర్యము

ఈ ప్రకారము కౌఁగిలించుకొని మిక్కిలి ప్రేమతో దశరథుఁ డిట్లనియె. రామచంద్రా! సత్యము చెప్పెదను. దేవలోకమందు మునులు దేవతలు నెంతో గొప్పగా నన్ను సత్కరించుచున్నారు. అయినను నిన్ను విడనాడి యుండుటచే నాయనా! నాకు సంతోషము లేదు.

దీనివలన రాగద్వేషములు స్వర్గలోకమందుండు వారికిని గలవని యేర్పడు చున్నది. రాగద్వేషములున్నప్పు డసూయా మాత్సర్యాదులు గలవు. రాజసూయయాగము చేసి తనకంటె గొప్పపదవి నందువారిని జూచికదా పాండురాజు ధర్మరాజునకు రాజసూయయాగము చేయుమని చెప్పి పంపెను.

కం. దుర్నయులం బొరిగొని సంపూర్ణాత్ముండ వైన నిన్నుఁ ♦ బొడఁగనుటను ని
స్తీర్ణవనవాసు నిప్పుడు, పూర్ణమనస్కుండ నైతిఁ ♦ బుణ్యచరిత్రా. ౨౭౨౯

అర్థములు. దుర్నయులన్ = చెడు నీతిపరులను - సంపూర్ణాత్ముఁడవు = పూనిన ప్రయత్నము పూర్ణముగా నెఱవేర్చిన వాఁడవు; నిస్తీర్ణవనవాసున్-వనవాస నియమము దాఁటిన వానిని-పూర్ణమనస్కుండను=నిండినకోరికగలవాఁడను.

తాత్పర్యము

దుష్టులను సంహరించి పూనినపని సాంతముగా నెఱవేర్చి వనవాస నియమము కడముట్టించియున్న నిన్నుఁజూచి కోరిక నెఱవేఱుటచే సంతోషముతో నిండిన మనస్సుగలవాఁడ నైతిని.

ఉ. కానల నిన్నుఁ ద్రోయుమని ♦ కైక వచించిన నిష్ఠురోక్తు లీ
మానసమందు నాటినవి ♦ మానక యిప్పుడు కౌఁగిలించి స
మ్మానితు నిన్ను లక్ష్మణుని ♦ మానితి దుఃఖము మంచుపాయుటన్
భానుఁడువోలె నే మరల ♦ భాసిలఁ గంటిఁగదయ్య పుత్రకా! ౨౭౩౦

తాత్పర్యము

కుమారా! నిన్ను నడవులకుఁ బంపుమని కైక పలికిన పరుష వాక్యములను నా మనస్సున నాటి బాధించుచుండినవి. ఇప్పుడు వనవాసదీక్ష దీరిన నిన్ను లక్ష్మణునిఁ గౌఁగిలించి యీ దుఃఖము పాసితిని. మంచుపోఁగాఁ బ్రకాశించు సూర్యునివలె నైతిని.

కం. శిష్టుఁడు ధర్మాత్ముఁడు నగు నష్టావక్రుఁడు కహోళు • ననువున నీచా
 శ్రేష్ఠుఁడ వగు పుత్రుఁడవై, దిష్టమునఁ దరింపఁజేసి•తివి నను వత్సా. ౨౬౧

తాత్పర్యము

సదాచార సంపన్నుఁడు ధర్మబుద్ధియగు నష్టావక్రునిచే నతని తండ్రి కహోళుఁడు తరించినట్లు నేను నాభాగ్యవశమున నీవు ప్రియపుత్రుఁడ వగుటచే దరించితిని.

కం. రావణవధాభిలాషులు, దేవత లెల్లరును నా కృ • తిన్ విఘ్నంబున్
 గావించిరి పురుషోత్తమ, యావిధ మేనిపు డెఱుంగు•టయ్యెం దండ్రీ. ౨౬౨

తాత్పర్యము

రావణు వధయందుఁ గోరికగల దేవతలందఱు నేను నీకుఁ జేయఁదలఁచిన పట్టాభిషేకమునకు విఘ్నము గావించిరి. అది యిప్పుడు నాకుఁ దెలిసినది.

కం. జన్యమున నరులఁ బొరిగొని, వన్యావళినుండి మరలి•వచ్చిన నిను దుః
 ఖాన్యమతిఁ గనఁగఁ జాలెను, ధన్యగదా నిన్నుఁ గన్న • తల్లి కుమారా.

అర్థములు. జన్యమునన్=యుద్ధమందు, అరులన్ = శత్రువులను, పొరిగొని=చంపి, వన్యావళినుండి=అడవులనుండి, దుఃఖాన్యమతిన్ = సంతోషముతోఁ గూడిన మనస్సుతో.

తాత్పర్యము

యుద్ధమునందు శత్రువులఁజంపి యడవులనుండి మరలి యయోధ్యకు వచ్చిన నిన్ను•సంతోషముతోఁ జూడఁగల నీతల్లి ధన్యురాలుగదా.

కం. వన్యాగతు సుఖయితు సౌ,జన్యధనా! యాభిషేక • జలసంక్లిన్నన్
 మాన్యుని రాజుగఁగందురు, ధన్యులువో పురముజనులు•ధర్మవిచారా! ౨౬౪

అర్థములు. వన్యాగతున్=అడవులనుండి వచ్చినవానిని, సౌజన్యధనా = సుజనుల సద్గుణములు ధనముగఁ గలవాఁడా, అభిషేక = అభిషేక సంబంధమైన, జల=నీటిచే, సంక్లిన్నన్=తడిసిన వానిని, మాన్యునిన్=పూజ్యుని.

తాత్పర్యము

నీ వయోధ్యకుఁ బోవుటవలన ధన్య యగునది నీ తల్లిమాత్రమే కాదు. పట్టాభిషేకజలముచేఁ దడిసిన నిన్నుఁ దమరాజుగఁగొని పురజనులు ధన్యులగుదురు.

కం. అనురక్తుండును భక్తుఁడు, వినియమవంతుండు శుచియు • విక్రమపరుఁడౌ
 ననుజుఁడు భరతుఁడు నీవును, గనఁగోరెదఁ గలసి మెలసి • గరిమ జరింపన్.

అర్థములు. అనురక్తుఁడు=ప్రేమగలవాఁడు, వినియమవంతుండు=ఇంద్రియ నిగ్రహము గలవాఁడు.

తాత్పర్యము

నీ తమ్ముఁడు నీయం దనురాగము గలవాఁడు, నీకు భక్తుఁడు, ఇంద్రియ నిగ్రహము గలవాఁడు, పవిత్రమైన నడవడిగలవాఁడు, పరాక్రమవంతుఁడు కావున వానిని నీవు కలసి మెలసి యైకమత్యముతో నుండఁ గోరెదను.

సీ. పదునాల్గువర్షముల్ ♦ వనములఁ గడిపితి, సీతతో ధీశాలి ♦ భ్రాతతోడఁ
బ్రతినయు నెఱవేర్చెఁ♦బంక్తికంధరుఁ ద్రుంపఁ, బరితోష మందిరి♦సురలు మునులుఁ
కెలసము లీర్చితి ♦ వలఘుకీర్తిని గంటి, పట్టాభిషేకోత్స♦వంబుఁ గాంచి
తమ్ములతోడ సు♦ఖమ్ముగ దీర్ఘాయు, వగుచు రహింపుమీ ♦ యన్న ! యనిన
ఆ. జనకుఁజూచి రామ♦చంద్రుఁ డిట్లనెఁ దండ్రి! కరుణఁ దలపు కైక♦భరతులందుఁ
గొడుకుతోడ నిన్ను ♦ విడిచితినంటివి, తొలుత శాప మదియుఁ♦దొలఁగుఁగాత.

అర్థములు. కెలసముల్ = కార్యములు.

తాత్పర్యము

మాట ప్రకారము పదునాలుగేండ్లడవులలో సీతతోడను బుద్ధిమంతుఁడగు తమ్మునితోడను గడిపితివి. నీ ప్రతిజ్ఞ నెఱవేర్చెను. నీవు రావణాసురుఁ జంపుటచే దేవతలు సంతోషించిరి. చేయవలసిన పనులన్నియుఁ జేసి కీర్తిసంపాదించితివి, ఇఁకఁ బట్టాభిషిక్తుఁడవై తమ్ములఁగూడి దీర్ఘకాలము సుఖ మనుభవింపుము. అనిన రామచంద్రుఁ డిట్లనియె. తండ్రీ-ఆనాఁడు నీవు కైకను భరతుని వదలితి నంటివి. వారిని స్వీకరించి యా శాపము దొలఁగింపుము.

—♦ దశరథుఁడు లక్ష్మణునకు శ్రీరామసేవ కర్తవ్యమని బోధించుట ♦—

కం. అనవుడుఁ గానిమ్మనుచు, న్వినయమ్మునఁ గేలు మొగిచి ♦ నిలుచు సుమిత్రా
తనయునిఁ గని తమి నాలింగనముం బొనరించి పలుకుఁ♦గరుణాయుతుఁడై.

తాత్పర్యము స్పష్టము.

సీ. జానకీరాముల♦చరణసేవ యొనర్చి, ధన్యుండ వైతివి ♦ తనయ ! నీవు
అత్యంతతుష్టుండ ♦ నైతి నీచరితకు, ధర్మఫలం బెల్లఁ ♦ దనరె నీకు
స్థిరమయ్యె నీకు స♦త్కీర్తి ధర్మము ధర, రామునికరుణ స్వ♦ర్గంబు మహిమ
నమకూరెఁ జుమి రామ♦చంద్రు భజింపుము, రాముఁడే త్రిభువన♦క్షేమరతుఁడు
ఆ. సేంద్రులగుచు నెల్ల♦సిద్ధులు ఋషులును, మూఁడులోకములును♦మొనసి వచ్చి
యుమ్మహానుభావు♦నీపురుషోత్తము, నర్చ్చ చేయువార♦లనఘచరిత. ౨౬౩౮

తాత్పర్యము

కుమారా ! నీవు సీతారామచంద్రుల పాదసేవ చేసి నీ జన్మము సార్థకము చేసికొంటివి. అంత కెక్కువ నీవు జన్మసార్థకమునకై చేయవలసిన దేదియు లేదు. నీ నడవడికి నేను మిగుల సంతోషించితిని. ధర్మమనునది యెంత ఫలమీయఁగలదో యంతయు నీకు లభించెను. ధర్మము లేని మోక్షము లేదు కావున నీకు సీతారాముల సేవచే మోక్షము లభించెను. దీనివలన నీ కాముష్మికఫలమే కాదు. భూలోకమున నీకుఁ గీర్తియు ధర్మము స్థిరమయ్యెను. రాముని కరుణచే నీకు వైకుంఠము గొప్పమహిమ(లక్ష్మణుఁడుకూడ భగవదవతారమూర్తి యనిదశరథుఁ

దెలుపంగఁడు) లభించెను. కావున నీవు రామచంద్రసేవయే చేయుచుండుము' ఆయనయే మూఁడులోకములకు క్షేమము గలిగించువాఁడు. ఇంద్రునితోడ నిచ్చటఁ జేరిన సిద్ధులు ఋషులు మూఁడు లోకములవారు ఈ మహామహిమగల పురుషోత్తముని బూజించుచుందురు.

మ. ఇతఁ డవ్యక్తుఁడు నక్షరుండు దివిష ♦ద్బృందాంత రాత్ముండునున్
శ్రుతిసంస్థాపితతత్త్వమూర్తి యనఘా ♦ శుద్ధుండు వైరిఘ్నుఁడున్
శ్రుతిశంవేద్యుఁడు నైన బ్రహ్మ మనుచున్ ♦ క్షోణీస్థలిన్ రాము నా
కృతి జన్మించె నటంచుఁ జెప్పిరి సుధీ ♦యీయున్న వారెల్లరున్. ౨౬౩

అర్థములు. అవ్యక్తుఁడు = (౧) భక్తులు గానివారికిఁ గానరానివాఁడు, (౨) మనుష్యత్వేన సర్వత్ర । పరభావాప్రకాశనాత్ । బుద్ధైరవ్యక్త ఇతిచ' కథిత స్తత్త్వపారగైః ॥ మనుష్యుఁడుగాఁ గానవచ్చుటచే పరభావము ప్రకాశింప నీయనివాఁడు కావున నవ్యక్తుఁడు.

'నాహం ప్రకాశ స్సర్వస్య'—గీ-౭-౨౫

'నాహం వేదైర్నతపసా'—గీ-౧౧-౫౩

'నాయమాత్మా ప్రవచనేన లభ్యః' మొదలైనవి, అక్షరుండు అని, అపక్షయ, వినాశ, వృద్ధి, జన్మ పరిణామ రహితుఁడు, అపక్షయ వినాశాభ్యాం పరిణామర్ధి జన్మభిః వర్జిత శ్శక్యతే వక్తుం యస్సదాస్తీతి కేవలమ్'—వి. పు. ౭-౧౦. దివిష ద్బృందాంతరాత్ముండు = దేవసమూహములకు నంతరాత్మయై యుండువాఁడు, వారి యాత్మలకు నాత్మయై యుండువాఁడు, శ్రుతిసంస్థాపిత తత్త్వమూర్తి=వేదములచే స్థాపింపఁబడిన తత్త్వముగల యాకారముగలవాఁడు.

శుద్ధుఁడు = ప్రకృతి గుణసంపర్కము లేని శుద్ధసత్త్వమయుఁడు, వైరిఘ్నుఁడు=శత్రువులఁ జంపువాఁడు, శ్రుతిసంవేద్యుఁడు = వేదములచేఁ దెలియఁదగినవాఁడు, శాస్త్రయోనిత్వాత్ అని బ్ర. సూ. ఆమ్నాయవేద్యో హరిః.

బ్రహ్మము=బృహత్వాద్బృంహణత్వాచ్చ బ్రహ్మేతి పరికీర్త్యతే, బృహత్వము వలనను బృంహణత్వము వలనను బ్రహ్మమని కీర్తింపఁబడువాఁడు, బృహత్వము= అనఁగా గొప్పతనము, అన్నిటికంటె నన్నివిషయముల గొప్పవాఁడు కావున బ్రహ్మ యనఁబడును. బృంహయతి = వర్ధయతి, ప్రపంచమును వృద్ధినొందునట్లు చేయువాఁడు కావున బ్రహ్మము.

బృంహతి=వర్ధతే, వృద్ధిపొందువాఁడు, బ్రహ్మము, తాను స్వయముగ నిరతిశయకల్యాణగుణములచేతను స్వరూపగుణవిభవములచేతను వృద్ధిపొందువాఁడు, వ్యక్తావ్యక్త సమష్టివ్యష్టిరూప మగు విశ్వమును వృద్ధిపొందించువాఁడు బ్రహ్మము.

నిరుక్తి-వ్యక్తావ్యక్త సమష్ట్యాది పురుషాంశ్చైవ నిత్యశః। గుణైశ్చకల్యాణతమైః బ్రహ్మ బృంహయతీతిచ, రూపై స్స్వరూపేణ గుణైర్విభవైశ్చస్వయం మహాః బృంహేతి సతువా బ్రహ్మ పదర్థస్సంతతిప్రదః.

పరమాత్మను బోధించు నీ బ్రహ్మశబ్దము(౧)గొప్పది(౨)గొప్పగానగునది (౩)గొప్పగాఁజేయునది యను నర్థముగలదికావున సగుణబ్రహ్మమునే బోధించును. నిర్గుణ మనునది లేదు కావున దానిని బోధించు శబ్దము లేదు. నిర్గుణబ్రహ్మమగుట నాతల్లి గొడ్రాలనుట వంటిది. నిర్గుణమైన గొప్పతనము గలదని చెప్పవలెను. గొప్పతనము గొప్పగానగుట గొప్పగాఁజేయుట, మూఁడును గుణవంతి మగు దానినే బోధించును. నిర్గుణ మనునది లేదు. నిర్గుణమైన బ్రహ్మ మని చెప్పెదరే, యనిన ప్రకృతిగుణములు హేయగుణములు లేనివాఁడని యర్థము. సత్త్వాదయో నసంతరే యత్రచ ప్రాకృతాగుణాః॥ అని వి. పు. సాక్షాద్వేదమైన యీ రామాయణ మిట్టి బ్రహ్మమునే బోధించుచున్నది. 'కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్?'అనియే ప్రశ్న ప్రారంభింపఁబడెను. బ్రహ్మసూత్రములు బ్రహ్మజిజ్ఞాసా యని ప్రారంభించి జన్మాద్యస్యయతః అని బ్రహ్మలక్షణము నిర్వచించి తదుపాసకులకు పునరావృత్తిలేదని ముగించెను. భారతము భాగవతము భగవద్గీత పురాణములు సర్వమా బ్రహ్మమునే బోధించుచున్నవి. ఈ బ్రహ్మము నుపాసించుట చేతనే మోక్షమని రామాయణము, భగవద్గీత, బ్రహ్మసూత్రాదులు బోధించుచున్నవి. అట్టి బ్రహ్మ మీ రాముఁడని దశరథుఁడు బోధించెను. ఈ యున్నవారెల్లరు బ్రహ్మ శివుఁడు, ఇంద్రుఁడు లోనగు దేవతలందఱను వ్రేలఁజూపించి చెప్పుచున్నాఁడు.

## తాత్పర్యము

అచ్చటనున్న బ్రహ్మరుద్రేంద్రాదులను వ్రేలఁజూపుచు లక్ష్మణా! యీ యున్న దేవతలందఱు అవ్యక్తుఁడు,అక్షరుఁడు దేవతల యాత్మలయందంతరాత్మగా నుండువాఁడు, వేదములచే స్థాపింపఁబడిన తత్త్వస్వరూపము గలవాఁడు, పాపసంపర్కము లేనివాఁడు, శత్రువుల సంహరించువాఁడు, వేదములచే నిట్టివాఁడని తెలిసికొనఁదగినవాఁడునై బ్రహ్మము భూమియందు రాముని యాకారముతో గానవచ్చెనని చెప్పిరి.

ఈ పద్యము శ్రీరామచంద్రమూర్తి సాక్షాత్పరబ్రహ్మ మనియు నవతారమూర్తి యనియు సిద్ధాంతీకరించుచున్నది.

కం. సీతాయుతుఁ డౌ రాముని, బ్రీతిం బరిచర్యఁ దనిపి ♦ ప్రియులని భక్తిన్
బూతం బగు సత్కీర్తియు, నాతతధర్మాచరణము ♦ నందితి తనయా. ౨౮౦

అర్థములు. సీతాయుతుఁడౌ రాముని బ్రీతింబరిచర్యఁ దనిపి = సీతతోఁగూడిన రాముని భక్తితోఁ బరిచర్యచేసి, యనుటచే నొకరిని మాత్రమే పరిచరింప

రాదనియు దంపతులుగానే పూజింపవలయుననియు నేర్పడుచున్నది. పూతము=పవిత్రము, ఆతత=విస్తారమైన, ధర్మాచరణము=ధర్మము నాచరించు ఫలము.

తాత్పర్యము

సీతతోఁగూడిన రాముని నీవు భక్తితో సేవించుటచే నిర్మలమైన సత్కీర్తియు విస్తార ధర్మాచరణఫలము నందితివి.

—• దశరథుఁడు సీతాదేవి నూరార్చుట •—

కం. అని సౌమిత్రికి దశరథ, జనపాలుఁడు పల్కి పరమ•చరితఖ్యాతన్
జనకేశ్వరసంభూతను, గని సీతన్ శుభతరోక్తి•త్స్మాపతి యనియెన్. ౨౮౧

అర్థములు. పరమ చరితఖ్యాతన్=ఉత్తమమైన నడవడిచే ప్రసిద్ధికెక్కినది.

తాత్పర్యము

ఈ ప్రకారము సౌమిత్రికిఁ జెప్పి దశరథుఁడు పాతివ్రత్యముచేఁ బ్రసిద్ధికెక్కిన సీతను జనకరాజపుత్రికనుజూచి మిగుల శుభమగు మాటల నిట్లనెను.

మత్తకోకిలము. కోపగింపకు మమ్మ నీపతిఁ • గోడలా! యిటు సేఁతకున్
నీపతివ్రతమున్ జగంబుల • నిత్యమై వెలుఁగొందెడిన్
బాపదూర వటంచుఁ దెల్పఁగఁ • బాల్పడెన్ హితకామియై
పాపరాఘుఁడు గాఁడు కూరిమి • సైపవమ్మ సతీమణీ! ౨౮౨

తాత్పర్యము స్పష్టము.

కం. పతిశుశ్రూషారతవై, క్షితి వెలయుమటంచు నేను • జెప్పఁగ నేలా?
పతికన్న వేఱు వరదై, వతమే లేదమ్మ నీకు • వసుధాతనయా. ౨౮౩

అర్థములు. పతిశుశ్రూషారతవై=పతిసేవయందు ప్రీతిగలదానవై.

తాత్పర్యము స్పష్టము.

కం. అని కోడలి నూరారిచి, జనవినుతుఁడు దశరథుండు • చని నాకంబున్
దనదు విమానంబున మఱి, దినకరకులమణిని గాంచి• దేవేంద్రుఁ డనున్.

అర్థములు. దినకరకులమణిని=సూర్యవంశమునందు రత్నమగువానిని.

తాత్పర్యము స్పష్టము.

—• ౧౨౩-వ సర్గము. ఇంద్రుని వరంబుచే మృతవానరులు పునర్జీవితు లగుట •—

సీ. నీదర్శనముచేఁత • నెగడె సార్థకమయి ప్రీతుల మైతిమి • ఖ్యాతచరిత
యిష్ట మెయ్యది నీకు • నెఱిగింపుమా యన, జానకీలక్ష్మణ•సహితుఁ డగుచు
నభివాదన మొనర్చి•యనియె శ్రీరాముండు, కరుణ నాపై నీకుఁ • గలదయేని
వచియింతుఁ దీర్పు నా•వాంఛ నాకై యని, హతులయి యమువీటి•కరిగినట్టి
ఆ. వారలెల్ల మరలఁ • బ్రాణసంయుక్తులై, సతులతోడ ముద్దు • సుతులతోడ
వెలయువలయు నాదు•ప్రియు లనురక్తులు, మృత్యుముక్తు లగుత•సత్యముగను.

అర్థములు. నీ దర్శనము చేఁత = నిన్ను మేము దర్శనము చేయుట. దశరథున్ యజ్ఞకాలమందలి శేషము. (౨) నీ విప్పుడు మమ్ము జూచుట, సార్థకమయి= ఫలవంతమై, మా శరణాగతి ఫలించుననుట, అనిన్ = యుద్ధమందు, హతులయి= చంపఁబడినవారై, అనురక్తులు=అనురాగము గలవారు.

తాత్పర్యము స్పష్టము.

కం. నీరుజములు నిర్వ్రణములు, పౌరుషబలయుక్తములయి ♦ భల్లుకకపిసం
వారంబులు విలసిల్లఁగ, గోరెదఁ దొల్లింటియట్ల ♦ కుధరచయారీ. ౨౮౬

అర్థములు. నీరుజములు = వ్యాధిలేనివి, నిర్వ్రణములు = గాయములు లేనివి, పౌరుష బలయుక్తములు = పౌరుషముతోను బలముతోను గూడినవి, భల్లుకకపిసంవారంబులు=ఎలుఁగుల క్రోఁతుల గుంపులు, కుధరచయారీ=ఇంద్రా! పర్వతవిరోధీ.

తాత్పర్యము

ఇంద్రా! నాకొఱకై చచ్చినవారు బ్రతుకుటేగాక బ్రతికియుండి వ్యాధిగ్రస్తులైనవారు గాయపడినవారు నగు భల్లుకములు కపులు పౌరుషము బలముగలవారై మును పున్నట్టు లారోగ్యవంతులై యుండఁజేయఁ గోరెదను.

కం. కాలంబు గాకయును నే, వేళన్ వారున్న చోట ♦ వివిధఫలంబుల్
మూలంబు లమరవలయును, నేఱుల జలములు సమృద్ధి ♦ నెసఁగ న్వలయున్.

తాత్పర్యము

ఆ యా ఫలములకు కందమూలములకు ఋతువు గాకపోయినను వారున్న చోట నానావిధములయిన ఫలములు మూలములు నేళ్ళయందు జలములు దండిగా లభించుచుండవలయును.

కం. ఇవి నాకోరు వరంబులు, దివిజపతీ! యొసఁగు మనిన ♦ దేవేంద్రుఁ డనున్
భువనేశ! మహావరముల, నివి యొసఁగితి నాడి తప్ప ♦ బొంకఁగను గానన్.

తాత్పర్యము

ఇంద్రా! యివి నేను గోరు వరములనఁగా నింద్రుఁ డిట్లనెను. ప్రపంచాధిపతీ! నీవుకోరిన గొప్ప వరముల నొసఁగితిని, ఆడితప్పుట బొంకఁగను.

చ. అని మొన రక్కసుల్ దునుమఁ ♦ బ్రాణము వాసిన భల్లుకంబులున్
వనచరు లాదిగాఁ గలుగు ♦ వారలు నీరుజులై వ్రణచ్యుతిన్
మునుపటి శౌర్యదర్పముల ♦ నూల్కొని నిద్దుర లేచు భంగి నో
జనవర! లేచువారు తమ ♦ జ్ఞాతులతో హితమిత్రపాళితోన్. ౨౮౯

అర్థములు. అని మొనన్=యుద్ధముఖమున, నీరుజులై=వ్యాధిలేనివారై, వ్రణచ్యుతిన్ = గాయములు వదలి.

తాత్పర్యము

యుద్ధముఖమున రాక్షసులు చంపఁగా చచ్చిన యొలుఁగులు వానరులు లోనగువారు వ్యాధిలేక గాయములు మాని పూర్వమువలె శౌర్యదర్పములు గలవారై నిద్రలేచినట్లు తమ బంధువులతో హితులతో మిత్రసమూహముతో లేతురు.

కం. కాలంబు గాకయును హే, రాళంబుగ వెలయుఁ గుసుమ•రాజులు ఫలముల్
మూలంబులు వృక్షంబుల, నేళుల శుభజలసమృద్ధి•యొసఁగుంగాతెన్. ౨౯౦

అర్థములు. హేరాళంబుగన్ = దండిగ, కుసుమరాజులు = పూవుల సమూహములు.

తాత్పర్యము స్పష్టము.

కం. గాయములు మాని దృఢతర, కాయంబుల లేచువారు • కప్యాదు లనన్
మాయురె నిదురను మేల్కాంచు, నా యనువున లేచి రెల్ల•రచ్చెరువుపడన్.

అర్థములు. దృఢతరకాయములన్ = మిగుల దృఢమైన దేహములతో మాయురె=ఆశ్చర్యమును దెలుపును.

తాత్పర్యము స్పష్టము.

కం. ఏమిది యేమది యని యెం, తో ముద మబ్బురము మకుల•దోలఁ గాఁడగ శ్రీ
రామునిఁ జేరం జని శా, ఖామృగములు మ్రొక్కి నిలిచె • ఘనతరభక్తిన్.

అర్థములు. అబ్బురము=ఆశ్చర్యము, అపూర్వోత్సవము.

తాత్పర్యము స్పష్టము.

ఉ. అంత సురల్ ప్రపూర్ణహృద•యాంతరు రాము నుతించి జానకీ
కాంత! వనాటులన్ విడిచి•క్రన్న నయోధ్యకుఁ బొమ్ము యీశుచి
స్వాంతఁ దపస్వినిం బ్రియను•సమ్మతిఁ దేర్పుము, దుఃఖకారణా
క్రాంతల నెల్ల తల్లులను•గారవ మారఁగ నూఱడింపుమా. ౨౯౩

అర్థములు. ప్రపూర్ణ=నిండిన, హృదయాంతరున్ = అంతర్హృదయము గలవానిని, క్రన్నన్ = త్వరగా, శుచిస్వాంత = నిర్మలమైన మనస్సుగలది, తపస్వినిన్ = (౧) శుష్కించిన దానిని, (౨) తపస్సు చేసిన దానిని, తేర్పుము = సంతోషపెట్టుము, దుఃఖ + కారణ + ఆక్రాంతలని =దుఃఖవేదనచే నాక్రమింపఁబడిన వారిని.

తాత్పర్యము

అంతట దేవతలు కోరిక నెఱవేరిన రామచంద్రుఁ జూచి పొగడి జానకీనాయకా! యీ వానరులను వారివారి ప్రదేశములకుఁ బంపి నీవు త్వరగా నయోధ్యకుఁ బోయి యీ పవిత్రహృదయను చాల బడలియున్న దానిని సంతోషపెట్టుము. దుఃఖవేదనచేఁ దపించు తల్లుల నందఱను బ్రీతితో నూఱడింపుము.

కం. నీకై శోకించుచు న,స్తోకవ్రత మూనియున్న • శుభతరశీలున్
గైకసుతుం గనుమీ మహి,మాకలితుం బిన్నతమ్ము•వరయుము ప్రేమన్.

తా త్ప ర్య ము

నీ నిమిత్తముగా శోకించుచు గొప్ప నియతిం బూనియున్న మిగుల మేలి నడవడి గల భరతుని జూడుము. గొప్ప మహిమ గల శత్రుఘ్నుని ప్రేమతో విచారింపుము.

కం. పట్టాభిషేకముం గొని, పట్టణజనములను ముదము • పటుపుము మా మా
పట్టుల కరిగెద మని భూ,మీట్టుముదల నొంది దివిజు • లేగిరి దివికిన్. ౨౦॥౨౧॥

అర్థములు. భూమీట్టుముదల=రాజానాజ్ఞ గొని, దివిజులు = దేవతలు, దివికిన్=స్వర్గమునకు.

తా త్ప ర్య ము

పట్టాభిషిక్తుఁడవై పురవాసుల నెల్ల సంతోషపఱుపుము. మా మా స్థానములకు మేము పోయెద మని రామచంద్రమూర్తి యాజ్ఞ దీసికొని దేవతలు స్వర్గము నకుఁ బోయిరి.

చ. సురలిటు లేగ రాఘవులు • సొంపును నింపును నివ్వటిల్ల వా
నరవరులన్ సమర్హగతి • నవ్యతలంబుల నెల్ల నిల్ప నా
గురుతరసేన మేర యని • గుర్తిడరాని ముదంబుతో నిశా
కరయుతయామినీగతిని • గ్రాలె మనోహరమై ప్రభాఢ్యమై. ౨౨॥౨౩॥

తా త్ప ర్య ము

దేవతలు వెడలిపోఁగా రామలక్ష్మణులు ప్రసన్నులై సంతోషముతో వానర శ్రేష్ఠుల నెల్ల తగిన విధమున మనోహరప్రదేశంబులందు నిలుపఁగా మేర మీఱిన సంతోషముతో నా సేన చంద్రుని గూడిన రాత్రివలె మనోహరమై కాంతిగలదై యొప్పెను.

## — { ౧౨౪-వ సర్గము. విభీషణుఁడు శ్రీరాము నంస్కారాదు లంగీకరింపఁ బ్రార్థించుట. } —

కం. రాతిరి గడిపి సుఖంబుగఁ, బ్రాతఃకాలమున లేచి • రాజలు రామ
త్స్వాతలవిభుఁ గని సుఖవా, క్పాతముగ విభీషణుండు•కొమరుగఁ బలుకున్.

అర్థములు. రాతిరి = విదియ నాఁటి రాత్రి, ప్రాతఃకాలమున = తదియ నాఁటి యుదయమున.

తా త్ప ర్య ము

విదియ నాఁటి రాత్రి సుఖముగఁ గడపి, తదియ నాఁటి యుదయమున లేచి విభీషణుఁడు రామచంద్రమూర్తి నిజూచి సుఖకరములైన వాక్కులచేఁ బవిత్రమగు నట్టు లిట్టు పలికెను.

ఉ. ఘుమ్మను దివ్యతీర్థములు • కమ్రతరమ్మగు మేలి యంగరా
గమ్ములు స్థాసకమ్ములు ని • గారపుఁ గ్రొత్తపసిండి పట్టువ
స్త్రమ్ములు సొమ్ములున్ మలయ • జమ్ములు దైవతవృక్షపుష్పమా
ల్యమ్ములు సిద్ధమైనయవి • యంబుజపత్రవిశాలలోచనా ! ౧౭౫౦

అర్థములు. కమ్రతరము = మిగుల మనోహరము, అంగరాగములు = దేహమునకుఁ బూసికొన సుగంధద్రవ్యములు, స్థాసకమ్ములు=కుంకుమపువ్వులోనైనవి, నిగారపు కాంతిగల, మలయజమ్ములు = చందనములు, దైవత వృక్ష పుష్ప మాల్యమ్ములు=దేవతావృక్షము లగు కల్పవృక్షము లోనగు వృక్షము లందలి పూలతో సిద్ధము చేసిన దండలు, అంబుజపత్ర విశాలలోచనా=తామరరేకులవలె విశాలములైన కన్నులు గలవాఁడా.

తాత్పర్యము

పరిమళయుక్తములైన దివ్యతీర్థముల జలములు మిగుల మనోహరములై దేహమునకుఁ బూసికొను యోగ్యమైన కుంకుమపువ్వు మొదలైనవి కాంతిగల బంగారుసరిగ పట్టువస్త్రములు సొమ్ములు చందనములు దేవతావృక్షముల పూల దండలు రామచంద్రా! సిద్ధమై యున్నవి.

కం. వివిధాలంకారకళా, సువిదిత లీ పద్మముఖులు • సుఖముగ నీ కా
ప్లవ మొనరింతురు నాపైఁ, దవిలిన గురుకరుణ సమ్మ • తము జూపఁగదే.

అర్థములు. వివిధాలంకారకళా = నానావిధములుగ నలంకరించు విద్య యందు, సువిదితలు = ప్రసిద్ధి కెక్కినవారు, ఈ పద్మముఖులు = ఈ స్త్రీలు, ఆప్లవము = స్నానము.

తాత్పర్యము

రామచంద్రా! యీ స్త్రీలు నానావిధములుగ నలంకరించుట యందు ప్రసిద్ధి కెక్కినవారు. నీకు సుఖముగ స్నానము చేయింతురు. నా యందు దయ యుంచి యంగీకరింపుము.

చ. అనవుడు రామచంద్రుఁ డను • నాదట స్నానము సేయ వేఁడుమీ
యినతనయాదులన్, భరతుఁ • డెంతొ సుఖార్హుఁడు నానిమిత్తమై
యనఘుఁడు సత్యసంశ్రవుఁ డ • నంతబలుండు కుమారుఁ డుగ్రని
ష్ఠను వనరంగ నాకిచట • సౌఖ్యపడన్ మనసెట్టులొప్పెడిన్. ౨౭౬౦

అర్థములు. ఆదటన్ = ప్రేమతో, ఇనతనయాదులన్ = సుగ్రీవుఁడు మొదలగు వారిని, సత్యసంశ్రవుఁడు=సత్యమైన ప్రతిజ్ఞ గలవాఁడు, కుమారుఁడు= చిన్నవాఁడు, ఉగ్రనిష్ఠను=తీవ్రనియమముచే, వనరంగన్ దుఃఖపడుచుండగా.

తాత్పర్యము

ఇట్లు విభీషణుఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి యిట్లనియె. విభీషణా ! సుగ్రీవాదులను స్నానముచేయఁ బ్రార్థింపుము. భరతుఁ డెంతో సుఖ మనుభవింప

యోగ్యుఁడు. అటువంటివాఁ డేదోషము నెఱుఁగనివాఁడు మహాబలవంతుఁడయ్యు నానిమిత్తమై వానప్రస్థాశ్రమము వహించి పదునాలుగేఁడులు పూర్తి కాఁగానే మఱుదినము నీవు రాకపోయితివాయగ్నిలోఁ బ్రవేశించెదనని ప్రతిజ్ఞ చేసి యున్నాఁడు. వాఁడు ప్రతిజ్ఞ దప్పనివాఁడు. నాకంటెఁ జిన్నవాఁడు వాఁడట్లు దుఃఖపడుచుండ నేనిక్కడ సుఖపడుటకు నా మనస్సెట్లంగీకరించును.

కం. జననుతధర్మచరిత్రుం, డనుజుఁడు భరతుండు లేక ♦ యాభరణంబుల్
గొన వస్త్రంబులఁ గట్టను, ననఘా! యభ్యంజనంబు ♦ నాసం జేయన్.

అర్థములు. జననుతధర్మచరిత్రుండు = ప్రజలచేతఁ బొగడఁబడిన ధర్మ ప్రవర్తనము గలవాఁడు, అభ్యంజనంబు=తలంటు.

తాత్పర్యము స్పష్టము.

కం. మా నగర మరుగుమార్గము, కాననదుష్టంబు గానఁ ♦ గష్టం బిపుడే
మానగుఁ బయనింపఁగ నన, మానవపతిఁ జూచి సుగుణ♦మండితుఁ డనియెన్.

అర్థములు. కాననదుష్టంబు = అడవులచే దోషయుక్తమైనది, సుగుణ మండితుఁడు = మంచి గుణములచే నలంకరింపఁబడినవాఁడు.

తాత్పర్యము

మా యూరికిఁ బోవు మార్గము అడవులచే బాధ కలిగించునది, కష్టముచేఁ బ్రయాణము చేయఁదగి యున్నది. కాఁబట్టి మే మిప్పుడే ప్రయాణమై పోవుట బాగనిన సద్గుణములను నలంకారములు గల విభీషణుఁ డిట్లనెను.

సీ. మార్తండతుల్యవి♦మానంబు గల దొండు, పుష్పకాఖ్యంబు న♦త్యూర్జితరము
రణమున యక్షేశు♦రావణుండు జయించి, హరియించెఁ గామగం♦బది నృపాల
దివ్యంబు నీకు నై ♦ తివిరి నిల్పితి వారి, వాహనిభం బొక ♦ పగటిలోన
నిన్నయోధ్యకుఁ జేర్చు♦నిశ్చింతముగ నందు, నామీఁద లవమేని♦ప్రేమయున్న
ఆ. నా గుణాళి నీకు ♦ జ్ఞప్తియం దున్నను, స్నేహభావ మైన ♦ నివ్వటిలిన
రామచంద్ర! నీవు ♦ రమణితో ననుజుతో, నిలఁగదయ్య యిచట ♦ లలితశీల!

అర్థములు. మార్తాండతుల్య విమానము = సూర్యునితో సమానమైన తేజస్సుగల విమానము. పుష్పకాఖ్యంబు=పుష్పక మను పేరుగలది, కామగంబు= కోరినట్లు పోఁగలది, తివిరి = ప్రయత్నముతో, వారివాహనిభంబు = మేఘము వంటిది, రణమునన్=యుద్ధమందు, దొంగిలించి కాదు.

తాత్పర్యము

పుష్పకమను పేరుతో సూర్యకాంతిగల విమాన మొకటిగలదు. అది మిగుల గారవింపఁ దగినది. యుద్ధమునందుఁ గుబేరుని జయించి రావణుఁడు హరించెను. అది కోరినట్లు పోఁగలదు. ఎవరెవరి పదార్థములు వారి వారికిఁ బంపుచు దీనిని మీనిమిత్తమై పంపక నిలిపితిని. ఇది మేఘమువలె విశాలమై వేగముగఁ బోఁగలదు.

ఒక్కపగటిలో మిమ్ము నయోధ్యఁ జేర్చెను. ఆలోచింపవలదు. నాయందు నీకుఁ గొంచెమైనఁ బ్రేమయున్నను నా గుణములు నీకు ప్రీతియం దున్నను వీఁడు నా స్నేహితుఁడుగదా యని యైన నీ మనస్సునందున్నను నీవు తమ్మునితో భార్యతో నిందు నిలుపుము.

ఉ. మిమ్ము మహానుభావులను • మేలిసపర్యలఁ దన్పఁ గోరెదన్
సమ్మతి నెల్లమిత్రులను • సైన్యములన్ విహితార్చనాళి నా
ఖ్యమ్ములఁ దేల్పఁ గోరెద మ•హాపురుషా! బహుమానభక్తి న
ఖ్యమ్ముల పేర్మి వేఁడెదనుఁ • గా దిదియాజ్ఞ. త్వదీయదాసుఁడన్. ౨౦౮

అర్థములు. సపర్యలన్ = సత్కారములచే, తన్పన్ = తృప్తిపడఁజేయ, విహితార్చనాళిన్ = యోగ్యమైన పూజలచే, బహుమాన = నీయందు నాకుఁగల గౌరవముచేతను, (అ) నీవు నన్ను గౌరవముతోఁ జూచుచున్నావుగదా నామాట త్రోసివేయవనియు, భక్తిన్ = నీయందు నాకుఁగల భక్తిచేతను, భక్తుని కోరిక నెఱవేర్తువను విశ్వాసము చేతను, సఖ్యము=స్నేహభావము చేతను, వేఁడెదను= ప్రార్థించెదను.

తాత్పర్యము

గొప్ప మహిమగల మిమ్ము మంచిన త్కారములచే దృప్తి పఱుపఁగోరెదను. స్నేహితుల నందఱను సైన్యములను దగినట్లు పూజించి సుఖపడఁజేయఁగోరెదను. మహాపురుషా! నీయందు నాకుఁగల గౌరవముచేత నీవు నన్ను గౌరవదృష్టిఁ జూచుటచేత, నీయందు భక్తిగలవాఁడ నగుట భక్తులకోరిక నీవు నెఱవేర్తువను నమ్మకముచేత స్నేహాతిశయమున నేను బ్రార్థించుచున్నాను. గాని మీ దాసుఁడ నైన నేను మిమ్మాజ్ఞాపింపలేదు.

కం. నావుడు వానరులున్ రక్షోవరులున్ వినుచుండ • శుభచరితుఁడు నీ
తావిభుఁ డీటులను నా రక్షోవిభునకు ననుముఁ బ్రియముఁ•జూపుచు నెలమిన్.

తాత్పర్యము స్పష్టము.

కం. నచ్చికచే మచ్చికచే, హెచ్చగు సాచివ్యమున సు•హృద్భావముచే
నచ్చపుఁ జేఁతల నాయము, మెచ్చగ నొనరించితివి సు•మీ కొఱ నేమీ.

అర్థములు. నచ్చికచే = నమ్మకముచేత, మచ్చికచే = చనవుచేత సాచివ్యమున=ఆలోచన చెప్పుటచేత, సుహృద్భావముచే=స్నేహభావముచే, అచ్చపు జేఁతలన్=వంచన లేక కార్యములు చేయుటచేత.

తాత్పర్యము

నమ్మకముచేత, చనవుచేత, మంత్రాలోచనము చెప్పుటచేత, స్నేహభావము చేత కపటము లేక కార్యములు చేయుటచేతఁ గావలసినంత సాహాయ్యము చేసి యున్నావు. ఇఁకఁ గొఱఁత యేది గలదు?

ఉ. నీవచనంబులన్ వినని • నిష్ఠురచిత్తుఁడ నంచు నెంచ కో
పావనశీల! నామనసు • భ్రాతపయిం జనుచున్న, దమ్మహా
భావుఁడు చిత్రకూటమునఁ • బాదములం బడెఁ జేతు లొగ్గి, నం
తోవడి వేఁడె నన్మరలఁ • దోడ్కొనిపోవ; నిరాకరించితిన్. ౨౬౮

అర్థములు. నిష్ఠురచిత్తుఁడను=కఠినమైన మనస్సు గలవాఁడను.

తాత్పర్యము

పవిత్ర చరిత్రుఁడా! నీమాట వినని కఠినచిత్తుఁడ నని తలంపకుము. నా మన స్సంతయు నా తమ్మునిపైఁ బోవుచున్నది. ఆ మహానుభావుఁడు చిత్రకూటము నందు నన్ను మరల నయోధ్యకుఁ దీసికొనిపోవ నా కాళ్ళమీఁదఁబడెను. చేతులు జోడించెను. ఎంతో దీనుఁడై దీర్ఘముగఁ బ్రార్థించెను. నే నంగీకరించినవాఁడఁగాను.

—• శ్రీరాముఁడు విభీషణునిఁ బుష్పకంబుఁ దేర నియోగించుట. •—

ఉ. అంతియ కాక మిత్రమ మదంబ సుమిత్రను గైకఁ జూడ నా
స్వాంతము త్రొక్కులాడెడిని • పౌరుల మిత్రుల వారిబిడ్డలన్
శాంతుల మద్గురూత్తముల • సంతస మార గనంగఁ గోరెదన్
జింతిలఁ బోకు పుష్పకముఁ • జెచ్చెర నియ్యెడఁ దేరఁబంపుమీ. ౨౬౯

తాత్పర్యము

అంతమాత్రమే గాదు. మిత్రుఁడా! మా తల్లిని కౌసల్యను సుమిత్రను గైకను జూడవలయునని నా మనస్సు త్రొక్కులాడుచుఁ దొందరపడుచున్నది. అది గాక బిడ్డలవంటి పౌరులను బిడ్డలవంటి మిత్రులను బిడ్డలను శాంతచిత్తులైన మా గురువులను సంతోషముతోఁ జూడఁ గోరుచున్నాను. నీ వాలోచింపవలదు. పుష్పకమును దెప్పింపుము.

కం. వనవాసము ముగియుటచేఁ, దనవారిని జూడఁ గోరు•తమి నిట నిలువన్
మన సొప్పదు క్షమియింపుము, కినియకు నా కాజ్ఞ నిమ్ము•కీర్తితశీలా!

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఈ పొనరించు నర్చనల • నెల్ల గ్రహించితి, వేగ మందు నేఁ
బోవలయున్, విభీషణ! సుబుద్ధివి పుష్పక మిమ్ము చాలు నా
క్ష్మావిభునాజ్ఞమై నతఁడు • క్రచ్చఱ లంకకుఁ బోయి వచ్చి నీ
శావరుప్రోల నద్భుతవి•ధానవిధానము నవ్విమానమున్. ౨౭౦

అర్థములు. అర్చనలన్=పూజలను, సుబుద్ధివి = మంచిబుద్ధిమంతుఁడవు, అద్భుత విధాన నిధానము=ఆశ్చర్యకరమైన నిర్మాణమునకు స్థానమైనది.

తాత్పర్యము

నీవు చేయఁదలఁచిన పూజల నెల్ల నంగీకరించితిని. నేను వేగముగ నయోధ్యకు బోవలయును. విభీషణా! నీవు బుద్ధిమంతుఁడవు. అక్కడి వారందఱు పదునాలుగు

సంవత్సరములు ముగిసినవి ఎప్పు డెప్పుడు నేను వత్తునాయని నా రాకకై పలు ప్రక్కలఁ జూచుచుందురు. అట్టివారిని వదలి యిక్కడ నేను విహారణముగ నుండవచ్చునా? అచ్చటికిఁ బోవుట ముఖ్యకార్యమో, ఇచ్చట నుండుట ముఖ్యకార్యమో నీవే యాలోచింపుము. తక్కిన వేవియు వలదు. పుష్పక మిచ్చితే నీ జాలును అని చెప్పఁగా రామచంద్రమూర్తిచే ననుజ్ఞపొంది త్వరగా లంకకుఁ బోయి వచ్చి యద్భుతరచన గల యవ్విమానమును.

సీ. వైడూర్యమణిమయ • వేదికాంచిత మయి, కాంచనచిత్రాంగ • కలితమగుచు
రాజతప్రభలచే • రమ్యతరం బయి, యుప్పరిగలపంక్తి • నొప్పు మిగిలి
భూరినీరేజవి • భూషితమై హేమ, హర్మ్యతలంబుల నను • వెసంగి
పాండుపతాకలు • ధ్వజములు రాణింపఁ, గింకిణీజాలప్ర • కీర్ణ మగుచుఁ
తే. జారుముక్తామణీగవా • క్షములతోడ, రణితఘంటాళిమధురస్వ • రములతోడ
హాటకగిరీంద్రసన్నిభం • బగుచు మున్ను, విశ్వకర్మకృతంబయి • వెలయుదాని.

అర్థములు. వైడూర్య మణిమయ వేదికాంచితమయి=వైడూర్యముల చేతను వివిధరత్నముల చేతను నిండిన యరుఁగుల చే ప్రకాశించుచుండినదై, కాంచన చిత్రాంగ కలితము = బంగారుచే చిత్రింపఁబడిన అవయవముల చేఁ గూడినదై, రాజత ప్రభలచే=బంగారు కాంతులచే, రమ్యతరంబయి = మిగుల మనోహరమై, ఉప్పరిగ = మేడ, ఉపరిగృహము=మిద్దెమీఁదఁ గట్టఁబడినది, భూరినీరేజవిభూషితమై=బంగారు కమలముల చేత నలంకరింపఁబడి, హేమహర్మ్యతలంబులన్ = బంగారుమేడల చే, పాండు = తెల్లనైన, పతాకలు = చిత్రింపఁబడిన ధ్వజములు, ధ్వజములు = చిత్రింపఁబడిన టెక్కెములు, కింకిణీజాల=చిఱుగజ్జెల సమూహముచే, ప్రకీర్ణము= వ్యాపించినది, చారు = మనోహరమైన, ముక్తామణీగవాక్షముల తోడన్ = ముత్యములయు రత్నములయు కిటికీలతో, రణిత = ధ్వనించుచున్న, ఘంటాళి = ఘంటల వరుసల యొక్క, మధురస్వరంబులతోడ = ఇంపైన ధ్వనులతో, హాటక గిరీంద్ర సన్నిభంబు=బంగారుకొండతో సమానము.

## తాత్పర్యము

వైడూర్యరత్నములచే నిండిన యరుఁగులు గలిగి బంగారుచే చిత్రింపఁబడిన భాగములు గలదై బంగారు కాంతులచే మనోహరమై మిద్దెల మీఁది యిండ్లచే నొప్పి బంగారు కమలములచే నలంకరింపఁబడి బంగారు మేడలచే ననువై, తెల్లని పతాకములు ధ్వజములుగలదై, నడుమఁ జిఱుగజ్జెలు కలిగి మనోహరములైన ముత్తెములచే రత్నములచేఁ జేయఁబడిన గవాక్షములతో నాలుగుమూలల మ్రోగుచున్న గంటల యింపైన ధ్వనులతో మేరుపర్వతముతో సమానమై విశ్వకర్మచే జేయఁబడినదై.

కం. స్ఫాటికచిత్రాంగంబై, హాటక వైడూర్యమయవ • రాసనమై స
త్కూటాస్తరణయుతంబై, సాటి యెటన్ లేక చిత్త•జవనం బగుచున్.

అర్థములు. స్ఫాటికచిత్రాంగంబై = స్ఫటికములచేఁ జిత్రింపఁబడిన యవయవములు గలదై, హాటకవైడూర్యమయవరాసనమై = బంగారుచేతను వైడూర్యములచేతను నిండిన యుత్తమాసనములుగలదై, సత్ =మంచి,కూట=కొలువుకూటములతోను, ఆస్తరణ=కంబళ్ళతోను, యుతంబై = కూడినదై, చిత్తజవనంబు = మనోవేగము గలది.

తాత్పర్యము

స్ఫటికములచేఁ జిత్రింపఁబడినదై బంగారు వైడూర్యములచే నిండిన మేలి యాసనములు గలిగి కొలువుకూటములతోను తివాచీలతోను గూడి యసమానమై మనోజవము గలిగినదై.

## —•{ ౧౨౫-వ సర్గము. శ్రీరాముఁడు విభీషణుచే వానరులకుఁ గానుక లిప్పించుట. }•—

తే. అంద మగుదాని నిల్పి య•య్యసురభర్త
యాజ్ఞ యిడఁ నేమి యనఁగ ని•జానుజాతు
తోడ యోజించె నెయ్యంబు • దొరఁకఁ బలుకు
నో విభీషణ! నామాట•నొకటి వినుము. ౨౬౩

తాత్పర్యము

అందమైన దాని నిల్పి విభీషణుఁ డిఁక నేమి యాజ్ఞాపించెద రనినఁ దమ్మునితో నాలోచించి స్నేహభావముచే నిట్లనియె. విభీషణా! నేనొకటిచెప్పెద వినుము.

ఏమి యాలోచన? వానరులందఱు మన నిమిత్తమై వచ్చి కష్టించినవారు. వీరికిఁ దగిన బహుమానము మన మియ్యవలసినది న్యాయమే. వీ రిచ్చట నుండియే వెడలిపోవుదురు. రిత్తచేతుల పంపుట న్యాయ్యముగాదు. ఈ కష్టఫలము విభీషణుఁడుకూడ ననుభవించినవాఁడే కావున వీరికి బహుమానము నీ విమ్మని చెప్పుట ధర్మమా యధర్మమా యని యాలోచించిరి.

చ. పనిఁగొని నాకుఁగా సకల • వానరవర్యులు సంగరంబునన్
దనువుల నాస మాని తెగి • దారుణభంగిని బోరి యేరికే
విని గెలువంగ రానిదగు • నిర్జరవైరిపురంబు లంక బ
ల్మిని బడఁగొట్టి రిందఱకు • మేలొనరింపఁగ నాస యయ్యెడిన్. ౨౬౪

తాత్పర్యము

నా పని తమపనిఁగా బ్రయత్నించి నా నిమిత్తమై సకల వానరులు దేహముల మీఁద నాశవదలి చావునకుఁ దెగించి యుద్ధముచేసి దేవతలకైన గెలువ సాధ్యము

గానిది లంకను బడఁగొట్టిరి. కావున వీరి కందఱకు బహుమాన మీయవలయునని యాశ యగుచున్నది.

కం. వీరల కెల్లరకును న,వ్వారిగ మణిరత్నములును ♦ వసుచయములు పే
ర్వేర నొసంగుము తద్వ్యా,పారంబులు సఫలమందఁ ♦ బసదనములుగన్.

అర్థములు. పేర్వేరన్=ప్రత్యేక ప్రత్యేకముగ (పేరుపెట్టి పిలిచి), అవ్వారిగన్=దండిగ. తద్వ్యాపారంబులు = వారు చేసిన కష్టకార్యములు, పసదనములుగన్=బహుమానములుగన్, ప్రసాధన శబ్దభవము పసదనము.

తాత్పర్యము

వీరి కందఱకు దండిగ శ్రేష్ఠములైన మణులు బంగారులు నొక్కొరొక్కరికి వేలువేలుగ వారి కష్టము ఫలించునట్లు బహుమానము లిమ్ము.

కం. మానద! మానసమర్హులు, వానరనాథులు కృతజ్ఞ ♦ వర! నీచే స
మ్మానితులై చనెదరు స్వ,స్థానములకు సంప్రమోద♦సంగతమతులై. ౨౭౬

అర్థములు. మానద=మానసంరక్షణము చేయువాఁడా, ఇట్లు నీవు చేసితి వేని నా మానము కాపాడినవాఁడ వగుదువు. ఇంతకష్టము చేయించుకొని రిత్త చేతులతో నంపుట నా కవమానకరము గదా. ఇక్కడ నిచ్చుటకు నాకేమియున్న దని భావము. మానసమర్హులు=బహుమానింప మిక్కిలి తగినవారు, కృతజ్ఞవర = మేలు తెలిసినవారిలో శ్రేష్ఠుఁడా, సమ్మానితులై=గౌరవింపఁబడినవారై, సంప్రమోదసంగతమతులై=సంతోషముతోఁ గూడిన మనస్సులు గలవారై.

తాత్పర్యము

మానద! వానరశ్రేష్ఠులు గౌరవయోగ్యులు. కృతజ్ఞుఁడవైన నీచే గౌరవింపఁబడినవారై సంతోషముతో వారివారి స్థానములకుఁ బోవుదురు.

కం. దాతవును సంగ్రహీతవు, జాతానుక్రోశమతివి ♦ సత్కీర్తి వటం
చాతతగతిఁ దలఁచెద రా, హేతువునన్ నాకు వలసె♦హెచ్చరికింపన్. ౨౭౭

అర్థములు. సంగ్రహీతవు = కష్టము తెలిసిన వాఁడవు, జాతానుక్రోశమతివి=పుట్టిన దయగల మనస్సు గలవాఁడవు, హెచ్చరికింపన్ = ఎచ్చరింపఁగా, రూ. ఎచ్చరికింపన్=ఇది హెచ్చరించుటే కాని యాజ్ఞాపించుట గాదు.

తాత్పర్యము

నీ వీప్రకారము చేసితివేని వీరందఱు నిన్ను దాతవని కష్టము తెలిసిన వాఁడవని దయగలవాఁడవని కీర్తిపరుఁడవని తలఁచెదరు. ఆ నిమిత్తముగ నిన్ను నేను హెచ్చరింపవలసి వచ్చినది.

కం. పెట్టను బోఁతయు దయ యొ,ప్పట్టున నేన్ లేక రిత్త ♦ భండనమందున్
గిట్టింపన్నృపతిఁ గని వెఱ,పుట్టఁగఁ గష్టముల విడిచి♦పోదురు బంటుల్. ౨౭౮

అర్థములు. పెట్టును=అన్నము బెట్టుటయును, పోతయు=నీళ్ళు పోయుటయును, కూడునీళ్ళనునవి తక్కిన సౌఖ్యముల కుపలక్షణము, గిట్టించు = చంపు, వెఱపుట్టఁగన్=భయము కలుగఁగా.

తాత్పర్యము

కష్టము చేసిన బంటులకు మఱి యేమియు నీయకపోయినను అన్నము నీళ్ళు విచారించి యిచ్చుక యుద్ధమునకుఁ దేరకుఁ జంపించు రాజును జూచి మఱియొక సమయము పడినపుడు భయపడి వదలిపోదురు. కావునఁ దగినరీతి బహుమానించిన యెడల మరలఁ బనిపడినపుడు సహాయపడుదురు.

## —• శ్రీరాముఁడు పుష్పకం బెక్కి సుగ్రీవాదుల కనుజ్ఞ యిచ్చుట •—

కం. అని రాముఁడు వచియించిన, ధనములు రత్నములు తెచ్చి • తగుగతి నిచ్చెన్
వినయముగ గౌరవించెను, మనముల వారెల్ల హర్ష • మాణులు గాఁగన్.

అర్థములు. హర్షమాణులు=సంతోషించినవారు.

తాత్పర్యము స్పష్టము.

సీ. అది గని శ్రీరాముఁ • డానందమగ్నుఁడై మఱిఁ బుష్పకం • బెక్కి యుండు
లజ్జమానను యశో • లలిత వైదేహిని, నంకతలంబున • నారఁ జేర్చి
పీరుండు సౌమిత్రి • విల్లు కేల వహించి, చెంత నిల్వంగ నా • సీనుఁ డగుచు
వానరరాక్షస • వల్లభులను జేరి, బహుభంగులను వారి • బహుమతించి
తే. వానరోత్తములార! మీ • వలన మిత్ర కార్య మియ్యది నెఱవేఱెఁ • గడమ వడక
నాకుఁ గా నెంత గాసిల్లి • నారు మీరు, సెలవొసంగెదఁ జనరయ్య • నెలవులకును.

అర్థములు. లజ్జమానను=మగని తొడపై పదుగురిలోఁ గూర్చుండ సిగ్గుపడు దానిని, యశోలలిత=కీర్తిచే మనోహరమైనదానిని, అంకతలంబునన్=ఆఁడువారు మఱెవ్వరు లేమిచేఁ దన యెడమతొడయందు, బహుమతించి=గౌరవించి.

తాత్పర్యము స్పష్టము.

విశేషవిషయము.

వైదేహిని నంకతలంబున నారఁజేర్చి—దీనివలనఁ బ్రపన్నులు తెలియవలసిన విషయ మొకటిగలదు, సీతాదేవియందుఁ బ్రపన్నలక్షణము లన్నియుఁ బూర్ణముగఁ గలవని పూర్వకాండమందు వివరింపఁబడెను. ప్రపత్తివలన భగవత్సాయుజ్యమీ జన్మమందే కలదనియుఁ జెప్పఁబడెను. భక్తులకు కర్మకులకు జ్ఞానులకు యోగులకు నర్చిరాదిగమనము గలదు. ప్రపన్నులకు నా చుట్టుత్రోవతోఁ బనిలేదు. "సోహ మాశ్రితతంత్రాత్మా స్మరామిచ తదా స్వయమ్। ఇమం మద్భోగ్యయోగ్యంతు కృపాపూరప్రకాశనాత్। నయామి పరమం స్థానమర్చిరాదిగతిర్వినా। గరుడస్కంధ మారోప్య యథేష్ట మనివారితం॥ వరాహపురాణము.

ఆశ్రితపరతంత్రుండనైన నేను ఆ సమయంబున (ప్రపన్నుని మరణకాలంబున) నేనే జ్ఞప్తికిం దెచ్చుకొని నన్ననుభవింప యోగ్యుండైన యీ ప్రపన్నుని నా దయారసము ప్రకాశింపంజేయుటకై యర్చిరాదిగమనము లేకుండ గరుడుని మూంపుపై నెక్కించికొని యథేష్టముగ నడ్డములేక పరమపదమునకుం దీసికొని పోదును. ఇది భగవద్వాక్యము. ఈ వాక్యములకు నిది లక్ష్యము. ప్రపన్న యగు సీతాదేవిని వేఱుగా నుంచుకొని యితరులంబంపికాని రప్పించుకొనక తన తొడ మీందం గూర్చుండంబెట్టుకొని చక్కంగా నయోధ్యకు (వైకుంఠమునకు) రామచంద్రమూర్తి పిలుచుకొనిపోయెను.

ఇందుం బ్రపన్నగమనము సాయుజ్యలక్షణము రెండును జెప్పంబడెను.

కం. నీవు సుహృత్తును మిత్రుం, డౌ వాం డొనరింప యోగ్య•మగు నంతయు సు
గ్రీవా! ధర్మభయంబునం, గావించితి పురికిం జనుము•కపిసేనలతోన్. ౨౭౧

అర్థములు. సుహృత్తు="దుఃఖే విపది సమ్మోహే, కార్యకలాత్యయేపిచ, హితాన్వేషీచ హితకృ ద్యస్సుహృ త్సోఽభిధీయతే"- ప్రతిఫలాపేక్షలేక యాపదలందు దుఃఖవేళల సహాయుండగువాండు సుహృత్తు, ప్రతిఫలాపేక్ష గలవాండు మిత్రుండు, ధర్మభయంబునన్ - చేయకపోయిన నధర్మమగునే యని పాపభీతిచేం జేసితివికాని నాకు భయపడిగాదు.

తాత్పర్యము స్పష్టము.

కం. నెమ్మిని నాయొసంగిన రా, జ్యమ్మున లంకన్ వసింపు•మా సుఖముగ ని
న్నమ్మఘవాదులకైనం ద, ర మ్మిటం గాదయ్య చెనక•రాక్షసరాజా! ౨౭౨

అర్థములు. నెమ్మిని వసింపుమా, మఘవాదులకైనన్ = దేవేంద్రాదులకైనను, రాక్షసులయందు దేవతలకుం గల విరోధభావమును బట్టి వారు నిన్ను లంకను జెఱుపంజూచినను నామిత్రుండవైన నిన్ను వారేమియుం జేయంజాలరు. 'నా యొసంగిన రాజ్యమ్మున లంకన్' అనుటచే లంకానగరరాజ్యము నేను నీ కొసంగితిని, దానిని పాలింపుము. రావణుండు దురాగతుండై యాక్రమించి యుండిన యితర ప్రదేశముల జనస్థానము లోనైనవి వదలి యచ్చటనుండిన రాక్షసుల మరలం బిలిపించుకొనుమని భావము.

తాత్పర్యము స్పష్టము.

తే. తండ్రి యేలిన యారాజ•ధాని కేన, యోధ్యకును బోవ నిప్పుడ•యుత్సహించి
నాండ నోమిత్రజనులార! నాకుం గరుణ, సెల వొసంగంగ విజ్ఞప్తి•సేయువాండ.

తాత్పర్యము స్పష్టము.

ఉ. రాముం డిటుల్ వచింపం గపి • రాజును రాక్షసరాజు నో దయా
ధామ! భవత్పురంబుం గనం • దద్దయుం గోరెద, మందు నేరి కే

నేమి యుపద్రవం బిడక • యిచ్చఁ జరించెద మయ్య నద్వనీ
స్తోమములం బురంబునను • దోయజలోచన! సమ్మతింపవే. ౨౬౮

అర్థములు. ఏరి కే నేమి యుపద్రవం బిడక - మీరు అయోధ్యకువచ్చెద మనుచున్నారే - క్రోఁతులు రాక్షసు లిరువు రిరువురే - తోఁటలలో నుంచితినా తోఁటలు పాడుచేయుదురు. ఊరిలో నుంచితినా మనుష్యులను బీఁకి పెట్టెదరు - మిమ్మెట్లు పిలుచుకొనిపోదు నందు వేమో? మేమట్లు చేయము. గుణముగలవారమై యుండి వచ్చెదము.

తాత్పర్యము స్పష్టము.

కం. మీ రాయభిషేకము మీ స్థానీయంబును జూచి మ్రొక్కి • నీ జనయిత్రిన్
మా యిండ్ల కరుగువారము, చేయుము మామీఁదఁ గరుణ • సీతానాథా !

అర్థములు. స్థానీయము = పురము.

తాత్పర్యము స్పష్టము.

— • శ్రీరాముఁడు సుగ్రీవవిభీషణాదు లయోధ్యకు వచ్చుటకు సమ్మతించుట • —

సీ. అని వారు పల్క ధ • ర్మాత్ముండు రాఘవుం, డినజాసురేంద్రుల • కిట్టు లనియెఁ
బ్రియముకంటెను మేలి • ప్రియతరం బిది యబ్బె. మిత్రవరేణ్యుల • మిమ్ముఁ గూడి
మా పురి కేగడి • మహితభాగ్యము గల్గె. నెక్కుము సుగ్రీవ • యెల్లకపులఁ
నీవు విభీషణా ! • నీ సచివాదులు, నెక్కుఁడీ పుష్పకం • బిపుడె యనిన
తే. వార లెల్లరు నెక్కఁగా • బేరయాన. మా ధరాధిపునాజ్ఞచే • నభ్రవీథి
కెగసె హంసాన్వితంబయి • యొసఁగు నందు, రాజరాజన వెలుగొందె • రామవిభుఁడు.

అర్థములు. ఇనజ+అసురేంద్రులకున్ = సుగ్రీవ విభీషణులకు, సచివాదులు = మంత్రులు మొదలగువారు - కౌబేరయానము = పుష్పకము, హంసాన్వితంబు = హంసలవలెఁ జేయఁబడిన ప్రతిమలతో, అనఁగా జూచువారికి బ్రహ్మరథము వలె హంసలు మోచికొని పోవునట్లు తోఁచుచున్నట్లు చేయఁబడినది. రాజరాజు = కుబేరుఁడు, ప్రియముకంటెను, మేలిప్రియవరము = నీ లాభము ప్రియము, భరతాదిప్రాప్తి ప్రియవరము, మిత్రులతో నయోధ్యకుఁ బోవుట మేలి ప్రియవరము.

తాత్పర్యము స్పష్టము.

తే. నవ్యతరమైన యీ విమా • నంబునందు, నిలుతు లేక సుఖంబుగ • నెడమెసఁగఁ
గూరుచుండిరి రక్కసుల్ • కుధరచరులు, కాంచు చిత్రంబు లెల్లవ • ర్ణించికొనుచు.

అర్థములు. కుధరచరులు = వానరులు.

తాత్పర్యము స్పష్టము.

ఈ విమానము గుఱించి - సి. వి. వైద్య - ఎం. ఏ., ఎల్. ఎల్. బి. అనువారిట్లు వ్రాసియున్నారు. దీనివలన మన పురాణాదులందు విశ్వాసము లేనివారి మనస్సు లెంత నీచస్థితికి వచ్చినవో తెలియఁగలదు.

"The idea that Ram went back to Ayodhya in one day in a *Vimana* of Kubera strikes us as hyperbolical. But it is possible to believe that he was carried in a palanquin of superb construction by fast bearers, a palanquin given by Vibhishana and resembling that used by Montezuna"

Riddle of Ramayana, page 175, foot note.

అటంగా కుబేరుని విమానమందుఁ గూర్చుండి రాముఁ డయోధ్య కొక్క దినములోఁ బోయెననుట యతిశయోక్తిగాఁ దోఁచుచున్నది. అయినను విశాలమైన పల్లకీలోఁ గూర్చుండి త్వరగాఁ బోఁగల వాహకులు తీసికొనిపోయి యుండురని నమ్మసాధ్యమగును. ఈ విభీషణుఁ డిచ్చిన యీపల్లకీ పెరుదేశపురాజు మాంటిజూమా యుపయోగించిన పల్లకీవంటిది" (Conguest of Peru) పెరుదేశమును జయించుట. Prescot వ్రాసిన గ్రంథము నందున్న ప్రమాణబుద్ధి యితనికి మన మహర్షులు వ్రాసిన గ్రంథములందు లేదాయె. త్రిపురములు విమానములు. కావేని మఱియేమి? ఇప్పటికి నైదువేల సంవత్సరములనాఁడు సౌంభక విమానమున్నట్లది యుద్ధమునకై ద్వారకమీఁదికి సాల్వుఁడు తెచ్చినట్లు భారతమునఁ జెప్పఁబడెను. ఇవిగాక కీలుగుఱ్ఱములు, కీలుచిలుక లున్నట్లు మన కథలయందును గలవు. పాశ్చాత్యులే కసుమాలపువ్రాఁత వ్రాసినను వీరికిఁ బ్రమాణము. మన వా రెంత సత్యము వ్రాసినను అప్రమాణము. ఇప్పు డంతరదశయందున్న విమానములే యితని చిత్తవృత్తికి లోకము నవ్వఁజేయును. వేఱు విమర్శన మక్కఱలేదు. ఇందఱు వానరులు రాక్షసులు కూర్చుండ నెంత పెద్ద పల్లకీ కావలెను? ఇందఱు కూర్చుండిన మోయువా రెందఱుండవలెను? ఒక్క మనుష్యుఁడు పల్లకీలో కూర్చుండిన సమీపస్థలమునకుఁబోవుటకే యధమపక్షమున నలుగురు కావలెను. ఇంతమందికి మోఁతగాం డ్రెందఱుండవలెనో? ఇంత పెద్ద పల్లకీ యెప్పుడు నిర్మింపఁబడెనో? ఎంత వేగముగఁ బోఁగల మనుష్యులైనను లంకనుండి యయోధ్యకు నొకనాఁటిలోఁ బోఁగలరేమో యాలోచింపుఁడు. తన వ్రాఁతయందలి దోష మితనికి స్ఫురించినదికాదు. పాశ్చాత్య విద్యా పిశాచగ్రస్తచిత్తులై స్వమతగ్రంథవిశ్వాసములేని వారి గతి యిట్టిదే.

## ౧౨౬-వ సర్గము. శ్రీరాముఁడు సీతాదేవికిఁ బూర్వపరిచితస్థలంబులఁ జూపుట

ఉ. రామునిచేఁ ననుజ్ఞఁ గొని • రమ్యవిమానము మారుతోద్ధతం
బౌ ముదిరంబనంగ వియ • దధ్వమునన్ వడి నేగువేళ ది
క్సీమలు పాఱఁజూచుచును • శీతకరానన సీతఁ జూచి యెం
తో ముద మార నిట్లనియెఁ • దోయజలోచనుఁ డో మృగేక్షణా ? ౨౭౦౧

అర్థములు. అనుజ్ఞగొని = విమానము అచేతనము. కావున విమానము నడపువాఁడని గ్రహింపవలెను. మారుతోద్ధతంబు=గాలిచే నెగురఁ గొట్టఁబడినది, ముదిరము = మేఘము, వియదధ్వమునన్ = ఆకాశమార్గమున, శీతకరాననన్ = చంద్రునివంటి ముఖము గలదానిని.

తాత్పర్యము

విమానము నడపువాఁడు రామచంద్రమూర్తిచే ననుజ్ఞ తీసికొని దానిని బోనియ్యగా నది యాకాశమార్గమున గాలిచేఁ జిమ్మఁబడిన మేఘమువలె తీవ్రవ బోవుచుండఁగా ప్రక్కలఁ జూచుచు సీతను జూచి రామచంద్రమూర్తి యిట్లనియె.

కం. మానుగ హారగిరిశిఖరముఁ, బోని త్రికూటంబు శిఖర ♦ మునఁ బొల్పెడిఁ గం
టే నెమ్మి విశ్వకర్మునిఁ, చే నిర్మిత మైన లంక ♦ శీతాంశుముఖీ ! ౨౦౯

అర్థములు. శీతాంశుముఖీ=చంద్రునివంటి ముఖము గలదానా, హారగిరిశిఖరము=కైలాసశిఖరము, పోని = పోలిన, విశ్వకర్మునిచే = విశ్వకర్మ — విశ్వకర్ముఁడని రెండు రూపంబులుగలవు. 'విశ్వకర్మునికూఁతు విశదలావణ్య సముజ్జ్వలఁ జేకొని - హరి. ౪ ఆ.

తాత్పర్యము

విశ్వకర్మచే నిర్మింపఁబడి కైలాసశిఖరమునకు సమానమైన త్రికూటశిఖరమునందు లంక యున్న దిది చూచితివా ?

సీ. మాంసశోణితకర్ద ♦ మంబు రాక్షసకపి, రణరంగ మియ్యది ♦ రాజవదన
నీనిమిత్తంబుగ ♦ నే నిదుఁ ద్రుంచితి, రావణు దుష్టునిఁ ♦ బ్రాప్తవరునిఁ
గుంభకర్ణుం డిందుఁ ♦ గూలె నా దోశ్శక్తి, నంతకుఁ జేరెఁ బ్ర♦హస్తుఁ డిచట
ధూమ్రాక్షు నిర్యోడఁ♦గూలించె మారుతి, బలియు విద్యున్మాలి♦భంగపఱచె
ఆ. నిట సుషేణుఁ డందుఁ ♦ గుటిలచారిత్రుని, మేఘనాదు ననిసు ♦ మిత్రపట్టి
గీ టడంచె వికటు♦పోటుమాన్పను వాలి, నందనుండు బలపు♦రందరుండు.

అర్థములు. ఇయ్యది వ్రేలితోఁ జూపించి చెప్పుచున్నాఁడని తెలియునది. మాంసశోణితకర్దమంబు = మాంసము నెత్తుటితో బురదయైనది, రాక్షసకపిరణరంగము=రాక్షసులు వానరులు యుద్ధముచేసిన ప్రదేశము, ప్రాప్తవరుని=బ్రహ్మరుద్రులచేత వరము సంపాదించిన వానిని, దోశ్శక్తిన్ = భుజబలముచే, కుటిలచారిత్రకుఁడు = మోసపునడవడి గలవాఁడు, మేఘనాదున్ = ఇంద్రజిత్తును, అనిన్=యుద్ధమందు, బలపురందరుండు=బలమునం దింద్రుని బోలినవాఁడు.

తాత్పర్యము

ఈ ప్రదేశము చూడుము. వానరులు రాక్షసులు యుద్ధముచేయఁగా భూమి నెత్తురు మాంసములచే బురదయైయున్నది. బ్రహ్మరుద్రులచే వరములు సంపాదించిన రావణుని నీనిమిత్తమై యిందుఁ జంపితిని ఇచ్చట నా భుజబలముచేఁ గుంభ

కర్ణుఁడు చచ్చెను. అచ్చటఁ బ్రహస్తుఁడు చచ్చెను. ఇక్కడ నాంజనేయుఁడు ధూమ్రాక్షుఁ జంపెను. సుషేణుఁడు బలశాలి యగు విద్యుజ్జిహ్వుఁ జంపెను. మాయలమారి యింద్రజిత్తును లక్ష్మణుఁ డచటఁ జంపెను. వికటుఁ డనువాసిని ఇంద్రుని బలమంత బలము గల యంగదుం డచట జంపెను.

సుషేణుఁడు విద్యుజ్జిహ్వుఁ జంపుట గాని యంగదుఁడు వికటునిఁ జంపుటగాని ముందు చెప్పఁబడలేదు. ఇచ్చటఁ జెప్పఁబడెను గావునఁ బూర్వము జరిగిన ట్లూహింపవలెను.

కం. పాపులు మహోదరుండు వి,రూపాక్షుఁ డకంపనుండు ♦ రూక్షబలుం డు
  ల్లోపుండు మహాపార్శ్వుం, డాపదఁ గని రిందు వనచ♦రావళిచేతన్.

తాత్పర్యము స్పష్టము.

ఆ. పంక్తికంఠుజ్యేష్ఠ♦భార్య మండోదరి, కనుల నీరు గారఁ ♦ గరుణముగను
  వేలకొలఁదిసవతి♦వెలఁదుకలును దాను, నేడ్చె వివిధగతుల ♦ నిందుఁ జెలియ !

తాత్పర్యము స్పష్టము.

కం. ఉడురాజబింబముఖ ! యి,య్యెడఁ జూమ యంభోధి దాఁటి♦యేను గపులతోఁ
  గడుకొని యీరాఁ రే సుఖమునఁ, గడసితి నినుఁ దలఁచికొనుచుఁ♦గళవళపడుచున్.

అర్థములు. ఉడురాజబింబముఖ = చంద్రబింబమువంటి ముఖము గల దానా !

తాత్పర్యము స్పష్టము.

ఉ. నూతనపల్లవాంగిరొ ! క♦నుంగొనుమీ యిదె సాగరంబునన్
  సేతువు నీదు హేతువున ♦ నిర్మితిఁ జేసితి నుత్తరింపఁగా
  ఖ్యాతి యొసంగ వైరిహృద♦యంబులు వ్రీల నసాధ్యపద్ధతిన్
  సీత యిదే జగాన నల♦సేతువు నాఁగఁ బ్రశస్తిఁ గాంచెడిన్. ౨౬౯౮

అర్థములు. నూతన పల్లవాంగిరొ = క్రొత్త చిగురువంటి కోమలమైన దేహము గలదానా, ఉత్తరింపఁగాన్=దాఁటుటకు.

తాత్పర్యము

సీతా! యిదిగో జూడుము. సముద్రమును దాఁటుటకై దాని మధ్యంబునందు నీ నిమిత్తముగా నసాధ్యమైన విధముగ శత్రువుల గుండెలు పగులఁగా నాకుఁ గీర్తికరముగ సేతువు నిర్మించితిని, ఇక లోకమునందు నలసేతువని ప్రసిద్ధి గాంచఁగలదు.

ఉ. రంగదరాళకుంతల! త♦రంగపరంపర రంగుమీఱి దు
  ర్భంగగతిం జెలంగుచు భ♦రంబుగ మ్రోఁగుచు శంఖశుక్తులన్
  రంగగు సాగరంబు నుడు♦రాజముఖీ! కను మందు మధ్యమం
  దుం గనుఁగొంటె హాటకమ♦నోహరశృంగహిరణ్యనాభమున్. ౨౬౯౯

అర్థములు. రంగత్ = చలించుచున్న, అరాళ కుంతల=వంకర వెండ్రు

కలదానా. తరంగపరంపర=అలల వరుస, హాటక మనోహర శృంగ = మనోహర మైన బంగారు శిఖరముగల, హిరణ్యనాభమున్=మైనాకమును.

తాత్పర్యము

జానకీ! తెలుపి లేక యలలపరంపరలచే మనోహరమై విశేషముగ ధ్వనించుచు శంఖములచేత ముత్యపుఁజిప్పలచేత నందమైన సముద్రమును జూడుము. అదిగో! దాని నడుమ బంగారుశిఖరము గల మైనాకపర్వతమును జూడుము.

కం. మరుదాత్మజుండు జలనిధి, దరియించెడిసమయమునను ♦ దన్వీ! గాసిన్
హరియింప నీనగేంద్రం, బసుదెంచి జలంబునుండి ♦ యాశ్వాసించెన్. ౨౬౬

అర్థములు. మరుదాత్మజుండు = వాయుపుత్రుఁడు - ఆంజనేయుఁడు, గాసిన్ = బడలిక.

తాత్పర్యము

హనుమంతుఁడు సముద్రము దాటునపుడు ఆయన బడలిక దీర్ప నీ పర్వతము నీళ్ళలోనుండి వచ్చి యూరార్చెను.

కం. స్కంధావారనివేశము, సింధువరము కుక్షియందుఁ ♦ జెలఁగెడిఁ గంటే
సింధురగమనామణీ! కడు,బంధుర మైయున్న దాని ♦ భంగిం గంటే. ౨౬౭

అర్థములు. స్కంధావార నివేశము = కిష్కింధనుండివచ్చి వానరసేనలు విడిసిన స్థలము, సింధువరము కుక్షియందు = సముద్రగర్భమున, సేతువు దాటిన పిమ్మట నుత్తరతీరమున, సింధురగమనామణీ = ఏనుఁగు నడకవంటి నడకగల స్త్రీలలో శ్రేష్ఠురాలా, బంధురము=మనోహరము.

తాత్పర్యము

సముద్రమునందు త్తరతీరమున సేతువు కడపట వానరసేనలు శిబిరము లేర్పాటు చేసికొని దిగినస్థలముఁ జూడుము.

కం. బింబాధర! జలనిధితీ,రంబునఁ గనుఁగొంటె తీర్థ ♦ రాజము సురపూ
జ్యంబు నరార్చ్యము ధుతపా,పంబు పవిత్రంబు సేతు♦బంధం బబలా. ౨౬౮

అర్థములు. సురపూజ్యంబు=దేవతలచేఁ బూజింపఁబడునది,నరార్చ్యము= మనుష్యులచే నర్చింపఁబడునది, ధుతపాపంబు=పాపముల నెగురఁజిమ్మునది, సేతుబంధము=సేతువు కట్టఁ బ్రారంభించిన ప్రదేశము.

తాత్పర్యము

దొండపండువంటి పెదవిగలదానా! సముద్రతీరమున దేవతలచే మనుష్యులచేఁ బూజ్యమై పవిత్రమై పాపహరమై సేతువుకట్ట నారంభించిన స్థలముఁ జూచితివా?

తే. దేవి! మున్ను ప్రభుఁడు మహా♦దేవుఁడిందు, గంజనేత్రి! ప్రసన్న తా♦కారియయ్యె
నెలఁది! రాక్షసరాజు వి♦భీషణుండు, వచ్చికలసిన తల మిది♦పల్లవోష్ఠి! ౨౬౯

అర్థములు. మహాదేవుఁడు = సముద్రుఁడు, ఇందు = ఈ స్థలమందు,

మున్ను = పూర్వము, ప్రసన్నతాకారి = ప్రసాదించినవాఁడు, అనుగ్రహించినవాఁడు, తలము=ప్రదేశము, పల్లవోష్ఠి=చిగురువంటి పెదవిగలదానా.

తాత్పర్యము

చిగురువంటి పెదవిగలదానా! పూర్వమిచ్చట సముద్రుఁడనుగ్రహించెను. ఇచ్చట విభీషణుఁడు వచ్చి కలిసికొనెను. 'వామదేవో మహాదేవో విరూపాక్ష స్త్రిలోచనః' అని మహాదేవ శబ్దము శివపర్యాయముగా నిఘంటువులం దుండుటచే నిచ్చట నాశబ్దమునకు శివుఁడని కొందఱర్థము చెప్పెదరు. అది యెంతవఱకు సందర్భోచితమో విచారింపవలసియున్నది.

"మహాంశ్చ అసౌ దేవశ్చ మహాదేవః" గొప్ప దేవుఁడని శబ్దార్థము. దీనిని విష్ణుసహస్రనామములందు విష్ణుపర్యాయనామముగఁ జెప్పఁబడెను. నిరుక్తియందు 'బ్రహ్మాదిభిః క్రీడతి యో మహాదేవ స్సఉచ్యతే' యనియు 'మహాదేవః ప్రధానత్వా ద్దేవానా మభిధీయతే' యనియు వ్రాయఁబడినది. 'సర్వాన్ భావాన్ పరిత్యజ్య ఆత్మజ్ఞానయోగైశ్వర్యే మహతి మహీయతే తస్మా దుచ్యతే మహాదేవః' శంకరాచార్యులవారు, రుద్రులలో నష్టమరుద్రుఁడవైన మహాదేవుఁడు నీవే యని మీఁద దేవతలు రామచంద్రమూర్తి స్తోత్రము చేసియున్నారు, కావున మహాదేవశబ్దము ముఖ్యవృత్తిని మహావిష్ణువుకే యన్వయించును. తరువాత గౌణవృత్తిని నేదేవతకైన నన్వయించును. భగవచ్ఛబ్ద మిట్టిదేకదా,

* ముందు పూర్వవ్యాఖ్యాతల యభిప్రాయముఁ దెలిసి యావల నా యభిప్రాయముఁ దెలిపెదను.

(౧) మహాత్=జలము, ఆరూపమున నుండు దేవుఁడు మహాదేవుఁడు, సముద్రుఁడు, 'స్నిహం స్నిహ్యం మహచ్ఛబ్దం వారుణం సర్వతోముఖమ్,' వైజయంతి.

(౨) మహాదేవు డష్టమూర్తులలో నొకఁడు కావున మహాదేవ శబ్దముచే సముద్రుఁడే చెప్పబడెను.

పూర్వము=సేతుబంధమునకుఁ బూర్వము, ప్రసాదించెను. నీళ్ళమీఁద సేతువు ధరించు రూపమున ప్రసాదము లేదా? ప్రసాదము = ప్రత్యక్షమగుట, 'దర్శయామాస చాత్మానం సముద్ర స్సరితాంపతిః' నదులకు పతియగు సముద్రుఁడు కనఁబడెను. అని చెప్పుటచే మహాదేవుఁడు సముద్రుఁడే.

ఇది మహేశ్వరతీర్థీయ వ్యాఖ్యానము.

రామచంద్రమూర్తి దర్భశయన స్థలముఁ జూచి చెప్పుచున్నాఁడు. మహాదేవుఁడని సముద్రుఁడు చెప్పఁబడెను. ఔచిత్యము ననుసరించి యీ యర్థమే పొసఁగియున్నది. ప్రభువనఁగా సముద్రజలాధిష్ఠాత, ప్రసాదించెను = సముద్రము నెండించెద నని కోపించిన నన్ను ప్రసన్నునిఁ జేసెను. ప్రసాదస్తు ప్రసన్నతా యని

యమరము. ఇచ్చట మహాదేవుఁడనఁగా రుద్రుఁడు గాఁడు. ఆయన పూర్వము ప్రసాదించినట్లు చెప్పఁబడలేదు. పూర్వము జరిగినవే యిచ్చట ననువదింపఁబడినవి. అయినను వికటుఁడను వాఁడంగదుచేఁ జచ్చినట్లు ముందు చెప్పలేదు కదా. ఇచ్చటఁ జెప్పుటచే నది పూర్వము జరిగినట్లు గ్రహించినట్లే పూర్వము చెప్పకున్నను నిచ్చటఁ జెప్పుటచే గ్రహింపవచ్చునని చెప్పవచ్చును గదా. అచ్చట నంగదుఁడు వికటుని జంపెనని గ్రహించుటచే విరోధమేమియుఁ బొసఁగదు. ఇచ్చట నట్లు గ్రహించిన విరోధము ప్రాప్తించును. ఎట్లన ఈ ప్రసాదము సేతునిర్మాణ కాలమందా? లేక యిప్పుడు మరలి వచ్చునపుడా? మొదటిది కాదు. ప్రసాదకారణమైన రావణవధ యప్పుడు లేదు. పూర్వసిద్ధమైన సముద్రప్రసాధమునకే సేతునిర్మాణము సంఘటించుచుండ శివుఁడు ప్రసాదించిన దేది. (ఇరువురు ప్రసాదించి రందమా? ఎవరు ముందు? ఎవరు వెనుక? సముద్రుఁడు ప్రసాదించిన పిమ్మట శివుఁడు ప్రసాదించుట చర్వితచర్వణము, వ్యర్థము. సముద్రమునందలి సేతునిర్మాణమునకు సముద్రుఁడంగీకరించె ననుట సమంజసముగాని శివుఁ డనుమతించె ననుట సమంజసముగాదు. శివుఁడు ముందనుగ్రహించియుండెనా దర్భశయనము వ్యర్థము. రామచంద్రమూర్తి జరిగినది చెప్పక జరగనిది చెప్పినట్లగును) కావున సేతునిర్మాణకాలమందు శివుఁ డనుగ్రహించెననుట సరిగాదు. మరలి వచ్చునపుడనుటయు సరిగాదు. ఏలన నిప్పుడని చెప్పక పూర్వమని చెప్పుటచే వర్తమానము బాధింపఁబడుచున్నది. పూర్వము ప్రసాదించెను అని భూతకాలమునఁ జెప్పఁబడినది వర్తమానమున నన్వయించు టెట్లు? పూర్వమనఁగాఁ బూర్వకల్ప మని చెప్పుటయుఁ దగదు. పూర్వకల్పమందుఁ గట్టిన సేతు విప్పటికి నుండెనేని వేఱొక నూతన సేతువు కట్టనేల? దానికై దినములు వ్యర్థపుచ్చనేల? (అట్టిది యొకటుండిన హనుమంతుఁడు సముద్రము దాటనేల? వానరులందఱు, దానిపై సీతాన్వేషణకాలమునఁ బోయియుండవచ్చునుగదా) ఇచట నని స్థలనిర్దేశము చేయఁబడుటచే పూర్వకల్పసేతు విది గాదని స్పష్టపడుచున్నది.

కూర్మపురాణమందు "సేతుమధ్యే మహాదేవమీశానం కృత్తివాససం। స్థాపయామాస వై లింగం పూజయామాస రాఘవః। తస్య దేవో మహాదేవః పార్వత్యా సహ శంకరః॥ ప్రత్యక్షమేవ భగవాన్ దత్తవాన్ వరముత్తమమ్" ఇత్యాది వాక్యములు గలవు కావున వానిని బట్టి చెప్పెద మనుటయు సరిగాదు.

ఇట్టులే పద్మపురాణమందును గలదు, ఇట్లు పురాణవాక్యములుండుటచే రామచంద్రమూర్తి శివలింగము ప్రతిష్ఠించెనని చెప్పవచ్చునుగదా యనిన నదియు సరిగాదు. ఏలన ఇతిహాసములకంటె పురాణములు ఎక్కువ ప్రమాణములు గావు. శ్రుతి స్మృతీతిహాస పురాణములందు శ్రుతి ప్రథమప్రమాణము. దానికి విరోధముగ లేకుండెనేని స్మృతి ప్రమాణము. వానితో విరోధింపదేని యితిహాసము ప్రమాణము. వానితో విరోధింపదేని పురాణము ప్రమాణము. కావుననే

ఇతిహాసం పురాణః పంచమమ్ అనియే చెప్పఁబడుచున్నది. వ్యాకరణసూత్రప్రకారము అల్పాక్షరమైన పురాణశబ్దము ముందు ఇతిహాసశబ్దము వెనుక నుండవలెను. ప్రాశస్త్యమును బట్టి ఇతిహాసము ముందు చెప్పఁబడెను. కావున సాక్షాద్వేదమైన రామాయణముకంటెఁ బురాణములు అధిక ప్రమాణములు గావు. త్రేతాయుగమందుఁ బుట్టిన రామాయణమునందలి విషయములకుఁ గలియుగమునఁ బుట్టిన పురాణము లెట్లు ప్రమాణములు కాఁగలవు? ఈ సర్గమందలి శ్లోకములు వ్యత్యస్తములుగా నున్నవని పూర్వవ్యాఖ్యాతలు వ్రాసిరి. ఈ శ్లోకము మండోదరీ ప్రలాపానంతర ముండఁదగినది. అప్పుడు దేవప్రసాద మనఁగా పితృదర్శనమే యగును. తండ్రికర్శనము మహాదేవు ననుగ్రహమునఁ గలిగినట్లు రామచంద్రమూర్తి హనుమంతునకుఁ జెప్పిన మాటలయందు "మహాదేవు కరుణ జనకు దివిని గనుట" యని కలదు.

ఇది గోవిందరాజీయ వ్యాఖ్యానసారము. ఇచ్చట మహాదేవశబ్దమునకు శివుఁడని యర్థము చెప్పువారికిఁ బ్రకృతప్రమాణము నిఘంటువు.

(౨) రావణుని జంపుటచే బ్రహ్మహత్య రామచంద్రమూర్తికిఁ బ్రాప్తింపఁగా దాని నివారణార్థము శివలింగము ప్రతిష్ఠించెననుట రెండవది. ఈ రెండు ప్రమాణములు క్షోదక్షమము లేమో చూతము.

• ౧. శ్రుతిస్మృతీతిహాసము లందలి శబ్దములకు సర్వత్ర యమరనిఘంటువు ప్రమాణమగునేని యనర్థము సప్పదు. దీనికి పరశ్శతోదాహరణము లీయవచ్చును గాని యా ప్రయత్నము మాని యీ రామాయణమందే యమరము ప్రమాణముగాఁ దీసికొని యర్థము చెప్పినచో నెట్టి విరుద్ధార్థములు చెప్పవలసి వచ్చునో చూతము. 'ఇహోపయాతః కాకుత్స్థ దేవరాజ శ్శతక్రతుః ఉపాగమ్యచ మాం దేవో మహాదేవ స్సురేశ్వరః' అరణ్య-౭-౧౦- ఇచ్చట మహాదేవశబ్ద మింద్ర పర్యాయముగ వాడఁబడినది. ఇచ్చట శివుఁడని యర్థముచెప్ప సాధ్యపడునా? 'ఇదంచ బ్రహ్మణాదత్తం హేమాద్యై—' కిష్కింధ-౫౧-౧౫ ఇది స్వయంప్రభా వాక్యము. ఇచ్చట బ్రహ్మయనఁగా మయుఁడు.

తతస్స మధ్యంగత మంశుమంతం - సుందర. ౫ అని సూర్యపర్యాయమైన అంశుమంతుఁ డనునది చంద్రపర్యాయముగఁ జెప్పఁబడెను.

సుషేణశ్చాపి ధర్మాత్మా పుత్రో ధర్మస్య వీర్యవాన్ యుద్ధ. ౩౦-౨౨ ఇచ్చట ధర్మశబ్దము వరుణపర్యాయము.

"ప్రాప్తం వైశ్రవణేనాపి నయమేన నవిష్ణునా" అరణ్య. ౩౧ - ౫ ఇచ్చట విష్ణుశబ్దము వరుణపర్యాయము.

"నకాలస్య నశక్రస్య—నవిష్ణో ర్విత్తపస్యచ" ఉత్తర. ౬౫.౮ ఇచ్చట విష్ణుశబ్దము వరుణపర్యాయము.

ఇట్టి వింకనుగలవు. ఇట్టి సందర్భములందు నిఘంటువులు ప్రమాణములుగావు.

ఇక రెండవది యెంతమాత్రము సత్యమో చూతము. రావణుఁడు బ్రాహ్మణుఁడఁట. వానిఁజంపిన బ్రహ్మహత్య రామచంద్రమూర్తిని బీడించెనఁట. ఆ దోషముపోవ శివలింగప్రతిష్ఠ గావించెనఁట.

రావణుని తండ్రి బ్రాహ్మణుఁడైనను తల్లి క్షత్రియ స్త్రీ. ఈమె వివాహితయు గాదు. కావున రావణుఁడు క్షత్రియుఁడు కూడఁ గాఁడు. విశ్రవసుని యుంపుడు కత్తె కొడుకని చెప్పవలసియున్నది. కావుననే వీఁడు కర్మములచేఁ గర్మచండాలుఁడు. ఇట్టివానిని జంపిన బ్రహ్మహత్య యెట్లు వచ్చును?

వీఁడు బ్రాహ్మణుఁడేయైనచో కుంభకర్ణుఁడు బ్రాహ్మణుఁడు కాఁడా? ఆ బ్రహ్మహత్య యేల రాలేదు? వీఁడు బ్రాహ్మణుఁడు కాఁడనియు బ్రాహ్మణునినైనను యుద్ధమునఁ జంపిన బ్రహ్మహత్య లేదనియు ముందే వ్రాయఁబడెను. తాటకను జంపుటచే స్త్రీహత్య యెట్లు రాలేదో రావణుఁడు బ్రాహ్మణుఁడని గ్రహించినను బ్రహ్మహత్య రాదు.

తిలకవ్యాఖ్యయందు సముద్రుఁడు ప్రసాదించిన పిమ్మట విఘ్నములు రాకుండుటకై శివుని స్థాపించెనని వ్రాయఁబడినది. ఇది క్షుద్రము గావునఁ బ్రత్యుత్తర మీయఁదగినదికాదు. తిలకాభిప్రాయప్రకారము సముద్రుఁడు శివుఁడు నిరువురు ప్రసాదించినట్లే కదా యగుచున్నది. ముందు సముద్రుఁడు ప్రసాదించె ననుటచే వాక్యము సరిపోయెనుకదా? రెండవదానిని జెప్పు వాక్య మెందున్నది? వాస్తవముగ చెప్పవలసిన ముఖ్యవిషయము సముద్రదర్శనము. మహాదేవ శబ్దమునకు శివుఁడని యర్థము చెప్పినచో చెప్పవలసిన సముద్రదర్శనము విడిచిన ట్లగును. లేనిది చెప్పినట్లగును.

'బహుశాఖా హ్యనంతాశ్చ బుద్ధయోఽవ్యవసాయినామ్' సత్యమును విడిచి వక్రమార్గమునఁ బోవఁబూనిన నన్ని యవలక్షణములే పొసఁగును.

ఇప్పుడు సేతువు రామేశ్వరద్వీపము ననుసరించి కానవచ్చుచున్నది. ప్రక్కన గొంతవఱకు నేల యుండఁగా దానిప్రక్కననే సేతువు ప్రారంభించి యుండునా? ద్వీపాంతమునుండి ప్రారంభించియుండునా? మఱియొక్క విషయ మాలోచింపఁ దగియున్నది. ఆ కాలమున నిప్పటి మధుర తిరునల్వేలి మండలములు జలమున మునిఁగియుండెనని ముందే వ్రాయఁబడెను. మధురకుఁ గొంచెము దక్షిణమువఱకు సముద్రము వ్యాపించియుండెను. ఇప్పటి రామేశ్వరము సముద్రములో మునిఁగి యుండ లింగప్రతిష్ఠ యెట్లు జరిగెను?

సముద్రమునీరు తీసిపోయి నేలయేర్పడి జనులు వాసముచేయ నారంభించిన కొన్నాళ్ళకు దేవాలయ మేర్పడియుండవలెను. ద్వంద్వార్థముగల యొక శబ్దము నాధారముచేసికొని రామాయణమునకు దేవాలయమునకు సంబంధము కల్పించుట

పరిగాదని తోఁచుచున్నది కాని యీ దేవాలయము చిరకాలమున నున్నది కాదని యభిప్రాయము కాదు. రామచంద్రమూర్తి ప్రతిష్ఠించినది కాదని మాత్రమే యీ మీమాంసాసారము.

"It is indeed strange to find that such an untenable theory should have been put forwared by Talboys Wheeler But the reason plainly is that he never probably studied the Ramayana of Valmiki and derived his information from later versions of Rama's story And naturally enough; for even most Hindus do not know that Rama is not described in the Ramayana in any place as a Linga-worshipper. It would be an astounding revelation to many Hindu readers to know that there is no mention whatever of the founding by Rama of the great Rameshvar Linga at the Southern extremity of India. This is a story which has very probably been subsequently formulated There is no doubt a solitary line in the Ramayana of Valmiki, when Rama was returning from Lanka and was pointing out to Sita from his Vimana in the sky the several places of importance on the earth below as they passed them, wherein it is said;

'అత్ర ప్రసాద మకరో న్మహాదేవః స్వయం మమ.'

This line has probably been interpolated in support of the claim of the great temple of Ramesvara; it is differently interpreted by the Vaishnavas who see in it nothing of the kind that is ordinarily believed But leaving that interpretation aside we are bound to state that it was expected that the poet would mention the founding of the Linga or even the story of the propitiation of Mahadeva at the time when Rama was encamped on the coast with his army and was in difficulty as to the crossing of the strait. Moreover Rama is throughout the length of the Ramayana of Valm ki shown as a Vedic Aryan who knew nothing else but sandhya and sacrifice. He is never spoken of as worshipping a Linga.

రామేశ్వరాలయంబున రెండు లింగములు గలవు. నేను నా మిత్రుఁడు లంకా వేంకటసుబ్బయ్య యనువారము అర్చకుఁడు పరిచితుఁడగుటచే సమీపమునకుఁ బోయి చూచితిమి. ఈ చిన్న లింగ మేమి యని నా స్నేహితుఁడు ప్రశ్నించెను. ఇది అత్ర 'పూర్వం మహాదేవ' యని చెప్పుచు సేతువు ప్రారంభించినపుడు స్థాపించినది చిన్నలింగమనియు, రెండవసారి స్థాపించినది పెద్దలింగ మనియుఁ జెప్పెను.

రామచంద్రమూర్తి నారాయణార్చనము చేసినట్లు రామాయణమందున్నది గాని శివార్చనచేసినట్లు చెప్పఁబడలేదు. రుద్రుఁడే యుద్ధవేళ శరణాగతి చేసినట్లు ఇప్పుడువచ్చి స్తుతించినట్లు చెప్పఁబడెను. రావణునిఁజంపఁగానే రాని బ్రహ్మహత్య తరువాత రెండునాళ్ళ కెట్లు వచ్చెను? ఈ లోపల శివుఁడు ప్రత్యక్షమాయెఁగదా. అప్పు డా బ్రహ్మహత్య యెందుండెను? యుద్ధహతులకుఁ బిశాచత్వము కలదా? మహాదేవశబ్దమునకు సముద్రమని యర్థము వ్యుత్పత్తిచేఁ బొసఁగి ప్రకరణానుసారమై యుండఁగా దాని విడిచి యసందర్భపుటర్థము చెప్పుట సరిగాదు.

కం. మానిని! యదిగోఁ గిష్కింధానగరము చిత్రవనము • తరణిజాపుర మిం
దేను వధించితి వాలిని, నా నీరజనేత్ర భయవి•నయములఁ బలుకున్. ౨౧౦౦

అర్థములు. తరణిజాపురి=సుగ్రీవునగరము, భయవినయములఁ బలుకున్ = భయముతోను వినయముతోను - ఏమనుకొనునో యని భయము.

తాత్పర్యము స్పష్టము.

—• సీతాదేవి తారాదికాంతల నయోధ్యకుఁ దోడ్కొనిపోవఁ గోరుట •—

ఉ. శ్రీమహిమాభిరామ! విను • చేసెద నే నొక విన్నపంబుఁ దా
రామహిళాదిముఖ్యకపి•రాజసతుల్ మఱి యన్య వానరీ
స్తోమము గొల్వ నమ్మదము•తోఁ జనఁ గోరెద నయ్యయోధ్యకున్
నా ముదమార వల్లె యని • నారదగాత్రుఁడు నిల్పె యానమున్. ౨౧౦౧

అర్థములు. శ్రీమహిమాభిరామ = సంపత్కరమైన మహిమచే మనోహరుఁడవైనవాఁడా, తారామహిళాది=తార మొదలగు, ముఖ్యకపిరాజసతుల్ = ముఖ్యులైన సుగ్రీవుభార్యలు, అన్య వానరీస్తోమము = తక్కిన యాఁడుకోఁతుల గుంపు, నారదగాత్రుఁడు=మేఘమువంటి దేహముగలవాఁడు.

తాత్పర్యము

రామచంద్రా! నేనొక విజ్ఞాపనము చేయుచున్నాను. తారాదేవి మొదలగు సుగ్రీవుభార్యలను దక్కిన వానరస్త్రీలను దీసికొని సంతోషముతో నయోధ్యకుఁ బోవఁగోరెదను. అనిన సంతోషించి రామచంద్రుఁడు విమానము నిల్పెను. సీతాదేవి తారాదిస్త్రీలముఖమైన నెఱుఁగదు. వారామెకు సాహాయ్యము చేసినదిలేదు. అట్టి వానర స్త్రీలను బిలుచుకొని పోవఁగోరుటకుఁ దన కెంతో యుపకారము చేసిన విభీషణుభార్యను పుత్రికను దీసికొనిపోవఁ గోరకుండుటకుఁ గారణ మేమి?

రావణునింట విభీషణునిభార్య, పుత్రిక దప్పఁ దక్కిన యందఱు స్త్రీలు నూతనవిధవలే. మగఁడు చచ్చి మూఁడు దినములే యగుటచే దుఃఖించుచు మూలఁ బడి యుండువారే. ఇట్టి వారి నాదరించు వారెవరైన నొకరైన నుండవలెఁగదా. ఇట్టి కష్టదశలో వారి నందఱ విడిచి సరమ యెట్లు పోఁగలదు? సీతాదేవి పిలిచి యుండునుగాని సరమ యంగీకరించి యుండదు. అట్లుగాదేని సీతాదేవి యంతటి కృతఘ్నురాలా? తోడికోడలి నిష్ఠురము లోకనింద పడజాలక సరమ పోలేదు.

ఉ. భానుజుతోడ నిట్టు లను • వానరనాథుల కెల్లఁ జెప్పవ
య్యా! నిజదారయుక్తి జన•కాత్మజతోఁ జనఁగా నయోధ్యకున్
జానుగ నీవు నీయువతి•సంఘముతోఁ జనుదెమ్ము జాగులన్
మాను మటన్న నాతఁ డస•మత్వర నంతిపురంబులోనికిన్. ౨౧౦౨

అర్థములు. నిజదారయుక్తిన్ = తమ భార్యలతోడ.

తాత్పర్యము

సుగ్రీవా! వానరులకు నందఱకు వారి వారి భార్యలను సీతాదేవితోడ నయోధ్యకు వచ్చుటకై పిలుచుకొని రమ్మని చెప్పుము. నీవు నీ భార్యలను దక్కిన యాఁడువారిని బిలుచుకొనిరమ్ము. ఆలస్యము సేయవలదు అనిన నంతఃపురమునకు మిగుల శీఘ్రముగఁ బోయెను.

చం. చని నిజదారఁ దారఁగని • చంద్రముఖీ ? సకలప్లవంగమాం
గనలును నీవు తత్క్షణము • క్ష్మాసుతప్రీతికి నై యయోధ్యకున్
జనవలె నేగుదెం డనుచు • గాటపుఁబ్రేమను రామచంద్రుఁడే
యనియెను రమ్మయోధ్యయును • నాజవతీతతిఁ గాన నౌ ననన్. ౨౧౦౩

అర్థములు. నిజదారన్ = తన భార్యను, సకలప్లవంగమాంగనలును = వానరస్త్రీ లందఱు, రామచంద్రుఁడే=మధ్యవర్తులు చెప్పిన మాటగాదు, ఆజవతీతతిన్=దశరథుని భార్యలను, విమానము దిగిపోయినవాఁడు సుగ్రీవుఁ డొక్కఁడే, తక్కినవారు దిగలేదు.

తాత్పర్యము స్పష్టము.

సీ. ప్రాణేశుఁ డీగతి • భాషింపఁగాఁ దార, సర్వాంగసుందరి • సంభ్రమమునఁ
గపులభార్యల నెల్లఁ • గడువడిఁ బిలిపించి, యనియె మమ్మెల్లర • నర్కుఁ డేనయుఁ
డాయయోధ్యకును దా • నరుదేర ముదలిడె, నీరెల్ల నాతోడ • నేగుదెంచి
రాముని పురముఁ బు • రంబునజనముల, దశరథపత్నుల • తలవిభూతిఁ

ఆ. గాంచు నాకు ముదముఁ • గలిగింపుఁడీ యన, నట్లకాక యనుచు • నతివ లెల్ల
గడుముదంబుతోడఁ • గై సేసి తోడికట్టి, సురవిమానమునకుఁ • జుట్టుదిరిగి. ౨౧౦౪

అర్థములు. ముదల = ఆజ్ఞ, ఈరు=మీరు, కైసేసి = అలంకరించుకొని, తోడి = తొందరగా, కట్టి = క్రొత్తచీరలు కట్టుకొని, చుట్టుతిరిగి = ప్రదక్షిణించి, ప్రదక్షిణించి యనుటచేఁ బూర్ణ ప్రదక్షిణము గ్రహింపరాదు. ఇంత విమానము నకు నిందఱు ప్రదక్షిణము పూర్ణముగాఁ జేయవలయు ననిన కాలహరణ మగును. కావునఁ గుడిప్రక్కగా వచ్చి విమాన మెక్కిరని భావము. సర్వాంగసుందరి యనుటచే నిదివఱకే యలంకరించుకొన్నదని సూచన.

తాత్పర్యము

తనభర్త యీప్రకారము చెప్పఁగా సర్వాంగసుందరి యగు తార యతి శీఘ్రముగ వానరస్త్రీలఁ బిలిపించి సుగ్రీవుఁడు మమ్ము నందఱ నయోధ్యకు రమ్మని యాజ్ఞాపించెను. మీరందఱు నాతోడవచ్చి యయోధ్యానగరమును, అందలి జనులను దశరథుభార్యల నైశ్వర్యము చూచి నాకు సంతోషము గలిగింపుఁడు, మేముమాత్రము పోవుటకంటె మీరుకూడ వచ్చితిరేని నేనెక్కువ సంతోషింతును. సుగ్రీవుని యాజ్ఞ యని తలఁపవలదు. నా సంతోషమునకై నేను జెప్పుచున్నాను

అని చెప్పగా వా రందఱు సంతోషించి శృంగారించుకొని విమానమునకుఁ బ్రదక్షిణముగావచ్చి యెక్కిరి. తార మాట విన్న పిమ్మట స్త్రీలు తలలలో దువ్వెనలు పెట్టుకొని కుచ్చిళ్ళు సవరించి చీరలు కట్టుకొనుటకు నొక దినము పట్టెనని కొందఱి యభిప్రాయము.

కం. సీతాదర్శనకాంక్షను, బ్రీతిని రాజాస్య లెల్ల • వే యెక్కిన సం
జాతత్వరఁ బుష్పక ము,త్పాతింపన్ సతికి రామ•భద్రుఁడు పలుకున్.

అర్థములు. ఉత్పాతింపన్=పై కెగురఁగా, ఇట్లు చెప్పుటచే స్త్రీలెక్కుటకై విమానము క్రిందికి దిగె నని గ్రాహ్యము. ఆకాశమున నుండు విమానమును స్త్రీ లెట్లెక్కఁ గలరు ?

తాత్పర్యము

సీతాదేవిని జూచు కోరికతో సంతోషముతో స్త్రీ లందఱు త్వరగా విమాన మెక్కఁగా త్వరగా విమానము పై కెగసెను. అప్పుడు రామచంద్రమూర్తి సీత కిట్లనెను.

దీనివలన విమానము సేతుబంధమునుండి యయోధ్యకుఁ జక్కఁగాఁ బోవుటలో నడుమఁ గిష్కింధ ప్రాప్తించె నని యెఱుఁగవగు.

ఉ. అల్లదె ఋశ్యమూకము ల•తాంగిరో నే నటఁ గాంచి భానుజున్
వల్లభ! చంపువాఁడఁ జామి • వాలి నటంచుఁ బ్రతిజ్ఞఁ జేసితిన్
బల్లవపాణి! చిత్రతర•వారిజసంగత పంప యద్దిగో
యొల్లపుఁ గాననంబులను • మోదము గూర్చెడి వింత వింతగన్. ౨౦౬

అర్థములు. చిత్రతర = మిగుల విచిత్రములై, వారిజసంగత = కమలములతోఁ గూడిన, యొల్లపు=అందములైన.

తాత్పర్యము

సీతా ! యదిగో ఋష్యమూకము. అచ్చటనే నేను సుగ్రీవునిఁజూచి వాలిని జంపెదనని ప్రతిజ్ఞ చేసితిని. వింతలగు కమలములుగల పంప యదిగోఁ జూడుము. అడవులు మిగుల సంతోషకరములై యందములై యున్నవి. చైత్రమాసము కావునఁ బూచియున్నవి.

కం. నినుఁ బాసినకతమున నో,•వనజేక్షణ! విరహతాప•భరమున నిం దే
వనరితిఁ జిమ్మె యశ్రులు, కనులం బ్రవహింప నాప•గాతతివోలెన్.

అర్థములు. విరహతాపభరమునన్ = నిన్ను విడుచుటచేఁ గలిగిన సంతాపాతిశయమున, వనరితిన్=ఏడ్చితిని, ఆపగాతతివోలెన్=నదులవలె.

తాత్పర్యము

నిను వదలిన కారణమున సీతాదేవీ ! నీ వియోగతాపము సహింపలేక కన్నీళ్ళు నదులవలెఁ గాఱఁగా నేడ్చితిని.

సీ. దానితీరంబున • ధర్మచారిణియైన, శబరిని గంటి నో•శఫరనయన!
పడఁతిరో! యోజన • బాహుఁ గబంధుని, నయ్యెడఁ ద్రుంచితి • హరిణనేత్ర!
యదె జనస్థానంబు • నందు జటాయుని, శ్శాఖిరుహంబు గపడె•ఖంజనాక్షి!
నీకయి యిట గృధ్ర • నేతకు రక్కసు, కూళకుఁ బోరు చ • కోరలోచ
తే. నా! యిటం గద ఖరదూష•ణత్రిశిరులు, మామకీనశరంబుల • మడసి రబల
యంబుజేక్షణ! మనమున్న•యాశ్రమంబు, పదము నుత్పలనేత్ర! య•ల్లదిగోఁ గంటె.

అర్థములు. శఫరనయన = మత్స్యము వంటి కన్నులు గలదానా, ఖంజనాక్షి = కాటుక పిట్టలవంటి కన్నులుగలదానా.

తాత్పర్యము

మీనాక్షీ! యిదిగో నిచ్చట ధర్మచారిణియగు శబరిఁ జూచితిని. అచ్చట యోజనము చేతులుగల కబంధునిఁ జంపితిమి. అదిగో! జనస్థానమునందు జటాయువుండిన చెట్టు. ఇచ్చట నీ నిమిత్తముగ జటాయువునకు రావణునకు యుద్ధము జరిగెను. ఇక్కడఁ గదా ఖరదూషణత్రిశిరసులు నా బాణములచేఁ జచ్చిరి. అదిగో! మన ముండిన యాశ్రమప్రదేశము.

కం. నిన్ను బలాత్కారంబున, మున్నట దశకంధరుండు • ముచ్చిలె నవలా
మిన్న! యదె పర్ణశాల ప్రసన్నమతిం గనుము దాని • సంతోషమునన్.

తాత్పర్యము

నిన్ను రావణాసురుడు బలవంతముగ దొంగిలించిన పర్ణశాల యిదే. ఇప్పుడు సంతోషమునఁ జూడుము

కిష్కింధనుండి యయోధ్యకుఁ బక్కని సీతకు చితికేని కుడిప్రక్క పంచవటి సమీపమందే యుండును గాని నాసికకు సంబంధము లేదు.

కం. గోదావరి యదె చూడు కృశోదరి! నిర్మలితతరశు • భోదకయుతమున్
సాదరమతి లోపాముద్రాదయితుని యాశ్రమంబు•దర్శింపు తమిన్. ౪౦-౪౧

అర్థములు. కృశోదరి = కృశించిన కడుపు గలదానా, నిర్మలితతరశుభోదక యుతమున్ = మిగుల నిర్మలమైన మంచినీళ్లతోఁ గూడినది, లోపాముద్రాదయితుని = అగస్త్యుని.

తాత్పర్యము స్పష్టము.

తే. అదియు చూడు సుతీక్ష్ణు నా•యాశ్రమంబు, నదియె శరభంగునాశ్రమ•మంబుజాక్షి!
యందె కాదె మహాముని•నాదరింప, వచ్చె నాఁడల్లశక్రుండు • వైభవమున.

తాత్పర్యము స్పష్టము.

మ. అట నేఁ ద్రుంచితి నమ్మహాతను విరా • ధాఖ్యున్ సతీ! యల్లవే
జటిలావాసము లత్రిమౌనిని విన • స్వత్పావకాభప్రభున్

బటుమాహాత్మ్యుఁ దపస్వినిన్ మునిసతిం • బద్మాక్షి ! నీ కాంచు టి
చ్చటనే చు మ్మదె చిత్రకూటము మనో•జ్ఞం బిందుబింబాననా. ౨౮౧.

అర్థములు. మహాతనున్ = పెద్ద దేహము గలవానిని, జటిలావాసములు= మనము పది సంవత్సరములు గడపిన ఋష్యాశ్రమములు, అత్రిమౌనిని = అత్రి మహర్షిని, వివస్వత్ + పావక + అభ + ప్రభున్ = సూర్యునితో నగ్నితో సమానమైన కాంతి గలవానిని, బటుమాహాత్మ్యున్=గొప్ప మహిమ గలవానిని, తపస్వినిన్ = తపస్సు చేయుదానిని, ఇందుబింబాననా = చంద్రబింబమువంటి ముఖము గలదానా.

తాత్పర్యము

పెద్ద దేహముగల విరాధుని నచ్చటఁ జంపితిని. అదిగో మనము పది సంవత్సరములు గడపిన ఋషీశ్వరుల యాశ్రమములు! సూర్యాగ్నుల తేజస్సు గొప్ప మహిమ గల యత్రిని, గొప్ప తపస్సు చేసిన యాయన భార్యను అనసూయను నీవు చూచిన దిచ్చటనే సుమా. అదిగో! మనోహరమైన చిత్రకూటము !

తాత్పర్యము స్పష్టము.

కం. ఇచ్చటఁ గాదే భరతుఁడు, సచ్చరితుఁడు నన్నుఁ జూడ • సమ్మతిమైన
న్నిచ్చగఁ బిలిపింగొనిపో,వచ్చెను నది యెట్లు మఱవ • వచ్చును జెలియా !

తాత్పర్యము స్పష్టము.

కం. దూరమున గోచరించెడి, హారివనోదార! యదిగో • యమునానది రం
భోరు! భరద్వాజాశ్రమ,మారం, గను మదిగో సుప్ర • భాంచిత మతివా!

అర్థములు. హారివనోదార = మనోహరములైన వనములచే గొప్పది, రంభోరు=అరఁటిచెట్ల బోదెవంటి తొడలుగలదానా, సుప్రభాంచితము = మిగులఁ గాంతికలది.

తాత్పర్యము స్పష్టము.

కం. వరవర్ణిని నానాద్విజ,వరకీర్ణయుఁ బుష్పితోరు•వనపంక్తియు నై
కర మొప్పెడు భాగీరథిఁ, బరికింపుము దేవి కనుల • పండువు గాఁగన్.

అర్థములు. వరవర్ణిని = ఉత్తమతరుణీ, నానాద్విజవరకీర్ణయు = అనేక పక్షులచే వ్యాపించినదియు, పుష్పితోరువనపంక్తియు=పుష్పించిన యడవులవరుస గలదియు.

తాత్పర్యము

అనేక పక్షులచే వ్యాపించినదియు, తీరము వెంటనున్న వనము లన్నియు బుష్పించి యుండునదియు నగు భాగీరథిని కన్నులపండువుగాఁ జూడుము.

తే. శృంగిబేరపురం బదె•శ్రీనివాస!, మనలఁ గనవచ్చె గుహుఁ డుండు•మధురవాణి
యూపమాలినియును బువ్వు•యుతవనాళి, యొనసరయువుఁ గంటివే•హంసగమన!

అర్థములు. శ్రీనివాస = కాంతిసంపదకు నివాసస్థానమైనదానా, అదిగో

నదియే శృంగిబేరపురము, అచ్చటనే గుహుఁడు మనలఁ జూడవచ్చెను. అదిగో సరయువు. తీరమున యూప స్తంభములు వరుసగా నున్నవి. తీరములందలి వనములు పుష్పించియున్నవి. చూచితివా?

తా త్ప ర్య ము స్పష్టము.

కం. మాజనకు రాజధానికి, నో జనకతనూభవా! యయోధ్యకు రక్తిన్
 జేజే లొనరింపుమి శుభ, రాజితగతి మరలఁ గనుటయొదవెను మనకున్

అర్థములు. జేజేలు=నమస్కారములు, శుభ రాజితగతిన్=శుభముతోఁ గూడిన విధముగ.

తా త్ప ర్య ము

మా తండ్రియుండిన రాజధానియగు నయోధ్యను మరల క్షేమముగఁ జూడఁ గలిగితిమి. దానికి నమస్కరింపుము. ఆకాశమున నెత్తున నుండుటచే అయోధ్య, గంగా, యమునలు కానవచ్చెను.

చం. అనవుడు వానరావళులు • నాశరభర్తయు లేచి లేచి యా
 జననుతపాండుహర్మ్యచయ • జాలకయున్ సువిశాలకక్ష్యయున్
 ఘనతరవాజివారణని • కాయసమాకులమేఘవాహప
 త్తననిభ నయ్యయోధ్యను ము•దంబునఁ జూచిరి యద్భుతంబుగన్. ౨౫౧

అర్థములు. ఆశరభర్త=రాక్షసరాజు - విభీషణుఁడు, జననుత = ప్రజలచేత స్తోత్రముచేయఁబడిన, పాండు = తెల్లని, హర్మ్యచయజాలక = మేడలసమూహములు కిటికీలుగలది, సువిశాల కక్ష్యయు = మిగుల విశాలమైన తొట్టికట్లు గలదియు, ఘనతర=మిగుల గొప్పవగు, వాజి=గుఱ్ఱములయు, వారణ=ఏనుఁగులయు నికాయ = సమూహములు గలదియు, మేఘవాహ = ఇంద్రుని, పత్తననిభ = పట్టనముతో సమానమైనదియు.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి యదియే యయోధ్యయని చెప్పఁగానే వానరులు విభీషణుఁడు లేచి లేచి, లేచి నిలుచుండి వెనుకటి వారు కూర్చుండుఁడని యడిగఁగా గూర్చుండి పూర్ణముగాఁ జూచుటకై మరల లేచి యని యర్థము. ప్రజలచేవిశేషముగ జెప్పఁకొనఁబడినదియు, తెల్లని మేడలసమూహముల కిటికీలు గలదియు, వెడలుపైన తొట్టికట్లు గలదియు, గొప్ప గుఱ్ఱములు ఏనుఁగులు వీని గుంపులచే నిండినదియు, ఇంద్రుని నగరముతో సమానమైనదియు నగు నయోధ్యను జూచిరి.

## —•{ ౧౨౪-వ సర్గము. శ్రీరాముఁడు భరద్వాజాశ్రమంబునఁ బుష్పకంబు డిగుట. }•—

సీ. పదునాల్గువర్షముల్ పరిపూర్ణమగుడును, బంచమి శ్రీరామ•భద్రవిభుఁడు
 వరవిమానముభర•ద్వాజనాశ్రమమున,డించి యమ్మునినాథుఁ•గాంచి మ్రొక్కి

పురినిసుభిక్షమా? మునిచంద్ర! యెపుడైన, వింటిరా యవ్వార్త•విశ్వవినుత?
మాతల్లులందఱు•మనియున్న వారుగా?, ప్రజలపోషణమున•భరతుఁ డున్నె ?
ఆ. యనుచుఁ దన్ను నడుగు•నంబుజాక్షునిఁజూచి, యాసనమున నుండ•హాన మొనర
మౌనివర్యుఁ డనియె • మనుజేంద్రనందన !, యెల్ల వారు సుఖుల•యింటిలోన.

అర్థములు. పదునాల్గు వర్షముల్ పరిపూర్ణ మగుచును = పదునాల్గు సంవత్సరములు చైత్రశుద్ధ చతుర్థితోఁ బూర్తికాఁగా పంచమినాఁడు - దీని వలన చైత్రశుద్ధ పంచమినాఁడు వనవాసమునకై సీతారామ లక్ష్మణులు బయలు దేఱి రని యేర్పడుచున్నది. ఫాల్గుణ బహుళ చతుర్దశినాఁడు మూలబలము హతము. ఆనాఁడే లక్ష్మణ మూర్ఛ.

ఫాల్గుణ బహుళామావాస్యనాఁడు రావణవధ. ఇది యమావాస్య శేషముగాఁ గల పాడ్యమి. విదియనాఁడు విభీషణ పట్టాభిషేకము. తదియనాఁడు సీతా దేవి పరీక్ష.

చతుర్థినాఁడు అయోధ్యకుఁ బ్రయాణము. త్రోవలోఁ గిష్కింధలోనిలుచుట.

పంచమినాఁడు భరద్వాజాశ్రమ ప్రవేశము. ఇది పదునేనవదినము. మొదటి దినము తక్కినవి యందందు వివరముగ వ్రాయఁబడెను.

## తాత్పర్యము

పదునాల్గుసంవత్సరముల వనవాసదీక్ష పూర్తియైన కారణముచే, చైత్రశుద్ధ పంచమినాఁడు శ్రీరామభద్ర ప్రభువు భరద్వాజాశ్రమమున విమానము దిగి యా మునీశ్వరునిఁజూచి నమస్కరించి, మునీంద్రా! యయోధ్యయందుఁ గాలము చక్కఁగా నున్నదా? కఱవులు నుపద్రవములు లేవుగదా? ఆ సమాచార మెప్పుడైన మీరు వింటిరా! మా తల్లు లందఱు బ్రతికియున్నారా? భరతుఁడు ప్రజలఁ జక్కఁగాఁ బాలించుచున్నాఁడా యని యడుగఁగా పుండరీకాక్షుఁడగు నాయనను జూచి యీయన దాఁగఁబోయి తలారివానియెదుట దాఁగినట్లు నా యెదుటనే యేమియు దెలియని యజ్ఞునివలె నటించుచున్నాఁడే యని నవ్వుకొనుచు మీ తల్లులు మాత్రమే కాదు-పరిచారికలుకూడ నందఱు క్షేమముగా సుఖముగా నున్నారనెను. (నవ్వుటకు వేఱొక కారణ మని చెప్పినను జెప్పవచ్చును. తన్ను విడిచి తల్లులు తమ్ములు సుఖింతురని యెట్లీయన తలఁచెనని నవ్వియుండవచ్చును.)

ఆ. పంకదిగ్ధుఁ డగుచు • భరతుండు జడ లూని, నీదు పాదుకలను•నిత్య మెదుటఁ
బూని నీదు రాక • ఫుల్లలోచనుఁ డయి, వేచియున్నవాఁడు • వీరవర్య !

అర్థములు. పంకదిగ్ధుఁడు = దుమ్ముచేఁ గప్పఁబడినవాఁడు, నేలఁ బండుకొనుటచేతనునంగసంస్కారాదులు లేకపోవుటను అని భావము. దినదినముస్నానము లేని వాఁడని భావముగాదు. స్నానములేనివాఁడని చెప్పినను జెప్పవచ్చును. జడలు ధరించిన వారికి వారుణస్నానము(శిరస్స్నానము) లేదు. గౌణస్నానమే, భరతుఁడు

జడలు ధరించినవాఁ డగుటచే గౌణస్నానమే (కంఠ - మాంత్రిక - మానసిక) చేయుచుండెనని తెలియనగు. అరణ్యకాండమున లక్ష్మణుఁడు 'అపరవేళలన్ సారసనయనుండు గ్రుంకు సరయువునందున్' ౨౬-౨-వ. అని యున్నదే యనిన ఇది లక్ష్మణు నూహయేకాని చూచి చెప్పినదికాదని కాని, యెప్పుడైన నొకప్పుడు తలకు మునిఁగెననికాని సమాధానము చెప్పుకొనవచ్చును. దీక్షితులకు స్నానము లేదు. ఫుల్లలోచనుఁడయి = వికసించిన కన్నులు గలవాఁడయి, కన్నుఱెప్పలు విచ్చి యని భావము.

## తాత్పర్యము

భరతుఁడు దేహసంస్కారములు లేక నేలఁ బండుకొనుచు నారచీరలు కట్టి యున్నవాఁడై దుమ్ముతో నిండిన దేహముతో జడలు ధరించి యెప్పుడు నీ పాదుకల నెదుట నుంచికొని యెప్పుడు నీవు వత్తువాయని తెప్ప లెగఁబట్టుకొని యెదురు చూచుచున్నాఁడు.

సీ. జనకసంప్రీతికై ♦ సర్వంబుఁ బోనాడి, రాజ్యంబు విడిచి ధ♦ర్మం బోకండ
యర్థిమైఁ గైకొని ♦ యడవుల వెతఁబడి, స్త్రీతృతీయుండ వై♦నీతి విడక
నారచీరలు గట్టి ♦ నాకంబు విడిచిన, దేవతవోలె నో♦దేవ! నీవు
కాల్నడ దిరుగుచుఁ ♦ గానలఁ గందమూ,లాదులఁ గడుపుచి♦చ్చార్చికొనుచు
ఆ. వనటపడఁగ నిన్నుఁ ♦ గనఁ గన నక్కటా!, కైకమాట కింత ♦ కష్టపడెనుఁ
గదె మహాత్ముఁడనుచుఁ♦గడుపు భగ్గని మండ, వనరుచుండువాఁడ♦వారిజాక్ష!

అర్థములు. పోనాడి = వదలుకొని, అర్థిమై = ప్రీతితో, స్త్రీతృతీయుండవై = సీత మూఁడవదిగా గలవాఁడవై.

## తాత్పర్యము

తండ్రిని సంతోషపెట్టవలయునని సర్వసుఖములు సర్వబంధువులను వదలినవాఁడవై మీ యిరువురకుఁ దోడు సీతను దీసికొని నీతిమార్గము వదలక నారచీరలు గట్టి స్వర్గమును వదలిన దేవతవలె దేవా! కాలినడఁ దిరుగుచు నడవులందు గడ్డలు వేళ్ళు దిని యాఁకలి చల్లార్చుచు దుఃఖపడుచుండు నిన్నుఁ జూడఁగా జూడఁగా నయ్యో పనికిమాలిన యొక యాఁడుది కైక చెప్పెనని మహాత్ముఁడు కష్టపడుచున్నాఁడే యని కడుపు భగ్గు మనుచుండ దుఃఖించుచుండువాఁడను.

భగవంతుఁడు సాధువుల కోర్కెలెట్లు నెఱవేర్చునో దుష్టుల కోరికల నట్లే నెఱవేర్చునుగాని వారి వారిని వారి వారి కోర్కులఫల మనుభవింపఁ జేయును. ఆ కారణముచేఁ గైక కోర్కె నెఱవేర్చెను. ఆమె శాశ్వతాపకీర్తి సంపాదించుకొనెను. లోకమునఁ గౌసల్యపేరు సుమిత్రపేరు తమ యాఁడుబిడ్డలకుఁ బెట్టుచున్నారుగాని కైక పే రెవరైనఁ బెట్టుచున్నారా? మాయలాఁడులని చెప్పవలసి

వచ్చినపుడు దాని పర్యాయపదముగాఁ గదా కైక పేరు చెప్పుచున్నారు? కావున బాగుపడఁగోరినవారు దుష్టసంకల్పములు చేయరాదు.

కం. హితజనబాంధవయుక్తుని, నతులసమృద్ధార్థుఁ జూచి • హతపరిపంథిన్
నుతగుణ యిప్పుడు నీయెడ, నతిహార్దము గలిగె సజ్జ•నావనదీక్షా! ౨౮ ౨౨

అర్థములు. సజ్జనావన దీక్షా=సాధువుల రక్షించు దీక్షగలవాఁడా, హిత జన బాంధవ యుక్తుని=హితజనులతోను చుట్టములతోను గూడిన వానిని, హితులతోఁ గూడియే యున్నావు. బంధువులతోఁ గూడఁ బోవుచున్నావు. అతుల సమృద్ధ+అర్థున్ = అసమానముగ వృద్ధిచెందిన ధన ప్రయోజనములు గలవానిని, హతపరిపంథిన్ = శత్రువులఁ జంపినవానిని, నుతగుణ=స్తోత్రము చేయఁబడిన గుణములు గలవానిని, అతిహార్దము = మిక్కిలి స్నేహము. ఇదివఱకు హార్దము గల వాఁడను. ఇప్పుడు సాధుజనరక్ష సలిపి సాధుపరిత్రాణమును, హతపరిపంథివై= దుష్కృత వినాశమును జేసి నీ కార్యము నెఱవేర్చుటచే నతిహార్దము కలిగె నని భావము. అవతారప్రయోజనములలో మూఁటిలో రెండు నెఱవేఱినవికదా.

తాత్పర్యము

స్నేహితులతోను బంధువులతోను గూడిన వానిని అసమానముగ నర్థవృద్ధి గల వానిని శత్రువుల వధించిన వానిని హేయరహిత కల్యాణ సహిత గుణములచేఁ బొగడ్త గాంచిన వానిని సాధుజనరక్షాదీక్షా! నిన్నుఁ జూడ మిగుల స్నేహము గలుగుచున్నది.

కం. కానల నీకైన జనస్థానవధాదికసుదుఃఖ • సౌఖ్యము లెల్లన్
నే నెఱుఁగుదు బ్రాహ్మణరక్షానియతిఁ జరింప దండ•కావనిలోనన్. ౨౮ ౨౬

అర్థములు. కానలన్ = అడవులందు – నీకైన = నీకుఁ గలిగిన, జనస్థాన వధ=జనస్థాన రాక్షసులను జంపుట లోనగు వానిచేఁ గలిగిన, సుదుఃఖ సౌఖ్యములు=గొప్పదుఃఖములు, అల్పదుఃఖములు, బ్రాహ్మణ రక్షానియతిన్=బ్రాహ్మణులఁ గాపాడు నియమమునందు.

తాత్పర్యము

దండకారణ్యమందు బ్రాహ్మణుల రక్షింపఁబూనిన నీకుఁ గలిగిన జనస్థాన రాక్షసుల చంపుట మొదలగు బహువిధదుఃఖములు సుఖములు నన్నియు నే నెఱుఁగుదును.

కం. మారీచదర్శనము సీ,తారమణిన్ భవ్యశీల! దశముఖుఁడు బలా
త్కారించి హరించుటయును, దారుణవనిలోఁ గబంధు•దర్శించుటయున్.

తాత్పర్యము

సీతాదేవిని మారీచుఁడు చూచుట, రావణాసురుఁ డామెను బలాత్కారముగ హరించుట, భయంకరమైన యడవిలో వికారు కబంధుని జూచుట.

కం. పంపాభిగమన మర్కజుఁ, బెంపుమెయిన్ నెయ్యుఁ జేత • వృత్రారిసుతుం
జంపుట సీతను వెదకుట, లెంపరి హనుమంతుచేత • దెలియును నాకున్.

తాత్పర్యము స్పష్టము.

కం. వలసేతునిర్మాణము, బలములతో మిత్రపుత్ర • బంధులతోఁ గీ
శులు నీవును రక్కసులన్, బలవైరివిరోధిఁ గలనఁ • బరిమార్చుటయున్.

తాత్పర్యము స్పష్టము.

కం. సురలును బ్రత్యక్షం బై, వరములు నీ కిచ్చుట తపము • బలమున సర్వం
బురుగుణ! యెఱుఁగుదు నేనున్, వరమిచ్చెదఁ గోరుకొనుము • వరధర్మమతీ !.

అర్థములు. బలవైరి విరోధిన్=ఇంద్రశత్రువు, రావణుని.

తాత్పర్యము

దేవతలు ప్రత్యక్షమై నీకు వరములిచ్చుట నేనెఱుఁగుదును. నీ విందున్నాఁడవు, లంకలో జరిగినది నీ కెట్లు తెలియునందువా ? నా తపోబలముచేఁ జూచితిని. నేను నీ కొక వర మిచ్చెదఁ గోరుము.

కం. నిలువుము యీదిన మిచ్చోట ! నలఘుగుణా ! యనిన వల్లె • యని శిరమున నా
పలుకు గ్రహియించి ముదమున, బలభిన్నుతుఁ డిట్లు వేఁడె • వరమున్ మౌనిన్.

తాత్పర్యము

• నీ వీ దిన మిచ్చట నిలుమని చెప్పఁగా ఇంద్రునిచే స్తోత్రము చేయఁబడిన రామచంద్రమూర్తి దాని నంగీకరించి తలవంచి గ్రహించి వర మిట్లు గోరెను.

శా. ఏ కాలంబు నయోధ్య కేగుపథమం • దెందున్ సుధాకల్ప మ
స్తోకం బౌ ఫలసంతతుల్ బలిసి యొం • తో నొప్పుతం జెట్లచా
లో కారుణ్యమయాంతరంగక యనన్ • ద్యోరత్న తేజుం డపాఁ
గా కన్నం బురికేగు తన్నిఖిల మా • ర్గంబుల్ మనోజ్ఞంబు లై. ౨౮ ౨౯

అర్థములు. సుధాకల్పము=అమృతముతో సమానమైనవి, అస్తోకంబు = విశేషించినవి, కారుణ్యమయాంతరంగక = దయతో నిండిన మనస్సుగలవాఁడా, ద్యోరత్న తేజుండు = సూర్యకాంతి గలవాఁడు.

తాత్పర్యము

దయామయా ! అన్ని ఋతువులందు నీ కాల మా కాల మనక తియ్యనిపండ్లు దండిగా అయోధ్యకుఁబోవు మార్గమునందుఁగల చెట్లయందుండవలెను అనికోరఁగా సూర్యకాంతివంటి కాంతిగల యా మునీశ్వరుఁ డట్లులే యగునని వరమిచ్చెను. ఆ వరముబలముచేత నయోధ్యకుఁ బోవు సమస్తమార్గములు మనోహరములై.

కం. ఇగురులఁ బూవులఁ బిందెల, జిగిగలకాయలను బండ్లఁ • జెలఁగుచుఁ దరువుల్
దగుగతిఁ గల్పకకుజముల, పగిదిం దనకారె నర్వ • ఫలసంగతులన్. ౨౯ ౩౦

అర్థములు. కల్పక కుజముల పగిదిన్ = కల్పవృక్షములవలె, సర్వఫల సంగతులన్=అన్నివిధములైన పండ్లతో.

తాత్పర్యము స్పష్టము.

కం. కుసుమములు లేనియగములు, గుసుమంబులఁ బండ్లు లేని • కుజములు పండ్లన్
బసలేదివయవి పసరువఁ, బసమీాఱెను మ్రోడు లెల్లఁ • బచ్చాకులచేన్. ౨౮ ౩౧

తాత్పర్యము

పూలులేనిచెట్లు పూలతోఁ బండ్లులేనిచెట్లు పండ్లతోను పసరులేనివి పసరుతోను మొద్దు లెల్లఁ బచ్చని యాకులతోను సారవంతము లయ్యెను.

కం. ఎటు చూడఁగ మూఁడామడ, యిటు కుజసంతతులు దేవ • వృక్షము లట్లై
పటిమ చెలంగఁగఁ గపు లుద్భటముదమున మెక్కి రెల్ల • తత్ఫలరాజుల్.

తాత్పర్యము

ఏ ప్రక్కఁ జూచినను మూఁడామడ పొడవునఁ జెట్లన్నియుఁ గల్పవృక్షములవలెఁ బటుత్వము గలవి కాఁగా వానరు లధికసంతోషమున ఆ ఫలముల భుజించిరి.

## —• ౧౨౫-వ సర్గము. శ్రీరాముఁడు హనుమంతుని భరతుకడ కనుపుట. •—

కం. అంతట భూమిాతనయా, కాంతుం డొనరింపఁదగిన • కార్యం బెల్లన్
జింతించి యనియె నా హను, మంతుం దనఁ జేరఁ బిలిచి • మహితజవాఢ్యా.

అర్థములు. మహిత జవాఢ్యా = విశేష వేగసంపత్తి గలవాఁడా, ఇట్లు చెప్పుటచే నీవు త్వరగా నయోధ్యకుఁ బొమ్మని భావము.

తాత్పర్యము స్పష్టము.

సీ. నీ వయోధ్యాపురి • నృపతిగృహంబున, నెల్లరు సేమమా • యెఱిఁగి రమ్ము
పగుచోఁ ద్రోవను • శృంగిబేరంబున, గుహుఁడు నిషాదుండు • కూర్మిసఖుఁడు
గలఁ డాతనికి నాదు • పలుకుగా నా సేమ, మంతయుఁ దెలుపు నా • యాత్మసముఁడు
నా ప్రాణమిత్రుండు • నాకుశలంబును, వికతరోగుఁడ నందు • వినిన యంత

ఆ. నిండుముదముఁ గాంచు • నీకు నయోధ్యకుఁ, జనెడిమార్గ మతఁడ • వినుచుఁ బ్రీతి
నంత భరతుఁ జేర • నరిగి నామాటగాఁ, జెప్పవయ్య నాదు • సేమ మెల్ల.

అర్థములు. నృపతిగృహంబునన్ = రాచనగరు నందు, ఆత్మసముఁడు = నాతో సమానుఁడు, నాకు నే నెట్టివాఁడనో నతఁడు నాకు నట్టివాఁడు, నా ప్రాణమిత్రుఁడు=నా ప్రాణములయందు నాకెట్టి ప్రేమగలదో యతనియం దట్టి ప్రేమ గలదు.

తాత్పర్యము

నీ వయోధ్యాపురమున రాచనగళ్ళయందు నందఱు క్షేమముగా నున్నారా తెలిసికొనిరమ్ము పోవునపుడు త్రోవలో శృంగిబేర మను పల్లెయందు నా కాత్మ

సముఁడు నా ప్రాణస్నేహితుఁడు గలఁడు. నాక్షేమమును నే నారోగ్యవంతుఁడనని వినిన మిగుల సంతోషించును. అతనికి నాక్షేమవార్తఁ జెప్పుము. అయోధ్యకుఁ బోవు మార్గ మతఁడు నీకుఁ దెలుపును, ఆ మార్గమునఁబోయి భరతుని సమీపించి నేను జెప్పితినని నాక్షేమముఁ జెప్పుము.

కం. అనుజునితో జనకజతోఁ జనుదెంచినవాఁడ జనకు ♦ శాసన మెల్లన్
బొనరించి కృతార్థుఁడనై, యనుమీ తోలుదోల్తఁ బిడప♦నసురుం డడవిన్.

తాత్పర్యము

మొట్టమొదట తండ్రి యాజ్ఞ నెఱవేర్చి కృతార్థుఁడనై తమ్మునితో సీతతో మరల వచ్చినానని చెప్పుము. ఆ మాటలు విని యాయన ముఖ మెట్లుండునో పరీక్షింపుము. ఆ తరువాత.

కం. సీతను హరించుటయు రవి,జాసునితో మైత్రి వాలి♦సంహారము భూ
జాతాన్వేషణమును నీ,వా తరుణికి నబ్ధిదాఁటి ♦ యట పతిఁ గనుటన్. ౨౦౮

తాత్పర్యము

రావణుఁడు సీతను హరించుట, సుగ్రీవునితో స్నేహముచేయుట, వాలిని జంపుట, సీతను మీరు వెదకుట, సీతకై నీవు సముద్రమును దాఁటుట, లంకలో సీతను జూచుట.

ఆ. డాడిపోక జలధి ♦ దర్శించుటయు సేతు,బంధనంబు నసుర ♦ పతివధంబు
వాసవాజవరుణ♦వరదానమును మహా, దేవుకరుణ జనకు♦దివిని గనుట. ౨౦౯

అర్థములు. డాడిపోక=దండె తిపోవుట — ధాటీ శబ్దభవము డాఁడి.

తాత్పర్యము

మనము దండెత్తిపోవుట సముద్రుని దర్శించుట సేతువు కట్టుట రావణుని జంపుట బ్రహ్మేంద్రవరుణులు వరములిచ్చుట మహాదేవుని దయచే ఆకాశమునఁ దండ్రిని జూచుట.

ఇచ్చట బ్రహ్మేంద్ర వరుణులు వరములిచ్చుట యనుటచే బ్రహ్మవరుణులతో నాలోచించి యింద్రుఁడు రామచంద్రమూర్తికి వరమిచ్చెనని గ్రాహ్యము. ఈ పద్యమందు మహాదేవుఁడు తన తండ్రిని జూపినట్లు చెప్పెనేకాని సేతువు కట్టుటకు ముందుగాని వెనుకఁగాని లింగప్రతిష్ఠ చెప్పలేదు. వాస్తవమై యుండినచో అంతటి గొప్ప విషయము చెప్పకుండునా ?

కం. హరినాయకుతో రాక్షస,వరుతో నారాక నీవు ♦ వచియింపుము యీ
భరతుం డది యంతయు వినఁ, బరికింపుము రొట్టెరూపు ♦ వహియించెడినో.

తాత్పర్యము

వానరరాజుతో రాక్షసరాజుతోడ నేను వచ్చితినని నీవు చెప్పుము. ఇది

యంతయు విని యాతని యాకార మెట్టిదై యుండునో తృప్తి తెలుపునో యతృప్తి తెలుపునో గని పెట్టుము.

ఉ. మార్తుర నెల్లరం దునిమె ♦ మానితశక్తి, జగంబునందు స
 త్కీర్తిని నిల్పె, నిస్తులిత ♦ తేజముఁ గూరె? నిజేప్సితంబులం
 బూర్తి యొనర్చె, మిత్రులను ♦ భూరిబలంబును గూడి పెంపుతో
 వర్తిలవచ్చె రాముఁడని ♦ పల్కుము, పల్కెడివేళ నీవునున్. ౨౦౯

అర్థములు. మార్తురన్=శత్రువులను-నిజేప్సితంబులన్=తనకోరికలను.

తాత్పర్యము

ఇంతవఱకు నేను జెప్పినది నా మాటలుగా నేను చెప్పినట్లు చెప్పుము. ఇఁక నీ మాటలుగా నీవు చెప్పినట్లు నీ మాటలఁ జెప్పుము. గౌరవింపఁదగిన శక్తిచే శత్రువుల నెల్ల సంహరించెను. లోకములోఁ గీర్తిని శాశ్వతముగ నిలిపెను. అసమాన తేజస్సును బొందెను. తన కోరికలన్నియు నెఱవేర్చుకొనెను. స్నేహితులను గొప్పసేనను గూడి సగౌరవముగా వర్తింప రాముఁడు వచ్చెనని చెప్పుము. ఇట్లు నీవు చెప్పు సమయమందు.

ఆ. అతనియింగితములు ♦ నాననకాంతియుఁ, జూపువిధము పలుకు♦చొప్పెఱింగి
 వానిచిత్తవృత్తి♦వర్తన మఖిలంబుఁ, దెలిసి రమ్ము వేగ ♦ తెల్లముగను.

అర్థములు. ఇంగితములు = కన్నులు ముఖముయొక్క వికారములు (మార్పులు), ఆననకాంతియు=ముఖకాంతియు.

తాత్పర్యము

అతని ముఖము ప్రసన్నముగా నుండునా లేక మాడ్చునా? తెల్లబోవునా? ముఖమున కాంతి యెట్లుండును? సంతోషముచే హెచ్చునా? శోకభయ దుఃఖములచే, దగ్గునా? చూపు చిన్నపోవునా? వికాసము నొందునా? మాటలెట్లు మాటలాడును? కంఠస్వర మెట్లుండును? వానినుసన్న నడవడి యెట్టిది? విసుఁగు కనఁబఱుచునా? అసంతుష్టి కనఁబఱుచునా? ఇవియన్నియుఁ జక్కఁగాఁ దెలిసికొని వేగరమ్ము. నీవు త్వరగాఁబొమ్ము. నీవు త్వరగాఁ బోకుండిన నతఁ డగ్నిలోఁ బ్రవేశించును. గడువు నిన్ననే తీఱినది.

'భ్రాతలందఱు భరతుని పాటిగారు' అని యిటువంటి యభిప్రాయముగల వాఁడు, ఇంత సత్వశల్యపరీక్ష చేయనేల ?

భ్రాత లందఱు భరతుని పాటిగా రనునది చిత్రకూటమందు భరతు డుండిన స్థితినిబట్టి చెప్పినమాట. అప్పటికి రాజ్యభోగము, సంపద యెఱుఁగఁడు. అభావమున విరక్తి సుకరము. ఇప్పుడో రాజ్యసంపద గలవాఁడు. 'అఁడుదానిఁగన్న వర్ధంబుఁ గన్నను, బమ్మకైనఁ బుట్టు రిమ్మ తెగులు'అన్నట్లు లిప్పటి మనస్థితి యెట్లున్నదో? నేనింత సేనతో వచ్చితిని గావున నా రాజ్యము నాకు నీయనని భయముచేఁదిరుగఁ

బడఁ డనుకొమ్ము. అతఁడట్లు ప్రత్యక్షముగఁ దిరస్కరింపకుండినను పూర్వము నేను జెప్పినట్లు 'భరతా! రాజ్యము నీవే యేలుకొనుము'అని నేను జెప్పిన నంగీకరించు వాఁడగునేనియు నాకా రాజ్యమువలదు. ఆయనకే యిచ్చెదను. అని తలఁచిపరీక్షింపఁ గోరెను. భరతుని విషయము విశేషవిధిగాని సామాన్యవిధిగాదు. రాజ్యసంపద వశపడిన పిమ్మట దానివదలి మఱియొకనికి సేవకుఁడై వర్తింప నెవ్వఁడంగీకరింపఁడు. ధర్మప్రవర్తన బుద్ధిగల రామచంద్రమూర్తి యిట్టి సందర్భములో సాధువృత్తి యిది యని లోకమునకు బోధింప నీ పరీక్ష చేసెను. ఇది యుత్తమ రాజనీతి.

కం. కరిహయరథసంకుల మై, వరభోగ్యము లమరి వంశ ♦ పారంపర్యం
బరుదైన ధరారాజ్యము, మరగింపక యున్న నెట్టి♦మనుజామనంబున్.

అర్థములు. రామచంద్రమూర్తి పరీక్షాకారణము చెప్పుచున్నాఁడు. కరి హయ రథ సంకులమై = ఏనుఁగులు, గుఱ్ఱములు, రథములతో నిండినదై - వర భోగ్యములు=ఉత్తమమైభోగయోగ్యములైన పదార్థములు, వంశపారంపర్యము= వంశక్రమముగ తాతలు తండ్రి వారివలన లభించిన, అరుదైన = ఇతరులకు లభిం పని, మరగింపక=ఆశ పుట్టింపక.

తాత్పర్యము

ఏనుఁగులతోను గుఱ్ఱములతోను నిండినదై యుత్తమమైన భోగ యోగ్య పదార్థములుగలిగి యుండు వంశపరంపరగాఁ దాతల తండ్రి తరములనుండి వరుసగ వచ్చిన రాజ్య మెట్టివాని మనస్సునందైన నాశ గలిగింపకపోవునా ?

ఇట్టియాశ భరతునకుఁ గలుగలేదు. కావున నతని యుత్తమోత్తమపురుష లక్షణము ప్రకటిత మగుచున్నది. అది లోకమునకుఁ దెలుపుటకే యీ పరీక్ష.

కం. చిరపరిచితిచే శ్రీమద్భరతుఁడు రాజ్యార్థి యగుచు ♦ వలలిన నేమిన్
ధరణీతల మంతయుఁ దా, నిరవుగ రఘునందనుండె♦యేలెడుఁగాతెన్. ౨౦౮౨

అర్థములు. చిరపరిచితిచేన్=దీర్ఘకాలము పదునాలుగు సంవత్సరములు, శ్రీమద్భరతుఁడు = శ్రీమంతుఁడైన భరతుఁడు, రాజ్యార్థి = రాజ్యమునందుఁ గోరిక కలవాఁడు, రఘునందనుండె=అతఁడు రఘువంశమునఁ బుట్టినవాఁడే, నేను రఘువంశమునఁ బుట్టినవాఁడనే, ఆ కారణమున నతఁ డేలిననేమి? నే నేలిన నేమి? ప్రజాపాలనము జరుగుట ప్రధానము. ఆ కార్య మెవఁడు చేసిన నేమి?

తాత్పర్యము

చిరకాలము పరిచయ మగుటచేత శ్రీమంతుఁడగు భరతుఁడు రాజ్యము నందుఁ గోరిక గలవాఁడగునేని నతఁడే రాజ్యమేలును గాక.

చ. నరపతి వానిబుద్ధి వ్యవ ♦ సాయ మెఱింగి ధరాభిలాషి యేన్
బరువున మేము దూరముగ ♦ వచ్చుటకున్ మును మున్న రమ్మనన్

నరవపులన్ ధరించి వడి • నాగజిఘృక్షను మింటఁ బాఱు న
గ్గరుడునిఁబోల్కి- నేగి భుజ•గప్రవరాలయమున్ శుభంబునన్. ౨౦౬

అర్థములు. బుద్ధి వ్యవసాయము=బుద్ధి నిశ్చయము, ధరాభిలాషి యేన్ = భూమియందుఁ గోరికకలవాఁ డయ్యెనా, నరవపువున్=మనుష్యశరీరమును, నాగ జిఘృక్షను = పామును బట్టు కోరికతో, భుజగప్రవరాలయమున్ = పెద్దపాముల కగు స్థానము, ఇది గంగా యమునా సంగమమునకు విశేషణము. విహగేంద్రాలయ మని తీర్థీయపాఠము.

తాత్పర్యము

మంచితనముగానే వాని బుద్ధినిశ్చయ మెట్టిదో తెలిసికొని రాజ్యమందుఁ గోరికగలవాఁడయ్యెనా మేము దూరముగ రాకముందే ఖరువున రమ్ము. రాజ్యాభి లాష లేనివాఁడాయెనా, రావలదు, నీ వందే యుండుము అని చెప్పఁగా మనుష్య రూపము ధరించి పామును బట్టుటకై పోవు గరుత్మంతునివలె వేగముగాఁ బోయి పాములతో నిండి శుభకరమైన.

కం. గంగాయమునా వేణీ, సంగమమున శృంగిబేర • జనపదమందున్
బొంగుచు గుహుఁగని మధువా, క్సంగతి నిట్లనియె హనుమ•సంతోషమునన్.

అర్థములు. గంగాయమునా వేణీసంగమమున=గంగా యమునా నదులు కలయుచోట, జనపదము = ఊరు, గ్రామము, మధువాక్సంగతిన్ = తియ్యని మాటల్ల కూడికతో.

తాత్పర్యము

గంగా యమునా ప్రవాహములు గలయుచోట నుండు శృంగిబేర మను గ్రామమందు తనకంటె భక్తుఁడని చెప్పఁదగినవాని పరమభక్తుని ప్రపన్నుని దర్శనముచేయు లాభము కలిగెఁగదా యని సంతోషముతోఁ బొంగుచు గుహునిఁ జూచి తియ్యనిమాటలతో నతనికి సంతోషముగలుగ నిట్లనియె.

కం. అయ్యా గుహ! రాముఁడు నీ,నెయ్యుఁడు సానుజుఁడు సావ•నీజుఁడు నై నన్
జయ్యన నీ సేమము నే,నిన్నెడ నెఱుఁగంగఁ బనిచెఁ•గృతకృత్యుండై.

అర్థములు. నెయ్యుఁడు = మిత్రుఁడు, సానుజుఁడు=తమ్మునితోఁ గూడిన వాఁడు. సావనీజుఁడు=సీతతోఁ గూడినవాఁడు, చయ్యనన్ = శీఘ్రముగా, కృత కృత్యుండై=చేయువలసిన వనవాసదీక్ష తీర్చినవాఁడై.

తాత్పర్యము

తండ్రీ, గుహా! నీ స్నేహితుఁడు రాముఁడు వనవాసదీక్ష తీర్చి తమ్మునితో సీతతోఁ నీ క్షేమము దెలిసికొనుమని నన్ను శీఘ్రముగఁ బంపెను.

హనుమంతుని ముందుగా గుహ భరతులకొద్దకుఁ బంపుటకుఁ దా నున్నట్టు లుండి వారికి కనఁబడిన సంతోషాతిశయముచే వారి తలలే యెగిరిపోవునో, పిచ్చియే

పట్టిపోవునో యని దాని యావేగము తగ్గింపఁగోరి ముందు వార్తపంపెను. ఆకస్మిక సంతోషాతిశయముచేఁ బ్రాణము పోవుటయుఁ గలదు.

తే. పంచమీరాత్రి మునిభర • ద్వాజతోడఁ, గడపి యాయనచే నాజ్ఞఁ • బడసివచ్చు
కమలలోచను నిప్పుడ • కనెద వనుచుఁ, జెప్పి యుప్పొంగి చనియె నే • చింత లేక.

తాత్పర్యము

పంచమినాఁటిరాత్రి భరద్వాజు నాశ్రమంబునఁ గడపి యాయన యాజ్ఞ పొంది నేఁడిప్పుడే వచ్చుచున్నాఁడు నీవు చూడఁగలవు అని చెప్పి యయోధ్యకుఁ బోవుమార్గము దెలిసికొని సంతోషించి మార్గమున నుండు పదార్థములపై మనస్సు పోనీయక భరతునొద్దకుఁ బోయెను.

ఇచ్చట నొక చిన్నకథ గలదు. భరద్వాజుఁ డీ దినము సీతారామ లక్ష్మణ సుగ్రీవ విభీషణులకే కాక సర్వవానర రాక్షసులకు విందు దండిగ బెట్టెనఁట. అప్పుడు రామచంద్రమూర్తి మునీంద్రా! ఆనాఁడు మే మెంతో యాఁకలిగొని నీయొద్దకురాఁగా కందమూలములిచ్చి పంపితివి. ఇప్పు డిందఱకు విందుపెట్టిన వాఁడవు. అప్పుడు మా ముగ్గురు కన్నము పెట్టలేకపోయితివా? అనెనఁట. అప్పుడు భరద్వాజమహర్షి రామచంద్రా! అప్పుడుగాని ఇప్పుడుగాని నీవ్యక్తిని నేను గౌరవింపలేదు. అగౌరవింపను లేదు. నీ దశనుబట్టి ప్రవర్తించితిని. అప్పుడు నావలె నీవు బికారివే. నేను నీకు విందు పెట్టుటచే నీవు నన్నుఁ జేయఁబోవునది యేమియు లేదు. నీకుఁ బెట్టుటచే నీవలన నాకు రాఁగల లాభము లేదు. అప్పుడు నీకు నిగ్రహ శక్తి లేదు. అనుగ్రహశక్తి లేదు. ఇప్పుడో మహారాజవు. ఏ క్రోధముతో జెప్పినను నా కుటీరముమీఁది కప్పు నిలువదు. ఆశ్రమములోఁ జెట్టు నుండదు. కాఁబట్టి యిప్పటి దశను బూజించితిని. లోకములో నెవరైన దశను బూజించువారే కాని కేవల వ్యక్తిని బూజించువారు లేరు అని చెప్పెను.

సీ. రామతీర్థంబును • రమ్యవాలుకినియు, గోమతీనదియును • భీమసాల
వనమును వేనవే • ల్పల్లెలను నూళ్ళను, గనుచును జనిచని • కపివరుండు
సరగ నందిగ్రామ • సన్నివేశంబునఁ బుత్రులతో నాఁడు • పువ్వుఁబోండ్లు
వృద్ధులు చెలువార • వెలసెడిదానిని, చైత్రరథంబును • సౌరవనము

తే. తోడఁ దులఁదూఁగుదానిని • దోరమైన
కుసుమఫలసంతతులచేత • నెసఁగుదానిఁ
గని యయోధ్యకుఁ గ్రోసుడు • వ్వున రహించు
నాశ్రమం బొందు గాంచి వా • తాత్మజుండు.

అర్థములు. సన్నివేశంబునన్ = గ్రామసమీపంబున నుండు బయలునందు సౌరవనము = నందనము.

తాత్పర్యము

రామతీర్థము-వాలుకినినది-గోమతీనది-భయంకరమైన సాలవనము వేలు

వేలుగ జనులు కలయూళ్ళు వరుసగఁ జూచుచు పోయి పోయి నందిగ్రామము చుట్టు బయళ్ళయందు కొడుకులతో నాడుకొను స్త్రీలతోను ముదుసళ్ళతోను నందమై కుబేరుని చైత్రరథమును ఇంద్రుని నందనమును బోలి విశేషముగ ఫలములు పూవులు గలిగినదైన దానిని జూచి యయోధ్యకు క్రోసుదూరమున నుండు నొక యాశ్రమమును హనుమంతుఁడు చూచెను.

క్రోసు అనఁగా రెండు గడియలలోఁ బోఁదగిన దూరము. నలుబది రెండి మిది నిమిషములలోఁ బోఁదగిన దూరము. కొన్ని దేశముల నిది రెండుమైళ్ళు. కొన్ని దేశముల రెండున్నర మైళ్ళుగా నెన్నఁబడును.

క్రోశలక్షణము జ్యోతిషదర్పణమున నిట్లు చెప్పఁబడెను.

"యవోదరై రంగుళ మష్ట సంఖ్యైః, హస్తోంగుళైష్షడ్గుణితైశ్చతుర్భిః హస్తై శ్చతుర్భి ర్భవతీహ దండః, క్రోశ స్సహస్రద్వితయేన తేషామ్" రెండు వేల బార లొక క్రోసని యేర్పడుచున్నది. ఇప్పటి ఆంగ్లకొలఁత ప్రకారము మైళ్ళ లెక్క చూడఁగా రెండున్నర మైలునకు రెండువేల రెండువందల బార లగుచున్నవి. రెండువందల బారలు వ్యత్యాసము గలదు.

౮ యవలు ౧ అంగుళము, ౨౪ అంగుళములు ౧ దండము ౧ మూర. ౪ దండములు ౧ హస్తము, ౪ మూరలు బార, ౨౦౦౦ హస్తములు ౧ క్రోశము,

## —• హనుమంతుఁడు భరతు నందర్శించుట •—

సీ. అరదు నారలును గృ•ష్ణాజినంబును గట్టి, తపసివేషంబునఁ • దనరువాని
  నన్నఁ బాసిన చింత • ఖిన్నుఁడై దీనుఁడై, మిగుల శుష్కించిన • మేనివాని
  ధూళి గ్రుంగినమేను • వ్రేలాడుజడలు నై, బ్రహ్మర్షి తేజాన • వఱలు వాని
  ఫలమూలభోజనుఁడై • భావితాత్ముండు నై, దాంతుఁ డై నియతిని•దాల్చువాని
తే. నన్నపావలు మున్నిడి • యఖిలజగతి, వర్ణములు నాల్గు తమతమ • పద్ధతులను
  దలఁగకుండఁగ దిటముగ • నిలిచియుండ, నేలువానిని గనియె భూ•పాలసుతుని.

అర్థములు. నారలు=నారచీరలు, కృష్ణాజినము=జింకచర్మము. ఫలమూలభోజనుఁడై, భావితాత్ముండునై.    తాత్పర్యము

ఆ యాశ్రమమందు నారచీరలు గట్టి కృష్ణాజినము నుత్తరీయముగ వేసికొని తపసివేషము, వేసిన వానిని, అన్నను విడిచియున్న చింతచే దుఃఖించుచు చిన్నపోయినవాఁడై మిక్కిలి శుష్కించి యుండువానిని, దుమ్ముచే నిండిన దేహము వ్రేలాడుచున్న జడలుగలవాఁడై బ్రహ్మర్షి కాంతితో నున్నవానిని, పండ్లు వేళ్ళు తినుచు పరమాత్మను ధ్యానించుచు జితేంద్రియుఁడై నియమము వహించిన వానిని, అన్నపాదుక లెదుట నుంచుకొని లోకమునందలి నాలుగువర్ణములవారు వారి వారి పద్ధతులు దొలఁగకుండ యుండునట్లు దిట్టపఱిచి యేలువానిని రాజకుమారుని జూచెను.

తే. కావివస్త్రంబు లూని సౌ◆ఖ్యములఁ బాసి, సచివవర్గంబు సైన్యేశ◆సంచయంబు
శుచిపురోహితతతులును◆శుద్ధమతులు, పౌరులును గొల్వనుండెడి◆భరతుఁగనిరొ.

తాత్పర్యము

కాషాయవస్త్రములు కట్టుకొన్నవాఁడై సౌఖ్యముల వదలి మంత్రి సమూహము సేనానాయకుల సమూహము శుచిమంతులైన పురోహితులును శుద్ధ మనస్సులు గల పౌరులు సేవింప నుండు భరతుని జూచెను. ఇందు రాజసేవకులేకాక కొందఱు పౌరులు కూడఁ గాషాయవస్త్రములు కట్టినట్లు చెప్పఁబడెను. వీరు సన్న్యాసాశ్రమముఁ దీసికొనినవారుగారు. కాని సౌఖ్యములఁ బాసినవారని చెప్పఁబడుటచే నింద్రియసుఖము లన్నియు వదలి వైరాగ్యమందున్న వారని యేర్పడుచున్నది. 'జ్ఞానం సన్న్యాస లక్షణ' మ్మనియు, 'నలింగం ధర్మకారణ' మ్మనియు నుండుటచే సన్న్యాసాశ్రమ స్వీకారము దీసికొనకపోయిన మానసికసన్న్యాసముఁ దీసికొని వైరాగ్యము కలవారై కామ్యకర్మములు మానిరేని వారు సన్న్యాసులే కావున (కామ్యానాం కర్మణాం న్యాసం సన్న్యాసం కవయో విదుః) నట్టి నిజమైన విరాగులు సన్న్యాసివేషము వేయువచ్చునని యేర్పడుచున్నది.

వీ రందఱు రాజ్యకార్యములు కామ్యముగాఁ జేయక రామార్పణబుద్ధితో రామదాస్యముగాఁ జేయుచుండిరని గ్రహింపవగు.

ఏకకాలమందు ముఖ్యపౌరులతోఁ డ నిందుఁ జేరనేల యనిన పదునాలుగు సంవత్సరములగడువు నిన్నటితో ముగిసెను. నేఁడు రామచంద్రమూర్తి రాఁడాయెను. ఈ దినము రాకుండిన నగ్నిలోఁ బ్రవేశించెద నని చెప్పితిని. ఆ ప్రకారమే నేను జేసెద నని భరతుఁడు చెప్పఁగా నీ దిన మంతయుఁ జూడుము. రేపటి యుదయము లోపల నెప్పుడు వచ్చినను నేఁడు వచ్చినట్టు లేకదా. నీవగ్ని బ్రవేశించిన మేమందఱము నీతోడివారమే యని సమాధానము చెప్పుచు మాటలాడు చుండిరనిభావము.

తే. తనువు, గాంచినధర్మమో◆యనఁగఁజాలి, ప్రాలు ధర్మజ్ఞు దరిసించి◆గేలు మొగిచి
వినయగరిమంబు దీపింప ◆ విన్నవించె, గంధవాహతనూజుండు ◆ క్రమఫణితి.

అర్థములు. తనువు=దేహము, గంధవాహతనూజుండు=వాయుపుత్రుఁడు

తాత్పర్యము

ధర్మ మాకారముగొని యుందున్నదా యేమి యన్నట్లుండిన ధర్మజ్ఞుని చూచి ప్రాంజలియై నమస్కరించి వినయాతిశయంబున హనుమంతుఁ డిట్లని వచించెను.

కం. ఏ రాముఁడు దండకలోఁ, జీరాజినధారి యనుచుఁ ◆ జింతించెదవో
యా రాముఁడు నీ సేమము, గారామున వినఁగఁ గోరెఁ ◆ గాకుత్స్థవరా!

అర్థములు. చీరాజినధారి=నారచీరలు కృష్ణాజినములు ధరించినవాఁడు.

తాత్పర్యము

భరతా! నీవే రామచంద్రమూర్తి దండకలో నారచీరలు కృష్ణాజినము

ధరించియున్నాఁడని విచారపడుచున్నాఁడవో యా రామచంద్రమూర్తి నీ క్షేమము తెలిసికొని రమ్మనెను.

సీ. ప్రియము వచించెద ♦ వినుపుము దారుణ, దుఃఖంబు నీ కూర్మి ♦ తోడఁ బుట్టు
రాముని నీ ముహూ ♦ ర్తంబునఁ గాంచెదు, రావణు వధియించి ♦ దేవిఁ బడసి
సౌమిత్రితోఁగూడి ♦ శచితోడి దేవేంద్రు, పగిది నై దేహితోఁ ♦ బరమమిత్ర
కోటితో సేనతోఁ ♦ గొమరార వచ్చుచు, నున్నవాఁ డన నుడి ♦ విన్నమాత్రఁ
ఆ. బరమహర్షమునను ♦ భరతుండు ధరవ్రాలి, మూర్ఛపోయె నంత ♦ మూర్తమునను
లోనఁ దెలివిఁ గూరి ♦ మానవనాయకుం, డాశ్వసించికొని న ♦ యంబు దోలఁక.

తాత్పర్యము

భరతా! నీకు సంతోషకరమైనది చెప్పెదను. నీ వీ భయంకరదుఃఖము వదలిపెట్టుము. నీ యందు ప్రేమగల మీ యన్నను నీ గడియయందే నీవు చూడఁ గలవు. రావణుని జంపి సీతను గ్రహించి లక్ష్మణునితో శచీదేవితోడి యింద్రునివలె సీతాదేవితో నుత్తమమిత్రసమూహముతో సేనతో సంతోషముగ వచ్చుచున్నాఁడు. అనుమాట విన్నంతమాత్రమున నే పట్టరాని సంతోషముచే భరతుఁడు మూర్ఛపోయి నేలమీఁదఁబడి కొంచెము సేపునకుఁ దెప్పిఱిలేచి యాశ్వాసపడిచికొని నయముతో

చం. ప్రియము వచించు వాయుసుతుఁ ♦ బ్రీతిని గౌఁగిటఁ గ్రుచ్చి యశ్రునం
చయముల భూరిబిందువుల ♦ సమ్మతి నాతనిమేను దడ్పి కై
కయిసుతుఁ డిట్లు పల్కెనన ♦ ఘా మనుజుండవో, నిర్జరుండవో
దయగొని నమ్మదం బిడు ను ♦ దంతముఁ జెప్పఁగ వచ్చి తీ క్రియన్. ౨౮౫౩

అర్థములు. నిర్జరుండవో=దేవతవో. ఉదంతము=వార్త.

తాత్పర్యము

సంతోషవార్త చెప్పు హనుమంతుని ప్రేమతోఁ గౌఁగిలించుకొని సంతోష బాష్పబిందువులచే నతని దేహము తడుపుచు భరతుఁ డిట్లనియె. నాయందు దయ యుంచి యీ సంతోషవార్త చెప్ప వచ్చిన నీవు మనుష్యుఁడవా? దేవతవా?

కం. ఈ మాటకుఁగా నూటిని, గ్రామంబుల నూఱువేల ♦ గవుల సతులుగా
శ్రీమహితలఁ గులకన్యల, హైమాంగల భూషితలఁ బ ♦ దార్వుర నిత్తున్.

అర్థములు. గవులు = గోవులు, హైమాంగల = బంగారువంటి దేహ కాంతి గలవారి, భూషితల=సర్వాభరణముల నలంకరించుకొన్న వారిని.

తాత్పర్యము

ఈ సంతోషవార్త నీవు చెప్పితివి గావున నీకు నూఱుగ్రామములు లక్ష గోవులు సాలంకృతలైన బంగారుఛాయగల కులకన్యల గొప్పవంశములఁ బుట్టిన వారిని గానుకగా నిత్తును.

సంతోషవార్త చెప్పినవారిని బహూకరింపవలయునని దీనిచే సూచితము.

కం. అని యద్భుతోపమము రా,మునిరాకన్ విని ప్రహర్ష•మున రఘురాముం
గను తమి పెండియు నిట్లనె, హనుమంతునితోడఁ గుతుక•మాగుబ్బతిలన్.

అర్థములు. అద్భుతోపమము=నిరుపమానము, ఆగుబ్బతిలన్ = అతిశయింపఁగా.

తాత్పర్యము

ఇట్లు చెప్పి యసమానమైన రాముని రాక విని సంతోషాతిశయమున రాముని జూచు కోరికతో హనుమంతునితో నుత్సాహ మతిశయింపఁగా నిట్లనియె.

—•{ ౧౨౬-వ సర్గము. హనుమంతుఁడు భరతునకు శ్రీరామ వృత్తాంత మంతయుఁ దెలుపుట. }•—

కం. ఎన్నోవత్సరములకున్, మున్న రఘూత్తముఁ డరణ్య•ములకుం జనెఁ దా
నిన్నాళ్ళకు బ్రతివిందుగ, మన్నాథునికీర్తనంబు • మరలన్ వింటిన్. ౨౦౫౬

అర్థములు. మన్నాథుని = నా భర్త, నా రక్షకుఁడు.

తాత్పర్యము

ఎన్నియో సంవత్సరములకు ముందు రామచంద్రమూర్తి యడవులకుఁ బోయెను. మరల నిన్నిదినాలకు వీనులవిందుగ నా భర్తయు నా రక్షకుఁడగు నాయనవార్త వినఁగలిగితిని.

కం. తనువునఁ బ్రాణము లుండినఁ, గనుఁగొను నూఱేండ్లకైనఁ•గడు హర్షంబున్
మనుజుం డను సామెత, ము,న్ననుకోనఁగా వింటి నది య•థార్థము చూడన్.

ఇది సీతాదేవి హనుమంతునకుఁ జెప్పినమాట. సుందరకాండము ౨౭౦వ పద్యము.

భరతుఁడు శ్రీరామచంద్రమూర్తిని దన నాథుఁడని చెప్పుటచేతను ఆమె చెప్పిన మాటలే భరతుఁడు చెప్పుటచేతను రామవార్త రాదేని ప్రాణము విడువ సిద్ధపడి యుండుటచేతను భక్తి పారతంత్ర్యములయందు సీతాభరతులు సమాన దశయందున్నారని తెలియనగు.

తాత్పర్యము స్పష్టము.

కం. ఏలా యేదేశంబున, శైలచరావళికి రామ•చంద్రున కెటులో
కో- లభియించెను నెయ్యం, బోలిన్ వినిపింపు సర్వ • ముత్తమచరితా !

తాత్పర్యము

అయ్యా! రామునకు వానరులకు నేమి కారణమున నే దేశమున నేవిధముగ స్నేహము లభించెనో దాని సర్వము వివరింపుము.

కం. నావుడు దర్భాసనమునఁ, బావని కూర్చుండి రామ•భద్రుని చరితన్
దా వినిపించెను సర్వము, త్సామివిభుపుత్రునకు సుజన•సమ్మతమతికిన్. ౨౦౫౮

తాత్పర్యము స్పష్టము.

సీ. మీతల్లి కోరిన ♦ సీతాధినాథుండు, మునివేషం బూని ♦ కాన కరుగఁ
దనయశోకంబున ♦ దశరథుం డీల్గుట, దూతల మి మ్మిందుఁ ♦ దోడితేరఁ
బనుచు టయోధ్యకుఁ♦జనుదెంచి రాజేంద్ర, యుర్వీభరం బూన♦నొల్లమియును
ధర్మనిష్ఠుండవై ♦ తరలి యా చిత్రకూ,టంబున రాము రా♦జ్యంబుఁ గొనఁగ
ఆ. వేఁడుకొనుట భూమి♦విభునాజ్ఞ రాముండు, మీఱమియును బిదప♦మీర లన్న
పాదుకల గ్రహించి♦వచ్చుట మీకెల్ల, నెఱుక యవలిచరిత♦మెల్ల వినుము.

తాత్పర్యము

మీ తల్లికోరిన ప్రకారము మునివేషము ధరించి రామచంద్రమూర్తి యడవికిఁ బోవుటయుఁ బుత్రశోకముచే మీ తండ్రి మరణించుటయు పురోహితులు నిన్ను దూతలఁ బంపి పిలిపించుటయు నీ వయోధ్యకు వచ్చి రాజ్యభారముఁ బూన నిష్టపడకుండుటయు ధర్మమందు స్థిరబుద్ధి గలవాఁడవై చిత్రకూటమునకుఁ బ్రయాణమై పోయి రాజ్యము గ్రహింపుమని నీవు రామచంద్రమూర్తిని బ్రార్థించుటయు తండ్రి యాజ్ఞ రామచంద్రమూర్తి మీఱకుండుటయు పిదప నీవు మీ యన్న పాదుకల గ్రహించి వచ్చుటయు నింతవఱకు మీకుఁ దెలియునుగదా. ఆవలి చరిత్రము చెప్పెద వినుము.

ఇదంతయు భరతాదులకుఁ దెలిసిన వృత్తాంతమే, దాని నేల చెప్పవలెనన రాదు. కథయం దతుకులు లేకుండుటకును, మీ వృత్తాంతము నాకుఁ దెలియునని విశ్వాసము పుట్టించుటకును సీతాదేవితో బ్రశంసించినట్లే ప్రశంసించెను. అక్కడ గుర్తుంగర ముండినది. ఇక్కడ నది లేదు. అనావశ్యకము.

ఉ. మీరల రాకపోకలను ♦ మిక్కుటపు న్వెఱఁ బక్షిసత్త్వసం
వారము కాందిశీక మయి ♦ బమ్మరవోవ వనం బవాససం
చారసమర్హమైన రఘు ♦ సత్తముఁడున్ ద్విపఖడ్గసింహభూ
దారవిహారఘోర మగు ♦ దండకఁ జొచ్చె సతీతృతీయుఁడై. ౨౦౬౧

అర్థములు. వెఱన్ = భయముచే, పక్షిసత్త్వ సంవారము = పక్షులయు మృగములయు సమూహము, కాందిశీకమయి = కలఁత చెంది, బమ్మరవోవ = భ్రమగొని పోవఁగా, వనంబు = అడవి, అవాస సంచార సమర్హము = వసించుటకు సంచరించుటకు యోగ్యముకానిది, ద్విప = ఏనుఁగులయు, ఖడ్గ = ఖడ్గములయు, సింహ = సింహములయు, భూదార = పందులయు, విహార = సంచారముచే, ఘోర=భయంకరమైన, సతీతృతీయుఁడై =భార్యమూఁడవదిగాఁగలవాఁడై.

తాత్పర్యము

మీరు వచ్చిపోవుటచే నడవియందలి మృగములు పక్షులు మిగుల భయపడి భ్రమగొని పోఁగా నా ప్రదేశము వసించుటకు సంచారము సేయుటకు తగినది కాదయ్యెను. ఆ కారణముచేఁ జిత్రకూటము విడిచి ఏనుఁగులు ఖడ్గమృగములు

సింహములు అడవిపందులు సంచరించు భయంకరమైన దండకకు సీతారామలక్ష్మణులు ముగ్గురు పోయిరి.

ఉ. వారలు పోవుచుండ సుర•వైరి విరాధుఁడు భూరినిస్స్వనో
దారుఁడువచ్చి తాఁకుటయు • దైత్యు నధోముఖు నూర్ధ్వబాహుఁగా
ధారిణిఁ బాతిపెట్టిరి ప్ర•తాపధురంధరు లన్నదమ్ము, ల
లవ్వారలు సంజవేళ శర•భంగునిఁ గాంచిరి ముక్తసంగునిన్. ౨౦౬౨

అర్థములు. భూరినిస్స్వనోదారుఁడు= గొప్ప ధ్వనిచే గొప్పవాఁడు, అధోముఖున్ = తలక్రిందుగా నున్నవానిగా, ఊర్ధ్వబాహుఁగాన్ = చేతులు పైకున్నవానిగా, పాతిపెట్టిరి = పూడ్చిరి, 'ప్రక్షిపంతిస్మ' యని సంస్కృతమున బహువచనము ప్రయోగింపఁబడెను. ఆంధ్రమున నొకటి మించిన బహువచనమే. సంస్కృతమున రెంటికిఁ బైబడినఁగాని బహువచనము రాదు. అథమపక్షము ముగ్గురైన నుండవలెను. కావున సంస్కృతమున బహువచన ప్రయోగముచేఁ సీతయుఁ గొంతసాహాయ్యము చేసినని యేర్పడుచున్నది. ముక్తసంగునిన్ =సంగము వదలినవానిని.

తాత్పర్యము

వార లడవిలోఁ బోవుచుండఁగా విరాధుఁడను రాక్షసుఁడు పెద్దగా నఱచుచువచ్చి యెదిరింపఁగా వానిని వారు ముగ్గురు తలక్రిందుగాఁ జేతులు పైఁగా నుండునట్లు గుంతలువేసి పూడ్చిరి. ఆ సంధ్యాకాలమున సర్వసంగములు వదలిన శరభంగుని జూచిరి.

కం. శరభంగుఁడు దివి కరిగిన, వరసత్యపరాక్రముఁడు త•పస్వుల కెల్లన్
గురుమతిఁ గావించి నతుల్, వరనుతుఁడు వసించె నాశ్ర•మస్థానమునన్.

తాత్పర్యము స్పష్టము.

ఉ. రామునిఁ జుప్పనాతి యను•రక్కసి డాసిన రామునాజ్ఞ చే
శ్రీ మహితుండు లక్ష్మణుఁడు • చెక్కెను ముక్కును వీను లంత సం
గ్రామమునన్ రఘూత్తముఁడు • రాక్షసులం బదునాల్గువేవురన్
నాము మడంచె నొక్కఁడ ది•నంబున నాలవభాగమం దొగిన్. ౨౦౬౪

అర్థములు. చుప్పనాతి = శూర్పణఖ, చుప్పనాక యనియు రూపము గలదు, దినంబున నాలవభాగమందున్ = అనఁగా నాలవభాగమందు అపరాహ్ణమున, సాయంసమయమందు = అందు యుద్ధకాల మరణ్యకాండమునఁ జెప్పినట్లు లొకటిన్నర ముహూర్తము తక్కినది యుద్ధసన్నాహనకాలము.

చూడు అరణ్య. ౪౭౦ వ పద్యము.

తాత్పర్యము

రామచంద్రమూర్తిని శూర్పణఖ యను రాక్షసి దుర్బుద్ధియై సమీపింపఁగా రామాజ్ఞచే లక్ష్మణుఁడు దాని ముక్కు చెవులుగోసెను. ఆవల యుద్ధమందు రామ

రామచంద్రమూర్తి యొక్కఁడే పదునాలుగు వేలమంది రాక్షసులను దివసమున నాలవ భాగమున అపరాహ్ణవేళఁ జంపెను.

ఉ. ఈ కరణిన్ మహాబలుల • హీనచరిత్రుల భీమకర్ములన్
ప్రాకటసంయమిప్రకర • బాధకులన్ ఖరముఖ్య రాక్షసా
నీకములన్ వధింపఁగఁ జ • నెన్ ఖల రావణు డాయ వాఁడు సీ
తాకమలాక్షి ముచ్చిలఁగఁ • దా మది నెంచి నిజానుయాయినిన్. ౨౭౬౫

తాత్పర్యము

ఈవిధముగ మహాబలవంతులు నీచపు నడవడిగలవారు భయంకర కార్యములు చేయువారు ఋషిసంఘముల బాధించువారు నగు ఖరుఁడు మొదలగు రాక్షసుల సమూహములను చంపఁగా నాదుష్టురాలు శూర్పణఖ తన యన్నయగు రావణు నొద్దకుఁ బోయెను. వాఁడు రామచంద్రుని నెదిరించి యుద్ధముచేయ భయపడి సీతను దొంగిలించుటకై తన సహాయుఁడగు.

కం. క్రూరుని ఘోరాకారుని, మారీచునిఁ బనిచె రత్న • మయమృగ మై సీ
తారమణి నాశ గొల్పఁగ, నారమ్యమృగంబుఁ జూచి • యవనీసుతయున్.

తాత్పర్యము

క్రూరుని భయంకరాకారముగల వానిని మారీచుని బంపెను. వాఁడు రత్న కాంతులతో నిండిన జింకయై సీతకు నాశ గలిగించెను. మనోహరమైన యాజింకను జూచి సీతాదేవి.

కం. తనపతిఁ గని యాహరిణము, మన యాశ్రమమృగమ యైన • మంజుతరం బై
కనుఁగవవిందై యుండదె, యన రాముఁడు ధనువుఁ బూని•హరిణము వెంటన్.

తాత్పర్యము స్పష్టము.

కం. చని యది పరువిడుచుండఁగ, సునిశితశరమునను దాని • ద్రుక్కించెను రా
మునిపోక యు లక్ష్మణుఁడుం, జనుటం గని పంక్తిముఖుఁడు•సత్వరుఁ డగుచున్.

తాత్పర్యము

పోయి యది పరువెత్తుచుండఁగా పదునైన బాణమున దానిని రామచంద్ర మూర్తి చంపెను. రాముఁడు లక్ష్మణుఁడు నిద్దఱు పోవుట చూచి రావణుఁడు త్వరపడి.

ఇచ్చట లక్ష్మణుఁడు పోయెనని హనుమంతుఁడు చెప్పెనుగాని యేల పోయెనో యాయనకుఁ దెలియదు. సీతారామ లక్ష్మణులు చెప్పినవారుగారు. మఱి యొకరి కది తెలియదు. యోగదృష్టి చూచి వాల్మీకి బయటఁ బెట్టెను.

ఉ. క్రూరపుదుర్గ్రహుంబు దివి • రోహిణి డాసెడుభంగి జానకిం
జేరఁగఁబోయి యాసతిని • చెన్నఁటి భీతిలఁ జేయుచున్ బలా

తాఁ గ్రమునన్ హరించి చనఁ గా వినువీథిని వే జటాయు వన్
పేరిటిగ్రద్ధ జేఁ డెయిది వీఁక మహాసమరం బొనర్చినన్. ౨౮౯

అర్థములు. క్రూరపు దుర్గ్రహంబు=క్రూరమైన దుష్టగ్రహము, అంగారకుఁడు, చన్నటి=దుష్టుఁడు, ఎయిది=కలిసికొని.

తా త్ప ర్య ము

క్రూరమైన చెడ్డగ్రహము రోహిణిని నాకాశమందు సమీపించునట్లు రావణుడు సీతాదేవిని సమీపించి యాదుష్టుఁ డామెను భయపెట్టి బలవంతముగా హరించి యాకాశమునఁ బోవుచుండఁగా జటాయువను గ్రద్దరాజు వానితో గొప్ప యుద్ధము చేయుగా.

ఉ. వానిని ద్రుంచి రక్కసుఁ డవార్యజవంబునఁ బోవుచుండ న
వ్వానిని జానకిం గనిరి పర్వతసన్నిభ లద్రిమూర్ధసం
స్థానులు విస్మితుల్ ప్లవగ నాయకు లాగతిఁ బోయి పోయి లం
కానగరంబునందు నిజ కాంచనవేశ్మమునందు జానకిన్. ౨౯౦

అర్థములు. అవార్యజవంబునన్=అడ్డములేని వేగమున, అద్రిమూర్ధసంస్థానులు = పర్వతశిఖరమందున్నవారు, విస్మితుల్ = ఆశ్చర్యముతోఁ గూడినవారు, నిజకాంచనవేశ్మమునందున్=తన బంగారుమయమైన యింటియందు.

తా త్ప ర్య ము

వానిని జంపి యా రాక్షసుఁడు వారింపరాని వేగమునఁ బోవుచుండఁగా కొండశిఖరమందున్న క్రోఁతు లాశ్చర్యముతో వారిని జూచిరి. వాఁడట్లు పోయి పోయి లంకానగరమందుఁ దన బంగారింటిలో.

కం. దనుజవరుఁ డుంచి యెన్నో, యనునయములు పల్కఁ దృణము నట్లు తెరుకుల్
గొనక యశోకవనంబున, ననయముఁ బడియుండెఁ బ్రాణ వల్లభు చింతన్.

తా త్ప ర్య ము

రాక్షసుఁ డామె నుంచి ఎన్నో యూరడింపుమాటలు చెప్పెనుగాని వాని మాటల నామె గడ్డిపోఁచవలెఁ జూచి లెక్కించినదికాదు. అశోకవనంబునఁ బ్రాణ వల్లభు ధ్యానించుచుఁ బడియుండెను.

సీ. అచట రాముండు మా యామృగమును ద్రుంచి, శ్రమ్మతి నై దేహిఁ గాన లేక
నెమకుచుఁ ద్రిమ్మరి విహతు గృ ధేశుని, దనతండ్రి నెయ్యునిఁ గని తపించి
దహియించి, యడవులఁ దరుణిని వెదకుచు, దశరథసుతులు గో దావరీవ
నాళుల రోయుచు వడవిలోనఁ గబంధు, వధియించి యాతని వాక్యమునను

తే. ఋశ్యమూకంబునందు సు గ్రీవుఁ జూడ, నతఁడు తనయన్న వాలి వి ఖ్యాతబలుఁడు
తన్ను నిరసించు టాదిగా విన్నవించె, వారి కన్యోన్యసంవాద కారణమున.

తా త్ప ర్య ము స్పష్టము.

కం. స్నేహాభివృద్ధి యుగుటకు, బాహుబలోద్ధతిని ద్రుంచి • ప్రథితబలున్ భీ
మాహవమున వాలిని స,న్నాహంబున గీశరాజ్య•నాథుఁగ నిపజన్. ౨౦౮౩

అర్థములు. బాహుబలోద్ధతిని = భుజములయొక్క యతిశయముచే• ప్రసిద్ధికెక్కినబలముగలవాలిని భయంకరయుద్ధమునఁ జంపి సుగ్రీవునివానరరాజుగ.

ఉ. రాముఁ డొసర్పఁగా బ్లవగ•రాజు ధరాసుత రోయఁ గోతులన్
భూమి సమస్తదిక్కులకుఁ • బొల్పుగఁ దాఁ బదికోట్ల పంచె, నా
స్తోమములోన దక్షిణపుఁ • జొప్పును రోయుచు వింధ్యకూటమం
దేమి చరించుచుండ జని•యెన్ గడువంతయు దాన నాత్మలోన్. ౨౦౮౪

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఆతతదుఃఖ మంది మను • నాశయుఁ బాసి మఱుంగుచుండ సం
పాతి జటాయుతమ్ముఁడు క్ష•మాసుత రావణునింట నుంకుటల్
ప్రీతి వచించె, దుఃఖభర•పీడితమిత్రుల శోక మార్పఁగా
స్ఫీతజవోద్ధతిని మకర • వేశ్మము నామడ లొక్కనూఱిటిన్. ౨౦౮౫

అర్థములు. మను నాశయు = బ్రదుకఁ గోరిక, మఱుఁగుచు = దుఃఖం చుచు, దుఃఖభర=దుఃఖాతిశయముచే, పీడిత = బాధింపఁబడిన, మకరవేశ్మము = సముద్రము, స్ఫీతజవోద్ధతి=ప్రసిద్ధవేగాతిశయమున.

తాత్పర్యము

మిగుల దుఃఖించి బ్రదుకుమీఁది యాశవదలి తపించుచుండఁగా జటాయు తమ్ముఁడు సీతాదేవి రావణునింట నున్నదనిచెప్పెను. దుఃఖాతిశయముచేఁ దపించు మిత్రులశోకము చల్లార్ప మిగులవేగముతో నూఱామడ వెడల్పుగల సముద్రమును.

కం. పీకునఁ దరించి లంక న,శోకవనిన్ పీతహర్ష • శుద్ధవ్రత దుః
ఖాకుల మలినాంబరయై, యేకాంతము వసరుచున్న•యింతిం గంటిన్. ౨౦౮౬

తాత్పర్యము

నా పరాక్రమముచేఁ దాఁటి లంకలో నశోకవనములో సంతోషము లేనిదై శుద్ధపాతివ్రత్యమును వ్రతముగ ధరించి దుఃఖముచేఁ గలతపడి మాసినచీర గలదై మిక్కిలి దుఃఖపడు సీతాదేవిని జూచితిని.

ఉ. ఆ నవలాను డాసి తదు•దంతము సర్వ మెఱింగి నే నభి
జ్ఞానముగా రఘూత్తముఁ డొ•సంగిన ముద్రిక నిచ్చి మాఱుగా
జానకి యిచ్చిపట్టిమణి • సమ్మతిఁ గైకొని ధన్యచిత్తతన్
మానవనాథుఁ జేరి మణి•మండన మిచ్చితి నే నభిజ్ఞగన్. ౨౦౮౭

అర్థములు. నవలా = స్త్రీ, తదుదంతము = ఆమె వృత్తాంతంబు, అభి జ్ఞానముగా=గుర్తుగా, అభిజ్ఞ=గుర్తు.

తా త్ప ర్య ము

ఆమెను సమీపించి యామె వృత్తాంత మంతయు దెలిసికొని రామచంద్రమూర్తి నాయొద్ద నిచ్చిన యుంగరమును గుర్తుగా నామెకిచ్చి యామె యిచ్చినమణిని తీసికొని ధన్యుఁడనైతినని రామచంద్రమూర్తియొద్దకుఁబోయి గుర్తుగా దాని నిచ్చితిని.

కం. ప్రాణాంతవేళ వ్యాధిత, మానవుఁ డమృతంబు గ్రోలి ♦ మనినవిధమునన్
జానకివార్తం దెలిపిన, క్ష్మానాథుం డాన చేసె ♦ మనఁగ ధరిత్రిన్. ౨౮౭౮

అర్థములు. ప్రాణాంతవేళ = ప్రాణముపోవుసమయంబున, వ్యాధితమానవుఁడు=రోగియగు మనుష్యుఁడు, గ్రోలి=త్రావి, మనిన=బ్రతికిన.

తా త్ప ర్య ము

ప్రాణముపోవు సమయమున వ్యాధిగల మనుష్యుఁడు అమృతముఁ ద్రావుటచే మరల బ్రతికినట్లు సీతాదేవివార్త తెలుపుటవలన రామచంద్రమూర్తి మరల జీవింప నాశపడెను.

చ. ప్రలయమునన్ జగంబులను ♦ భస్మము సేయఁగఁ బూనువహ్నినా
జలజవిశాలనేత్రుఁ డరి ♦ సంఘములన్ వధియింప నెంచి క్రోఁ
తులబలగంబుతోడఁ జని ♦ తోయధి సేతువుఁ గట్టఁబంచినన్
నలుఁ డటు సేయ రాఘవుఁ డ ♦ నంతబలంబులతోఁ దరించుమున్. ౨౮౭౯

తా త్ప ర్య ము స్పష్టము.

కం. నీలుఁడు చంపెఁ బ్రహస్తునిఁ, గూలిచె ఘటకర్ణు నృపతి ♦ కుంభనుఁ డంతన్
దూలించె రావణాత్మజు! నాలమున సుమిత్రపట్టి ♦ యమృతభంగిన్. ౨౮౮౦

తా త్ప ర్య ము స్పష్టము.

ఉ. రాముఁడు ద్రుంచె రావణు సు ♦ రప్రభుఁడున్ వరుణుండు కాలుఁడున్
గామవిరోధి వాగ్యువతి ♦ కాంతుఁడు బంక్తిరథుండుఁ దోఁపఁగా
శ్రీమహితుండు మౌనిసుర ♦ శేఖరదత్తవరుండు తత్ప్రసా
దామితభూతి వానరస ♦ మాగతుఁడై తమిఁ బుష్పకంబునన్. ౨౮౮౧

అర్థములు. సురప్రభుఁడు=దేవేంద్రుఁడు, కాలుఁడు=యముఁడు, కామవిరోధి = శివుఁడు, వాగ్యువతికాంతుఁడు = బ్రహ్మ, పంక్తిరథుండు = దశరథుఁడు, మౌనిసురశేఖరదత్తవరుండు = మునిసురప్రభు వగు నింద్రునిచే వరములఁ బొందినవాఁడు, తత్ప్రసాద = వారి యనుగ్రహముచే లభించిన, అమితభూతి = విశేషసంపదగల, వానర=వానరులచే, సమాగతుఁడై =కూడినవాఁడై.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి రావణుని వధించెను. అప్పుడు దేవేంద్రుఁడు వరుణుఁడు యముఁడు శివుఁడు బ్రహ్మ దశరథుఁడు చూడవచ్చిరి. జయశ్రీచే గొప్పవాఁడైన రామచంద్రుఁడు మునులచే దేవతలచే వరములు పొందినవాఁడై వారి యనుగ్రహ

మున మరల జీవించిన వానరులతోడఁ గూడి పుష్పక విమానంబున.

కం. తాను వెసఁ దరలి కిష్కిం, ధానగరముఁ జేరి కీశ • తరుణులఁ గొని గం
గానదితటమున నున్నాఁ, డో నృప! మునియాశ్రమమున • నుత్తమభక్తిన్.

తాత్పర్యము స్పష్టము.

లింగప్రతిష్ఠయైన ప్రస్తావన యిచ్చటను లేదు.

తే. ఎల్లి పుష్యయోగంబున • నీవు రాముఁ, గాంచెదవు నిజమనఁ బొంగి • కరము మోడ్చి
యెన్నినాళ్ళకీడేరె నా • యిష్టమనుచు, భరతుఁడు వచించి వీనుల • పండువుగను.

తాత్పర్యము

ఈ దినము పునర్వసు జన్మతార కావునఁ బుష్యము వచ్చుటకై కాచి గంగాతీరమున నున్నాఁడు. రేపు పుష్యము రాఁగానే బయలుదేఱి వచ్చును? నీవు చూడఁగలవు అని చెప్పిన సంతోషించి రెండు చేతులు జోడించి నా కోరిక యెన్ని నాళ్ళకీడేర నని చెవులపండువుగఁ జెప్పి.

—• ౧౩౦-వ సర్గము. శత్రుఘ్నుం డయోధ్యానగరంబు శృంగారింపించుట •—

సీ. శత్రుఘ్నుఁ గనుఁగొని • సకలచైత్యంబుల, దైవతంబుల నెల్లఁ • దగినభంగిఁ
జందనసుమమాల్య • సంతానముల వాద్యముల నరుల్ శుచులయి • పూజసేయ
నియమింపుము పురాణ • నిచయజ్ఞులను స్తుతి, విదులను వాదిత్ర • విజ్ఞజనుల
గణికల వైతాళి • కప్రచయంబుల, భటచయంబుల నెల్లఁ • బరమవేష

తే. ధరుల శ్రీరామచంద్రుని • తారకేంద్ర, తుల్యముఖమును దర్శింపఁ • దూర్ణముగను
బయనమగునట్లు సేయుమా • వలయుతెఱఁగు, కెలనముల నెల్లఁ దీర్పుమా • లలితభంగి.

అర్థములు. చైత్యంబుల దైవతంబులకు = గుళ్ళయందలి దేవతలకు, ఇవి యర్చావిగ్రహములు కావేని యర్థశూన్య మగుచున్నది. లేదా - చైత్యంబులన్ = సామాన్య దేవాలయములను, దైవతంబులన్ = కులదేవతలను, చందనసుమమాల్య = గంధముల చేతను, పూలదండల చేతను, శుచులయి = స్నానములు చేసి మడివస్త్రములు గట్టుకొని, పురాణనిచయజ్ఞులను = వంశపూర్వచరిత్రలఁ దెలిసిన వారిని, సూతులు, స్తుతివిదులను = స్తోత్రము చేయఁ దెలిసినవారిని, వాదిత్రవిజ్ఞులను = మేళములు వాయింపఁ దెలిసినవారిని, గణికలన్ = వేశ్యలను, వైతాళిక ప్రచయంబులు = మేలుకొలుపులు పాడువారు, పరమవేషధరులన్ = అలంకారములు చేసికొన్నవారు, తారకేంద్ర = చంద్రునితో, తుల్య = సమానమైన, ముఖమును = మొగమును, కెలనములన్ = కార్యములను.

తాత్పర్యము

శత్రుఘ్నుని జూచి యన్ని సామాన్యదేవాలయంబులందును, కులదేవతాలయంబులందును, దేవతలనెల్లఁ దగినరీతి గంధములతోఁ బూలదండలతో నలంక

రించి మంగళ వాద్యములతో జనులు స్నానముచేసి మడుగులు కట్టుకొని పూజ సేయునట్లు నియమింపుము. పురాణములు తెలిసిన వారిని వందులను వాద్యములు వాయింపఁ దెలిసినవారిని వేశ్యలను వైతాళికులను భటులను అందఱను మంచి వస్త్రములు కట్టుకొని యలంకరించుకొని శ్రీరామచంద్రమూర్తి చంద్రునివంటి ముఖమును దర్శనముచేయఁ ద్వరగాఁ బ్రయాణమై రండని యేర్పాటు చేయుము. తక్కిన పనులను చేయుము.

దీనివలన స్వామి దర్శనమునకుఁ బోయినపుడు శుచిగాను జక్కని వేషములతోఁ బోవలయునని యేర్పడుచున్నది.

కం. అన శత్రుఘ్నుఁడు వెట్టులఁ, బనివాండ్రుర వేనవేలు • పనిచెను మూర్తం
బున వెస నందిగ్రామంబుననుండి యయోధ్యదనుక • భూమిస్థలమున్.

తాత్పర్యము స్పష్టము.

కం. మిట్టలుఁ బల్లంబులు నొక, మట్టంబుగఁ జేయ నీట • మార్గము లెల్లన్
గట్టింపఁగ, హిమవారిని, నెట్టన చల్లింపఁ గుసుమ • నిచయము లాజల్.

అర్థములు. హిమవారిని=చల్లనీళ్ళను.

తాత్పర్యము స్పష్టము.

చ. తెరువుల నెల్లఁ జల్ల, శుభ • దీధితు లొప్పుపతాక లెల్లెడన్
బురమున నెత్త, భాస్కరుని • పుట్టువువేళకు సర్వవేశ్మముల్
సురుచిరభంగిఁ జిత్రముగ • శోభన మార నలంకరింపఁగా
హరువుగఁ దోరణంబులు ల • తాంతచయంబులు గట్ట వీథులన్. ౨౦౦౭

అర్థములు. పతాకలు=చిన్న ధ్వజములు

తాత్పర్యము

మార్గములందన్నిటఁ జల్లునట్లును మంచి కాంతిగల ధ్వజములు పట్టణమందంతట నెత్తునట్లును సూర్యోదయము వేళకు నిండ్లన్నియు మనోహరముగఁ జిత్రముగ ప్రకాశించునట్లు నలంకరించునట్లు పూలదండల తోరణములు గట్టునట్లును, ఇండ్లను.

కం. పరిమళసంభరసుమభా•స్వరములుగాఁ జేయ నైను • వన్నెల ముగ్గుల్
కర మరుదుగ నిడ నెల్లెడఁ, బురమునఁ జాటింపఁబంచె • బురుహర్షమునన్.

అర్థములు. పరిమళసంభర=విశేషవాసనగల, సుమ=పూలచే, భాస్వరములుగన్=ప్రకాశించునవిగా, నిర్గంధసుమములు గట్టి ప్రయోజనము లేదు. సుగంధము ఆరోగ్యకరము, సంతోషకరము, శుభకరము, ఐదువన్నెల=పసుపు, ఎఱుపు, తెలుపు, నీలము, ఆకుపసరు=ఈ వన్నెలుగల పిండులతో.

తాత్పర్యము

మంచి సువాసన విశేషముగఁ గల పూలతోఁ బ్రకాశింపఁ జేయుటకు, ఐదు వన్నెల ముగ్గులూరినిండఁ బెట్టునట్లును బురమునఁ జాటింపించెను.

—• భరతాదులు శ్రీరాము నెదుర్కొనఁ బోవుట •—

తే. రాజపత్నులు మంత్రులు• బ్రాహ్మణులును, రాచవారును సైన్య
ముల్ • రాజముఖులు
పరమ ముదమున వరుసలు• వరుసలుగను, బయలు దేరిరి మఱువఱు• వాత లేచి.

అర్థములు. వఱువాత=ఉదయమున, ఇది పష్ఠీనాఁటి చరిత్రము.

తాత్పర్యము స్పష్టము.

తే. మంత్రపాలుండు దృష్టి సు•మంత్రుఁ డర్థ, సాధకుండు జయంత వి•జయు లశోక
మంత్రిసిద్ధార్థులను వారు• మహితకనక, లసితకరియుక్తిఁ బయనించి• రసముమించి.

అర్థములు. మహిత కనక లసిత కరి యుక్తిన్ = గొప్పబంగారు భూషణ ములచే నలంకరించిన యేనుఁగులతో, అసము=దర్పము, యశము.

తాత్పర్యము స్పష్టము.

తే. హేమకక్ష్యాన్వితంబు లౌ•నిభములందు, నాఁడుదంతులయందు హ•యాళిపూని
నట్టిరథములఁ గొందఱు • నధిపునాంత, రంగికులు తర్లి పోయిరి • రంగుమీఱి.

అర్థములు. కక్ష్య=ఏనుఁగులకు నడుమునకుఁ గట్టు మోకు, ఇభములు = ఏనుఁగులు, దంతులు=ఏనుఁగులు.

తాత్పర్యము

రాజు నాంతరంగికు లగువారు కొందఱు బంగారు మోకులుగల మగయేనుఁగు లందు, ఆఁడేనుఁగులందు గుఱ్ఱములు కట్టిన రథములందు బయలు దేఱి పోయిరి.

ఆ. ప్రాస శక్తి చంద్ర•హాస యష్ట్యాదులు, ధ్వజపతాకలును ము•దంబుతోడఁ
గేలఁ బూని తురగ•పాళి నారోహించి, భటులతోడ వీర•పటలి తరలె.

అర్థములు. వీరపటలి=వీరుల సమూహము, తరలెన్=పయనించెను.

తాత్పర్యము

వీరులగువారు ఈఁటెలు, శక్తులు, కత్తులు, కట్టెలు మొదలైన యాయుధ ములు, విగ్రహములు వ్రాసిన వ్రాయని టెక్కెములు చేతులఁ బట్టుకొని గుఱ్ఱముల నెక్కి భటులతోడఁ బయనించిరి.

కం. కౌసల్యయును సుమిత్రయు, భాసురగతి మున్నుగాఁగఁ • బంక్తిరథుసతుల్
వాసిగ వారలతో సం,తోసంబున వాహనములఁ • దొరపురక్తిన్. ౨౮౯౩

తాత్పర్యము

దశరథుని భార్యలు కౌసల్యను సుమిత్రను ముందుగా నుంచుకొని వారలతో సంతోషంబుగ వాహనములమీఁదఁ బోయిరి.

తే. ఎక్కిచనిరి నందిగ్రామ•పృథ్విఁ జేరఁ, గైకయునుబోయె నందఱుఁ•గలసి యటకుఁ
బట్టణంబున నున్నట్టి• వారలెల్ల, మురిసి చనిరి నందిగ్రామ•మునకుఁ దమిని.

తాత్పర్యము

'నందిగ్రామపృథ్విఁ జేరఁ గైకయునుబోయె నందఱుఁగలసి, యనుటచేనా మెను

ప్రత్యేకముగ భరతుఁడు పిలువకుండుటచే నామె యంతట నామెయే వేఱుగాఁ బోయి కౌసల్యాసుమిత్రలను గలిసికొనెనని భావము. దీనివలన రాముని ద్వేషించు వారిని నూరు నాడు రోయు హీనపుబ్రతుకు బ్రతుకవలసి వచ్చుననియు, వారు పదుగురిలో సమముగాఁ దిరుగనైన నర్హులు గారనియు నేర్పడుచున్నది.

కైక చేసిన దోషమేమి? ఆమె నా కార్యము చేయ దేవతలుగదా ప్రేరించిన వారు? కావున నింద్యులు దేవతలుగాని కైక కాదుగదా యని సందేహము. దేవతలు ప్రేరించుట సత్యమే. వారు కౌసల్యనుగాని సుమిత్రనుగాని ప్రేరింపక కైకనే యేల ప్రేరింపవలెను? అటువంటి ఘోరకార్యములు చేయుటకుఁ గావలసిన తమోగుణము రజోగుణ మామెయందు విశేషించి యున్నది. తక్కిన వారియందు లేదు. ఒకఁడు కార్యసాధకుఁడు, మంచికార్యముఁ జేయుటకు సాధువగు వానినిగాఁజూచి వానికాఁపని చెప్పును. క్రూరకార్యము చేయవలసివచ్చినపుడు క్రూరునే నియమించును. క్రూరుఁడు సాధుకార్యము చేయఁజాలఁడు. సాధువు క్రూరకార్యము చేయఁజాలఁడు. అటువంటి కార్యమునకు కావలసిన ప్రకృతిగుణ మామెయం దుండుటచే నామెను బ్రేరించిరి. నలమహారా జడవులలో నొంటరిగసంచరించువేళ దేవతలాయనయం దనుగ్రహించి యాయన యీ రూపమున నున్న నెవరీయనను దగ్గఱఁ జేర్పరు, రూపము మాఱి నేని యెవ్వరైన దగ్గఱఁ జేర్తురని తలఁచి యింద్రుఁడు సర్పములను జూచి సర్పములారా! మీకోఱలయందు నమృతము నుంచెదను, మీరు నలమహారాజును గఱవుఁడు. అమృతమువలన నాయన చావఁడు. విషమువలన కురూపి యగును. అట్లయిన నాయన నెవరినైన నాశ్రయించి బ్రదుకునని చెప్పెను. మేమెంత విషజంతువులైనను ఆయన మేలునకే యైనను అటువంటి ధర్మాత్ముని నెట్లు కఱవఁగలమని సర్పములన్నియు నిరాకరించెను. కర్కోటకుఁ డను వాఁ డంగీకరించెను. వాఁడు నలమహారాజును చూడఁగానే యతనికిఁ గఱవ బుద్ధిపుట్టినది కాదు. ఇటువంటివానిని నిష్కారణముగఁ గఱవరాదు, ఏదైన నెపము పెట్టి కఱవవలయునని తలఁచి గాఱుచిచ్చు కల్పించుకొని దానిమధ్యమునఁ దా నుండి నలమహారాజా! కాఱుచిచ్చువలనఁ జావనున్నాను, రక్షింపుమని యఱచెను. ఈమంటలో నతఁడు రాఁడు ఆ నెపమునఁ గఱవ వచ్చునని దాని యాలోచన. ఆమాట వినఁగానే నలుఁడు నిప్పులలో దూఁకి పోయి చూడఁగా పాము కానవచ్చెను. ఇది దుష్టసర్పమే, దీని నెట్లు రక్షింతును? తాఁకఁగానే కఱచునేమో యని భయపడక దాని బట్టుకొని తెచ్చి మంట కీవల నిరపాయస్థలములో విడువఁబోయెను. ఆ పాము తన యాలోచన కొనసాగమిని నాయన దయాగుణమున కాశ్చర్యపడి యెటులైనఁ గఱువవలయునని పట్టుదలగలది కావున నీయనచేతనే కఱవుమనిపించి కఱచెదనని యాలోచించి యయ్యా! యిఁక పది యడుగు లెంచుకొనుచుఁ బోయి విడువు మనెను. ఆయన దానియుద్దేశ మెఱుఁగక సంస్కృతమున నడుగు లెన్నుచుఁబోయి దశ(పది)యని పదియడుగు లెంచి విడిచెను

విడువఁగానే పైఁబడి కఱచెను. ఏల నన్ను నిష్కారణముగఁ గఱచితివని నలుఁడడి గెను. 'దశ' కఱువుమని నీవంటివి. నీ మాటప్రకారము కఱచితిననెను. కోట్లకొలది సర్పములలో నే సర్పము చేయఁజాలనిపని కర్కోటకుఁడు చేసెను.

అట్టులే భారతమున కృష్ణమూర్తి ద్రోణుని చంపుటకై యశ్వత్థామ చచ్చె నని చెప్పుమని యర్జునుని ప్రేరించెను. ధర్మరాజును ప్రేరించెను. అర్జునుఁ డంగీకరిం చినవాఁడు కాఁడు. రాజ్యకాంక్షగల ధర్మరా జంగీకరించి యసత్యమాడెను.

మన గుణములనుబట్టియే మనకు బుద్ధిపుట్టును.

తే. హరులఖురశబ్దములను శ•తాంగ నేమి, నిస్స్వనంబుల దుందుభీ•నినదములను
శంఖరావంబులను జన•స్స్వనముచేత, సంచలించెను మేదినీ•చక్రమెల్ల. ౨౮౯

అర్థములు. హరుల = గుఱ్ఱములయొక్క, ఖురశబ్దములను=గిట్టల ధ్వనుల చేతను, శతాంగనేమి నిస్స్వనంబులన్ =రథచక్రముల యంచుల ధ్వనులచేతను, దుందుభినినదములను = నగారాల ధ్వనులచేతను, శంఖరావంబులను=శంఖముల ధ్వనులచేతను, జనస్స్వనముచేతను = జనుల సందడిచేతను, మేదినీచక్రము = భూ చక్రము సంచలించెను=అదరెను.

తాత్పర్యము

గుఱ్ఱముల గిట్టల ధ్వనులచేతను తేరుల చక్రముల రాపిడుల ధ్వనులచేతను, నగారాలధ్వనులచేతను శంఖధ్వనులచేతను జనుల కోలాహలముచేతను భూమి గడ గడ లాడెను.

మ. పురవాసుల్ వణిజుల్ ద్విజాతివరులుం • బుష్పావళీమోదకో
త్కరహస్తుల్ సచివుల్ దను న్వెనుకొనన్ • ధర్మాత్ముఁ డా రామసో
దరుఁ డా యార్యునిపాదుకల్ శిరమునం • దాల్చెన్ మృదంగధ్వనుల్
వరవందిస్తుతులుం జెలంగఁ దరలెన్ • భ్రాత్రీక్షణాసక్తుఁడై. ౨౯౦

అర్థములు. వణిజుల్ = కోమట్లు, ద్విజాతివరులున్=బ్రాహ్మణశ్రేష్ఠులు, పుష్పావళీమోదక+ఉత్కరహస్తుల్=పూలగుంపుల లడ్డువముల రాసులను చేతఁ గలవారు, సచివుల్=మంత్రులు, రామసోదరుఁడు=భరతుఁడు, భ్రాతృ+ఈక్షణ+ ఆసక్తుఁడై=అన్నను జూచుకోరిక గలవాఁడై.

తాత్పర్యము

భరతుఁడు శ్రీరామచంద్రమూర్తి పాదుకలు శిరమున ధరియించి తనవెనుక బురమున నుండువారు తమ చేతులందు (మూకుండ్లవంటి పాత్రములం దుంచుకొని) పూలు లడ్డువములు నుంచుకొని కోమట్లు బ్రాహ్మణులు మంత్రులు రాఁగా మద్దల ధ్వనులు వందులస్తోత్రము లతిశయింపఁగా నన్నను జూచు కోరికతో బయలుదేఱెను.

మ. ధవళశ్వేతసుమావశోభితము శ్వే•తచ్ఛత్రముం బూని స్వ
ర్ణవిరాజద్వ్యజనంబు లొప్ప మృగచ•ర్మస్థాముఁడై నారలన్

సపురారంగ ధరించి యార్తి నుపవాసశ్లేష్ముఁడై యన్న రా
క విసంగల్గిన సమ్మదంబునఁ జనెం గాకుత్స్థు దర్శింపఁగన్. ౨౦౯౭

అర్థములు. ధరళీశ్వేతసుమోపశోభితము=అందమైన తెల్లని పూలచేతఁ బ్రకాశించునది. శ్వేతచ్ఛత్రమున్ = తెల్లని గొడుగును. స్వర్ణవిరాజత్ వ్యజనంబులు=బంగారుచేఁ బ్రకాశించు వింజామరలు, మృగచర్మత్తర్యముఁడై = జింక చర్మము నుత్తరీయముగాఁ గలవాఁడై, నారలన్ = నారవస్త్రములను, ఉపవాసశ్లేష్ముఁడై=ఉపవాసములచేఁ గృశించినవాఁడై, అన్నరాక విసంగల్గిన సమ్మదంబునన్=అన్న వచ్చుచున్నాఁడన్న సంతోషముచే, ఇట్లు చెప్పుటచే నింతకుముందు సంతోషము లేమి యటుండఁగా ఉపవాసములచేఁ గృశించిన వాఁడగుట యింత దూరము నడచు శక్తియు లేనివాఁడై యుండెనని భావము.

తాత్పర్యము

అందమైన తెల్లని పూవుల హారములచేఁ బ్రకాశించునదియగు తెల్ల గొడుగును బూని, బంగారు పిడులు గల చామరములు (గొడుగు-చామరములు పాదుకల కని గ్రహింపవలయును) జింకచర్మము నుత్తరీయముగఁ గలవాఁడై నారచీరలు గట్టుకొని దుఃఖముచే నుపవాసములచే క్షీణించి యన్న వచ్చుచున్నాఁడన్న సంతోషముతో రామచంద్రమూర్తిని దర్శింపఁబోయెను.

చ. చని భరతుండు నాలుగుదెసల్ పరికించి రఘూత్తముండు రా
మిని హనుమంతుఁ జూచి యను మిత్రకులాభరణంబు రాముఁ డ
య్యనఘుఁడు రాఁడు, వానరుల యందొకఁడేనియుఁ గామరూపి యేఁ
కనుఁగొనఁ లేఁడు, నీ కిపుడు కల్గదుగా కపిలోలబుద్ధియున్ ? ౨౦౯౮

అర్థములు. కపిలోలబుద్ధియున్=క్రోఁతుల చపలచిత్తము.

తాత్పర్యము

ఇట్లు ప్రయాణమై పోయి నాలుగు దిక్కులు చూచి రామచంద్రమూర్తి రాకుండుటచే నిట్లనియె. హనుమంతా! సూర్యవంశాభరణమైన రామచంద్రుఁడు గానవచ్చిన వాఁడు కాఁడు. క్రోఁతులయందైన నొక క్రోఁతియైన కామరూపియై మారువేషము వేసికొనిన వాఁడైనఁ గానరాఁడు. నీ కిపుడు క్రోఁతులకు స్వభావసిద్ధమైన చపలచిత్తము లేదుగదా.

హనుమంతున కీ చీవాట్ల కిది మొదటిసారిగాదు ఇతరవిధముల నెవఁడెంత గొప్పవాఁడైనను జాతిప్రయుక్తనింద తప్పదు.

**వానరులరాక జాగగుటకుఁ గారణంబు హనుమంతుఁడు భరతున కెఱిఁగించుట**

కం. ఈవిధి భరతుఁడు పలికిన, జావగుటకుఁ గారణంబు శ్వసనసుతుం డా
భూవరుతో సత్యబల, శ్రీవరుతో విన్నవించె జిత్తం బలరన్. ౨౦౯౯

అర్థములు. జావు = జాగు, ఆలస్యము, గకారమునకు వకారమువచ్చెను. శ్వసనసుతుండు=వాయుపుత్రుఁడు, సత్యబల శ్రీవరుతో=సత్యము బలము అనెడి శ్రీకి వరుఁడైన వానితో.

### తాత్పర్యము

ఈ ప్రకారము భరతుఁడు చెప్పఁగా రామచంద్రమూర్తి రాక జాగగుటకుఁ గారణము సత్యబల శ్రీవరుఁడైన భరతునితో హనుమంతుఁ డిట్లు చెప్పెను.

సీ. రాజేంద్ర! మునిభర • ద్వాజ ప్రసాదంబు, కతనఁ గుజంబులు • క్రమపుష్ప
ఫలసంయుతంబు లై • భ్రమరనాదితము లై, తేనెలఁ గురిసెడిఁ • దేట లొలుక
వానరు లుండెడి • వసతులు వనము లా, కెఱఁగున నుండఁగ • దేవపతియు
వర మిచ్చి యున్నాఁడు • వరగుణాన్వితముగా, విందు చేసెను ముని • విభుఁడు గాన
తే. దానఁ బ్రొద్దులు పుచ్చెడిఁ • దరుచరాళి, యదియుఁ గాక దె వినవయ్యె • నద్రిచరుల
కలకలంబులు గోమతిఁ • గపులసేన, దాటుచున్న దటంచును • దలఁచువాఁడ.

అర్థములు. ప్రసాదంబుకతనన్=అనుగ్రహము కారణముగ, కుజంబులు=చెట్లు, క్రమ=మనోహరములైన, పుష్పఫలసంయుతంబులై = పూలతోను బండ్లతోను గూడినవై, భ్రమరనాదితములై = తుమ్మెదల ధ్వనులు గలవై, కపులు గోమతిని దాటుచున్నా రనుటచే వానరులు పండ్లకుఁ గాను విమానము దిగి చెట్ల కెగఁబ్రాకుచున్నారని సూచితము. ఆ నిమిత్తముగా జాగైనది.

### తాత్పర్యము

రాజశ్రేష్ఠుఁడా! భరద్వాజ మహాముని వర మనుగ్రహించుటచేత చెట్లన్నియు మనోహరములైన పూలతోను పండ్లతోను గూడినవై తుమ్మెదలు ఝంకారింప తేట తేనెలు గలవై యున్నవి. అదియునుగాక వానరు లుండెడుచోటుల నేల నావిధముగనే యుండునట్లు ఇంద్రుఁడును వరమిచ్చి యున్నాఁడు. అదియును గాక యందఱకు భరద్వాజమహర్షి యష్టమృష్టాన్నముతో సారవంతముగా విందు చేసెను. ఈ కారణములచే వానరులు కడుపులనిండఁ దిని ప్రొద్దులు పుచ్చుచు జాగు చేయుచున్నారు. అదియునుగాక యిదిగో ధ్వని వినవచ్చుచున్నది. వానరులు గోమతిని దాటుచున్నారు అని తలచుచున్నాను.

కం. వాలుకినీ నదివంకను, ధూళులు మిన్నంటెఁ గనుము • తోరంబుగ నా
సాలవనంబును గ్రోఁతులు, సాలుపడం జేయు చున్న • చందము దోఁచెన్.

### తాత్పర్యము

వాలుకినీనది యొండు పక్క విశేషించి దుమ్ము లాకాశము నంటుచున్నవి. క్రోఁతులు సాలవనంబును నేలపాలు చేయుచున్నారని తోఁచెడిని.

మ. అదె దూరంబునఁ జూడుమీ విమలచం • ద్రాభంబు ద్యోయానమున్
హృది నిర్మించెను బ్రహ్మ పుష్పకము దా • నిన్ బాంధవోపేతునిన్

గదనంబందు వధించి రావణుని త్ర్యంబకన్యాయమనోనాథుఁ డీ
య్యదనం గైకొని సూర్యసన్నిభము దివ్యంబున్ మనోవేగమున్. ౨౫౦౭

అర్థములు. విమలచంద్రాభంబు = నిర్మలమైన చంద్రునితో సమానము, ద్యోయానము = విమానము, హృదిన్ = సంకల్పముచే, బాంధవోపేతునిన్ = చుట్టములతోఁ గూడిన వానిని, కదనంబందు = యుద్ధమందు, అదనన్ = సమయమందు, సూర్యసన్నిభము=సూర్యునితో సమానమైనది, మనోవేగము = మనోవేగమువంటి వేగము గలది.

తాత్పర్యము

అదిగో, దూరమందు నాకాశంబున నిర్మలమైన చంద్రమండలమువలెఁ దెల్లగాఁ గానవచ్చుచున్న దానిని జూడుము. దీనిని బ్రహ్మ సంకల్పముచే సృజించెను. యుద్ధమందు రామచంద్రమూర్తి రావణుని బంధువులతోడఁ జంపి యీసమయమందు గ్రహించెను. అది సూర్యకాంతి గలది. దేవతాసంబంధమైనది, మనస్సువలెఁ త్వరగాఁ బోవునది.

కం. ఈరామువాహనంబును, సారససంభవుడుఁ దొలుత ధనాధిపునకున్
గూరిమి నొసంగె నాతని, వైరంబున గెలిచి యసురపతి హరియించెన్.

తాత్పర్యము

ఈ రాముని వాహనంబును బ్రహ్మదేవుఁడు సృజించి కుబేరున కిచ్చెను. దానిని విరోధముచే గెలిచి రావణుఁడు వహించెను.

**విమానమున నున్న శ్రీరామాదుల భరతునకు హనుమంతుఁడు కనఁబఱచుట**

ఆ. అమ్మహానుభావుఁడగుఁ జుమ్ము రాముండు, సీతతోడ ననుఁగు భ్రాతతోడ
నున్నవాఁడు వానరోత్తముఁ డదిగో వి,భీషణుండు వాఁడె ప్రియరతుండు.

తాత్పర్యము

అదిగో, నా కానవచ్చువాఁడే రామచంద్రమూర్తి! సీతతోడను ప్రియసోదరునితోడను నున్నవాఁడు. ఎడమప్రక్క సీతయుఁ గుడిప్రక్క లక్ష్మణుఁ డున్నవాఁడు అదిగో! సుగ్రీవుఁడు, అదిగో! విభీషణుఁడు, వాఁడే ప్రియము చేయుటయందుఁ బ్రీతి గలవాఁడు.

ఉ. రాముఁడు వాఁడె యంచుఁ గపిరాజు వచింపఁగ మిన్ను చూచి యో
షామణి వృద్ధమాణవకసంఘములున్ దరుణాళి వాఁడె శ్రీ
రాముఁడు వాఁడె రాముఁ డదె రాముఁ డటంచును వ్రేలఁ జూపుచున్
స్తోమము లఞ్జలెత్తి కని తోరపురావము నించె నర్మిలిన్. ౨౫౦౫

అర్థములు. మిన్ను = ఆకాశము, యోషామణి = స్త్రీరత్నములయు, వృద్ధ = పెద్దలయు, మాణవక = బాలురయు, సంఘములున్ = గుంపులు, తరుణాళి = వయస్సువారి గుంపులును, అఞ్జలెత్తి = మొక్కలెత్తి, తోరపురావము = విశేషధ్వని, అర్మిలిన్ = ప్రేమతో.

తాత్పర్యము

వాఁడే రాముఁడు అని హనుమంతుఁడు చెప్పఁగానే యాకాశమును జూచి స్త్రీలు ముసలివారు బాలురు వయస్సువారు నందఱు నాకాశమును వ్రేలఁ జూపుచు వాఁడే రాముఁడు! వాఁడే రాముఁడు! అదిగో రాముఁడు! రాముఁ డదోయని గుంపు లందఱు మెడలు పైకెత్తి చూచి ప్రేమతో ధ్వనించిరి.

కం. అంబరమున శీతాంశుని, నింబునఁ గనుమాడ్కి రథము • లిభములు గంధ
ర్వంబులు డిగి నిలిచి విమా,నంబునఁ జెలువొందురాము • నర్మిలి లోకుల్.

అర్థములు. అంబరమునన్ = ఆకాశమున, శీతాంశుని = చంద్రుని, ఇంబునన్=సంతోషముతో, ఇభములు=ఏనుఁగులు,గంధర్వంబులు=గుఱ్ఱములు.

తాత్పర్యము

అంతవఱకు వాహనములమీఁద నున్నవారు రామచంద్రమూర్తి కానరాఁగానే వారి వారి వాహనములు ఏనుఁగులు తేర్లు గుఱ్ఱములు దిగి నేల నిలఁబడి సంతోషమున నాకాశమున చంద్రబింబమును జూచినట్లు చూచిరి.

మ. కని యుల్లాసముఁ బొంది రబ్భరతుఁడుం • గైదామర ల్మోడ్చి భూ
తవయావల్లభసమ్ముఖుం డయి యథా•ర్థ వ్యాహృతిన్ స్వాగతున్
గని దీర్ఘాక్షుని నాదితేయవరసం•కాశున్ విమానస్థుఁ గాం
చనశైలస్థదివాకరుం గొలుచు న • చ్ఛందంబునన్ మ్రొక్కినన్. ౨౯౦౮

• అర్థములు. కైదామరల్ = హస్తపద్మములు, యథార్థవ్యాహృతిన్ = చెప్పినమాట తప్పని వానిని, స్వాగతున్ = క్షేమముగావచ్చినవానిని, దీర్ఘాక్షుని=నిడివి కన్నులు గలవానిని, ఆదితేయవరసంకాశున్=దేవేంద్రునితో సమానుఁడైన వానిని, విమానస్థున్=విమానమం దుండువానిని, కాంచనశైలస్థ= మేరుపర్వత మందుండు, దివాకరున్=సూర్యుని.

తాత్పర్యము

మిగుల సంతోషించిరి. ఆ భరతుఁడు కరకమలములు ముకుళించి రామచంద్రమూర్తికి నెదురుముఖమై పదునాలుగు సంవత్సరములు దాఁటఁగానే వచ్చెద నని చెప్పిన మాటతప్పక వచ్చినవానిని, పెద్దకన్నులవానిని, దేవేంద్రునితో సమానుని, విమానమం దుండువానిని జూచి మేరుపర్వతమందున్న సూర్యునికి నమస్కరించునట్లు నమస్కరింపఁగా.

ఆ. హంసయుక్తమైన • యయ్యనుత్తమవిమా,నంబు ధరణి వ్రాలె • నంబుజాక్షు
నాజ్ఞఁ జేసి భరతుఁ • డద్దానిపై కెక్కి, రాము డాసి వ్రాలి • ప్రణతిసేసె.

అర్థములు. హంసయుక్తమైన=హంసలతోఁ గూడిన, అనుత్తమ=అంతకంటె నుత్తమమైనది లేనిదియగు విమానము.

తాత్పర్యము

హంసలతోడి విమానము నేల వ్రాలెను. రామచంద్రమూర్తి యాజ్ఞాప్రకారము భరతుఁ డద్దానిమీఁద నెక్కి రామచంద్రమూర్తిని సమీపించి నమస్కరించెను.

—• శ్రీరామ భరత సమాగమము. •—

ఉ. క్రన్నన రామచంద్రుఁడును • గైకయిపుత్రకు లేవనెత్తి యె
న్నెన్ని దినాలకో కనిన • యంతయు గాదిలితమ్ము నంకమం
దు న్నెఱప్రీతి నిల్పి కను•దోయి ముదశ్రులు రాలఁ గౌఁగిటన్
మన్ననఁ గ్రుచ్చి తండ్రి! సుఖ•మా యని సాదరవాక్కు లాడినన్. ౨౯౦౯

అర్థములు. క్రన్ననన్ = త్వరగా, అంకమందున్ = తొడమీఁద, నెఱప్రీతి=నిండు సంతోషముతో, ముత్+అశ్రులు=సంతోషబాష్పములు.

తాత్పర్యము

భరతుఁడు నేల వ్రాలి నమస్కరించిన వెంటనే రామచంద్రమూర్తి యాయనను లేవనెత్తి యెన్నాళ్ళకో చూచిన మిక్కిలి గారాబుతమ్ముని తొడమీఁదఁ గూర్చుండబెట్టుకొని యానందబాష్పములు రాలఁగా గౌఁగిలించుకొని నాయనా! సుఖమా యని యాదరముతోఁ బలుకఁగా.

చ. ముదమున లక్ష్మణుం గదిసి • మ్రొక్కెడు నాతనిఁ గౌఁగిలించి యా
కదపడి ప్రీతితోడ నభి • వాదనమున్ ఘటియించి సీతకున్
విదితముగాఁగ స్వాఖ్య కపి•వీరుని భానుసుతున్ విధాత్మజున్
భిమరథరాత్మజాతభవుఁ • బ్రేమునఁ గౌఁగిటఁ జేర్చి వెండియున్. ౨౯౧౦

అర్థములు. ముదమున లక్ష్మణుం గదిసి మ్రొక్కెడు నాతనిఁ గౌఁగిలించి- దీనికి మూలమున 'తతో లక్ష్మణ మాసాద్య' లక్ష్మణు సమీపించి యని మాత్రమే చెప్పఁబడెను. మ్రొక్కఁబోవుచున్న లక్ష్మణుని నివారించి యని పూర్వులు వ్రాసియున్నారు. దేవతా సన్నిధానమందును పెద్దల సన్నిధానమందును దా నెవ్వరి యభివాదనములు గ్రహింపరాదు. కావున రామచంద్రమూర్తి సన్నిధియందుఁ దనకు నభివాదనము చేయఁదలఁచు గల లక్ష్మణుని వలెఁడు వంగక ముందే కౌఁగిలించెనని భావము. అంతియకాని, లక్ష్మణుఁడు భరతునికంటెఁ బెద్దవాఁ డగుటచే నమస్కరింపనివాఁడు కాఁడు. లక్ష్మణునిఁ గౌఁగిలించిన పదపడి సీతాదేవికి నభివాదనముఁ గావించి, 'విదితము గాఁగ స్వాఖ్యయభివాదనమున్ ఘటియించి,' యని యన్వయము, నమస్కరించి పేరుచెప్పి, భరతునికంటె సీతచిన్నదికదా, అట్టి యామెకు భరతుఁ డెట్లు నమస్కరించెనను విషయ మింతకుముందే చర్చింపఁబడెను. 'స్త్రీయోనమస్యావృద్ధాశ్చ వయసా పతిదేవతా, దేవతాప్రతిమాంద్రుష్ట్వా యతించైవ త్రిదండినమ్, నమస్కారం న కుర్యాచ్చే దుపవాసేన శుద్ధ్యతి' వైద్య.

వయస్సుచేఁ బెద్దవారగు స్త్రీలకు, పతిదేవతలైన స్త్రీలకు, దేవతాప్రతిమలకు, త్రిదండి సన్న్యాసులకు నమస్కరింపనివాఁ డొక దిన ముపవసింపవలెను. శుద్ధ పతివ్రతల విషయమునఁ జిన్న పెద్ద విచారములేదు.

భరతుఁడు శత్రుఘ్నుఁడు నత్తలు వచ్చుట చూడఁగానే సీతాదేవి లేచి స్త్రీలతో నిలఁబడియుండె ననియు నచ్చట భరతుఁ డామెకు నమస్కరించె ననియు గ్రాహ్యము.

తాత్పర్యము

సంతోషముతో లక్ష్మణు సవిూపించి యాయనను గాఁగిలించికొని యా పిమ్మట సీతాదేవికి నమస్కరించి యావల సుగ్రీవుని జాంబవంతుని నంగదుని ప్రేమతోఁ గాఁగిలించి.

తే. మైందు ద్వివిదు గంధ • మాదను వాహినీ, నాథు శరభుఁ బనసు • నల గవాక్షు
లను సుషేణు నెనరు • నను గాఁగిలించిన, నంద ఱిష్టరూపు • లగుటఁ జేసి. ౨౧౧

అర్థములు. ఇష్టరూపులు=మనుష్య వేషములు ధరించిన వారగుటచే నని యర్థము, (౨) రూపప్రత్యయముగాఁ దీసికొని శ్రేష్ఠులైన యిష్టులనియుఁ జెప్పవగు.

తాత్పర్యము స్పష్టము.

కం. మానవరూపంబులతో, మానవపతిఁ గుశల మడుగ • మదిఁ బొంగుచు నా
సూనృతరతుఁ డినజుని డెం, దానం గదియించి యనియె • నవ్యప్రీతిన్.

అర్థములు. సూనృతరతుఁడు=సత్యమునందుఁ బ్రీతిగలవాఁడు.

తాత్పర్యము స్పష్టము.

కం. పావన సౌహృదమున సుగ్రీవా ! మిత్రుండు గల్గుఁ • గీడరి గుఱుతౌఁ
గావున మా నలువురిలో, నీ వైదవసోదరుఁడవు • నిర్మలచరితా ! ౨౧౩

అర్థములు. పావన సౌహృదమునన్=నిర్మలమైన స్నేహభావముచే, కీడు అరిగుఱుతు=కీడు చేయుట శత్రులక్షణము.

తాత్పర్యము

సుగ్రీవా! నిర్మలమైన స్నేహము మిత్రుని లక్షణము. కీడు చేయుట శత్రువు లక్షణము. ఆపత్కాలమున నీవు సాహాయ్యము చేసితివి. ఇదివఱకు మేము నలుగురమే సోదరులము, ఇప్పుడు నీతోడ నైదుగుర మైతిమి.

కం. అని యవల విభీషణునిన్, పనయంబుగఁ గాఁగిలించి • సాంత్వోక్తుల నో
యనఘా ! నీ తోడ్పాటున, ననుపమ దుష్కరము సాధ్య • మయ్యెన్ మాకున్.

అర్థములు. సాంత్వోక్తులన్=మంచిమాటలచే.

తాత్పర్యము

ఆవల విభీషణుని మంచిమాటలచేఁ బ్రీతునిఁ జేసి పుణ్యాత్ముఁడా ! నీవు సాహాయ్యము చేయుటచేఁ గదా మే మసాధ్యకార్యము సాధింపఁ గలిగితిమి.

తే. అంతశత్రుఘ్నుఁడును రాము • నంఘ్రులందు, వ్రాలి లక్ష్మణుఁ డనుప్రేమ • భక్తిసీత
పాదకంజాతముల కభి • వాదనంబు, సలిపి నిలిచిన శ్రీరామ • చంద్రుఁ డంత.

తాత్పర్యము స్పష్టము.

తే. వనటపెంపున నవసిన • జననిఁ జేరి, పాదముల సాఁగిలంబడి • పట్టుకొనుచు
నంబ! విననైతి నీమాట • నల్లనాఁడు, నన్ను క్షమియింపు మనుచుఁ బ్ర • సన్నుఁ జేసి.

అర్థములు. వనటపెంపునన్ = దుఃఖాతిశయముచే. నవసిన = కృశించిన

తాత్పర్యము

రామచంద్రమూర్తి తానే దుఃఖముచే కృశించిన తల్లియొద్దకుఁ బోయి పాదముల సాష్టాంగముగఁ బడి నమస్కరించి తల్లీ! యానాఁడు నీవు చెప్పినమాట విననివాఁడ నైతిని, నాతప్పు క్షమింపుము అని యామెను సమాధానపఱిచి.

కం. మ్రొక్కె సుమిత్ర యశస్విని, కక్కైకకుఁ దక్కుఁగల్గు • నంబల కెరఁగెన్
మక్కువఁ బురోహితుం డగు, నక్కంజజనిభ వసిష్ఠు • నంఘ్రుల వ్రాలెన్.

అర్థములు. యశస్వినికి అక్కైకకు = కీర్తిమతి యగు కైకకు, కైకకు యశస్విని యను విశేషణము వాల్మీకి రెండుమూఁడుసార్లు ప్రయోగించినాఁడు. దేవకార్య మామెమూలమున నెఱవేఱుటచేతను రాముఁడు కీర్తిమంతుఁ డగుటకు లోకము రామాయణముచే ధన్యమగుటకు నీమెయేకదా కారణము. మహేశ్వర తీర్థులు దశరథుఁడు నరకమునుండి తరించుట యీయామె మనోదార్ఢ్యముచే నని వ్రాసిరి. ఎరఁగెన్ = నమస్కరించెను, కంజజనిభ = బ్రహ్మతో సమానుఁడైన.

తాత్పర్యము స్పష్టము.

తే. స్వాగతము నీకు శ్రీరామ • భద్రదేవ, సేమమా నీకు మాతండ్రి • రామచంద్ర!
సౌఖ్యమా దీర్ఘబాహు! కౌ • సల్యనందనా! యటంచును పౌర జ • నంబు లెల్ల.

తాత్పర్యము స్పష్టము.

కం. అంజలి ఘటించి పలుకన్, రంజిలి కైమోడ్పు లెల్ల • రమణీయములౌ
కంజంబుల మొగ్గలనం, గంజహితకులుండు గాంచెఁ • గడురాగమునన్.

తాత్పర్యము

చేతులు జోడించి యందఱు పలుకఁగా వారి యంజలులను దామర మొగ్గల వలె రామచంద్రుఁడు ప్రీతితోఁ జూచెను.

ఉ. అంతట రాముపావలు స్వ • యంబుగఁ గైకొని కైకపట్టి భూ
కాంతుని పాదపద్మముల • గాటపుభక్తిని బూన్చి నిల్చి స
త్కాంతుఁడు కేలు మోడిచి నృ • పా! భవదీయము రాజ్యమెల్ల, నే
నింతకుఁ గాచియుండి యిదె • యిప్పుడు క్రమ్మఱ నీకొసంగితిన్. ౫౦

అర్థములు. పావలు = పాదుకలు.

తాత్పర్యము

కుశల ప్రశ్నాద్యనంతరము మంచి మనస్సుగల భరతుఁడు తానే రామచంద్రమూర్తి తన కిచ్చియుండిన బంగారు పాదుకల తీసికొనివచ్చి రామచంద్రుని పాదములకుఁ దొడిగి చేతులు జోడించి రాజేంద్రా! యీ రాజ్య మంతయు నీది. నీవు లేనికాలమున నే నింతవఱకుఁ గావలి కాచియుండి యిప్పుడు నీది నీకు నప్పగించితిని. దశరథుఁడు రాజ్యమును భరతున కిచ్చెను. అయినను భరతుఁడు రాజ్యము తనదని తలఁచినవాఁడు గాఁడు. శ్రీరామచంద్రమూర్తి దనియే తలఁచి యుండెను. ఆ కారణముచే దనయొద్ద నొకఁడు దాఁపనిచ్చిన యిల్లడ సొమ్మువలె నెంచి రామచంద్రమూర్తి యరణ్యముల నుండిన కాలములో దానిఁ జెడకుండ రక్షించి మరల నాయనసొత్తు నాయనకు సమర్పించెను. ఇల్లడ సొమ్మునే సంస్కృతమున న్యాస మందురు. దీనివలన మనము నేర్చుకొనవలసిన దేమి? లోకులు సామాన్యముగ నిది నా తండ్రిసొత్తు, నాతండ్రి నా కిచ్చినాఁడు, ఇది నాది యనుట కలదు. స్థూలవ్యావహారికదృష్టి కిట్లు తోఁచినను బరమార్థదృష్టిఁ జూచితిమేని సర్వము భగవంతునిదే కాని మన దేమియు లేదు ఉన్నదినా లనుభవించుటకే మనకధికారముగాని సొత్తునందు స్వామిత్వము లేదు. సర్వస్వామి భగవంతుఁడే యను జ్ఞానము గలవారమై నాది నాది యను దురభిమానము వదలి మనకు జీవనాధారమున కెంతకావలయునో యంతమాత్రము భగవదుచ్ఛిష్టముగా గ్రహించుచుండవలెనుగాని నేనే స్వామి యని మమకారముచే దుర్వినియోగము చేయరాదు. స్వామికార్యములకు వినియోగింపవచ్చును. ఆయన సొత్తుతో నాయన కార్యములు చేయుటయందే యాక్షేపము లేదు. తదితరవ్యయములు పనికిరావు. తాను తనది యనుకొనునది సర్వము చేతనాచేతనాత్మకము. భగవంతుని దనుకొనుటే భరన్యాసము.

కం. రాజుగ నిన్ను నయోధ్యను, నోజమెయిం జూచుపుణ్య • ముదయించుటచే
నాజన్మం బీడేఱెను, రాజవరా! నేఁడ నేను • రన ధన్యుండన్. ౨౯ ౨౧

అర్థములు. రసన్ = భూమియందు.

తాత్పర్యము స్పష్టము.

కం. కనుమీ కోశాగారము, ధనములు పట్టనము బలము • త్వత్తేజమునన్
జనవర! దశగుణ మయ్యెను, గొనుమీ సకలంబు నీవు • గుణనుత యనుమున్.

అర్థములు. కోశాగారము = ధనముండు భండారము, త్వత్తేజమునన్ = నీ తేజస్సుచే, దశగుణమయ్యెను = నా స్వాధీనమునకు వచ్చినప్పటికంటె నిప్పుడు పదియంతలు హెచ్చియున్నది. వాస్తవ మిట్లుండఁగా భరతరాజ్యమని యపకీర్తి ప్రబలియున్నది. ఇట్టి తెలివితక్కువ మాటలాడుట లోకధర్మము. గుణనుత = గుణముచే స్తోత్రము చేయఁబడువాఁడా.

తాత్పర్యము

రాజేంద్రా ! ధనాగారము ధాన్యాగారము లోనైనవి పరీక్షింపుము. నీతేజస్సు చేతనే, నా సామర్థ్యముచేఁ గాదు- యన్నియుఁ బదియంతలు హెచ్చి యున్నవి. దీనిని సర్వము నీవు గ్రహింపుము.

తే. భ్రాతృవత్సలుఁడైన యా•భరతుఁ జూచి,తమ్ముఁ డన నిట్టివాఁడయి•తనరవలదె
యనుచు నానందబాష్పంబు•లగచరాళి, యవ్విభీషణుఁడును నించె•నంతవిభుఁడు.

తాత్పర్యము

అన్నయందుఁ బ్రీతిగల యా భరతుని జూచి తమ్ముఁ డనిన నిట్టివాఁడుగదా తమ్ముఁడు. అన్నలఁ జంపించి రాజ్యము గోరువారేకాని యిట్టితమ్ములు మనలో లేరుగదాయని వానరులు విభీషణుఁడు నానందబాష్పములు గురియించిరి.

—• శ్రీరాముఁడు భరతునాశ్రమంబునకుఁ బోవుట •—

కం. పరమానందంబున నా,భరతుని నంకమునఁ జేర్చి • పయనించెను సో
దరునాశ్రమభూమికిఁ ద,త్పురయానముతోడ సైన్య•శోభితుఁ డగుచున్.

తాత్పర్యము

నిండుసంతోషముతో భరతుని నొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని రామచంద్ర మూర్తి సేనలతోడ భరతు నాశ్రమము నొద్దకుఁ బోయెను.

కం. నందిగ్రామంబున డిగి, యందఱతోఁ బుష్పకంబు • నవని నిలిచి యా
బృందారక యానంబున, కుం దా సెలవిచ్చె ధనదుఁ•గొలువం జనఁగన్.

తాత్పర్యము

నందిగ్రామమందు నందఱతోడ విమానముదిగి రామచంద్రమూర్తి భూమి మీఁద నిలువఁబడి విమానాధ్యక్షుని బిలిచి యిఁక దీనిని నీవు కుబేరునొద్దకుఁ దీసికొని పొమ్మని చెప్పెను.

చ. అదియును రామునాజ్ఞ నుద•గాశఁ జనెన్ భజియించె శ్రీదునిన్
ముదమున రాముఁడున్ విబుధ•ముఖ్యుఁడు జీవునిఁ గొల్చుమాడ్కి న
వ్విదితపురోహితాంఘ్రులను • వేస్పృశియింపఁగ నిద్ధబుం బృథ
క్పదమలపీఠికాస్థలుల • సమ్మతి నొక్కటఁ గూరుచుండిపన్. ౫౯-౬౦

అర్థములు. ఉదగాశన్ = ఉత్తరదిక్కుగా, శ్రీదునిన్ = కుబేరుని, విబుధముఖ్యుఁడు=ఇంద్రుఁడు, జీవునిన్ = బృహస్పతిని, విదిత పురోహితాంఘ్రు లను=ప్రసిద్ధికెక్కిన యాత్మజ్ఞానము గల వసిష్ఠుని పాదములను.

తాత్పర్యము

రామాజ్ఞచే నవ్విమానము కుబేరునొద్దకుఁబోయి యతని సేవించెను. రామ చంద్రమూర్తియు సంతోషముతో నింద్రుఁడు బృహస్పతిని సేవించునట్లు ప్రసిద్ధ

పురోహితుఁడైన వశిష్ఠు పాదములను దాఁకఁగా విద్దఱును వేఱువేఱు పీఁటలపై గూర్చుండిరి.

—• ౧౨౧-వ సర్గము, భరతుండు రాజ్యంబు శ్రీరామునకు నప్పగించుట •—

చ. శిరమున నంజలిం గదియఁ • జేరిచి కైకయిముద్దుపట్టి శ్రీ
భరతుఁడు సత్యవిక్రముని • భ్రాతను జ్యేష్ఠుని రామభద్రునిన్
వరమతిఁ బల్కె నాజనని • వాక్యముఁ బాలన సేసి రాజ్యమున్
సిరి విడి గౌరవించితివి • శ్రీకరసద్గుణ! యామె నావలన్. —౨౯ ౨౮

తాత్పర్యము

అప్పుడు భరతుఁడు శిరస్సున నంజలి చేర్చి సత్యపరాక్రముఁడు నన్నయగు రామభద్రుని జూచి గొప్ప మనస్సుతో నిట్లనియె. లక్ష్మీకరములైన సద్గుణములు గలవాఁడా! నా తల్లి వాక్యమును పాలించి రాజ్యమును లక్ష్మిని వదలి యామెను గౌరవించితివి. శిరస్సు నంజలిఁ జేర్చుట పూర్వము చిత్రకూటమునఁ జేసిన శరణాగతి జ్ఞప్తికిఁ దెచ్చుటకే. కైకేయి ముద్దుపట్టి యనుటచే కైక మునుపటి దురభిప్రాయము వదలి భరతుని రాజ్యము రామున కిచ్చుట కంగీకరించిన దని సూచన.

రామచంద్రుఁడు విమానముమీఁదఁ జక్కఁగ నయోధ్యకుఁ బోక నంది గ్రామములో దిగుటచే తన సమ్మతి లేక యయోధ్యకుఁ బోవుట కిష్టము లేదని గ్రహించి భరతుఁడు చెప్పుచున్నాఁడు.

కం ఇచ్చితివి రాజ్య మెల్లను, సచ్చరితా! నీవు నాప • శంబున మును నీ
విచ్చినయది యట్టుల నే, నిచ్చెద గ్రహియింపవయ్య • యిప్పుడు మరలన్.

తాత్పర్యము స్పష్టము.

తే. బలిమి నొంటిగ నెంతైన•బరువు మోయు, పోతరించిన పెద్దయాఁ•బోతుబరువు
లేఁగలు భరింపఁజాలని•లీల నేను, నురుభరంబును మోయంగ•నుత్సహింప.

తాత్పర్యము స్పష్టము.

ఉ. భీమజవాతివేగమున • భిన్నము ఛిన్నము నైన సేతువున్
రామ! మహాప్రయత్నమున • రక్ష నొనర్చినఁగాని నిల్వని
ట్లీమహి ఛిద్రరాజ్యము న • హీనతరావరణంబుచేతఁ గా
కేమెయి నిల్పశక్యమగు • నే తలపోయుము మానవేశ్వరా! —౨౯ ౩౦

తాత్పర్యము

భయంకరమైన నీటి యతిశయముచేఁ దెగి తునుకలైన యనకట్టను గడ్డిగాదము జాలువేసి గొప్ప ప్రయత్నము చేసి కట్టినఁగాని నిల్వనట్లు ఛిద్రమైన యీ రాజ్యము మిగుల గొప్పదగు ప్రయత్నముచే రక్షించినఁగాని నిలువ శక్యముగాదు. ఇది నీవే యాలోచింపుము. అట్టైన నిన్నినాళ్ళు నీ వెట్లు పరిపాలించితి వందువా?

ఆ. వాయసంబు హంస • వలెఁబోవ జాలునే? ఖరమువకును హయము • గతియుగలదె?
యట్లు నీదుమార్గ • మనుసరింపఁగను నా, యట్టివాఁడు నేర్చు • నా? మహాత్మ !

తా త్ప ర్య ము

ఏదో కొంత యల్పప్రయత్నముచే రక్షించితినిగాని నీవలె పూర్ణశక్తి కలిగికాదు. కాకి యేదో తనశక్తిగొలఁది పోవఁగలదే కాని హంసవలెఁ బోఁగలదా? గుఱ్ఱము పోవు వేగమున గాడిద పోఁగలదా? అవి రెండు పక్షిజాతిలోఁ జేరినవే. ఇవి రెండును మృగజాతిలోఁ జేరినవే. ఏమి ప్రయోజనము. మన మిరువురము క్షత్రియజాతికిఁ జేరినవారమే. అయిన నేమి? నీ శక్తి నాకు రాఁగలదా? మహాత్ముఁడవు నీవు. అల్పాత్ముఁడను నేను.

సీ. ఒకఁడు ఫలాకాంక్ష • నొక్క వృక్షంబును, నంతర్ని వేశన • మందుఁ బెంప
నదియును బెరిఁగి దు • రారోహ మై మహా, స్కంధంబు శాఖలు • చాలఁ గలిగి
చక్కఁగాఁ బూచియు • నొక్క ఫలంబును, నొసఁగ దేనియుఁ జెట్టు • నాఁటినతఁడు
వ్యర్థయత్నుం డగు • నట్ల నీవును మను, జేంద్ర ! యీ భక్తుల • భృత్యజనుల
ఆ. హితులఁ బ్రోచుపొం కె • నిల నేల వేని యీ, యుపమ నీకె చెల్లు • నరుగు సాధ్య !
చెట్టు నింట నాటి • నట్టివాఁ డగుఁ జుమ్మి. నీదు జనకుఁ డింత • నిజము దేవ !

అర్థములు. ఫలాకాంక్ష=పండ్లమీఁది యాశచే, అంతర్ని వేశనమందు = ఇంటిలోపల, దురారోహమై = మిగులనెత్తై, యెక్కరానిదై, మహాస్కంధము= పెద్దబోదె, వ్యర్థయత్నుండు=కష్టము వృథాపోయినవాఁడు.

తా త్ప ర్య ము

ఒకఁడు ఫల మనుభవింపఁగోరి మంచి ఫలవృక్షమును దనయింటిలోనే విత్తు నాటి పెంచి పెద్దచేసెను. అదియును గోముగాఁ బెరిఁగి యెక్కరానంతదై బోదె కొమ్మలుగలదై, పూవులుదండిగాఁ బూచెనుగాని ఫలించినదికాదు. ఆ చెట్టు పెట్టిన వాఁడు చేసినకష్ట మంతయు వ్యర్థమేకదా. చెట్టుపెట్టినవాఁడు తండ్రి, చెట్టు నీవు, నిన్నుఁ బెంచి పెద్ద చేసిన యీ రాజ్యమును బాలింతు వని యెంతో యాశగల వాఁడై యుండెను. నీ విపు డీ భక్తులను భృత్యులను రక్షింపనొల్లవేని తండ్రియాశ చెఱిచినవాఁడ వగుదువు. నీయునికియు వ్యర్థమే యగును. ఇది సత్యము.

ఈ యుపమానమందుఁ జెట్టుపెట్టినవాఁడు దశరథుఁడు, చెట్టు రామచంద్ర మూర్తి. విత్తు నాటుట పుత్రకామేష్టి మొదలైనవి. పెద్దబోదె, తమ్ములతోఁ గూడి యుండుట. కొమ్మలు సుగ్రీవాది మిత్రులు, పుష్పములు కల్యాణ గుణములు, రాజ్యము పాలింపకుండుట ఫలము లేకపోవుట యని యెఱుఁగవగు.

తే. మట్టమధ్యాహ్నమున దీప్తి • మంతుఁ డైన, ఖరకరునిసూర్యుఁ గన్గొను • కరణినిపుడు
నిన్నుఁ బట్టాభిషిక్తుఁడై • చెన్ను మీఱు, వానిఁగాంచెదరయ్య! భూ • ప్రజలు రామ?

అర్థములు. దీప్తిమంతుఁడు=ప్రకాశించువాఁడు, ఖరకరుని = తీక్ష్ణకిరణములు గల.

తాత్పర్యము

మట్టమధ్యాహ్నమందు మండుచున్న కిరణములుగల సూర్యుని జూచినట్లు పట్టాభిషిక్తుఁడైన నిన్నుఁ బ్రజలు చూతురు. మట్టమధ్యాహ్న సూర్యుని నుపమానముగాఁ జెప్పుటచే, సౌశీల్య-సౌలభ్య - వాత్సల్య - కారుణికత్వ - పరమోదారత్వ-మధురభావము లింతవఱకుఁ బ్రకటించితివి. ఇఁక నీ యైశ్వర్యత్వముఁ బ్రకటింపుమని భావము.

కం. అంచితతూర్యధ్వనులను, గాంచీనూపురకలాప • ఘల్ ఘల్ శింజా
సంచయముల నిఁక మేల్కను, గాంచందగు నీకు మధుర • గానధ్వనులన్.

అర్థములు. అంచితతూర్యధ్వనులను = మనోహరములైన వాద్యధ్వనులచేతను, కాంచీ నూపుర కలాప = ఒడ్డాణములు అందెలు లోనగు భూషణముల యొక్క, ఘల్ ఘల్ శింజాసంచయములన్=ఘలుఘల్లుమను ఆభరణ ధ్వనుల సమూహముచే, మధురగానధ్వనులన్=తియ్యని పాటల ధ్వనులచేతను.

తాత్పర్యము

ఇంతవఱకు నడవులందు ఘోరమృగముల నాదములతో మేలుకొనుచుంటివి. ఇఁక మంగళవాద్యధ్వనులతోను స్త్రీలు ధరించిన మొలనూళ్ళ గజ్జెలయు కాళ్ళయందలియు సొమ్ముల ఘల్లుఘల్లు మను ధ్వనులచేతను మేలుకొలుపుపాటలచేతను నిద్ర మేలుకొనుము.

కం. ఎందాఁక వెలయు వసుమతి, యెందాఁక ఖగోళ ముండు • నెసఁగుచుఁ దిర మై
యందాఁక నీవు ప్రభుతం, బొంది జగంబెల్లఁ గావఁ • బూనుము నెమ్మిన్.

అర్థములు. ఖగోళము=నక్షత్రమండలము.

తాత్పర్యము స్పష్టము.

కం. అనుభరతునివచనంబుల, విని శాత్రవహరుఁడు రామ • విభుఁడును వల్లే
యన భరతుఁడు తనపీఠం, బునకుం జని కూరుచుండెఁ • బొంగుచు మదిలోన్.

అర్థములు. శాత్రవహరుఁడు=శత్రుసంహారకుఁడు, వల్లే=అట్లే కానిమ్మని, పొంగుచున్=నాకోరిక నెఱవేఱెను ధన్యుఁడనైతిని అని సంతోషముచేనుప్పొంగుచు.

తాత్పర్యము స్పష్టము.

—• శ్రీరామాదులు జడలు విడుచుట •—

సీ. అంత శత్రుఘ్నుని • యానతి సుఖకరుల్, శ్మశ్రువర్ధకశా • చణులు వచ్చి
కాకుత్స్థునకు క్షుర • కర్మంబుఁ దీర్చిన, భరతుండు దొలుత న • వ్వల సుమిత్ర
పట్టి సుగ్రీవుండు • పదపడి రాక్షస, నాయకుం డోలి స్నా • నంబు సేయ
జడలు చిక్కుఁడలించి • స్నాతుఁడై చిత్రమా, ల్యానులేపముల మ • హార్హవసన

తే. ములను గై సేసికొని శ్రీల♦ వెలుఁగుచుండు, రాముసకును ద్రిలోకాభి♦ రామునకును
లలితలక్ష్మీకుఁడైన శ్రీ♦లక్ష్మణునకుఁ దొడిగె మణిభూషణములు శ♦త్రుఘ్నుఁ డెలమి.

అర్థములు. సుఖకరుల్ = సుఖముగాఁ బనిచేయువారు, శ్మశ్రువర్ధన కళాచణులు=మీసములు కత్తిరించు విద్యయందు నేర్పరులు, క్షత్రియులకు మీసముల కత్తిరింపు మాత్రమే కాని శిరఃక్షౌరము లేదు.

లక్ష్మణునకు భరతునకు కూడఁ గావలసియుండుటచే శ్మశ్రువర్ధన కళాచణులని బహువచన ప్రయోగము. క్షురకర్మంబు = క్షౌరము, చిత్రమాల్యానులేపనములు = చిత్రములైన పూలదండలు గంధము లోనైన పూఁతలు, మహార్హ వసనములు=మిగుల విలువగల వస్త్రములు, కై సేసికొని = అలంకరించుకొని, లోకాభిరామునకును=మూఁడు లోకములకును మనోజ్ఞమైనవాఁడు, లలిత=మనోజ్ఞమైన లక్ష్మీకుఁడు=ఐశ్వర్యసంపత్తిగలవాఁడు.

తాత్పర్యము

అంతట శత్రుఘ్నుని యాజ్ఞప్రకారము సుఖముగాఁ బనిచేయు మీసములఁ గత్తిరించు నేర్పుగలవారు వచ్చి రామునకు లక్ష్మణభరతులకు మీసములు కత్తిరించి గడ్డములు క్షౌరముచేసిరి. అవల వారు స్నానము చేసిన పిమ్మట సుగ్రీవ విభీషణులు స్నానము చేసిరి. శ్రీరామచంద్రమూర్తి వెంట్రుకలు చిక్కులు దీసి స్నానముచేసి పూలదండలు చందనాదులు వెలగల వస్త్రములు ధరించి సింగారించుకొని శ్రీమంతుఁడై త్రిలోకాభిరాముఁడై యుండ రామునకును లక్ష్మణునకును శత్రుఘ్నుఁడు మంచి యాభరణములు దొడిగెను.

కం. కైసేసి రంత సీతకు భాసురగతి దశరథేశు♦పత్నులు కడు సం
తోసంబునఁ దామే నా,నాసుసచిరలీల లెనఁగ ♦ నవ్యతరముగన్. ౫౧౩

అర్థములు. కై సేసిరి = అలంకరించిరి, తామె = పరిచారికల సంపక, నవ్యతరముగన్=మిగుల మనోహరముగ.

తాత్పర్యము

అంతట దశరథుని భార్యలు తామే సంతోషముతో నానావిధముల సందముగ మనోహరముగ సీతకు నలంకరించిరి.

కం. సుతలాలస కౌసల్యా,సతి ముదమున యత్నమునను ♦ సకలవనచరీ
తతులకు సింగారించెను, హితగతి భూషావళుల న♦నేకవిధములన్. ౫౧౪

అర్థములు. సుతలాలస = కుమారుని కీర్తియందుఁ గోరిక గలది, వనచరీతతులకున్=ఆఁడుక్రోఁతుల గుంపులకు.

తాత్పర్యము

కుమారుని కీర్తియందు విశేషకాంక్ష గల కౌసల్య తానే వానర స్త్రీలకందఱకు సొమ్ములు చీరలు నిచ్చి యలంకరించెను.

## —• శ్రీరాముఁడు అయోధ్యకుఁ బ్రయాణ మగుట. •—

సీ. అంత శత్రుఘ్న వా•క్యమున సుమంత్రుండు, సర్వాంక శోభన•సహిత మగుచు
అర్కమండలనిభం • బయి దివ్య మగు తేరి, సజ్జీకృతముఁ జేసి • సరగఁ దేర
నాజానుబాహు కం • జాయతలోచనుఁ, డిద్ధవిక్రముఁ డందు • నెక్కె తరలె
స్నాతులై కుండలో • పేతులై దివ్యసం, కాశవస్త్రంబులఁ • గ్రాలి చనిరి
ఆ. యమరనాథతేజు • లైన సుగ్రీవుండు, మారుతాత్మజుండు • మహిమ వెలయ
రాముురథము వెంట • రమణీయభూషణ, వార దివ్యకాశ • పత్రధరలు.

అర్థములు. సర్వాంకశోభనసహితము=సమస్త చిహ్నముల కాంతితోఁ గూడినది, అర్కమండలనిభంబు=సూర్యమండలముతో సమానము, సజ్జీకృతము= సిద్ధము, సరగన్ = శీఘ్రముగ, తేరన్ = తీసికొని రాఁగా, ఆజానుబాహు = మోఁకాటి వఱకు చేతులు గలవాఁడు, బాహు వృద్ధాదులలోఁ జేరినది కావున డుజ్ రాలేదు. కంజాయతలోచనుఁడు = కమలములవలె దీర్ఘములైన కన్నులు గలవాఁడు, ఇద్ధవిక్రముఁడు=ప్రసిద్ధికెక్కిన పరాక్రమముగలవాఁడు స్నాతులై = స్నానము చేసినవారై, కుండలోపేతులై=కుండలములతోఁ గూడినవారై, దివ్య సంకాశ వస్త్రంబులన్ = దేవతల వస్త్రములతో సమానములైన వస్త్రములు ధరించినవారు, అమరనాథతేజులు = ఇంద్రునివంటి తేజస్సుగలవారు, రమణీయ భూషణవార=మనోహరములైన యాభరణ సమూహములను, కాశపత్ర=కమ్మలను, ధరలు=ధరించిన స్త్రీలు.

### తాత్పర్యము

ఇట్లందఱు నలంకరించుకొన్న పిమ్మట శత్రుఘ్నుఁడు చెప్పిన ప్రకారము ధ్వజాది సమస్త చిహ్నములతోఁ బ్రకాశించునదియై సూర్యమండలముతో సమానముగఁ బ్రకాశించు దివ్యరథమును సిద్ధముచేసి సుమంత్రుడు తీసికొని శీఘ్రముగ రాఁగా ఆజానుబాహువు కమలనేత్రుఁడు ప్రసిద్ధబలుఁడు నగు రామచంద్ర మూర్తి దానినెక్కి పయనించెను. ఆరథము వెంట నింద్రసమానులైన సుగ్రీవుఁడు హనుమంతుఁడు స్నానములుచేసి కుండలములు ధరించి దివ్యవస్త్రంబులు గట్టి పయనించిరి. అందమైన భూషణములు దివ్యములైన కమ్మలు ధరించిన స్త్రీలు.

కం. వానరసతు లంద ఆయో, ధ్యానగరముఁ జూచుతమిని • దరలిరి జనక
క్ష్మానేతృతనయతో డెం, దానన్ మురియుచు నితాంత•నవ్యోత్సుకలై.

అర్థములు. జనకక్ష్మానేతృతనయతో=జనకరాజపుత్రికతో, డెందానన్= హృదయమందు, నితాంత = మిక్కిలి, నవ్య = క్రొత్తదగు, ఉత్సుకలై = కోరిక గలవారై.

### తాత్పర్యము

సుగ్రీవుని భార్యలు ఆమెకు సంబంధించినవారు అయోధ్యానగరముఁ జూచు కోరికతో జానకీదేవితోడ నిండుసంతోషముతో క్రొత్తకోరికలు గలవారై.

'సుగ్రీవ పత్న్యః' అని సుగ్రీవునికి బహుభార్య లున్నట్లు బహువచనము ప్రయోగింపఁబడెను. సుగ్రీవునకు భార్య లిరువురే - తారయు రుమయు, బహువచన ప్రయోగముచే వారలతోడివారు పరిచారికలు - ఇతర ముఖ్యస్త్రీల నని యర్థము.

కం. సంతసమున రామ స్త్రీ, సంతతి ద్రుక్కింగ భరతు ♦ క్షయమున మదిలో
సంతాపింతురు నీ స్నుష, లెంతో చింతింపు దీని ♦ కెయ్యది తెరువో.

అయోధ్య ౧౯౬ పద్యము.

ఇచ్చట రామస్త్రీ సంతతి యని, నీ స్నుషలని చెప్పినపుడు సంబంధము గల వారి నెట్లు గ్రహింపవలయునో యట్లే యిచ్చట గ్రహింపవలెను. రామభరతులేక పత్నీ వ్రతులు, సుగ్రీవుఁడు ద్విభార్యుఁడు.

సీ. మున్నె మున్న యయోధ్య♦పురికేగి దశరథు,మంత్రు లశోక సు♦మంత్రి విజయు
లను వారలు పురోధ♦సునిఁ గూడి యోజింప రామాభివృద్ధికిఁ ♦ బ్రజలవృద్ధి
కమ్మంత్రు లిల్లని ♦ రయ్య జయార్హుఁ డో, నా మహా♦భావుని♦రామచంద్రు
మంగళపూర్వక ♦ మహితాభిషేకార్థ, మెల్లను దీర్పుఁడీ ♦ యిప్పు డనుచుఁ
తే. చెప్పి శ్రీరామచంద్రు దర్శించుపొంటఁ,బురము వెలువడివచ్చి రా♦భూనుతుండు
హరితసైంధవయుతరథ♦మందు నింద్రు, చెన్ను దోఁపఁగ స్యందనా♦సీనుఁడగుచు.

అర్థములు. హరితసైంధవయుతరథమందున్ = ఆకుపచ్చరంగుగల గుఱ్ఱములఁ గట్టిన తేరియందు, స్యందనాసీనుఁడు=రథమందుఁ గూర్చుండిన వాఁడు.

తాత్పర్యము

ఇచ్చట రామాదులు ప్రయాణమునకు సిద్ధపడుచుండఁగా అశోకుఁడు సుమంత్రుఁడు, విజయుఁడు నను వారు ముందుముందుగ నయోధ్యకుఁ బోయి పురోహితుఁ డగు వసిష్ఠునితో నేమిచేసిన రామచంద్రమూర్తికి ప్రజలకు క్షేమము గలుగును దానిఁజెప్పుఁడని యోజించి యిట్లనిరి. అయ్యా! మహానుభావుఁడైన రామచంద్రమూర్తికి శుభకరముగఁ బట్టాభిషేకమునకుఁ గావలసిన వన్నియు నిప్పుడే సిద్ధముచేసికొనుఁడు అని చెప్పి మరల రామచంద్రమూర్తిని దర్శించు కొఱకు పురము వెలువడివచ్చిరి. ఆ రామచంద్రభూపాలుఁడు ఆకుపచ్చ గుఱ్ఱముల గట్టిన తేరియందు నింద్రునివలె నెక్కెను.

మంత్రులు పురోహితులే కాక ముందు సర్వము సిద్ధముచేయుటకై దశరథు భార్యలు కూడ నయోధ్యకు ముందే పోయిరి.

కం. తుఱఁగలి గొను పమ్మదమున, మెఱవడి చన మేనిరుచులు♦మీఱఁ బ్రజలకున్
మిఱుమిట్లు గొలుపఁ బురమునఁ బఱ వగు నగరంబు రాచ♦బాటల వెంటన్.

అర్థములు. తుఱఁగలిగొను=అతిశయించు, పఱవగు = విశాలములైన.

తాత్పర్యము

అతిశయించిన సంతోషముతోఁ దన దేహకాంతులు ప్రజలకు మిఱుమిట్లు గొలుపఁగా రామచంద్రమూర్తి పురమున విశాలములైన రాచబాటల వెంబడి మెఱవడిపోయెను.

సీ. పగ్గముల్ చేఁబూని • భరతుండు నొగ నుండి, సారథ్య మొనరించె • సమ్మదమున
బరమాతపత్రంబుఁ • బట్టె శత్రుఘ్నుండు, సౌమిత్రి రాము శీ • ర్షంబుపైన
వ్యజనంబు వీచుచు • సవ్యహస్తంబున, వెలిచామరముఁ బూని • నిలచియుండెఁ
బృథుకీర్తి యైన వి • భీషణుండు మఱొండు, చంద్రసన్నిభ మూనెఁ • జామరంబు
ఆ. నింగి పిక్కటిల్ల • నిలిచిన వేల్పుల, మునుల మధురనుతులు • వినఁగ నయ్యె
శైలనిభము గజము • శత్రుంజయంబును, నినతనూజుఁ డెక్కి • యొలమి వచ్చె.

అర్థములు. పరమాతపత్రంబు=ఉత్తమమైన ఛత్రమును, వ్యజనంబు = విసనకఱ్ఱ, అన్యహస్తంబునన్ = రెండవచేత, వెలిచామరము = తెల్లని వింజామరము, తక్కినవారందఱు నొక్కొక్క పదార్థమునే తీసికొనిరి. లక్ష్మణుఁడు 'సర్వము నేన తీర్చెదన్'అని చెప్పినవాఁడు కావున అన్ని సేవలు తానే చేయవలయు నని యాశగలవాఁడయ్యు చేతులు రెండే కావున రెండుచేతుల రెండువస్తువులు గ్రహించెను. పృథుకీర్తి=గొప్ప కీర్తిగలవాఁడు, నిజమైన భక్తుఁడు అను కీర్తి, నింగి = ఆకాశము, పిక్కటిల్లన్ = క్రిక్కిఱియఁగ.

తాత్పర్యము

భరతుఁడు తాను నొగయందుఁ గూర్చుండి పగ్గములు చేతఁబట్టుకొని సారథ్యము చేసెను. ఉత్తమశ్వేతచ్ఛత్రము శత్రుఘ్నుఁడు పట్టఁగా రామచంద్రు శిరస్సుమీఁద విసనకఱ్ఱతోఁ గుడిచేత విసరుచు నెడమచేత లక్ష్మణుఁడు వింజామరముపట్టుకొని నిలువఁబడియుండఁగా విస్తారకీర్తిశాలియగు విభీషణుఁడు చంద్రుని వంటి తెల్లని వింజామరము పట్టుకొనఁగా నాకాశము క్రిక్కిఱియునట్లు నిలువఁబడిన దేవతలయు మునులయు నింపైన స్తోత్రవాక్యములు వినఁబడుచుండెను. కొండవలె నెత్తైన శత్రుంజయం బను నేనుఁగు నెక్కి సుగ్రీవుఁడు బయలుదేఱి వచ్చెను.

కం. మానుషవిగ్రహధరులై, నానాభూషలు ధరించి • నగచరవర్యుల్
మానుగ నొక తొమ్మిదివే, లేనుంగులమీఁదఁ జనిరి • హృదయము లలరన్.

అర్థములు. మానుషవిగ్రహధరులై=మనుష్యాకారము ధరించినవారై, నగచరవర్యుల్=వానరశ్రేష్ఠులు.

తాత్పర్యము స్పష్టము.

కం. దుందుభుల పేరుటులివులు, దందడి శంఖములు మ్రోఁత • తతఘనరవముల్
దొందడిగాఁ బురుషోత్తముఁ, డందంబుగఁ జనియెఁ గనుచు • హర్మ్యశ్రేణుల్.

అర్థములు. దుందుభుల = నగారాల, పేరుటులివులు=పేరు+ఉలివులు =

పెద్దధ్వనులు, తత=వీణాదులయు, ఘన = తాలాదులయు, రవముల్ = ధ్వనులు, దొండడి=విస్తారము, హర్మ్యశ్రేణుల్=మేడల వరుసలు.

తాత్పర్యము

నగారాధ్వనులు, శంఖముల మ్రోతలు, వీణెలయు తాలములయు ధ్వనులు విస్తరింపఁగా రామచంద్రమూర్తి మేడల వరుసలఁ జూచుచుఁ బోయెను.

చ. అతిరథుఁడై నవాని నిజ♦హారిశరీరవిరాజమానునిన్
 క్షితిజనకోటిసంవృతుని ♦ శ్రీరఘురామునిఁ గాంచి మంత్రులం
 చితగతిఁ జేరి దీవనలఁ ♦ జిత్తె మిగుర్పఁగఁ జేయ నాతఁడా
 హిత సచివాళులం దనిపె ♦ నెంతయు గౌరవ మూను వాక్కులన్. ౯౮౭

అర్థములు. అతిరథుఁడు = ఎందఱితోనైన యుద్ధము చేయఁ గలవానిని, నిజ=తన, హారి = మనోహరమైన, శరీర = దేహకాంతిచే, విరాజమానునిన్ = ప్రకాశించువానిని, క్షితిజనకోటిసంవృతునిన్ = భూజన సమూహముచేఁ జుట్టఁబడిన వానిని, హితసచివాళులన్ = మేలుగోరు మంత్రులను, సహాయులను, తనిపెన్ = తృప్తిపడిన వారిఁ జేసెను.

తాత్పర్యము

అతిరథుఁడై తన దేహకాంతులచే ప్రకాశించుచు భూజన సమూహముచే జుట్టఁబడియుండువానిని రామచంద్రమూర్తిని మంత్రులు సమీపించి దీవనల సంతోషింపఁ జేయఁగా తన మేలు గోరు నా సహాయులను మంచిమాటలచే తృప్తులఁ గావించెను.

ఉ. వారును దమ్ములం గలసి ♦ వచ్చిరి వెంబడి; నిట్లమాత్యులుం
 బౌరులు ధారణీసురులు ♦ ప్రాభవ మొప్ప తనున్ భజింప నీ
 తారమణుండు నిస్తులని ♦ శాంతరుచిన్ వెలుఁగొందెఁ దారకా
 వారముతోడఁ బొల్చు హిమ ♦ భానునకున్ సరియీడుఁ జూపునై. ౯౮౮

తాత్పర్యము

వారుకూడఁ దమ్ములతోఁ గలసికొని వెంబడి వచ్చిరి. ఇట్లమాత్యులు పుర జనులు బ్రాహ్మణులు తన్ను సేవింపఁగా రామచంద్రమూర్తి అసమానమై విశేష మైన కాంతిచే నక్షత్రములచే నొప్పుచున్న చంద్రునకు సమానుఁడై ప్రకాశించెను.

సీ. మంగళవాద్యముల్ ♦ రంగుగ మొరయంగఁ, దాళహస్తులు జాణ♦తనము దెలుప
 స్వస్తికపాణులు ♦ సామర్థ్యమును జూప, గీతముల్ కొందఱు ♦ కేరలి పాడ
 వాద్యంబు లన్నియు ♦ హృద్యంబులై మ్రోఁగ, నడజోదు లెల్లరుఁ ♦ గడిమి మెఱయఁ
 బచ్చనయక్షతల్ ♦ పట్టి బ్రాహ్మణులును, గన్నెలు గోవులు ♦ మున్ను చనఁగ
ఆ. సచివతతికి రామ♦ చంద్రుండు వచియించె, నినజుతోడిచెల్మి ♦ యనిలతనయు
 మహిమ మగచరాళి ♦ మహితకృత్యమ్ము విభీషణాగమంబు ♦ విశదఫణితి.

అర్థములు. తాలహస్తులు = తాలములు చేత ధరించినవారు, స్వస్తిక పాణులు=స్వస్తికముల చేతులందుఁ గలవారు, త్రికోణాకారముగ నుండు లోహ వాద్యము, నడజోదులు=కాలిబంట్లు, కడిమి=పరాక్రమము.

తాత్పర్యము

మంగళవాద్యము లింపుగా ధ్వనించుచుండెను. కొందఱు తమ నేర్పు ప్రకటమగునట్లు తాలములు, కొందఱు స్వస్తికములు వాయించుచుండిరి. కొందఱు పాడుచుండిరి. అన్నివిధములైన వాద్యములు విన మనోహరములై మ్రోగుచుండెను. కాలిబంట్లు తమబలము ప్రకాశింప నడచిరి. పచ్చని యక్షతలు(విఱుగని బియ్యము పసుపులోఁ గలిపినవి) తీసికొని బ్రాహ్మణులు కన్యకలు గోవులు ముందు పోవుచుండిరి. అప్పుడు రామచంద్రమూర్తి మంత్రులకు సుగ్రీవుని స్నేహవిధము హనుమంతుని మహిమ వానరుల గొప్పకార్యములు విభీషణుఁడు వచ్చి కలసికొనిన విధము స్పష్టముగాఁ జెప్పెను.

శా. క్ష్మాకాంతోక్తుల నెల్లలోకు లధికాశ్చర్యాబ్ధి నిర్మగ్నులై
యాకర్ణింపఁగఁ దెల్పిచొచ్చెను నయోధ్యన్ హృష్టపుష్టప్రజా
నీకోపేతను గేతుమండితగృహాన్వీతన్ రఘూత్తంసుఁ డి
క్ష్వాకాభీష్టముఁ దండ్రిమందిరము వేడ్కం జొచ్చె నుల్లాసియై. ౨౯౦

అర్థములు. క్ష్మాకాంతోక్తులన్ =రాజుమాటలను, అధికాశ్చర్యాబ్ధి నిర్మగ్నులై = విస్తారమైన యాశ్చర్యమను సముద్రమున మునిఁగినవారై, హృష్ట = సంతోషించినట్టియు, పుష్ట=చక్కఁగాఁ బోషింపఁబడినట్టియు, ప్రజానీక = జన సమూహములో, ఉపేతను = కూడినదానిని, కేతు = ధ్వజములచే, మండిత = అలంకరింపఁబడిన, గృహాన్వీతన్=ఇండ్లతోఁ గూడినదానిని, ఇక్ష్వాకాభీష్టము = ఇక్ష్వాకువంశము రాజులకు మిగుల నిష్టమైనది, తండ్రి మందిరమున్ = తండ్రి వసించుచుండిన యిల్లు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి చెప్పిన యా మాటలు విని లోకులు మిగుల నాశ్చర్య సముద్రమున మునిఁగిరి, ఇట్లు చెప్పి సంతోషముతోఁ గూడినవారును దేహపుష్టి గల వారును నగు ప్రజలఁగలదియు ధ్వజము లెత్తఁబడిన గృహములు గలదియు నగు నయోధ్యఁ బ్రవేశించి రామచంద్రమూర్తి యిక్ష్వాకువంశరాజులకు నిష్టమైన దశరథుఁడుండిన నింటియందు సంతోషముతోఁ బ్రవేశించెను.

కం. తల్లులకు ముువ్వురకు వే, నల్లలితవిధంబు దోఁప సాఁగిలి మ్రొక్కెన్
మొల్లముగ నర్థహితమధు,రోల్లసితోక్తులను భరతు నొయ్యనఁ బలికెన్.

తాత్పర్యము

ముువ్వురుతల్లులకు సాష్టాంగనమస్కారము గావించి రామచంద్రమూర్తి భర

తునితో నర్థవంతమై తియ్యనైన మాటల నిట్లు చెప్పెను.

కం. నాయుత్తమభవనంబు మ,హాయతము నశోకవనిక • మతులితముక్తా
స్ఫాద్వైడూర్యచయ, శ్రీయుత మట దింపుమా హ•రిప్రభువనిచన్. ౨౯౨

అర్థములు. మహాయతము = మిగుల నిడివియైనది, అశోకవనికము = అశోక వనము గలది, అతులిత = అసమానమైన. ముక్తా=ముత్యముల యొక్క, స్ఫాయత్ = ప్రకాశించు, వైడూర్యచయ = వైడూర్య సమూహముల యొక్క, శ్రీ=కాంతితో, యుతము=కూడినది.

తాత్పర్యము

మిగుల నిడివియై యశోకవనము కలిగి మంచిముత్యముల వైడూర్యముల కాంతి గలదైన నాయింటియందు సుగ్రీవునకు విడిది యేర్పాటుచేయుము.

శా. కేలుం గేలఁ గదించి తోడ్కొనుచు సు•గ్రీవున్ వెసంబోయి సు
శ్రీలాలిత్యమనోజ్ఞశాల విడియిం•చెం దైలదీపంబులున్
లీలామంచము లాసనంబులును గో•లీతల్పముల్ లోనుగాఁ
జాలన్ లక్ష్మణుతమ్ముఁ డాజ్ఞ నిడి రా•సద్మంబునన్ సేవకుల్. ౨౯౩

తాత్పర్యము

అని చెప్పఁగానే భరతుఁడు సుగ్రీవుని చేతిని తనచేతఁ బట్టుకొని త్వరగాఁ బిలుచుకొనిపోయి మంచికాంతిగలిసి యందమైన యింటియందు సుగ్రీవుని దించెను. శత్రుఘ్నుఁ డాయింటియందు చమురు దీపంబులు, ఉయ్యాలలు, మంచములు, పీటలు, పానుపులు మొదలయిన వన్నియు నాయిల్లునిండ సేవకులచే బెట్టించెను.

తే. రాముతమ్ముండు కపిరాజు•తో మహాత్మ, రాముపట్టాభిషేకంబు•కను గంగజలుపఁ
బుణ్యతీర్థజలంబులు • పోయితేర. మాతలకు నాజ్ఞ సేయుమీ • తూర్ణ మనిన.

తాత్పర్యము స్పష్టము.

ఉ. సూరతనూభవుండు కపి•శూరుల నల్వురఁ జూచి నాల్గుబం
గారపుబిందె లిచ్చి యివి•కైకొని తెవ్వునఁబోయి నాల్గిటన్
వారిధినీరముల్ గొని ప్ర•భాతములోపల రండు పొండు నిం
డారుజవాన మమ్మురు • నాకటఁ జూపుఁడు వచ్చి యిచ్చెదన్. ౨౯౪

అర్థములు. సూరతనూభవుండు = సూర్యపుత్రుఁడు, సుగ్రీవుఁడు, వారిధినీరములు = సముద్రజలములు, ప్రభాతములోపలన్ = ఉదయము కాకముందే, ఇది చైత్రశుద్ధషష్ఠినాఁటిరాత్రి వృత్తాంతము, నిండారుజవానన్=మిగుల వేగముగ.

తాత్పర్యము

సూర్యపుత్రుఁడు సుగ్రీవుఁడు నలువురు వానరులఁజూచి వారలకు నాలుగు బంగారు బిందెలిచ్చి యివి తీసికొని మీరు తెవ్వునఁ బోయి నాలుగు సముద్రముల నీళ్ళు తీసికొని యుదయములోపలవచ్చి నారాక కెదురుచూచుచుండవలెను. మీ

రాకను మేము కాచుకొని యుండునట్లు చేయవలదు.

చ. అనవుడు వారణోపమవ • నాటవరుల్ దివి కుద్గమించి య
వ్వినతతనూజుఁబోలి కడు • వేగమునం జని రయ్యెడన్ మరు
త్తనయుఁడు వేగదర్శియు వి • ధాతృజుఁడున్ ఋషభుండు దివ్య తీ
ర్థనిచయపూర్ణకుంభములఁ • గ్రన్నన తెచ్చిరి మూర్తమంతలోన్. ౫౧-౫౨

అర్థములు. వారణోపమ=ఏనుఁగులతో సమానమైన, వనాటవరుల్ = వానరశ్రేష్ఠులు, దివికిన్=ఆకాశమునకు, ఉద్గమించి = ఎగిరి, వినత తనూజున్ = గరుత్మంతుని, మరుత్తనయుఁడు=హనుమంతుఁడు. విధాతృజుఁడు=జాంబవంతుఁడు, దివ్యతీర్థనిచయ పూర్ణకుంభములన్=దేవసంబంధ తీర్థసమూహములను, మూర్తమంతలోన్ = ముహూర్తమాత్రకాలములో, అగమశాస్త్ర మనిత్యము కావున వకారాగమము రాలేదు.

తాత్పర్యము

సుగ్రీవుఁ డిట్లు లాజ్ఞాపింపఁగా నేనుఁగులవంటి వానరులు హనుమంతుఁడు వేగదర్శి జాంబవంతుఁడు ఋషభుఁడు వనువారు తీవ్రునఁబోయి ముహూర్తకాలములో దివ్యతీర్థములతో నిండిన బిందెలు తెచ్చిరి. ఇవి నదీతీర్థములు.

ఆ. ఏడునూర్ల నదుల • యందుండి పుణ్య,తీర్థములు కనక కలశ • రాజిఁ దెచ్చి
వరుస నిల్పినారు • వానరుల్ కొందఱు, మందిరంబు నిండ • మంజులముగ.

అర్థములు. కనకకలశరాజిన్=బంగారు కలశ సమూహములయందు.

తాత్పర్యము

ఆ నలుపురుగాక మఱికొందఱు వానరులు పోయి యైదునూర్ల నదుల తీర్థముల జలము తెచ్చి యింటినిండ నుంచిరి.

ఈ గ్రంథకర్త వాసుదాసుఁడు నూటయెనిమిదిమార్లు శ్రీ మద్రామాయణము పారాయణముచేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వాములవారికి సామ్రాజ్య పట్టాభిషేకము చేసినవుడు ఆయన మిత్రులునుబోయి పట్టాభిషేకమునకై యుత్తర సముద్రజలము తెప్పఁ దక్షిణ నైదువందల తీర్థములఁ దెచ్చి స్వామికి సమర్పించిరి. అష్టోత్తర సహస్రకలశములతో వేనవేలు ప్రజల సమక్షమున శ్రీ సీతారాము లభిషేకము గైకొనిరి. హిరణ్మయపాదుకలు స్వామికి వాసుదాసుఁడు సమర్పించెను. స్వామి కైంకర్య సాధనభూత నారికేళ భిక్షాపాత్రమును సమర్పించెను. ఈ చిప్ప విషయము టెంకాయచిప్ప శతకంబునఁ గనఁగు.

కం. లలితమణీమయభూషిత, కలశంబును గొంచుఁ దూర్పు • కడలికిఁ జని త
జ్జలములు బలసంపన్నుఁడు, చెలువుగఁ గొని వచ్చె నెన సుషేణుఁడు భక్తిన్.

అర్థములు. లలిత = మనోహరమైన, మణీమయ = రత్నమయమైన, భూషిత=అలంకరింపఁబడిన,కలశంబును=పాత్రమును, కడలికిన్ = సముద్రమునకు,

తాత్పర్యము

రత్నములు చెక్కఁబడిన బిందెను దీసికొని తూర్పు సముద్రమునకుఁ బోయి సుషేణుఁడు జలము తెచ్చెను.

కం. వేరొక ఋషభుఁడు దక్షిణ, వారాశికిఁ బోయి కడుజవంబునఁ దెచ్చెన్
నీరము లోహితచందన, భూరుహశాఖావినద్ధపురురుక్మఘటిన్. ౭౫౯

తాత్పర్యము

ముందు చెప్పఁబడిన ఋషభుఁడు గాక వేఱొక ఋషభుఁడు దక్షిణ సముద్రమునకుఁబోయి ఎఱ్ఱచందనపుఁ జెట్లకొమ్మలచే మూయఁబడిన బంగారు బిందెతో నీళ్ళు తెచ్చెను.

కం. పడమటిమొగ మై గవయుఁడు, కడలికిఁ జని రుచిరరత్నకలశంబునఁ ద
జ్జడతీర్థము మారుతగతిఁ, గడిమిం గొని తెచ్చె నల్పకాలములోనన్.

తాత్పర్యము

గవయుఁడు పడమటి సముద్రమునకు వాయువేగముతోఁబోయి రత్నకలశమున జలము దెచ్చెను.

కం. ఉత్తమగుణసహితుండును, సత్తముఁ డగు నలుఁడు పవనశకునేశ్వర వే
గాత్తుం డై కొనివచ్చెను, నుత్తరపుంజలధిజల ముత్తమమతితోన. ౭౬౧

తాత్పర్యము

ఉత్తమగుణవంతుఁడైన నలుఁడు వాయువేగ గరుడవేగములతోఁ బోయి ఉత్తరసముద్రమునీరు దెచ్చెను. ఈ నలువురు సముద్రజలములఁ దెచ్చినవారు. హనుమదాదులు నదీతీర్థములఁ దెచ్చినవారు.

తే. వానరోత్తము లిటుగొనివచ్చినట్టి తోయములనెల్లఁ గాంచి శత్రుఘ్నుఁడలరి
సచివమిత్రపురోహితజనుల కెల్ల, నధిప నభిషేక మొనరింపుఁడనుచుఁ దెలిపె.

తాత్పర్యము

వానరులందఱు నిట్లు తీర్థములు తీసికొని రాఁగా చూచిన శత్రుఘ్నుఁడు సంతోషించి యిఁక శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకము చేయుఁడని మంత్రులతోను మిత్రులతోను పురోహితులతోను జెప్పెను.

## — శ్రీ సీతారామ పట్టాభిషేక మహోత్సవ ఘట్టము —

కం. అంతట వృద్ధు వసిష్ఠుఁడు, శాంతుఁడు భూసురవరేణ్యచయయుతుఁడు మణీ
కాంత మగు పీఠి సీతా, కాంతునిఁ గూర్చుండఁ బెట్టెఁ దన్మాసుతతోడన్.

అర్థములు. వృద్ధు=ముసలివాఁడును, శాంతుఁడు = శమదమాది సంపత్తి గలవాఁడును, భూసురవరేణ్యచయ యుతుఁడు = బ్రాహ్మణశ్రేష్ఠులతోఁగూడినవాఁడు. మణీకాంతము = రత్నములచే మనోహరమైన, పీఠిన్ = పీఁటయందుఁ దన్మాసుతతోడన్=సీతాదేవితోడ.

తాత్పర్యము

అంతట పెద్దవాఁడును శాంతచిత్తుఁడును బ్రాహ్మణశ్రేష్ఠులతోఁ గూడినవాఁడు నగు వసిష్ఠుఁడు రామచంద్రమూర్తిని సీతాదేవితోడ రత్నపీఠమందుఁ గూర్చుండఁబెట్టె.

సీ. అవల వసిష్ఠ కా • త్యాయనజాబాలి, కాశ్యపవిజయులు • గౌతముండు
వామదేవసుయజ్ఞ • వర్యులు వసువులు, శక్రుని నభిషేక్తు • జలుపుభంగిఁ
గమ్మనివలపుల • ఘుమ్మను నిర్మల,జలముల నభిషేక్తుఁ • జలిపి రలమి
నవల ఋత్విక్ బ్రాహ్మ • ణాళి కన్యామంత్రి, యోధులతో వైశ్య • యూథయుక్తి
ఆ. దివ్యమౌ మహౌష • ధీరసంబులచేత, దివిని మూఁగియున్న • దేవతతుల
తో దిశాధిపతి చ • తుష్కంబుతో నభి,షేకకార్య మెల్లఁ • జేయఁ బిదప. ౨౯౬౮

అర్థములు. కమ్మని వలపులు=మనోహరమైన సువాసనలు, వైశ్య యూథయుక్తిన్=వైశ్యసమూహములతోడ.

తాత్పర్యము

ఇట్లు సీతారామచంద్రులను రత్నపీఠమునఁ గూర్చుండఁబెట్టిన తరువాత వసిష్ఠుఁడు కాత్యాయనుఁడు జాబాలి కాశ్యపుఁడు విజయుఁడు గౌతముఁడు వామదేవుఁడు సుయజ్ఞుఁడు మొదలగు బ్రాహ్మణశ్రేష్ఠు లెనమండ్రు ఇంద్రుని నష్టవసువులు నభిషేకించినట్లు మంచి పరిమళము ఘుమ్మని వీచుచున్న జలములచే నభిషేకించిరి. అవల ఋత్విజులు బ్రాహ్మణులు కన్యకలు మంత్రులు యోధులు వైశ్యులు దివ్యములైన గొప్ప మూలికల రసములచేత నాకాశమున గుంపుచేరిన దేవతలతోను నలువురు దిక్పాలురతోను నభిషేకకార్యమంతయు జరపిరి.

ఈ పట్టాభిషేకము ఇరువది నాలుగవ మహాయుగమునఁ ద్రేతయందు, ఇది యిరువది నాలుగవ మహాయుగమందని హరివంశమునఁ గలదు. కృష్ణావతారము ఇరువది యెనిమిదవ మహాయుగమున, ద్వాపరమున, ధాత సంవత్సర చైత్ర శుద్ధ సప్తమి గురువారము పుష్యమి నక్షత్రము జరగెను.

సీ. బ్రహ్మనిర్మితమయి • బహురత్నశోభిత,మై దీప్తతేజుఁడై • యలరు మనువు
మున్నభిషిక్తుఁడై • చెన్నుమీఱినవేళఁ, దాల్చినయది యయి • తరతరంబు
త ద్వంశ్యులెల్లరుఁ దప్పక యభిషేకమునఁ దాల్చునది యయి • తనరుదాని
సకలమహాజన • సంశోభితంబయి, కాంచనక్లృప్తంబు • క్రమతరము
తే. బహువిధామూల్య మణిగణ • భాసమాన,మైన సభయందు దేదీప్య • మానరత్న
పీఠమున శాస్త్రచోదిత • విధిని నిల్పి,యర్చితముఁజేసి పదపడి • హర్షమార.

అర్థములు. ౨౯౬౮-౨౯౬౯ పద్యముల మూలశ్లోకములు ప్రక్షిప్తములని పూర్వులు వ్రాసియున్నారు.

తాత్పర్యము

బ్రహ్మచే నిర్మింపఁబడినదై యనేకరత్నములచేఁ బ్రకాశించుచుఁ దేజస్సుచేఁ బ్రకాశించు మనువు పూర్వమభిషిక్తుఁడైన వేళ ధరింపఁబడినదియై యది మొదలు వంశపరంపరగాఁ బట్టాభిషేకసమయమున ధరింపఁబడుచున్న దానిని సమస్త మహాజనులతోఁ బ్రకాశించుచు బంగారుతోఁ జెక్కఁబడి మిగుల మనోహరమై యనేక విధములైన వెలలేనిమణులచేఁ బ్రకాశించునదియైన సభయందు ప్రకాశించు రత్న పీఠమందు శాస్త్రమునందుఁ జెప్పఁబడినప్రకారముపూజించిరియావలసంతోషములో.

కం. శ్రుతిమంతమైన ఋత్విక్, తతిఁ గూడి వసిష్ఠమౌని ♦ కమనీయపరి
ష్కృతితోడ రామవిభుస,మ్మతిఁ దాల్పఁగఁ జేసెఁ జెలఁగ♦మంగళరవముల్.

తాత్పర్యము

వేదాధ్యయనపరులైన ఋత్విజులతోడ వసిష్ఠుఁడు అందమైన యలంకారములతోడ రామవిభుఁ డంగీకరింపఁగా ధరింపఁ జేసెను.

సీ. శత్రుఘ్నుఁ డన్నకు ♦ శస్తమంగళకర, పాండురచ్ఛత్రంబుఁ ♦ బట్టె భక్తి
వెల్లనిచామర ♦ విసరె సుగ్రీవుండు, వేఱొండు సంపూర్ణ♦విధునిభంబుఁ
బట్టెను రాక్షస♦ప్రభువు విభీషణుం, డమరేంద్ర చోదితుం ♦ డగుచుఁ బవనుఁ
డర్పించె శతకమ♦లాంచితం బయి ధగ,ద్ధగితతేజం బయి ♦ తనరు కనక
ఆ. మాలికయును సకల ♦ మణిసమాయుక్తంబు, దివ్యరత్నతరల ♦ దీప్యమాన
మౌక్తికప్రకాండ♦మంజులహారంబుఁ, గొంచు వచ్చి యిచ్చెఁ♦గొమరుమిగుల.

అర్థములు. పాండురచ్ఛత్రంబు = తెల్లగొడుగు, విధునిభంబు = చంద్రునితో సమానమైనది, అమరేంద్రచోదితుఁడు = దేవేంద్రునిచే నాజ్ఞాపింపఁబడినవాఁడు, శతకమలాంచితంబయి = నూఱు కమలములచేతఁ బ్రకాశించునదియై, కనకమాలిక=బంగారు సరము, దివ్యరత్నతరల=దేవతా మణులుగల పతకముచే, దీప్యమాన = ప్రకాశించునదియు, మౌక్తికప్రకాండమంజుల=శ్రేష్ఠమైన ముత్తెములచే మనోజ్ఞమైనదియు నగు హారము.

తాత్పర్యము

అన్నకు శత్రుఘ్నుఁడు ప్రశస్తమైన శ్వేతచ్ఛత్రంబు భక్తితోఁబట్టెను. తెల్లని చామరమును సుగ్రీవుఁడు వీచెను. నిండుచందురువంటి మఱియొక తెల్లని చామరము విభీషణుఁడు పట్టుకొనెను. ఇంద్రుని పంపున వాయుదేవుఁడు నూఱు కమలములుగలిగి తళతళ ప్రకాశించుచుండు బంగారుసరమును సమస్తరత్నములతోఁ గూడిన పతకముచేఁ బ్రకాశించుచు మంచిముత్యాలచే మనోహరమైన ముత్యాలసరమును నర్పించెను.

కం. పాడిరి గంధర్వులు దివి, నాడిరి సంతోషగరిమ • నచ్చరవెలదుల్
గూడిరి గుములై సిద్ధులు, పీడిరి వెలి తదభిషేక•విధిఁ గని మానుల్. ౨౯౬౮
తాత్పర్యము స్పష్టము.

కం. ఇల నిండెఁ బైరు పచ్చలు, ఫలములు నిండారె సకల • పాదపతతులన్
వలపులు నిండెను సుమముల, మలయుచుఁ బట్టాభిషేక•మహమున నెంతన్.

అర్థములు. పైరుపచ్చలు = పచ్చని పైరులు, పాదపతతులన్ = చెట్ల సమూహములందు, వలపులు=సువాసనలు, మహమునన్ =ఉత్సవమున.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తికిఁ బట్టాభిషేకోత్సవము జరుగఁగా పచ్చని పైరులు భూమినిండెను. చెట్లయన్నిటియందు ఫలములు నిండి యుండెను. పూవులయందు పరిమళములు నిండియుండెను.

చ. తవిలినప్రీతి రాఘవుఁ డు•దారత వాజుల నూఱువేలు గో
నివహము లక్ష కోడియల • నిస్తులవీర్యము లొక్కనూఱు భూ
దివిజుల కిచ్చి వెండియును • దేవవిభుండు మహార్హవస్త్రముల్
వివిధవిభూషణంబులును • లీలగ ముప్పదికోట్ల నిష్కముల్. ౨౯౭౦

తాత్పర్యము

త్యాగియై రామచంద్రమూర్తి యీ సమయంబున నూఱువేల గుఱ్ఱములను లక్ష గోవులను నూఱుకోడెలను బ్రాహ్మణులకిచ్చి మఱియును దక్షిణవారికి వెలగల వస్త్రములు నానావిధములైన సొమ్ములు ముప్పదికోట్ల బంగారునాణెములు.

కం. దానంబుఁ జేసి భాస్కర, భానుద్యుతిదివ్యరత్న • పరిఖచితం బై
జా నగు కాంచనమాలిక, భానుజునకు నిచ్చె రామ•భద్రుఁడు ప్రీతిన్.

తాత్పర్యము

దానముచేసి సూర్యకిరణముల కాంతి గలిగి దివ్యరత్నములు చెక్కఁబడిన బంగారుహారమును రామచంద్రుఁడు ప్రీతితో సుగ్రీవునకిచ్చెను.

కం. హీరమణిభూషితమ్ము వి, దూరజమణిచిత్రితంబు • సోరపుఁగాంతిన్
దీ రగునంగదముల నీ, తారమణుం డంగదునకు • దయతో నిచ్చెన్. ౨౯౭౨

అర్థములు. హీరమణివిభూషితమ్ము = వజ్రమణులచే నలంకరింపఁబడినది, విదూరజమణి చిత్రితంబు=వైదూర్యములచేతఁ జిత్రింపఁబడినది, అంగదములన్= భుజకీర్తులను.

తాత్పర్యము

వజ్రములచే నలంకరింపఁబడి వైదూర్యములచే చిత్రింపఁబడి విశేషకాంతి గల భుజకీర్తులను దయతో నంగదునకు నిచ్చెను.

చ. అమలమణిప్రవేక నిచ • యాన్వితమై పరిపూర్ణ చంద్రమ
స్సమవిమలప్రభంబు నయి • చారుతరంబు ననుత్తమంబునై
కొమ రగు నాణిముత్తెములఁ • గూడిన మేలిసరంబు నిచ్చె న
త్యమితసురక్తి భూమిసుత • యామణికిన్ జనకేంద్ర కన్యకన్. ౨౯౭౩

అర్థములు. అమల = నిర్మలమైన మణిప్రవేకనిచయ = శ్రేష్ఠములయిన రత్నముల సమూహముచే, అన్వితమై=కూడినదై, పరిపూర్ణ=నిండు, చంద్రమస = చంద్రునితో, సమ = సమానమైన, విమల = మలినములేని, ప్రభంబు = కాంతి గలది, చారుతరంబు=మిగుల మనోహరము, అనుత్తమము, అనుత్తములందన్నిటి కంటె నుత్తమమై, అతి+అమిత+సురక్తి=మిగుల మేరలేని మంచి ప్రేమచే.

తాత్పర్యము

నిర్మలములయిన రత్నశ్రేష్ఠములతోఁ గూడినదై నిండుచంద్రునితో సమాన మైన కాంతిగలదై మనోహరమై ఉత్తమోత్తమమై యాణిముత్తెములతోఁ గూడిన శ్రేష్ఠమైన హారమును మిగులఁ బ్రేమతో సీతాదేవి కిచ్చెను.

—• శ్రీ సీతాదేవి హనుమంతు బహూకరించుట •—

కం. నిర్మలసుదుకూలంబులు, భర్మమయాభరణములును • బతిఁ జూచుచుఁ దా
నర్మిలి జానకి కరువలి, కూర్మినిసుంగునకు నిచ్చె • గుణమణినిధికిన్. ౨౯౭౪

అర్థములు. నిర్మలసుదుకూలంబులు = పరిశుభ్రములైన దువ్వలువలు - భర్మమయాభరణములు = బంగారుతో నిండిన భూషణములు - పతిఁ జూచుచు = ఆయన యంగీకారార్థమై, - కరువలి కూర్మినిసుంగునకున్ = వాయుదేవుని ప్రియ పుత్రునకు, గుణమణినిధికిన్=సుగుణములను రత్నముల గనికి.

తాత్పర్యము

పరిశుభ్రములైన దువ్వలువలు బంగారు భూషణములు సీతాదేవి భర్త యనుమతికై యాయనను జూచుచు నాంజనేయునకు నిచ్చెను. ఇచ్చియు నీయన సుగుణరత్నములకు నిధియే, యిది యేమి యీవి యని తలఁచినదై.

ఉ. ఇచ్చియుఁ దుష్టిలేక జన • కేశ్వరనందిని యాత్మకంధరన్
ముచ్చట గూర్చుచున్ మెఱుఁగు • ఫుంజము లీనుచు నున్నహారమున్
హెచ్చిన ప్రీతిఁ జేకొని హ • రీశ్వర పాళుల నెల్లఁ జూచుచున్
మచ్చిక ప్రాణనాథుముఖ • మండలముం గని మాటిమాటికిన్. ౨౯౭౫

అర్థములు. తుష్టి=తృప్తి, - ఆత్మకంధరన్=తన మెడయందున్న.

తాత్పర్యము

ఇన్నియు నాంజనేయున కిచ్చియు నంతతోఁ దృప్తిలేక జానకీదేవి తన

మెడలోనున్న యందమైన మెఱుఁగులు గ్రక్కుచున్న నొక హారమును నిండుసంతో షముతోఁ దీసికొని వానరుల నందఱఁజూచుచు రామచంద్రుని ముఖమును మాటి మాటికి జూచెను. ఇది యెవరి కిత్తునని యామె యభిప్రాయము. రాము నభిప్రా యముఁ దెలియఁగోరి చూచెనని భావము.

ఉ. రాణ నెసంగుహారముఁ గంఠంబునఁ దాలిచి తన్నుఁ జూచువ్రా
 లోనితలం బెఱింగి రఘుపుంగవుఁ డిట్లను హార మి మ్మరీ
 వేణిరో! నీకు మెచ్చుగొలిపెన్ గుణపాళి నెవం డెవండు క
 ళ్యాణి! సుధీపరాక్రమబలంబుల నెప్పుడుఁ బొల్చువానికిన్. ౭౮

తాత్పర్యము

అధికమైన కాంతిగలహారమును చేతఁదీసికొని తన్నుఁబలుమఱు చూచుచున్న సీతాదేవియభిప్రాయము దెలిసికొన్నవాఁడై రామచంద్రమూర్తి యోయలివేణీ! యెవఁడు తన గుణములచే నిన్ను మెప్పించెనో, కల్యాణీ! యెవనియందు మంచి బుద్ధియుఁ బరాక్రమము బలము గలవో యట్టివానికి దాని నిమ్ము అని చెప్పెను.

ఇట్లు చెప్పక హనుమంతుని కిమ్మని చెప్పినఁ బక్షపాతమో అన్యనిందయో యేర్పడును. ఈ గుణములు తక్కినవారియందు లేవా యనిన బలపరాక్రమము లున్నవానియందు బుద్ధిబలము లేదు. బుద్ధిబల మున్నచోట బలపరాక్రమములు లేవు. ఇది వానరులు సముద్రము దాటఁ బ్రయత్నము చేసినపుడే పరిష్కార మైనది. ఇది గుణములకు నిచ్చిన బహుమానమే కాని వ్యక్త్యభిమానముచే నిచ్చి నది కాదు. ఈ మూఁడు గుణములు దమయందు లేవు. సీత మెచ్చుకార్యము తా మేమియుఁ జేయలేదు కావునఁ దక్కినవారు సమాధానపడి యూరకుండిరి.

కం. అనఁ గువలయలోచన యది, యనిలాత్మజునకు నొసంగెం హారముఁ దాల్పన్
 హనుమయు శశికరధవళం,బును సితఘనయుతము శైలమును బోలె రహిన్

అర్థములు. అని చెప్పఁగా, కువలయలోచన = కలువలవంటి కన్నులు గలది, శశికరధవళంబును = చంద్రకిరణములచేఁ దెల్లనైనదియు, సితఘనయుతము = తెల్లని మేఘముతోఁగూడినదియు నగు. శైలమును = పర్వతమును, రహిన్ = కాంతియందు.

తాత్పర్యము

అని రామచంద్రమూర్తి చెప్పఁగా సీతాదేవి యా హారమును హనుమంతున కిచ్చెను. అది ధరించి హనుమంతుఁడు కాంతిచే చంద్రకిరణములచేఁ దెల్లనైన దియు, తెల్లని మేఘముచేఁ గూడినదియు నగు కొండను బోలియుండెను.

ఇచ్చటఁ బౌరాణికు లొక కథ చెప్పెదరు.

ఈహారమును సీతాదేవి యీయగాఁ దీసికొని హనుమంతుఁడు దానియందలి యొక్కొక్క ముత్యమును నూడఁదీసి నమలి యుమ్మివేసెనఁట. ఇట్లన్నియు ముగి

యుఁగా సీతాదేవి చిన్నపోయి యేమది యాంజనేయా! నీక్రోఁతిచేష్టలు వదల వైతివి. నేనంతో ప్రీతితో నిచ్చిన దాని నీకళిఁ బట్టించితివే యనెనఁట! అమ్మా! యీ రత్నములలో రామనామమువలెఁ దియ్యనైనది యొకటియైనఁ గలదేమో యని చూచితిని. అన్నియుఁ జప్పగా నున్నవి కాని నోరు తీపుచేసినది యొకటి లేదాయె నని చెప్పెనఁట. ఈ కథ రామనామమాధుర్యమును హనుమంతునికి రామునందుఁగల భక్తి విరక్తియుఁ దెలిపెడిని. ఇది కథయే.

ఆ. పిదప మైందునకును ♦ ద్వివిదనీలురకును, వారువారు ప్రీతి ♦ వలచినట్టి
వరమహార్హవస్తు♦వర్ణంబులన్నియు, వేలు వేల రామ♦విభుఁ డొసంగె. ౯౮

తాత్పర్యము స్పష్టము.

ఆ. ప్లవగవృద్ధులకును ♦ వానరనాథుల, కెల్ల యోగ్యముగను ♦ హితవిధముగ
గౌరవించి వస్త్ర♦కనకభూషణముల, నిచ్చి వారికెల్లఁ♦దృప్తిఁగూర్చె. ౯౯

అర్థములు. ప్లవగవృద్ధులు=వానరులందుఁ బెద్దవారు, వానరనాథులు = వానరసేనానాయకులు.

తాత్పర్యము స్పష్టము.

ఉ. ఈవిధి రాక్షసప్లవగ♦ఋక్షవిభుల్ హనుమంతుఁ డెల్లఁ గీ
శావళి యర్హభంగి సము♦దారగతిన్ మణిభూషణాదిపూ
జావివిధప్రకామములు ♦ సంతస మారఁగఁ బొంది భూమిక
న్నావిభుచే ననుజ్ఞఁ గొని ♦ స్వావనిఁ జేరఁగఁబోయి రందఱున్ ౧౦౦

అర్థములు. రాక్షసప్లవగ ఋక్షవిభుల్ = రాక్షసవిభుఁడు-విభీషణుఁడు, ప్లవగవిభుఁడు=సుగ్రీవుఁడు, ఋక్షవిభుఁడు=జాంబవంతుఁడు, ఎల్లకీశావళి=వానరు లందఱు, మణిభూషణాది పూజావివిధప్రకామములు = రత్నముల సొమ్ముల గౌరవములు నానావిధములైన కోరిక పదార్థములు, స్వావనిన్=తమ దేశమును.

తాత్పర్యము

ఈ ప్రకారము విభీషణు సుగ్రీవ జాంబవంతులు వానరు లందఱు వారి వారికిఁ దగిన రీతి విస్తారముగ రత్నాభరణములు మొదలయిన గౌరవములు మఱియు పెక్కులు కోరిన వస్తువులు తృప్తిదీరఁ బొందిన వారై రామచంద్ర మూర్తిచే ననుజ్ఞగొని తమ తమ భూములు చేరఁబోయిరి.

ఇట్లు చెప్పుటచే పట్టాభిషేక మైననాఁడే యందఱు వెడలిపోయిరని యర్థము కాదు. వీలనఁగా వెంటనే సుగ్రీవ విభీషణుల వృత్తాంతము చెప్పఁబోవుచున్నాఁడు. ఇది గ్రంథాంతము సూచింపదు. వ్యాసవాక్యమునకు ముందు సంగ్రహవాక్యము చెప్పుట యన్ని గ్రంథములందు నన్ని భాషలయందుఁ గలదు. ఇది యుత్తరకాండ మునకు సూచనయే కాని గ్రంథాంతము కాదు.

కం. వానరసత్తములున్ సీ, తానాథున కెఱఁగి తన్మ•తంబునఁ గిష్కిం
ధానగరికిఁ జని రట్టుల, భానుజుఁడుం జనియె భూమి•పతియనుమతిచేన్.

అర్థములు. వానరసత్తములు = వానరశ్రేష్ఠులు, ఎఱఁగి = నమస్కరించి తన్మతంబునన్ = ఆయన సమ్మతింపఁగాఁ.

తాత్పర్యము స్పష్టము.

చ. కులధనమున్ గ్రహించి రఘు•కుంజరు చేత ననుజ్ఞఁ గాంచి స
ల్లలితగతిన్ విభీషణుఁడు • లంకకుఁ బోవ మహాయశుండు ని
ర్గళితవికోధివర్గుఁడు వ•దాన్యశిరోమణి రాఘవుండు దా
నిల సకలంబు నేలెఁ బరి•హృష్టుఁడు తుష్టుఁడునై నయంబునన్. ౨౯౮౨

అర్థములు. కులధనమున్ గ్రహించి = వంశపరంపరగా వచ్చిన ధనము - ఇది యెవరి కులధనము - రామచంద్రుని కులధనమా? విభీషణుని కులధనమా యని సందేహము.

గోవిందరాజీయ వ్యాఖ్యయందు ఇక్ష్వాకుకులధనము శ్రీరంగవిమాన మని సంప్రదాయార్థ మని వ్రాయఁబడినది. రామానుజీయమందు కులధనము ఇక్ష్వాకు కులధనము శ్రీరంగమను పేరుగల విమానమని పెద్దలు చెప్పుచున్నారు. విభీషణ కులక్రమాగతము లంకారాజ్యమని కొందఱందురు అని యున్నది.

మహేశ్వరతీర్థీయంబున నిదివఱకే యిచ్చిన లంకారాజ్యమును గ్రహించి యని యర్థము. పూర్వము చెప్పినదే యిచ్చట ననువదింపఁబడినది. కొందఱు కుల ధన మనఁగా శ్రీరంగవిమానమని చెప్పుచున్నారు. అది సరిగాదు. ఏలన కులధన మనిన నిక్ష్వాకుల కులధనమని చెప్పఁబడ లేదు. అదియునుగాక యవతార సమాప్తి కాలమందు ఉత్తరరామాయణమున ఇక్ష్వాకు కులదైవతము రంగవిమానము నిచ్చి నట్లు చెప్పఁబడును.

"కించాన్య ద్వక్తు మిచ్ఛామి రాక్షసేంద్ర మహాబల।
ఆరాధయ జగన్నాథ మిక్ష్వాకుకులదైవతమ్" ఇతి॥

మఱియొకటి నీకుఁ జెప్పఁదలఁచినాను. మహాబలా! రాక్షసేంద్రా! ఇక్ష్వాకుకులదైవతమైన జగన్నాథు నారాధింపుము అని పాద్మపురాణమందవ తారసమాప్తికాలమందు వచ్చిన విభీషణుతో శ్రీరామచంద్రమూర్తి,

"యావ చ్చంద్రశ్చ సూర్యశ్చ యావ త్తిష్ఠతి మేదినీ, తావద్రమస్వ రాజ్యస్థః కాలే మమపదం వ్రజ। ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై స్వవిశ్లేషాసహావిష్ణవే, శ్రీరంగ శాయినం స్వార్చ్య మిక్ష్వాకుకులదైవతమ్, రంగం విమాన మాదాయ లంకాం ప్రాయా ద్విభీషణః॥ అని యవతారసమాప్తికాలమందు రంగవిమానదానము చెప్పఁబడుటచే నిచ్చట "కులధనశబ్దేన రాక్షసకులధనం లంకారాజ్యమేవోక్త మితి వేదితవ్యమ్" సూర్యచంద్రులు భూమి యెంతవఱకుందురో యంతవఱకు నీవు

రాజ్య మేలి కడపటఁ బ్రలయమందు నా స్థానమునకు రమ్మని చెప్పి తన వియోగమును సహింపలేని యతనికిఁ దన యర్చామూర్తియు నిక్ష్వాకుకులదైవ మయిన శ్రీరంగశాయిని నిచ్చెను. రంగవిమానముఁ దీసికొని విభీషణుఁడు లంకకుఁ బోయెను అని యవతారసమాప్తి కాలమందుఁ జెప్పఁబడుటచేఁ నిచ్చట కులధన శబ్దముచే లంకారాజ్యమే చెప్పఁబడెనని తెలియఁదగినది యని యున్నది.

ఇట్లు చెప్పుటచేత మహేశ్వరతీర్థులవారి యభిప్రాయ మిచ్చట కులధన మనఁగా రంగవిమానము కాదని చెప్పుటయే కాని రామచంద్రమూర్తి విభీషణునకు తన యర్చామూర్తి రంగనాథుని నియ్యలేదని కాదు. ఎప్పు డిచ్చినాఁ డనుటయందే యభిప్రాయభేదము.

ఆయన యభిప్రాయప్రకారము పూర్వము జరిగినది యిచ్చట ననువదింపబడినదని చెప్పినను గోవిందరాజీయప్రకారము జరగఁబోవునది తక్కిన విషయములు చెప్పినట్లు సూచింపఁబడెనని చెప్పినను రాఁగల బాధ యేమియు లేదు.

ఈ విషయమున ముద్రితప్రతులం దొక సూచిక కానవచ్చుచున్నది. గోవింద రాజీయమందు రంగవిమాన మని యున్నది. మహేశ్వరతీర్థు లిది కాదనిరి. ఈ విరోధమునకు బరిహార మెట్లు అని శంకించుకొని ఉత్తర శ్రీరామాయణమున నీకు మఱియొక విషయము చెప్పవలసి యున్నదను శ్లోకములు ప్రక్షిప్తములని మహేశ్వరతీర్థులు వ్రాసియుండుటచేతను (ఇది తిలకాభిప్రాయము గాని తీర్థులవారి యభిప్రాయము గాదు. ఆయనయందు స్వోక్తివ్యాఘాతము లేదు) పాద్మము నందలి వాక్యములు కల్పాంతర విషయము లనుటచేతను లంకారాజ్యప్రాప్తి పూర్వమే చెప్పుటచే మరలఁ జెప్పవలసినపని లేకుండుటను నిచ్చట కులధన మనిన నిక్ష్వాకులకులధన మని చెప్పిన విరోధము లేదు.

పద్మపురాణమందే గాక నరసింహపురాణమున నిట్లు చెప్పఁబడెను.

'రావణం దేవకంటకం సబాంధవం హత్వా సీతామాదాయ పునరయోధ్యాం ప్రాప్య భరతాభిషిక్తో విభీషణాయ లంకారాజ్యం విమానం వా దత్వా తం ప్రేషయామాస। సతు పరమేశ్వరో విమానస్థో విభీషణేన నీయమానో లంకాయామపి రాక్షసపుర్యాం వసతు మనిచ్ఛన్ పుణ్యారణ్యం తత్ర స్థాపితవాన్, నృసింహ - ౫౨ యధ్యాయము.

అనగా దేవకంటకుఁడైన రావణుని బంధువులతోడఁ జంపి సీతను గ్రహించి యయోధ్యకు వచ్చి భరతునిచే నభిషేక మంగీకరించి విభీషణునకు లంకారాజ్యము విమానమును నొసఁగి యాయనను బంపెను. ఆ పరమేశ్వరుడు విమానస్థుఁడై విభీషణునిచేఁ దీసికొనిపోఁబడి రాక్షసపురి యగు లంకయం దుండ నొల్లక పుణ్యారణ్యమందు స్థాపితుఁ డయ్యెను.

మహేశ్వరతీర్థు లుదాహరించిన వాక్యములుగాక 'ఇత్యుక్త్వాథ స కాకుత్ స్థః స్వార్చ్యావిష్ణుం సనాతనమ్, శ్రీరంగ శాయినం సౌమ్య మిక్ష్వాకుకులదైవతమ్ । సుప్రీతః ప్రదదౌ తస్మై రామో రాజీవలోచనః" అనియుఁ గలదు.

నిర్దళిత విరోధి వర్గుఁడు = చీల్పఁబడిన విరోధిసమూహము గలవాఁడు, వదాన్య శిరోమణి= దాతలయందు శ్రేష్ఠుఁడు, పరిహృష్టుఁడు = మిగుల సంతోషించినవాఁడు, తుష్టుఁడు=తృప్తిపొందినవాఁడు.

తాత్పర్యము

రామచంద్రమూర్తి యనుగ్రహించిన కులధనమును గ్రహించి విభీషణుఁడు రామాజ్ఞఁ దీసికొని లంకకుఁ బోయెను. విస్తారకీర్తి సంపాదించినవాడును శత్రువుల నందఱ జయించిన వాఁడును దాతలయందు శ్రేష్ఠుఁడును నగు రామచంద్రమూర్తి సంతుష్టుఁడై నీతివిధానము తప్పక రాజ్య మంతయుఁ బరిపాలించెను.

సీ. ధర్మవత్సలుఁడైన ♦ ధరణిజానాథుండు, సౌమిత్రి కిట్లనుఁ ♦ జనవు దోఁప
ధర్మజ్ఞ! పూర్వభూ ♦ ధవపాలితం బగు, నీ ధరారాజ్యంబు ♦ నీవు బలిమి
నాతో సమంబుగా ♦ నర్మిలిఁ బాలింపు, మిది కులాగత మయి ♦ యిట్లు వచ్చె
యౌవరాజ్యభరంబు ♦ నీవు దాల్పుమటంచు, నెన్నెన్ని విధముల ♦ నెంత చెప్ప
తే. మేకొనఁడయ్యె దాని సౌ♦మిత్రి భరతు, యౌవరాజ్యంబునన్ నిల్పి♦యశ్వమేధ
పౌండరీకంబులును మఱి ♦ వాజపేయ, మాదిసవతతు లొనరించె♦నవనివిభుఁడు.

అర్థములు. కులాగతమయి=వంశపరంపరగా.

తాత్పర్యము

ధర్మమునందు బ్రీతిగల రామచంద్రమూర్తి లక్ష్మణుతోఁ జనవున నిట్లనియె. ధర్మజ్ఞా! మనవంశమున ముందుపోయిన రాజులు పాలించిన యీ రాజ్యమును నీవు బలయుక్తుఁడవై నాతో సమముగాఁ బ్రీతితో యువరాజవై పాలింపుము అని ప్రథమ పట్టాభిషేకమునకు నారంభమునఁ దాను 'ఈ వసుధాంతలంబు నెల్లను దమి నాకుఁ దోడయి చెలంగుచు నేలుము (అయోధ్య ౧౩౩)అని ముందు దాను జెప్పిన మాట తప్పకుండఁ బాలింపుము.ఇది వంశక్రమముగ వచ్చినది కావున యువరాజవు కమ్ము అని యెన్నెన్ని విధములనో యెంతో చెప్పెనుగాని దానివలనఁ దన కైంకర్య మునకు విఘ్నము వచ్చుననియు భరతుఁడు పెద్దవాఁ డుండఁగాఁ దాను యువ రాజగుట ధర్మవిరుద్ధ మనియు నాలోచించి లక్ష్మణుఁ డంగీకరించినవాఁడు కాఁడు. కావునఁ బరతంత్రుఁడై తన యాజ్ఞ మీఱని భరతునకు యౌవరాజ్య మిచ్చెను. ఆవల నశ్వమేధ పౌండరీక - వాజపేయములు లోనుగాఁగల యజ్ఞములు సలిపెను.

తాత్పర్యము

రామచంద్రమూర్తి లక్ష్మణుతో ధర్మజ్ఞుఁడా! నీవు ధర్మము ననుసరించి నాతోఁ

బదియు నాలుగు సంవత్సరములు దుఃఖము లనుభవించినవాఁడవు సుఖములఁగూడ ననుభవింపవలెను. కావున పూర్వరాజులచే వంశపరంపరగా పాలించుచు వచ్చిన రాజ్యమును నీవు యువరాజవై నాతో సమముగ ననుభవింపుమని యెన్నెన్ని విధములనో యెంతెంతో చెప్పెనుగాని లక్ష్మణుఁడు దాని నంగీకరించినవాఁడు కాఁడు. కావున బరతంత్రుఁడైన భరతునకు యౌవరాజ్యమిచ్చి యశ్వమేధము పౌండరీకము వాజపేయము లోనగుయజ్ఞములు గావించెను.

సీ. ఆజానులంబబా • హార్గళుం డతులిత,విక్రమవంతుండు • వినుతగుణుఁడు
దృఢమహాస్కంధుండు • దివ్యతేజస్కుండు, లక్ష్మణానుచరుండు • లలితగతిని
ను త్తమరాజ్యంబు•నొంది ధర్మాత్ముఁడై. పదివేలయేండ్లు భూ•పాలనంబు
సలిపి యను త్తమ • సైంధవంబుల వీడి, భూరిదక్షిణలతోఁ • బుణ్యవిధిని
తే. జేసినూఅశ్వమేధముల్•వాసిచెలఁగ,జ్ఞాతిబాంధవహితసుహృ•త్సహితుఁడగుచు
బహువిధంబుల నధ్వరా•వళులు నలిపె,భువనవినుతుండు శ్రీరామ•భూవరుండు.

అర్థములు. ఆజానులంబ=మోఁకాఁటివఱకు దీర్ఘములైన, బాహార్గళుండు= గడియ మ్రాఁకులవంటి బాహువులు గలవాఁడు, అతులిత=అసమానమైన విక్రమవంతుండు=బలము గలవాఁడు, వినుతగుణుఁడు=విశేషముగ స్తోత్రము చేయఁబడిన గుణములు గలవాఁడు, దృఢమహాస్కంధుండు = గట్టివగు గొప్ప మూఁపులుగల వాఁడు,దివ్యతేజస్కుండు=అమానుష మైన తేజస్సుగలవాఁడు,లక్ష్మణానుచరుండు= లక్ష్మణుని ననుచరునిగా (వెంటవచ్చువానిఁగా) గలవాఁడు, లలితగతిని = మనోహరమైనరీతిని, యుద్ధాదిఘోరకార్యములు లేక, అను త్తమసైంధవంబులన్=ఉ త్తమో త్తమములైన గుఱ్ఱములను, వీడి = అశ్వమేధయాగము చేయుటకై వదలి, జ్ఞాతి=తమ్ములతోను, బాంధవ = చుట్టములతోను, హిత = తనయాప్తులతోడను, సుహృత్=స్నేహితులతోడను, సహితుఁడు=కూడినవాఁడు, అధ్వర+ఆవళులు = అనేకయజ్ఞములు,భువనవినుతుండు=ప్రపంచముచే స్తోత్రముచేయఁబడినవాఁడు.

తాత్పర్యము

మోఁకాటివఱకు దీర్ఘములైన చేతులు గలవాఁడును, అసమానమైన బలము గలవాఁడును, స్తోత్రము చేయఁబడిన కల్యాణగుణములు గలవాఁడును, దృఢములైన మూఁపులు గలవాఁడును, అమానుషతేజస్సు గలవాఁడును, వెంటనంటియుండు లక్ష్మణుని గలవాఁడును, ధర్మయుక్తమైన మనస్సు గలవాఁడును నగు రామచంద్ర మూర్తి యుద్ధాదిఘోరకార్యములు లేకయే మనోహరరీతిని ను త్తమరాజ్యంబు నొంది పదివేల సంవత్సరములు భూమి పాలించి భూరిదక్షిణలతో నూఅశ్వమేధములఁ జేసి తమ్ములతోను జుట్టములతోను ఆప్తులతోను మిత్రులతోను గూడిన వాఁడై యనేకవిధయజ్ఞములు సలిపినవాఁ డయ్యెను. ఉ త్తరకాండమందలి విషయము సంక్షేపముగఁ జెప్పఁబడెను.

దీని వివరణము ఉత్తరకాండమునఁ గలవు.

కం. ఆధులు పొసఁగవు జను లహి,బాధలచేఁ గుందరబ్జ•పత్రేక్షణలున్
వైధవ్యదుఃఖ మెఱుఁగరు, వ్యాధులు లే వెందు రామ•పాలనమందున్.

అర్థములు. ఆధులు=మనోవేదనలు, అహిబాధలచే = స్వరాష్ట్రి కలహములచే, ఇంటిలోఁబాము చేరినట్లు ఒక రాష్ట్రిములోనిజనులే రాజుతో పోరాటము పెట్టుకొనిన నహిభయ మనఁబడును. "మహీభుజా మహీభయం స్వరాష్ట్రిప్రభవం భయమ్" అమరము, అబ్జపత్రేక్షణలు = స్త్రీలు, వైధవ్యదుఃఖము = భర్తలు మరణించుటవలనఁ గలిగిన దుఃఖము, కౌసల్యాదులు విధవలు గారా యనరాదు. వారు విధవ లగుట రామరాజ్యమునఁ గాదు. వ్యాధులు=రోగములు.

శ్రీరామచంద్రమూర్తి రాజ్యముచేయువేళ ప్రజలు మనోవేదనలు లేక యుండిరి. ప్రజలు వారితో వారుగాని రాజుతోఁగాని కలహింపక యుండిరి. స్త్రీలు వైధవ్యదుఃఖ మెఱుఁగకుండిరి. రోగము లనునవి లేకుండెను.

తే. దొంగలను పేరు జగతి వి•నంగ రాదు, కలుగద యనర్థ మొకఁడై న•త్మ్మాజనులకుఁ
చిన్నలకుఁ బ్రేతకార్యముల్•పెద్ద లెందుఁ, జలుప రుర్విని శ్రీరామ•చంద్రుఁ డేల.

తాత్పర్యము

శ్రీరామచంద్రమూర్తి రాజ్యము పాలింపఁగా దొంగతన మెట్టిదో తెలియదు. దారిద్ర్యము దొంగతనమునకుఁ గారణము, అది లేక సర్వము సర్వజనులకు సమృద్ధిగా నుండుటచే నొకనిసొత్తు నొకఁ డాశింపఁ గారణము లేదు. ఒక కీడైనను ప్రజలకుఁ గలిగినది కాదు. పెద్దవారికంటె ముందు చిన్నలు చచ్చినవారు లేరు. ఆ కారణమున కొడుకులకుఁ దండ్రులు తమ్ములకన్నలు శ్రాద్ధకార్యములు జరుపలేదు.

ఉ. రామునిఁ జింతసేయుచు ని•రంతరమున్ సకలంబు ధర్మధీ
ధామమునై ప్రమోదకలి•తంబుగ నయ్యెఁ, బరస్పరం బహిం
సామతిఁ గూడియుండిరి ప్ర•జల్ బహుపుత్రకులై యరోగులై
క్షేమముదంబు లుబ్బంగ వ•సించిరి తత్పురి నేండ్లుపూండ్లుగన్. ౨౯౦౭

అర్థములు. సకలంబు = సమస్తజనము, ధర్మధీధామము = ధర్మబుద్ధికి స్థానము, ప్రమోదకలితంబుగన్ = సంతోషముతోఁ గూడినది, అహింసామతి = హింసచేయరాదను మనస్సు, ఎవరి కేమి హింసఁ జేసిన రామచంద్రమూర్తి మనస్సు నొచ్చుకొనునో, ఆయనమనస్సు నొప్పించుకార్యము మనము చేయవచ్చునా యని విరోధులుకూడ తమ వ్యవహారములను ధర్మపద్ధతిఁ బరిష్కరించుకొనుచుండిరి గాని యొకని నొకరు మనోవాక్కాయముల నొప్పించినవారుగారు, ఏండ్లుపూండ్లుగన్ = అనేక సంవత్సరములుగ, మనుష్యులు మరణించుటకు అనాచారము దురాచారము అధర్మప్రవర్తనము కారణములు. సదాచారసంపత్తి గలిగి స్వధర్మప్రవర్తనమందే

యుండువారికి మరణభయము లేదు. ఎన్నివేల సంవత్సరములైన జీవింపవచ్చును "శతమానం భవతి శతాయుః పురుషః" అని శ్రుతి చెప్పుచున్నదే యని సందేహింపఁబనిలేదు. అక్కడ శతమునకు అనంతమని యర్థము. 'శతం సహస్ర మయుతం సర్వమానంత్యవాచకమ్' అని ప్రమాణము భీమాదులం దొక్కొక్క దోషము మరణ కారణముగఁ జెప్పఁబడెను. కృతయుగమున సత్యధర్మములు లోపము లేకుండుటచే చిరకాలము జీవించుచుండిరి. ఇప్పుడు పరమాయు విరువదియైదు సంవత్సరములైనది. ఇరువది పదునాలుగులకు క్షీణింపఁగలదు. అసత్యాధర్మములు ప్రబలుచుంట కారణము.

### తాత్పర్యము

రామ రామ యని రామచంద్రమూర్తిని సర్వదా ధ్యానించుచు సమస్త జీవకోటి ధర్మబుద్ధిగలదై సంతోషముతో సుఖముగ జీవించుచుండెను. ఒకరి నొకరు విరోధులుకూడ హింసింపకుండిరి. ప్రజ లొక్క భార్యయు ముగ్గురు పుత్రులు గలవారై రోగములు లేనివారై క్షేమము సంతోషము లతిశయించినవారై యా పురమందు ననేకసంవత్సరములు జీవించిరి. బహుపుత్రత్వమునకు పాపము కారణము.

కం. రాముఁడు రాముఁడు రాముఁడు, రాముఁ డటం చతనికథలు ♦ ప్రజ వర్ణింపన్
రామమయ మయ్యె భువనము, రాముండు సమస్తధరణి ♦ రాజ్యం బేలన్.

### తాత్పర్యము

రామచంద్రమూర్తి రాజ్యము చేయువేళ నే నోరను రామశబ్దమే, ఏకథ విన్నను రామునికథయే ప్రజలు చెప్పుకొనుటచే ప్రపంచము రామమయ మయ్యెను. రామచంద్రమూర్తి ధర్మముగఁ బాలించుటచే నందఱమనస్సులు తనవంకకు లాగుకొనెను. కృష్ణమూర్తి దొంగతనముచే గోపికల మనసుల నాకర్షించెను.

సీ. నిత్యపుష్పంబులై ♦ నిత్యఫలంబులై, శాఖోపశాఖలై ♦ శాఖు లమరెఁ
గఱవుల వెత పాయఁ ♦ గాలంబు దప్పక, రమణ వర్షించెఁ బ♦ర్జన్యుఁ డప్పు
డంచమై భూప్రజా♦నందమై మందమై, మలయమారుతి మెప్పు ♦ మలయుచుండె
బ్రాహ్మణక్షత్రియుల్ ♦ వైశ్యులు శూద్రులు, లోభదూరగులయి ♦ శోభ దాల్చి
ఆ. వారివారినియత ♦ వర్తనంబునఁ దృప్తిఁ, గనుచు వారివారి ♦ కర్మవిధుల
ధర్మనిరతు లగుచుఁ ♦ దతశుభచిహ్నులై, వఱలి రవని రామ ♦ పాలనమున.

### తాత్పర్యము

మఱియొకటి నిత్యపుష్పంబులై=ఎప్పుడు పూచునవియై, నిత్యఫలంబులై= ఎప్పుడు ఫలములతోఁ గూడినవై, ఋతునియమము లేక సర్వవృక్షములు సర్వ ఋతువుల ఫలించియుండెను. శాఖోపశాఖలై = కొమ్మలు రెమ్మలు గలవై, శాఖులు = చెట్లు, లోభదూరగులు = పిసినితనము లేని వారై, నియత వర్తనంబునన్=శాస్త్రమునందు నియమింపఁబడిన్రపన కారము.

తా త్ప ర్య ము

రామచంద్రమూర్తి రాజ్యము సేయునపుడు వృక్షములు ఋతువుల నియమములేక సర్వదా పుష్పములతో పండ్లతో కొమ్మలతో రెమ్మలతో గూడి యభివృద్ధి గాంచుచుండెను. కఱవుల భయము లేకుండునట్లు సకాలమున వానలు గురియుచుండెను. ప్రజలకు సంతోషకరముగ మెల్లగ చల్లనిగాలి వీచుచుండెను. నుడిగాడ్పులు లేకుండెను. బ్రాహ్మణులు క్షత్రియులు వైశ్యులు శూద్రులు వారి వారి వర్ణాశ్రమ ధర్మముల ప్రకారము వర్తించుచు స్వధర్మమునఁ దృప్తిగనుచు శుభలక్షణములు గలిగియుండిరి.

కం. పదివేలవత్సరంబులుఁ, బదినూఱేఁడులును దనదు • భ్రాతలతో స
మ్మదమున శ్రీమంతుఁడు భూ,విదితుఁడు శ్రీరామవిభుఁడు•విశ్వం బేలెన్. ౨౯౯౦

తా త్ప ర్య ము

ఈవిధముగ శ్రీరామచంద్రమహారాజు పదునొకండువేల సంవత్సరములు తమ్ములతో శ్రీమంతుఁడై జగత్ప్రసిద్ధిగ ప్రపంచమును పాలించెను. ఈ వివరము త్తరకాండమునఁ జెప్పఁబడును.

—• ఫ ల శ్రు తి •—

సీ. ఆదికావ్యం బిది • యార్షంబు పూర్వంబు, వాల్మీకి రచియించి • ప్రకటపఱిచె
ధన్య మాయుష్యంబు • తతయుఁ గోజనకంబు, భూపరులకు విజ • యావహంబు
దీనిని బఠియింపఁ • దీఱుఁ బాపంబులు, పుత్రకాములకును • బుత్రఫలము
ధనకాములకుఁ జాల•ధనములు లభియించు, రామాభిషేచన•క్రమము విన్న
ఆ. రాజు గెలిచి వైరి•రాజుల వసుమతీ,పాలనంబు సేయుఁ • బ్రాభవమునఁ
బ్రజలు వినిర యేని•రామాయణము రాము,విజయ మాయు వధిక•వృద్ధిఁగూరు.

అర్థములు. ఆదికావ్యము = కావ్యములందు మొదటిది, ఈ గ్రంథరచనకుఁ బూర్వము ఛందోబద్ధమైన కావ్యము లేదు. వేదములందు శ్లోకములు గలవు గాని నియమ రహితమై యున్నవి. ఛందస్సుల ప్రకారము వృత్తములకు వ్యవస్థ గల్పించి నియమప్రకారము తొలుత వ్రాయఁబడిన దీగ్రంథమే, ఆర్షంబు=ఋషి సంబంధమైన, ఋషి = వేదము, వేదోపబృంహణము = వేదములందుండు నర్థము విస్తరించి చెప్పఁబడిన, పూర్వంబు=(౧) రామోత్తర తాపసీయమూల మగుటచేఁ బూర్వము, (౨) అందఱు కవులకంటెఁ బూర్వము అని యర్థమేకాని యవతారమునకుఁ ముందని యర్థముగాదు, ఏలన ;— ప్రాప్తరాజ్యుం డయి ప్రజలరాముఁ డేలుచునుండ భగవంతుఁడగు ఋషి వాల్మీకుండు శ్రీరాముచరితంబు రచించెనని గ్రంథ మారంభింపఁబడెను. బాల. ౧౨౦ ప.

నారదమహర్షి వాల్మీకికి రామాయణ ముపదేశించునపుడు 'తనతో' డెలియఁగ

భూమిఁ తనయామణి రాజ్యరమను దాల్చెన్' అనువఱకు భూతకాలమునఁ జెప్పి 'బ్రహ్మలోక మరుగుఁ బ్రథితగుణుఁ'డని భవిష్యత్కాలమునఁ జెప్పెను.

వాల్మీకి ప్రశ్న చేయుట యందే ఎవ్వఁడీ ధారిణి నీకాలమున నని ప్రశ్నించెను గాని కడచినవారి గుఱించికాని రాఁబోవువారినిగుఱించి కాని ప్రశ్నింపలేదు.

అవతారమునకు ముందే రామాయణము రచింపఁబడి యుండినయెడలఁ గొంత భూతార్థకమందును, గొంతవర్తమానార్థకమందును, గొంత భవిష్యదర్థకంబుగను జెప్పఁ గారణము లేదు. పూర్వమని చెప్పినంతమాత్రముననే పూర్వకల్పమని, పూర్వయుగమని చెప్పవలసిన విధిలేదు.

ద్రౌపదీవస్త్రాపహరణ కాలమందు.

'జ్ఞాతం మయా వసిష్ఠేన పురా గీతం మహాత్మనా, మహత్యాపది సంప్రాప్తే స్మర్తవ్యో భగవాన్ హరిః' ద్రౌపది నాకుఁ బూర్వమున మహాత్ముఁడగు వసిష్ఠుఁడు మహాపదకాలమందు భగవంతుఁడగు హరిని స్మరింపవలెనని చెప్పెను అనెను. ఇచ్చటఁ బురా యనఁగా కొంత కాలము ముందేయని యర్థము కాని పూర్వయుగము కల్పమని యర్థము కాదుకదా.

'లోకేస్మిన్ ద్వివిధా నిష్ఠా పురా ప్రోక్తా మయానఘ' అనుచోట (కొన్ని నిమిషములకు ముందు- ఇంతకు ముందనియే యర్థము. సీతాదేవి శ్రీరామచంద్రమూర్తితో,

'అథవాపి మహాప్రాజ్ఞ బ్రాహ్మణానాం మయా శ్రుతం పురా పితృగృహే సత్యం వక్తవ్యం కిల మే వనే' అని చెప్పెను. ఇట్టి ప్రయోగము లెన్నియో కలవు. ౩౦౦౦ పద్యము చూచునది.

అవతారమునకు ముందే రామాయణము రచింపఁబడిన దనునెడల విరోధములు చాలఁ బొసఁగును. అట్లు చెప్పుటకు నొక్క యాధారమైన రామాయణమునందు లేదు. ఇతరులు చెప్పినది దీనిని బాధింపదు. రామాయణము వేదమువలె స్వతఃప్రమాణము. దాని యందలి విషయములు స్థాపింప వేఱు ప్రమాణములు గ్రహింపవలసినపని లేదు. ధన్యము = పుణ్యఫల మిచ్చునది, ఆయుష్యము = దీర్ఘాయువు నిచ్చునది. తతయశోజనకంబు=విస్తారకీర్తికిఁ గారణమైనది, భూవరులకు = రాజులకు, విజయావహంబు = గెలుపు గలిగించునది, పుత్రకాములకును= పుత్రులను గోరిన వారికి, ధనకాములకు=ధనము కోరినవారికి.

## తాత్పర్యము

ఇదియే మొదటి కావ్యము. వేదార్థ మిందు విస్తరించి చెప్పఁబడినది. వాల్మీకి మహర్షి దీనిని యశ్వమేధయాగము చేయుటకు ముందు రచియించి ప్రకటపఱిచెను. ఇది పుణ్యము గలిగించి యాయువును వృద్ధిచేయును. మిక్కిలి కీర్తికరము. రాజులకు గెలుపు గలిగించును. దీనినిపఠియింప సమస్తపాపములు నశించును. పుత్రులను గోరిన

వారికి పుత్రులు ధనము కోరిన వారికి ధనము లభించును. రామాభిషేక విధము విన్న రాజు విరోధులను గెలిచి రాజ్యము చేయును. రామాయణమును ప్రజలు విని రేని వారి యాయువు వృద్ధియగును.

ఈ ఫలశ్రుతిశ్లోకములు కతకవ్యాఖ్యయందు లేవు.

కం. రామునిచేఁ గౌసల్యయు, సౌమిత్రులచే సుమిత్రతోపతి భరతునిచే
శ్రీమతి కైకేయియువలె, శ్యామ లెసఁగుదురు చిరాయువులగు పుత్రులచేన్.

అర్థములు. సౌమిత్రులచే=లక్ష్మణశత్రుఘ్నులచేత, శ్యామలు=యౌవనవతులైన స్త్రీలు, చిరాయులు=దీర్ఘకాలము జీవించువారు.

తాత్పర్యము స్పష్టము.

మ. జితరోషుండును శ్రద్ధధానుఁ డగుచుం జిత్తంబు నేకాగ్రసం
గతముం జేయుచు వల్మికోద్భవుని సత్కావ్యంబు నార్షంబు స
మ్మతి నెవ్వండు పఠించు వాఁడు తరియించుంగల్గు దుఃఖంబులన్
మతిలోఁ గల్గినకోర్కెలుం బడయు రామశ్రీకటాక్షంబునన్. ౨౯౯౩

అర్థములు. జితరోషుండును = క్రోధమును జయించిన వాఁడు, శ్రద్ధధానుఁడు=శ్రద్ధగలవాఁడు, ఏకాగ్రసంగతము=చలింపనీయక, గ్రంథస్థవిషయము నందే మనస్సుంచి, ఆర్షంబు=వేదోపబృంహణము.

తాత్పర్యము

క్రోధము జయించి శ్రద్ధగలిగి మనస్సు నేకాగ్రముచేసి వేదార్థము విస్తరించి వాల్మీకిమహర్షిచేఁ జెప్పఁబడిన రామాయణమును మంచి మనస్సుతోఁ జదువు వాఁడు సమస్త దుఃఖములను దాఁటును మరణించినపిదప మోక్షసుఖము గనును. జీవించిన కాలమున శ్రీరామకటాక్షముచే వానికోర్కె లన్నియు నెఱవేఱును. ఇది సత్యము సత్యము సత్యమని స్వానుభవముచే నీ వ్యాఖ్యాత చెప్పఁగలఁడు. అతఁడు సంకల్పించిన మహాకార్యము లతనిశక్తికి మించినవైనను లోకోత్తరముగ నన్నియు నెఱవేఱినవి. నెఱవేఱుచున్నవి, నెఱవేఱఁగలవు.

కం. ఈ కావ్యంబును వినియెడి, లోకులయెడ నెల్ల వేల్పులును ముదపడెదున్.
భీకరభూతగ్రహములు, వ్యాకులపడి పాఱిపోవు వారలయిండ్లన్. ౨౯౯౪

అర్థములు. ముదపడెదున్ = సంతోషించును, భీకరభూతగ్రహములు = భయము గలిగించు కూశ్మాండవినాయకాదిగ్రహములు.

తాత్పర్యము

ఈ కావ్యము వినువారినిగుఱించి దేవతలందఱు సంతోషింతురు. వారియిండ్ల యందుఁ గూశ్మాండాదిదుష్టగ్రహములు నిలువక భయపడి పాఱిపోవును.

కం. నరపతి ధరణి జయించును, బరదేశియు సుఖము చెడక పయనము సేయున్
దరుణి రజస్వల వినినన్, వరగుణులం బుత్రకులను బడయఁగఁ జాలున్.

అర్థములు. పరదేశియు = ఇతరదేశములకు బోయినవాఁడు. తరుణి = వయస్సున నుండినది, రజస్వల=ముట్టుస్నానము చేసిన తర్వాత పంౘ్రెండుదినములు.

## తాత్పర్యము

రాజు వినిన భూమిని జయించును. పరదేశమున నుండువాఁడు ఆపద లేక ప్రయాణము చేయును. ముట్టుస్నానము చేసిన వయస్సు స్త్రీ వినినేని యుత్తమ గుణములుగల కొడుకులఁ గనును.

ఆ. ఈ పురాతనంబు•నితిహాసమును వరుం, డనఁడు పూజ చేసి • యిచ్చ భక్తి
బరఁగ మారఁ జేయు•వాఁడు పాపంబులఁ, జెదరఁగఁ జెఱచి దీర్ఘ•జీవి యగును.

అర్థములు. పురాతనము = పూర్వమున జరిగినది, అనఁగా ఈ గ్రంథ రచనకు ముందు జరిగినది, ఇతిహాసము=ఇట్లు జరిగినదని చెప్పుచున్నది.

## తాత్పర్యము స్పష్టము.

కం. శిరమున నిత్యము మ్రొక్కుచు, ధరణీసురు చేత దీని • ధరణీపతి వినన్
సిరియును సుతలాభంబుం, బొరయును నిస్సంశయముగ • ముమ్మాటికినిన్.

## తాత్పర్యము స్పష్టము.

ఉ. పాయనిరక్తిచే వినిన • భక్తిఁ బఠించిన యేని నెల్ల రా
మాయణ మట్టివానిఁ గరు•ణార్ద్రకటాక్షము చేతఁ జూచు నా
రాయణుఁడుం బ్రభుండు హరి • యాదిమ దేవుఁడు దీర్ఘబాహుఁడున్
మాయధినేత విష్ణుఁడు స•నాతనుఁ డౌటను రాముఁ డెప్పుడున్. ౩౯౯౦

అర్థములు. ఎల్ల రామాయణము=రామాయణ మంతయు, కరుణార్ద్ర కటాక్షము చేతన్ = దయచే, దడసిన కడగంటి చూపులచే మా యధినేత = లక్ష్మీదేవికి నాథుఁడు, మా ఏకాక్షరము గావున నాంధ్రమున హ్రస్వరూపము లేదు. ఇది సంస్కృత సమాసముగాదు. సంస్కృతసమాసమైనయెడల మాధినేత యని రూపముండును, విష్ణుఁడు! సర్వవ్యాపియైన సర్వాంతర్యామియై యుండు వాఁడు, సనాతనుఁడు = శాశ్వతుఁడు, నిత్యుఁడు, త్రిసత్యుఁడు.

## తాత్పర్యము

శ్రీరాముఁ డేనాఁడో మరణించెనుగదా? అట్టివాఁడు తన్ను సేవించిన వారి కిప్పు డేమి చేయఁగలఁడను దురాక్షేపమున కిది సమాధానము: రామచంద్రమూర్తి నారాయణుఁడు, సమస్తభూతములకు స్థానమై సర్వమునందుఁ దా నుండువాఁడు.

కావున నానాఁ డుండి నేఁడు లేఁడనరాదు. ప్రభుండు = సమస్త ప్రపంచమునకుఁ ప్రభువైనవాఁడు, ఆయన లేఁడేని లోక మనాయక మగును. లోక మనాయకము గాదు గదా! ఆయన యవతరింపకముందు అవతారకాలమందు నీవల నేకవిధ ముగ లోకము ప్రవర్తించుటచే నవతారమునకు ముందుగాని యావలఁగాని రామ చంద్రమూర్తి లేనివాఁడు కాఁడు. రామచంద్రమూర్తి లేఁ డనిన భగవంతుఁడు లేఁడనియే యర్థము. ఏలన ఆయనయే ఆదిమదేవుఁ డగు హరి, బ్రహ్మరుద్రాదులు లేని కాలమం దాయన యుండి వీరి కందఱకు జన్మకారణమైనవాఁడు. ఆయన యొక కాలమందుఁ లేఁ డనిన నిఁక నుండునది యేది? ఈయన దీర్ఘబాహుఁడు అనుటచే సాకారుఁడై యున్నాఁడని యర్థము. కొందఱు తలఁచునట్లు నిరాకారుఁడు కాఁడు. చేతు లుండెనేని మొండె ముండవలె, తల కాళ్ళుండవలె, ఈయన లక్ష్మీ పతియై యున్నాఁడు, 'స ఏకాకీ న రమేత' యన్నట్లు ఒంటరిగాఁడు కాఁడు, దీనిచే లక్ష్మీవిశిష్టుఁడని యేర్పడుచున్నది. లక్ష్మీదేవి ప్రకృతి కధిష్ఠానదేవత గదా ఈయన విష్ణుఁడు గావున నరసింహాకారమందు వలె వ్యూహావస్వభావములు విడు వక సర్వాంతర్యామియై సర్వవ్యాపియై 'అంత ర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థిత' యన్నట్టు లుండువాఁడు, వ్యాపించు వానికి వ్యాపింపఁబడు వస్తువుండవలెఁ గదా. సనాతనుఁడు = ఎప్పటికి నుండువాఁడు, ఒక కాలమం దుండి వేఱొక కాలమున లేనివాఁడు కాఁడు. ఇట్టివాఁడు శ్రీరామచంద్రమూర్తి. కావున సామాన్య మనుష్యులతోఁ బోల్చి చెప్పుట తగదు. కర్మబద్ధులయిన వారే తాము వచ్చిన పిమ్మట తమ్ము సేవించిన వారికిఁ దమ మాహాత్మ్యము కనఁబఱిచి వారి కోర్కుల నెఱవేర్చునపుడు భగవంతుని నేమని చెప్పవలెను.

సీ. ఈ శుభకావ్యంబు • నెలమి నాలించిన ధనధాన్యవృద్ధి సం • తానవృద్ధి
వరగుణోపేత లౌ • సరసిజనేత్రల, సంగతి యుత్తమ • సౌఖ్యతతియు
సకలార్థసిద్ధి మ • హార్థసంసిద్ధియుఁ, బ్రాపించు నరులకు • భవ్యరీతి
వాయువుఁ గీర్తియు • నారోగ్య మొనగూర్చు, సౌభ్రాత్రకరమును • సౌఖ్యకరము

తే. సాధుధిషణాకరంబు నో • జస్కరంబు, నై నయీపుణ్యకావ్యంబు • నభ్యుదయముఁ
గోరి వినునట్టి సజ్జనుల్ • కొఱఁత లేక, నియమయుతు లయి వినవలె • నిశ్చలమతి.

అర్థములు. ఆలించినన్ = వినినయెడల, మహార్థసంసిద్ధియు - సకలార్థసిద్ధి చెప్పి, మహార్థసిద్ధి చెప్పుటచే మోక్షమనియే యర్థము. అంతకంటెఁ బరమార్థము లేదుగదా, సౌభ్రాత్రకరము = సోదరప్రీతిని గలిగించునది. సాధుధిషణాకరంబు= మంచిబుద్ధికి స్థాన మగుటచే మంచిబుద్ధి నిచ్చును. ఓజస్కరంబు=తేజస్సు కలిగించు

నది. అభ్యుదయము=శ్రేయస్సు, నియమయుతులయి = నియమింపఁబడిన మనస్సు గలవారై, శ్రద్ధాభక్తి గలిగి.

తాత్పర్యము

శుభకరమైన యీ కావ్యమును విన్నయెడల ధనవృద్ధి ధాన్యవృద్ధి సంతాన వృద్ధియుఁ గలుగును. సద్గుణములు గల స్త్రీల సాంగత్యము ఉత్తమసౌఖ్యము లభించును. కోరిక లన్నియు నెఱవేఱును. పరమార్థమైన మోక్షము ప్రాప్తించును. క్షేమపద్ధతి ఆయువు కీర్తి యారోగ్యము లభించును. ఇదిసోదరస్నేహము సౌఖ్యము సాధుబుద్ధి తేజస్సు కలిగించును. పుణ్యలాభముఁ గోరి దీనిని విను సత్పురుషులు నియమముతోఁగూడి చపలతలేని మనస్సు గలవారై గ్రంథమంతయు వినవలెను.

రామాయణ శ్రవణపఠనంబునఁ గుష్ఠరోగములు కూడ మానినవి. ఇది ప్రమాణానుభవసిద్ధము.

మానిని. ఈరహి నింపుమహత్త్వముఁ గల్గిన ♦ యిట్టిపురాతన వృత్తమణిన్
మీరు పఠింపుఁడు సంశయ మూనక ♦ నిండుమనంబున నమ్మి జవన్
దూరములై చను దోషములన్నియుఁ ♦ దోరపుభద్రము మీకు నగున్
వారక విష్ణుమహామహిమోన్నతి ♦ వర్ధిలుతం గడువర్ధిలుతన్. ౩౦౦౦

ఈ రహిన్ = ఈ విధముగ, పురాతనవృత్తమణిన్ = పూర్వము జరిగిన శ్రేష్ఠమైన చరిత్రము.

ఇందు రామాయణము పురావృత్తమణి యని చెప్పఁబడెను. పురావృత్తము లెన్నియో కలవు. అవి రామాయణమునకు సరిగావు. ఏలన శ్రీమద్రామాయణము బ్రహ్మచే సముజ్ఞాతుఁడై - 'న తే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి' - నీ కావ్యమునం దనృతము కొంచెమైనఁ గలుగదని బ్రహ్మచే వరముఁగొంది 'వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా,' వేదస్వరూపమని చెప్పఁబడినది. కావున నిట్టి యోగ్యత, మాహాత్మ్యము గాయత్రీ ప్రణవ మంత్రాది సంపుటీకరణము తక్కినవానియందు లేదు. పురాతనమనిన పూర్వకల్పమని పూర్వయుగమని తలఁపవలసిన పనిలేదు. కొంచెముకాలము జరిగినను బురాతనమే. 'వినుము మహాపార్శ్వ వినిపింతు మత్పురావృత్తంబు' నని తన్ను బ్రహ్మశపించినది పురావృత్తమని రావణుఁడు చెప్పెను.

'హుతాని యాని శీర్షాణి, పూర్వ మగ్నౌ త్వయానఘ' పూర్వము నీ వగ్నియందు వేల్చిన శిరస్సు లని బ్రహ్మ రావణునకుఁ జెప్పెను. ఇట్టి ప్రయోగము

లనేకములు గలవు. ౨౯౯౧ వ పద్యము చూచునది. సీతాదేవి వాల్మీకాశ్ర మమునం దుండఁగ వ్రాయఁబడినది కావున నిది పురాతనచరిత్ర మనఁబడెను. విష్ణుమహామహిమోన్నతి=విష్ణుదేవుని యత్యతిశయమహిమ, వర్ధిలుతన్ = వృద్ధి పొందునుగాక.

తాత్పర్యము స్పష్టము.

కం. రామాయణపఠనంబున, రామకథాశ్రవణమునను ♦ రంజిలి దేవ
స్తోమంబు పితరులెల్లరు, నామోదము నొందువార ♦ లనవరతంబున్. ౩౦౦౧

తాత్పర్యము స్పష్టము.

కం. వాసిగ ఋషివిరచిత మగు, నీసంహిత నెవఁడు రాము♦నెడఁ గడుభక్తిన్.
వ్రాసిన వ్రాయించిన న్వ,ర్వాసం బామానవునకు ♦ వఱలు నతంబై. ౩౦౦౨

అర్థములు. సంహిత='పద ప్రకృతిః సంహితా' వేదభాగము ఈ రామాయణము సంహితతో సమానమగుటచే సంహిత యనఁబడెను. సంహితాలక్షణ సప్తకాండములవలె నుండుటచే సంహిత యనఁబడెను. వేదార్థము గల పద్యరూప గ్రంథము. వ్రాసిన వ్రాయించిన - అనుటచేతను శ్రీరామ ముద్రికయందును శ్రీరామబాణములమీఁదను నక్షరములు చెక్కఁబడి యుండుటను, వ్రాసినది చూచి వేదము చదువువారు పతితపాతకులని నీచులుగాఁ జెప్పఁబడుటను పూర్వము వ్రాఁత లేదను వాదము దుర్వాదమని యెఱుంగునది. స్వర్వాసంబు=మోక్షము.

తాత్పర్యము స్పష్టము.

కం. అని యార్ష మాదికావ్యం,బును నగు రామాయణంబు ♦ ముని వల్మీకసం
జనితుఁడు తపస్వి సంహిత,గను బల్కెను భూప్రజోప♦కారకబుద్ధిన్. ౩౦౦౩

అర్థములు. భూప్రజోపకారకబుద్ధిన్ = లోకులకు మేలుచేయు తలంపుతో - స్వప్రతిష్ఠకుఁ గాదు.

తాత్పర్యము

ఈ ప్రకారము వేదార్థమును దెలుపు నీరామాయణకావ్యంబును పూర్వము వాల్మీకిమహర్షి లోకుల కుపకారముచేయు తలంపుతో దీనిని సంహితగ వచించెను.

## —• యుద్ధకాండాంత పద్యములు •—

కం. నయనీకృతరవిచంద్రా! యయనీకృతసాగరేంద్ర • యవితసురేంద్రా
శయనీకృతభుజగేంద్రా, జయ జయ శ్రీరామ జనక•జాహృద్ధామా. ౩౦౦౪

అర్థములు. నయనీకృత=కన్నులుగాఁ జేయఁబడిన, రవిచంద్రా=సూర్య చంద్రులు గలవాఁడా, అయనీకృత సాగరేంద్ర = గృహముగాఁ జేయఁబడిన క్షీర సాగరము గలవాఁడా, అవిత = రక్షింపఁబడిన, సురేంద్రా = దేవేంద్రుఁడు గల వాఁడా, శయనీకృత = పానుపుగాఁ జేయఁబడిన, భుజగేంద్రా=సర్పశ్రేష్ఠుఁడగు శేషుని గలవాఁడా, జనకజాహృత్+ధామా=సీతాదేవి హృదయముస్థానముగాఁ గలవాఁడా.

### తాత్పర్యము

సూర్య చంద్రులను నేత్రములుగను, సముద్రము వాసస్థానముగను, ఆది శేషుఁడు శయ్యగను గలవాఁడా! ఇంద్రుని రక్షించువాఁడా! శ్రీ సీతాహృదయ మందుండువాఁడా! నీకు జయము జయము.

ఉ. శ్రీకమనీయశీల! ఖల • శిక్షణలోల! దయాలవాల! నీ
రాకరగర్వభంజన! ధు•తాఘ! నిరంజన! భక్తరంజనా!
ప్రాకటకీర్తిధామ! యప•వర్గదనామ! హితైకకామ! ఖ్యా
తైకశిలావిహార! జన•కాత్మభవాహృదయాబ్జభాస్కరా! ౩౦౦౫

అర్థములు. శ్రీకమనీయశీల = సంపత్కరమై, మనోహరమైన స్వభావము గలవాఁడా, లక్ష్మీదేవిచేఁ గోరఁబడిన శీలముగలవాఁడా, ఖలశిక్షణలోల=దుష్టుల శిక్షించుటయం దాసక్తిగలవాఁడా, దయాలవాల=కరుణకుఁ బాదైనవాఁడా, నీరాకరగర్వభంజన = సముద్రగర్వమును సణఁచిన వాఁడా, ధుతాఘ = చెదరఁ గొట్టఁబడిన దోషములు గలవాఁడా, నిత్యకల్యాణగుణసంపన్నా, నిరంజన=దోష రహితుఁడా, భక్తరంజనా = భక్తుల సంతోషింపఁ జేయువాడా, ప్రాకటకీర్తి ధామ = ప్రసిద్ధకీర్తికి స్థానమైనవాఁడా, అపవర్గదనామ = మోక్షమిచ్చు పేరు గలవాఁడా, రామనామోచ్చారణముచే మోక్షము గలదని భావము, హితైక కామ = మేలుచేయు కోరిక మాత్రమే గలవాఁడా, ఖ్యాత=ప్రసిద్ధికెక్కిన, ఏక శిలావిహారా=ఏకశిలయను పేరుగల ఒంటిమిట్టయందు విహరించువాఁడా, జనకాత్మ భవా=సీతాదేవియొక్క, హృదయకమలమునకు, భాస్కరా = సూర్యుఁడవైన వాఁడా.

## —• మంగళమహః శ్రీవృత్తము •—

ధీర ! రసఖాభ్ర శుచి•దృష్టిగతపద్యనుత • దేవహిత ఘోరరణవృత్తా !
సూరకుల ! దాశరథి • సూరిహితశా శరధి • శూర ! వరధీ ! విరథి ! వై దే
హీరమణ ! హీరమణి• హేమరమణీయ వర•హీరశయనా ! వనధివాసా !
భూరమణవర్య! గుణ•పూతశుభచర్య! నత•భూమిరథ మంగళమహ•శ్రీ.౩౦౦౬

అర్థములు. రస = షడ్రసములు గావు, ఆఱు అనిసంజ్ఞ, ఖ = ఆకాశము, ఆకాశం గగనం శూన్య మనుటచే సున్న, అభ్ర=ఆకాశము కావున సున్న, శుచి దృష్టి=శివునికన్నులు మూఁడు, 'శుచిర్నా శుక్రశృంగార చంద్రాషాఢహరాగ్నిషు,' నానా॥ర॥ శుచి యనఁగా నిచట శివుఁడు, పద్యనుత్ =పద్యములచే స్తోత్రము చేయఁబడినవాఁడా, ౬౦౦౩ 'అంకానాం వామతో గతి' యని కుడినుండి యెడమకుఁ జదువఁగా ౩౦౦౬ అని యేర్పడును. ఈ కాండమందు ౩౦౦౬ పద్యములు గలవని భావము. దేవహిత = దేవతలకు మేలైన, ఘోరరణ వృత్తా = భయంకరమైన యుద్ధచర్య గలవాఁడా, సూరకుల = సూర్యవంశమునఁ బుట్టినవాఁడా, దాశరథి-దశరథి=దశరథ కుమారా, సూరిహితశా శరధి = పండితులకు మేలిచ్చు గుణమునకు సముద్రుఁడ వైనవాఁడా, వి - రథి - వి = పక్షి, రథి = వాహనముగా గలవాఁడా, గరుత్మంతుని వాహనముగఁ గలవాఁడా, వైదేహీరమణ = సీతావల్లభా, హీరమణి = శ్రేష్ఠములైన వజ్రముల చేతను, హేమ = బంగారు చేతను, రమణీయ=అందమైన, వర = శ్రేష్ఠమైన, హీరశయనా = సర్పము శయనముగాఁ గలవాఁడా, 'హీర స్సింహాహివజ్రేషు॥' నానా॥ర॥ వనధివాసా=సముద్రము వాసముగాఁ గలవాఁడా, భూరమణవర్య=రాజశ్రేష్ఠుఁడా, గుణపూత = గుణములచేఁ బవిత్రమైన, శుభచర్య=శుభకరమైన నడవడిగలవాఁడా, నతభూమిరథ = నమస్కరించు శివుఁడు గలవాఁడా, మంగళమహశ్రీ=మంగళకరమైన గొప్పసంపద గలవాఁడా.

సీ. ఆఱు ప్రాకారంబు లాఱు సముద్రంబు
లాఱుకాండంబులు నాఱుదశలు
నాఱు వికారమ్ము లత్యమోఘంబైన
భవదీయకరుణను బరమపురుష
తెరియింపఁగంటిని దారిని బడలక
త్వచ్చరిత్రాంబుధిఁ ద్రచ్చుచోట
నాదిని ప్రభవించె హాలహాలం బదియూతెఁ
దావకకరుణ సీతాకళత్ర

గీ. కామధేను చింతామణి కల్పవృక్ష
కౌస్తుభంబును లక్ష్మియుఁ గలిగె నవల
నమృత మింకిటఁ గలిగించి యఖిలజనుల
నందఁ జేయు మమర్త్యత్వ మాదిదేవ.

—•గద్యము

ఇది శ్రీమద్రామచంద్ర చరణారవింద మిళిందాయమాన,
మానసత్వ మహావైభవ వావిలికొలను రామచంద్ర
రాయతనూభవ సుజనవిధేయ సుబ్బరాయ
(వాసుదాస) నామధేయ ప్రణీతంబైన
మందరాఖ్య స్వయంకృత వ్యాఖ్యాన
సమేత శ్రీమదాంధ్ర వాల్మీకి
రామాయణ మను నిర్వచన
మహాకావ్యంబునందు
యుద్ధకాండము.

శ్రీరామార్పణమస్తు.

శ్రీ శ్రీ శ్రీ

శ్లో॥ నమోస్తు రామాయ సలక్ష్మణాయ, నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభవే వరాయ, నమోస్తు వల్మీకభవాయ తస్మై.

న్యూ విజయ ఆర్టు ప్రెస్, తెనాలి.

# శ్రీ వాసుదాస స్వామివారి గ్రంథముల పట్టిక

## ఆంధ్ర వాల్మీకి రామాయణము :

### మందరము - టీకా తాత్పర్య వ్యాఖ్యానముతో

బాలకాండ
అయోధ్యకాండ 1వ భాగము
డిటో 2వ భాగము
అరణ్యకాండ
కిష్కింధ
సుందర
యుద్ధకాండ 1వ భాగము
డిటో 2వ భాగము
ఉత్తరకాండ

### మూలము - పద్యకావ్యము :

బాలకాండ
అయోధ్యకాండ (స్టాకు లేదు)
అరణ్యకాండ ,,
కిష్కింధకాండ
సుందరకాండ
యుద్ధకాండ
ఉత్తరకాండ

### చరిత్రలు :

సీతాదేవి చరిత్ర
హనుమంతుని చరిత్ర (స్టాకు లేవు)
రుక్మాంగద చరిత్ర
నలచరిత్ర (స్టాకు లేవు)
శకుంతల చరిత్ర
సావిత్రి చరిత్ర
హరిశ్చంద్ర
వామన చరిత్ర

### హితచర్యలు :

(పురుషులు స్త్రీలు ఆయా వయస్సులలో ఆచరింపదగిన ధర్మములు, విధులు, విపులముగా వ్రాయబడినవి.)

పురుషపర్యాయముగ :

బాలక కుమార పతి

స్త్రీ పర్యాయముగ :

కుమారి
సతి
గర్భిణి
వైధవ్య

వలయువారు :— © 30690

శ్రీ కోదండరామ సేవక ధర్మసమాజము
దాసకుటి, అంగలకుదురు - 522 211 (వయా) తెనాలి.